S 288

సంజయ రాయబారము

Hindi

కళా ప్రచారక సమితి, బరంపురం.

మా మనవి

ఇరువదియవ శతాబ్దమున ఆంధ్రదేశమున వాఙ్మయ వాతావరణమున వింతసంచలనములు విలసిల్లినవి.

చిన్నయసూరిగారి కాలమున గండములు దాటి బ్రతికిన వాఙ్మయ బంధనమూలసరస్వతిని చిరాయువుగా జీవింప శక్తులు చేకూర్చిన యాంధ్రసాహిత్య పరిషత్తును, ఆసరస్వతిని సజీవముగాఁ జేయఁ గంకణముకట్టుకొన్న అప్పారాయ రామమూర్తి ప్రభృతుల పరిశోధనలును, ఆసందర్భమునకు ఫలములు.

పరిషత్తువారు వాఙ్మయప్రవాహమును గట్టుకట్టి యరికట్టివేయఁ బ్రయత్నింప, అప్పారాయ రామమూర్తిప్రభృతులా గట్లు త్రెగగొట్టి యాప్రవాహమును స్వేచ్ఛగాఁ బాఱింపఁ బ్రయత్నించిరి. ఈ రెండుప్రయత్నములవలనఁ గలిగిన లోపములను బరిశీలించి వాఙ్మయప్రవాహము నవసరమైనంతవరకు మాత్రమే యరికట్టి, దానిపాయలకు కావలసినంత యవకాశమిచ్చి లోకకల్యాణమునకై యాప్రవాహము వినియోగించునట్లు చేయు నుద్దేశమున నీకళాప్రచారకసమితి యేర్పాటైనది.

ఈసమితిపక్షమున మేము ప్రచురించిన మొదటిగ్రంథము మా॥రా॥రా॥ దేవరాజు వేంకట కృష్ణారావు పంతులుగారు రచించిన "రాయబారము" లోని మొదటిభాగమగు "సంజయ రాయబారము". జగత్ప్రఖ్యాతివహించిన మహాభారతమును గూర్చి ప్రత్యేకించి చెప్పనక్కఱలేదు. లోకోత్తరచరిత్రముగల మహాత్మునిహృదయ మెంతగంభీరమైయుండునో, శ్రీ మహాభారతహృదయ మంతగంభీరమైనది.

జగత్కల్యాణమునకై యవతరించిన శ్రీకృష్ణునిచరిత్ర మెంతయద్భుతమో, శ్రీ మహాభారత మంతయద్భుతము. అట్టి శ్రీమహాభారతమున. అట్టి శ్రీకృష్ణుఁడు నిర్వహించిన "రాయ

భారము" మహాభారతగ్రంథమునసే గాక, ప్రపంచవాఙ్మయముననే యత్యద్భుతము.

మహాభారతహృదయమును, శ్రీకృష్ణహృదయమును, లెస్సగాఁదెలిసికొని, యామహాత్మునిరాయబారమునంగలి తత్త్వమును లోకమునకుఁదెలియఁజేయుటకై యెందఱో యిదివఱకు ప్రయత్నించిరిగాని, వారందఱునుపరిపూర్ణమనోరథులుకాలేదు.

ఈగ్రంథము రచించిన శ్రీ కృష్ణారావుగారు ఆంధ్రలోకమునకుఁ జిరపరిచితులు. ఆంధ్రభాషలోని ప్రథమనిరూపక నవలను — అపరాధపరిశోధక నవలను—వీరే వ్రాసియిచ్చిరి. అపరాధపరిశోధక నవలలు తెనుగున వ్రాయుటకు వీరిడినదియే భిత్తి. అనంతరము 1926 సం॥లో వీరు తప్పలతమాపా యను నామాంతరముగల జానకీపరిణయమను పౌరాణికమగు నవలను క్రొత్తపక్కిని వ్రాసి ఆంధ్రలోకమున కొసంగిరి. ఇపుడీరాయబారము నల్లే క్రొత్తత్రోవను ద్రొక్కుచు వ్రాసిరి. వీరీగ్రంథము ను జిరకాలపరిశోధనఫలముగ ఆంధ్రదేశమునకుఁ బ్రసాదించిరి. వీరిగ్రంథమునుబఠించుచున్నప్పుడు భారతముచదువుచున్నప్పుడు మనకుకలుగుచుండిన యనేకసందేహములు నిర్మూలములగును. కావున వీరిగ్రంథ మన్నివిధముల శ్లాఘాపాత్రముగా నున్నది.

మ॥రా॥రా॥ పింగళి లక్ష్మీకాంత కవిగారు దీనికొక లఘుపీఠిక యిచ్చినందుకును, విశాలపీఠికదయచేయ వాగ్దానము చేసినందుకును, వారికి మేము కృతజ్ఞులము.

ఈగ్రంథమును శ్రీ కృష్ణరావుగారు మాసమితి పక్షమున బ్రచురింప ననుజ్ఞయిచ్చినందుకు మాసమితివారు గ్రంథకర్తగారికి కృతజ్ఞులు. మాగ్రంథముల నాదరించి మాలోపములను దెలియఁజేసి, మాయాశయముల నభివృద్ధిచేయవలసినదని యాంధ్రలోకమును బ్రార్థించుచున్నాము.

బరంపురం మండపాక పార్వతీశ్వరశాస్త్రి, సభాపతి

9—6—33. కళాప్రచారక సమితి.

రాయబారము

(మొదటి సంపుటము)

సంజయ రాయబారము

— కృతికర్త —

దేవరాజు వేంకట కృష్ణారావు.

వాండ్రేవీడు, నేనే, కాలూరాయి, విభ్రమరాఘవుల

గ్రంథకర్తయగు యీరా కృతికర్త.

రాయబారము

మొదటి సంపుటము

సంజయ రాయబారము

వెల రూ. 1-0-0

రాయబారము

రెండవ సంపుటము

శ్రీకృష్ణ రాయబారము

వెల రూ. 1-0-0

సర్వాంగసుందరమగు

రెండుసంపుటములునుగల ఒకేసంపుటము వెల రూ. 2-4-0.

(పోస్టేజీలు ప్రత్యేకము)

సర్వస్వామ్యములును
గ్రంథకర్తవి.

ముద్రాపకుఁడును
ప్రకాశకుఁడును
గ్రంథకర్తయే.

"వేగుఁజుక్క" ముద్రాలయమున
కును వేగుఁజుక్క "గ్రంథమాల"
కును లేశమును సంబంధములేదు.

వేగుఁజుక్క ముద్రాలయము
బరంపురం—గంజాం.
1933.

ఉపోద్ఘాతము

ఈ గ్రంథము రచించిన శ్రీయుత దేవరాజు వేంకట కృష్ణారావుగారు, ఆంధ్ర విద్యార్థిలోకమునకు సుపరిచితులు. మనభాషలో నవలా రచన క్రొత్తగా ప్రారంభమైన దినములలో "[illegible]" "[illegible]" "[illegible]" మొదలగు నపరాధ పరిశోధనాత్మకములైన క్రొత్తరకపు నవలలు వ్రాసి మంచి పేరుగడించిన వారీ కృష్ణారావుగారు. వీరు నాడు నెలకొల్పిన "వేగుచుక్క గ్రంథమాల" ఆంధ్రుల [illegible] పాత్రమై [illegible] మొదటిది [illegible]. దాని పెంపునకు [illegible] కారణము.

ఇప్పుడు వీరు రచించిన యీ రాయబారము ఇంకొక క్రొత్తరకపు పుస్తకము. ఇది క్రొత్తనవలలు లేని రచనకే పునాది. ఈ రాయబారము భారతములోని కథ [illegible] నాధారముచేసి యున్నది. భారతాది ప్రాచీన గ్రంథములలోని ఏకదేశ గాథలను ఎత్తి, [illegible] పుస్తకములు వ్రాయుచున్నారు. కాని వానికిని, దీనికిని, చాల వ్యత్యాసమున్నది. నే నెఱింగినంతవఱకు అవన్నియు దండాన్వయ ప్రాయములు. ఇదియో వ్యాఖ్యాన ప్రాయము. అనగా, ఆ యుద్యోగపర్వమును తెలిసి చదివి, అందలి [illegible] సందేహములన్నిటిని విమర్శించి [illegible] తేల్చిన సారభూతరచన. ధర్మశాస్త్రవిషయములను, కురుపాండవ పక్షముల వాదప్రతివాదములను బాగుగ పరామర్శించి, స్వతంత్రుడగు ప్రాడ్వివాకుడు తీర్చిన తీర్పు. ఈ రకపు పుస్తకము మనభాషలో నిది క్రొత్తది. [illegible] ఇది యొక [illegible]. ఇతిహాసగాథను నవలవలె వ్రాయుటయు వారికి క్రొత్తది. అందుచేత [illegible] కబ్బురముతోచు [illegible] విమర్శనము [illegible] క్రొత్త.

కనుక ఏ విధమునచూచినను ఇది నూత్నవైఖరిని విరాజిల్లు స్వతంత్ర రచన యనకతప్పదు.

వేంకట కృష్ణారావుగారితో సంభాషించునపుడు. వారి మాటలో నొక ప్రత్యేకపులక్షణము గోచరించును. సత్యమును పురస్కరించుకొని మాటలాడునపుడు వీరు, ఎదిరి మనసు నొచ్చునన్నైనను జంకక, తీక్షణముగ, ఖండితముగ మాటలాడు స్వభావముకలవారు. ఆ స్వభావమే యీరచనలో గూడ ప్రతిఫలించుచున్నది. కనుకనే శైలి, ఎరవు తెచ్చుకొన్నదిగాక, సహజమై యొప్పుచున్నది.

ఈ గ్రంథము సర్వధా ఉత్తమమై, ఆంధ్రవచన వాఙ్మయమునకు ఒకనూత్నాలంకారమువలె నున్నదనుటకు సందియము లేదు.

దీనికి, వస్తువిమర్శపూర్వకమైన ఉపోద్ఘాతము వ్రాయదలచితినిగాని, ప్రస్తుతము వ్యవధిలేక పోవుటచే నింతతో చాలించితిని. రెండవభాగమున ఆమాటను దక్కించుకొందునని గ్రంథకర్తను వేడికొని యీరెండుబంతులుమాత్రము వ్రాసితిని.

విశాఖపట్టణము
1—6—33.

పింగళి లక్ష్మీకాంతం.
హెడ్ లెక్చరరు, తెనుగు,
ఆంధ్ర యూనివర్సిటీ కాలేజీ.

పీఠిక

1928 సంవత్సరమున నేనును బ్రా॥శ్రీ॥ కొత్తపల్లి రాజలింగ కవిగారును భారతమున నుద్యోగపర్వమును చదువుచుండ 1929 సం॥ తూన నామిత్రులును ప్రస్తుతమున ననువాద గ్రంథమండలికి (పాలకొండ) సంపాదకులును అగు బ్రా॥శ్రీ॥ మంగిపూడి శ్రీరామ చంద్రశాస్త్రులవారు బరంపురము వచ్చియుంటిరి. ఆతరుణమున వారితో మఱియొకతూరి యుద్యోగపర్వమునే చదివితిని. పూర్వాపరసందర్భములకొఱకు భారతమంతయు జదువవలసివచ్చినది. కొన్ని కొన్నిఘట్టముల నిరూపించుకొఱకు హరివంశ విష్ణుపురాణములను జూడవలసివచ్చినది. ఇట్లు తీగఁగదుప డొంకంతయుగదలినది. అందందు నాకుపొడమిన సంశయములనెల్ల శ్రీరామచంద్రశాస్త్రుల వారినడిగి తెలిసికొంటిని. అనంతరము 1930 లో కీ॥శే॥ నాతమ్ముడు సీతారామస్వామితో కృష్ణచరిత్ర బరిశీలనాదృష్టులతో సంపూర్ణముగ బలుమారు దఱచితఱచి చదివిచూచితిని. భారతోద్యోగమున శ్రీకృష్ణుని పురస్సరణము బరిశీలింప నాగాథ నొకకథారూపమున వ్రాయనగునని తోచినది విమర్శింపదగినవిషయములు పెక్కులుండుటను నవలారూపమున విమర్శనయే రచియింపదగినదని తోచిన యంతన గ్రంథరచనకు గడంగి బ్రా॥శ్రీ॥ మండపాక పార్వతీశ్వర శాస్త్రులవారికి, నావ్రాసినంతవట్టు జూప వారు నాయవలంబించిన మార్గమును కామోదించి, మఱికొన్ని నూతనవిషయముల నాకు సుబోధకమొనర్చిరి. వీరు నాకు 1898 సం॥నుండి గురువరులు. వీరు నావ్రాతప్రతిని జూచి, సవరించి, సంస్కరించి నను గృతకృత్యుంగా నొనరించిరి. పదపమున కొంత వ్రాసిన నాభాగము బ్రా॥శ్రీ॥ కొత్తపల్లి రాజలింగకవిగారికి చదివి వినిపించి, వారిసలహాలను పొందియుంట వారికెంతేయు గృతజ్ఞుండను. శ్రీ జయంతి సోదరులును, బ్రా॥శ్రీ॥ కోట సూర్యనారాయణ శాస్త్రులవారును (బొబ్బిలి) వీరి కుమాళ్లు కోట లక్ష్మీనారాయణగారును, కీ॥శే॥ మహామహోపా

ధ్యాయ శ్రీమాన్ పరవస్తు వెంకటరంగాచార్యులుఅయ్యవార్లంగారి మనుమలు శ్రీమాన్ వరహ లక్ష్మీనృసింహాచార్యులు అయ్యవార్లంగారును, శ్రీమాన్ నిడాధూర్ అనంతాళ్వాన్ అయ్యవార్లంగారును, నాకు పెక్కుగతుల ప్రోత్సాహముకలుగజేసిరి. మఱికొంత కాలమునకు నాకుఁజేరిన బ్ర॥ శ్రీ॥ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రుల వారి భారతచరిత్రమును బ్ర॥ శ్రీ॥ వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రులవారి కర్ణచరిత్రమును జూచి, నేనడివరకువ్రాసిన కొన్ని భాగములు మార్చుకొనుటయు, కొన్నిపట్టుల వారియభిప్రాయముల నుండి భిన్నపడనగుటయు సంభవించినవి. నావ్రాసిన విషయముల సరిచూచుకొనుటలో మహాభారతచరిత్రమునుండియు కర్ణచరిత్రము నుండియు కొన్నికొన్ని భాగములు సరిగా నెత్తివ్రాయవలసివచ్చినది. అట్లగుట నెవరెవరి గ్రంథములు నాకు సాయపడినవో వారివారి పవిత్రనామములతో వారివారిగ్రంథనామములనొకపట్టికలో యిందు పొందుపరచినాను. గ్రంథము ముద్రింపకముందుగూడ, యెన్నెన్ని సభలలోనో యెందరెందరు పండితకవులయొద్దనో, చదివితిని వారివారి సదభిప్రాయముల వడసితిని. వారందరికిని కృతజ్ఞుఁడను.

1929, 30 సం॥రములలో నాకార్యముపైని మదరాసు నేను పోయినపుడు శ్రీ తాపీ ధర్మారావుగారిని కలిసికొని వారితో నెన్నోవిషయముల శ్రీకృష్ణచరిత్రమునుగూర్చి చర్చించితిని. వారును కొన్నియంశములు నాకువెల్లడిచేసిరి. వారికిని కృతజ్ఞుఁడను.

1932 సంవత్సరములో శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారియెదుట నాప్రయత్నమంతయు వారికి నివేదించితిని. వారు నాకుగల కొన్ని సంశయములుదీర్చి, నాకు ప్రోత్సాహమొసంగి, నాగ్రంథమునకు పీఠిక వ్రాయుటకు నాప్రయత్నమున వారికిగల యానందము వెల్లడించినందుకు నేను వారికెంతయు కృతజ్ఞుఁడను.

అనంతరము 11, 12, 13-3-1933 తేదీలను జరిగిన అభినవాంధ్ర కవిపండితసభలో నీగ్రంథము చదివి వినుపింప నను ప్రోత్సహించిన

శ్రీ పంచాంగ్నుల ఆదినారాయణ శాస్త్రులవారికి నాకృతజ్ఞతా సూచకనమస్కారములు. అప్పుడట రెండుమూడుఘట్టములుచదువగా తత్సభాగ్రాసనాధిపతియగు డాక్టరు శ్రీ చిలుకూరి నారాయణరావు గారు ఈగ్రంథరచనయందు నేనవలంబించినమార్గమున కానందించి, వారికికలిగిన తృప్తి నెన్నోవిధముల సభలో వెల్లడించి నాకెంతేని ప్రోత్సాహము కలుగజేసిరి. వారికేనెంతేని కృతజ్ఞుండను. తుదకు బ్రహ్మశ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రులవారు నాయందున్న శిష్య వాత్సల్యముచేత నాప్రార్థన మంగీకరించి, ఉపసంహారమనుపేర కొన్ని పుటలు వ్రాసి యీగ్రంథాంతమున నుంచునట్లుచేయుమని నాకాజ్ఞ యిచ్చిరి. వారికేనెంతయు కృతజ్ఞుండను. ఈగ్రంథము ప్రకటించిన కళాప్రచారక సమితివారి యాదరమునకే నెంతేని కృతజ్ఞుండను.

1929 సం॥నుండి రాయబారమనుపేర నీగ్రంథము రచియించుచున్నానని, తద్గ్రంథవిశేషముల, నా వేగుజుక్క ముద్రాలయముయొక్క క్యాలెండరులలో బ్రచురించుచునేయుంటిని. తుదకు 1932 సం॥ ఫిబ్రేవరునెలలో 'రాయబారము' అనుపేర నొక చిన్న పుస్తకము సుమారు 28-30 పుటలుగలది ప్రచురించితిని. అందు నారచియింపబూనిన యీరాయబారపుకథావిధానమెల్ల సుబోధకమగునట్లు వ్రాసియుంటిని. "వ్రాయబోవుగ్రంథమునకువిషయసూచిక నిట్లు తొలిబ్రకటింపరాదు" అని నామిత్రులువలికిరి. అట్లు విపులమగు విషయసూచికను తొలిప్రకటించుటవలనను, పెక్కండ్రెదుట దొలిచదువుచుండుటవలనను, పొందదగిన ప్రమాదము, మరికూడదీయరానితెన్నున ననుభవించితిని. గ్రంథము వినినవారందరును గ్రంథకర్తకు సలహాయిచ్చుటకే విందురని యెట్లనగలము! నా గ్రంథముచదువగా వినినవారిలో పండితులును, పండితకవులును, నగువారు గ్రంథప్రాశస్త్యతకొరకు మంచివిషయములు సుబోధకమొసఁగిరి. గ్రంథకర్తలును గ్రంథప్రకటనవాణిజ్యకార్యమేవృత్తిగా గలవారు తామే 'ప్రకటింతుమి' మ్మని నాగ్రంథమునడిగినారు. అట్టి

గ్రంథములకు బ్రకటనార్థమొసంగ ననినంతనె నీసును రోసమ్ముం బూని నన్నీ రాయబారము బ్రకటింపనలదని రాయబారములంపి నపుడు, ఒరులయున్నతి జూడనోపని పౌండ్రకవాసుదేవ, సృగాల వాసుదేవాదులు, వాసుదేవున కనిపిన రాయబారములే జ్ఞప్తికి వచ్చినవి. తుదకెట్లైననేమి స్వాతంత్ర్యముగ నిది ప్రకటించుటయే దటస్థమైనది.

నాయెడగల అభిమానము పెంపుననైననేమి, నాతోనున్న వ్యావహారిక సంబంధముచేతనైననేమి, నాకడకు వచ్చుచుబోవుచు నున్న పరిచితులకొసగిన స్నేహితులతోడను నేను శ్రీకృష్ణుని ప్రవర్తనమునుగూర్చి పలుపలు తెఱగుల జర్చించుచు ముచ్చటించుచునే వచ్చితిని. ఇట్లు 1928 మొదలు నేటివరకును నే నెందరతో జర్చించి యుంటినో, అందు గొందరు,—వారిమూలముననే నే నీగ్రంథము రచియింపగలిగితిని—అని పలుకుటయు బ్రాప్తించినది. ఇంతకును సర్వవ్యాపియైన వాసుదేవుడే యిన్నిరూపముల వచ్చి నాకీపనియందు దోడ్పడినవారలకు నందియ మంజజాలను.

ఎన్నివిధముల తర్కించుకొని, జర్చించుకొని గ్రంథము రచియించితినని నే ననినను, సరోవరోదకంబుల భేదించుకొని పైకివచ్చు నంతవరకేగద కోరకమునకు నిసర్గవృత్తి. ఆ సరసీరుహకోశమునకు బరిపక్వతయును, వికాసమును, శ్రీనివాసమును జేకూర్చువాడు సర్వశక్తి సంభరితుండగు సకలకర్మసాక్షియే కద. అట్లనే గ్రంథము రచియించు వాడు తన హృద్గతవిషయముల కొకరూపమిచ్చి లోకమునకందిచ్చు నంతదనుకనె తత్కర్తకు విహితకృత్యమును; తదనంతరము పాఠక లోకమె, దానిమంచిచెడ్డల నేర్పరించునదగుట, నే నిట్లు వ్రాసితి నట్లు వ్రాసితి నని యనంబనిలేదని యింతతో విరమించితిని.

బరంపురం
జూన్, 1933.

దేవరాజు వేంకట కృష్ణారావు,
గ్రంథకర్త.

రాయబారము

మొదటి ప్రవేశము

[విరాటనగరము:— ఉపప్లావ్యమున వివాహోత్సవరంగము
పాండవ బంధుమిత్ర సమాలోక సభ—సింహాసనమున [illegible]
[illegible] పాండవుల [illegible] సుఖాసీనులై యుందురు,
[illegible] వాసుదేవుల [illegible], శ్రీకృష్ణుడుద్దేశ-
[illegible] సమ—[illegible] సమ—
సాత్యకి [illegible] బలరాములవారు [illegible]. శ్రీకృష్ణ సాత్యకుల
[illegible] — [illegible] రాయబారిగ . [illegible]
[illegible] బంధువు—శ్రీకృష్ణ సాత్యకి బలరామాదుల [illegible].]

“శ్రీకారము ముందిడుకొని గ్రంథములు రచియించు గ్రంథకర్తలవలె నిపుడీ శ్రీకృష్ణుని ముందిడుకొని ప్రారబ్ధవిరాటాగారిలీ వివాహమహోత్సవ సందర్భమే సుసమయముగా నెంచి, పేరోలగంబునందీ యేదేని పెద్దనాటకంబున కాయత్తపడుచున్నట్లున్నది. ఎట్టి నాటకంబున కైన సూత్రధారుఁడు నాఁదగియున్నకృష్ణుండదె సరిచి, తన యుత్తరీయంబు బల్లునఁ జక్కఁజేసి కొనుచుఁ దన మామున కామాయా దాని మయూరపింఛం బొకవింతకళ నొసంగఁ దనునుముఁజ్జు సరిచి కొనుచు నేమో పలుకసున్నాఁడు. ఇంతవఱకిట్టుఁ గూడ నుండి యున్ననే నిపుడేల తొందర పడవలయు” నని యొక్క ఒడదారి .మా సభనుండి పోబోవుచు మెల్లఁ గూయుచుండెను.

అయ్యది విరాటునగరంబున విరటునికూఁతురగు నుత్తరను సుభద్రార్జునులపుత్త్రుఁ డౌ నభిమన్యున కిచ్చి వివాహ మొనర్చిన కళ్యాణమంటపసభాభవనము. వివాహము ముగిసిన మఱునాఁటి కార్యక్రమ సమాలోచన సమయము.
అదె! కృష్ణుఁ డేమో పలుకుచున్నాఁడు.

*　　　*　　　*　　　*

"ఉత్తరాభిమన్యుల వివాహమహోత్సవసందర్శనసమాగత క్షోణీధరణీశులారా! న్యాయాన్యాయవిచక్షణదీక్షా దక్షులారా! పరిణయకార్యము జయప్రదముగ ముగిసెనుగదా! మన మింకను పెండ్లివిందులు గుడుచుచు నీ పిచ్చ పీటకుంట యనుచితము కాదే! ఇందఱము మిమ్మోప నిచ్చినఁ గూడినందులకుఁ దగినంత సార్థకత కలుగు నాలోచనము నొనర్పుటయె యుచితము. అర్జునాదులకు ద్రౌపది నిచ్చి వివాహ మొనర్చినది గాని, ఈ ద్రుపదరాజును తన యల్లురకు నిలువనీడ లేకపోయెనే యని చింతించియున్నను, సముచితమగా నాలోచనముఁ జేయఁడు. సమర్థుఁడై యుండియుఁ దాఁ జింతించినంత మాత్రానఁ గాఁదగిన కార్యమని యైన నేమగుంగదు. అప్పటికి సుసమయము కాదని యోచించి పుడు నుడువ సంసిద్ధుఁడై యున్నను, నొకరికి మఱొకరు తోడ్పడరి గనుక, నిపు డేమత్స్యభూకాంతుఁడు తోడు చేసి కొన్నియైనఁ జేయందగు కార్యము మున్నుఁ జేయఁగవలెనేని యయ్యెడ యసమంజసం బగును.

ఓ మత్స్యభూకాంతా! ఇంక నీ కూఁతునకు - నుత్తరకుఁ - బట్టభోగము దొరకు టెన్నఁడు జూతునేని, నీ యుత్తరాభిమన్యులతోఁ బాటు పాండవేయులుఁగూడ నీ యింట నియుడుకూడు గుడుచుచు స్వాతంత్త్ర్యముఁ దక్కి, మానసిక నొవ్వుతో దినములు గడుప వలసి వచ్చును. నీ వెన్ని సహాయ మిచ్చినను, ఎన్ని మన్ననలఁ

జూపినను, అల్లు న్నిల్లఱిక ముంచుకొనుట యెట్లైన నల్లువారికి దాసత్వమై, లొంగి తిరుగ వలసిన బ్రదుకే యగును. వియ్యపు వారియింట నీ పాండునందనులు దినములు గడపుటకంటెను, నన్నలును దమ్ములును. నెయ్యమునఁ బెనిచి పెద్దజేసిన పెదతండ్రియుంగలయిం టన్నే కలకాలము జీవనము చేయుట సమంజసము కాదా! అటుగాక క్షాత్ర ధర్మము నవలంబింతు మనిన, వే ఱొకమార్గము ననుసరింప నగును. నేఁటికిని ద్రుపదునిచేతఁ గానిపని యీ నాఁడీ విరటుని, వలన నగునేమో యనియైనఁ దలంచుట భావ్యము కాదు; కాని, పాండవేయుల భాగధేయవృత్తి యెంతకాలము ఫలింపకుండును, నంత కాలము వీరలు కష్టపడుట తప్పదుకదా! ఎంతయుఁ గాకున్న, నాఁడిన జూదమ దెట్టిదైన నేమి, రాజ్యముతోడను, ధనసంపదలతోడను, ఏమాత్రమును సంబంధములేని యుపకార్యపుఁ బందెమని తొలుత నుద్ఘాటించి పలికి, జూదమున నోడినవారు పండ్రెండేండ్లు అరణ్యా వాసంబును, నొక్కయేఁ డజ్ఞాతవాసంబును సలుపవలయు ననియు, నం దెలుంగఁబడి రేని, మఱల నరణ్యాజ్ఞాతవాసంబుల నట్లె సలుప వలె ననియు ననియెను; కాని, జయప్రదంబుగ సమయంబు దీర్చి కొని, వీరలు స్వరాజ్యంబునకు మగుడునంతలోన వీరి రాజ్యంబును, వీరి వైభవంబును, తాము కొల్లఁగొట్టుట లే నాగరక దేశమునఁ గాని, యే బాధ్యత గలపరిపాలనమునఁ గాని, ఏనాఁడైనను జూచుచు నోర్చియుండుట యమానుషము కాదా! బాహుబలసమన్వితు లయి యుండియు, విపినావాసమును, గూఢచర్యయును, సమయభంగము కాకుండ, నెన్నియిక్కట్టులంబడియైన నిర్వర్తించుకొని మఱలివచ్చు నరికిఁ గూఁడులేనిపట్టు లయి, సాటి మనుష్యుల నడుమ ననదలవోలె కూటికిని గుడ్డకును, గక్కుఱితి పడి, చింతలం జిక్కుచుండ, ధర్మ మార్గం బెఱింగినయిందఱు పెద్ద లుండియుఁ, బాండవులకు నిలువ

నీడయు, దిన నన్నమును, గట్ట గుడ్డయు, నిశ్చింతముగ దొరకెడు మార్గము నాలోచింపకున్న మఱి యింకెప్పుడు? కాఁదగు వా రందఱును వచ్చి యున్నారు; చేయఁదగు యోచనల కింతకన్న సుసమయము మఱిలేదు. కావున నో సదయవిదులారా! జూదమున జరిగిన సమయము చొప్పున నీ పాండవు లడవులపాలయి, క్రూర మృగముల నడుమను, రక్కసి మూఁకల మధ్యమునను, బడరాని యిక్కట్లఁబడి తుదవత్సరం బగు నిర్వ్యోఢ దమ్మొరు లెఱుంగ కుండుట కెన్నెన్ని యూహద లొందవినను, భరియించుమన్నైనఁ గడపిరి గదా! ఇట్టియెడ ధర్మజాదుల ఋజుమార్గ వర్తనంబును, వీరియెడ ధార్తరాష్ట్రుల యనుచితవృత్తియును, నౌదార్యవంతులగు తమకెల్ల రకును విదితము గాకపోదు. పాండవులకుఁ బైతృకం బగునట్టియును, దాము దిగ్విజయంబున సంపాదించి కొనినట్టిదియును, నగు రాజ్యంబును గపటద్యూతాంతంబున దుర్యోధనుండు వంచనచే నన్యాయాక్రమణం బొనర్చుటయు, ధర్మజునిమహానుభావంబు గుర్తింపంగక, ధార్తరాష్ట్రులు పరిపరి విధంబులఁ గీడు బరిభవించినను, పెకుంటు మూఁగు సేయని శాంతాత్ముండౌటయు. నేఁటికి నమీరలు, వంచనచే వారి న్యాయాక్రమణం బొనర్చిన భూభాగంబు నా ధార్తరాష్ట్రులీ పాండవేయుల కచ్చినేయు టయో తగిన కార్యం బని యంతా రేని, దాని మార్గంబు సెప్ప నలంతులగు మీరు. అయినను నాకుఁ దోఁచిన దొకటి గెలింగింతు. సావధానులై వినుండు. ... ... "

ఇటుల గ్రృష్ణుఁడు పలుకు పలుకులు విని, ఆ మొదటి జన దారి, తనలో, "ఏ మిది? ఇపు డిట నమకూడిన యెల్లరురాజుల సాను భూతియుఁ బాండవులయెడఁ బ్రసన్నత నొందు తెలుపుగునను, ధార్త రాష్ట్రులయెడ నేవ జనింపఁజేయునట్లును, నుపన్యసించి తుదకుఁ బాండవుల పక్షపాతమును మఱులవారికిఁ గల నుపాయము నాలోచింపఁ

డని యిపు డీ సభ నలంకరించి యున్నవారినందఱ నడిగియు, సభ్యుల నోట నొక్కమాటయు బయల్పడుటకైన నెవఁడు నీయఁ డిదేమి చిత్రము! తగినయాలోచన మడిఁగియుఁ, దనకుఁదోఁచిన తెఱం గెఱిఁగింతు సావధానులరై వినుం డని యనుచున్నాఁడే! ఇం దేదేని విచిత్రము లేకపోదు. ఈతనిపలుకులు సావధానముగ వినఁదగినవియే యయి యుండు" నని యనుకొని యా జపిదారి, కృష్ణునిపైన దృష్టి సారించి వినుచుండెను.

కృష్ణుఁడు మఱల నిట్లనెను:—

"పాండవు లిప్పు డీయుర్విఁ జ్ఞాతవాసంబుల నొనర్చుటకుఁ గతంబగు సమద్యూతప్రారంభంబున దుర్యోధనునకుఁ శకునియొనర్చిన విస్తారంబైన పణంబునను, నక్షంబునను గ్రహించితిమేని, వీరి దీక్షానంతరమ్ము, వీరిసకలసంపదయును, వీరిరాజ్యంబును యథాపూర్వంబున వీరికిఁ జెందఁదగినవే యయ్యెను, వీరిడవులనున్న కాలమున, వీరి రాజ్యము ధార్తరాష్ట్రులు పంచనచే స్వాధీనపఱచికొని యన్యాయముగ ననుభవించుచున్నారనుట నిర్వివాదాంశమని మీరెల్ల రెఱింగిన దియేకదా! కావున ధార్తరాష్ట్రులు వీరి ధరణీభాగము వీరి కొసంగరేని, యిప్పు డిట విచ్చేసి యున్న తామందఱును గలసియే వారి భూభాగము వారి కొసంగఁ జేయ నలంతులరు. క్షాత్రధర్మంబుచొప్పున వీరలా భాగంబుకొఱకే కొఱంతయు లేకుండ, జగడము సేసియైనఁ గైకొనుట యధర్మమని, నయకోవిదు లగువారెట్లు పలుకఁగలరు? అట్లగుటఁ దోడి భూపాలుండగు ధర్మభూపాలుఁడి ట్లడవులపాలయి యుంట తమకు మాత్ర మేమాత్రపు మనశ్శాంతిని గలుగఁజేయఁగలదు? తమ యట్టి వారిమాటయేని ఆ ధార్తరాష్ట్రులు గైకొనకున్నచో, పాండవు లింకను ననవలంబ లేఁగాలము గడపఁజాలమి, దమ బాహువిక్రమముఁ జూపఁ దలపెదురు. అట్టిపట్టుల వీరును వారును గలసి దేవాసురులట్లు

పోరఁగలరు. అందు మనకును, వారికిని, ఆ యుభయుల దేశములకును, శాంతి దక్కదు. కాన నట్టి కడఁకేఁలు కార్యంబు చేకురకుండఁ గాపాడు భారము వయోవృద్ధులును, ధర్మస్వరూపులును, నయ కోవిదులును, నగు నిచటి యీ పెద్దలే వహించి, చేయఁ దగు కార్య మూహింపఁ దక్షులు. మీ యందఱితోడివారగు నీ పాండవుల నిట్లిడుమలపాలు చేసి, యక్రమముగ నమానుషముగ నింకను వంచన సేయుతలంపును, నీచపఱచునూహను, ధార్తరాష్ట్రులు కలిగియుండుట యెంతటి నింద్యమో, మన సాటి మన్నీం ద్రీవిధమున గూడు లేనిపక్షులవలె మలయుచుండఁ జూచుచు, వినుచు, నూఱకుండుట మనకును నంతటినింద్యమేయగును. మఱల నింత ననింద్యచరిత్రులును, ధర్మ సంస్థాపనార్థము ప్రాణముల నైన నొసంగ సంసిద్ధు లగువారును, విక్రమాఢ్యులును, నగు ధరణీపాలురు సమకూడుట యఱిది; కావునఁ దామందఱును సమయోచిత మగు నాలోచనము నెఱపఁ బ్రార్థితులారు. ఇచట సమకూడిన మన మి ట్లనుకొను చున్నాము; కాని, మొదట మానసప్రహారము నెఱుంగకుండ నెదియు నిశ్చయింపవలనుపడదు గనుక, ధర్మమార్గానువర్తనుండును, మనకు హితుండును నగు నొక్కని నక్కురుపతి కడ కనిపి, సవిస్తరంబుగఁ జెప్పింపనొప్పు. సామ్యంబున నా కౌరవనాథుఁడు వీరి ధరణీభాగంబు వీరి కిచ్చివేసిన మేల యగు. అందులకుఁ దప్పెనేని, అప్పటికిఁ బోలిన చెయ్యఁ గారయ నగుఁగాక—ఇప్పటి కింతకన్న మిన్న యూ మార్గము లేమి నిట్లు చేయ నగును."

అని కృష్ణుం డూరకుండెను.

బలరాముఁడు:— వింటిరిగదా, కృష్ణుని వాక్యములు! ఇరుతెగలవారికి నివి హితములగుటయె గాక, లోకకళ్యాణప్రదములుగూడ నైయున్న యీతని పలుకు లెవ్వరికి మాత్ర మభిమతము లై

యుండవు? జూదమునాఁటి పందెపు విధుల ననుసరించి, వీరు పదుమూఁడేఁడులు రాజ్యమువీడి యరణ్యములఁ బలుబాధలం బడి, తుదకు మఱలి యిపుడు స్వరాజ్యముం జేరి భ్రాతృవర్గముచే నాక్రమింపఁబడిన తమ యర్థముఁ దాము కోరుటయం దధర్మ మేమున్నది? ప్రతిక్రియ సేయఁగల సమర్థులయ్యుండియుఁ గోప ముడిఁగి, ధార్తరాష్ట్రులం దాడి కోడయు బాంధవముఁ దలంచి, పాండవులు కోరుచున్న సగమును దుర్యోధనుఁ డొసం గుటవలన, కురుపాండవవంశముల ధ్వంసమువాటు యవకాశ మిచ్చి, జగద్వ్యసనమును వారింపఁ జేయవలెను. కావున నిష్పక్షపాతుఁ డుండఁదగిన మాన్యుఁడగు దూతని నొక్కని నా కురుపతికడకు బంపి, ప్రసాదయుక్తముగ నాతఁడు దుర్యోధనుం జేరి, కౌరవేంద్రుని చిత్తస్థితిం గని పెట్టి, విధేయుఁడై, సిరిపడసవారల వివరించుచు వారికిఁ దెలిపి, వారి మనంబులు సీఁగపై వ్రాలునట్లు చేయు ప్రసంగం బుల నెఱపి, పాలు పంచి యిమ్మని యడుగఁ గలఁడు. లేకున్న నీ వ్యవహారము పొత్తుపడఁబోదు.

ఈ ప్రసంగమును వినుచున్న సాత్యకి తీవ్రదృష్టితో బలరాముని జూచుచుండె. బలరాముఁ డింకను నేమి చెప్పపోవునో, యని కొందఱు యును, కృష్ణుఁ డాతురముగఁ గనిపెట్టుచుండెను.

బలరాముఁడు మఱల నిట్లనెను:—

బలరాముఁడు:—ఏల యన: దుర్యోధనుని యున్నతికి ధర్మజుని కే మాపోవమి, నాతనికన్నఁ దా మున్నయని యనిపించుకొను కొఱకు, ధర్మజుండు దిగ్విజయంబు సలిపి, రాజసూయంబు నెఱ పుటకు జరాసంధాది మహావీరుల వంచనమొయి మడియింపఁ జేసి, తనకుఁ గల బాహుబల విక్రమంబులకును, మయసభాద

విభవంబులకును గర్వించి వర్తించుచు,—మమ్మెదిరించు
వారును గలరా—యను గరువంబున నున్న సమయమున,
జూదంపుఁగారణంబున సిలుగుల నొందవలసివచ్చె; ఇంతకును,
దనకు నక్షవిద్యయం దాతురమె కాని, అందుఁ గౌశలము
లేమి నెఱుంగకున్నను, బంధుసుహృజ్జనామాత్య వర్గంబులు
జూదంపు వ్యసనము మాను మని యెంతగ వారించినను, వినక
యాయత్తపడుచుండ, దుర్యోధనునకుం గూడ నక్షవిద్యా
కౌశలము లేమిని దనయమాత్యబంధుగణంబులు వల దని
యనుటను, దా నాడుట మాని, తనకు మాఱుగఁ బాచికల
యాట నారితేరి యుండిన సౌబలుని నియమింప నాతం
డొడ్డిన పందెమ్మున ధర్మతనయుం డోడి, యరణ్యాజ్ఞాత
వాసంబుల నిర్వర్తింపవలసి వచ్చె; అట్లగుట దుర్యోధను నెడ
నధర్మంబు నారోపించుట మన కధర్మంబు కాదె! ఇట్టిట్టుల
మనము పంపెడు రాయబారి రారాజుహృదయంబు పల్లవింపం
జేయఁదగు సంభాషణంబుల జరపి, వినయప్రవృత్తి నవలంబించి
మనకుఁ గావలసిన కార్యంబు నెఱపి, జయంబు నొంది రాఁ
దగువాఁడుగా నుండవలయుఁగదా !

సాత్యకి:—బాగు-బాగు; ఇట్టి ప్రసంగములు సేయుటయందు నీకు
నీవ సాటి! ఇంతకును నీయిట్టి ప్రసంగములు చెవియొగ్గి వినిన
వారి ననవలయు నంతియ కాని, నిన్ననిన నేమి ప్రయోజ
నము? ధర్మజుఁడు వేడుక పడి జూదం బాడెనో? లేక ధృత
రాష్ట్రుఁడానతి సేసి సభకుఁ బిలువఁబంచి, ఆ పిదపఁ దా రంద
ఱును బలవంతపఱచి, మోమోటమి కోటువఱచి, యాతనిచే
జూదంబునాడించిరో? ఈ మాత్రమే నెఱుంగనివా రిపు
డీ సభను లేకపోలేదు! ధర్మజుని యెడ నొక్క నింద్యమైన

నారోపించి బ్రదికిపోఁగల నా సంతోషజాలము! అట్టి కట్టిన నాతని నానావిధ వంచనచే జూదమున నోడించిన, ఆస్సభలో ధర్మజునిచే నాశిన యూడిపోఁతలకు, ధర్మమునకుఁగట్టుపడిన ధర్మశీలుండగుటను, సమస్తమైయుండియుఁ దా మిన్నకుండుటయే గాక. తన యోర్మి సర్వత్ర సంభావన చేసి, యాగ్రజునకు భక్తియుక్తులగు తన యనుజులు కూడ నప్రకటన సేయక, ధర్మజుఁడు గనుక సమయమునకుఁగట్టువడియుండగా యింక నొకరెవరీ ధరణిపై నాకొరవ్వరు కాఁ బెద్దవులగుచు యూడిపోఁతల కట్టలఁ గట్టుకనీయుదురు! ఇంకెవ్వన్న నింకెట్టి వారలోనగద ధర్మాత్ములు! ఇంతమాత్ర నాలోచింపకపోయిన మాయన్న! మాయన్న నుదివిన ...గున ప్రకరమొక్కకొను చేతలకుఁ దండనమువారు, ప్రాణులకు దసనరించి, సమయము నిర్వర్తించికొని జయప్రదముగ సర్వజనులకు ...రిని విదసఁ దమ ధరణి భాగము తమ కొసంగని నా దేహమును ప్రత్యక్షమగు తమ నాశనాగమునను, రణోద్యోగమునకైనను. దమ బాహుబలముఁ జూపినను, గెలిచి మరలఁ గైకొను సామర్థ్యము గల, యూహావకేళీవిక్రమములు కారు. కాని మొట్టికను దన్నియమూను సారముగ వీ రడవులనున్న కాలమున వీరి సర్వస్వమును సపహరించియు, వీరి ... టవసానమునఁ దమకుఁదామగా వీరిది వీరి కొసంగకుండుట యటుండ, నిప్పుడు మనమం పెడితాయబారి వారికడఁబలికెడి సముచితములగుపలుకులకుఁగూడ నాతఁడుచక్కఁబడఁడేని, క్రూరశరముల ధార్తరాష్ట్రుల నొప్పించియిప్పించుటో, గెలిచి కైకొనఁ జేయించుటో, చేయింపఁగలను. ఎదురులేని భీమార్జునులును, నేనును గలసి సమరమునకుఁ గడంగితి మేని యింకెట్టి పాటునూనిసి

వైనను, దుర్యోధనుపక్షమున నడచిన భూమీశులలో నొక్కండైనను బ్రదికి పోంగలండా! దుర్యోధనుని వంటివారు నూర్గురెత్తి వచ్చినను, పాంచాలురును, వృష్ణివరులును, మన కవలవారును, పుత్త్రసంతానమును ధార్తరాష్ట్రుల నిట్టె పిండిసేయరే! చతుర్విధోపాయపరాయణుండును భుజబల యుతుండును, నగు నీ మత్స్యమహీపతి సహాయమున మనకుం దీర్పరానిపని యేమున్నది! ఏది యెట్లు జరుగనైయున్నను, నా మతమున మాత్రము, సంగ్రామమునం గానిపని యింకొకటి కాదనియు, సౌమ్యవచనంబుల నా కురుభూపతితోడం బలుకం దలంచిరేని, మన మిపుడంపుదూత దైన్యవిరహితమై ధర్మసమంచితమై, రాజసమ్మాన్యమైన తెఱంగున సంప్రదించి పదుమూడేండ్ల క్రిందట, పాండవుల యనుభవమున నుండిన ధరణీభాగ మెప్పటియట్ల ధర్మోచితముగ వీరి కప్పగించునట్లు బలుకందగు వాంఛగా నుండవలెను. అట్లును నాతం డొడంబడండేని తత్ఫల మాతం డెల్లని యనుభవించు: నంతియుకాని, వేడుకోలు, తిరిపమెత్తుకొను తెఱంగు, దైన్యభావము, ఇట్టివి, రాచబిడ్డలకు—నందునను ధర్మయుతమగు వివాదాంశముం గూర్చి—పొందని సుద్దులు కావే!

ద్రుపదుండు:—సాత్యకిమాట మాటగాని బలరామునిమాట మాట కాదు. దుర్యోధనుండు దుష్టాత్ముండును, బలపరాక్రమ వంతుండును, బహుసహాయ సంపన్నుండును, నగుటను రాజ్య భాగం బీపాండవుల కాతం డొసంగుట కలలోనివార్త. మఱియు, మృదుభాషణంబులచే నెన్నండును, దుర్జనులు ప్రసన్నతామహిమంబు నొందంజాలకపోవుట యటుండ, శాంతయుతులును, మృదువచనరచనాయుతులును, నగు వారిం

గాంచి వారి నెల్లెదముగ నెంచి, యంతంతకు మదమును దురభి
మానమును హెచ్చి, మఱింత సిరిపై నుఱుకఁ బ్రయత్నింతురు.
ఇంతియగాక, నటుఁ గౌరవసభను సూటికై చేరిన భీష్మద్రోణు
లంకారప్రాయులను గుణవంతులు సుశీలురయు వారి ననుసరింపక
మానరు. హీనదశోపు రాజ్యాన్వేష్ణాధికారమును, అట్టి వ్యామో
హమునను, ధృతరాష్ట్రుఁడు తనపుత్రునకు నిమ్ముగఁ జూపి సల్లభి
నయించుచుండ నాతని ననుసరించిరి. ఇట్టి కుమారులు మెచ్చు
వారు రాధేయుండొక్కఁడు తుంటరులు పక్క మఱి యితరులు లేరు.
కావున సుక్షేత్రుండగు దుర్యోధనుండిట్టి విధమైన సంగరంబె
నాంఘించి యనుట నిస్సందేహంబగుట మనము బాహుబల
సమకూర్చుకొని, రాజ్యాధికారము రాజులనెల్ల రావించుట
కింకను విలంబమేల? సహాయము సమకూర్చుకొనుటయం
దే మాత్రమును నిరాలసించినను, మనకు సాయము దొరకుట
యుండుట యసాధ్యమగును. ఏలయన: దుర్యోధనుండు గూడ
భోజనసమయంక మానఁడుగదా! సహాయము కొఱకుఁ గోరిన
వారికె సాయమిచ్చుట మంచిరాజులకు సహజగుణమౌట,
మనకడనున్న వారిలో వేగిరము నిపుణులు శల్యకేకయధృష్ట
కేతుసహదేవాదిభూపతులకడకును, వారివారి బంధు
మిత్రులకడకును బంపి, మనకార్యం బెఱింగించి, వారి వా
ర్తానంబులఁ దెలిసికొనుటయే కర్తవ్యం బని నాకుఁ దోఁచెడిని.
ఇంతలో మా పురోహితుఁడు చతురతముఁడు సత్వశీలుండు
న్నాఁడు, వానిఁబంపి కేయుకడ కనుపుదము. ఆతనికి ధృతరాష్ట్ర
సమ్ముఖమ్మునను, దుర్యోధనుని కడను, భీష్మ సన్నిధిని,
ద్రోణు నొద్దను, విదురు సమక్షమ్మునను ధర్మోచిత పలుకా
రంబులఁ బ్రసంగించు నేర్పుం గలుగఁజేయుచు విధంబును దెలియఁ

జెప్పెడి విషయంబుల ప్రకారంబును, నేర్పడఁ జెప్పి పుచ్చిన స్నేహంబును లాభంబును సమకూడు. నాకుఁ దోఁచిన తెఱం గెఱింగించితిని—అని చెప్పి ద్రుపదుఁ డూరకుండెను.

కృష్ణుఁడు:—ఇపు డీ పాంచాలపతి పలుకు వింటిమి. ఇఁకఁ గౌరవ పాండవు లిరువురును నాకు సమానము. ఈ రెండు కుటుంబములవారును సస్నేహముగ సముచితముగ రాజ్యము లేలికొనుచు బ్రదుకుట మోదముతోఁ జూడ మాకు మాత్రము వేడుకగాదె! ఓ ద్రుపదభూపాలా! మీరు మా కెల్లవారికిని గురుస్థానము; ధృతరాష్ట్రుఁడును మీ యెడ బహుమానంబు సేయు; శాంతనవుఁడును మిమ్ముఁ గొండాడు; ద్రోణ కృపాచార్యాదులు మీ యెడ సఖ్యంబు వాటింతురు; కావున మీ పురోహితుని సంపుటె సముచితముగఁ గార్యము జక్కఁబడు విధంబై యున్నది. మీమాటయు జవఁదాట నెంచినచో నుద్రిక్తులగువారె చెడుదురు. అట్లయ్యును శక్తి వంచనలేని మనప్రయత్నము సొవ్వఁ బొందోఁదవిన నది లెస్సయగును; అటుగాక మన ప్రయత్నమంతయు భగ్నమైన యెడ, మీ నుడివిన యట్లుల సహాయార్థము రాజుల నెల్ల రావించి, చివరను మమ్మును బిలువ బంపుఁడు. మీ యాలోచనప్రకారము పాండుతనూభవులకు రాజ్యభాగ మీకున్న దుర్జయుండగు నర్జునకోపానలము కౌరవాన్వయ విపినమునకు దావానలమై భస్మము సేయక యూరకుండునా? ఇంతకును పెద్దలగు తా మందఱును నుచితానుచితమ్ములు సమయజ్ఞతతోఁ నెఱింగి మఱియు నడపింప సమర్థులరు గదా! ఉత్తరాభిమన్యుల వివాహ కార్యమునకై ఆహ్వానింపఁబడి వచ్చియుంటిమి. శుభకార్యము సుఖముగ జరిగినది. ఇఁక మే మందఱమును ఇటనుండి సెలవు గైకొందుము.

అనుచు స్వదేశాభిముఖుండయి సాత్యకిబలరామ సహితుండయి కృష్ణుండు బయలుదేరి, పాండవులును ద్రుపదవిరాటాదులును, దక్కుంగల రాజులును గొంతదూరము దన్నంపకము వెట్టఁ బయనము సాగించెను.

ఇంతవఱకును సభావేదికపై జరిగిన విషయములన్నిఁ శ్రద్ధతో వినుచుండిన ఆజపదారి తన మనమున నిట్లనుకొనసాగెను.

ముని——ఔరా! ఏమి [illegible]ము ! ఏమి మాటనేర్పరితనము ! దశదినంబు లిట్లు యుద్ధముఁ బుట్టించి, పోరాడుచున్న వారిపై భారము మోపి, నేరము చేరిచి, సంగనాడి [illegible], దగ్గిన నిట్టిలేచి నాఁడే కృష్ణుఁడు! బలరాముని మాట నదలఁ ద్రోసినాఁడు—— దుర్యోధనుని మాట మొదలకట్టినాఁడు. దుర్యోధనునకును ద్రోణ భీష్మ కర్ణ దుర్యోధనాదులకును గల ప్రాబల్యము నెఱింగియు, దుర్యోధనుని [illegible] దూరంగా గొనుసభకుఁ బంపుటకుఁ నిర్ణయించినాఁడు. తన తేనెమాటలచే ద్రుపదుని నాకసముపైఁ గూర్చుండఁ బెట్టినాఁడు. ద్రుపదుని నెపమ ద్రోణ కృపాచార్యాదులు సఖ్యంబు వారించుటకు రని ద్రుపదునకు మొన్న ప్రుట్టించి నాఁడు. తనకు సాయము సేయు మున్ముందుగ సందులు రాజులకును గబురంపి తుట్టతుదకుఁ దనను బిలువఁ బెట్టు మనినాఁడు. ఆహా! ఏమి రాజనీతిజ్ఞుఁడు ! రాజనీతియనఁ దేనియపూసిన కత్తియ కావలయు!

ఈ కృష్ణునకుఁ దో డా సాత్యకి యొకఁడు! మాటనేర్పరి యాతఁడు: మాటదురుసరి యాతఁడు; ఎదుటివారిని రచ్చకీడ్చు నీతఁడు: తానుగాఁ బలుకుబడు నాతఁడు; ఇఁక ద్రుపదుని మాటఁ దలఁచుకున్న, ద్రోణ భీష్ములఁ గూటికై చేరినవారని త్రుణీకరించినాఁడు. దుర్యోధనుని గుమతియని నిర్దేశించి

నాఁడు. ధృతరాష్ట్రునిపైఁ బుత్రవ్యామోహపు నేరము మోపినాఁడు. రాధేయునిఁ 'దులువ' యని తూష్ణీంభావముఁ జూపినాఁడు.

కృష్ణ బలరాము లిరువురును గురుసభకు దూతసంపుటకు సమ్మతించినారు కాని దూత సంపుటయే యనవసరమనినాఁడు సాత్యకి. ఇప్పట్టున ధార్తరాష్ట్రుల కడకు దూత సంపుట పాండవ దౌర్బల్యముం జాటుటయే గాక, వారి యనదతనముంగూడ సువ్యక్తముఁ జేయుటయె యని సాత్యకి ధృవపఱచియుఁ గృష్ణబలరాముల పలుకుల నవలఁ ద్రోయ మోమోటమిఁ గోటఁబడి తుద కొప్పికోలునంబడి నాఁడా సాత్యకి.

ధార్తరాష్ట్రులవీఁటికి దూతసంపుట కీ కృష్ణబలరాము లిరువురు నేకాభిప్రాయము గలవారలెయయ్యును, గురుసభ నా దూత నెఱపు సంభాషణవిధానమున భిన్నాభిప్రాయులైనారు. న్యాయనిష్ఠురతలచే, ధర్మసూత్రముల నుపన్యసించు విధానములచే, ధృతరాష్ట్ర ధార్తరాష్ట్రుల మనములఁ బాండవులకగు భాగము వారికి స్వాధీనపఱచు తెఱఁగు దోఁపఁ జేయు మనినాఁడు కృష్ణుఁడు. బలరాముం డటుగాక, గురుపతి తన మానసము కరఁగ, జాలిఁ దలంచియైనఁ బాండవులకగుభాగం బిప్పించు తెఱం గెంచుమనినాఁడు. దుర్యోధనాదుల యెడ నేరము లెంచినాఁడు కృష్ణుఁడు; దుర్యోధనాదుల యెడ నేరమే లేదనినాఁడు బలరాముఁడు. కావుననే న్యాయనిష్ఠుర సంభాషణవిధానము నెఱపుమని కృష్ణుండును, సామ్యసంభాషణవిధానమే ప్రధానమని బలరాముండును సూత్రీకరించినారు. దూత నెఱపవలసిన సంభాషణ క్రమము పట్ల బలరామునిఁ ద్రోసిరా జనిపించు నాద్రుపదుండు. తన యన్న

యగు బలరాము నభిప్రాయమునుండి, తాను భిన్నుఁడై యున్నను, దనసూత్రము నంగీకరించిన ద్రుపదాదులు కలరు కదా యని మిన్నకుండెను. తన యుపపాదన నంగీకరింపఁ బడలేదుకదాయని యెంచి కానోపు బలరాముఁడును మిన్నకుండెను.

ఎట్లయినను దుర్యోధనాదుల మానసతత్త్వము నెఱింగిన వాఁడౌటనో, రాజ్యభాగ విషయమున దుర్బలవాదము గలవారు పాండవులని తన యెదఁ దలంచుటనో గాని, బలరాముఁడు మాత్రము దౌత్యమున సౌమ్యమార్గమును, వేడికోలును, ఉపపాదించినాఁడు. కాని యిప్పుడిటఁ జేరినవారు, తమ తమ వ్యక్తిసంబంధములను ప్రత్యేక ప్రత్యేక కారణములచేతనో, దేవాసురయుద్ధము నింకొకదాని నభిలషించుటచేతనో, లేక తమతమ ప్రాఁబగలఁ దీర్చికొనుటకు సమాహూతముగా సిద్ధింపఁబోవు మంచితరుణము నేలఁ బోఁగొట్టుకొనవలయునని యెంచిరో, రగులుకొనినయగ్నికి మఱింత పవనసహాయమును, ఇంధనసముపార్జనమును జేయుచున్నారు. కృష్ణునిదెస నాలోకింప నీకఁ జేదే నొక పెద్ద యెత్తు నెత్తు తలంపునఁ బన్నుచున్న యద్భుతవ్యూహమునకీటుల దిగ్బంధనకార్య మారంభించుచున్నాఁడా యని తోఁపక మానదు. ఉత్తరాభిమన్యుల కళ్యాణమంటప మిప్పుడిట్టి సంగర సమాలోచన మంటపముగా మారినది. కళ్యాణకారణమున నన్యోన్యమర్యాదలం దీర్చుకొన నేగుదెంచినరాజలోకము, మహాయుద్ధమే జరుగఁబోయినచో, నందుఁ బాండవులకు సహాయ మొనరించు రాజమండలముగను, ధార్తరాష్ట్రుల సేవగించు రాజచక్రముగను మారి పోయినది.

ఇంతతో వీరిసభ ముగిసినదే కాని కార్యము మించి వచ్చు చున్నది. మఱి నేనిటఁ దడయరాదు.

అని యనుకొనుచు నా మాయజడదారి తత్సభాస్థలిన్వీడి చనియెను.

శ్రీకృష్ణ బలరామాదులు ద్వారక కేగిరి. ఇఁక నుపప్లావ్యంబునఁ బాండవులకడ మిగిలినవారిలో ముఖ్యులు ద్రుపద విరాటులు మాత్రమే.

ద్రుపదుఁడు తన పురోహితునిఁ బిలిచి పాండవకార్యార్థియై యాతనితో నిట్లు ప్రసంగించెను.

ద్రుపదుఁడు—మా వంశమునకుఁ బురోహితుండవును, వయోజ్ఞాన వృద్ధుండవును, సుకృతివియునై నాకు నెచ్చెలి వగుటను పాండవులకొఱకు ధృతరాష్ట్రుపాలి కరిగి నేర్పుఁజూపి, కురు భూపతితోఁ బలుకవలయును.

పురోహితుఁడు—తమకు హితమునే కోరుచుండు నేను దమ యాజ్ఞానుసారము కార్యము నెరవేర్తును.

ద్రుపదుఁడు—పుత్రభూత పీడితుండగు ధృతరాష్ట్రుఁడు కుటిలుఁడు. కొడుకు కొట్టితెచ్చుదానిని దిని జీవించు నయ్యాంబికేయుని చంద మెఱుంగుదువు. ధర్మజు ననుపమానమగు సౌజన్యము నెఱుంగుదువు. ఇట్టి నీ వప్పాట నా కురుపతి సభలో,—

—మీరలన్యాయాక్రమణము జేసి యనుభవించుచున్న పాండవులపాలు మీరు వారికి నొప్పగించుట యుచితము—

అని ధృతరాష్ట్రుతో ధర్మోచితసంభాషణము చేయుచుండ, యుద్ధమునకే సిద్ధపడియుండినదొరలయుఁ, దద్భృత్యులయు మనమ్ము లొక్కపాటుగఁ దిరుగఁబడును. యుద్ధముమాట విననైననొల్లని గురుభీష్మాదుల, నేమిటకైన సంసిద్ధుఁడు

కానయియున్న దుర్యోధనుఁడు, యుద్ధమునకుఁ గాలుద్రొవ్వక మానఁడు. కావునఁ బాండునందనులెచటఁ బడిన పాటుల నఱిఁగి బాహుజనులెల్లఁ దెల్పునఁ బాండవులను వృద్ధులను గురు సిద్ధులసాలికిఁ బోయి, కురుకులోచితముకాని ధార్తరాష్ట్రులు చేసిన మోసమెల్ల నిరూపించి, చూపి, స్త్రీపురో క్తులచేఁ దక్కిన యెల్లరి యుల్లములఁ దక్కటికంపుఁ దలంపు పుట్టఁజేసి, యక్కడి యందఱి మనంబులు నెక్కుడు ప్రాలుపట్టి వెరవెఱింగి ప్రసంగంబులఁ బ్రదర్శఁజేసి, కార్యంబు చక్కఁ జేసికొని, మఱియు మగిడిరావలయు. ఇచట మత్స్య భూపాలుని కొలువుకూటంబున జరిగిన సంభాషణంబులు నీయెఱింగి నంతె పట్టు తప్పనుమానంబుగా నుడివి, పాండవులకుఁ దేశా లాభంబులుగలుగునట్లు నపుడు నాకుఁ గర్తవ్యంబని యెఱుంగుము. హస్తిపురంబున నున్న సమస్తదనంబులు సి వుండినయెడ నయసంపత్తి కలకును, కర్ణసూరాజ్యనొప్పకును, భీష్మ విదుర గురు కృపాదుల ప్రమోదకును, ప్రత్యేక ప్రత్యేకముగ నైనను, దంభముగ నరుగుచు, నానాఁటికి వారివారి చిత్తంబుల గుఱుతించి ప్రవర్తింపుము; మన యుద్దిన సూత్రంబున కా దుర్యోధనుం డొడంబడియుఁ జేసి, నయ్యెడ తప్పక సకలజనసమ్మతంబ యగును. అట్లు కాదేని కాఁగల కార్యంబులు గంధర్వులె తీర్పవలంతులు. కావున మఱిచేయక నీవు నయసమ్మన కాయితమ్ముగ వమ్ము.

పురో—చిత్తము.

పాంచాల భూపాలు నాజ్ఞంగొని ధర్మజాదుల యనుమతి వడసి, ద్రుపద పురోహితుండు కరినగరి కేగెంచెను.

ద్రుపదుండును పాంచాలమునకు మరలెను.

రాయబారము

రెండవ ప్రకరణము

—o—

హస్తిపురము—విరాటునగరమున వివాహవేదికపైజరిగిన పాండవ బంధుమిత్రగణంబులసంభాషణములను, తన గూఢచారుని మూలమునఁ దెలిసికొనినదుర్యోధనుని చిత్తవిభ్రమము-కర్ణ దుర్యోధనుల దూరాలోచనములు-వివాహకారణములు-భీష్మ ద్రోణాదులు .పాండవులపై నభిమానము జూపుదురేమోయని దుర్యోధనుఁడు సంశయించుచుఁ దనయభిప్రాయము ప్రకారము సకారణముగ వారివారి యనవస్థల సవిభజనముగఁ జూపిన చర్చ-పాండవపక్షంబున ద్రుపద పురోహితుండు రాయబారియై కరినగరిఁ జేరకపూర్వమే శ్రీకృష్ణుని సహాయ మభ్యర్థింప దుర్యోధనుని ద్వారకాభిగమనము.

(దుర్యోధనుఁడు—తనలో)

ఏమిది! ఇంత తత్తరపాటొందెనా ద్రుపదుండు! తనకు మా యెడఁగల ప్రాఁబగఁ దీర్చికొనుట కిదియె యదనని యెంచి ద్రుపదుం డాధర్మజుం జేరియుండునా! పాండవు లాద్రుపదున కల్లువాండ్రందుమేని, నేటివఱకును గాని యల్లుం డ్రిపుడే యయిరా? ద్రౌపదీ వివాహము మొదలు నేటివఱకును నిదురించుచున్న ద్రుపదుం డిప్పుడే మేల్కాంచెనా? అలనాఁడు భీష్మ ద్రోణ కర్ణార్జునులచే దా నోడింపఁబడి మాతోఁ గావించుకొనిన సంధి నియమముల ననుసరించి, ద్రోణునకుస్వాధీనపఱచినదియు గంగానది కుత్తరదిశను మాకంది రాజధానిగాఁగలదియునగు అహిచ్ఛత్రమును, వారణావతమును, మఱలఁగైకొనుట కిదియె తరుణమనియెంచి కాఁబోలు ద్రుపదుండా ధర్మజుంజేరి, యాతని వెరపై బొమ్మ నాడించురీతి నాడింపఁ దలంచినాఁడు. ఇదివఱకే కర్ణుఁడు యాదవుల పీచమడంచి సంధినియమముల

ననుసరించి చేకొనిన వృక్షస్థలము మఱలఁ దాము చేకొనుట కిదియె యదనని యెంచి కావలయు, నా యాదవులును ధర్మజుం జేరిరి.

తొల్లి పాంచాల పాండవమను ద్వివర్గసమ్మేళనమునకు భయపడి, యేమి మునుఁగునో యనియెంచియో, పాండవుల కింతతినుట కన్న ముండనిమ్మను భూతదయనో, జూసి మనసునొంచి, యెట్టులనో సంకీర్ణులగు నాపాండవులకు సంకీర్ణులగు నీభీష్మ ద్రోణ విదురాదులు ధర్మజునకుఁ దొలి యువరాజ్యపట్టాభిషేకము చేయించియున్నను, మాతండ్రి నా మొర నాలించి ధర్మజున కర్ధరాజ్యమొసంగి వారల నింద్రప్రస్థమునకుఁ బోవున ట్లానర్చెను. అర్ధరాజ్య మను మిషను ఖాండవ మిప్పించితిని. నే ననుకొనినట్లు ఖాండవమున నున్న వన్య మృగముల చేతనో, రాక్షసవర్గమువలననో, నిహతులగుటకుబదులు ఖాండవమెల్ల దహించి, క్రొత్త జనస్థానము లేర్పఱచుకొని, రాజసూయ మొనర్చి తమ విక్రమమే ప్రకటించుకొనఁ గలిగిరి.

రాజ్యమునం దేమాత్రమును స్వత్వములేని పాండవులే క్రమక్రమాభివృద్ధిఁ గాంచుచుండ వారి యుద్ధతికి సహింపలేక, జూదము నన్ని యందోడునట్లు పన్నగించి, తన్మూలమున వారు సర్వసంపదలం దూలు నట్లొనర్చినను రాజువారిం గరుణించి, మఱల వారిరాజ్యము వారి కొసంగుటం జేసి, ధార్తరాష్ట్రకులమునం దగ్రశాఖవారు ఖండరాజ్య మేలుటకు మనసొప్పమియుఁ, బురువంశీయు లేకాలముననైన నవిభాజ్యమగు రాజ్యమును ఖండంబు లొనర్చికొని తినుట యెఱుంగమియుఁ బాండవుల సమీపమున నున్నంతకాలమును రాజెట్లయినను గరుణించి యిచ్చుచుండుటో, రాజొసంగఁ దలంచియు, నా పోరు పడలేక తన మానసము నెట్లోని చిక్కఁబట్టి యీయకున్నను గురువృద్ధు లెల్లరును ఆతని యుల్లముఁ బల్లవింపంజేసి, యెట్లోని నాతని నొడంబఱచి, యొప్పించి యిప్పించుటో జరుగుచునే యుండును గదా యని యెంచి వారల వీలగునంతకాలము దవ్వులఁ బారఁదోల

బన్నాగ మొనర్చి, యనుద్యూత మేర్పఱచి, యం దరణ్యాజ్ఞాత వాసములే పణంబుగా నేర్పఱచి, యరణ్యావాసమునఁ గ్రూరమృగ ముల వాతఁబడి చచ్చుటో, లేక యజ్ఞాతవాసంబున నెఱుఁగంబడి రేని మఱల మఱల నరణ్యాజ్ఞాతవాసంబు లొనర్చుచుండుటో, జరుగు చుండునని యెంతో దూరము యోచించి వారి కరణ్యావాసాది కష్టపరంపర లొదవఁజేసియు, వారి నడవుల కనిచి దేశ భ్రష్ట త్వముఁ గలుగఁజేసియు. వారియనుభవమున నవు డుండిన ధరణీ భాగమును, మయసభాది సంపదలనెల్ల స్వాధీనపఱచికొనియు, వారు మగిడి వచ్చినను జనాదరణము నొందకుండున ట్లెంత ప్రయత్నించి నను వారు సక్రమంబుగ నరణ్యాజ్ఞాతవాసంబు లొనర్చి రాజ్య పరిపాలనకు మఱలసంసిద్ధులై అంతతో నాగక, అజ్ఞాతవాసదీక్షానం తర మా కోయరాజకూఁతురా నుత్తర నభిమన్యున కిప్పించి వివాహము నెరపఁ జేసి, తత్కల్యాణమంటపసభాభవనము సంగరస మాలోచనరంగముగా మార్చి యా యాదవు లురులొడ్డుచు వ్యూహ ములఁ బన్నుచున్నారని గదా చారుఁడు చెప్పియున్నాఁడు. అల నాఁడు పాండవ పాంచాల సమ్మేళనమునకు జంకి మా జనకునిచే నింద్రప్రస్థ మిప్పించినవారే, యిపుడీ పాండవ పాంచాల మాత్స్య మను నీ త్రివర్గ సమ్మేళనమునకు మఱింతజంకి యిం కేమేమి యిచ్చి వేయుమని మాతండ్రి నాకుఁ గట్టడిసేయున ట్లొనర్తురో కద! ఇఁక యాదవ సాహాయ్యము పాండవులకు సుస్థిరముగ లభించుటకుఁ బూర్వమే తొలుదొలుత నేనే ద్వారకకేగి, కృష్ణునిసాహాయ్య మడిగి చూచెదఁ గాక! ద్రుపదుఁ డంపిన పురోహితుఁ డీయూరు చేరక పూర్వమే నేను గృష్ణు సహాయ మభ్యర్థించి, తక్కుంగల రాజులఁ గూడ వారివారి బలములతో నాకు సహాయ మొసంగుటకు బాండ వులకన్న మున్ముందుగ నేనే కోరి మరలి వచ్చెదఁ గాక!

(దుర్యోధన దర్శనార్థియై కర్ణుఁడు ప్రవేశించెను.)

రెండవ ప్రకరణము

అంగరాజా, జూదపు సమయము నిర్వర్తించుకొనిన పిదప, మనలను గలసికొనకయే పాండవులు విరటునగరమునఁ గూరుచుండి తద్రాజన్యునితో సంబంధబాంధవముల నెఱపికొని, పాంచాల మాత్స్యులతోఁ గూడి మనపై నెత్తివచ్చుటకు సిద్ధపడుచు, మనతోడి సంగరంబునకుఁ దలఁపడిన పిదప మనకడకు దూతనంపుచున్నారఁట, వింటివే!—అంగరాజా, మనలను భయపెట్టి రాజ్యమును గొను తలంపది కాదా! ఏకీ ధర్మజుని సౌమ్యభావము? తన యత్నములు సౌమ్యములని, తనసరివారును, దన సమాజమువారును దలంచుకొనుటకును, ప్రజాభిప్రాయము తన్ననుసరించు కొనుటకును, దన మానసమున నున్న దురూహలఁ గప్పిపుచ్చుకొని, న్యాయమువలె, ధర్మమువలె, నీతివలె, లోకమునకు గోచరించుగతిని బ్రవర్తిల్లుటకు ధర్మజుఁడు వేయుచున్న పరమలౌకికపు టెత్తులు జుమీ యివి! ధర్మజుం డెంతటి ధర్మపరుండని యనుకొంటివి!

* * *

జపదారి వేసమునఁ బోయివచ్చిన మన చారుఁడు చెప్పిన దంతయు నీవును వింటివి గనుక మనతోఁ గయ్యమునకై కాలుఁ ద్రవ్వుచున్న పాండవులతో జరుగఁబోవు సమరమున మనకు సాయము సేయఁగోరుచు రాజులఁ జూడఁబోయెదను. కావున నేను మఱలివచ్చువఱకును నీవు రాజ్యపాలన విధులయం దప్రమత్తుండవై యుండుము.

కర్ణుఁడు—తమ యాజ్ఞల శిరసావహింతును.

దుర్యోధనుఁడు—మన శత్రువుల ప్రయత్నముల నీవు నేర్పున గుర్తించుచుండుము.

అని పలికి మిత పరివారముతో ద్వారకం గూర్చి దుర్యోధనుండు పయనమై పోయెను.

రాయబారము

మూఁడవ ప్రకరణము.

ద్వారకానగరము:—చరిత్రాత్మక, భూగోళశాస్త్రవిషయిక పౌరాణిక, నైసర్గిక, ప్రాముఖ్యతలంజూపుచు చిత్రించిన వర్ణనము-అర్జున దుర్యోధనుల ద్వారకానగరప్రవేశాభివర్ణనము-శ్రీకృష్ణుని ప్రథమ దర్శనౌచిత్యము-కృష్ణ దుర్యోధనుల సంభాషణము-కృష్ణార్జునుల సంభాషణము-అభిలషితసహాయవాంఛాఫలసిద్ధి నడసిన యర్జున దుర్యోధనుల సంతృప్తి-శ్రీకృష్ణుని కార్యములప్పు భగవత్స్వరూప సమర్థనము-అర్జునుఁ దుపప్లావ్యముననున్న ధర్మజునొద్దకు కృష్ణుం గొనిపోవుట-సహాయ మభ్యర్థించుటకుఁ జక్కనరాజులఁ జూడఁగోరిన దుర్యోధనునిగమనము.

పౌరాణికకథా కాలమునాఁటి ప్రదేశము లిప్పటి కింకను అదేరీతిని భూభాగములుగనో, జలభాగములుగనో, యుండక, యప్పటి భూభాగము లిపుడు జలభాగములుగఁ గాని, యప్పటి జలభాగము లిపుడు భూభాగములుగఁ గాని: పూర్తిగనో, యసంపూర్తిగనో, మారి కొన్ని తావుల నామమాత్రావశిష్టములయియు నింకం గొన్ని యెడల మఱపునకు వచ్చియు, నయనగోచరములు కాకయు, నుండియున్నవి. భారతయుద్ధకాలమునాఁటి జనపదములు కాలక్రమముగఁ గొన్ని జలాంతర్గతములై యున్నవి. కొన్ని యడవులుగా మాఱినవి; కొన్నింటి నామములే యిపుడు స్మరణకు రాకున్నవి. ఇట్టిమార్పులుపొందిన పెక్కుతావులలో శూరసేన దేశమునకు ముఖ్యపట్టణముగానున్న ద్వారక యొకటి. అలనాఁటి శూరసేన దేశము ఈనాఁటి గుజరాతు దేశమైయున్నది. కచ్ వియుక్తాగ్రగుడము శ్రీకృష్ణ నిర్యాణానంతరము

పొంగిపొరలి వచ్చుటచే ద్వారక యానీటిముంపుదునకు లోనైనది. మన కిపుడు కానవచ్చుచున్న ద్వారక, యలనాఁటి ద్వారక కాక సముద్రతీరమున కట్టబడిన మఱియొక ద్వారకయై యున్నది.

భూతలస్వర్గమని భాగవతులచేతను, దమకోటనే వాసుదేవుచే నిర్మించుకొనఁబడిన దాఁగుడుమూఁతని వైరులచేతను, వరుసగా నభినందింపఁబడి, నిందింపఁబడిన ఆ ద్వారకానగర మాద్వాపరమున రాచవారు నిర్మించిన వీడులలో వైభవమున మొదటిదియుఁ గాలమునఁ గడపటిదియునై యుండి, సాత్రాజితి కోర్కెదీర్ప మున్ను పేంద్రుఁ డింద్రుని నందనవనమునుండి తెచ్చి పెరటిచెట్టుగ నాటిన పారిజాత మందుండుటనో, ఉపేంద్రుని రాజధానియగుటనో, దాసజనముల కోర్కెలీడేర్చు నచ్యుతుం డందు నివసించుచు, భగవద్భక్తుల దరింపఁ జేయ వేచియుండుటనో, గాని, యక్రూర ప్రముఖులందఱును, ఆ ద్వారకను రెండవయమరావతి యని పిలుచుచుందురని పురాణము లందుఁ గలదు.

ఒకనాఁటిమధ్యాహ్నము ద్వారకానాథుఁడు భోజనానంతరము తనభవనమున నవరంజి కోళ్ల మంచముపైఁ బరుండియుండి, తనతల యంపిదెస రుక్మిణీసతి తములపాకులమడుపుల నందిచ్చుచుండ, సత్యభామయు మిత్రవిందయుఁ దమ కరపద్మములఁ జామరములఁ గొని, వీచుచుండ, జాంబవతి కాల్కడఁ గూరుచుండి తన పాదారవిందముల నొత్తుచుండఁ సాత్రాజితితో, నెడనెడ ద్రౌపదిం గూర్చియు, నర్జును గూర్చియుఁ బ్రశంసించుచుఁ గొంతతడవుగడపి, నిదురింపనెంచి, యువతీజనమును వారివారి సదనములకుఁ బో సెలవొసంగి, కొంత విశ్రాంతినొందనెంచి బోయి యయ్యాదవకులశేఖరుఁడు తన కనుదమ్ముల నరమోడ్చి నిదురించెను.

ద్వారకానగరపుఁ దూర్పుద్వారమునుండి సర్పకేతనపటాం

చలముతోఁ గన్నులు మిఱుమిట్లు గొల్పు వేగమున నీలిమఁగ్రక్కు-
చుండెడు పారసీకములఁ బూన్చినరథమునఁ గూరుచుండి, పవన
వేగమున యదుకులభూషణు నగరముంగూర్చి కడురయమున దుర్యోధ
నుండు వచ్చుచుండ, దక్షిణద్వారమునుండి, యనుపమానభక్తి
చిహ్నమగు కపిరాజకేతనము మెఱయుచుండ, విజయసూచకములౌ
ధవళాశ్వములఁ బూన్చినరథముపై నధివసించి నగరివాకిటఁ బ్రకాశిం
చుచున్న గరుడధ్వజ సమీపమునఁ దనయరదము డిగ్గి, గరుడధ్వజము
నకు సాగిలపడి మ్రొక్కి ప్రదక్షిణము సేయుచున్న పార్థుం గాంచి,
పాపమా దుర్యోధనుండు, "అన్నా, తరుణము మించెఁగా" యని
తత్తరంపడి, ఫల్గునుని ప్రదక్షిణ నమస్కారములు పూర్తికాక
పూర్వమే, తనగమ్యస్థానము ముందుగ జేరనెంచి, రథగమనవేగము
ద్విగుణము సేయుమని తనసారథికిఁ గట్టడియొసర్చెను. సారథియుఁ బయ
నపుటాయాసమునైనను సరకుఁ గొనక, అంతలోనె నందనందనుని
భవనద్వారముకడ నరదమ్ము నిమ్ముగ నిలుప దుర్యోధనుం డరదంబు
డిగ్గి, తత్సమీపంబున నిలిచిన దౌవారికుని మూలమున యదుపుంగ
వుండు నిదురించుచుండెనని తెలిసికొనియుఁ గృష్ణుని శయనమందిరము
నకుఁ ద్రోవఁ జూపుమని యాతని నడుగ, నాతండును బురోగామియా
కా నా దౌవారికుని వెంటనంటి సుయోధనుండును దచ్ఛయన మంది
రముఁ జేరెను. కృష్ణుఁడు నిదురమేల్కాంచునంతఁ దానె మున్ముందుగ
నాతనితో మాటలాడు తలంపునఁగానోపుఁ గృష్ణుఁడు నిదురించు
చున్న మంచమునకుఁ గాల్కడనున్న పీఠముఁ జూచియుఁ, దలయంపి
దెసనున్న పీఠముపైఁ గూరుచుండి, యతండు నిదురమేల్కాంచునం
దాక వేచియుండునని కావలయు, మిన్నకుండెను.

నగరమధ్యముననున్న గరుడధ్వజమునకుఁ బ్రదక్షిణ నమస్కా-
రములొనర్చి పదంపడి తనరథము నధిరోహించి, యరదముఁ బోనిచ్చి,

నగరివాకిటఁ దనవాహనముడిగ్గి, పుండరీకాక్షు మందిరద్వారమునకు నమస్కరించి, దౌవారికునిచే దుర్యోధనాగమన మెఱింగి, కక్ష్యాంతరములు దాటిదాటి, కృష్ణునిశయనాగారము ప్రవేశించి, మొదటఁ బీఠోపవిష్టుండగు దుర్యోధనునిఁ, దరువాతఁ గృష్ణుని శిరోభాగంబును, బిమ్మట రుక్మిణీకాంతునికాళ్లకడ నుండిన యనధిష్ఠిత పీఠమునుఁ జూచి మెల్లమెల్లనఁ బదములిడుచు నటకేగి యించుక తడ వటు నిలిచి, తనమనమునఁ గృష్ణుం గీర్తించుచు, మోడ్పుఁగేలుదోయితో శ్రీకృష్ణునిముఖారవిందమె చూచుచుండ, దేవకీనందనుండు మేల్కాంచి కన్నులు విప్పినంతనె తనదృష్టింబడిన విజయుంజూచి, పదంపడి తన శిరోభాగపువైపునఁగూరుచుండిన వాని గుఱుతించి, చప్పున లేచి కూరుచుండెను. 'ఎపుడునిదుర మేల్కాంచు నీయదుపుంగవుం'డని వేచియున్న దుర్యోధనుమానసపుటారాటము ద్విగుణీకృత మయ్యె ననుట కేమి సందేహము కలదు! నిదుర మేల్కాంచి కృష్ణుఁడు కన్నులు విప్పినంతఁ బార్థుఁ డయ్యాదవకుల జలధికౌస్తుభమగు కౌస్తుభలాంఛనుని పాదముల దక్కన నట్టెనిలిచి, కనికరమ్మును, రాజనీతియు నొకవంకను, విజ్ఞానమును, యోగేశ్వరేశ్వరతా సూచకంబగు ననాసక్తియు మఱియొకవంకను, వెదచల్లుచుండు విశాలపుండరీకలోచనములును, లోచనాంతములనంటి శ్రీకారములంబోలు వీనులును, వీనులమీఁద నుండి నునుఁజెక్కుటద్దములపైఁ జిందులాడుచుఁ బ్రతిబింబించు మణికుండలద్వయధాళధళ్యమును, దొలుకారు మబ్బునా వెలయు కోమలశ్యామల శరీరకాంతియుఁగల ప్రద్యుమ్నునికన్నతండ్రిం దన కన్నుల కరవుదీఱఁ గాంచి, "కాళీయుని ఫణాగ్రములఁ దాండవంబాడి, మున్ను బలిచక్రవర్తి నవరత్నఖచిత కిరీటముపైఁ గొంతతడవు విడిసి, సకలజగత్పావన కారణమగు వియద్గంగకు జన్మస్థానమగు నీ పాదరాజీవంబుల కిదె నమస్కరింతు" నని యంబుజోదరుముఖారవిందము

గాంచి తనకరాబ్జములతో, శ్రీకృష్ణునిపదాబ్జములకు మనఃపూర్వక ప్రణామంబు లాచరించి మానసికధ్యానంబు సేయుచు నిలచియుండెను.

నిద్రమేల్కాంచిన దృష్టినే ధనంజయ దుర్యోధనులఁ గ్రమంబునఁ జూచిన కృష్ణుఁడు, "ఏమిది—త్రోవదప్పివచ్చితిరే! చిరకాలంబునకు మీసందర్శనలాభంబు పడసితి. ఏదేనిమహాకార్యం బుండనిచో మహాత్ములరగు మీ రూరకరారు. కావున మీకార్యం బెఱింగించి నన్నుఁ గృతకృత్యుం గావింపుఁ" డని పలికెను.

దుర్యో:—యదునందనా, కౌరవ పాండవయుద్ధమున మే మిరువురము నీ సహాయ మభ్యర్థింప వచ్చితిమి. మేమును వారును స్నేహ బాంధవముల నీకు సమానులము. కావున నిను సాయ మొసర్పఁగోరి నిను సందర్శింపవచ్చుట యబ్బురముకాదు. సుజనులు మున్ముందుఁ గాంచినవారి నే ప్రసాదింతురట సుప్రసిద్ధము: అం దీవు సౌజన్యసారయుతుండవు. అట్లగుట మొదట నినుఁ గానవచ్చిన వాని కీవు తోడుగావలయునని కోరుచున్నాను.

కృష్ణుఁడు:—(కొంచెము స్మృతి నభినయించి ప్రకాశముగా) బావా! నీ చెప్పినయది నిక్కము. నన్ను మొదటఁ జూడ వచ్చినది నీవ యయ్యును, నేను మొదటఁజూచినదియర్జునుం గాని నిన్నుగాదు. నీ చెప్పినయ ట్లుకార్థులై వచ్చిన మీ యిద్దఱకును సమానముగ సాదరంబుగ సాయ మొసంగవలెఁ గావున మీ కోరికలెట్లో యట్ల నెరవేర్పఁగలను. నాతో సమానులును, నాచే శిక్షనొందినవారును, సంగర పాండితీ మహిమాన్వితులును, చాపాద్యాయుధ కళావిశారదులును, నగు పదివేలమంది నారాయణగోపాలు రను కంచురథాల వారొకయెత్తును, నిరాయుధుండనై, పరమాప్తుండనై, యూరక నిలుచు నే నొకయెత్తును నై యున్నారము. ఇందెవరి కేవంతు

కావలసిన, వారద్దానిం గైకొనందగుంగాని మీ యిరువురలోఁ దొలుదొల్త నెంచికొనుటకుం గొండికకే యర్హత కలదు.

ఫల్గునా, మీయిరువురలో నీవు చిన్నవాఁడవు గావున మొట్టమొదట నీవే నీ యిష్టమువచ్చిన వంతుఁ దీసికొనుము.

అర్జు:—నేను నిన్నే కోరుకొందును.

ఈ ప్రత్యుత్తరము విజయుముఖమునుండి వెలువడుటయె తడవుగఁ బెన్నిధిఁగన్న పేదవిధాన, పదివేవురు కంచురథాలనారాయణగోపాలుర బలంబులఁ గైకొని దుర్యోధనుఁడు, "బావా! నా యాప్తితంబు గుర్తించితివో—యన నెఱిఁగి యెఱిఁగి నా కోరిన సేనయే నాకుఁ దక్కునట్లు చేసిన నీ ప్రేమకు నే నెంతయుఁ గృతజ్ఞుఁడను. నీ నారాయణగోపాలుర కిపుడె యాజ్ఞ యొసఁగి నారాజధాని కనుపుము. సెలవొసఁగి నన్నునుపుము." అనిదుర్యోధనుఁడారంగము వీడి వెడలిపోయెను.

* * * *

కృష్ణు:—పార్థా, కోదండపాండితీ మహిమాన్వితులై సంగ్రామారంభశీలురగు నారాయణగోపాలుర దుర్యోధనుఁడు దృష్టిమెయిఁ గైకొన, నిరాయుధుండనై సంగరారంభ రహితుండనగు నన్నుఁ గోరుకొనుట నీ కేమి ప్రయోజనకారి యని యనుకొంటివి ?

అర్జు:—యుద్ధమునకు నేను సహాయముకోరను. సుప్రసిద్ధుండవగు నీవే సమర మొనర్చినచో, యుద్ధమున నేనెంత శ్రమించినను పేరును ప్రతిష్ఠయు నీవియ యగును. మఱియు నీకుఁ బ్రతిపక్షమూని జయంబుఁగొనుట దురూహ్యమగుటను, విజయమునకు నీవు మూలమగుటను, నిన్నే కోరుకొంటిని. కావున నపార కృపామతితో నా కీవు సారథ్యంబొనరించుచు, నన్గాపాడుచు,

నాకు జయము సమకూడఁజేయుము. చిరకాలమునుండి నీ సారథ్య గౌరవము నేనుపొందఁగోరి, కోరికోరి నిన్నిపుడు వేడుచున్నాను.

కృష్ణుఁడు — అర్జునా! నీ యభీష్టము నెరవేర్చుటయే నాకు విధ్యుక్త కార్యము గావున నీకుసారథ్యంబొసరించి, అసమయుద్ధక్రీడను నీకుఁ బరమాప్తుఁడనై యుందును.

అర్జు — యదుకులభూషణా! నాకీ వరమె చాలును. ఈ వరమె యీపదివేవురు నారాయణగోపాలుర బలమును కౌరవ సేనావారమును పోలిసిరాజునుఁజేయఁగల దను దృఢవిశ్వాసము నాకుఁగలదు.

ఇఁక మనమిదుపురమును ధర్మజు పాలికింబోవలయు. నిను దోడుకొని రమ్మని నాకుఁగట్టడిచేసి యుధిష్ఠిరుఁడు నన్నిటకుఁ బుత్తెంచెను గావున నీవును నేఁడే నాతోఁ బయనము కమ్మని ప్రార్థించుచున్నాను.

అంతఁగృష్ణుండును నర్జునునితోఁ [illegible] బయనపు సన్నాహము సేయఁ దొడంగెను.

* * * *

సింహావలోకనము

సెబాసునోయీ కృష్ణా! ఏకక్రియాద్వ్యర్థకరీబభూవ — యను నార్యోక్తిని నీ యొనర్చిన కార్యమున నొప్పించితివోయి! నీకడ కరుదెంచిన వారిరువురును నేక కార్యార్థులనుమాట సత్యమె యగును. అందుఁ బోలి దుర్యోధనుఁడే నిన్నుఁజూడ, వచ్చె ననుమాటయు నసత్యముకాదు. మొదట నీ సహాయము కొఱకు నోరు దెఱచి

నీ వన్నడిగినది దుర్యోధనుఁడై యుండ, 'నర్జునునే తొలిదొలి చూచితి నను సమయస్ఫూర్తి నెగడఁ జేసితివి. అర్జునునకు స్వయముగ నీవే సాహాయ్యముసేయ నీ మనమున నిశ్చయించియే కావలయు, దుర్యోధనుఁడు పశుబలమువంటి బాహుబలముపై నాధారపడువాఁడని యెంత కాలమునుండి గుర్తించితివో కాని, నీ వ్యక్తిబలమును, నీ నారాయణ గోపాలురబలమును సమానమగువంతు లని దుర్యోధనుని మానసమున కెక్కించి, నిన్నెవరు గోరుకొన్నను,-నిరాయుధుండనై, యనుపమానప్రేమతోఁ బరమాప్తుండనై "యూరక నిలుతు" నని బాహుబలముపై నెల్లయెడల నాధారపడియుండుదుర్యోధనునకు, నీ వ్యక్తి సహాయ మనుపయోగమని తోఁచుతెఱంగున సంభాషించితివి! అంతతో నాగక, నీవు వేసిన రెండువంతులలో, నీ 'వ్యక్తి' యనువంతును దుర్యోధనుఁడు గోరుకొనఁడని నీ వెఱింగియు, నవకాశమేల నొసంగవలయునని యెంచికానోపు, వంతుల నెంచికొని యెత్తికొనుటలోన 'చిన్నవాఁడే మొదట నెంచికొనవలె' నను ధర్మసూక్ష్మము వెదకినావు.

నారాయణ గోపాలురతో దుర్యోధనుఁడు మరలిన పిదప నీ వర్జునుం జూచి, 'నిరాయుధుండ నగు నన్నేల గోరికొంటివి? కోదండ పాండితీమహిమాన్వితులగు నారాయణగోపాలుర దుర్యోధనుఁడు గోరికొనెనే,' యని బావమరదితో హాస్యములుపలికి, నీ నిరాయుధత్వమునకుఁగల కారణములను నీమనసున నునిచికొనియే పరిహాసములాడితివి! ఎంత సమయస్ఫూర్తితో నట్లంటివో కాని మఱి వెల్లడించినావుకావు. కాని నీవే చక్రముపట్టి పాండుసుతులపక్షము వహింతువేని యెన్నిచిక్కులు తటస్థించునో, నీవుమాత్ర మెఱుంగవుగనుకనా! చక్రపాణివై నీవే పాండవపక్షమునఁ బోరఁదలపడుదువేని దుర్యోధనునకు గదావిద్యయం దాచార్యుండును, తన శిష్యులందఱిలో దుర్యోధను నందు ప్రత్యేకపుటభిమానముగలవాఁడును, నీయన్నయు నగు

బలరాముండు తన హలమును బూని ధార్తరాష్ట్రుల పక్షమునం బోర సిద్ధపడెననియు, దస్మాలమున మీ యన్నదమ్ము లిరువురకును యుద్ధము సంభవింపఁజేసినవాఁడవగుదు వనియు, నయ్యది లోకమునకు దుష్టమగు నుదాహరణ మగునుగదా యనియు, నింతవరకును జరిగిన కార్యకలాపమును, కురుపాండవవివాదములో నీవు జోక్యముకలుగఁ జేసికొనిన ప్రకారమును, నీజనకుండగు వసుదేవున కిష్టములేకుండుట నీ వెఱుంగుటకుఁ దోడు ప్రద్యుమ్నాదులగు నీ కుమారవర్గముఁ గూడ నిను సేవగించునో కా యనియు, శంకించియు నిరాయుధుండవయి యుండుమని యనియుందువు. మఱియు నీ వాయుధపాణివైనచోఁ దా నెంతదూరము నైతికపరుం డయినను, విదురుం డూరకుండక కౌరవపక్షమున నిలువకమానం డనియుంగూడ దలంచియుందువు. మాండవ్యశాపమువలన యముఁడే విదురుండయి జన్మించె ననియు, నట్టి—విదురుండే విలు వట్టిన నిక నాతని కెదురే— యనియు నీ వెఱుంగుదువు. యముఁడే సమరమునకు బూనెనేని సర్వమును నాశనమగునుగదా యని కూడ మదిం దలంచి యుందువు! అట్లు జరిగియుండెనేని అపుడు కురుపాండవయుద్ధముకాక, కురు పాంచాల యుద్ధమును గాక, కృష్ణబలరామయుద్ధమును, కృష్ణ విదుర యుద్ధమును నయి, అట్టియుద్ధమున నీవు ప్రత్యేకముగ గుర్తింప బడవలసివచ్చునుగదా యని, నీవు 'నిరస్త్రపాణివై యుండు' మని యని యుందువు. నీవు కురుపాండవసమరమునఁ జేయిచేసికొనని-చో, బల రాముండును నీ యనిమొన నిలువకపోవు ననియుఁ దలంచియుందువు. నీ వస్త్రముఁబూనకున్న విదురుండును నెప్పటియట్ల నీవలని మైత్రియు నీయెడ భక్తియుఁ జూపుచుండుఁగదా యనియు, దస్మాలమున గౌరవ పక్షపురహస్యములును విశేషములును దెలిసికొనుచుఁ గథాక్రమము నడపింపవచ్చును గదా యనియు నెంచియుందువు కావలయు. శాపము వలన నొకండును, అంశవలన నింకొకరును, క్రమముగాఁ దండ్రి

కుమారు లగుట పరస్పరము తెలియకున్నను, విదుర ధర్మజులు, యమ యమనందను లయి, పుత్రప్రేమయు పితృగౌరవమును పొందియుండుటను, దొలినుండియు ధర్మజాదులయెడఁ గల ప్రేమచే వారి నరసి రక్షించుచున్న విదురుని సాహాయ్య మేలఁగోలుపోవలె ననియు నెంచియుందువు! నీవే చక్రము పట్టినచో, యాదవులు నీపైఁ బగబూనుదు రనియుంగూడ దలంచియుందువు. ఔరా! ఎంత ప్రతిభాశాలివి! ప్రథమసోపానముననే యింతలు సేయఁ గలిగిన నీ చేతలయం దిమిడియున్న యంతర్భావములను బామరులమగు, మేము గ్రహింపఁగలమా! నీ యంతర్భావములును, నీ సంకల్పములును, నీ సంకల్పములకుఁ గలకారణములును మానవదుర్భేద్యములౌట, మేము దెలిసికొనఁజాలని సందర్భములపట్ల నీచేతలు భగవంతునిచేతలుగాఁ దలంచుటయం దసంగత మేమున్నది? మా కన్నులె కొలబద్దలుగను, మా మనములె కొలపాత్రలుగను, గల మేము నీ యొనర్చు కార్యములును నీ సంకల్పకారణములును దెలిసికొనఁజాలని తరుణము లసంఖ్యాకము లైనపుడు నినుఁ దలంచినపుడెల్ల నొకయెడ నీవే భగవంతుండవనియు, నింకొకయెడ, నీవు భగవదవతారంబవనియు, మే మెన్నుచుండుట యెట్లసంగతము కాఁగలదు!

దుర్యోధనుఁడు కోరినది దుర్యోధనునకును, అర్జునుఁడు కోరినది యర్జునునకును నొసంగి, తన్మూలమున నీ భావికార్యములకెల్లఁ ద్రోవలఁ దీర్చికొంటివి. ఇట్లొక్క కార్యమువలననే రెండు ఫలముల నేకముహూర్తమున నొందఁగల బుద్ధి బలము నీ పిననాఁట నుండియుఁ బ్రదర్శిత మగుచునేయున్నది! ఎప్పటి కప్పుడు ప్రమాదము రానీయకుండ నుక్తిపై నుక్తిబన్నుచు మంత్రరక్షణకళచేఁ బరిస్థితులఁ ద్రిప్పఁగల ప్రతిభాశాలిని నాఁటికిని నేఁటికినింగూడ నినుదక్క నింకొకనిని మరి కానను!

రాయబారము

నాలవ ప్రకరణము.

(i) మార్గమధ్యమున దుర్యోధనుఁడు బలరాముఁగలసి సంభాషించుట-పాండవ పక్షమునఁ జేరిన కృష్ణునిఁగూర్చి బలరాము నభిప్రాయము-ధర్మజుదర్శనార్థమై పోవుచున్న శల్యుని మార్గమధ్యమునఁ గలసి, దుర్యోధనుఁడు శల్యుసహాయలాభము వంచనమెయి నొంది కరినగరముఁ జేరుట.

ద్రుపదపురోహితుఁ డానాఁడే కురుపతిసభకు రాయబారిగఁ బంపఁబడియెను. మఱియు శల్య, కేకయ, ధృష్టకేతు, సహదేవాది భూపతుల కడకును వారి వారి సాహాయ్యముఁ గోరుచుఁ బాండవాగ్రజుండు దూతల నంపియే యుండెను.

సాహాయ్యముఁగోరుచు శ్రీకృష్ణునిదర్శింపనేగిన దుర్యోధనుఁడు తనకుఁ గృష్ణుఁ డొసంగిన యా పదివేల కంచురథాలవారినిఁ గరినగరమున కనిపి, మార్గమధ్యంబున బలరాముంగలసికొని మ్రొక్క బలరాముండును దనప్రియశిష్యు నాశీర్వదించి, సేమంబడిగి తెలిసికొనెను. అనంతరమ్ము కానయియున్న కురుపాండవసమరమున బలరాముని సహాయము దుర్యోధనుఁ డభ్యర్థించెను.

బలరాముఁడు:— సుయోధనా, అభిమన్యు, వివాహమునకుఁ బ్రభువర్గంబెల్లఁగూడంబడియుండ, నాసభను నీకొఱకే నేమిపలికితినో ఏమి మాటలు వచ్చిన్నో, మీకరినగరమున నాడుకొనలేదే! నీవు వినలేదే! పాండవపక్షపాతంబునఁ బ్రతికూలవచనంబులు వలికినకొండలు నా పలుకుల కసహ్యాపడుటయు, నయ్యావి

కృష్ణునకుఁ బ్రియంబులై యుండుటయుం బొసఁగినది. కృష్ణుని
బాసి యే నొక్క నిముసమును నుండఁజాలమియు, నాతనితో
విరసంపుమాటలు వలుకఁజాలమియు, నేనేమియు ననఁజాలక
ఒకనిశ్చయమ్మున నుంటిని. మీరును వారును జలమునఁ బోరిన
నం దెద్ది యెట్టులైనను నేనూరకయుండ నిశ్చయించితిని.
అట్లగుట నే నెరికిని సాయ మొసఁగఁ జాలను. నాయట్లే
కృష్ణునిపుత్త్రులగు ప్రద్యుమ్నాదులును దటస్థభావము నూని
యున్నారు. ఇఁక మజ్జనకుండగు వసుదేవుం డేమనునో!
అట్లగుట దుర్యోధనా, నీ ప్రయత్నమున నీవుండ నగును.
అని బలరాముం డాతనికి దీవెనలిడి యంపివేసెను.

దుర్యోధనుం డాతనికడ సెలవుఁ గైకొని, ధర్మజుని కోరిక
చొప్పున నాతనిఁ జూడవచ్చుచుండిన శల్యభూకాంతుని మార్గ మధ్య
మునఁ జూచి తొలుతఁ దానే యాతని సహాయ మభ్యర్థింప నెంచి,
యాతఁడు విడిసియుండు తావుల వలసినన్ని సదుపాయములు సన్నాహం
బుగ సన్నాహపఱచుచు, సుప్రసంగవశమున నిపుడు జరుగఁబోవు కౌరవ
పాండవయుద్ధమునఁ దనకు సమాత్యుండయి, వాహినీపతియై, సమర
సారథ్యంబొనరుచు సహాయ సంపద నాతని నోటఁ దొలుదొల్త వాగ్దాన
రూపంబునఁ దాఁబడసి, తనతోఁ గరినగరంబున కరుదేరఁ గోర,
శల్యుండును బాంధవ్యులం జూచి మరలివచ్చి తన్నుఁ [దుర్యోధనుని]
జేరుదుననియు నాతని కోరిక కొప్పుకొంటిననియుఁ దుర్యోధనునకుఁ
దెలిపి, శల్యుం డుపప్లావ్యంబునకుఁ జనియెను.

దుర్యోధనుండును, దాఁజూడఁ దలంచిన రాజులఁ జూచియు,
వారి వారి సాహాయ్యము నొందియు, హస్తిపురిఁ జేరుకొనియెను.

శల్యుండును బయనంబు సాగించి, ధర్మరాజాదు లున్న
తావునకుఁ జేరుకొనియెను.

* * * *

నాలవ ప్రకరణము

(ii)

(ii) శల్యుఁడు ధర్మజుని దర్శించుటః—ధర్మాధర్మ విచక్షణలఁ జూపు వారిసంభాషణ—ధర్మజుఁడు శల్యసహాయ మభ్యర్థించి, చేయు ప్రసంగఫణితి—శల్యుని వాగ్దానము—శల్యుని తాత్కాలికపు మానసిక తత్వవిచారము—అధర్మములుగఁ దొలఁదోపఁ జేసి యనంతరము ధర్మములై నెగడు కార్యముల విపులచర్చ—కార్యాకార్య నిరూపణము—ధర్మజుశీల విమర్శనము.

అదివఱకే పాండవపక్షముం జేరుకొనియుండిన చమూ సమూహములనెల్ల నుల్లమలరఁ గాంచి, శల్యధరణీపతి, ధర్మనందనుని యావాసంబున కరుగఁ నట నీ శల్యుని కొఱకెదురు సూచుచుండిన ధర్మజుండును, దన భ్రాతృవర్గంబును, ద్రౌపదీ సుభద్రలును, నభిమన్యు ప్రభృతి పుత్రసంతానమును దోడురా, నెదురేగి శల్యు నాలింగన పూర్వక గౌరవంబుల సంతుష్టాంతరంగుంగా నొనరించి యర్ఘ్యపాద్యాది సత్కారంబుల నాతని హృదయంబు పల్లవింపంజేయ నాతండును బునరాలింగనంబుఁ జేసి, యన్యోన్య మర్యాదలం దీర్చికొనిన పిదప ధర్మజుండు శల్యుని కుశలంబడిగి యాతని సముచితాసనంబున నుపవిష్టుం జేసెను.

శల్యుఁడు—ధరణియు రాజ్యముపేడి భార్యయు ననుజన్ములును, మీరలును, నీయడవులఁ గడు నిడుమలువడితిరి. అంతకంటెను ఘోరతర కష్టమౌ నజ్ఞాత వాసముఁగూడ ననుభవించితిరి.

ఇన్ని కష్టములఁబడియైన జూదమునాఁటి పంతెపు నియమముల జయప్రదముగ నిర్వర్తించుకొనఁ గలుగుటకు, మీ దైవ సూనృతాదులును, సద్ధర్మాచరణ శీలమును, దేవ మానుష శక్తియొక్క కారణకార్యసంబంధమున లెనుపు దైవమానుషముల రెంటినాదప్రవర్తించుమీ సుస్వభావమును గారణములు కావలయు. కౌరవులింపనుక మిముఁబఱచిన బాధలకును, వారి మూలమున మీ పొందిన మీ మానసపుటుమ్మలికమునకును, నీ లోకము నారెల్లరును గమనించిరి. ఎంతవారికిని విధిప్రేరణ యనుల్లంఘనీయమగుట మీరలింపలునడుట తటస్థించనది.

మీ దూత నన్నుఁ బిలిచినపిదప మిముఁజూడ నే నేతెంచుచుండ మార్గమధ్యమున దుర్యోధనుండు ననుఁ గలిసికొని, తాను పాండుసుతులతోఁ బోరుట సిద్ధమయ్యె ననియుఁ దనకు నే నమాత్యుఁడుగా చమూపతిగా సమర సారథిగా నుండఁగోరి, నావలన వాగ్దానంబునొంది, తనతోడను నిభపురమున కిపుడె రమ్మనికోర, మిముఁ జూచివత్తునని ప్రత్యుత్తరంబిచ్చి వచ్చి మిముఁ జూడఁగంటి.

దుర్భరమగు కష్టపరంపర లనుభవించిన మిమ్మిపుడు గనుఁగొని నా మనసు గలఁకదేఱినది.

అని వారియెడ నా శల్యుఁడు తన సానుభూతి నెఱపెను.

ధర్మరాజు:—మంచిపని చేసితిరి. ఒకరిని మెచ్చి వారికోర్కెఁ దీర్చుట పెద్దలగువారికి సహజగుణము కదా! ఇట్టి మీ మహోదాత్త గుణమునకెంతేని హర్షమొంది మీకడ నొక్కటి వేడసాహసించుచున్నందులకు నను క్షమియింపఁగల కర్తలు.

మీయర్జునునకుఁ గృష్ణుఁడు సారథ్యంబు సేయుచున్నాఁడు. కర్ణుఁడు మీయర్జునుతో నెల్లప్పుడును మత్సరించుచుండును. కర్ణార్జునులకు సంగరంబు జరుగుచున్నప్పుడు కృష్ణునకుఁ బ్రతి సారథ్యం బొనరుపఁ గౌరవపక్షంబునఁ దమరుదక్క నింకొకరు సమర్థులు లేకుంటఁ గర్ణునికొఱకు సారథ్యంబు మీకవశ్యంబు ననివార్యంబు నగును. కావునఁ దాము తప్పక యీ కార్యమున కొల్లమింజూపక, సమర సమయంబున సారథ్యంబుఁ బూనుటకు ముందు నిరాకరించిపలికి, కర్ణుచిత్తంబునకుఁ జాంచల్యంబు కలుగఁజేసి, మీ పలుకులఁ గలఁక పుట్టించి కర్ణుని తేజంబు దూలఁజేసి మా పార్థునకుఁ బరిరక్షనొసంగఁ బ్రార్థించుచున్నాను. ఇయ్యది యకృత్యంబని యనుమానింపక, మానసంబున నెవ్వగనొందక, నా ప్రార్థనం బెల్లవిధంబుల ననుష్ఠింపవలయు. ఇంతమాత్రంబు తా మొనర్చిన నయ్యది పాండుసుతులకు విజయసూచకంబ యగును.

శల్యుఁడు:—ధర్మనందనా, గాంధారీనందనుఁడు నను నమాత్యుఁగా నుండుమనియె; సేనానేతగా నుండు మనియె; సమర సారథ్యంబొనరింపు మనియె; నంతియే కాని సూతపుత్రునకు సారథివి కమ్మని కోరియుండలేదే! అతఁడు సమరసారథి యని యనియెనే కాని, రథికుని పేరుజెప్పి యన్నాతనికి సారథి కమ్మని చెప్పియుండ లేదే. నా సాయము కోరుట సూతపుత్రు సారథ్యమునకా? నాయట్టి వానికిఁ దగని సారథ్యము వహియింపు మనుట కాతనికి నోరెట్లాడును?

ధర్మ:—ఆతనికి నోరెట్లాడుననియా తమకుఁగల సందేహము? ననుఁ జూడవచ్చియుండిన తమకు మార్గమధ్యంబున పథికశ్రమంబు వాపఁదగిన సకల సౌకర్యములు నేర్పరించి, తమయుల్లమల

రించి, నాకన్న మున్న తమసహాయ వాగ్దానము గైకొన్న
యూ వంచకుని సాహసమునకుం దా మాశ్చర్యము నొందవలసి
లేదని, అంతటి సాహసునకు నోపెదనను గని తాము సహింప
నక్కఱలేదు. వంచనాన్వితముకాని కార్యముగాని, వంచన
మిశ్రితముకాని పలుకుగాని, యూహింపలేఁడు. ఇఁక సమా
త్ములను కండని తమ్ముఁ దోబుట్టువులుగాఁ గోరుట నన్నభినం
దించుటయ యగును. పదవ సేనాపతులు కంపని యుపుగుట,
తమ యుద్ధనైపుణ్యముఁ గొనియాడుటయు నగును. పదంపడి
సమర సారథ్యం బొనరుపఁ గోరుట యుద్ధరంగ మంతయును
నవ్వుఁదని తమ్ముఁ గోరుటకాదు. ఒక రథికునకు సారథ్యం
బొనరుపఁ గోరుటగాక యింకొకటి కాఁజాలదు.

ఇఁకఁ గర్ణార్జునులే ప్రధాన వీరులును, తొలినుండియును
మత్సరము పెరిగియున్నవారలును నయియున్నారలు. అర్జును
నిర్జించుటకే కర్ణుని దగ్గఱఁ జేర్చికొని నాఁడు దుర్యోధనుఁడు.
అర్జునునకుఁగల యన్ని లాంఛనములును, సౌకర్యములును,
కర్ణునకుఁగూడ లేనియెడఁ బ్రతియోధుని మహత్త్వమునకు
లోపము కలుగును. అందును శ్రీకృష్ణ సారథ్యంబునకుఁ దుల్య
సారథ్యంబు శల్యసారథ్యంబయగుట మిముఁగర్ణునకే సారథ్యం
బొనరుపఁ నాతఁడుగోరుట తప్పదుగనుక తప్పక కర్ణునకు మీ
సారథ్యంబె కర్తవ్యంబయగును. కావున మద్రదేశాధీశ్వరుఁడనగు న
న్నొక సూతపుత్రునకా సారథ్యంబు సేయఁగోరుట యని మీ
మానసమున నెంచక, మీ మనసు నెట్లైన నొప్పించుకొని,
వశీకృత చిత్తముతోఁ బ్రకాశముగాఁ దొలుత నిరాకరించి
పలికియు, నవల నెట్లో యొడంబడినట్లు నటియించి, కర్ణునకు
సారథ్యం బొనరింపుఁడు. రథారోహణ మొనర్చినది మొదలు

కర్ణుని కఠోరవాక్కులచే ధృతిదూలఁజేయుచు సారథ్యంబు నెఱపినచో, దుర్యోధను కోరికప్రకార మాతనికిని, నా ప్రార్థనము చొప్పున నాకునుంగూడఁ దాము సాహాయ్య మొనర్చిన వా రగుదురు. మా పార్థుని బరిరక్షణ మొనర్చిన వారునుంగూడ నగుదురు. అట్లగుట నెల్లవిధంబులఁ గర్ణునకు సారథ్యంబొనర్చుటయె కర్తవ్యంబగును.

శల్యుఁడు—దుర్యోధనున కేను సాయపడెద నని తొలుత ననుటను నాతని కోర్కె దీర్పవలయును.

మీ రంపిన దూత చెప్పిన చొప్పున మిము సందర్శింప వచ్చుచుండిన నన్ను మార్గమధ్యంబునఁ దన యొనర్చిన సదుపాయములచే నీన కా యని తోఁపఁజేసి, వంచనమెయి నా వలన సాహాయ్యవాగ్దానముం గొనుటను, నిట్టి సాహాయ్యమే చేయవలయును. పిన్నపెద్దల తారతమ్యము తెలియంగ నెంచక, సూతపుత్రునకే నను సారథ్యం బొనరుపఁ గోరెనేని, తాఁ గోరినయట్లు సూత సారథ్యంబొనర్చుచు, నిజానకు నర్జునుం గాచు తెఱంగారయుదు. మహాహవసమయమునఁ గటువాక్కులచే నా దుర్ణయవిచారుమనసు కలఁచి కలఁచి, కర్ణునకుఁగల దర్పమును, దేజమును, మాసితొలంగు నట్లొర్చి వివిధభంగుల నాతని నోనాడుచు, నా పలుకులచే నేమి సేయుటకును దనకుఁ జేతులాడకున్నతఱిఁ గర్ణు నర్జునుండు తన తీవ్రబాణ పరంపరల పాలుపఱచి, నిర్జించు.

యమనందనా, ఇదియొకటియే యననేల? మీ మనసునఁ గలదేది చేయుమనికోరిన నయ్యది చేయఁబూనితిని. అలనాఁటి జూదమున నీ సూతసూతి, యనార్యనిరీతి, మిము సభనాడిన యవినీతికి, నందఱ హృదయములును గడునొచ్చియుంట, మీ

కే విధానమైన మేలొనఁగూర్ప నిశ్చయించితిమి. ఎంతెంత యవి నీతులకైన మీ యోర్పు, దుర్యోధనుఁ డెంతవవరివను,! మీరందఱైనఁచి యూతఁడు మిముఁ బెట్టిన యట్టుల క్లేశఁ బ్రతిక్రియ సేయఁజాలియుండియు, మీరలు శాంతయుతులై సైరణసేయుటంజేసి, మీ పడిన పాటుల నెవ్వరి నొవ్వఁజేయావు! నిర్బంధమును, దుర్మార్గంబును, ప్రధానగుణములుగాఁగల యుల యవినీతిపరుండగు దుర్యోధనుని చేత నెరికి మిత్రులు మేనజనింపఁ జేయ కుండును! అట్లయ్యును, నిట్టి బన్నముల నటితిమే యని మీరలు మఱి చిత్తమునందెన్నక, మనమున నగవక, మానసంబున గ్రిందువడక, కర్తవ్యంబునడపఁ జూచుడు. మాధవుండే కలఁడని నమ్మిన మీ మనోరథమ్ము ఫలమ్ము నొందక వమ్ము కాఁజాలదు. దేవస్త్రీసను మెచ్చు సంతోదారము మీ ప్రశాంత ప్రవర్తన ప్రకారము ప్రకాశింపఁ జేసితిరి. ఇంకేమి సేయవలయు! మఱియెంతకును బశ్చాత్తాపముదయింపఁ జాలని యయోమయహృదయుండగు నా సుయోధనునెడ వెనుక ముందులాలోచింప నిఁకఁ బనిలేదు. సమయము దప్పివచ్చిన దేవతలైనను జిక్కువడి యాపదలం బొదలిన కథ లెన్నేని కలవు. ధైర్యము చిక్కఁబట్టి, దైవముపై భారముంచి యొనర్చుచున్న మీ యుద్యోగమున మీకు జయశ్రీ లభియింపఁ గలదు.

ధర్మ:— మద్రభూ కాంత! భవ్యభవదీయ భాషణ శ్రవణంబున చిత్తంబు కలంక దేఱె.

అని ధర్మజుండు పలికి మద్రపతికి సముచితంబులగు మజ్జన భోజనాదుల నేర్పఱచి, కొంతవడి విశ్రాంతి చేసినపిదప శల్యుండు పయనంబున కాయత్తపడుచుండ నపుడు యుధిష్ఠిరుండు—"మీరలు రాధేయుఁ

బలుకుట మఱువరాదుసుఁడీ మమ్ముఁదలఁచియైన—'' నని శల్యునికి సూచించెను.

శల్యుండును ధర్మజుంజూచి; "యట్ల చేయుదు; సంశయము వల'' దని యూరడఁ బలుకఁ బరస్పరగాఢాలింగన పూర్వక మర్యాదలం జేసిన పిదప మద్రపతియుఁ గౌంతేయాగ్రజుకడ సెలవుఁ గైకొని తన బలమ్ములతో హస్తి పురమ్మునకు మరలెను.

సింహావలోకనము

యమనందనా, నీ విపుడు శల్యునితో నెఱపిన సంభాషణపు టౌచిత్యముంగూర్చి మే మిఁకఁ బరిశీలింప వచ్చును గదా:—

"—అకృత్యంబని యనుమానింపక—, మానసంబున నెవ్వగ నొందక, నా ప్రార్థనంబెల్ల విధంబులననుష్ఠింపవలయు''నని కదా యంటివి! కావున నీకోరినయది యకార్యమని నీవ యెఱుంగుదువంట నిర్వివాదాంశమె యగును. అట్లకార్యమని నీ వెఱింగియుండియు, స్వలాభాపేక్షచే శల్యునిఁ దత్కార్యమొనర్పుమని కోరియుంటివి. కావున నిప్పట్టునఁ గేవలము స్వలాభమునే చూచుకొని శల్యు నాచరింపుమని కోరినది యకార్యమని యెఱింగియుండియు నీ మనమున నణుమాత్రమును ననుమానింపక యుండుటకుఁదోడు, పైపెచ్చు శల్యుం డొక వేళ యీ యకార్యకరణమునకు సంశయించునేమో యని నీవు శంకించి, —యకార్యమని సంశయింపకుమా—యనికూడఁ దుద కాతనితో నంటివి! నీ వెంత నీతిమంతుఁడవో, నీ మాటవిని, యట్లే చేయుదునని తానును నీ మతము ననుసరించుటకుఁదగినకొన్ని యుపపత్తుల నేర్చి కూర్చి చర్చించి, తనయొప్పికోలు జూపిన యల శల్యుండును నంతియ నీతిమంతుఁడు గదా!

దుర్యోధనుని కోరికమేరకు దా సమాత్యుండగుటకు శల్యుఁ డంగీకరించినను, తేని సేనల నడపుట నాతఁ డొల్లకపోవచ్చును. తొలి పలుకుఁబడి ననుసరించి చమూపతికాయనుమతించినను సారథ్యంబునఁ కొనసకపోవచ్చును. సారథ్యంబు వహించుట తప్పనిసరియయ్యెను సూతసూతి యరదంబు గడప నొడంబడకపోవచ్చునే గాని, ధర్మజా, నీ కుటిలపుటాలోచనయే లేకయున్నచో, రాధేయునకు రథచోదకుఁడ గుట కిష్టపడుటగాని, యిష్టపడినచో, నాతని నోనాడుచు, నాతనిఁ దేజోవీర్య హీనునిఁగఁ జేయుపలుకులు శల్యుఁడు పలుకక పోవుటగాని జరుగక పోవచ్చును.

ధర్మజా! తఱితప్పి వచ్చునందాఁకనే నీ నీతి పథక్రమంబు గాని, మీఁదుమిక్కిలి యైనచో మాత్రము, నీవు కార్యవాదివై నీ కార్యానుకూలమున కనువగు తెన్నే చూచెదవనుట నిర్వివాదాంశమూ సుమా! మఱియు నీవు నీ యెదిరినిఁ గృష్ణునింబోలె సంపూర్ణముగ నెఱుంగుదువు. ఎవనినిబట్టిన నీ కార్యము సానుకూల్యముకాఁగలదో, యావానిం బారపడకుండఁ జక్కఁగ గుర్తింపఁ గలవని నీ పలుకులంబట్టి తెలిసికొనవచ్చును. శల్యుని సారథిగ నుండఁ గోరినను, కర్ణునకే సారథిఁగ నుండుమని శల్యుని దుర్యోధనుఁడు కోరునని నీవు పోల్చు కొనుటయందే అపారమగు నీయనుభవజ్ఞానము వెల్లడియగుచున్నది. అందునను మద్రమహీనాథు నంతవానిని రాధేయునకు రథచోదకుఁ గా నుండఁగోరు నా సుయోధనుండని యెదనెఱింగి శల్యున కయ్యది మున్ముందుగ నెఱుంగజేసి, తన్మూలమునఁ గర్ణుని నిస్తేజునిఁగఁ జేయ నెంచి, నీ కాయుపకార మొనర్పుమని శల్యునిఁ బ్రార్థించి యట్లొనర్ప నాతని నొడఁబఱచితివి! ఇది యంతయు నీసమయజ్ఞతాస్ఫూర్తిని వెల్ల డించుచున్నదసుమా! ఇంతకును ముందుముం దెన్ని విశేషములు పొడ సూపునోగద!

కానున్న మహాహావమునఁ బనిసేయు వీరు లిట్టులనే యొక్కొక్క రొక్కొక్క కారణమున నొకొక్కరిపైఁ బగసాధింపఁ బూని కార్యక్రమము నడప నెంచినపు డేకీభావము లేని కార్యంపుఁ బర్యవసాన మెట్లు యధాయధలై పోవక యుండఁ గలదు!

రా య బా ర ము

ఐ దవ ప్ర క ర ణ ము

హస్తిపురము:— కౌరవసభ-ద్రుపదపురోహితుని రాయబారము-కౌరవ పాండవుల బలాబల నిరూపణము-సంధియావశ్యకము సూచించుట-భీష్మ ద్రోణాదుల ఆగ్రహము-కర్ణభీష్ముల వాక్కలహము-ధృతరాష్ట్రుని పరిశాంతి పరిసంగ ముము-శ్రీకృష్ణుని దగ్గిఱకు నియామకము-ప్రత్యేక పాత్రము; శ్రుత-సురిపు పురోహితుని వాక్యములకు వ్యాఖ్యానము.

ఆ మరునాఁడు గాంగేయుండు నిండుకొలువున్న సమయాన, ద్వారపాలకునిచేఁ గబురంపి, రాజాజ్ఞఁ గైకొని, ద్రుపద పురోహితుండు, ధార్తరాష్ట్రుని కొలువుఁ బ్రవేశించి, కృపద్రోణ విదుర గాంగేయాది కురువృద్ధుల సముచితాసనంగని, దుర్యోధను సందర్శించి. సముచితాలంకారంబుల నాతనిఁ బ్రసన్నచిత్తుంగావించుకొని, యంబికాతనయు సభాముఖుం జేసికొని, యఖిల సేనానాయకులఁ గలయంగనుంగొని, తానరుగు దెంచిన కార్యంబుఁ దెలుపందలంచి, యిట్లుపన్యసింపఁ బ్రారంభించెను.

ద్రుపద పురోహితుఁడు:—

"ధృతరాష్ట్ర భూపతియుఁ, బాండుమహీపాలుండును, నన్న దమ్ములగుటను, ధృతరాష్ట్రుండు జ్యేష్ఠుండయ్యును జాత్యంధుం డగుట రాజ్యపాలన కనర్హుండగుటను దోర్బలి పాండుపృథ్వీపాలుండె హాస్తి సామ్రాజ్యంబున కభిషిక్తుండయ్యెను. తన యన్న యందలి గౌరవము కతమునను, నభిమానంబు పెంపునను, జ్యేష్ఠుం డగు

నంబికానందనునందె రాజ్యభారం బిడి, పాండుండే పరరాజ్యాలఁ గెల్చి, పరభూపతులకుఁ బ్రాణగొడ్డ మయి, ప్రబలియుండి, కాలవశమున మృతినొందుట నాతని యనంతర మాతని రాజ్యాధికార మాతని తనయులనె జెందఁదగినదగుట నిర్వివాదాంశమెకద! అట్లగుటఁ బాండవుల "కెట్టి" భూఖండ మేర్పఱుపఁబడియెనో మనమందఱ మెఱింగినదేకద! పాండవులు తమపుణ్యవశమునను నిజబాహుబలమునను, రాజసూయాది క్రతువు లొనర్చి తమ రాజ్యమును ధర్మముదప్పక పరిపాలించు కాలమున నీ ధార్తరాష్ట్రులేయుపాయములఁ బన్ని యెట్లు పాండవుల నడవులపాల్సేయ గలిగినదియు, నెంతెంత వంచనమార్గముల వారి సర్వసంపదల నపహరింపఁ గలిగినదియు, పాపము వారడవులనున్న కాలాన, వారల నెన్నెన్ని విధముల బాధించుచుఁ దమ నిర్బంధాధికార మా పాండవులయెడ నీ ధృతరాష్ట్రతనయులు ప్రవర్తిల్లఁజేసిరో, యివియన్నియుఁ దామెల్ల రెఱింగియేయుంట, మరల వానినెల్ల నే నిపుడిట నుగ్గడించుట చర్విత చర్వణమ యగును.

ఇఁక ద్రోవది నానాఁ డాసభకీడ్చుకొనివచ్చిన యవమానము పాపము పాండవు లోర్చియు, సమయంబు చొప్పున నరణ్యాజ్ఞాతవాసంబు లొనర్చికొని మగుడి వచ్చునంతలో వారి సర్వస్వము వీరలపహరించినను, బ్రజా నాశనకరమగు యుద్ధమునకుఁ బాండు తనయు లొర్వకుండుటంజేసియెఁగాని కానిచో నన్నేల నిటకు రాయబారిగఁ బంపి, సంధిక్రమం బనుసరింపఁ బ్రయత్నింతురు? సంధిపలుకుల నవలంబించిన కారణమునఁ బాండవులు కొలదులని తలంప వలనుపడదు. వారలును మీవలెనే ధర్మపరులు కానిచో, నింతకాల మీరీతిగఁ దగవు నడవ నవకాశమే కలుగకుండెడిది. కాని, వీరికి బాహుబలాఢ్యులు వెనుదంపెఁ గలరనియుఁ బదునొకండక్షౌహిణులబలము కలదు

గదా యనియు, వారికి బల మేవేకద యక్షౌహిణులనియుఁ దలంపఁ జాలరేని ఆవల బాహుబలవిక్రముఁడౌభీముండును, సాహసరసికాత్ముఁడౌ సాత్యకియు, వారికిఁ గలరని మీ రెఱుంగుదురా? ఆహవపాండితీమహిమమున ననన్యసామాన్య శేముషీవంతుఁడౌ గాండీవధన్వుని, భండనమున నెవరొక్కండు నని యెనఁడు తలంచినను, కొండంతాకినతగరు పొగరణఁగినగతియ యగునుగదా! ఆ విజయుని శరవిద్యాకౌశలముఁ బందికై బవరము సల్పిన నాఁటి శాంబరీ భిల్లుఁడగు హరునకుఁదక్క నొరున కెట్లు తెలియుందగు? పాండవుల బలగంపుసంపద యింతతో నాగక, వివిధోపాయపరాయణుండును, శత్రుబలమును దాఁ గన్నారఁజూచినంత మాత్రముననే కొల్లఁగొను నంత ధీమహిమాన్వితుండును, దన మంత్రశక్తిచే స్వజనమును రక్షించుట యం దెదురులేనివాఁడును, ధైర్య స్థైర్య వివేకాది సకల సుగుణోత్తరుండును, సకలకళాసందోహసంవేద్యుండును నగు దేవకీనందనుం డావెనఁ బాండవుల కండయైయుండ, నింకను వారికసాధ్యం బొండుండునే! ఇంతయుం దెలిసికొనకుండనుండుట, మనబుద్ధిమాంద్యముగాక, యింకేమున్నది! ఏదీ కురువీరుల యొద్దనున్న యోధవరులలోఁ బాండుసుతులపక్షమున నున్న వెన్నున కెదిరిగ నిలువం దగిన ప్రతిభాశాలినో, బుద్ధిశాలినో, మతిశాలినో, యొక్కనిఁ జూపుఁడు; చూతము! ఇంకను సమయము మించకుండ నా పాండవేయులఁ బిలువనంపి, ఆంబికేయా, నీకును, లోకమునకును,హితమును,ప్రియమును నగుతెఱం గెఱింగి వారిది వారికొసంగి, మీరును మీరును గలసిమెలసి మనుట సమ్యగ్ జ్ఞానము గలవారి రీతియని తోఁచెడిని.”

ద్రుపదపురోహితుఁ డిట్లనుట వినుచుండిన భీష్ముఁడు:—

[పురోహితు వెసం జూచుచు]

“బ్రాహ్మణోత్తమా, శ్రుతికిఁ గఠోరంబైన నగుంగాక, గాని

నీ విట్లింత శుద్ధవైదికముగాఁ బలుకుట విప్రస్వాభావికమె యైనను, నిప్పట్టున నొప్పిదమై యున్నది. ఉన్నదియున్నట్లు పలుకవలసి వచ్చినప్పు డెట్లైనను, శ్రుతికిఁబరుషము కాకతప్పదు. ఇంకను బాంధు సందను లిక్కట్టుల పాల్పడకుండ, ధృతరాష్ట్ర పాండు భూపతుల వంశములు సుహృద్భావంబున క్షీరనీరంబులంబోలెఁ గలసి మెలసి సౌహృద మార్గమునం జనుట లోక కళ్యాణకరము గాదె!

[ధృతరాష్ట్రు దిక్కు మొగంబయి]

"సంపూర్ణ విక్రమాఢ్యులయ్యును నశక్తుల చాడ్పున నివ్వీడు వీడిపోయిన వారి నాఁటి దైన్యమును, నరణ్యావాసవిషాద వేదనశ్రమమును, అజ్ఞాతవాసంపుదుఃఖమును, లోకమునకుఁ గ్రొత్త కావె! అనఘుల నట్టెలుపెట్టఁబాడియగునే! పితృపైతామహమగుసంప్రదాజ్యము నుచితమా తెలుంగునఁ బాండుతనూజులకుంగూడఁ బంచియిచ్చి, లోకమువారలు మెచ్చునట్లు వారలంగూడ నాత్మజులంబోలె నాదరమునఁ జూడవలదా! తప్పనిసరియైనట్లు మీరలు చేయుటచేత మోమోటమికోడి, కాదనఁజాలక, మిక్కిలివిచారముతో మీతో వాగుఁజూదమాడి, ధర్మమునకుఁ గట్టువడి, మీరొనర్చినవంచనలకు సైరణచేసిన ధర్మజు మోము జూచి విజయుఁ డోర్చెనేకాని, కానిచో, నాతని యచ్చపుఁ గిన్కకు నోర్వఁగలిగిన యెట్టిమగవారలనైన నిజగానఁగానఁగలమా!"

అని భీష్ముఁడు పాండవులదెస సానుభూతిం జూపెను.

ఆసభనదివఱకే యలంకరించియుండిన కర్ణుఁడు విని విని బలు కోపము దెచ్చుకొనినాఁడు. మొగమెఱ్ఱవారినది. భీష్ముని దిక్కు మొగమయి పలుక నారంభించినాఁడు.

— కర్ణుఁడు —

"దుర్యోధనునికొఱకు శకుని జూదంబాడి, మేదినిగెలుచుట [illegible], ధర్మపుత్రుం డోడుటయును జనులెల్ల రెఱుంగుదురు. ఇంత లోకపటలంబైన యీపనికై యింతగా నిన్నిసార్లు లగ్గడింపవలయునే!

మాతండ్రి పాలు మాకుఁ బంచియిమ్మని, యి ట్లడియరితనముచేసి, తాగుడుమన్ని, యిపు డిట్లభిముఖులౌట తప్పగాని, జూదమున నోడిన వారు తత్సమయానుసారముగ నడవులకేగి సిలుగు లొందుటయం దేమితప్పగలదు? ఇంతతో నాగక, ప్రత్యేక ప్రత్యేక కారణములు గల పాఁబగలఁ దీర్చికొనఁ దరుణములకు వేఁచియున్న ద్రుపదాదులఁ నిపుడు దోడుసేసికొని, రాజ్యలోభమున, యుద్ధమున కెత్తివచ్చి నంతమాత్రం గురుపతి వెఱచి పాలిచ్చునని తలంచు టేటితగవు?"

భీష్ముఁడు:—ఏనాఁడును నోడనిపోటుమానిసివి గనుక నింత యూడఁ గలిగితివి. ఇంతటిమెక్కుడుమాటలాడ వినువారలు నవ్వెదరని యైనను నీకుఁదోపదాయెఁగా? మొన మొన్న నేకద అనన్యసామాన్య విక్రమమూర్తియౌ నర్జునుం డొక్కఁడె కాదె, యల యుత్తరగోగ్రహణమున మనయార్వుర నుగ్రరణాన గెల్చినది; నేఁ డిపు డిక్కడ నీరాజుకొల్వున నాఫల్గునుని వాగ్రణమున గెల్వఁజాలుదీవు! అగు-నగు- కిరీటిని గెలువఁగలుగుట కీవె తగుదువు.

అని ధిక్కరణం బొనరించెను.

కర్ణుఁడు:—శాంతనవా, వయస్సుమీఱినకొలఁది బుద్ధియుఁ జేవ దేరునని వింటినిగాని, వయస్సుజారిన కొలఁది బుద్ధియుఁ గ్రమంబుగ దిగఁజారు నని నే నెఱుంగకుంటిని. నీయెడ నయ్యది విపరీతమె కాకున్న, నే నన్న దేమి, నీ వనిన దేమి? కర్ణార్జునులలో నెవ్వరుగెల్చునదియు నటుండనిచ్చి, కవ్వడి యుబ్బైనను మనకిపుడు ప్రసంగాంశమె కాలేదే! తఱచుగ మన ధృతరాష్ట్ర ధరణీపతిని,-మానవసహజమె యైనను- సుతువాఁడని మెత్తిపొడుచుచుందువే కాని, నీవిపుడు కూఁటికిని గుడ్డకును గురుపతింజేరియు, రిపువాఁడవై, పాండుసుతుల బూతురీతిఁ బొగడుచున్నావు- కానిచో, మన ప్రసంగాంశము

కాని యర్జును నిర్జించుచోప్పేల నీతలంపునకువచ్చు? వారిని, వారివారినిఁ బొగడుచు నెవరియన్నము దినెదవో, వారి యపయశస్సే కోరుచుఁ గాలముపుచ్చుట నీ వెఱింగినంత దూరము ప్రసంగశుద్ధి నీ వెఱుంగవైతివి—

— ధృతరాష్ట్రుఁడు —

"రాధేయా! నీకెంత వయసువచ్చినను, పిన్నపెద్దల తారతమ్యము మాత్రము గుర్తింపఁజాలకున్నావు. ఇఁక నింతతోనైన నీ వీ ప్రలాపములు విరమించినచో, నింకను మిగిలియున్న మా యందఱి గౌరవములు దక్కింతువు. నీవు మిన్నకున్నఁ గుల వృద్ధుల గౌరవించుటయు, కౌరవగౌరవము కాపాడుటయు, నగును.

(భీష్ము నుద్దేశించి)

"శాంతనవా! మంచిచెడ్డలఁ బాటింపక ప్రసంగంబులఁ బ్రల్లదనంబులు చొరకుండఁ బ్రశంసించు నేర్పెఱుంగని రాధేయుని మాటల నంతగాఁ బాటింపక మన ప్రస్తుతాంశము విచారింతుముగాక!"

అని, రాధేయుం గినిసియు, నాపగాతనయు ననునయించియు, వారివారి వాగ్వాదముల నప్పటి కపనయించి, ధృతరాష్ట్రుండు:

(ద్రుపదపురోహితు నుద్దేశించి),—

"భూసురాగ్రణీ, పురోహిత హితామాత్య సుహృద్బంధుజనంబులతోడ, వివేకముతో నాలోచించి, మా మనోగతియుఁ గర్తవ్యమును విస్పష్టముగ ధర్మజుమ్రోలఁ బలుకుటకు సౌమ్యగుణప్రధానుఁ డౌ నొక్కరునిఁ బంపి సమస్తభూప్రజకును, మాకును, వారికిని, హితకరమౌ మార్గము ననుసరింప నెంతుము; గావున నీవు ముందుగ నేగుము."

అనిపలికి య ప్పురోహితునకు నమూల్యాభరణాదు లొసంగి విడెం బిడి, వీడుకో లిచ్చి, పుచ్చి, తనమంత్రివర్గములోనివాఁ డగు

సంజయుండను వానిఁ దనకొలువునకు రావించి, ధృతరాష్ట్రుండాతనితో నిట్టులఁ బ్రసంగమున కుపక్రమించెను.

— ధృతరాష్ట్రుఁడు —

"వింటివా! సంజయా, పాండుసుతు లుపప్లావ్యమునకు వచ్చి యున్నారఁట! నీవట కేగి, వాసుదేవసహితముగ వారినిఁ గలిసికొని, వారి విషాదవేదన లెట్టు లడంగఁగల వట్టు వారితోఁడఁ బలుకవలయు: మఱియు నామాటలుగా వారితో— 'మీరు వనవాసా ద్యాయాసంబులం బడి తుదకు సురక్షితముగ నుపప్లావ్యముఁ జేరఁ గనుట విని మీయయ్య హృష్టాత్ముండయి మిమ్ముఁ జూచిరా నను మీకడ కంపె'—నని సిగ్గుపోయిన మొగంబ ననుము."

అని సంజయుతోఁ బలికి తనకొలువునఁ నున్నవారినిఁ జూచి—

"నాకొడుకు కార్యాకార్యజ్ఞుఁడు గామి నింతకలత గలిగెఁ గాని, కాకున్నచో నార్యులును, ధృష్టధైర్యులును, రణశూర్యులును, నగు పాండుతనూజులు దోషాన్వితు లగుదురే! మనమును, వారును, క్షీరనీరముల తెఱంగునఁ గలసిమెలసి బ్రదుకవలసిన వారము కామా! వా రిడుమలఁ బడఁదగినవారు కారే! పితృభాగమేలఁ దగని వారు కారే! పాండుసుతులతోఁ గలసి జీవించుటకు మన మిష్టపడ నేర మనియు, గర్వాల మనియు, మన మన్యాయపరుల మనియు నిఁక బ్రజలు మనల నమ్మనేరరు. ప్రజానురాగముఁ బాయుటకుఁ దోడు, ప్రజల విశ్వాసమునకుఁగూడ బాహ్యమయ్యెనేని, అట్టి పరిపాలన నామమాత్రావశిష్ట మగును. నాకొడుకుల యవినీతి ప్రవర్తనకుఁ దగవునడపింప సౌమ్యుఁడౌ ధర్మజుండు గలఁడు గనుకగాని, కాకున్న నింతకుఁ బూర్వమె యెంతెంతలు పుట్టి యుండునో కద! మనము దుర్మానంబు వాటించి, కూడనికార్యంబు లొనర్చి, గర్వోక్తు లాడుచు, వారి పాలు వారి కొసంగకపోయినంతమాత్రమున, మనము వారిని గెలువ

సైర్తురె? పార్థుఁడే నిజముగ నలిగెనేని, విజయమూలకంబగు తన గాండీవంబు నారిసారించి కృష్ణునిసారథ్యంబుతో ననిమొన నిల్చెనేని, త్రిజగంబులును సంక్షోభంబు నొందకుండునే! కడుభయంకరంబగు తన గదఁబూని భీముఁడు కురుకుమారవర్గముపైఁ గవియుననుమాట మనమునఁ బడియెనేని నా మేనెల్లఁ జెమ్మటలుగ్రమ్మి, కంపమొందు చుండును. నిజముగ వాని మార్కొన నాహవరంగమున నిలుచు వా రెవరు! మాద్రేయులగు కవలుమాత్రము తమయన్నలకన్న నేమితక్కువ! ద్రుపదుఁడు మాత్రమేమి మాటలఁబోయెడువాఁడె! అతనిపుత్రులో—బాహుబలసమన్వితులు! విరటుండును, నాతని తమ్ములును కొడుకులును అలఁతులఁబోదురే! సాత్యకియునునలుపాలఁ బోయెడువాఁడే! వృష్ణికుమారులును, పాండ్యుండును, గేకయ పతియు, నాదిగాఁగల బంధుమిత్ర గణంబులతో నాహవరంగమున నిలిచినఁబాండవులం గెలువదలంచుట వెఱ్ఱితనముకాకయింకేమగును! సంజయా! ఉన్నదియున్నట్లు చెప్పవలసివచ్చినచో, మహావిక్రమ స్ఫూర్తిని దాల్చు భీమున కేను మనమున డింకను; మాయాకిరా తుండగు మాహేశ్వరుందూలించిన కఱ్ఱివిక్రమంబునకైనను డొంకను; సృష్టిస్థితిలయములకుం దావని యనుచున్న హరికింగూడఁగొంకను; కాని మనవారిందఱను, గెలువంగలవార మని విఱ్ఱవీఁగినను, రుద్రున కైనంగెలువరాని ధర్మపుత్త్రుని కోపమునకైన జంకవలదే!

[ఎల్లవారును వినునట్లుచ్చస్వనమున మరల ధృతరాష్ట్రుఁడు]

"సంజయా,—నీవు ధర్మజుపాలికిఁ బోయి యాతని యనుజ వర్గంబును బంధుమిత్ర గణంబులును వినునట్లు స్నేహముపాటించి, యాతనికోప మపనయించునట్లు, నాతని మనమునఁ గయ్యమను మాటయే పోవునట్లు, మాపై వ్వారి కిపుడుండిన కోపము పోవునట్లు, గడు తీయందనమునుజూపు మాటలచే నాతని నియ్యకొలిపి, నాకు వారియెడఁగల ప్రేముడియం దబద్ధములేమిం దెలిపి, గుప్త

ర్థములుగల భావములం దెలిపి, మఱియు నీపోవుకార్యము జయప్రదముగఁ జేసికొని మరలిరమ్ము."

అని ధృతరాష్ట్రుండు వలికి రథంబెక్కి పొమ్మని సంజయుని వీడుకొలిపి పుచ్చెను.

× × × ×

"ఆంబికేయా, ఏమోయి యింతసాహసము! ఏమని పాండవులతోఁ బలుకుమంటివి! అచటనున్నవారి కింపుపుట్టంగ బలుకుమంటివి; నెయ్యము వాటించి కపటదయ్యామెసంగ బలుకుమంటివి; వారియలుకలెల్ల దీఱునట్లుగాఁ బలుకుమంటివి; కయ్యమను తలంపు వారి మనమున మానునట్టితెఱంగునఁ బలుకుమంటివి; అంతియేకాని, మీ రాజ్యభాగంబు మీకొసంగెద రండనువార్తనంప నీకు గుండె నిబ్బరములేకున్న లేకుండకపోవచ్చునుగాని, వనవాసాద్యాయాసంబులు దీర్చుకొననైన వారిని నీవెంటఁ గొనిరమ్మని నాతో ననఁ జాలవైతివే! నీమెత్తని రిత్తపలుకులకు లోఁబడువారు పాండవేయులని తలంచితివో! రాజకీయపరిస్థితులను వారితో సంప్రదించి వారిని శాంతాత్ములుగాఁ జేయుందగు తెఱంగు తెల్పకపోతివి; కార్యదీక్షతో నున్నవారిని, వంచితులయి సర్వస్వమును గోల్పడియున్నవారిని, బుడిబుడిమాటలచే ననయించు తెఱంగునందలి కష్టమెఱుంగక పోతివి! రాజకీయమునకుఁ జోటులేదు; ధర్మమార్గంబునఁ బల్కెదుమన్న ధర్మజుమోముల నవియెల్ల హనుమంతునిముందలి కుప్పిగంతులగును. మఱి యేమార్గమును దెలుపవైతివి. ఇఁకమిగిలినది వేదాంతమార్గము. ఏతన్మార్గమున, వారిని గలకాలమును నడవులఁ గందమూలఫలభక్షణచేఁ గాలముపుచ్చుఁడని, ప్రబోధము సేయవలయు. వారి కాచార్యుండయి నిలుచు కృష్ణుం డిదివిని యూరకుండునా?"

అని చిరకాలమునుండి ధృతరాష్ట్రు నెఱింగిన సంజయుఁడనుకొనుచు నుపప్లావ్యము దెస బయనమయి పోవుచుండెను.

రాయబారము

ఆఱవ ప్రకరణము

(i) ఉపప్లావ్యము.

పాండవశిబిరమునన్న శ్రీకృష్ణ మందిర వర్ణనము-రహస్య గోష్ఠీనిరతుండగు శ్రీకృష్ణుని యునికిచందము-కృష్ణార్జునుల విలాస సంభాషణము-ద్రౌపదీ సత్యభామల యన్యోన్య సంభాషణము-అవమానితయా ద్రౌపదియొనర్చిన యుద్రేకపూరిత భీషణ భాషణములు-సంజయుఁడు శ్రీకృష్ణుని దర్శించుప్రకారము.

ఇపుడు ఢిల్లీనగరమని వాకొనఁ బడుచున్నదియు నింద్రప్రస్థమునకు దక్షిణమున నున్నదియు నగు నుపప్లావ్యంబను ప్రదేశంబున విడిసియున్న, పాండవులకు సాయపడు తలంపున సానుభూతి నెఱపుచు వచ్చిన రాజుల విడుదులు లెక్కకు మిగిలియుండెను. ఏడక్షౌహిణుల సైన్యము విడిసియున్న బయలున నిసుక చల్లిన నేలరాలఁ జాలనంత సాంద్రమై కోలాహలముగ నుండెను. రాజుల కేర్పఱచిన శిబిరములలో శ్రీకృష్ణునకని యనినది తక్కిన శిబిరములకుఁ గొంతదవ్వున నుండెను.

ఒకనాఁటి యపరాహ్ణమునఁ దన శిబిరమున శ్రీకృష్ణుండొక శయ్యం బరుండియుండఁ, దన యొడినిడికొని శ్రీకృష్ణుని పాదముల నర్జునుం డొత్తుచుండఁ, బాంచాలియు సాత్రాజితియు వేర్వేఱు పీఠములపైఁ గూరుచుండియుండ, నా సమయానఁ బానలనాఁడు ప్రాగ్జ్యోతిష పురముననున్న నరకుని వధియించిన నాఁటి ముచ్చటలనెల్ల శ్రీకృష్ణుఁడు నుడువుచుండ, యుద్ధమధ్యమున నరకవధార్థము తాను

శ్రీకృష్ణున కొసంగిన చేయూఁత లాదిగాఁగల విషయములన్నిఁ సత్యభామయాదికిఁ దెచ్చుచుండ, ద్రౌపది విని విని, "అమ్మా, కానయియున్న కురుపాండవ సమరమునఁగూడ నీ సహాయ మవసరమయ్యెనేని నిన్నును శ్రమపెట్టక తప్పదని తోఁచెడి" నని తన యీప్సితము సూచింప సత్యభామయు, "వివేకముగల పురుషులెన్నండును సంగరమొల్లరేకాని, సంగరమునఁగాక తీర్పఁబడనిపట్టుల వారికిఁగల పట్టుదల స్త్రీలకుండఁ జాలదు. అయినను గార్యాచరణముపట్ల స్త్రీలకుఁగల తెంపరితనము పురుషులకు మృగ్యము. అట్లగుటను ధర్మనందనుని ధర్మ నిరతియు, నందనందనుని నేర్పును, జివరవఱకును జూచియే, మనము చేయఁదగినది చేసి చూపుదుముగాక!" యని కాఁగల కార్యముంగూర్చి సాత్రాజితి నిర్వచించెను.

ద్రౌపది:—సత్యా! తనరాజ్యభాగముఁ దనకిమ్మని ధర్మనందనుఁడు గాంధారీనందనునిఁ బ్రార్థనాపూర్వక దీన సంభాషణములనైన నెఱపుచు, నాతఁడీని రాజ్యభాగంబున కెదురుతెన్నులు సూచుచుండుటేగాని, దుర్యోధనుఁడెంతమాత్రము నే మాత్రముగాని ధాత్రీభాగ మీనేర్చునే! కీడెంచి మేలెంచుమనునట్లు భ్రాతృభాగ మాతఁడెట్లీని, యేపాటి యొసంగినను, బాండవాగ్రజుండాహవ ప్రయత్నములనొల్లఁడు. వీరినడుమ హృదయశల్యముగనున్న నన్నవమానము నొందించి, రాజసభకీడ్చి వారెంతలుపఱచిరో నీవెఱుంగనిది కాదు. అవమానాగ్ని నన్నెంత దహించుచున్నను, యమసుతుండొల్లని సంగరము తద్భ్రాతృవర్గము మాత్ర పూనునా? అట్టియెడ సాత్రాజితీ, అలనాఁడు నరకుని ననిమొన నెదుర్కొని, యమపురి కాతని ననిపిన నీ ఖడ్గ మిప్పుడే త్రుప్పువట్టి యుండదుకద! అలనాఁటి నీ యాహవకేళీ కౌశలము నింకొకపరి చూపి, కర్ణ దుశ్శాసన దుర్యోధన హతకుల సంహరించి, తద్రక్తధారల

నీవీడియున్న క్రుమ్ముడిఁగ్రమ్మఁగట్ట, నాకు నీసాయమున్న, నీ కృష్ణుండేల, యీ యర్జునుండేల? నీ వింత మాత్రము సహాయ మొసంగినఁజాలు.

ఈ సంభాషణ మందలి లాలిత్యమునకు శ్రీకృష్ణుని మోమునఁ జిఱునవ్వు లొలుకుచుండ, నర్జును మోమునఁ జిన్నతనంబు చెలంగుచుండ, నింతలో నొక ప్రతీహారివచ్చి—"దేవా, దేవరదర్శనార్థియై సంజయుండను నొకరుండువచ్చిద్వారముకడ వేచియున్నాఁ" డని నుడివి, శ్రీకృష్ణునాన నీ ప్రతీహారియుఁ బోయి సంజయుదోడ్కొని వచ్చెను. సంజయుఁడును శ్రీకృష్ణుని సమీపించునంత, కృష్ణుఁడు సాదరదృక్కుల సంజయు నవలోకించుచుండ, సంజయుండును దన యుత్తరీయంబును శిరోవేష్టంబుగా ధరియించి, వినీతవేషుండయి, యెదుటంబడి, సాగిలిపడి సాష్టాంగంబుగఁ దన కరారవిందంబుల శ్రీకృష్ణుని పదారవిందంబులంటాకి, ప్రణామిల్లి ప్రఫుల్లమగు శ్రీకృష్ణుని ముఖారవిందము దెసం జూడ్కి నిలిపి, కొంతవడి మానసికధ్యానమొనర్చి నిలువ, శ్రీకృష్ణుండును సంజయునాశీర్వదించి, యుచితాసన మొసంగనెంచి తనకాల్కడనుండిన కనకమణిమయంబగు పీఠంబుఁ జూపుచు సాత్రాజితిదెస దృక్కులు సారింప,నర్జునుండును పాంచాలికిఁగనుసన్న సేయ, ద్రౌపదీ సత్యభామలారత్నస్థాపిత స్వర్ణపీఠంబుదోడ్కొని దెచ్చి శ్రీకృష్ణుని సమీపంబుననునుప, శ్రీకృష్ణుండును సంజయుంగూరుచుండ నియోగించెను. తనవ్రేల్చిన కాళ్లుదిగిచికొని శ్రీకృష్ణుండును గూరుచుండెను. తనకని యునిచిన, యయ్యున్నతాసనము నా సంజయుండును దనకరతలంబున నంటుచు, ధరణీతలంబునన గూరుచుండి, నిజఫాలతలంబున మొగిడ్చిన తన కేలుకెందామరలంగదియించి ధ్యానము చేయుచున్నట్టు నిలచెను.

ఆఱవ ప్రకరణము

(ii)

కృష్ణసంజయుల సంభాషణము—ధర్మరాజు సముఖమునం దాఁ బలుకవలసినవిగా నేర్పఱుపఁబడిన ధృతరాష్ట్రుని పలుకులు తాను ధర్మజున కెఱిఁగించు నవసరమున శ్రీకృష్ణుని సాహాయ్యమును సంజయుఁడు కోరినప్రకారము-శ్రీకృష్ణుని ప్రత్యుత్తరము.

"వదినా, మే మంపిన ద్రుపదపురోహితుపలుకులు విని, మము ననునయింపగావలయు, ధృతరాష్ట్రుం డీసంజయుని బంపియుండ నోపు" నని సత్యభామతోఁ బలుకు ద్రౌపది దెస చూచుచుండిన నీలవర్ణులును, బాహుమేధాబలసంపన్నులును నౌ నరనారాయణులం జూచునపుడు సంజయునకు హర్షాశ్రుపులకలును భయకంపంబులును నొక్కసారియె జనియించుటను నిమీలితనేత్రుండయియుండ, శ్రీకృష్ణుం డాతని సేమం బడిగి, కురువృద్ధులంగూర్చి గౌరవ సూచక ప్రసంగంబుల నెఱపుచు, దుర్యోధను సేమముంగూడ నెఱుంగఁగోరి కానోపు:—

"ఆపన్నలౌ కులాంగనల సభల నవమానించు నలవాటు మాని, మానియై, సుఖియై, యున్నాఁడుగద రారాజు!"

అని నిర్ధారణార్థమునఁ, బ్రశ్నార్థకమును కృష్ణుఁడు సూచించెను.

సంజయుఁడు శ్రీకృష్ణుని వాక్యము వినినంతనె, విన్నఁదనంబు దోఁచుచిన్నెలతోఁ, శ్రీకృష్ణుంజూచుచు, "హేకృష్ణా! ద్వారకావాసా! మముఁబోఁటులొనర్చు నేరముల సైరించుటయు, మము సన్మార్గవర్తనులుగఁ జేయుటయు, శీలముగాఁగల నీయంతటి మహాత్ముఁడే యకృత్యముల నింకను క్షమియింపక, గోరంతలు కొండంతలు చేసి, యింకను రేపెట్టుచుండిన నిఁక కాఁగల కార్యములు చక్కఁబడు టెట్లు?"

అని వినయముగ సంజయుండనెను.

— కృష్ణుఁడు —

"ఇపుడు నీ వచ్చిన కార్యముకాఁ దగియుండియు నావలననే కానోపదు కావలయు! ఎట్లైనను ఒకరొనర్చినహాని సైరింపవచ్చునే కాని మఱపునకు మాత్రము రాఁజాలదుసుమా! లోకమున నేకాలమునసైనను రాణివాసము నవమానించుట యాలకించితివే! అందును, నన్న దమ్ముల గుంజులాటలలో! రారాజుపంపున దుశ్శాసనుచే సభ కీడ్వఁబడిన పాండువిభుకోడలు, -సాధ్వి- తన మానముఁ గోల్పడఁబోవు సమయాన, దవ్వులనున్న నన్నుఁ బిలపించుచుఁ దన మనోబలమున నాత్మగౌరవముఁ గాపాడుకొనినపాటు తీరని యప్పయి బహుభారమయి, చలింపక యున్నది. ఇతరకారణముల నెల్ల నటుండనిచ్చి యీ యొక్క కారణము మూలమున నొక్క త్రుటికాలమునఁ గౌరవ పాపాటవీదహనకార్యమును వారింప రానిదిఁగఁ జేయుచుండ నీవు చెప్పవచ్చిన దేదియైయున్నను, మీఁతేని పంపున జరిగిన యీ యమానుషకార్యమును మాత్రము మాటుపఱుపఁజాలదు. కౌరవ వంశ మేమయిన నగుఁగాక, గాని, సృష్టికార్యము నడచుచున్నంత కాలమును, ద్రౌపదీ పరిభవమును గూర్చిన వాదుమాత్రము ఆచంద్రార్కమునుమహాప్రళయముపర్యంతమును నాశనముకాదుసుమా!"

— సంజయుఁడు —

"నంద నందనా, రాజకీయవేత్తలలో నినుమించిన ప్రభువీ కాలమున నింకొకఁడుండఁజాలఁడనిన నందులకు నీకుఁ బదివేల మ్రొక్కులిడెద. భారతవర్షమున నిపు డట్టుడికించి నట్టుడికింపనయి యున్న కౌరవ పాండవ దాయభాగ విషయమున, నీ నిమిత్తమున యాదవ పాండవ పాంచాలమను నీ త్రివర్గ సమ్మేళనముచే, రుధిర సహితమహావిప్లవ మొకటి రానయియున్న దని నిన్నుఁగూర్చి మ్రొక్కవలసినచో మఱింత మ్రొక్కువాఁడనే కాని, ధృతరాష్ట్రి

నభిమతముఁ దెలుపవచ్చిన నా ముఖమునఁ దద్విషయము సాంగముగ సావధానముగ విననైన నెంచక, తొలుదొల్తనే, తీరని బాధలంగూర్చియు, సమయానుసారంబుగ మానసోద్రేకము కతమునఁ దటస్థించిన సంఘటనములంగూర్చియు, నిపుడు తలంచుచు, వానినెల్ల మరల మరలఁ గెఱలించుచుఁ బ్రస్తుత విషయమును గమనింపక, వివాదాంశము పొత్తుపడురీతినైనఁ దలంపక, ప్రత్యేకముగ నిను దర్శించి నీ ముఖమున, నయ్యజాత శత్రుం బ్రసన్నుంజేసికొనవ నే నేగుఁదెంచిన యట్టి తరుణముననే నీవింత బిరుసుగఁ బ్రసంగించుచున్నచో, నిఁక నా ధర్మజు సముఖంబున నెట్టులుండునోకద యని శంకింపవలసి వచ్చుచున్నది. సౌమ్యభాషణంబుల నా చెప్పఁబూనినది సాదరంబుగ విని, ససాకల్యంబుగ నీవును పౌర్వాపర్యంబుల నూహించి, యిరువెగలవారికిని, లోకమునకును గల్యాణ ప్రదమౌప్రణాళికను బ్రసాదించుటే ప్రథమ కార్యంబుగా నెంచక, పాప మొంతటి పహార్ఖ్య మనుచు మూర్ఖజనములపట్ల గనికరమును బూనుటకు బదులు, వారియెడ నింత వేగిర పాటొందుట నీ యట్టి లోకోత్తర ప్రజ్ఞానిధికిఁ బాడికాదని, దర్శన మాత్రముననే శత్రుజన వీర్యము నపహరించుటయందు సంపూర్ణసామర్థ్యముగల నీ ప్రోలఁ బలుకుట దుస్సాహస మగునేమో యని సంశయింతునుగాని, కానిచో, దృఢీకరింపఁ దగిన విషయమేజుమ యిది! నీ మూలమున ధర్మజాదుల సేమమారసి నీ యనుమతి వడసి, యాతనిఁ బ్రసన్నునిఁజేసికొని పోఁదలంచి వచ్చితినే కాని, మాధవుఁడే పక్షమున నుండిన, నా పక్షముననే జయలక్ష్మి బంధీకృతయై యుండు నని యెఱుంగని వాఁడను గాను. అట్లయ్యును నీ పురుషకారము ప్రధానమనియు నెఱుంగని వాఁడను గాను. కావున సకల భువనంబుల నొక్క నిమేషంబున నరచేతికిఁ దేరంజాలిన ప్రజ్ఞానిధివియును, మహారాజకీయ వేత్తవును, మహాపురుషుండవునునగు నినునేదర్శింప వచ్చుట, యేరికిని దుస్సాధ్యంబైనది

నీకు సుసాధ్యంబగునని యెఱింగి నీ వలన నయ్యెడి కార్య సిద్ధివొంద గలదనిసుమా!

"ఏదియెట్లున్నను బోరుకలుగకుండ నుండున ట్లేయుపాయమునైనను నీవ చెప్పవలంతివి. నీ వలనఁగానిపని యింకొకని వలన నెంత కాఁజాలదో, నీ వలన గానయియున్న కార్య మితరులచే వారింపఁబడనుం గూడ నంత కాఁజాలనిదే. నే నిన్ని యెఱుంగక కాదు నిన్నే తొలితొలి చూడవచ్చుట! ధర్మజుమ్రోల నుడువఁ దగిన పెక్కు విషయములు వారి తండ్రి నా ముఖమునఁ గబురంపెను. కావున నుచితసమయ మెఱిఁగి, ధర్మనందనుని దర్శనము నాకు లభియింపఁజేసి, నాచేయుప్రసంగంబున నీవును బ్రసక్తికలుగఁజేసికొని, నావచ్చినకార్యము సఫలతనొందు తెఱంగారయ నినువేడుచున్నాను."

— కృష్ణుఁడు —

"మీరును మీరునుం గలసిమెలసి జీవింతుమన్న వలదనుట నా కేమి ప్రయోజనకరము? సర్వవిధములఁ బొందే సమకూర్పఁ బ్రయత్నింతుముగాక. ఇంతకును బెరవారలా? కాని దాయభాగము కొఱకుఁగాని, నష్టసంపద నిమిత్తముగాని, జగడములు చేసినవారు లోకమున లేకపోలేదు. కాని తన్మధ్యమున, నమానుషములగు కృత్యములంగూర్చి ప్రసంగము వచ్చినపుడు నేనే యనఁజేల, లోకము మాత్రము హర్షించునే? అంతదూరము పోనేల? సర్వము నెఱింగిన నీవుమాత్ర మలనాఁటి ద్రౌపదీ పరాభవమునకు హర్షింతువే? ప్రసంగ వశమున సంప్రదించి యనవలసంటేఁగాని, వారివారి పొందికజీవనమును గూర్చియుఁ దత్సంఘటనముఁ గూర్చియు నెంతవఱకు శ్రమంపడవలె నంతదూరమును బనిచేసి తీరుదుము. ఎంతో దూరమున నున్నకరినగరమునుండి, యాంబికేయుపంపున యుధిష్ఠిరుం జూడ వచ్చిన నిన్నలజడి నొందించుట కాడిన మాటలుగానెన్నఁబోకుము. తత్ప్రసంగమే మానసోద్రేక జనకము కాదా!

"మనము రేపకడ లేచి కార్యములందీర్చికొని ధర్మజుండు కొలువున్న సమయాన నాతనిం జూడంబోదముగాక!"

అని కృష్ణుం డప్పటి కా సంభాషణ చాలించి సాయంసంధ్యావందనాచరణార్థము లేచెను.

సంజయుండును నామఱునాఁడు కృష్ణ ధర్మజాదులు కూడియున్న సమయమున ధర్మజుంజూచు తన నిశ్చయము కృష్ణునకు విన్నవించి యాతని యనుజ్ఞవడసి తనవిడిసియున్న తావునకు మరలెను.

రాయబారము

ఏడవ ప్రకరణము

ఉపప్లావ్యము

శల్యవాగ్దానముం గూర్చి తన తమ్ములతో ధర్మజుఁడు ప్రసంగించుచుండ శ్రీకృష్ణసంజయులు ధర్మజుంజూడ నేగుట-సంజయ ధర్మజుల యన్యోన్య సంభాషణములు-ధర్మజుఁడు కౌరవుల యోగక్షేమము లరయు ప్రకారము-తద్వ్యాఖ్య-ధర్మజుని వాక్నైపుణ్యము-సంజయుఁడు ధర్మజుని గ్రహించినరీతి ననుసరించిన వ్యాఖ్యానము-కురుపాండవ బలాబల విమర్శనము-సంజయు రాయబారపు టుపన్యాసము-సంజయుఁడు యుద్ధము వలదని ధార్మికముగ ధర్మజునకు శుష్కప్రియోక్తులతో, శూన్యహస్తములతో, నుపదేశ మొనర్చిన యుపన్యాసము; తద్వ్యాఖ్యానము. సంజయ ధర్మజుల స్వభావ పరిశీలనము-సవివరముగ, భావగర్భితముగ, శ్రీకృష్ణుఁడొనర్చిన యుపన్యాసము-సంజయుఁడు శ్రీకృష్ణున కొసంగిన ప్రత్యుత్తరము-శ్రీకృష్ణ భీమార్జునుల స్వభావ నిరూపణము-తన రాయబారపుఁ గార్యానంతరము కరినగరమునకు సంజయు నిష్క్రమణము.

ఆ మరునాఁడు ధర్మజుం డనుజ తనుజ సమేతుండయి శల్యుని వాగ్దానముంగూర్చి పౌర్వాపర్యంబులఁ జర్చించుచును, ద్రుపద పురోహితుని మూలమున నంపిన రాయబారముం గూర్చి సంశయించుచును, ననుద్యూతమున నరణ్యాజ్ఞాత వాసంబులు పణంబులుగా గాంధారీనందనుండును, సౌబలుండును, నేర్పఱచుటయందిమిడియుండిన భావంబును, బునర్విమర్శ చేసికొనుచును, శ్రీకృష్ణు నెడ నెడ సంస్మరించుచును, నున్న సమయంబునఁ గృష్ణసంజయులు ధర్మజు దర్శింప

ద్రోవదియును ననుజులును, పుత్త్రసంతానమును, సేమమున నుంట మీతండ్రి విని నీక్షేమము నారయ నన్నుం బుత్తెంచెను."

ధర్మజుండును, నొక్కపెట్టున దమ పడిన బన్నములును, గౌరవ్యులొనర్చిన భంగపాటులును, దన తలంపునకు వచ్చినవో యన నొక వేడినిట్టూర్పు విడిచి,—

"మాయెడ నారాజునకుంగల కారుణ్యముకతమున సుఖమున నిట్లున్నారము. మా సేమ మారయ నిను గారవమున నంపుట నామది హర్షమందినది." యను ప్రత్యుత్తరమున సంజయు ధృతరాష్ట్రుల నభినందించి ధర్మజుండు మరల నిట్లందుకొనియెను.

ధర్మ:—ఆరాజును, బుత్త్రులును, మనుమలును సేమముగ నున్నారు గద; రాజ్యంబున శుభపరంపర గలదుగద; ద్రోణుండును, కృపుండును, ద్రోణసుతుండును సుఖమున్నవారె? సుశ్లోకుండగు భీష్మునిపెత్తనంబు గౌరవించి కౌరవులు మెలంగుచుండిరే? రాజ్యంబున బ్రాహ్మణులకు మన్నన గలదే? మేమలనాం డొసంగినవృత్తులు సెల్లుచున్నవే? రాజ్యంపుం గలంకులం దొత్తుడుగలుగునాండు గాండీవి భుజబలంబును, భీమసేనుగదావిహారంబును, దలంపునకు వచ్చుచుండునే!

——సంజయుండు—— (తనలో)

"అన్నా! తనవారలసేమ మడుగు నెపమున నెన్నన్ని యెత్తిపొడుచుచున్నాండు! తమ యిచ్చిన వృత్తులుగూడం జెల్లనీకుండం జేసిరో కా కౌరవు లనికూడ సంశయించుచున్నాండు! కురువృద్ధుండగు భీష్మునిమాట కౌరవులు గౌరవింపరని సూచించినాండు. తనకాలము నాంటింబోలె బ్రాహ్మణులకు మన్ననలుండ వోప వని స్థిరపఱచినాండు. తనకాలమునం దొత్తుడు గల్గునాండు, తనయనుజుల బాహుబలంబుల మూలమున గెలుపు గలిగెం గాని, యిప్పటియిన నట్టిదొత్తుడెగల్గినచో, నేమగునో గదాయను సానుభూతి

నెఱపువానిం బోలెఁ బలుకుచుఁ దన యనుజుల బాహుబల విక్రమంబుల నభివర్ణించుచు, నను నదలింపఁ బూనినాఁడు! మఱియు నింకెన్ని తెఱంగులఁ బలుకునో సావధానంబుగ విందును గాక——" అని తనమనమున సంజయుం డనుకొను చుండెను.

ధర్మ:— పాండుకుమారులు కౌరవగౌరవముఁ గాపాడిన తెరుఁగు మఱి యని చెప్పుటకు నొకనాఁడా, రెండునాళ్ళా--? యెుక్క-నాఁడని నీకు నెంచి చూపఁగలను? ఘోషయాత్రకు గంధర్వులు వచ్చినప్పటి చరిత్రము మనవారి మనములం బాయఁ దగినదికాదే! ఇంతలో నింత మఱపు చేకుర వచ్చునే? కృతమును మఱచినవారి నిఁక నేమందుము? పోనిమ్ము-మనమిరువురమును మధ్యస్థులమైమాటాడుదము. రణరంగమున నర్జును నోడించి, తన మానమును బ్రాణమును దక్కించుకొని పోయినవాని నొక్కనినైనఁ జూపఁ గలవే! కావునగాని, ప్రసంగవశమున నడుగ మఱచితిని: దుర్యోధను నింటఁ గార్యమునకును, ఖడ్గమునకును దగుదు రని చతురతమెయి వర్ణించుచున్న కర్ణుని శౌర్యత్వమును, బెట్టిదికమును జెప్పుచున్నవి గదా!

ధర్మజుని పలుకులు వినుచు, సవిమర్శంబుగ

—సంజయుఁడు— (తనలో)

“ఔరా! ధర్మజుం డెన్నిరసంబు లొలికించుచున్నాఁడు! ఘోషయాత్ర నుదాహరణంబుగఁ జూపి, తనవారి నిర్వ్యాజవిక్రమంబుఁ బ్రకటించినాఁడు! తనకక్కఱలేదను నట్లు, మధ్యస్థుల మని చెప్పి, నాకు మెప్పు పుట్టింప నెంచి, తన్నుఁగూడ నాతోఁ జేర్చికొనినాఁడు. అర్జును నెదిర్చి యనిమొన మానప్రాణంబుల దక్కించుకొనినవాఁడు లేఁడుసూ యని భయపెట్టువానిం బోలెఁ బలికినాఁడు. కౌరవసైన్యమువారి కుశల మడుగుటలోఁ బాండవులకుఁ

ప్రధానవైరి యగు కర్ణునిఁగూర్చి మఱచి యడిగినట్లు తుట్టతుదకుఁ గర్ణుని యార్యత్వమును, నధికారమును, జెల్లుచున్న వేళనిఁ గూడఁ గ్రుచ్చి గ్రుచ్చి యడిగినాఁడు. పూర్వపుణ్యమునం గాని లభియింపని యాతని వాక్పుణ్యముం గూర్చి యెంతని యభినందింతును! సమయోచితప్రసంగములనే కాని యాతనిఁ బ్రసన్నుం జేయ వేరుమార్గము గానరాదు.”

అని సంజయుఁడు తన మనమున ననుకొని తుట్టతుదకు ధర్మజునకుఁ బ్రత్యుత్తరంబుగాఁ బ్రకాశంబుగా నిట్లనియె.

—సంజయుఁడు—

“కౌంతేయాగ్రజా! నా సవినయ విజ్ఞప్తి యాలింపుము—

“కురురాజునొద్ద నొకరి మాట యింకొకరి కెక్కనివారు పెక్కండ్రు కలరు. అవినీతులును, నీతిమంతులును, సత్త్వసంపన్నులును, దురహంకారులును నై కురుసభ నున్నవారి నంత యనం బనిలేదు. ఏమి చెప్పఁ దలంచినను, నీతిపరులును, సత్త్వగుణప్రధానులును, లోకమునకు వెఱచువారును, జనులకు నొడంబాటగు విధమునఁ జరియించువారును, సంఘముతోఁ బొంది పోవఁగి మను తలంపు ప్రధానముగఁ గలవారును, నగు మీతోడన చేయు ప్రసంగంబు ప్రస్తుతికెక్కం గలుగుట, నటఁ బలుకుటకంటె, మీతోడన పలుకుట మేలని తలంతును.

“మీ యడిగిన వారందఱకును నిప్పటి వఱకుఁ గాకున్న మానెఁగాని, పొందే ముఖ్యమని తలంచి యెంతశ్రమపడినను ధార్తరాష్ట్రులతోడి నెయ్యమునకై ప్రయత్నించు మీ విమల హృదయంబుకతంబున నిఁక మొదలుగనైన క్షేమలాభంబులు సమకూరు. అంబికేయునకు వృద్ధత కతమునఁ మన మొక తెన్నునఁ బోకుండుటఁ దన సుతుని పొగరుఁబోతుఁదనము మాన్పఁజాలక

పోయియు, నిపుణించుకచిత్తశాంతినొంది, మీయెడ నిక్క-వమౌ మక్కువఁ బూనియున్నాఁడు. ఇట్టిపట్టుల సంపూర్ణ హృదయమున మీస్సైరణ, ధర్మప్రవీణహృదయులరగు, మీ యజాతశత్రుత్వంబునకు, మఱింత మెఱుంగువెట్టినదై, మీశాంత స్వభావం బఖిలలోకవిశ్రుతమగునట్లుచేయక యూరకుండునా !

"ధర్మనందనా ! నీవు కొలువున్న సమయాన, నీవును దమ్ములును, నీ యాప్తవర్గమును, కృష్ణుండును, వినుచుండ, నీ సముఖమున విన్నవింపుమని మీ పెద్దయ్య పలికిన పలుకులు గలవు. అనుజ్ఞనొసంగిన విన్నవింతును."

అని సంజయుండొక్క త్రుటికాలము ధర్మజుదెసం జూచుచుండెను.

ముఖమునఁ గెంపు గదుర, దృక్కులు చెదరఁ, బెదవులదర, సంజయుం జూచుచు ధర్మజుండు:—"సంజయా! వీరె నాతమ్ములు; వీరె యాప్తులు; ఈతఁడె కృష్ణుఁడు; ఇఁక నీకొలువునఁగల తక్కిన యందఱును వినుచునె యుందురు. ఓ యయ్యా! నిన్నేమనుమని మాయయ్య నాకడ కనిచెనో యవియెల్ల వాయోడక వచియింపం దగు" నని మిన్నకుండెను.

ఈ పలుకులు యమసుతుని మోమునుండి వెల్వడుటయుఁ బలుకుచున్నప్పటి ధర్మసూతి ముఖకళలు మాఱుచుండుటయు, సంజయుండు చూచి చూచి—

"అన్నా—యీ ధర్మజుని గరువంపుఁ బలుకుల విధంబు నేమందును! దుర్యోధనుని యున్నతిం జూడఁజాలక, తన మెయివడిఁ గల ప్రవర్తనకుండోడు నోటివడితనముంగూడఁ జూపుచున్న ఈ యమసుతుంగూర్చి యేమి తలంపవలయు? ఈతనియం దిదివఱ కెన్నండును గని విని యెఱుంగని రజోగుణము నేఁడు చూడవలసి వచ్చెనే! కటకటా! నీళుల నగ్ని పుట్టినట్టు లయ్యెఁగదా! లోక సానుభూతికొఱకెదురుతెన్నులుచూచువాని సైరణ మితిమీఱినచో

నేమి యగును? కాలపరిమానవధి దాటినచో నయ్యది వెల్లి విరియక తప్పదు. ఇంతకును నికృష్టకష్టము లకారణముగ నెంత కాలమని స్థైరణ సేయఁగలఁడు! ఏది యెట్లున్నను విన్నవింప వలసియున్నవి విన్నవింపక తప్పదుగదా!" యని సంజయుండు లోలోన ననుకొని, సద్భక్తి వెలిఁగ్రక్కు దృక్కులఁ గృష్ణుని దెసం బఱపి, భీమార్జునన నకుల సహదేవుల నెయ్యముం జూపు చూపులఁ జూచి, దృష్టద్యుమ్నుని సవినయంబుగ నవలోకించి, ద్రుపద విరాట భూమిపతుల సంప్రీతిమెయిం దిలకించి, యుధిష్ఠురుదెస మోడ్చిన కేలుంగవతో సంజయుఁడు ప్రసంగము ప్రారంభించెను.

"యమనందనా! మీయయ్యం దలంచి, మిమ్ము స్మరియించి, మీ పెదనాయన చిత్తశాంతి నొంది, మనః కళంకము వీడి, మీ తోడి పొందికపనికి మనమున నసయము గోరికోరి, యెంతేమోదమున నను నిట కనుపునపుడు, నాతే రేగసి త్రోనఁ జెప్పుచు, నీ సమ్ముఖమ్మున నెఱపెడి సంభాషణవిధానముఁ దెలుపుచు నెంతో దవ్వుల నను మీకడ కంపకమువెట్టఁ దనవారిని నావెంట నంపిన యాభూకాంతుని మానసమున నీదెస ననురాగంపు కల్మి యెంతకలదో, కాని, యాతని మనసు గ్రహియించి, యిఁకనైనను మన మెఱుక గలిగి కార్యక్రమము నడపఁగడంగుట సమంజసము కాదా!

"ఈ సందర్భమున నెంతదూర మాలోచించినను సర్వధర్మజ్ఞులును, బరమశాంతులును, నని లోకమునఁ బ్రసిద్ధిఁగాంచిన మీరలు, లోకులు మిక్కిలి చులుకనగా వారొనఁ దగిన కార్యము సేయంబూనుట యేమాత్రమును దగవు కానేరదు. మధుఁగు వంటి కౌరవాన్వయమునకుఁ గౌరవేంద్రు కతమున మసియంటినను, గార్యనిపుణహృదయులరగు మీ రద్దానిని దొలఁగఁ ద్రోసి, కీర్తిచంద్రికలం బ్రసరింపంజేయఁగల సమర్థులరయ్యును, బామరజన

పరిపాలింపఁగుట యెంతయు గర్హ్యము కాదా! సకల జనక్షయ కారణంబగు యుద్ధమున ఈ జయాపజయంబుల నేది సమకూడినను సుఖ మెద్దని యోచనకి మీవంటి యుత్తమోత్తములకు పూనం దగునే! ఆహవకేళీవిక్రములగు మీ రీయుద్ధమున నాబాల వృద్ధజనంబుల, సఖుల, బంధువులం ద్రుంచి, కట్టకడ, నొందిన సుఖము లవేటికి ?

“. దయాపయోనిధీ!- యని పుణ్యునినం బిలువం జాలుదుమే !

“మీ వీరజనంబుల నెంతుమన్న, యోధాగ్రేసరులగు భీమార్జును లరాతివనదవానలములు. సాత్యకియును, విరటుండును, నసమానయోధవరులు. ఇంక సంగ్రామశోభితుండౌ నీ ద్రుపదుం డున్నాడో, మీ చుట్టాలకెల్ల మేటివు. మీ విజయమునకెల్ల మూలము మీ కృష్ణుఁడు. సురలకైన నజేయులగు నిట్టివారిం గూడియున్న మీ విజయమున కేమి కొఱంత!

“అటు కౌరవబల మూహింతుమన్న ద్రోణ భీష్మ కృపాశ్వత్థామ కర్ణ శల్యుల ప్రాణములే యా సుయోధనుని పాలివని లోకు లనుచున్నారు. సుయోధను ననుజు లసమానపరాక్రములు. వారి కొడుకు లజేయులు; ఇంక నా బాహ్లీకసోమదత్తు లాస్థానమునకైన నోడరు. వారిని నిర్జింప నీ యిలంగలవారిలో నెవరికి నశక్యము. ఇంతింత బలపరాక్రమవంతులౌ మీ యిరువాగుల వారికిని నన్యోన్య కలహంబు మే లొనఁగూర్చునని నాకుం దోఁపదు. ఈమాట నాడటఁ గాదటంచనెదవేని, మీ యిరువురకును బ్రియమును, హితమును గోరువారి నడిగి చూడుము.”

అని కృష్ణునిదెసం జూపులు నిలిపి, సభం గలయం గనుంగొని, సంజయుండు మాటల నిట్లందుకొనియెను.

“క్రోధ శాంతికై వాసుదేవునకు నమస్కరింతును; సవ్యసాచికిం జేతులు మోడ్తును; తక్కిన మిత్రబాంధవ హితప్రియు

మంత్రినయున్యకోటికి అభివాదన మొనర్చెను. అసూయాళుడై, పాఁపగలఁ దొలఁగఁద్రోసి, పాండవు లడవులంబడిన యుగబాల్ల మఱులమఱులఁ గెరలింపక నామాట పాటింపఁ బ్రార్థించుచున్నాను.

"తన నేల యేలుటలో, ప్రజలఁ బాలించుటలో, దేవ బ్రాహ్మణగురు జనుల నాదరించుటలో, సర్వజనంబుల కీర్తులొసంగు టలోఁ, గ్రతువులొనరించి తన్నుచిత ప్రకారంబుల గౌరవించుటలో ధృతరాష్ట్ర నగ్రనందనుఁ డీపాండుతనయాగ్రేసరున కేమాత్ర మును దీసిపోఁడని మన మంగళ మెఱుంగనిది కాదు. ఒక్క పాండవులను ద్వేషించినంతమాత్రాన దేవబ్రాహ్మణులకు మన్నన కష్టఁబోదనియు మీనాఁటి యీవులు సెల్లనిచ్చుట లేదోకాయ నియు భీష్మాది కురువృద్ధులమాట పాటింపఁబడ నేరదనియు, శంకింపం బనిలేదు. ప్రత్యేక కారణమున మిము ద్వేషించియుండు నా సుయోధనుఁడు కొంతకాలంబున మీకు ద్రోహంబుసేయు నెంచెనని యిపుడా కురునాథుఁ డెఱింగి మిగుల వగచి, మీవలనఁ జేరిముడికతమున నను మీకడ కనిపెను. ఇంతకును సెవు డెవరి కెట్లుపోయి యెట్లువచ్చునో యెవరి కెఱుక? స్వయంకృత కర్మము ననగదా సుఖదుఃఖములు కలుగుచుండును! అనుభవింపకతీఱునే యెవ్వరికైనను? పురుషున కుండఁదగినధర్మంబులన్నియు నీయందుఁ గలవు. క్లేశములు కలిగినను మనమునన్నైన వగవని ధీమంతుండవు. సకల ధర్మజ్ఞుండవగు నీవు, నీయెడ నొరులెగ్గు దలంపకుండఁ బ్రవర్తింపనలయునే కాని సర్వబంధుజన వినాశహేతుభూతం బయిన యుద్ధము నభ్యర్థింతువా? స్వజన వినాశకరంబుగ మీ రొండొక మననది జయమె యయినను, అద్దాని నపజయము యెంతురు సూక్ష్మజ్ఞులు. ఇపు డింతకాలమునకైన నగుఁగాకగాని, సమర సన్నాహమే నీకు మోదావహమేని యీపాటి కని యూనాఁడె యొనర్చి, దుర్యోధనుని లోకప్రసిద్ధుల పాల్పడినయుఖలుండనుచో

అరణ్యాజ్ఞాతవాసముల నన్నిఁ యిడుములఁ గుడువలసి యుండకయే పోవునే! ఇవియన్నియుఁ దలంచియే గద మీ పెదతండ్రి, శాంతి వహించుటయె శ్రేయమని నీకుఁ దెలుపుమని, నన్ను నిట కనిపి పుచ్చుట! ఆహవప్రయత్నముల నింకనైన విరమించుటయే శ్రేయోదాయకమని మీ పితామహుండును, విదురాది సజ్జనులుం గూడ నీకడ విన్నవింపు మనిరి. నీ విప్పట్టున నీ పట్టు వీడిన నిఖిల లోకకళ్యాణప్రదమని నీ కురుగురుజనంబు లందరును వాకొనుచున్నారు."

— ధర్మజుఁడు. —

"సంజయా! నే నెంతయోసేపు మాట్లాడ లేదు కాని, మాటలాడినంతవఱకును సౌహార్దమును, స్నేహమును, గాని మాట యొక్కటియైనను నా నోట వెడలివచ్చెనే! నేను సంగరభీరువును గాకపోయినను, యుద్ధావసర సమయమున మాత్రము ప్రాణనష్టమునకు సర్వదా భయపడుదును. పోరులేకుండ మేమును వారునుం గలిసి క్షీరోదకన్యాయమున జీవించుటయె సర్వదా నేఁ గోరుచున్నది. మరియుఁ బోరులేకుండ సమకూడెడి యసిద్ధి యే వెట్టిదైనను నొల్లననా? లౌకిక దూషకులగు దుర్యోధనాదులే దుర్వర్తనులు కారనినచో, నిఁక లౌకికసమ్మతధర్మనిబద్ధకార్యపరులగు భీమార్జునులేనా దుష్కర్మములకు రోయనివారలు?

"నీవు వేఁడికపై సంధి యొనఁగూర్పనెంచి వచ్చితివి గాని, సంపదఁ బోఁగొట్టుకొని యశక్తులం బోలియున్న మమ్ముఁ బిలిచి, యాదరించుట కా సుయోధనుఁ డంత బేలయా! బుద్ధులు చెప్పెడివారి నాతఁడు మన్నింపఁడు. ఆతని చరిత్రము నీకును దెలియనిది కాదు గద! 'తగవిది' యని మెలఁగిన యాంబికేయుఁడే రాజ్యకాంతాంధుం డగు కొడుకు తెన్నునే యనుసరించి నడచుండ నింకెవరిని సత్పథమునకు రమ్మని పలుకుట!

"జూదపుసిరి యాసపడందగదని విదురుఁడు నుడివిన యప్పుడాతని మాట నాదరించుటయుఁ, గర్ణాదుల యుచ్చకపుఁబలుకుల నాదరింపకుం టయు, జరిగించియుండినచో, నంతయు నింతదూరము పెఱుఁగక యుండునే! శకునియుఁ గర్ణుండును నెఱత్రిప్పిన సలహాలకు దుర్యోధనుఁడు తండ్రినిఁ దనవశము చేసికొని, యింతలు సేతలు గలుగుచున్నాఁడు. నీ వింకను వెఱంగువై యూర్ష్యులనో చెప్పుదు తెన్నునా మాటలాడెదుగాని, దుర్యోధనుని యవినయ మనివార్యమనుమాట చక్రధరుఁడైన లెక్కసేయక, పరాక్రమనిధియగు మన యర్జును గెలువ గాంగేయునిపై నాధారపడి రాజ్యసంపదనెల్ల పోఁగొట్టుకొనుట కాయత్తపడుచున్న పరమావివేకిసుమా—పాపము— మన దుర్యోధనుఁడు!

* * * * * *

కొంచెమ్ము సేపు మిన్నకుండి మఱల యిట్లనియెను—

"సంజయా! ఫల్గునునికపిధ్వజప్రభలు శత్రువుల కన్నుల మ్రాఁతవడు నట్లొనర్చుటయు, నాతని దేవదత్తధ్వానము వారి చెవులు చిల్లులువోవఁజేయుటయు, చాపాచార్యుండౌ ద్రోణుండును, గురుపితా మహుండౌ భీష్ముండును, ద్రోణసుతుండగు నశ్వత్థామయుఁ, గర్ణ దుర్యోధనులును మాత్రమెఱుంగరే! నీవుఁగూడ మఱచితివే! ద్రుపదపురోహితుఁ డంపఁబడెనుగదా యని నిన్నందులకుఁ బ్రతిగా నిటకంపితిగాని, నీవు మాత్రము న్యాయముగ నెఱుఁగని దేమికలదు ? నీవు మాటనేర్పరివి గాన, తొలుదొలుత మేము బాహువిక్రమా ఢ్యుల మనియును, గడుశాంతుల మనియును, మముఁబొగడి పొగడి, పిదపఁ ధార్తరాష్ట్రులనింగెలువ నరిదియని, సులభముగఁ జెప్పితి వే కాని పక్షపాతవృత్తిని బలుకుచున్న నీనుడులు సమంజసము లని నేఁ దలంతు ననియే నీవూహించితివే! కౌరవులజేయులౌట వారిఁ

గెలుపొందరవే? యను నీమాట లటుండనిచ్చి, సద్గుణుండవై నీవు వచ్చి, కోపోపశమనంబుగ నింతవట్టు పలికితి వంతెచాలు. వారిచేఁ బరాభూతుల మయ్యును, నీ మాటలచే నింకను గొంతమేర సైరణ జేయుదుము. ఇంతకుఁ బూర్వము వారు మాయెడ నొనర్చిన దుర్నయముల నెంత సైఁచితిమో నీవును గొంతయైన నెఱుంగుదువు కదా; ఇంకనుంగూడఁ వారియెడఁ గీడుదలంపకుండ నీ వుండుమనునంత కాలము నుండుదుము. కొడుకులవలె మముఁగబురంపి, పాలిమ్మని తనకొడుకులకుఁ జెప్పి, యింద్రప్రస్థమో కాక వేఱొకటియో, మాకిచ్చి, మము సంతుష్టాంతరంగులఁ జేయుట యాతని కుచితము కాదా!"

—సంజయుఁడు—

"ధార్తరాష్ట్రులొనర్చిన యెట్టిదుండగముల్లనైన మీరు భరించి శాలిమియె యమూల్యాభరణముగఁ దాల్చితిరి, కావున మీతోడ నింతదూరము ప్రసంగింపఁగలిగియుఁ, దృప్తినొందక మరల విన్నవింపఁ బూనుకొంటిని.

"నీకున్న వైభవ మంతయు నహింసయు ననింద్యచరిత్రమును గాక మ రేమున్నది? దుశ్శీలురగు కౌరవులు మీకుఁ బాలీక చెడఁ దలంచిరేని,—నేఁజెప్పెద, వినుఁడు—రక్తపుఁగూడు కన్న, మీ సత్ప్రవర్తనకుఁ దగినది భిక్షాన్నంబుకన్నను, మిన్నయై, భిన్నమైనది మఱిలేదు. ఇది కాదందువేని, రాజసూయ మహాధ్వరం బొనర్చి, ద్విజులకును దేవతలకును, దృప్తినిఁగలుగఁజేసి, శాంతియు దాంతియుఁజూపి, సకలలోకములఁ బొగడొందిన మహాపుణ్యమూర్తి వగు నీ పుణ్యచరితంబు మహాహవకారణమున హింసాకళంకితముగఁ జేయనెంచు టెంతయు నీ కొప్పియుండదు సుమా!

"ఇంకొకమాట—

ఏడవ ప్రకరణము

"మాయజూదమొనర్చి, మిముమోసపుచ్చి యింత లోనర్చిన ధార్తరాష్ట్రుల గర్వము నేల యింతవట్టు చెల్లనిచ్చితివి? లోకముచేత వారల నేలతిట్టులువడఁజేసితివి? తాలిమిందూలకయడవులపాలయి మీ రందఱన్ని యిడుముల నేలపడవలసివచ్చినది? ఇన్నింటికిని మీయనింద్య చరిత్రమును, దాక్షిణ్యమును గదా ప్రధాన కారణములు! ఇంతవడి యును, చుట్టతుదకు, సకలజనక్షయకారణంబగురణంబునకే యొడఁబడి, బంధుగుల, గురుల, ననుజుల, వెదకి వెదకి మ్రైనను, వధి యింప లభియించు నా సురలోకసౌఖ్యంబైనను నదియేల? అస్థిర మును, నార్యనింద్యమును గాదా? లోకములోని సర్వజన సామాన్య మానవప్రకరప్రవర్తన మనుసరించినచో, మీకు ధార్తరాష్ట్రులు పరాభవములో, ప్రాణాపాయములో కలిగించిన సమయములనే మీరు వారికిఁ బ్రతీకారములు సేయవలసి యుండియుఁ దగిన సాహాయ్య సంపత్తి దొరకకుండుట నయ్యది యసమయమని మీరపుడు తలంచి మిన్నకుండి యిపుడు మీకు సాహాయ్యసంపద సమకూడినది గదా యని, సమరము సకలజనక్షయకారక మని యెఱింగియు, నిపుడు ధార్తరాష్ట్రులపై దాడి వెడలఁదలంచితివే, యింతకాలము మిన్నకుంటి రేని, మీ రిన్ని యేండ్లు లడవులఁ గడునిడుమలఁబడి యుండుటయు నధర్మము కాదనవలసివచ్చును. మీ రిపుడిట్లు వారిపై నెత్తిరాఁదలంచి యుండుటయే కావలయు మిము దుర్యోధనుఁడట్లు బాధలు పెట్టెనో కాయని తోఁపఁజేయుచున్నది. ఇపుడు నీకు సాయ మొనర్ప నెంచి వచ్చిన రాజు లపుడు మాత్రము రా మని యనిరా? వారపుడు లేరా? అలనాఁటి రాజసూయమునకుఁ బూర్వము మీచే జయింపబడిన రాజు లేకద మిము నాశ్రయింపవచ్చుటలు! ఈ కృష్ణుం డును ద్రౌపదీస్వయంవర కాలమునుండియు మిము సంభావించుచునే యుంట, మీరడవులకుఁ బో నియమింపఁ బడినప్పుడే, యిపుడు చేయఁదలంచిన యీ రణయజ్ఞ మొనర్చి మీ ధరణీ భాగముగైకొని

యుండిరేని, మీ రిన్ని యిడుమలఁబడకపోయి యుందురే! కాని సహజముగఁ దీవ్రవృత్తియే యెఱుంగని నీకీ పాపాకరమగు యుద్ధపుటూహ తగదు సుమా! కోప మెఱుంగని నీవు కోపసంభావితమును, ప్రజ్ఞావిరుద్ధమును నగు ఘోరతర కార్యమున కెట్లు తత్తరమునఁ దలపడుచున్నావో కదా!

"జనక్షయ కారకమగు యుద్ధమునకు నే నెదఁ దలంకెదనని పలుమా రనుచున్నావు గాన, నే నిపు డాడవలసిన మాట యొకటి లేకపోలేదు!

"ధార్తరాష్ట్ర వినాశమే నీ ముఖ్యోద్దేశము కానిచో, నీ తమ్ముఁడగు నర్జునుని దివ్యాస్త్ర సంపాదనకై తపమునకుఁ బంపునపుడు, మున్ముందుఁగ నీవు భీమునితో నాడిన మాటల యర్థమేమి? నీ రాజనీతి లోకోత్తరమైనది. మఱియు నీ కాలమున రాజనీతి పరులని యనిపించుకొనుచున్న వారిలో నగ్రగణ్యుండగు శ్రీకృష్ణుండుకూడ నీ పథమునకు లోఁబడినవాఁడె! ఏ సమయమున కేమాట యాడవలయునో, అది నీ వెఱిఁగినంతవట్టు శ్రీకృష్ణుండుఁగూడ నెఱుంగఁడని యేతలంతును.

"లాక్షాగృహ దహనము స్వయముగ భీమునిచే నొనర్పఁ జేసియుఁ దద్గృహదహనపు టపవాదమును దుర్యోధనుని మెడకుఁ జుట్టి, మరణమును నిషాదవనితకును, దత్సుత పంచకమునకును బంచిపెట్టి మీరు వెడలిపోవుట యందును;

"అట్టుల వెలువడిన వెంటనే ప్రచ్ఛన్న వేషులయి ద్రౌపదీ స్వయంవరసమయము వఱకును నందందుఁ బ్రాకులాడుట యందును;

"ద్యూతానుద్యూతానంతరమున మీ రడవులఁ దిరుగాడు నాఁడు ద్రౌపదియును భీముండును నిను యుద్ధమునకుఁ బురికొల్పుచుండ సమయము గాదది యనియును, సమయము నిర్వర్తింపఁబడు నంతవఱకును మాటాడరాదనియును, వారిని వారించుట యందును;

"సమయనిర్వహణానంతర మైనను సుసమయము వచ్చునందాఁక వేచియుండవలెనని వారిని శాసించుట యందును;

"మీలో మొనగాఁడని యనిపించుకొనిన యర్జునుని, 'ధార్తరాష్ట్ర వినాశము కొఱకు దివ్యాస్త్ర సంపాదనార్థము తపమునకని, యనిపిన పిదప మీరందఱును దుర్యోధనుని దాఁకికోడి తీర్థయాత్రల నెపమున, దీక్షాభంగ భయమునఁ, దక్కినవారితో నానాపర్వత వనాదులం ద్రిమ్మరుటయందును;

"మీరరణ్యావాస మొనర్చుచుండునాఁడే, మున్ముం దేజనావాసమున నజ్ఞాతవాసదీక్షను దీర్పఁగల మను నాలోచనము మనమునఁ జేసికొని విరటునగర మందుల కేర్పఱచికొనియే యరణ్యమున మీ విడిసిన తావులు మార్చుకొనుచుండుటలో మత్స్యదేశము దెసనే మీరు నడచి నడచి తుదకు సులభముగ నందుఁ జేరి మీ రేమి చెప్పిన నది నిజమనియే నమ్మి మిమ్మాదరింపఁగల యమాయకుండగు విరటుకొలువును జేరుటయందును;

"నీ రాజనీతిజ్ఞత వెలువడలేదా? నా కన్నుల యెదుటఁబుట్టి పెరిగి విద్యాబుద్ధులఁ గఱచి, పరమవివేకివై నీవు పరమరాజనీతి పరుండవగుట నాకేమాత్రమును శిరోభారము లేదు సరిగదా, నామానసమునమఱియు నెంతేని గరువము కలుగుచుండును. కాని నీవు యుద్ధము వలదనుటలో, నీ సౌమ్యసమాధాన వాక్యములలోఁ గేవలము శాంతి కోరియేయనిగాని, మున్ముందు స్వలాభ చింతాలేశము లేక యని గాని, యనఁగలమా యను శంకమాత్రము లేకపోలేదు. యుద్ధచింతయేమాత్రమును లేదనియనుచున్న నీవు, ద్రౌపదీవివాహానంతర మొక వత్సరము మీరందఱును ద్రుపదునింటనున్న కాలాన ధార్తరాష్ట్రుల రూపుమాపుటెట్లను నాలోచన మీరును బాంచాలురును యాదవులును గలసి గుణించు కొనుచుండిరను వార్త వినియే కద భీష్మాదులు మిముఁ బిలిపించి, యింద్రప్రస్థము మీ కిప్పించి రాజ్యార్ధమున

మిము నిలువఁ జేసిరి. ఈ మాత్రము కార్యకారణ సమన్వయ మెఱుంగని వాఁడను గాను.

“ధర్మజా! ఇంతవఱకును జరిగినవేవో జరిగిపోయినవి—గాని యరణ్యాజ్ఞాతవాసములు నిర్వర్తించుకొనిన వెంటనే మాది మాకిచ్చి వేయుఁడని సుయోధనునకుఁ గబురంపి యుందురేని, ‘పాండవులెన్ని యిడుమలఁ బడియున్నైన సమయబద్ధులే’ యని యెంచి దుర్యోధనుఁడు మీ రాజ్యము మీకేల యిచ్చియుండఁడు? మహావివేకివగు నీకీ మాత్రము తోఁపక పోయెనే? ‘ద్రుపదపురోహితుముఖమున దౌత్యమొనరింప లేదా’ యని యందువేమో! ఏమోగాని, ధార్తరాష్ట్రుల పురమున నిర్జింప నెంచి, సైన్యముల సమకూర్చు కార్యము మున్ముందొనరించిన పిదపనే ద్రుపదపురోహితు నాకురుపతి కడకంపలేదని నీవు డనఁగలవా? ఆహవప్రయత్నములయందు మీరే తొలుత ముందడుగిడుట నె కదా, దుర్యోధనుఁడును మిముఁజూచి, తానును సహాయ మభ్యర్థింపఁ బెక్కుర కడకుఁ బోయెను! కడు శాంతాత్ములమనుచు, సమయము కొఱకెదురు సూచి చూచి, మీరే తొలుతొలుతఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వుచుంటిరి కాని, సుయోధనుఁడే ముందడుగిడలేదే! ధార్తరాష్ట్రులచే నెన్నెని యిక్కట్టులు పడియు, మాఱు సేయక సైరించిన శాంతాత్ముండని నిను నీవారును, వారివారును, పలుమా రనుచుందురే కాని, యసహాయస్థితియును నసమయమును బోయి, సహాయసంపల్లాభమును, సుసమయవీక్షణమును ప్రధాన కారణములుగ నీ వప్పటికి మాఱుసేయకుంటి వని, ధార్తరాష్ట్రులు మీ కొనర్చిన యగచాట్లకు వారలతోఁబాటు మాప్రజనెల్ల మడియింప సమకట్టిన నీ యాంతరంగికకఠినభావమును మాత్రము వారు గ్రహించి యుండరు కాఁబోలు నని యనుకొనవలసి వచ్చుచున్నది.

“ధర్మనందనా, కారణ మెట్టిదైననేమి జూదమున మీరోడితిరి

గాని, సుయోధనుండే యోడెనను కొందము. మీరపుడు వారల నడవుల కనుపఁ దలంచకుందురోటు! జూదమునకుఁ బ్రారంభించునపు 'డోడుదు-నరణ్యావాసాదులొనర్తు-' ననునిశ్చయముతోడనె కూరుచుంటినోటు! గెలిచియుందువేని దుర్యోధనుఁడిపుడు నడిపించిన కార్యకలాపమంతయు—మానినచో, నాతని పూర్వజన్మవాసనాయుతములగు నొకటి రెండు పనులు మాత్రము మానియుందువేమోగాని—యంతయు — నీవును నడిపించియే యుందువు. ఇందెంత మాత్రమును సంశయము లేదు.

"కౌంతేయాగ్రజా!, పరబ్రహ్మమునం దాత్మానుసంధాన మొనర్ప నేర్చి, యెదిరి మానసము నొవ్వఁజేయనొల్లని, నీ కిపుడిట్టి పాపకార్యమునం దెట్టుల మానసము లగ్నమయ్యెనో యని లోకు లనుకొందురని యైనఁ దలంక వలదా? ఇంత క్రూర కార్య మొనర్పఁ జేయఁగల కాఠిన్యమును దుర్యోధనాదులంబోలె నింత రాక్షసహృదయంబును, నీ చిన్ననాఁటనుండియు లేని నీ కిపు డెట్టులలవడియెనోయి! ఐహికసౌఖ్యములు తుచ్ఛము లనియు వినశ్వరము లనియుఁ దలంచి కదా యడవులఁ గందమూల ఫలంబులైనఁ దినుచు దినములు గడపుదునని యెంచిన నీవు, కర్మసంబంధమగు ఫలమును వీడి, వైరాగ్యసంపన్నుఁడవై, పునరావృత్తిలేని మోక్షసంపాదనార్థమె, యోగాభ్యాస మొనర్చుట కిఁకనైనఁ బ్రారంభింపుము. అఖిలజనక్షయము వలనఁగాని లభ్యముకాని రాజ్యసంపదవలనఁ బ్రయోజనము లేదను విజ్ఞానముతో, గర్మరాహిత్యమును బొంది, లోక సంగ్రహార్థముసత్యము, దమము, సౌజన్యము, జీవదయాళుత్వము, వదలి పెట్టక సంచరించుచుఁ గడకాలము పుచ్చితివేని, యింతవట్టును నీ వార్జించిన కీర్తియుఁ బ్రతిష్ఠయును శాశ్వతముగ నియ్యెల నిలువఁగలవు. దుర్జనులకు హితమగు క్రోధమును దిగఁద్రావి సుజనులకు హితమగు శాంతినే వహించి జీవవధవలనఁ గలుగు నరకమును బొందఁ

దలంపును దప్పులకుఁ బాఱఁదోలి, తాలిమియె ప్రధానామూల్యాలం కారముగ నెన్నుచున్న నీ విదివఱకే గడించిన అజాతశత్రుండవను పేరు నిలిపికొనుము. నీవు వహించిన శాంతి యంతస్సున రగులుచున్న యగ్గిగ నుండనీయకుము. నీయట్టి స్థైర్యశాలురుఁ డీ యిల లేఁడను నానుడి మారనీయకుము. అనన్యసామాన్యమైన హాలాహలము మ్రింగిన నీలకంఠు నెన్ని పొంగి పొరలెడుకోపము దిగమ్రింగు ని న్నెన్నవలె. అట్టి నీవు శాంతింపవలెఁ గాని కాకున్నచో నీ పేరు కాలకాలములు నిలుచునే!"

సంజయుఁడు ధర్మజుం దర్శింప వచ్చినది మొదలు సంజయ ధర్మజుల సంభాషణము సాంగముగఁ దదేకధ్యానముగ వినుచున్న కృష్ణుఁడు తనలో—"ఆహా యేమిస్తోత్రపాఠ పారాయణము! తా వచ్చిన కార్యము నిరాఘాటముగ నెఱవేఱుటకు ధర్మజు నీశ్వరునితో సరిపోల్చుచున్నాఁడు! దేవతలనైన మెప్పించునంతటి యోగ్యత వీరి కున్నను, మఱియు మఱియు నిక్కట్టులం గుడుపుమనుచున్నాఁడే! కౌరవులను దుశ్శీలురనుచు, నట్టిరు పాలియఁకున్న, మీరు నడయ దలంచిన రక్షాస్త్రముకన్న, మీ సత్ప్రవర్తనకు భిక్షాన్నమే మిన్న యన్నాఁడు. ఔరా! ఎంతదారుణము! తుదకు బికిర మెత్తుకొని జీవింపు మనినాఁడు! రాజులకిచ్చుటే గాని యడిగి కోలులేదని యెఱుంగఁడు గాఁబోలు! బ్రాహ్మణ ధర్మము నూతఁగాఁగొని, నృపధర్మమును దిద్దఁబోవుచున్నాఁడు! ధర్మములంగూడఁ దారుమా రొనర్పఁ బ్రయత్నించుచున్నాఁడు. ఆహా! ఏమి బుద్ధివిశేషము! ఏమి వక్తృత్వము!—"

అని తన మనమున ననుకొని కృష్ణుండు మిన్నకుండి వారి సంభాషణ వినుచుండెను.

—ధర్మరాజు—

"సంజయా, నయసంభాషణంబులం జొన్పి నను నిందించు

చున్నావని నే నెఱుంగనివాఁడనుగాను; కాని, కార్యారంభమునఁ గొన్ని కర్మంబులు ధర్మంబులుగాఁ జూపట్టినను, బదంపడి యా ధర్మములే, యధర్మములుగా మారునని యెఱుంగవోటు! మఱియు గొన్ని కర్మములు, తొలి తొలి యధర్మములుగాఁ గానవచ్చియుఁ దుట్టతుదకు ధర్మస్వరూపము నొందుచుండుఁ గావున నా చేయు నది యధర్మంబని సహేతుకంబుగ నిరూపించి, విడవ ననుదూఱుము. ఇంతియగాక, వంశదూషకులును, లోకకంటకులును నగు వారిని నిర్మూలనంబొనర్చుటయే ధర్మంబను పెద్దలమాట నీవు వినియుండవో! సంగ్రామంబు క్షాత్ర ధర్మంబుకాదని నీవు నిర్వచింపుము; చూతము. ఇంతకును, మనకిది కర్తవ్యం; బిది యకర్తవ్యంబని వచియించి, మనల శాసింపంగల వాసుదేవుఁడిటనుండ మన కీ వితర్కమేల? ఈతండు ధర్మాధర్మ విదులకు గురుండు; కార్యాకార్యనిరూపకులకు శిక్షకుండు; ఉచితానుచితజ్ఞులకు మార్గదర్శి. ఈతని మఱియు సమస్త పురుషార్థమ్ములకును మూలంబగుట నీతని చెప్పెడి చొప్పు మన కెల్లరకును నవశ్య మనుసరణీయంబయగును."

అని ధర్మజుండు కృష్ణుని దెసంజూచుచు మిన్నకుండెను.

అంత నందనందనుండును సంజయుదెస నవలోకించుచు, వేడ్కతో నిట్లని వచియించె.

—కృష్ణుఁడు—

"పాండు పుత్రులకు శుభమునే కోరుదును. పుత్ర పౌత్ర మహిమోజ్వలుండగు నాంబికేయునకుఁ జేటు మేలుకాదందును. ఇంతవఱకును గథాక్రమం బెట్లునడచినను, నిపుడా ధృతరాష్ట్రుండు తెలివొంది, యీ పాండవులఁ బలుకులఁ దేర్చుటకు నిండుమనంబున నిన్నిట కనిపినందుకు నే నెంతేనియుఁ బరితృప్తుండ నైతిని.

"ఆతని పనుపున వచ్చిన నీవు వివేకమూర్తివి కావున నుచిత మార్గమున, స్నేహము వినయము బాంధవమును సమ్మేళన మొనర్చి,

వీరు శాంతిని బొందు విధంబున, నీకుఁదోఁచిన ధర్మముల బోధించి పలుకఁ గలిగితివి. కాని నీ నుడివిన విధానమది యెంత యొప్పిదమని నీవు దలంచినను, బాండవాగ్రజుని పలుకులరీతిఁజూడ, సంధిపొసఁగదు కా యని తోఁచెడిని. ఇంతకును, నుస్మత్పుత్రుండగు దుర్యోధనుని, సుతు వాఁడౌ ధృతరాష్ట్రుని, మనము కొంత కొంతయైన నెఱుంగని వారము కాముగద! నీవు కడునేర్పరివి గనుక, ఆ ఱేఁడు వీరిదెసఁ జూపుమైత్రియును, గారాబమును, గడుఁదీయని నీ మాటలచే వన్నెవెట్టి చెప్పుచున్నావుగాని, వీరిభాగమువీరికొసంగకయె, మధుర మధుర ప్రసంగములతో నీకార్యము గడతేఱు ననుకొందువా? వీరిది వీరి కిచ్చివేసినచోఁ గౌరవులింతదాఁక వీరికొనర్చిన పరిభవములనెల్ల సైరించి, వానిని మరల మరల మనములఁ ద్రవ్వకొనక, శాంతులై వారలతోఁగూడి వీరు జీవింపఁ బూనుట, వీరి కరుణార్ద్ర హృదయత్వమును, శాంతాత్మతయు, జగంబున శాశ్వతముగ నిలుచుటకుఁ గారణములగును. అటుగాక, వీరికేమి యొసంగుటకును ధార్తరాష్ట్రులొల్లనిచోఁ, దమస్వత్వములఁ గౌరవు లపహరించిరని వీరు వారిపై నెత్తివచ్చిన నెత్తివత్తురుగాక! అందేమి ద్రోహమున్నది? వీ రవమానము నొందియు, నిటుల నణఁకువచే వారికి లొంగియుండుట కంటెఁ దమ యౌజ్జ్వల్యముచే, శత్రులనుదాఁకుట యేల కర్తవ్యము కాదో? ఎంత విచారింతమన్నను యుద్ధమే వీరికి మేలుగాఁ దోచు చున్నది.

“ రాజులకు యుద్ధము ధర్మమగునా కాదా చెప్పు’ మనికదా యుధిష్ఠిరుండు నన్నడిగెను. ద్విజులగు బ్రహ్మక్షత్రియ వైశ్యులకు యజనయాజనాదికర్మకరణవిభాగంబు ధర్మశాస్త్రాచార్యులు విధించు నపుడు, రాజు లిచ్చువారేకాని, వేడుకొనువారు కారని యయ్యాచార్యులు సూత్రీకరించుట లోకప్రసిద్ధము కాదా! అనద్యలై యున్న వీరికి నీవు చెప్పెడి శాంతధర్మములు మీ దెఱుంగక కడు

మోహితులై చెడుతెరువునం బోవుచున్న, కౌరవులకుంగూడ నీవు చెప్పవలదా!

"సంజయా, త్రవ్విన కొలఁది పెరుగునుగదా యని యూరకుండవలసి వచ్చుచున్నది గాని, కానిదో, నాఁడా సభలో వేయి మందియెదుట—నది యెంతపగయో కాని, ద్రౌపదిని—వారెట్టి తులువలును గాకపోయిన—నట్టులిక్కట్టులఁ బెట్టెదరే! జూదము లాడుట లోకమున లేదే! ఇట్టి సంప్రదాయమొందెనిఁగలదే! మొదటి జూదమున వీర లోడుటం జేసి రాజ్యమును ధనమును సంపదయుం గోలుపోయిరిగా యని యూరకేయుండక గరుణించి, వీరి రాజ్యమును ధనసంపదయుం గూడ మరల వీరికొసంగుటఁ జూపోపమి దుర్యోధనుఁ డనుద్యూతము నేర్పఱచి, సౌబలునిచే—'ధృతరాష్ట్రుండు మిమ్ముఁ గరుణించి, ధనసంపద్రాజ్యంబులను మీకొసంగి సత్కరించెను; గావున నీద్యూతంబున వాని నొడ్డందగదు. అపూర్వంబైన పణంబు నొకదాని నిపుడొడ్డంబూనవలె; ఇట్టి యపూర్వంబైన పణంబొడ్డి యాడి, యందోడు వడిన వారు, నారచీరెలుగట్టి, వన్యమూలఫలంబుల నారగించి బ్రహ్మచర్యాశ్రమంబునం బన్నెండేడులు విపినావాసంబుచేసి, పదుమూఁడవయేఁట జనపదంబున గూఢచర్యను జీవింపవలె; ఇందెవ్వరుం గనంబడిరేని, మరల నరణ్యాజ్ఞాతవాసంబులఁ గ్రమంబున నిర్వర్తించు వారు సక్రమంబుగ నరణ్యాజ్ఞాతవాసంబులం దీర్చికొని యేతెంచిన వారు యథారూపంబున వారి రాజ్యంబు గైకొని యేలుకొందురు" అని కదా యుద్ఘాటింపఁజేసిరి. అట్లయ్యును ధర్మజాదులు సమయము నిర్వర్తించుకొని మగుడివచ్చుసరికి, వీరిరాజ్యం బా కౌరవులు గైకొంట యేకాలపునీతి? ఏ నాగరకప్రపంచమున నిట్టివిడ్డూరంబు గలిగె? వీ రడవులనున్న కాలమున వీరి సంపద్రాజ్యములఁ గాపాడుభారము తమకెంత కలదని యనసాహసింతురో, సమయము నిర్వర్తించుకొని వచ్చిన పిదప, యథారూపమున వీరి సంపద్రాజ్యంబులు వీరికొసం

గుటయందుఁగూడ వారికంత భారమును కలదని యెఱుంగవలదా? ద్రుపదపురోహితు ముఖమునఁ గబురంపిన పిదపనైన, వీరిది వీరి కొసంగక యింకను దమస్వాధీనమం దుంచుకొనుట, మఱియు నను భవించుట లే నాఁటి రాజనీతులు ?

"మయసభాది నిరుపమసంపదలయందలి మక్కువచే, ధర్మజు ప్రతిష్ఠయెడ నసూయచేఁ బాండవుల నెట్లయిన దవ్వులకుం బాఱఁ దోల నెంచియుండ నోపు. కానిచో నేకాలమునకైన జూదమునం దోడినవారికి విపినావాసమును గూఢచర్యయు విధియించుట యను విద్దూరంబైన పణంబు వింటిమే? పాండవుల నెట్లయిన దేశభ్రష్టులఁ జేసి పెద్దకాలము సిరుల కెడఁజేసినచో వీరలు తమ సమయము నిర్వర్తించుకొని మగుడి వచ్చినను జిరకాలపు టెడఁబాటు ప్రజానురాగ బాహ్యులుగను, దమ సంప్రదాజ్యపు టధికార భ్రష్టులుగను, జేయునుగదా యని కానోపు పాపము దుర్యోధనుఁడు వంచన సేయ నెంచెనే కాని ధార్తరాష్ట్రుల మూలమునఁ బాండవు లొందిన పరాభవముల కెల్ల వీరుమారుసేయక ప్రశాంతముగ సైరించుట ప్రజానురాగమును మఱింత వీరిదెస నభివృద్ధినొందించి జయ సూచక చిహ్నములనే శతాధికగుణములుగ మార్చివేసినదని యిప్పటికిని మన దుర్యోధనుఁ డెఱుంగఁడు గదా!

"సంజయా దుర్యోధనునే యననేల? ఆతనికిఁ దండ్రియేకదా ధృతరాష్ట్రుఁడు? లేని మన సెఱుంగనికారణమున భీష్మాది కురువృద్ధు లందఱును నాజాదపు సభయందుండియుఁ జూచియు నోరెత్తఁ జాలకకదా యూరకుండిరి. తన కుమారులబుద్ధి మరల్పఁ దగినట్టు గట్టిగాఁ జెప్పుటకైనను ధృతరాష్ట్రునకు నోరువిడలేదు. కాని య ప్పట్టునఁ దాను దనకొడుకుల దుడుకుఁదనము మాన్పఁగలిగినచో నేనే యననేల లోకములెల్ల సంతసింపవా? అంతటి పున్నెమా తనకును మనకును !

"పాప మా పాంచాలిని దుస్ససేనుఁడు దయావిహీనుఁడై, యా కొలువులోనికిఁ దలపట్టి యీడ్చి తెచ్చినది యపుడా రాజెట్టుల సహియించెనోకద! తనకోడలి యేడ్పు వినఁగలుగు నా మామ యెటు లోర్చెనోకద; యిపుడీ శుష్కప్రియోక్తులతో నీ ముఖమున నీ రాయబార మంపుట కెట్లు నేర్చెనో గద! పాంచాలీ! యిభవ సభ నలంకరించియున్న వారిలో నొకరుండయిన నిది తగ దని యడ్డుపడక చిత్తరువుల యాకృతి నొంది నిలిచియుంటఁజూచి, పాప మమ్మానిని, తన మానసిక బలముచేఁ దననుదాఁ గాపాడు కొనుశక్తి గలిగి యున్న కారణమునఁగాని, కాకున్న నక్కురుసభ నింకేమేమి విడ్డూరములు పుట్టియుండునోకద! ధర్మజు సహనమె, కౌరవులనట్టుల పై పైఁ బడఁజేసినదికాని, కాకున్న నచ్చపు రాకొమరులేకాలమున నైన, నిట్టిభంగపాటులఁ పాలయ్యునోర్చి,—గెలిచినను, గెలువకున్నను ప్రతీకారరహితులయి—యుంట వింటివే! ఇంతతోఁ గథ పరిసమాప్తము నొందె ననుకొంటివా? కర్ణుఁడెంతేసి మాటల నాడిపోసె ననుకొంటివి? ఆ సభలో నమ్మానవతీ శిరోమణికి భర్తలు లేరఁట! ఉన్నవారు జూదమున నామె నోడి విడిచిరఁట! ఇఁక నాసభనున్న వారిలోఁ దనపైఁ గూరిమి గల మగని నెన్నుకొనుమనికూడ ద్రోవది నోనాడుట నీ వెఱుంగనిది కాదే! పాప మా మాట లయ్యర్జునునకు వాగ్రూపకమైన బాణమై హృదయమున నాటి యింకను గదలకయున్నదిగదా! ఇందుకేమందుము? కర్ణుఁడే యట్టులనియెఁగదా, నేనేల యూరకుండవలెనని కాఁబోలుఁ బాపము దుశ్శాసనుఁడును దలయెత్తి పాండునందనుల దెసంజూపుచు—వీరందఱును గొడ్డువో యినవారలనియును, పౌరుషంబుగల మానిసి యిం దెవ్వండనియును, ననియెఁగదా! దుశ్శాసనుం డనినట్టులు నిజముగ వీ రందఱును నింత కాలంబును గొడ్డువోయిన వారలే యగుదురు. వీరి వలన వారికేమి ప్రతిక్రియ లభించినది గనుక! అనవలసి వచ్చినది గనుక, యంటిని

గాని, యలనాఁటి యా సభలో మఱియుఁ బడిన పలుకు లన్నియు నిపుడుగ్గడింప వలసినవి యయ్యెను, దూతవగు నీ వచ్చిన సంధికార్యము మఱియు దుర్ఘటంబగునుగదా యని వెనుకముందు లాలోచింప వలసి వచ్చుచున్నది కాని, కానిచో నలనాఁడు జూదమున నోడిన వారు నారచీరెలుగట్టి యడవుల కేగుతఱి, దుస్ససేనుఁడు వీరిని దఱియ వచ్చి—మీరు చచ్చినట్టివారు; అడవులంబడి కడు నిడుమలఁ గుడువుం-డని యుద్ఘాటించి, వీరిపై పండతిలలు విసరిచల్లెఁగదా! మా దృష్టి దాటినంత నె, మీరు చచ్చితిరని యానందించి, ఆశౌచస్నాన మొనర్చి మైలవడుటను దీర్చికొందుమని నొక్కి వక్కాణించి పాండవులు తమ్మువీడి నాల్గుడుగు లిడినంత నె మృతాశౌచస్నాన మొనర్చి తడి యుడుపులతో నిలిచి పాపము దుర్యోధనుఁ డానందించి, తనభ్రాతృ వర్గమును, రాణివాసమును, దక్కంగల జ్ఞాతివర్గమును, స్నాతులుగ నొనర్పఁగా లేదని యిన్నియు నెఱింగిన నీవు మాత్ర మనఁగలవా? అనంతరము ధర్మజాదులంగూర్చి ప్రసంగము వచ్చినపుడెల్ల మృత కళేబరములంగూర్చి మాట్లాడి నట్లేకద యాతఁడు పలుకుచుండును! మఱియు వీరు వీరి సర్వస్వము నోడిన పిదప, మఱియు నొడ్డ నింకేమి కలదని ధర్మజుండనుకొనుచుండ,—నాలినొడ్డు—మనిమీసౌబలుండన లేదా? ఇట్టివియెల్లఁ బాపము వీరిమనములగాటముగ నాటుకొనియుండఁ 'బోరుగాక వేఱేమగు!' నని, నీతో ననవలసియే యున్నది. అట్లగుట నిప్పటికి ధర్మజు ధోరణింజూడ నీ వచ్చిన కార్యం బశక్యంబని తోచెడిని.

"ఇఁక నీవు పాండవులను గర్మరాహిత్యమును బొందుమను నూహాను బలికిన పలుకులందలంతుమన్న నదియొక పెద్ద విషయము. వైరాగ్యమువలన ముక్తులగుదురని కొందఱందరు—కాని సంసారమున నున్నవారికి, ముక్తికిఁ బెక్కు దారులు పెద్దలు చూపిరని నీ వెఱుంగవోటు! వైరాగ్యంబన నది మీదిమీఁది యన వాటంబుగాదు;

కర్మానుష్ఠానంబునకుంగాని దుర్బలులు వైరాగ్యంబె యభివర్ణింతురు. కాని కర్మము వలననె సృష్టియంతయు నడచుచున్నదని యెరుంగమిం గద నెంతెంత ముప్పునకైన పాలు బడుచున్నది. కర్మప్రభావంబు సిద్ధించుటచేత నేకద దివిషదులు దేవత్వమందుటయు, గాలివీచుటయు, నగ్ని వెలుఁగుటయు, విధువు పక్షములు మార్చుటయు, నదులు ప్రవహించుటయు బొసఁగుచున్నవి. అనుల్లంఘనీయమగు కర్మమది యెంతో బలవత్తరమైనదియు గాకుండిన, దానెంతటి సమర్థులైయున్నను నీ పాండవు లింతకాలమును కర్మమునకుఁ గట్టువడియెఁగదా, యిన్ని యిడుములఁ గుందుచు, రాజధర్మము లెఱింగియుంగూడ, తమకుఁరాఁ దగిన రాజ్యభాగంబు కౌరవులు మొదలంట ద్రోచుకొంట చక్కఁగ నెఱింగియు, నింకను వీరు మీఁనమేషములు లెక్కించుకొనుచునుం గూడ వేచియున్నారు. కాని సంజయా, కంటికే కావరాకుండ దొంగిలించిన వాఁడును, నెట్టయెదుట నిలిచి బలాత్కరించి సంపద నపహరించిన వాఁడును, వీరిరువురును నిందార్హులేగాన్ని, మీ ధార్తరాష్ట్రు లీ రెండు తెగలలో నేతెగలోనివారో నీకును దెలియదో!

“ఇక నీ మృదూక్తులచే నీవు మెత్తపడకున్నను, నీ కార్యంబశక్యంబెయైనను నేను పాండవులను ప్రార్థించినైనను, కౌరవుల కడకువచ్చి, కౌరవులకు బుద్ధులు చెప్పి చూచెదను. లోక కళ్యాణకరముగ వారలు పాండవులకుఁ జెందఁదగిన రాజ్యభాగంబు వారికొసంగిరేని, మృత్యుపాశములనుండి తప్పియుందురు. ఇందుఁ దగవును నేర్పును నామీఁద నిలిచియుంట, నాకుంగీడు లేదు. అన్యాయ విరహితమై లోకకళ్యాణ ప్రదమై శుభంకరమగు నా పలుకులకు వా రొడంబడక కేరడము లాడిరయేని, వారిలోభమను చిచ్చు నలుఁగడల రేగి, వారినే భస్మము చేయందగు. ఇందుకుఁ బాండవ బాణాగ్ని యవసరమే కానరాదు. కాని కలయికమనికియందుఁగల

గౌరవమును బ్రయోజనమును గౌరవులకుఁ దెలియుటయే తొలితొలి మనకుఁ దేటతెల్లము.

"ధృతరాష్ట్రుండును బుత్రులునునను వనమునఁ గుంతీపుత్రులు సింహములు కారా? సింహములు లేని వనము నెవరు కొట్టుకొని పోవరుగనుక? వనావృతముకాని సింహములు మాత్రము సేమమున నుండఁగలవా? కావున వారును మీరునుం గలసి పొందికతో జీవించుట మేలని నేను స్వయముగఁ జెప్పఁ బూనుదును. సంజయా! పాండవులు కౌరవులకుఁ బరిచారకులై యుందురు. శత్రుకోటి నెదుర్కొని తెగటార్పఁగలుగుదురు. అట్టి వీరిని ననకొడుకులతో సమముగఁ జూచుకొనుట ధృతరాష్ట్రున కెంతయు నొప్పిదము కాదా! ఆతఁ డొప్పినను, నొప్పకున్నను, నే నీపని కటకు స్వయముగ వచ్చెదను. అందువలన నే మేముఖ్యాతి గడింతుము. కావున మా మతమెల్ల నమ్మానవనాధునకుఁ దెల్లము సేయుము.

సంజయుఁడు:—అట్లయినంగడు లెస్స; నావచ్చిన కార్యంబు దీరినది.

భీమార్జున నకుల సహదేవ సాత్యకి ద్రుపద విరాటాదులం జూచుచు "మీయందఱచే ననుజ్ఞాతుండను. పోయివచ్చెద. నా యిపు డాడిన పోడిమి యందేమియు ననుచితములును, ననయములును, ననభ్యములును, ననందర్భములునునగు పలుకులు లేవుగద!'' యని సంజయుండు లేచి నిలువంబడియెను.

ఈ చివర పలుకులువిని పాండవాగ్రజుండును "నీ విపుడాడిన పలుకుల యందేమి యనయము లుండగలవు? ఒక్క మాటయైన ననుచితమైనది లేదే! నీవు చెప్పినట్లుగాక, యింకెట్లు చెప్పనగును? ఎదిరినిగూర్చి యున్నది యున్నట్లు చెప్పుటకు నీవు జంకవు. సహజముగా నీవు దుర్ణయములును, గఠిన భావములు గలవియును, వర్ణాశ్రమపరిక్షితధర్మములకు విరుద్ధములును నగు పలుకులు నీ నాలుకకు రానేరవు. వ్యాసశిష్యుండవును, నయోన్నతుండవును

నగు నీవు గానిచో నయవిదుండగు విదురుండు గావలె—నిట్టి పట్టుల వేఱొకరు రాఁగలరా! ఈ విషయము నీ నేర్పు నింకొకరి కలవడఁ గలదా?

“ఇంత కేమి గాని, నీ వటఁ జేరిన పిదప నాకుఁ గడుంగూర్చు వారగు గురుకృపపితామహాదులఁ గాంచి, నా నమస్కారములు వారికిఁ దెలియఁజెప్పి వారి సేమ మడిగితినని శ్రుతపఱుపుము.

ప్రకృతిదుర్లలితుండును, నాజన్మపాండవద్వేషియు, నైశ్వర్యమదమత్తుండును, క్రూరపరాక్రముండును, దురుద్యోగియు, నగు దుర్యోధనుని యోగము నరసితిననుము. అతని తమ్ముఁడే యనఁదగు నా దుస్ససేనుని కుశలము నడిగితినని నుడువుము. వారి కుమారవర్గము యొక్కయు, వనితాజనంబుల యొక్కయు, సౌఖ్యము నెఱుంగఁ గోరితినని పలుకుము. సకల కష్టదశలయందును భగవంతుంబోలె జనకునింబోలె మమ్మరసిరక్షించిన విదురునిఁ బ్రశంసించితిననుము శల్యుంజూచి, మా తాతనిదెస ననయము గల వినయము దెలిపి, తానమాకు విజయమూల మని తెలిపి, మా యందలి భక్తియుఁ దెలుపుము. ద్రోణసుతుం గౌఁగిలించితిననియు, బాహ్లిక సోమదత్త భూరిశ్రవః ప్రముఖుల నెల్లయెడల మా యెడదలఁ దలంచుచుందుమనియు, వంశవంతులును వయోవృద్ధులును నగు ధరణిపతులను, కర్ణ, శకుని, సైంధవాదులను, మిగిలిన రాజకోటిని, యుద్ధసన్నద్ధులై గౌరవులకుఁ దోడువచ్చిన సకలవిషయాధిపతులనుం గూడఁ జూచి, వారి వారల ప్రణామవినయబాంధవమైత్రీవాత్సల్యంబులకు నెట్లెట్లు తగుదురో యాయావిధంబుల నా మాటలుగా నీవు సంభాషించి, పలుకుము. నీవు పోయిన మొగాననె కురుపతికడ నుడువఁదగినది చెప్పియే యుంటిని.

పిదప నిండుకొలువునందు మాయయ్యతో నిట్లనుము.

"కురురాణ్మణీ, నీ యాశీఃపరంపరలబలంబునఁ, బాండునందనులు కదాప్త బంధుజనసహితంబుగ సుఖముగనున్నారు. పాండురాజ రాజ్యాంతమునఁ దత్సుతులను నిలిపి, చిరుతప్రాయమునుండియు, వారికి రాజ్యామేలెడినేర్పు నలవరింపఁజేసి వారికిఁ రాఁదగినదని నీకుఁదోఁచినపదవులిచ్చివారినిఁబ్రోచియు, నీనాఁటికి వారియెడ నుపేక్షఁజేసి, దయావిహీనుఁడవై, పాండుసుతులు కూటికినిగుడ్డకును వెలియయి వారు పొందరాని బదవలఁబొదలుచుండఁ, జూచుచు నూరకుండుట నీకుఁదగునే? మనకుఁబడనివారికి గుండెగాలమై యుండునట్లు, మన రెండు కుటుంబములవారును గలసి మెలసి వెలయుట లోకకళ్యాణకరము కాదా?"

అని పిదపఁ బితామహుంజూచి యిట్లనుము:—

"ఓ మందాకినీ నందనా! అపుత్రుకులైనవిచిత్రవీర్య, చిత్రాంగదులయనంతరము-అడుగంటిపోవుచున్న శంతనుని యన్వయము నట్టియడఁగిపోనీయక, మరల నీబోధనవలన—శంతను నన్వయమును నివహింపొందఁజేసి, మేమెల్లరమును జననము నొందఁజూచి, యిపుడు నీ పౌత్రు లిట్టులధర్మమునకును, లోకపునడికిని, బాల్పడియున్న సమయాన వారికి సద్బోధనముచేసి రక్షణనొసంగినచో, భూజనంబులును, భూసురులును, భూజానులును నినుమెచ్చుకొనరే! ఇంతలు పుట్టినను, నౌదార్యమును, సహనమును బ్రధానాలంకారములుగాఁగల ధర్మజుఁడు యుద్ధసంపర్కము కోరఁడు సరిగదా; యుద్ధము మాటయైనను వినసహింపఁడుసుమా—"యని యాసభఁగల బుధజనులెల్లరును, వినునట్టుల నుచ్చైస్స్వరమునఁ బలుకుము. మఱియు నదే సమయమున నా సభనున్న వారందఱును వినునట్లు సుయోధనునితో నిట్లనుము:—

'బాహుబలమున నీకుఁదీసిపోవని మమ్ము సామాన్యజనముగా నెంచి; బలహీనులను వెడలఁగొట్టినరీతిని వెడలఁగొట్టిన యప్పటి

దుర్మానమిశ్రితమగు నీ నిరంకుశాధికారపు వెఱ్ఱితనమును దన విశాల హృదయముతోఁ బాండవాగ్రజుండు సైరించె;

'వంచనచే మము నడవులకనిచి దుర్గమారణ్యములను, గొండ చఱియలను బెద్దకాలము వేధించిన యలనాఁటి నీ కఠినతను, నీ యెడఁ జాలిగఱంగు హృదయముతోఁ బార్థుండు క్షమియించె;

'నిండుకొలువునఁ బాంచాలినిఁ దలపట్టి యీడ్చి నలుగుర ముంగటికిం దెచ్చిన తన తులువఁదనమును భ్రాతృభావంబున నిండిన సదయహృదయముతో వృకోదరుండు సహియించె;

'నీ దురుసుఁదనంపుఁబలుకులను, గార్యములను బాండుపుత్రులొక్కరొక్కరె నిన్ను క్షమియించిరి కావున నీకనైనఁ గురువంశీయులందఱి నాలమున నెట్టి దిగమ్రింగికొనక నొరుల సొమ్మున కాసపడక వారిదివారి కొసంగి వారును మీరునుంగలసి క్షీరోదక న్యాయమునఁగూడి జీవింపుఁడు—'

అని మోమోటమికోఁడని వాఁడవు గాన నీవు మరవక పలుకుము. మేము యుద్ధము కోరము; తనతోఁ బొందికతో జీవించుటయే కోరుదుము. తనకుఁగల దురాశాపిశాచము, దుర్మానపిశాచము, దురహంకారపిశాచము, నను నీ పిశాచత్రియబల మత్యధికమగుట నే నింతదూరము చెప్పవలసివచ్చినది. తనపక్షమున నున్న యోధాగ్రేసరు లెంకెటనైనను లేకుంట సత్యమేటియైనను, ధర్మమును, గృష్ణుండును, మాకుఁ జేదోడు వాడోడుగనుండ, మముఁ గెలువ నేరికిని సాధ్యము కాదు. భీమసేనాదులకును దుర్యోధనాదులకును నేను బెద్దవాఁడనగుట, వీరును వారునుం గలసి నాయభీష్టమునకు భంగము వాటిలనీయక, యింకను నన్యాయాసము పడనీయక, కయ్యములు మాని యెవరి యర్థము వారనుభవించుచు, వారును మేమునుం గలసి కడమ

కాలమైనను బుచ్చుట, మనకును మన పెద్దలకును, లోకమునఁగల బుద్ధిమంతులకునుంగూడ పరితోషము కాదె!

మాకు రాఁదగిన దంతయు నొసంగ నొల్లక యింకను లోభోపహతుండయ్యెనేని, (1) కుశప్రస్థము (2) వృకస్థలము (3) మాకంది (4) వారణావతము నను నీ నాల్గు తావులును నింకొక్కటి యొండైనను నిట్టైదు స్థలములును మా యైదుగురకు నొసంగి మము మననిమ్మనుము. ఇట్లయిన మనవంశమ్మునకు యశమ్మును దెచ్చినవారగుదురు. శత్రురాజులకుఁ బ్రాణగొడ్డములమైయుందుము. మఱియుఁ గురుయాదవ పాంచాల మాత్స్యసమ్మేళనము పరస్పర ప్రేమాస్పదమై, దిగంతవిశ్రాంత కీర్తివంతమై నెగడఁగల దని యమ్మహాత్మునకుం దెలియఁజెప్పుము."

—కృష్ణుఁడు—

[తనలో] అన్నా! ఎంతవాతప్పొనర్చె నీ ధర్మజుఁడు? సైఁచి సైఁచి, తుట్టతుద కొక లేఁబలుకు పలికి గొంతుమీఁదికిఁ దెచ్చుకొని, తన్ననుసరించియున్న వారింగూడ శృంఖలాబద్ధులం జేయుచుండును. రాజసూయము నొనరుపఁజేసి, తననుబెద్దఁగ నందఱంగీకరించునట్లొనర్పఁ జేసి, తనయుద్ధతి సిద్ధాంతపరుపఁబడిన పిదప, భ్రాతృవర్గమె యగుఁగాక, క్షాత్రధర్మమె యగుఁగాక, జూదమునకుఁ బిలిచిరిగాయని పోకుండ నుండరాదని క్షాత్రధర్మవిరుద్ధమని, తలంచి జూదమాడుటయే మొదటి పొరపాటు; తన్మూలమున నొదవిన యగచాట్లనుభవించియు, స్వరాజ్యమును గోలుపోయియుఁ గట్టకడను శాంతింపుండను సంజయుని రాయబార మిపుడా యనియైనఁ దలంపకయె మైదూళ్లిన నొసంగిన మే మూరకుందు మనుట తమయసమర్థతను వెల్లిగక్కు నీ ధర్మజుని ప్రత్యుత్తరము రెండవ పొరపాటు! జూదపుటాట నాపరోక్షమున నయ్యె నను కొందమన్నను, నా ప్రత్యక్షమున నింత

లేతపలుకుఁ బలికెనే యీ యుధిష్ఠిరుండు! సంజయుండిపుడువోయి, కురుసభ నీ పంచగ్రామసంధి వాకొనియెనేని, ధర్మజు మహాను భావంబు గుర్తెఱుంగక, యీపాండవుల నందఱ నలసులుగ నక్కార వులు దలంచి, పైపైఁ దలకొందురు. ఇందు కేమి సేయవలయు! ఇంకేమేమి వెలితిమాటలు వచ్చునోకద!

సంజయుఁడు:—యుధిష్ఠిరప్రభూ, దేవరయానతి నతిక్రమింపక, య ట్లనె మనవిసేయుదును. నీకును, దమ్ములకును, వాసుదేవు నకును నెట్లు ప్రియం బట్లె జరుగుంగాక !

అనుచు సంజయుండు ధర్మజునకు నమస్కరింప, ధనంజయుండు సంజయుదెస నవలోకించి,—

“సంజయా! నీవు మాకును బాలసఖుండవు; నీ మంచితనము మే మెఱుంగనిది కాదు; శైశవలీలల కాలమునుండియు, వారిదుశ్శీలత నీ వెఱుంగనిది కాదు. కౌరవసభలో నానాఁడును, మా యారణ్యా వాసకాలమునాఁడును, నిచ్చట నీ నాఁడును, నియ్యాజాతశత్రుని కృపాపహార్ద్రాంకుశ మా మత్త గజేంద్రాకృతియైన మా భీము సంరం భము నాపివేయుటకుఁ దగినంత దయియుండ ధార్తరాష్ట్రుల కేలనో కద నీతిమార్గావలంబనమును, శాంతాత్మయును గలవారలకుండఁదగిన విచారక్లేశములు!”

ధర్మ—ఇపుడా ప్రసంగముతో నేమిపనియోయి ఫల్గుణా! కారణ కార్యము లెఱింగిన సంజయుని సత్కరించి, సగౌరవంబుగ వీడ్కొలిపి, సంజయునిచేఁ గాఁదగు కార్యంబును బ్రతీక్షించు టయె మనకిఁకఁ గర్తవ్యంబు—

కిరీటియుఁ దన యన్నయాన సంజయుని సత్కారపూర్వకంబుగ సాగనంపి, మరలివచ్చి, తన యన్నగారితో మఱల సంభాషించుటకు బ్రారంభించెను.

అర్జు—భవదాజ్ఞాబద్ధుఁడనై సంజయు సంపకము నెట్టి వచ్చితిని గాని, యీ సంజయుని రాయబారపుఁ బరమార్థ మేమియని ?

కృష్ణ—ధనంజయా, సంజయుని సంభాషణమంతయు సాంతముగ వినివిని కూడ, నిట్లడుగుచున్నావేమి?

అర్జు—ఆతని సంభాషణములో మాభూభాగము మాకిచ్చుమాటే లేదే!

కృష్ణ—అంతవఱకైనను గ్రహియించితివి కద చాలును— ధార్తరాష్ట్రులు మీకీయరుగనుక మీసంపద మీరొందు తలంపున, మీరుపోరాదఁ జేసినచో, నేతన్మార్గమున మీ కొదవెడు రక్తపుఁగూడుకూడదనియు, మీకు దనసన్నము లేదంటిరేనిఁ భికిర మెత్తుకొని జీవింపుఁడనియు, మీకు నచ్చఁ జెప్పుటయే సంజయు పలుకులకుఁ దలకట్టు.

— ధర్మజుఁడు —

"దేవకీనందనా, మనయర్జునుని పలుకులకేమిగాని, సంజయుని దేమి నేరము? యుద్ధమువలనఁ గలిగెడు జనక్షయమునకు నేనెంతఁ కుందుచుంటినో పాపము. సంజయుండును అంతియ విచారించుచు, మాది మాకిచ్చుటకుఁగాని, మాకు గ్రాసవాసముల కగునంతమైన నిచ్చుటకుఁగాని, దుర్యోధనుఁడు సమ్మతింపకుండుటకుఁదోడు తనతండ్రి మనకొసంగఁదలంచినను, నీయకుండఁజేయుచున్న దుర్యోధనునొప్పింపఁజాలక, సౌమ్యసంభాషణలకె మనసొగ్గెడు మనకడనింతకన్న మిన్నయైన యేతెఱంగున నెవరుమాత్రము సంభాషింపఁగలరు? సంజయుని తప్పేమి కలదందు? రాజులకు భిక్షాన్నము తగదుగనుక మనమొల్లకున్నాముగాని, సంగరమువలనఁ గలిగెడి ప్రాణహాని యెవరుమాత్రము మన్నింతురు? యుద్ధపుటూహ విసర్జింపఁజేయుటకు భిక్షాన్నమె మేలని సంజయుండును, సమరసన్నాహమే విరమించుటకుఁ గందమూల

ఫలాహారముననరణ్యవాసమే మేలని నేనును, నుపపాదించుచుందుము. మాయుపపాదనములలో నేమాత్రమును దోసములేమి యెల్లరెఱుంగుదురు; కాని యిప్పటి మాస్థితి కనుగుణమగు కార్యమేదియో నిర్వచింప సమర్థుండవగు నీవు మాయండనుండ మాకేమి కొదువ? ఇంతకును గార్యకారణము లెఱింగిన సంజయుండు కురురాజునెదుట నేమి ప్రసంగములు చేసి మనకాహవశ్రమం గలుగకుండం జేయునో, యేమి కానయి యున్నదో, చూడవలయునుగదా!

— ద్రౌపది —

"అన్నా, వినుచుంటివికదా! ఏమి కానయియున్నదో యింకను జూచుచుందురంట! తండ్రి పిలిచెనని ఇంటనున్న వారినిఁ జూదపుసభకు దోడ్కొనిపోయిన విదురుఁడింతలోనర్చెను? ఇఁకమిగిలినది సంజయు మూలమున నెఱపఁజేయఁ దలంచి, పాపమాతండ్రి తన సుతులలోఁ గొందఱిని మాత్రము భిక్షాన్నముఁ దిని జీవింపుఁడనియు, తక్కిన వారలు సామ్రాజ్యధురంధరులై యుండురనియు, నిపుడీరాయబారముంపెను. కాని వాసుదేవా, నేనొందిన యవమానమునకుఁ దోడు నే నిపుడింకను వీరివెంటఁ, జేతులజోలిఁ బట్టుకొని నెంతయభిమానము గోసికొనినను, దిరుగుటవలనఁ గలిగెడి యవమానము మఱి పొందఁ జాలను."

కృష్ణుఁడు—మనమిపుడేమియు ననఁజాలము. ఏమి కానయి యున్నదియు నిరూఢపరుపఁజాలము. మీయరణ్యాజ్ఞాతవాసాద్యవమానములును, దేశకాలపరిస్థితులును, వీరిమానసములును నేక కాలమునఁబరిపక్వతం జెందినఁగాని భావికార్యరూప మేర్పడఁ జాలదు. కావున నీవింకను నోపికసేయవలయును.

అని కృష్ణుఁడు యుధిష్ఠిరునివంకఁ దిరిగి యాతనికి మ్రొక్కి యనుజ్ఞాతుండయి నిజమందరమునకు వెడలెను.

రాయబారము

ఎనిమిదవ ప్రకరణము

మొదటి ఖండము

— విష్కంభము —

సంజయుఁడు తన రాయబారము నిర్వర్తించుకొని కరినగరమునకు మఱలుట-సంజయుఁడు మార్గమధ్యమున వేగు వానినిఁ గలసికొని సంభాషించుట- ధర్మరాజుశీల పరిశీలనము- పంచగ్రామసంధిసూత్రముపై వ్యాఖ్యానము-కౌరవ పాండవుల మానసతత్వ విచారము, పరిశీలనము, పరిశోధనము-కృష్ణుని శీలపరిశోధనము- రాయబారి విహితధర్మము.

పాండవులకడ ననుమతివడసి కరినగరోన్ముఖుఁడయి వెడలిన సంజయుఁడు కడు రయమునఁ దేరిపైఁ బోవుచుఁ గొంతదూరమేగుసరి కాతని దాపున నొకరుండు వచ్చి సంజయురథంబునాప సంజ్ఞఁజేసెను. తేరాగుటయు ఈనూతనాగతుం డాతని సమీపించి "సంజయా! ననుఁబోల్చుకొంటివా?" అని ప్రశ్నించెను.

సంజయుఁడు—నీ వెవరయినదియు నీ యాకారముచేఁ దెలిసికొంటిని. కాని బాహ్యవేషముచే నీవొక సారథివలెఁ గానవచ్చుచున్నను నిజమున నీవెవ్వండవయి

నదియు నేఁ బోల్చుకొనఁజాలకున్నాను. దుర్యోధను నానతిని, ధర్మజు నాజ్ఞను, దిరుగుచున్న వేగువారికి మితిలేకున్నది. నీవు ధర్మజు వేగువాఁడ వయ్యును దుర్యోధనునివేఁగనని చెప్పవచ్చును; కాక ధర్మజువాఁడనే యన వచ్చును. చెప్పుటల కెక్కడికి? ఇంతకును నాతో నీకేమి పని?

ఈ నూతనాగతుఁడు సంజయుని రథముఁ డిగఁగోరి యాతని చెవిలో నేమియో చెప్ప సంజయుండాతనితో "ఎంత సహజముగా నవతరించితివోయి నీకీసారథివేషము! నిను నీవు తెలుపుకొన్నంతవరకును నేను బోల్చుకొనఁ జాలకపోతిని. మా దుర్యోధనుని పక్షమునఁ బనిసేయుచున్న వారిలో నీకీ మారువేష మనుసరించినట్టి చిరుతల కమరుట యిప్పటికి నేఁజూడలేదు. సరియే-రమ్ము. హస్తినాపురమును గలసియే పోవుదము." అని సంజయుఁ డాతనితోనని యాతని రథంబెక్కించుకొని ప్రయాణము సాగించు చుండెను.

వేగు—సంజయా, రాయబారమునకని నిన్ను కురుపతి యిటకనుప నీవు ధర్మజునితో మృదువుగాఁ బ్రసంగింపక యాతని మాటలయే ప్రధానముగా నెంచితి విదియేమి ధర్మమయా?

—సంజయుఁడు—

"రాజ్యభాగమిమ్మని పాండవులు కోరుచుండ, భాగమిచ్చు మాటేమియు లేక, ఇత్తుననక, నీయననక, మధుర మధురప్రసంగములచే వారిననునయింపఁ జేయు మనిగదా నా కాజ్ఞయిచ్చెను మా కురుపతి! వారి వనవాసాద్యాయాసంబులు వోవు తెలియంగునఁ బలుకుమనినాఁడే కాని, వారి యాయాసం బడంగునంతవఱకైనను ఏమకడ నుండుమని కోరలేదు. అట్లగుటఁ బాండునందనుల ప్రవర్తనయందున్న సన్నకొన్ని ఘట్టములు గైకొని, వానికి 'పాండవుల దోషము' లను పేరొసఁగి, వారిని నిందించి వారినొకింత మానసమునఁ గ్రిందుపడఁజేసి, పదంపడి కౌరవపక్షదోషములెన్ని, వారినిం గూడ నిందించి, కట్టకడ ధర్మజుని శాంతాత్మత బొగడి యుద్ధమున నున్న శాంతి విరుద్ధమైన ముఖముఁ జేటుపఱచి, యాతని మహాప్రభువక్షేమము ననుసరింపఁ జేయవలెనుగదా! రాయబారి చేయఁదగినదియంతయుఁ జేసితిని; కాని కృష్ణుఁడొకఁ డటనుండుట నేమగునోయని నేను తొలినుండియు సంశయించుచునే యున్నాను.

ద్రౌపదిన్యాయనిష్ఠురముల కోర్వఁజాలక భీముండును, కుమారాస్త్ర విద్యాశాలల పరీక్షాసమయముననె యావహించిన ఈర్ష్యాకారణమున నర్జునుండును, కదనమునకే తన్నెంత బలవంతపఱచినను, సత్త్వగుణప్రధానుఁడై, శాంతియ పరమాభూషణముగాఁ గలిగిన పరమలౌకికుఁడగు ధర్మజుఁడును సమరము మానఁదలంచినను, దురాత్మనముతో సహామికతో నిరంకుశాధికారము వహియించిన దుష్టుల నెల్ల వధియింపనే కంకణముగట్టుకొనిన యదుకులభూషణుఁ డొకఁడే కొననిచ్చునా? శుష్కప్రియోక్తులతో, శూన్యహస్తములతో నాముఖమునఁ గబురంపెనే కాని యట్టి శూన్యోక్తుల కాతఁడియ్యకొనునని కొనియే నేనంతదూరము ప్రసంగించితినా? రాయబారమునకుఁబోవుచు, వివాదాంశముతో సంబంధించినవిషయము మాట్లాడుట కవకాశము లేనపుడు శూన్యోక్తులు పలుకవలసి వచ్చినపుడు శూన్యహృదయముగాక, యింకేముండును? తద్విషయ సంభాషణము జరుగవలసినపుడు వాజ్మ వైఁటప్రిజాలము తప్ప వేఱొండుండఁ గూడుటెట్లు! కనుకనే, నేనన్నివిధముల ధర్మజుం గొనియాడుచుఁ ధర్మజుని యహింసాజీవనమున కనుగుణముగు, హింసాయుతముగు, రక్తపూరితాన్నముకన్న బిచ్చపుటన్నమే నయమని యనవలసివచ్చినది కాని, రాజు లిచ్చువారే కాని పుచ్చుకొనువారు కారను సంప్రదాయమెఱుంగక కాదు నేనట్లుపపాదించుటకుఁ గారణము! పాపము నేనామాత్ర మెఱుంగ నని కావలయుఁ గృష్ణుఁడు, కర్మకరణవిభాగములం గూర్చిన సూత్రములఁ నాకుబోధింప బూనినాఁడు. ధర్మజుఁడిపుడు కురురాజుపయి దాడివెడలి జనక్షోభమును బ్రాణిహింసయు లేనుగాఁ గల క్రూరకర్మము లొనర్పఁగల కఠిన హృదయుఁడగుటనే దాదాపిరువది వత్సరములనుండి కురుకుమారవర్గముచే నన్నియిడుములును, నరణ్యాజ్ఞాతవాసాద్యాయాసములును నొందియుండుట పరమధర్మమని కార్యకారణ సమన్వయమును నపసవ్యముగాఁ ద్రిప్పిన హేతువాదసూత్రముచే ధర్మజుని మనస్సుత్రిప్పఁ బ్రయత్నించితినే గాని, నేనుమాత్ర మానందించి యట్లు ప్రసంగించితినా?

కాని యీ పరిస్థితులలో భిన్న భిన్న వ్యక్తులు భిన్నభిన్నాశయములతో నుంట నేదియుఁ బొత్తు పడకున్నది—

దుర్యోధనుఁడు కర్ణుని సాయమున బాండవులఁ గలనం ద్రుంపఁగలనను స్థిర బుద్ధితో నున్నాఁడు.

ఇఁక ధర్మరాజు పారమార్థిక చింతానిమగ్నుండయ్యును, పరమలౌకికుం డగుటను, జనక్షయకారకంబగు యుద్ధంబువలనఁ గలుగు నాఖండలుని పదవియైన నొల్లక, యుద్ధమునందుఁ బోనోపమి శాంతాత్మతయు, సంపద్విహీనులై యుండుట దినదైన్యము ననుభవించుటను, దిన దిన్నమును గట్టి గుడ్డయు లేమి నింకను నిడుములఁ బడనోపక స్వధర్మమా క్షత్రియధర్మము చెప్పిన బాహుబలంబున నష్టసంపదను గైకొన శౌర్య మానసికతయు, నిరుకెలంకులఁ గాఁగి యుండుటచే నేదియు నిర్ణయిం చుకొనఁజాలక యస్థిరబుద్ధితో నున్నాఁడు.

'ఇంత ధైర్యముతో నున్నాఁడుగదా నాకొడుకేల సమరమున జయింప నోపఁడు? జయాపజయములు లోకరీత్యాధీనములు కానపుడు ధర్మ రాజే జయింపఁగలఁడను నానుడియొక్క సందేహము!' నను బుద్ధియొక వంకను, పదపై నేరము నపవాదము నోపనుంచు మనసున్నట్లు పైపైఁ బలుకుచు, మనోభావంబును వాక్ప్రకారంబున నీకయు సేయలేని మనోదౌర్బల్య మొకవంకను, ధృతరాష్ట్రు నస్థిరునిఁగఁ జేసినవి.

కర్ణుఁ డర్జునునిపైఁ బగసాధింప నిట్టిదగు సమయము పోఁగొట్టుకొనరాదని రొమ్ముఁ జలంచి, దుర్యోధనునకు బాసటయై నిలిచి స్వామికార్యధురం ధరుండననియు జయము నాదనియు ధైర్యముఁ గొలుపుచున్నాఁడు.

కృష్ణుఁడు లోకకల్యాణ మొనరఁజేయు కార్యార్థియై, తాఁ దలంచిన కార్యము పట్ల సుస్థిరబుద్ధితో నున్నాఁడు.

కర్ణాదులచేఁ దామోడిన యుత్తర పాంచాల మెల్ల మున వారలఁ గైకొనుట కింతకన్న మిన్నయగు సమయము లేదుగదా యని పాండవులను యుద్ధమునకే పురికొల్పుచున్న ద్రుపదరాజు సుస్థిరబుద్ధితో నున్నాఁడు.

ఇదియిట్లుండఁ బాండవకౌరవుల ప్రవర్తనలలో నొక ప్రధాన భేదము విస్ఫుటముగఁ గానవచ్చుచున్నది—

స్వార్థము నే చూచుకొనుచు ప్రవర్తించువారు;

పరార్థము నకు భంగము రాకుండ చూచుకొనుచు ప్రవర్తించువారు;

స్వార్థపరార్థముల సమముగ నెఱిఁగి యుక్తి యుక్తముగఁ బాలించుకొనుచు లోకకళ్యాణప్రదమానటులఁ బ్రవర్తించుచుండువారు;

ఈ ముత్తెఱంగుల వారును నిపుడీ కురుక్షేత్రమునఁ జనఁగొని యున్నారు:—

పరార్థవినాశముచేతనైనను, తమకు లభ్యమగు స్వార్థమునే ప్రధానముగ జేసికొనుచున్న ధార్తరాష్ట్రులోరుల మందలింపుల వినఁదలంపకుండుటచే, వినాశము నొందెడు సూచనలే కానవచ్చుచున్నవి;

స్వార్థవినాశము చేతనైనను లభ్యమగు పరహితమును ప్రధానముగ జేసికొని ప్రవర్తించుటచేత పాండవులు, ప్రతిపక్షమందును సంశయమనస్కులై కడునిడుమలం బడుచుండుటచేఁ దమ్ము నడిపింప గృష్ణుని సారథ్యము గోరుకొనవలసి వచ్చినది;

లోకకళ్యాణమునకై, స్వార్థ పరార్థములకు భంగము రాకుండ తమ్ము నడిపింపఁగల శ్రీకృష్ణుని యుద్బోధన వలన యుధిష్ఠిరుఁడు స్వార్థమునుంగూడ గమనించి యుద్ధోన్ముఖుఁడైనచో నాతని మతిమరల్పఁగల వారుండఁ జాలరు.

ఇంత యెఱింగియేకద, వశీకృత చిత్తుఁడౌ ధర్మజుని సహజ క్షమాగుణమును మఱింత బలపరచుటకు రుధిరాన్నముకన్న భిక్షాన్నమె మిన్నయని యంటినేకాని పరధర్మమును లోకకళ్యాణప్రద ధర్మముగ మార్పఁగల కృష్ణుని యెదుటనా నాకార్యకారణసమన్వయసూత్రము!

శుష్కప్రియోక్తులతో నాముఖమున రాయబారము నెఱపఁజేసెనుగదా యని యీ కురుపతి చెప్పిన సూత్రము నాధారముగఁగొని, వారికిఁ జెప్పవలసిన మాటలు చెప్పితిని. నా పలుకులవలన నెంత ప్రయోజనము కలుగవలె నంతప్రయోజనమును గలిగియే యున్నది. ఇఁక వీరినుడు లాకురుకథను నివేదింపవలసి యున్నది. ఇచట నీ పాండవుల సమక్షమున నేవిధమున నిట్టిపట్లు రాయబారి పలుకవలె నవ్విధమున నెట్లు పలికితినో, యదేవిధమున నా కౌరవుల యెదుటనుంగూడ నెట్లుపన్య

సింపవలె నట్లొనర్చి, యుద్ధమువీడి, పాండవులకింత యిచ్చునట్లొప్ప సంభాషించి ప్రయత్నించి చూచెద. ప్రయత్నమే పురుషకర్తవ్యముగాని, ఫలవిశేషములో పురుషునకు నిమిత్తములేదు. కావునఁ గౌరవులా పాండవులకు భాగ మిచ్చు కార్యమున కెంత మూర్ఖత వహియించినను, రాయబారిగఁ బోయిన నేనుమాత్రము నా కార్యము విహితమార్గమున నెరవేర్పక మానరాదుకదా !”

వేగు:—మీ రెంతొ డనను నంతయు నాడితిరని నే నెఱుంగుదును కాని మీతో ధర్మజుఁడు నెఱపిన ప్రసంగమున నింద్రప్రస్థమో, వేఱొక పట్టణమో తమ కొసంగుమని యని, తనకు వారియైదుగురకును నైదు తావులిమ్మని యూరకుండక, యా యైదుతావులను బేర్కొనఁబోయి, నాల్గింటిని జెప్పి యైదవది యెచ్చటనైనను సరియేయని యనియెనే! మొదట నట్లు కోరుటయు, పదంపడి మరియొక తెన్నునఁ గోరుటయు, నాకేమియు సుబోధకము కాలేదు.

— సంజయుఁడు —

“నీ వడుగఁదగినదియే యడిగితివి. కాని నేనెంతవఱకు సరిగాఁ జెప్పఁగలనో నాకే సంశయముగనున్నది. ఏది యెట్లున్నను విశాలమై గంభీరమై సామాన్యముగ సంచలనము నొందని మహాసముద్రమువంటి ధర్మజు హృదయము నెఱుంగుట మహాకష్టతర కార్యము.

“నేను ధర్మజుని దర్శింపఁబోయినది మొదలు నే నాతనికడ సెలవుగైకొనువఱకును నడచిన ప్రసంగము లన్నియును క్రమముగా నీవు వినియుంటివా ?”

వేగు:—అందువలననే మిమ్మిట్టుల నడుగవలసివచ్చినది.

సంజ:—ఆతఁ డింద్రప్రస్థమిమ్మని యడుగునప్పటికి నాతో కృష్ణుఁడు పలుక నారంభించినాఁడా?

వేగు:—లేదు; కృష్ణుఁడు మీతో మాటలాడుట కారంభించుట, యుద్ధము క్షత్రి ధర్మమగునా కాదా యను ప్రశ్నము వచ్చిన పిదపనెగదా!

—సంజయుఁడు:—

“కృష్ణుఁడు జోక్యము కలుగఁ జేసికొనకపూర్వము తమకు ధృతరాష్ట్రుఁడొసంగిన యింద్రప్రస్థము మాత్రమే కోరినాఁడు. కృష్ణుఁడు జోక్యము కలుగఁజేసికొనిన

పిదప వారియైదుగురకును నైదూళ్ళి మ్మని కోరుచు కుశస్థలము-వృకస్థలము-వాసంతి-వారణావతము-నని నాల్గూళులపేరులు చెప్పి, యైదవది యేతావునకైన నిమ్మను మనికోరినాఁడు. అట్లొకస్థలము మాత్రము తాఁ జేర్కొనక యూరకుండుటలో-ధార్తరాష్ట్రులిచ్చు మచ్చేరయైనచో-'మేమనుభవించుటకొసంగినదియు, చిరకాలము మా యనుభవమున నున్నదియునగు మాయింద్రప్రస్థము మరల మాకొసంగకుందురా! అదియే యైదవతావేల కాఁగూడదు!' అని తలంచి మొదటనే పేర్కొనిన యింద్రప్రస్థ మొక్కటియొసంగిన నూరకుందునని తెలుతననిన యాలసర్మసుతుఁడు—తన యభిమానపుబలుకులతో కృష్ణుఁడు—"పాండవేయులను ప్రార్థించియైనను నేను గురుపతికడకువచ్చి బోధించినను పాండవులకు రాజ్యమునఁబాలొసంగరేని మృత్యుగహ్వరమునఁబడుదు" రని చెప్పుదునని పలికిన పిదప, కృష్ణుని సహాయ మనాహూతమయి లభ్యమగుచుండు నీ తరుణమేల పోఁగొట్టకొనవలెనని ధర్మజుఁడెంచి—మాకైదుగురకును నైదూళ్ళు లిచ్చినఁ జాలు ననియుండును.

"తమ్ముఁ గౌరవసభ కనుపుమని ధర్మజుని తనకుఁదానుగాఁగోరుట సముచితము కాదనితలంచి, కృష్ణుఁడు నాతో ప్రసంగించుచు, తత్ప్రసంగానుసరమున ననవలసి వచ్చుట నట్లంటిననుకొనుటకో యవ, ధర్మజునకాయూళ్ళ నొసంగెను. ఆ ధర్మజునకా కృష్ణుఁడే సరి.

"ఇంద్రప్రస్థము, వృకప్రస్థము, జయంతము, వారణావతము మొదలగునవి కోరుటలో నాయూళ్ళవులఁ గౌరవులు పాండవులకు నెరపినవిషభోజనము-లాక్షాగృహదహనము-ద్యూత సభాప్రవేశాదికములు దుర్యోధనునకు జ్ఞప్తికిఁ దెచ్చుచు నాతని నెత్తి పొడుచుటకో యనిశ్చయనవచ్చును కాని అంతకన్నను బలవత్తరమయిన యితర రాజకీయములగు కారణములు కానవచ్చుచున్నవి."

వేగు:—నే నాకారణములు వినవచ్చునా?

సంజ:—నీవు కారణములు వినుటయం దేమి తప్పుగలదు! ధర్మజుఁడనగా లేనిది-నీవు వినఁగా లేనిది-ఆయా పలుకులయం దిమిడియున్న భావగర్భిత కారణములు గంభీరస్వభావుండగు ధర్మజుం డూహించియే పలికెనని మన మనుకొనుటయందేమియు దోషము కానరాకున్నది.

“కృష్ణుఁడు ధర్మజుని బ్రార్థించినంతనే గర్వభంగము చేయుదునని నాతో ననినంతనె తత్పూర్వము నేనాతని నోనాడిన న్యాయనిష్ఠురములచే కించిన్మ్లానత నొందిన మానసమున కొకింత యూరట దొరకెగా యని సంతసించి యిదియె యవసరమని యెంచి తమ యైదుగుర కైదూళ్లు నిమ్మనుచు నాకంటిని జేర్కొని యుపప్లవానిం జేర్కొనక యదేలకో తనచేఁ గోరఁబడిన యింద్రప్రస్థమునె వాంఛించి యుండెనో పు! ఇంతకును మున్న యింద్రప్రస్థమును దాఁ గోరుటయం దేమి ప్రాతిపత్తి కలదు? కాని తాఁ జేర్కొనిన నాలుగు తావులలోఁ దొలుదొలుత కుశస్థలమునే వచియించుటలో ధర్మజునకొక ప్రత్యేకపుటూహ యుండియుండకపోదు. పాండవు లజ్ఞాతమున నున్నకాలమునఁ గర్ణుఁడు తనదిగ్విజయమున యాదవుల నెదిరించి కుశస్థలీ—మధుర మున్నగు తావుల జయించి కురురాజ్యమునకుఁ జేర్చుటను, కుశస్థలిని మన కర్ణుఁడనుభవించుచున్నాఁడు. యాదవౌత్సుక్యమునకును, యాదవోద్ధరణమునకును తనజీవితమె ధారవోయుచున్న కృష్ణుఁడిప్పటికి పౌండ్రకవాసుదేవునితోఁ బోరాడుచుండుటం జేసిగాని, కానిచో కృష్ణుడు కర్ణునిజృంభణంబునకు సహించునా? యాదవ దౌర్బల్యమున కోర్చునా? ముఖాముఖిగాఁ గాకున్నను కర్ణుని ప్రతిఘటింపక పోవునా? కర్ణునిచే నానాఁడట్లు కొలుపోఁబడిన కుశస్థలినే తొలి కోరుటయందు కృష్ణుఁడానందించునని గాని లేక యీ పంచగ్రామసంధికి కౌరవు లొడంబడిరేని తనపూర్వలఘున తనకు లభించు నీ కుశస్థలము యాదవులకొసంగు తలంపుకలిగి కాని కోరియుండును. అనంతరము కోరిన మాకంది వారణావతము లొకప్పుడు పాంచాలురనుండి కైకొనిన ప్రదేశములు కావా? వానిని మా ద్రోణాచార్యులవారును మావారును అనుభవించుచున్నారు. అట్లగుటఁ గర్ణునసుభగంబున నున్న కుశస్థలమును, ద్రోణునసుభవమునన్న మాకందీ వారణావతములును, మా దుర్యోధనుఁ డెట్లొసంగఁగలఁడు? కర్ణ ద్రోణుల బలాత్కరించి యీ ప్రదేశములు వారివారినుండి కైకొని పాండవుల కొసంగుటయే తటస్థించినచో, మన రాజుపక్షమునఁ బనిచేయుచున్న ప్రధాన వీరులకు మన రాజునెడ నసూయ కలుగుటకు హేతువే యగును. అట్లపట, ధర్మజుఁడు కుశస్థలమును మాకందియు వారణావతమును గోరుట కృష్ణాది యాదవులకును ధృష్టద్యుమ్నాది వీరులకును నుత్సాహము పుట్టుటకును, కౌరవులలో నంతఃకలహము

లందయించి ప్రధానవీరులగు కర్ణ ద్రోణులకు మా రాజుపైఁ గినుక జనింపఁజేయుటకును, గురిచేసి యడిగిన యూహలుగా యివి యని గూడ దోఁపఁజేయుచున్నవి.

ఇంకొక చిన్నవిశేషము చూడఁ గానవచ్చుచున్నది. మా కురురాష్ట్రములోనిది కాదు వారణావతము! మా రాజుతోఁ బాండవులు కలిసియున్న కాలమునఁ బాంచాలీ పరిణయమునకుఁ బూర్వము ద్రుపదుని మీదికి యర్జునుఁడు పంపఁబడినయప్పు డర్జునుఁడు ద్రుపదుని జయించిన తోడనే అర్జునుతో ద్రుపదుఁడు చేసికొనిన సంధినియమముల ననుసరించి అహిచ్ఛత్రము అను రాజ్యమును అర్జునునకు ద్రుపదుఁడొసంగ నద్దాని నర్జునుఁడు ద్రోణునకొసంగినాఁడు. అహిచ్ఛత్రమునకు రాజధానిమాకంది. ఇది గంగానది కుత్తరదిశనున్నది. అర్జునుఁడద్దానిని ద్రుపదునకిచ్చివేసినాఁడు. ద్రోణుఁ డిపు డద్దాని ననుభవించుచున్నాఁడు. తనకు మామగారగు ద్రుపదుఁడద్దాని నింతకుఁబూర్వమే తనమూలమునఁ గోల్పోవుటచేతను, ద్రుపదుఁ డిపుడీ సమయమునఁ బాండవులకు సాయమొసంగుచున్నాఁడు గావునను, మాకంది తనకు రాజొసఁగినచో మఱల నద్దాని నా ద్రుపదున కొసంగనూహాయు ధర్మజుఁడొందియుండనోపు! అట్లు యాదవులకుఁ దమ కోల్పడిన కుశస్థలియు, పాంచాలురకుఁ దారు కోల్పోయిన మాకందియు, నొసంగుతలంపే యమనందనునకు లేకయుండినచో వారలూరక పాండవులకు సాయముఁజేయుటకుఁ గతంబుండదు. ఔదార్యముగల వారు తమసేయు నుపకృతికి ప్రతిఫలమపుడే కోరకున్నను, కార్యానంతరమైనను దమకొసంగఁబడుదానిని స్వీకరింపకపోరు. అట్లగుట నిట్టియూహలు ధర్మజునకుండియుండు ననుటకును దావులేకపోలేదు. కాని తొలుతఁ దనకొసంగఁబడిన ఇంద్రప్రస్థముఁగోరియు మఱి దానినిఁజేర్చక కుశస్థలము మాకంది వారణావతాదులఁగోరుటయందు దనకుస్వలాభాపేక్ష యంతగ లేదనిగూడ స్ఫురింపఁజేయుచున్నది. కుశస్థలముతనయందభిమానమువహించినయాదవులకిచ్చివేసి మాకంది వారణావతములఁ పాంచాలురకొసంగివేసినచో నిఁక దనకు మిగిలినదేమి? ప్రాముఖ్యలేశముగల వృకస్థలమును, మనవారొసంగినచోఁ దొలి తన యనుభవమున నుండిన ఇంద్రప్రస్థమును, మాత్రమే కదా! అట్లగుట నొకరికిచ్చివేయుటయే ప్రధానకార్యముగా నెంచి స్వలాభాపేక్షకూడ లేకుండఁగోరిన యూహలుగా యవి యనిగూడఁదోఁపఁజేయుచున్నది.

ధర్మరాజుంగూర్చి నేనెఱింగినంతవఱకును బరిశీలింప మఱియొకవిశేషము గూడ స్ఫురించుచున్నది.

తాఁ జేర్చుకొనిన నాలుగుతావులును తనతమ్ములకు నల్వురికును నయ్యెనని చెప్పి, తనకుఁ దనకేమియు లేదేయని యుంకువును జూపఁజేయుచు, తోఁగి దాఁ గోరిన నింద్రప్రస్థము మనసార వాంఛించియుండెనో ఫు.

ఇన్నివిధముల నిన్నితెన్నుల నా ధర్మజుఁ బలుకుటలంగూర్చి ననవరూహించుట కాతనిగాంభీర్యమహాత్మ్యమే కారణము.

ధర్మజుఁడు సర్వవిధ సమరమునకు సిద్ధమైన రాజ్యపాలకులకెందఱకుంగడంగఁడో, వనమ్మునకేగి, కందమూలఫలాహారమ్ములఁగొని, కటికనేలఁ బన్నుండి, మునివృత్తిని గడదాక కాలముఁ బుచ్చుటకంతె నెక్కువ ప్రీతిచెందును. క్రోధము దిగమ్రింగి, శాంతము వహించియుండుటకెట్లు సమర్థుండో, పంగనవేయువారిని భస్మము సేయఁ గార్యవాదియై యుద్యమింపనుంగూడ నట్లె సమర్థుండు. కాని, తనప్రతిపక్షులును, తనకు సంబంధించినవారును, తనకెంతెంత యూపదలొనరింపఁగూర్చుచున్నను, వారెన్నటికైనను బశ్చాత్తప్తులు గాకుందురా, వందనమార్గము విడమింపరా, యని ప్రతిక్రియారహితుండై ముందునెనుకలు చూచిచూచి, తుట్టతుదకు కార్యరంగమున కుఱుకఁ గలఁడు. అట్లుఱికినపిదప మఱియొకని నోర్వనేరికిం గాని కానిపని.

శాంతిమార్గమునఁ, బ్రేమతత్త్వమున, సౌజన్యవిరహితమైనతెలివునఁ దమభాగము దా మొందుటకేగక, యెంతెంత వంతలనైనఁ బ్రశాంతముగ నోందుటకాతఁడు మన సొగ్గినాఁడు! కానిచో, ద్రుపదపురోహితరాయబారమునకు ప్రతిగా నా రాయబారమయిపోయినది కదా – నా సంభాషణయందు ధార్తరాష్ట్రులెవ్వరినుగూర్చి యేమియుఁ బ్రసంగము లేకున్నను, ధర్మజుండెంత ప్రశాంతముగ, భావగర్భితముగ బలుకుచుండెనో వినుచుంటివికద! అంతలు వడియును నాతఁడు సంధినే కోరుచున్నాఁడు. ధార్తరాష్ట్రులతోఁ గలిసి జీవించుటనే వాంఛించుచున్నాఁడు.

ఇంతకును సంధికోరువారే ఉభయపక్షములవారును నైనచో రాయబారులకు సంధిపొసగింపనవుపడునేమోగాని, సుయోధనాదులు వీరికేమియునొసంగమనియు,

రాజ్యమున వీరికి స్వత్వమే లేదనియు, వీరు పాండవులే కారనియు, నటుగాక వీరను పాండునందనులే యైనను కురురాజ్యమే నాఁడును పాండుఁడేల లేదనియు, నెవరైనను నాహవమునఁ గెలిచి రాజ్యమేలఁదగునే కాని తన చిన్నతనమునఁ దన తాతతండ్రులు తన శక్తిసామర్థ్యములెఱుఁగక రాజ్యమున భాగ మొసంగినంతమాత్రమున తన రాజ్య వ్యవహారముల స్వతంత్రముగఁ దనకు తాను జూచుకొనఁగలిగిన తరువాతఁ గూడ వెనుకటి యాటలమాటే సాగనిత్తునా యనుచున్న దుర్యోధనుఁడు పాండవులను భండనమునకె పిలుచుచుండ, - భండనము కానీయకుండ - వారికేదేని నొసంగుదుననకుండ - శుష్కప్రియోక్తులతోఁ గాలముబుచ్చ నయ్యంబికాతనయుండు వాక్ప్రయత్నములు పలుపుచుండ, పాండవులు తమకు పైతృకంబగు భాగమిమ్మనుచుఁ, దాము దిగ్విజయంబున నలఖరుమకొనిన దాని నిమ్మనుచుఁ, గపటద్యూతంబున మా వారపహరించిన దాని నిమ్మనుచు, తాము మనవారికిఁ జాలక కాకి పోయినను, కదనమున లభ్యమగు రక్తాన్నముఁ గుడువఁ జాలక వారి యైదుగురకును నైదూళులైన నొసంగినఁ జాలునని వారనుచుండ, నిఁక సంధి పొసఁగు టెట్టుల? సంధియను కార్య మిరువాగలవారును వాంఛించినఁ గదా, సమకూడునది! అట్లు కూడనినాఁ డది సమకూడునె?

ధర్మజుని సహజసాత్త్వికతత్త్వమునకుం దగిన యా వేదాంతబోధ యేమాత్రమేనియుం బనిసేయుటకైనను వీలు లేకుండ—వంచకుల నడంప, విషయభోగేచ్ఛచేఁ బ్రకృతిజనంబుల బాధించువారిని నిర్మూలింప, ప్రకృతి దుర్లలితుల రూపుమాయింప, దుష్టజనసంహారనాటకమునకు సూత్రధారుం డనఁదగు—కృష్ణుం డావల వలనుగ నిలిచియుంట యేదియు సమకూడదు, అని నేను తొలినుండియు సంశయింపకపోలేదు

—వేగు—

కృష్ణుఁడు పాండవపక్షమున నిలిచినవాఁ డనిగదా నుడివితిరి. అట్లయినఁ బాండవులు ద్యూతమున నవమానము నొందునాఁడును, ద్యూతజితులై వనమునకేగి కిలుగుల నొందుచున్నప్పుడును, కృష్ణుఁడో యాదవులో పాండవులకు సహాయ మొసంగి వీరిని కష్టములనుండి తొలఁగించి అపుడే యుద్ధముకాఁ జేసిరైనను, వీరిది వీరికిప్పించి వీరినేల యుద్ధరింపరైరి?

ఎనిమిదవ ప్రకరణము

—సంజయుఁడు—

పాండవులు ద్యూతమునఁ నోడి మనరాజుచే నవమానితులైనసమయము కృష్ణుడు సాళ్వునితోఁ హోరాహోరిగఁ బోరుచున్న సమయమగుటను బాండవులను గూర్చి దలంపనైనఁ దలంపఁ జాలఁడాయెను.

ఇఁకఁ బాండవు లడవులఁ బడియున్న కాలమున సాళ్వయుద్ధముచే యాదవు లలసియుండుట చేతను—

పాండవుల రాజసూయసమయమున జరిగిన శిశుపాలవధచే దంతవక్త్ర పౌండ్రకవాసుదేవాదులు కుపితులై యాదవులపై యుద్ధసన్నాహములు చేయుచుండుట చేతను—

తక్కిన రాజులుకూడ పాండవుల రాజసూయయాగమున వారియాధిక్య విభవంబులఁ గాంచి క్రోధాసూయలచే నపరపక్షమునఁ జేరుచుండుటయును సందిగ్ధస్థితి కలుగుట చేతను—

యాదవులలోఁ గూడ భోజకులజులగు కంసకృతవర్మాదులకును, వృష్ణికులజులగు కృష్ణాదులకును అంతఃకలహములు పెరిఁగియుండుటచేతను—

కృష్ణాది యాదవులు పాండవపక్షముం జేరరైరి.

యాదవులేలఁ బాండవులకు సాయపడలేదని యడుగుచున్నావుగాని, యాదవులీసమయమున నీకురుపాండవసంఘర్షణమున జోక్యముఁ గలిగించుకొనుటయే కృష్ణున కిష్టములేదు. ఎంతదూరము శ్రమపడినను, తానును తనతమ్ముండగు సాత్యకియు మాత్రమే కద!

ఇంతయేల? కృష్ణుడు పాండవపక్షమునఁ బనిచేయుచున్నను దన కుమారులగు సాంబప్రద్యుమ్నాదులుగాని, అన్నయగు బలరాముండుగాని తనకు సహాయముఁ జేయ నిప్పటికిని రాలేదే!

కృష్ణునితమ్ముఁడగు సాత్యకి అర్జునుని శిష్యుండగుటను బాండవులం జేరినాఁడు.

శమంతకమణి నక్రూరుం డపహరించుట జరిగిన పిదప సత్యము దెలిసికొనఁ జాలక కృష్ణుఁడే యపహరించినాఁడని బలరాముఁడు పొరపడి కృష్ణునివిడిచి మిథిలా

నగరమునకుఁ బోయి యచట దానుండిన మూఁడు సంవత్సరములలోన మా దుర్యోధనుఁడాతనికడనే గద గదాయుద్ధము నేర్చికొని బలరామశిష్యుండయ్యెను. అట్లగుటనె బలరాముఁడు దుర్యోధనునెడ పక్షము వహించుచుండియు కృష్ణునియెడఁ బ్రేముడికతమున నాతనికి బ్రతిపక్షము వహింపనోపక, నేరికిని సాయమొనర్ప మనసొప్పక, దవ్వులకేగినాఁడు.

శతధన్వాక్రూర కృతవర్మలలో నొకనికిఁ దనకూతురగు సత్యభామనిచ్చి వివాహమొనర్తునని సత్రాజిత్తుమాట నిచ్చియుండెను. అనంతరము సంఘటిల్లిన శమంతకమణి గాథవలన సత్రాజిత్తు సత్యభామను కృష్ణునకిచ్చి వివాహమొనర్చుట తటస్థించెను. అట్లగుటనె శతధన్వాక్రూర కృతవర్మలకు కృష్ణ సత్రాజిత్తులయెడ వైరముద్భవించుటకు గతంబైనది. సత్రాజిత్తునెడ పగసాధించుకొనుటకు శతధన్వుఁడాతనిఁ జంపివేసెను. కాని అక్రూరకృతవర్మలకు కృష్ణునెడఁగల ఈర్ష్యాసూయలు- కాలము గడువగడువ- అక్రూరుని కృష్ణభక్తునిగా నొనర్పఁగలిగియు కృతవర్మను పరమశత్రువుగనే యుంచినవి. అట్లగుటనే కృతవర్మ తన యక్షౌహిణీ సైన్యముతో వచ్చి మాదుర్యోధనునకు సాయమొనర్పఁ జేరినాఁడు. కృష్ణుఁడు వృష్ణికులజుఁడు. కృతవర్మ భోజకులజుఁడు. భోజ వృష్ణికులజులకు చిరకాలము నుండియు విరోధములు ప్రబలియే యున్నవి. ఈ కులవిరోధమె గదా, రుక్మిణీవివాహ సమయమందేమి, మా పెద్దలు చెప్పుచువచ్చిన ప్రకారము దేవకీవసుదేవుల వివాహ సమయమందేమి, బాంధవ్యము నెగూర్చి వివాదములును, కలహములును, పెరుఁగుటకు కారణమైనది. ఏది యెటున్నను తన యదుకులమువాఁడుగదాయని కృష్ణునెడ సానుభూతిఁ జూపునేమో గాని కృతవర్మ, వంశభేదములచేతను, వ్యక్తిపరమైన శత్రుత్వ కారణముచేతను, కృష్ణు నెల్లప్పుడును, నసూయాభావముననె చూచుచుండును. కృతవర్మలో నింకొక విశేషముకూడ కలదు. కృష్ణునెవరేమనినను దానోర్వజాలఁడు-కాని తనకు ప్రత్యేక కారణముచేత కృష్ణునెడ నీర్ష్యయుండుటచేత కృతవర్మ యెల్లప్పుడును కృష్ణునకు బ్రతిపక్షమే వహించుచుండును.

అంతమాత్రము పోనేల, యాదవులలో మహావీరుండును, పలుకుబడిగలాడును, కృష్ణజనకుండును నగు వసుదేవుండీయుద్యమమున నైక్యముకలుగఁ జేసికొనలేదే!

ఇట్లగుట తమయాపత్సమయముల సహాయసంపద దొరకమి పాండవులన్ని యాపదలం బొందుటకు కతంబయినది.

— వేగు —

మనవారెన్ని యిడుములఁ గల్పించినను పాండవులంతంత సహించి మానమును ధనమును గోల్పోవుటకుఁ దోడు ప్రాణాపాయకరంబులగు పరిస్థితులు ఘటిల్లించినను వారట్టులోర్చి మారుసేయక మిన్నకుండుటఁ జూచినవారికి మాత్రము "పాండవులసమర్థులగుటనే మిన్నకుండిరి" అని తోపఁజేయుచుండును. కాని పాండవులంగూర్చి యిప్పుడున్న మాటమాత్రము వారి యనుపమాన తేజోవిలాసములఁ జాటుచున్నది. అట్లగుటఁ బాండవుల మనసునిల్కడ, మారుసేయమి, అనన్యాయము కాదా?

— సంజయుండు —

మా ప్రభువునకుఁగల సంశయమే నీకును దోఁచుచున్నదే!

శాంతియుతమై దౌర్జన్యరాహిత్యమై ప్రతీకారగవేషణము లేక శత్రుజనంబులచేఁ దామొందుచుండు విపత్తులనెల్ల బలవంతముగ భరించుచుండు ప్రవర్తనలకు ప్రతిఫలము లోకసానుభూతి నభ్యర్థించుచు బ్రశాంతముగఁ దమకు గార్యసిద్ధి యగునప్పుడు తుట్టతుదకు రక్తపాతమునకైనను జీవహింసవలననయినను దమకుజయముకలుగ గలదని యెదురుచూచుటయే యగును.

'శత్రుజనపీడనమున కెంతసైరణ నొందియుండిన నంత ధ్రువమగుచుండు తమకు జయ' మని యెంచుచు, ఆత్మశక్తి సూత్రముల నెరింగిన వారి తెరంగిట్లేకద యుండును! నిర్బంధాధికారము చిరాయుష్మంతము కానేరదని యెఱుంగని మహామానియగు మారాజు నెంత దిట్టలంబడఁజేసిన, మా రాజు గర్వంబు నెంత చెల్లి నిచ్చిన, దనకెంత సహాయము దొరకు ననునూహ యుధిష్ఠిరునకు లేకపోయి యుండదు. మన రాజును లోకమెంత దూరుచుండిన నంతసులువుగఁ దన కార్యసిద్ధి యగు నను నూహ వశీకృతచిత్తుండగు ధర్మసూతికి లేకుండక పోదు.

ఎంతటి మేటియైనను తన యభ్యర్థిత కార్యమునకు సుసమయ మాసన్నమగు దాఁక నోర్వకున్న తమప్రయత్నములు సఫలీకృతములు గాకుండుటయేకాక యింకొక

ఫలముండదని యెఱింగినవా రిట్లే తెచ్చికోలైనరణమైన నూహించుచుందురు. ఇంతకును కారణ మాధర్మజుని వశీకృతచిత్తతయే యని యనవచ్చును.

నీలకంఠా, మనము కరినగరము సమీపించుచున్నాము. మనము సంభాషణములో మునిఁగియుంట నెంతదూరము వచ్చితిమో తెలియ కుండగనే వచ్చినాము.

మాటలసందడి నడుగమఱచితిని- నిన్నే మనుమని యుపప్లావ్యమున కనిచినాఁడు మా ఱేఁడు!

—నీలకంఠుఁడు—

భగదత్త మహారాజజనకుండగు నరకుని వధియింప నెంచిన కృష్ణుని సేవ గించుచున్న భగదత్తుఁడు 'పాండవపక్షముం జేర కృష్ణుం' డని యెఱింగినంతనే యాతఁడు కౌరవపక్షముం జేరినాఁడు. మాప్రభునానతి నేనీసారథివేసమున వేగునైతిని. మీరు పాండవులకడకు దూతలైపోయి కురువీరుల వలసుగఁ బ్రసంగింతురో, పాండు సుతుల స్తుతియింతురో, విని రమ్మను సుయోధను కోరిక మేరకు మాప్రభునానతి నే వటకేగితిని కాని పాండుసుతుల నేమాత్రమును గరుణింపక, వారినినోనాడుటయుం దేమాత్రము నేమరక, మీనెఱపినసంభాషణవిధాన మత్యంతసంస్తవనీయము.

—సంజయుఁడు—

సంధి యొనర్పంబోవువాఁ డిరువాగులవారిలోపముల నెన్నుచు, దూఱుచు, నెదుటి వారి నగ్గజముగ నెగ్గించుచు, పదంపడి స్తుతియించుచు కాఁదగుకార్యముం గూర్చి ప్రసంగింపందగును.

అని వీ రిట్లనుకొనుచుండఁగనే భగదత్తునకని నిర్మించిన మందిరమున కీరథము సమీపించినది. నీలకంఠుఁడు రథావరోహణంబుగావించెను. సంజయుండును దనయరదంబునుఁబోనిచ్చి ధృతరాష్ట్రమందిరసమీపమున నిలిపి రథంబుడిగ్గికురుపతిని దర్శింపఁ దత్సభాభవనమున కేగెను.

ఎనిమిదవ ప్రకరణము

రెండవ ఖండము

హస్తిపురము:—ధృతరాష్ట్రి సందేశము పాండవులకు నివేదించి మఱలిన సంజయుఁడు ధృతరాష్ట్రునిఁ దొలుదొల్త దర్శించుట—సంజయుఁడు ధర్మజుస్వభావము నిరూపించుట—ధృతరాష్ట్రునిఁ బరివర్తనయందున్నదని తనకుఁ దోచిన లోపములను సంజయుఁడు నిరూపించి చూపుట. సంజయ నిష్క్రమణము.

కురుపతి సామ్రాడ్విభూతితో సభాభవనమున గూరుచుండి యుండినసమయాన 'సంజయుండువచ్చె' నని తనకుఁదాఁ దెలుపుకొన్న ధృతరాష్ట్రి సంఘ్రియుగ్మమ్మునకు మ్రొక్కి నిలిచి యాతఁడు చక్రవర్తితో నిట్లనియెను.

—సంజయుఁడు—.

మీయానతి నతిక్రమింపక, యుపప్లావ్యంబున నున్న పాండవ్యాలం గంటిని. అప్రమేయసుగుణాన్వితుండగు నయ్యుధిష్ఠిరుని దర్శించితిని. ఆతఁడు మీకు నమస్కరించెను. నను సంభావన జేసెను. మిగుల బ్రసన్నుఁడై, మీసుఖశ్రీవిభవంబుల నడిగి కురుకుమారుల సేమము నరసి యానందించెను.

—ధృతరాష్ట్రుఁడు—

సంజయా, ఆ యజాతశత్రుండును, తదనుజన్ములును, సుఖముగనున్నారు గద!

—సంజయుఁడు—

భవదీయ స్ఫారబలము కారణమున సుఖముగ నున్నామని యన్నారు. నిజమునకుఁగూడ నంతియే కద!

ఇంతకును ధర్మజునకు ధర్మములింపైనట్లు భోగములింపుకావు. నిర్మల బుద్ధిచేత యోచించినచో, నహింసకే యతఁడు కలఁడు. అట్టి యుధిష్ఠిరుఁడు మానవశక్తి నొల్లఁడు; సముచితమగు దైవ శక్తిపై నాధారపడియుండును. అట్లని మానవప్రయత్నములఁ జరిగ గణింపకపోఁడు. మానుష దైవికముల యుచితసమ్మేళనమే, లౌకిక కార్యసాఫల్యమునకుఁ గారణమని నమ్మియుండును. అట్టి సుగుణ సంపత్తిగలధర్మజుఁడు పుణ్యమును బాపమును నీపయిబెట్టి ప్రవర్తించు చుండును. ఇఁక నినుగూర్చి యోచింతుమన్న నీవు నీపుత్రు నధీనుఁడవై యొంటి తెన్నునఁబోఁజాలకున్నావు. ఇఁక మిగిలినది కార్యనిశ్చయము. అది కర్ణసౌబలుల యధీనమైయుంట యథాయథలై పోవకతప్పదు. ఇది యందఱకును దెలిసిన విషయమే. ఇట్టి పరిస్థితులలో నీమతమును నీ ప్రవర్తనమును నెంతమాత్రమును నొప్పకున్నది. ఆలు బిడ్డలు లేని ద్రిమ్మరి కేకాని, మఱేరికైన నిట్టి వివాదములు జరుగుచుండ, జూచుట కిచ్చ బాడమునే! ఇంత తెలియక యూరకుంటివా? కొడుకు కెటు ద్రిప్పిన నటు దిరిగెదు నీవు, నీకొడుకు నడవడి వడివడిఁ ద్రిప్పఁ జాలమి నాకేకాదు లోకమునకంతకును గర్హ్యముగా నున్నది. అకుంఠిత తేజులగు కొమరులుగల నృపులెందరో యిల నేలలేదు! అట్టి వారైనను, దమకొడుకు లొకప్పుడు చెడుత్రోవంబడిరేని, తగవుచెప్పక, యుపేక్షించుచు, నూరకుండిరే! లోకము నోటికివచ్చినట్లెల్ల నిను దిట్టుచుండ, విని విని నాచెవులు గీపెట్టుచున్నవి. మీతండ్రీ కొడుకులా కర్ణసౌబలదుస్ససేను లెట్లాడించిన నట్లాడెడు కీలుబొమ్మలయియున్నారు. పెక్కుభంగుల మీ వలనఁ జిక్కులు వడి

మిక్కిలి యలసియున్న పాండవు లాగ్రహావృత్తికిఁ జొత్తురేని, నీచలమును, బలమును, గులమునుంగూడ నొక్క మహాహవమున నిట్టె జక్కఁబెట్టుదురు సుమీ! కొండను విరుగఁగొట్టుటకు డీకొనుచుండెలాగున నున్నదికాదా మనవారి దుస్సాహస ప్రయత్నము?

ధర్మజు సైరణను వెఱపుఁగా మనవారలు సమర్థించుచు సంతసించుచున్నారే కాని, పాపము తుద కేమగునో యనియైనఁ దలంప లేకున్నారు.

సత్కులీనులకు సాంప్రదాయికముకానిది జూదమని మన వారెఱుఁగక పోలేదు. అట్టి కానిజూదమునాఁడే యవినీతి పుట్టినది. ఆ సందర్భమున నీ యుపేక్షయే యెంతయుఁ జిచ్చువెట్టి కాల్చినది. ఇపుడింకను నేమి క్రొత్తగఁ బుట్టవలెను? తానుగ రచ్చకెక్కు స్వభావము లేని ధర్మజుఁడు వశీకృతచిత్తుఁడు. తనకొనర్పఁబడిన దేయపకృతినైన నెమ్మదిగ భరియించి, తరుణమువచ్చినపిదప విమవక, శత్రుజన వినాశమొనర్చుడు మెత్తనిపులి. లోకముగుర్తెఱిఁగి తనకార్యము జయప్రదముగఁ గొనగట్టుటకుఁ దగినరీతి నెదుటివానిమనస్సు రంజింపఁ జేసియైనఁ దత్సానుభూతి నొందఁగల సమర్థుఁడు. లోకమున నెల్లయును నీపయి నేరముమోపునందాక నిశ్చరచింతలుమాని, మీఱుడిన పాట్లెల్ల శాంతముగ భరియించును. సుసమయమునఁ విజృంభించుటకే యింతశాంతత వహించుచున్నధర్మజుం డొకతూరి యూహావమునకే గడంగెనేని, మరియాతని మాన్పను, మార్కొనను, మన కెవరికిని శక్యముకానిపని. మీరెంతలొనర్చినను, ఆతఁడు సైరణ సేయుచు, సమర్థుఁడయ్యును మాఱు సేయనొల్లకుండుట సంపూర్ణముగ లోకపు సానుభూతిఁ గోరి, మనసారఁ దాఁ గోరినంత మాత్రాన నిట్టె జయశ్రీ నొందుటకని మనవారు తెలిసికొనఁజాలక, యాతని సైరణ వెఱపుగను, మాఱు సేయకుండుట నాతని యసమర్థతగను, బాపము

సమర్థించుచున్నారు. మనవారియూహలు భ్రమప్రమాదమూలములని మనవారు తెలిసికొనునప్పటికిఁ బరిస్థితులుమించి, మఱితేరఁగరాని దురవస్థను దేఁగలవు. ఇది సామాన్యులు తెలిసికొనఁజాలరు.

ధర్మజునిగూర్చి మఱొక్కవిశేషముగూడఁగలదు. దౌర్జన్యరాహిత్యమై, శాంతియుతమై, సైరణ ప్రధానాంగముగాఁగలిగి, సాటిమన్నీండ్రయభిమానమును, జనసామాన్యఁపుటభిమానమును, సానుభూతియును మిక్కుటముగఁ గోరుచు, నరాతిజనంబులెంత వెక్కసముగఁ దన్నరికట్టి వేధించిన నంతయానందముగ నాపాటులఁ బరిగ్రహించుచుఁ— 'దన సైరణవలననైనఁ, దన యెదిరికిఁ బశ్చాత్తాప ముదయించియైన దుర్నయములు మఱి మానకపోదురా' యని యూహింపుచుఁ దన యనుజులెంత వేగిరంపడి మనపై నెత్తిరా లేచుచున్నను, వారి కడ్డువడి వారినప్పటికి నిరుత్సాహులుగఁ జేయుచు, మెలంగెడి సాత్వికనిరోధము, తన ప్రవర్తనకుఁ బ్రధానాంగముగ నెంచియున్న వశీకృత చిత్తుఁడగు యుధిష్ఠిరుఁడు లోకఁపుటచ్చెఁపు మెచ్చునకు వచ్చునుగదా! తత్కారణముననేకదా లోకమాతని గొండాడును! అట్టి యుధిష్ఠిరుపై ధ్వజమెత్తుట కొఱవిం దలఁగోఁకికొనుట యగుంగాదే!

నీకడుపునం గన్న మోహంబుకతన, నీకొడుకుల చెడుగులని వివేకించుకొనఁజాలక, నీకొడుకులందనియింప నెంచి, - నీమేలుఁగోరి నినుఁగొలుచుచు, నీవిడుకూడుఁగుడుచుచు నీచరణకమలసాన్నిధ్యమున నీయాన మెలంగ నెంచియున్న - పాండుసుతులదవ్వులకుం బాఱద్రోలి, యిపుడింత గొంతుమీఁదికి దెచ్చుకొంటివి. ఇఁకముం దేమి రానయియున్నదో యెవరికెఱుక! ఆప్తజనంబులఁ జేరఁదీయక ననాప్తులను స్వలాభముకొఱకును స్వమనోవాంఛాఫలసిద్ధికొఱకును నీ కొడుకులను బురికొల్పుచుండు వారిం జేరఁదీసి, చెడిపోయి, కురుకులంబెల్లఁ గూఁకటి వ్రేళ్లతోఁ బెకలింపఁజేసికొనె నను నపవాద మీయిలఁ గలకాలము నీవు నీజనముల

చేఁ బుర్వ్యఁదిట్లువడుటయె తుట్టతుద కలవడు ఫలశ్రుతి యగుం గనా యని నేనును, నీయాప్తవర్గమును దుఃఖింతుము.

కౌరవేశ్వరా, వేగమరలివచ్చుటను, పథికశ్రమంబున నొడల్నొచ్చుచున్నది. ఇపుడు ప్రొద్దును బోవుచున్నది. ఇప్పటికి సెలవు గైకొందును. రేపు నీవు, నీపుత్రులును, బంధుగులును, నాప్తజనంబులును బరివేష్టించియుండ నాపోయివచ్చినకార్యము సంపూర్ణంబుగ సవిస్తరంబుగ నివేదింతును. ఇప్పటికి నాకు సెలవొసంగుము."

అని సంజయుండు నిలువ, నక్కురుపతియు నాతనికి సెలవొసంగి కార్యచింతందగిలి, విదురునకుం గబురంపెను.

ఈతఁడు హస్తినాపురమేలెడు చంద్రవంశపురాజులలో మూఁడవ వాఁడగు పూరుచక్రవర్తితరువాత కొన్నితరములుగడచినపిమ్మటఁ బ్రజలచే నెన్నుకొనఁబడి చక్రవర్తిగఁ జేయఁబడిన 'కురు' అనువాని యయిదవతరపు మనుమఁడును, ప్రజలచే నెన్నుకొనఁబడిన వాఁడును, నగు శంతనుచక్రవర్తికి రెండవకుమారుఁడగు విచిత్రవీర్యుఁడు సంతానరహితుఁడై మృతినొంద, నాతనిభార్యయగు నంబికయొక్క దాసికిని వ్యాసునకును జన్మించి, జ్ఞానియు, మేధాసంపన్నుండును, బ్రఖ్యాతవేదాంతియు, విశేషించి నీతిపరుండునునై ధృతరాష్ట్రపాండురాజపరిపాలనకాలమున రాష్ట్రమునకుఁ బెద్దయై, వజీరునకు హేజీబునునై నెగడిన మహాపురుషుఁడు. ఈతఁడు నుడివిన నీతులు సమయోచితములు మాత్రమే కాక, ఈయిలఁ గలకాలమంతకును ఒప్పించియుండును. అమలచరిత్రుఁడౌ పాండుభూవిభుఁడు రాజ్యమునఁ జురుకుగఁ బనిసేయుచుఁ దన యన్నయందలి గౌరవముపెంపున సింహాసనముపై ధృతరాష్ట్రుని గూరుచుండఁజేసినకాలాన, రాజ్యపరిపాలనవిధానమున నీ విదురుండే ధర్మములను నీతులను బోధించుచు, రాష్ట్రపాలనమునఁ గడు దోడ్పడుచుండెను.

— — —

ఎనిమిదవ ప్రకరణము

మూఁడవ ఖండము

విదుర ధృతరాష్ట్రుల సమావేశము-లౌకిక, నైతిక, ధార్మిక విషయసమన్వితమగు విదురునుపన్యాసము—ధృతరాష్ట్రుని లోపముల నిరూపించుట, వానిని సవరించువిధానము విదురుఁడు ధృతరాష్ట్రున కుపదేశించుట.

మఱికొంత సేపటికి వచ్చిచేరిన విదురునితో — "తమ్ముఁడా, పాండుపుత్రులపాలికి మనమంపిన సంజయుఁడు మఱలివచ్చి — మఱి యచ్చట నేమి తెలిసికొనివచ్చెనో కాని,—ఆవచ్చిన మొగాననె నన్ను నాసమ్ముఖమ్ముననె దూఱి, రేపచ్చట ముచ్చటలను, అచ్చటిపనులను జెప్పువాఁడనని చెప్పి, మార్గాయాసమున నింటికిఁబోయెను. సంజయుని పలుకులు విన్నదాదిగ మనసుకలఁగి దుఃఖము నన్నలమికొనఁగ నిప్పుకలం బొరలినట్లు ధృతిఁదూలి నిదుర రాక, నొగులఁ బొరలుచున్నాను. సంజయుండెంతెంత మాటలనైన ననునాడిపోయెను. పాండవశిబిరంపు సన్నాహము లేయాకృతిఁ దాల్చినవో, వారేమనిరో, మఱియాతనికేమి దోఁచినదో కాని, ననులోకము తిట్టుచున్నదనియు, పాండవేయుల యాయాసంపుఁబాట్లకు నేనే కారకుండననియు, నెంతెంత మాటలనయిన ననునిందించి వెడలినాఁడు. నామానసికవేదనకు మార్పుఁగలిగించి, నీ నోటిమేల్మాటలచే ననుఁదేఱునట్లొనర్పుమో విశుద్ధవిచారా!" యని ధృతరాష్ట్రుఁడు మిన్నకుండెను.

— విదురుఁడు —

(తనలో) పాండవుల సమరసన్నాహములను సంజయుఁడు తెలిపియుండును. కావున నీక్షత రాష్ట్రుండు ధృతిఁదూలి యున్నాఁడు

(ప్రకాశముగా)

కౌరవేంద్రా, సంజయు పలుకులు వినినంత మాత్రమున నీకు నిదురపట్టకుండుట తటస్థమయ్యెనేమి! అంతనిదుర లేకుండుటకు నీకు బలవంతుండగువాఁడు నీపై కత్తి వచ్చునని యా? పరుల సొమ్ముల గ్రుచ్చులింప నెంచితి వనియా? కామాకులచిత్తుండ వైతివనియా? సంపదఁ గోల్పోయితి వనియా? ఇందేది నీకు తటస్థమైనను దుఃఖమునకుఁ గారణమై, మనమునఁ గలఁతపుట్టించి నిదుర రానీయదు. ఇపుడు నా నుడివిన నాలుగు కారణములలో నేదిబలవత్తరమై నీకుగూరుకు రానీయకున్నదో నీవేయోచించుకొని నీనిదుర రామికి గతంబీవే స్థిరపఱుచుకొనుము.

—ధృతరాష్ట్రుఁడు—

ధర్మజుమాట యేవాటముగ నున్నదో యెఱుంగమి నింత గుందవలసి వచ్చుచున్నది. నీవది తెలిసికొన సమర్థుండవగుట నా యలమటఁ బోద్రోలఁగలవు.

— విదురుఁడు —

నేనేమి చెప్పినను మాయలనాఁటి కపటపుజూదపుటాట మాటయే యగును. వయోవృద్ధుండవగుటనీసూనునివశంబవైపుత్రవ్యామోహము కతననీవేమియుఁజేయంజాలవు. నీసూనుండును అహంకారవశుండయి, సంపూర్ణస్వార్థపరత్వంబున మునిఁగి తేలుచుండ, నీవునునీకొడుకులునుం గూడ కర్ణ, శకుని, దుశ్శాసనులపై రాజ్యభారంబుఁ బెట్టుకొని యుంట నిఁక భారతవంశంపు భావిజీవనము కర్ణాదుల పాలఁబడియెను.

అటు ధర్మజుం దలంతుమన్న నాతఁడు నీకు బందుగుండును, జెలికాఁడును, తగినభటుండును, మంత్రియును, గురుండునునై, శాంతమూర్తియై, ప్రకటీకృత సత్యనిరతుండై, సద్వినయవివేకశీలగుణ విశ్రుతకీర్తివంతుఁడై యుండునాతండొక్కనాఁడైనఁ గీడుఁబలుకఁజాలఁడు. దారుణపుటూహలు తనమానససారంబునఁ జొరనీయనొల్లఁడు. శ్రుతికటువగు పరుషోక్తులు పలుకంజాలఁడు. తనబలముఁ దానెఱుంగుట-వేగపడమి-దాలిమి సెడమి- బట్టువిడుపులును- నిర్బంధరాహిత్యమును-లేని ప్రభుత్వ మేకాలమందైనను గంటిమే! ఏదీ! యీతీరగు సమానుషచర్య నొక్కటియైనఁ జూపఁగలమే పాపమా ధర్మజునెడ? వా రింతదిని మనుటకొసంగుఁడని బ్రతిమాలినను, మతిమాలిన మనవారొసంగక, వారు గొరివ్వి మనపై నెత్తివత్తురే యను నట్టి నీసుతుల నేమనందగును? సంజయుముఖమునఁ గబురంపియు, నిదియిచ్చెద మిదియీయమని స్థిరపఱుపక, శుష్కప్రియోక్తులతో నా రాయబారమంపిన నిన్నేమనవలె? విషయప్రాధాన్యము లేని రాయబారమునుఁ గూర్చిన నీబుద్ధిహీనత కేమందును? ఏమనిన రాయబారమది? లేక, రాయబారమను నెపమునఁ బాండవుల ప్రయత్నములును, వారి హృదయమును నెఱిఁగి వచ్చుటకు నీవు నెఱపఁజేసిన రాయబారమా యది? స్వార్థాభిజ్ఞత, పరార్థానభిజ్ఞత నిన్నును నీకుమారునిం గూడ సమముగ నల్లుకొనియుంట నింతమూఁడినది. పుత్రవ్యామోహాదోషాంధత నీయందును, ప్రకృతి దుర్లలితుండగుటకుఁ దోడు మహాభిమానియు నగుట అహంకార దోషాంధత నీసుతుని యందునుఁ బ్రవర్తిల్లుచున్నవి. ఇందెవరునుఁ ద్రోవకువచ్చువారు కారు. పురువంశమంతరించుకాలమాసన్నమయ్యెనా యను దిగులెల్లప్పుడును గలుగుచునేయున్నది. ధర్మజాదులు బాల్యముననే పితృవిహీనులగుట, నిన్నే తండ్రిగానెఱింగి, తగవునకు నినునమ్మి, మీఁపఱచిన వారెల్ల

లోకుల కచ్చెరువుఁ బుట్టునంతఁదనుక సైరించిరన్న! నీవును ఎఱుంగుదువు. వారి సైరణఁజూచియైన నీహృదయము మృదులత నడయదుకద!

— ధృతరాష్ట్రుఁడు —

సంజయుచే ధర్మజాదుల కెఱుకఁబఱచిన సాంత్వనవచనములు వారియెడ నుపయోగింపకున్న మనమిఁక నేమిచేయవలయును? యుద్ధమే సన్నద్ధమైనచోఁ దిరుగుమువచ్చుచున్న నామానసపరిస్థితి యింకనుఁ బాడగును. అట్లగుట నీహితభాషణములచే నామనస్సుఁ గుదురువడునట్లు చేయుము.

— విదురుఁడు —

ఆంబికేయా, ఇదిధర్మ మిదియధర్మమని బొత్తుగ నెఱుంగనివానికెంతఁ జెప్పినను చెల్లునే కాని, నీయట్టి ధర్మాధర్మవిదునకు, నయానయాభిజ్ఞనకు వేరేమి చెప్పఁగలము? ఇంతకు నొకరు నీకు దెలుపకునికి నింతలువాటిల్లెనని యనలేము. మోహ మనేకముఖములఁ బరిఢవిల్లును. అందుఁ బుత్రవ్యామోహ మొకమోహము. ఏమోహమైనను, కూడనంతదూర మెగఁబ్రాకినపుడు అది దురంతమైన వంతసమకూర్పక విడువదు. నీవు నయాభిజ్ఞుండవయ్యుఁను బుత్రవ్యామోహాంధకార మలముట నేమియుఁ జేయఁజాలకున్నావు. ఇది యందఱెఱింగినదే! ఎఱుకఁ గలిగియుండుట యొకటి. ఆ యెఱిఁగిన దానిననుసరించి కార్యములొనర్పుచుఁ బ్రవర్తించుటయింకొకటి. సాధారణముగ నెఱుకలేక కార్యములొనఁగూర్చుటయు, సంభాషించుటయుఁ జేయువారిసంఖ్యయే లోకమున మ్రూఁడువంతులు. ఇఁక మిగిలిన వారిలో నొకపాలెఱుకఁ గలిగియు, ననుసంధానమునందు వెనుకబడినవారి సంఖ్యయే యధికముగనుండును. కావున నేమియొనర్చినను నెఱుకతోఁగూడి యుండవలెను. ఎఱుక, చేత: అను నీరెంటికలయికయే మోక్షమునిచ్చును. దుష్కార్యముఁ జేసినను, సత్కార్యముఁ

చేసినను, నాయొనర్చునది సత్కార్యమనిగాని దుష్కార్యమనిగాని సంపూర్ణముగ నెఱిఁగి, పౌర్వాపర్యములఁ జర్చించుకొని తన యంతరాత్మను పూర్తిగఁ దృప్తిపఱచి మఱియుఁ గార్యమొనర్చినచో, సత్కార్యపర్యవసితఫలమునందలి గుణదోషములు మఱి కర్తం కంటఁజాలవు. ఇంతదూరమెఱిఁగి కార్యములొనర్చు ధర్మజుఁడుఁ కర్మచేసినను జేయనివాఁడే యగుచున్నాఁడు.

—ధృతరాష్ట్రుఁడు—

తమ్ముఁడా, ఇంతదూరము చెప్పుచున్నావే! ఒక్క సందేహముఁ దీర్పుము. సంజయుని శాంతప్రచారపుఁ బలుకులను వారు విననొల్లక, వారింకను సమరమునకే సంసిద్ధులుగ నుందురేని, సంగరము ప్రాణహానిఁ గలుగఁజేయునుగదా! అది యెట్లు వారికిఁ దగును? ధర్మజుండు హింసకు లేడట! శాంతమే మూర్తిభవించిన వాఁడట! ఇది యెట్లు సంగతమగును?

— విదురుఁడు —

కురుకులనాథా, అడుగదగినదియును నడుగక వీడరానిదియు నగుదానినే యడిగితివి. ఏకార్యమునకును పర్యవసానము తన యీప్సితమున కనుగుణమగునా కాదా యనియెంచి, తదీప్సితార్థమునకు దా నేర్పఱచుకొను మార్గము, దా ద్రొక్కుడుత్రోవయు ననుగుణ్యముగ నున్నవో లేవో చూచుకొని ప్రారంభింపవలెను. అంతేకానిఁ తత్కార్యపర్యవసాన మొకప్పుడు చెడి, తా గోరిన ఫలమీయక, తాననుకొనని వేరొకఫలమొసంగినచోఁ దనమార్గముతప్పనిగాని, తత్పర్యవసానము సందర్భశుద్ధి లేకున్నదనిగాని యూహింపరాదు. మానవుఁడు తనకు విపద్దశ సంభవించినప్పుడు తద్దశనుఁ దొలఁగించుకొని సౌఖ్యదశాప్రాప్త్యర్థము ప్రయత్నింపకమానకుండుట సర్వజనసామాన్యలక్షణము. తత్సిద్ధికొఱకు దానవలంబించుమార్గము తన మనోరథ

మీ దేర్పునని యెంచుకొని, అప్పటి కవలంబింపవలసినమార్గము నవ
లంబించియే తీరవలెను. కాని, వెనుదీయరాదు. ఇది కాదందు వేని:-
పాండవులు తమకుఁగూడ నీరాజ్యమున స్వత్వముకలదని నమ్మి యు
న్నారు. ఇదిలోకమువా రందఱు నెఱింగిన దేకద! మీ వంచనమార్గ
ముచే వా రడవులంబట్టి తిరిగితిరిగి తుద కిలుజేరుకొందమనుకొను
నప్పటికి వారిని గూడులేనిపక్షులుగనొనర్చుటయె కాక, మిమ్ములఁ బ్రా
ర్థించినను వారిదివారికిమీరొసంగకున్నారు. వా రరణ్యవాసమునకు
బోవునాఁటికి వారివి యనిపించుకొనిన స్వాస్థ్యము లిపుడు నష్టసంపద
లగుట మఱల వారువానిని సంపాదించుకొనుట వారికిఁగర్తవ్యము.
వారిది వారికందనీయకుండఁ జేయుట నీసంతానపుసంకల్పము. కావున,
నిందు మీకునుమీకునుంగల కర్తవ్యాకర్తవ్యములసాంప్రదాయికతఁ
జూచుకొనవలసిన దేకాని, కర్తవ్యమునకువలయు సాధనసంపత్తిని
గూర్చిన యాలోచనతో మఱి నిమిత్తములేదుసరికదా, తమకుఁగల
కర్తవ్యమునందలి నిర్దుష్టత స్థిరపఱుపఁబడిన పిదప, తమకార్యమున
జయమొనఁగూడకపోయినను, తమ కపజయమునకుఁ దోడు మఱి
కొన్ని క్రొత్త చెడుగులు సంభవించినను, తామొనర్చు కార్యమున
మాత్రము తత్కర్తలకు తద్దోష మావహిలఁజాలదు.

కార్యపర్యవసానముంబట్టి కార్యాచరణవిధానమును, తద్వి
ధానమున కవసరమగు సాధనసంపత్తియు, మంచిదనిగాని, చెడ్డదని
గాని మన మనలేము.

ఏపర్యవసానముకొఱకు మనముప్రయత్నింతుమో అట్టిఫలము
మన సంకల్పముచేతనే చెడ్డదైనచో, మనకార్యమునకు మన ముప
యోగించు సాధనసంపత్తి యెంతమంచిదయినను తత్ఫలము కర్తకు
చెడ్డదిగనే పరిణమించి తత్కర్తను వేధించుచునేయుండును.

కార్యాచరణకుఁ బూనునపుడు తత్ఫలము సంకల్పముచేతనే

మంచిదయినచో, తత్కార్యాపస్థానముకొఱకుఁ దా నవలంబించు సాధనవిధాన మెంత చెడ్డదయినను ఆసాధనవిధానపుఁ జెడ్డతనము తనకంటక తనసంకల్పనైర్మల్యమువలనఁ దనకు మంచిఫలమునే యొసంగఁగలదు.

మానవుని మనస్సునందిమిడియున్న సంకల్పమును, దత్సంకల్పము నెఱవేరుట కతఁడవలంబించు సాధనవిధానమును ఫలము లిచ్చుటలో, నన్యోన్యాశ్రయములై ప్రతిఫలించుచుండును.

ఇప్పుడు పాండవులకుఁ దమ నష్టసంపదను సంపాదించుకొనుట కర్తవ్యము కాదా? వారిని మీరింతకాలమును వేధించుచుండుటయు వంచన యొనర్చుచుండుటయు మీకు న్యాయమగునా? మీపరిపాలన మున్నంతకాలమును వారి బ్రతుకిటులే యుండునని వారికిఁ దోఁచిన నో భారతభూమి స్మశానవాటికగ మారినను, అట్టిమూర్ఖకౌరవదుర్మానపుఁ బరిపాలనముకన్న మిన్నయన్న తలంపు వారికిఁ గలిగినను గలుగవచ్చును. అందేమి నేరముకలదు? ధర్మజుఁడు పెద్దకాలము యోచింపక ఏపనియు నొనర్పఁడు. మీరొనర్చిన యకృత్యములనెల్ల భరించుచు, నవమానములను సైరణతోఁ గైకొనుచు, నింతకాలముఁగూడఁ దమ కష్టపరంపరలు తొలఁగఁజేసికొనులాగున, జేయందగు కార్యముంగూర్చియే యోచించుకొనుచుండును. ఇప్పట్టున ధర్మశాస్త్రములు చెప్పిన చొప్పునను, నీతిపథంబు నవలోకించినను, దనకుయుద్ధమే కర్తవ్యమని తోఁచకమానదు. అట్టిస్థిరబుద్ధి యాతనికిఁ గలుగకపూర్వమే మీరు మేల్కాంచియుండుట పరమధర్మము. మధురఫలాదులను మనముదినునప్పుడుసైతము మన మొరులకిడకుండఁ దిననొల్లముగదా! పాపముపాండవులడవులనున్న సమయాన, నీకెల్లైననేమి,- దక్కను గదా రాజ్యమనుచు నంతయు నాపోశనముఁబట్టఁదలంచితివేగాని, నీ తమ్మునిభాగ మాతనిసంతానమునకొసంగక, నీవును నీసంతానమును మాత్రమెట్లు మ్రింగఁగలవు? అదె ట్లరుగఁగలదు? ఆహార

భ్రీమను గ్రక్కునగాలము మ్రింగి, తుదకును పలంబాయు మీను బ్రతుకగును జుమీ కురువంశపు బ్రతుకు!

అంబికేయా, చక్కగనాలోచించి పాండవులకుం దగు నలంతి పల్లియలనైననిచ్చి, వారిని మనము లోబఱచుకొని, మననిచ్చితిమేని, వారు మనకు వశంవదులై మనకెంతేని యుపయోగింతురు.

—ధృతరాష్ట్రుడు—

విదురా, నాకు హితమును, గర్తవ్యమును నగుచందము నెఱింగింపుము.

—విదురుడు—

క్రొత్తగ నే నెఱింగించుట కేమున్నది? నాయెఱింగినంతవఱకు, నీబుద్ధికి హితమైనది నీవాచరించుచునే యున్నావు; అది లోకకల్యాణప్రదముకాదు కావున, కర్తవ్యమును కాదు. ఇంకఁ గర్తవ్యమైనది నీకుహితము కాఁజాలదు. అట్లగుట మఱిచెప్పుటకేమున్నది?

—ధృతరాష్ట్రుడు—

నీ ప్రసంగఘటితి నాయుల్లమును మఱింత కలఁత వెట్టినది. కావున, నీతుల నుపదేశించి ననుఁ దేర్పుము.

—విదురుడు—

నీతుల నుపదేశించుటకేమున్నది? కూడనివన్నియును ధార్తరాష్ట్రకులమునందే కూడియున్నవి. కావున నవియన్నియును ద్యజించుటయే యవినీతినుండి తొలంగుట యగును.

ఒక్క సామాన్యవిషయముఁ జూడుము.—ఒరులు నినుఁదిట్ట నీవోర్వఁగలవా? అట్లగుట నొరుల నీవేల నొవ్వఁజూచెదవు? నిన్ను గౌరవించువారిని, నీయెడఁ బితృభక్తిఁ జూపువారిని, నీవనాదరమునఁ జూచినపుడు, నీవు వంచించుచుండునపుడు, వారోర్వవలెనో? ఇదియేమి ధర్మమో!—ఇచ్చి వగచుమచ్చు నీకెట్లువచ్చెనో గద!

ధార్తరాష్ట్రులచేఁ బాండవులు చిరకాలమునుండియు పొందు

చుండిన పాట్లన్నియుఁ బాండవులచే ధార్తరాష్ట్రులే పొందుట తటస్థమయియుండినచో మీ రోర్వఁగలరా? లేశమైనను సైరణఁ జేయగలరా? వేయేల? లోకములో నింద్యములనిపించుకొనిన మార్గములను విరమించుకొని, జనులకు నోడఁబాటగు విధమునఁ జరియించుచు, దనకన్న నున్నతినున్న వారినిఁ జూచి, యేవగింపక ప్రజలతోఁ బొందికఁ గలిగి జీవించుటయే జన్మమునకు సార్థకతయగును. నీ పెద్దతికమును గౌరవించు తలంపున యుధిష్ఠిరుండును, నతనిమూలమున భీమార్జునాదులును, సైరణ సేయుచున్నారేగాని, వారసమర్థులై కాదీ మిన్నకుండుట!

నీ కొడుకులకు విద్య యలవడమియుఁ, బెద్దలతోడి సాంగత్యము నెఱుంగమియు, నింతలు దోసంగులు వాటిలుచున్నవి. మన దుర్యోధనాదులు ధర్మముల నెఱుంగరు. కార్యదీక్షనొందఁ జాలరు. కార్యములు కావలెనని కోరుచుందురు. తమ వాంఛితకార్య మెట్టిదైనను నయ్యది తమ వంశమునకుఁ దగునా తగదా యను చింతఁ జేయనోపరు. తుదకు నోటివడితనముఁ జూపి, బంధుకోటికిని, జ్ఞాతివర్గమునకును మనములు నొచ్చునట్లు పలుకుట కేమాత్రమును వెనుదీయరు. ఇట్టి నీ కుమారవర్గము సంపూర్ణముగఁ బ్రకృతికి లోఁబడి యున్నారు. ప్రకృతికి లోఁబడుట సర్వజనసామాన్యలక్షణమె యయ్యును, ఎఱుకతో కూడిన ప్రకృతిసంసర్గ మెంతకలిగియున్నను, ప్రకృతికి లోఁబడజాలఁడు. తన్మూలమునఁ జింత తగ్గుచునే యుండును. ఎఱుకఁగలవాఁడు ప్రకృతితో సంబంధించిన మాయను ఛేదించుకొనఁ జూచుచునే యుండును. తానెంతవఱకీ మాయను ఛేదించుకొనఁ గలుగునో, అంతవట్టును మోక్షము నందుచునే యున్నాఁడు. మోక్ష మనఁగాఁ బ్రకృతి మాయాబంధములనుండి విముక్తుఁడగుటయే కద! అట్టి మోక్షమునకు ప్రధానసాధనములు విద్యయుఁ బెద్దలతోడి సాంగత్యమునై యున్నవి. విద్య యధికమైన కొలఁదిని స్వార్థము తగ్గుచునే యున్నది. స్వార్థము రెండువిధములుగాఁ బరివర్తించి ఉత్తేజితమగుచున్నదని యెఱుకఁగల

వారు వాకొనుచున్నారు.

"స్వ" [లేక స్వార్థచింత] యనునది తనపట్ల తగ్గితగ్గిమఱిలేకయే పోవుట ఒకటి.

"స్వ" యనునది [స్వార్థచింత] తనపట్లనుండి హెచ్చిహెచ్చి, తన కుటుంబమునకు బ్రాకి మఱియు హెచ్చి, తనయూరంతయు నల్లుకొని, పిదప దేశముపై బ్రాకి, మఱియు విజృంభించి, ప్రపంచమంతయునిండి, లోకమంతయు తనదిగా భావింపఁజేసి, లోకమునకుఁగానిది తనది కానిదిగా భావింపఁజేసి, లోకపు మెప్పునకు వచ్చునదే తన మెప్పనియు, లోకమే తాననియుఁ, దానన లోకమనియు, విశ్వమయతనొందిన "స్వ" లేక స్వార్థచింత, లోకకళ్యాణ చింతగా పరివర్తించి లోకకళ్యాణ చింతయందు స్వార్థములీనమై, మఱి కానరాకయేపోవుట రెండవది.

ఇట్టి విజ్ఞాన ముదయింపఁజేయునది విద్య. అట్టివిద్య యనేషు లక్షణమునకుఁ బెద్దలసేవ లక్ష్యము. ఇది యెఱింగి యాసక్తి నెవఁడు గోసికొనునో, యాతఁ డహంకారమును భస్మము జేసికొనినవాఁడే యగుచున్నాఁడు. అపుడాతఁడు లోకమునంతను వశంవదముగా నొనర్చుకొనుచునే యున్నాఁడు.

ఇదియంతయు నిట్లుండ, లోకసంగ్రహావృత్తము యోచించి చూడ, నియమబద్ధజీవనులయి, నియమబద్ధమగు లోకసంగ్రహా వృత్తిగలిగి యుండవలెను. అట్లగుటంజేసి స్వేచ్ఛాప్రేరిత కార్యము లందు యథేచ్ఛావ్యాపారముగలవారుగాక, సదసద్వివేకమార్గాను వర్తులయి, నియమితకృత్యులయి, కులక్రమాగతసంప్రదాయకులయి యుందురేని, యిహాలోకమున శుద్ధచారిత్రసంపద యెట్లొనగూడునో పరలోక సంపాదనార్థమగుసాధనములును నట్లొనఁగూడఁ గలవు. ఇహాపరము లన్యోన్యాశ్రయములయి, కార్య కారణములం బోలె, నవినాభావసంబంధములయి యుండును. ఇంతయేఱుంగక, సహజమగు రాజపదమున నిమిడియున్న యీసుగొనముఁ గలిగిన

మాత్సర్యాది విరోధివర్గముచే నాఁచబడిన మన సుయోధనుఁడు, సూతసుతాది మంత్రివర్గముచేఁ, బ్రోత్సహింపఁబడి, పాండుపుత్రులపై నెల్లప్పుడును గాలు ద్రవ్వుచునేయుండును. ఇదియెంతయు తగనిపని.

పోనీయని మనమందఱమిపుడున్నట్లే యుండుమాయని తలంతుమన్న, నిమ్మహీచక్రంబును బరిపాలించినమహారాజు లెవరుమాత్రము గజతురగాది సంపదలును, గాంతలతోడి విహారలీలలును, విస్ఫురితాభరణానులేపవస్త్రజనితవైభవములును బొందియుండలేదు! ఎవరుమాత్రమునిలిచిరి? ఇపుడీకానవచ్చునదంతయు నిట్టులే కలకాలము నుండునని తలంతువా? ప్రకృతికి మార్పుసహజముసుమా! అదికాదందువేని, యేరీ నీ పితృపితామహులు? హస్తిశంతనాదులేరీ? హస్తి నిర్మించిన హస్తిపురముమాత్రము మిగిలినది. శంతనుఁడు గంగనువరియించుటచేత, తజ్జ్యేష్ఠపుత్రుండగు భీష్ముఁడు రాజ్యముత్యజించుటను నీవును బొందుందుము మీమూలమున దుర్యోధనాదులును, ధర్మజాదులును, నీసునరోసమునుబూని యింతలుదెచ్చిపెట్టుకొనుటలు మిగిలినవేకాని —నిమిత్తమాత్రులెయూదురుగాక—కారకులగువారుమఱిలేరే! కాని వారు కారకులనువార్తమాత్రము మిగిలినది. అట్లగుటఁ బరిణామస్వభావముగలయీప్రకృతిలో మెలఁగుచు, లోక కంటకులమనిపించుకొనుట కులమునకుఁ బాడియగునా? కులమునకు వన్నెదెచ్చిన వారందఱును గతింపఁ గులమునకుఁ గళంకము నాపాదించువారు తుదకుద్భవించిరను నపయశమా మనము గడించుకొనునది? మన పెద్దలూర్జితవంతులై యెంతెశ్రమపడి విఖ్యాతపురుషులై నెగడిరో, తుంటరులమై దుర్యశమును నపఖ్యాతియు నార్జించుకొనుట కంత కష్టమును బొందుచున్నారము. మనకు దుష్కీర్తివచ్చుటతో నాగక, భారతభూమినున్న రాజచక్రమున కంతకును సంఘాతవినాశము దేఁగల ప్రయత్నమునకే మనము సాయపడుట, జరుగుచున్నది కదా యని దుఃఖింపక తప్పదు.

మీయాదరణకుఁ బాత్రులగు పాండవేయులఁ బిలువఁబంపి, "మాతోడఁగూడి కుడిచి మనుఁ" డని మీయంత నుంచుకొనుటయు సర్వవిధమ్ముల శ్రేయోదాయకమును, తేజోలాభకారియు, నయి యున్నది.—కాదందువేని, నీవు దుర్యోధనాదుల నెల్లని నోడం బఱచి, పాండవేయుల జీవనంబునకగు కొన్ని యలంతి పల్లియలనైన నేర్పఱచి, యిచ్చి తెఱవుఁ జేసెదేని, యదియు లెస్స. ఇదియుఁ గాదేని, సుతునెడ గ్రుడ్డిప్రేమం దొరసిపుచ్చి, యిఁక నీకడకాలము బ్రిశాంత ముగఁ బోనిమ్ము. ఇట్లునట్లునుంగాక, పాండవ్యులతోడి పెనకువకే దిగఁదలంచితేని, యద్దానం బ్రతీకారంబులేని పశ్చాత్తాపంబు పుట్టుట యందేమాత్రమును సంశయములేదు. కావున నెన్నివిధాలఁ జూచి నను, బాండవేయులతోడి సంధిసేతయు మేలు. కాని యీసయ ములు నీకంతగ రుచింపవు. కాఁదగినది భిన్నరూపమునొంది, పర్యవ సానము ప్రత్యేక ముఖమున సిద్ధమయియే యున్నదేమో! నీకు నిద్దురరామి నన్నుఁ గథలఁ జెప్పుమన్నట్టులే తోఁచుచున్నది గాని, కార్యకారియగు ప్రకారము మాత్రము దోపకున్నది.

— ధృతరాష్ట్రుఁడు —

విదురా! నీనుడులు సమంజసములును ననుసరణీయంబులును నయియున్నవి. కాని సుయోధనాదులు, పాండుసుతులతో సంబంధము లేకుండఁగనే, జీవింపగలమను ధైర్యమున నున్నట్లు తోఁచుచున్నది. లేకున్నచో, వీరికింత మొండితనమెక్కడనుండి వచ్చినది?

— విదురుఁడు —

పాండవులసాహాయ్య మక్కఱలేకుండిన లేకుండకపోవచ్చును గాని, సంపదకు సాహాయ్యంబువలయు; సాహాయ్యంబునకు సంపద వలయు; నట్లగుట సాహాయ్యసంపద లన్యోన్యసహాయంబుల పేక్షించు స్వభావంబుకలయవి. కావున మీసంపదకు సాహాయ్యంబువలదనుట భావిఁ గనుంగఁగోరని గ్రుడ్డితనంపుఁ జిహ్నము. మీసంపదపైనాధారపడఁ

దగిన పాండవేయుల నీయండనుండ నియమించినచో, వారి సాహాయ్యంబు నీకుం బ్రియంబొనఁగూర్చును. కావున నటు సేయుటే భీష్మబాహ్లికాదులకును, నాకును నభిమతము. వారల నెడ సేయుట మన లావును వెలి సేసికొనుటయె యగును.

మఱొక్క మాట: కురువంశ నిస్తారులగు భీష్మయుధిష్ఠిరులును నిర్వక్రవిక్రములగు కర్ణార్జునులును, బ్రతాపధాములగు భీమ దుర్యోధనాదులును, శస్త్రాస్త్రపండితులగు నభిమన్యులక్షణ కుమారులును, శాపానుగ్రహసమర్థులగు ద్రోణద్రుపదాది పరమాప్తులును, వారి వారి బంధుమిత్ర గణంబులును, నీవారై నీకుఁ గైదండలిడఁగ, నీవు పృథ్వినిశాసింప, నొరులకుఁ గన్నెత్తియైనఁజూడవశంబగునే! పాండవులే కారణమున నైన వైరముండలంపక యడవుల నాకు లలములం దినుచుఁ గాలముబుచ్చనెంచినను, నీ నందనునందుమాత్రము వసుంధరాపరిపాలనభారంబు నిర్వహింపఁబడ నేరదు సుమా! నీసామ్రాజ్యంబుననున్న సామంతరాజులు శంతనునాటివలెగాక,—మాయంత వారము మేము- మేమీయిభపుర సామ్రాజ్యపదవినేల యంగీకరింపవలె--నను నూహాలతోఁదత్తదుచితప్రయత్నములనున్నారని, నీకును నీకొడుకు గమికిని నెఱుక లేకున్నది. కురుసామ్రాజ్యపదవినంగీకరింపని యాంతరంగికభావముననే చుమా జరాసంధుఁడు ప్రశ్రయప్రయత్నములఁ జేయుచుండ, భీముం డాతని మన్నిగొనెను. ఈసందర్భమునఁ గృష్ణుని సన్నాహము లప్రమేయములు. అవియన్నియును భీష్మునికెఱుక. సుసమయమున భీష్ముఁడు నీకవి తెలియఁజేయఁగలఁడు. ఏది యెట్లున్నను రాజ్యాంగదశఁ జూచినచో, శంతనునాఁటి రాజ్యగౌరవమును, గౌరవకులగౌరవమును నానాటికి క్షీణించిక్షీణించి, తుదకు బ్రబలదౌర్బల్యమునొంది, నామమాత్రావశిష్టమైపోవుచున్నదిచుమీ!

—ధృతరాష్ట్రుఁడు—

నీవు చెప్పినయంశములలో నేదికాదనఁగలను? నీపలుకులన్నియు

నిర్మలములై నిపుణజనసమ్మతములై, రాజనీతిబోధకములె యయ్యును గొడుకును విషువనోపమి ధర్మజయతియని యూరకుండఁడు. పాండవులయశమువినఁగోరుదు నేగాని, దుర్యోధనాదుల చెడుగోర్వలేను. ధార్తరాష్ట్రవినాశమూలమునఁ బాండవులభివృద్ధిఁగాంచిన నేసహింపలేను. దుర్యోధనాదులతోఁబాటు పాండవుల యభ్యుదయము నాకభిలషితమె కాని నాకొడుకు పాండవులమనికియే యొల్లకున్నను, ఆతని వినాశము మీరందఱును కోరినటుల నేఁ గోరఁజాలకయేకద, ధర్మజయతియని మిన్నకుండుటకుఁ గతంబైనది. నాయైహిక జీవనవ్యవసాయ మిట్లింత దుష్ఫలమిచ్చినది. కావున నిఁక నైహికజీవనవిశ్రేణి మూలమున పరమార్థము గ్రహించెద ననునాస మఱిలేదు. కనుక, పరమార్థదృష్టి నాకుఁ గలుగు తెన్నేర్పఱచి, పారలౌకిక చింతందగులు గుప్తార్థముల నాకు బోధించి నను ధరింపఁజేయుము.

— విదురుఁడు —

అగ్రజా! నీకోరిక కాదనలేనుగాని వేదాంత వేద్యంబులగు నర్థములు నా కగోచరంబులగుట సనత్సుజాతునివలన నీవెఱుంగఁ దగును.

అని చెప్పి విదురుండును ధృతరాష్ట్రునానతి నాసనత్సుజాతుని దలంచికొనిన నాతఁడు ప్రత్యక్షమై యెదుటఁగన్పట్టి యేమికావలెనని యడిగిన, నామహాత్మునాతడిట్లు ప్రార్థించెను.

"మీరును గారుణ్యాతిశయంబున విజయంచేసితిరి. గురుసమాశ్రితులగు వారెద్దానివలన సుఖదుఃఖంబులు, లాభాలాభంబులుఁ బ్రియద్వేషంబులు నాదిఁగాఁగల ద్వంద్వంబులంబడక బ్రదుకుదురట్టి పరమార్థోపదేశంబున నితనిం గృతార్థునింజేసి రక్షింపవలయు."

అని ప్రార్థించిన ధృతరాష్ట్రుండును దదనురూపంబగు నాలాపంబుల సనత్సుజాతుని నారాధింప నాతండును బ్రసన్నుండయి, ఆధ్యాత్మవిషయంబులగు వివిధవాక్యంబుల సోపానప్రకారంబున నంతకంతకు

సూక్ష్మంబులగు నర్థంబుల సమర్థించుచు, బాష్పిప్పుం డడగిన దానికెల్ల సమ్యక్జ్ఞాన సంకలితంబగు తెఱంగున బలుకుచుండఁ దనకులంబున జనియించిన ధార్తరాష్ట్రు లన్నదమ్ములతోఁ గలహించుటకు దుఃఖించి, వివర్ణతనొందినట్లు చంద్రురుండును వెలవెలవోవుచుండెను. అట్లు ప్రభాతంబగుటయు ధృతరాష్ట్రి విదురుల నామంత్రణంబు సేసి యద్దేవ ముని యంతర్థానంబునందె.

అనంతరము విదురుండును నాంబికేయునికడ సెలవుగైకొని నిజనివాసంబునకేగెను.

ఎనిమిదవ ప్రకరణము

నాల్గవ ఖండము

సంజయుఁడు మఱల ధృతరాష్ట్రునిఁ గలసికొనఁ గురుసభ కేఁగినప్పటి స్వగతవిచారము-తన్నుఁ బిలువ వచ్చిన దౌవారికునితోఁ దా నెఱపిన సంభాషణము-నైసర్గికవిషయనిరూపణము-ప్రాంతపరిస్థితుల రాజకీయ విషయచర్చ.

"కొందఱు వ్యక్తిత్వముచేతనే యుచితానుచితజ్ఞతఁ గలిగియుందురు. మఱి కొందఱు విద్యాధిక్యముచే నౌచితి నెఱుంగఁజాలి యుందురు. ఇంకం గొందఱౌచితి నెంత యెఱింగియున్నను, తదౌచితి నాచరణమ్మునకుఁ దేఁజాలక, దీర్ఘ సూత్రుని విధమ్మునఁ గార్యదిశ స్థిరపఱచుకొనఁజాలక, యేమియుందోపమిఁ దుదకు ప్రమాదంబునం బగులువడియెదరు. వేఱొక కొందఱనుభవముచే నాపద నొందుచున్నను, దత్కారణము తమప్రవర్తనమందె యిమిడియున్నదని యెఱుంగమిఁ దమపరివర్తనను సరిపెట్టుకొనఁజాలక దుఃఖముఁబొందుచునుం గూడఁ దమ ప్రవర్తనను సరిపెట్టుట కెవరేని జఱిఁగిన ఘట్టముల కార్యకారణ సూత్రములతో నెత్తి చూపుటయె పటిష్ఠించినచో, నదియెంతవఱకు సమన్వయయోగ్యమని తమలోఁ దామాలోచించుకొనన్నైన నొల్లక, మఱింత దుష్టుసుతేనముఁజూపుచు, మఱియు మఱియు దురితంబులు ఘోరయుకార్యంబుల నాచరించుచుందురు. మనుజునకును మృగమునకునుగల ప్రధాన భేదమొక్కవిషయమున మాత్రమె గోచరమగుచున్నది. సంఘటిల్లిన దానిని గేవల మూకీభావముతో మృగ మనుభవించుచుండ, మానవుండు తత్కారణ మరయఁ బ్రయత్నించుచుండును. తనకు లోకముఁ దెలిసికొను వయస్సువచ్చినదాదిగఁ దన పరివర్తనను దిద్దుకొనుటయె ప్రధానముగ నెంచుకొని, తనయంత్యకాలము వఱకును,

తానేసంఘమునఁ బ్రవర్తించుచుండునో, యా సంఘసంప్రదాయముల ననుసరించి తనపెద్దలు చన్నతెన్ననే తాననుగమించుచు, ధర్మాధర్మములును నీత్యవినీతులును గమనించుచు దేశకాలపాత్రలను గుర్తించుచు, కులాచారము వీడక, తన నడవడి దిద్దుకొనుచు మఱియుఁ గాలము పుచ్చుటే ప్రధానకార్యముగా నెంచవలసియున్నది. పొరపాటొందుటే మానవునకుఁ బరిపాటియగుట, గడకాలముదాఁక దిద్దుబాటు నొందుటే తన ప్రవర్తనకుఁ బ్రధాన లక్షణమై యున్నది.

మానవుని ప్రవర్తనయందు దోషములుండకపోవు; తద్దోషము లింకొకనిచేఁ బరిశీలింపఁబడి సవరింపఁబడవలెను. అట్లే సంఘమున దురాచారము లుండక పోవు. సంఘమే దేశాచారములను, కులాచారములను సంప్రదించి, సదాచారముల నేర్పఱచును. అట్టి సంఘమున నివసించుచుఁ, దత్సంప్రదాయములనధిగమించి, ప్రవర్తించువానినే యసాంప్రదాయకుండని యందురు. సంఘ మొల్లనికార్య మకార్యము. సంఘశాసనము లనుల్లంఘనీయములు.

తానిష్టపడిన మార్గమున స్వజనము లామోదించి యనుసరింపవలెనని నిర్బంధించు వ్యక్తులందుఁ గలదోషములు కేవలము స్వార్థమఖండముగఁ బెఱిఁగి యుండుటచే గలుగు దోషములే యగుచున్నవి. ఈ స్వార్థ[illegible]ద్ధియైన కొలఁదిని, నిర్బంధాధికారమును నభివృద్ధిఁ జెందుచునే యుండును. నిర్బంధాధికారము చిరాయుష్మంతము కానేరదనిఁ గూడ ఎ ప మా నిర్బంధాధికారులెఱుంగకయెగదా, తమ దుర్మానము విచ్చలవిడిగా నుండుకొఱకుఁ, దమ యసహనమె స్వేచ్ఛగాఁ దిరుగాడుకొఱకుఁ, దమ యహంకారమునకంతరాయము కలుగకుండ నుండుకొఱకుఁ, దమ నిరంకుశాధి[illegible]బడి యుండుకొఱకుఁ, దమ దురభిమానమె యెల్లకాలమును సాగుచుండు కొఱకు, ధర్మాధర్మ విచక్షణగాని, నీత్యవినీతివిభేదముగాని, గమ్యాగమ్య వ్యత్యాసముగాని, తమకుఁగాఁ దోఁపకున్నమానెఁగాని, యొరులు చూపిననైనఁ బరిగ్రహింప నొల్లకుందురు!

శంతనుకాలాంతముపర్యంతము నీ ధార్తరాష్ట్రికుల మేమాత్రము గడించినదో కాని, యాసౌశీల్యము మచ్చుమాత్రము నిపుడు కానరాకున్నది. అహంకారము కన్నులు గప్పుచున్నది. దుర్మానసము విశేషించినది. అసహనము ప్రబలమైనది. దురభిమానము విజృంభించినది. హేయములౌ నిన్నింటిచే నిండియుండి, సంస్కార

మన్నిదెశల నావశ్యకమయి యుండినతఱి నీ కొంతవు లధికారముకూడ వంచనమెయి నొందిరి; కావున నది నిరంకుశాధికారము కాక సామ్యాధికార మెట్లగును?

రాజ్యపాలనార్హులగు రాజుల నణిచికొని మనుమనుటయు, భర్తచేఁ బ్రహోవ ణార్హ్వాయను నాఁడు దాని నొకకడ నూఱిగముఁ జేసికొని జీవింపు మనుటయు, సమానధర్మములె యయి నెగడుచున్నవి. ఇట్టి పట్టుల నుపదేశకుల స్వార్థ పరతయో, చూపోపమియో, ప్రధానకారణములయి పరిఢవిల్లునేగాని జగత్కల్యాణ మెఱిఁగి సర్వదేశములందును, సర్వకాలములయందును ననుసరణీయంబులగు నుపదిష్టమార్గంబులయి నెగడఁ జాలవు. కావున నుపదేశికుఁ డెంతదూరము స్వార్థము త్యజించి ప్రవర్తింపఁగలఁడో, యాతఁడంతదూరమును నాత్మోపదిష్టవిషయమును వ్యాపనము సేయఁగలుగుచుండును "

* * *

అని యింకేమేమియో తనమనమున ననుకొనుచు నాఁటికేయుం దర్శింపఁ గురుపతిసభఁగూర్చి, సంజయుం డరుదెంచుచుండ, రారాజునాన సంజయుం దోడ్కొనిరా నొకదౌవారికుం డెదురువడి,—"దేవా! చక్రవర్తి నిండుకొలువుండి, మిముఁ దోడ్కొని రమ్మని నను మీకడకనుప వచ్చితి" నని యనియెను.

—సంజయుఁడు—

నేనను ప్రభువర్యనార్థినయిమే వడివడి నడచుచు వచ్చుచున్నాను. నిండుకొలువని యంటివే: ఎవరెవరు విచ్చేసియున్నారు?

—ప్రతీహారి—

దేవా, ఎవరని చెప్పఁగలను! ఇపుడా సభను తమరుతప్ప మఱి లేనివారే లేరు. కొలు వంతబలిసియున్నది.

—సంజయుఁడు—

సరియేకాని నీవుచూచినవారిలోఁ గొంత మందియైనను నీకు జ్ఞాపకముండక పోరు. కావున నీవు గురుతించినంతవఱకు నచటనున్న వారి పేరులు చెప్పుము.

—ప్రతీహారి—

ఇపుడా కొలువునసున్న వారిలో, నా యెఱిఁగినంతవట్టు ద్రోణకృపాశ్వత్థా

మాదిగురుజనంబులును, గర్ణకృతవర్మాదులగు దొరలును, భీష్మవిదురబాహ్లీక సోమదత్త భూరిశ్రవ ప్రభృతులగు బంధుజనంబులును, దుర్యోధనదుశ్శాసన ప్రముఖులగు కుమార వర్గంబును వేంచేసి యున్నారు.

—సంజయుఁడు—

సరియె-వీరందఱును మనవారే. మన రాజునకు యుద్ధమున సాయమొనర్ప వచ్చిన రాజులలో నెవరెవరిపుడా సభనున్నారు?

—ప్రతీహారి—

పండల కొలఁది- వేలకొలఁది- తమతమ సైన్యములతో వచ్చియున్నారు.

ఉలూక దేశాధీశుఁడౌ క్షేమధన్వియు

కాంభోజజననాథుఁడౌ సుదక్షిణుఁడును

అంబష్ఠ దేశాధిపతియౌ శ్రుతాయువును

ప్రాగ్జ్యోతిషాధినాథుడౌ భగదత్తుఁడును

ఉత్తరకోసలఁ (అయోధ్య) రాజగు బృహద్బలుండును

హైహయదేశ [మాహిష్మతి] ప్రభువగు నలుఁడును

దశార్ణదేశపు ధరణీశుండగు హిరణ్యవర్మయును

త్రిగర్తక్ష్మాపతియగు సుశర్మయు

అవంతీ కాంతులగు విందానువిందులును

సింధువిషయేశుఁడౌ జయద్రథుండును,

మద్రనాథుండగు శల్యుండును,

గాంధారాధినాథుండగు శకునియును,

మఱియు నింకెందఱెందఱో వచ్చియున్నారు. ఇంకెందఱు ప్రభువులు తాముదయచేయఁ జాలమి, తమతమ సైన్యముల మాత్ర మంపియున్నారు.

—సంజయుఁడు—

అయిన గొప్పసభ జరిగియున్నదే!

—ప్రతీహారి—

దేవా, సభమాటకేమిగాని, పోరులేకుండఁజేయు త్రోవ మఱిలేదా?

ఎనిమిదవ ప్రకరణము

— సంజయుఁడు —

మనరాజిష్టపడెనఁటో లేకేమి!

— ప్రతీహారి —

మనరాజనఁగా:- పెద్దరాజా, చిన్నరాజా?

— సంజయుఁడు —

ప్రత్యేకప్రత్యేకముగ మనకన్నులకు 'పెద్దరాజు' 'చిన్నరాజు' అనియిరువురు గానవచ్చుచున్నారు; కాని వీరిరువురు నొకటియే.

— ప్రతీహారి —

అదియెట్టుల?

— సంజయుఁడు —

ధర్మాధర్మ విచారశూన్యుఁడై, మాత్సర్యవశుఁడై, దురాత్మనాంధుఁడై, పాండవులకు నిలువనీడయైన నుండనొల్లఁడు చిన్నరాజు; అధర్మమనియు, నసాంప్రదాయికమనియు నెఱింగియు, ధర్మమార్గమున బుద్ధులు సెప్పి, పుత్త్రుని మనోగతిని మార్పసమర్థుఁడుకాఁడు పెద్దరాజు. అట్లగుటఁ, గంటికిఁ గానవచ్చువ్యక్తులిరువురే యైనను, వీరియభిమతమొక్కటియేయగుటను, వీరి నొకరుగనే భావించి, మనరాజని యంటిని. సన్నద్ధమయిన యుద్ధమును మాన్ప నెవరితరము!

ఇట్లు సంభాషించుకొనుచు వీరిరువురును నగరుసమీపించిరి. ప్రతీహారి మున్ముందుఁగ నగరుప్రవేశించి, సంజయురాకఁ దెలియఁగించి, రాజుశాసనమున సంజయునిఁ దోడ్కొని సభాభవనముఁ బ్రవేశించెను.

ఎనిమిదవ ప్రకరణము

అ యి ద వ ఖ ం డ ము

బాహ్లీక సోమదత్తులు కురుసభకుఁబోవుచు నెఱపిన సంభాషణము. కురుపాండవుల స్వభావ నిరూపణము. రాజ్యము జ్యేష్ఠక్రమానుగతమెగాక, తక్కటి భ్రాతృవర్గము కూడఁ బాల్గొన నర్హులని, పూర్వపు టనుభవములంగూర్చి ప్రసంగించుట—

—సోమదత్తుఁడు—

స్వామిపు డెచటికి దయచేయుచున్నారు?

—బాహ్లీకుఁడు—

కురుపతి కబురంపినాఁడు.

—సోమదత్తుఁడు—

రమ్మనువార్త నాకునుఁ జేరినది. కాని కారణముమాత్రము తెలియలేదు.

—బాహ్లీకుఁడు—

కారణమునకేమున్నది—ద్రుపదపురోహితురాయబారపు కథనము వినివిని మనరాజు సంజయునియూలమునఁ బాండవులకడ కేమని సందేశమంపినాఁడో—సంజయుండు మరలివచ్చి నిన్నటిరేయి రాజునకేమని నివేదించినాఁడో—కాని యాంబికేయుఁడు, తనకుఁగూర్కురామి, విదురుంగబురంపిపిలిపించుకొని, తెల్లవాఱు నందాఁక నేమేమియో బ్రసంగించుచునే యుండెనఁట! విదురుండొనర్చిన నైతిక ప్రసంగ మంధరాజుమానసమున కెక్కమి నిఁక నాధ్యాత్మికప్రసంగమునకుఁగావలయు సనత్సుజాతునింగూడ రావించి, భగవద్విషయములంగూర్చి ప్రసంగములొనర్చి

యుండును. లౌకికపారలౌకిక విషయములు రెండును సమముగానే వైచిత్రవీర్యునకు మాన సోత్సాహము గలిగించియుండును. ఇపుడు సంజయుండేమి సందేశముం గొనివచ్చెనో, సానుకూలముగ నుడువఁగలఁడనియు, నది వినవలసియున్నదనియు ననుగమ్మని రాజు కబురంపెను. శుభావహమై లోకకళ్యాణప్రదమైనవార్త సంజయుమూలమున వినఁ గలుగుదుమో, లేక పట్టువిడుపులులేని మనధార్తరాష్ట్రవంశవినాశహేతుభూతమా పాండుపుత్రులప్రయత్నమే వినవలసియుండునో, తెలియదుగదా! దశదిశలఁజూచు కొని ప్రవర్తించుప్రక్రియాయోజనంగని దుర్యోధనాదులందలంచి చింతింపవలయునో, లేక సమయోచితప్రవర్తనమునకుఁ వో డెదుటివారిపై నేరముమోపెడి తెన్నెఱింగిన ధర్మజుని సహాయసూత్రధారికి మదిందలంకవలయునో తెలియకున్నది. పరమలౌకికుండగు ధర్మజుని శీలమునకుఁ బరీక్షాసమయములయందు ధర్మసూక్ష్మములనెన్నుచు నిరూ పించు నిరుపమానశక్తిగల శ్రీకృష్ణుని నేర్పుతోడగుట దుర్యోధనాదులకింత తమపట్టు దుగుటో, లేక తమపట్టుసడలించుకో, రాజనీతిపరముగ కర్తవ్యమె యాయుంగ్యను, గర్ణాదులదృఢప్రతిజ్ఞలచే మోహితులయి, సౌబలాదుల కృత్రిమపటాలోచనములచే, దృఢీకృతమనస్కులయి యెదిరిబలముగాని, కృష్ణుని వివిధోపాయపరాయణతంగాని పరికింపఁజాలక, దీపపుకాంతిం గాంచి భ్రమియించి, తునకుసుఖులంబాయు శలభము లట్లు మ్రగ్గుదురోకా యని తోచుచున్నది-ఇంతకును నేమికానయియుండి యింతలు పుట్టుచున్నవో యెవనికెఱుక!

తాను చక్రవర్తియయినను నేనును రాజకుటుంబములోని వాఁడనగుటయే గాక, విశేషించి తనతమ్ముండనగుట, మాయన్నశంతనుఁడు బాహ్లికదేశము నా కొసంగి నన్ను బహూకరింపలేదా! దానిని మన మనుభవించుచుండుట లేదా!

పాండవులు తమయయ్యభాగమిమ్మనిరి. తాము రాజసూయమ్మున నలవఱచి కొనిన భాగమిమ్మనిరి. వంచనచే నన్యాయాక్రమణ మొనర్చినభాగ మిమ్మనిరి. ఏ పేరిడిననేమి-ఏదియైననేమి-ఏమిచ్చిననేమి-వారు వలవందురా? అంబికేయునిచేతి కడ్డము పెట్టువారెవరు? మాయన్న శంతను డిట్లేచేసెనా? రాజ్యలుబ్ధత యెంతెంత లోనర్చుచున్నది-ఔరా, ఎంత దారుణము!" * *

ఇట్లుప్రసంగించుకొనుచు నా బాహ్లిక సోమదత్తులు కురుసభాభవనముఁ జేరిరి.

రా య బా ర ము

చంద్రవంశమునేలిన రాజులలోఁ గడపటి రాజగు ప్రతీపుని రెండవ కుమారుఁడు శంతనుఁడు. అతని వంశములోనివారు ధృతరాష్ట్రపాండు భూపతులు. ప్రతీపుని మూఁడవకుమారుఁడు బాహ్లికుఁడు. ప్రతీపుని జ్యేష్ఠకుమారుఁడగు దేవాపి రాజ్యమేల ననర్హుఁడగుటచే నాతని ప్రజలు రాజ్యభ్రష్టునిఁ గావింప రెండవవాఁడగు శంతనుఁడే రాజయ్యెను. కురురాజ్యములో నొకటనుకయగు బాహ్లిక దేశము ప్రతీపుని మూఁడవ కుమారుండగు బాహ్లికునకొసంగఁబడుటచేత, నాతని పుత్రుఁడగు సోమదత్తునితో బాహ్లిక దేశము పాలించుకొనుచుండెను. కారణములేవియైననేమి, ప్రతీపుని జ్యేష్ఠపుత్రునకు రాజ్యము రాక, రెండవవాఁడగు శంతనునకు దక్కినది; శంతనుని జ్యేష్ఠపుత్రుఁడగు భీష్మునకుఁ గాక ద్వితీయపుత్రుఁడగు చిత్రాంగదునకు దక్కియుఁ నాతఁడు చిరకాలము ననుభవించుటను దుదకు విచిత్రవీర్యునకుఁ దక్కినది. పిదప, జాత్యంధుండగుటను, ధృతరాష్ట్రునకు రాజ్యార్హత లేమిఁ బాండునకుం గురుసామ్రాజ్య పట్టాభిషేకమొనర్పఁబడియెను. అట్లగుట నిటు మూఁడుతరములు దాఁక, జ్యేష్ఠునకు రాజ్యము దక్కుటఁ గురుసామ్రాజ్యవంశమునఁ జూడము.

మఱియు శంతనుఁడు రాజ్యాధిపత్యము వహించిన వెంటనె తనతమ్ముఁడగు బాహ్లికునకు బాహ్లిక [బాక్] దేశమొసంగెను. తద్రాజ్యాధిపత్యము వహించుటచేతనె గదా యాతని బాహ్లికుండందురు. బాహ్లికుండు నిజపుత్రుండగు సోమదత్తుండును భారతయుద్ధములో తాముదివికేగుదాఁక స్వరాజ్యము పరిపాలించుకొనుచునే యుండిరి, భీష్మునట్లు బాహ్లికుఁడు రాజ్యము త్యజింపలేదు.

ఎనిమిదవ ప్రకరణము

ఆ ర వ ఖ ం డ ము.

సంజయ ధృతరాష్ట్రుల ద్వితీయసమావేశము-పాండవుల తలంపులను దనయభిప్రాయములను జోడించి, పాండవులను, వారికి సాయమొనర్పవచ్చినవారిని, వేర్వేరెంచి, వారివారి బలాబలముల నిరూపణముసేయుట-పూరుని కాలమునుండియు హస్తి శంతనచిత్రాంగదుల కాలములవఱకునుంగల రాజ్యాంగపరిస్థితుల విమర్శించుచు, ధృతరాష్ట్రకాలమునంగల రాచరికపులోపముల నెత్తి చూపుచు, భీష్ముండు చేసిన మహోపన్యాసము- పాండవ కౌరవబలములలోం బ్రతిభా మహత్వముల ననుసరించిన వ్యక్తి విభజనము-భౌతికముగం గానవచ్చు మానవశత్రుత్వము-పరస్పరవిరుద్ధ గుణశత్రుత్వము-వీనినిగూర్చిన గుణ విభాగచర్చ-భీష్ముండు చూపిన కురుకాలమునాంటి హస్తిపురరాజ్య వ్యవస్థ-శంతను కాలమునాంటి సమృద్ధిమ-ధృతరాష్ట్రకాలము నాంటి ప్రభుత్వమహత్వపటుత్వము- యుద్ధకాలమునాంటి రాజ్య వ్యవస్థ-అప్పటిరాజకీయ పరిస్థితులలో శ్రీకృష్ణునిపురస్సరణమునకుం గల సహజమగు కారణాన్వేషణము-శ్రీకృష్ణుండంతకు పూర్వమే జరాసంధాదిమహారాజుల వధించుటయందును, కురుపాండవకలహము నందును, దాను సంబంధము గలిగించుకొనుటకుంగల కారణములు- దుర్యోధను వంశనిర్మూలనమొనర్ప శకుని నిశ్చయించినాండనుటకుం గల పూర్వకారణవిమర్శ-కర్ణార్జునుల పరాక్రమ విచక్షణలు-పాండవులకు ధరణీభాగమొసంగవలసిన యవసరమునందుంగల రాజకీయ కారణచర్చ-భీష్మద్రోణసంజయవిదురాదుల హితబోధనము-దుర్యో

ధనుని మనోనిశ్చయము-తన్నిశ్చయ కారణాన్వేషణము, సకారణ సమాధానము, స్వప్రయత్న కారణసమర్థనము-కర్ణభీష్ముల సంభాషణము-భీష్ముఁడు కర్ణుని బాహ్యముగ నీచపఱచుచుఁ బలికినకటూక్తులు కర్ణుని యస్త్రసన్యాసము- కర్ణునిఁగూర్చి భీష్ముని యాంతరంగిక భావము.

రాజబంధువు లొకవంకను, అమాత్యవర్గ మొకచాయను, పురోహిత హితజన మొకచక్కిని, సహాయసంపద నొసంగవచ్చిన రాజచక్ర మొకదిక్కునను, బారులుదీర్చియున్న సమయాన, తారాగణపరివృతుండగు రేఱేనివడువున సత్కురుపతి చెలువొందియుండ సభం బ్రవేశించిన సంజయుండు ధృతరాష్ట్రు సమీపించి తననుఁ జాఁ దెలిపికొని, ఱేనికి మ్రొక్కి యాశీఃపరంపరలొంది, తత్సమీపస్థలంబునఁ గూరుచుండెను.

—ధృతరాష్ట్రుఁడు—

అమాత్యులారా, కురువృద్ధులారా, కురుకుమారులారా, మనసంజయుండు పాండవులదండకుం జని, వారిశుభోదర్కంబులం గాంచి వచ్చుట నిపుడీతఁడు మనకు వారింగూర్చి తెలుపఁగలాఁడు. మనము సావధానులమై విందుముగాక!

సంజయుండును లేచి నిలిచి సభవారికి నమస్కారమని సభం గలయంగనుంగొని, యిట్లనియెను—

“మనమహారాజు నన్నాతురమున ధర్మరాజుపాలికనుప, నేనుపప్లావ్యమున కేగి పాండవులదర్శించితిని. ధర్మపుత్రుండును నన్నెంతేనాదరించి, మీయందఱ సేమమును వేర్వేఱ నడిగి తెలిసికొనియానందమునందెను. కురుకులనాథుండు నాకుఁ గఱపినతెఱంగున నేకొఱంతయు లేకుండ నేనును బంధుత్వంబునకుం దగినమాట లాడితిని. పిదప నామాట

లకు సార్థకనాముండగు ధర్మజుండు పలికినచందంబదెల్ల పరమ ధర్మమార్గంబు ననుసరించి, నీతిపథంబు దప్పకయయుంట, నెవ్వరము మాత్ర మేమని యనఁగలము! ఆప రేంగిత జ్ఞానము, నా లోకజ్ఞానము, నా వినయవివేకజ్ఞానములును మఱే నరేంద్రనందనునంతైనఁదిలకింపఁ గలమే!

నే నుపప్లావ్యంబుఁ జేరిన యంతన తొలుదొల్త మాధవు దర్శింప నెంచి, తన్మందిరముంగూర్చి చని నారాక యమ్మహామహు నకుం దెలుప- నా నందనందనునకు మనరాజునెడఁగల ప్రేమయు గౌరవమును నెంతఁగలవో కాని,—తానును, సత్యభామ యును ద్రౌపదియును, నర్జునుండును, రహస్యగోష్ఠినిరతాత్ములయియుండియు, ప్రద్యుమ్నాది కుమారవర్గమైనఁ దమ్ముఁ జేరని చెందనియట్టిచోటఁ, గాంతాజనమ్ములచేఁ దా సేవలుగొనుచు నెంతేనివిలాసమ్మున ప్రమదస్థితి నుండియుఁ, ఫణీహారిచే నాకుఁ గబురంపెను. నేనును వినీతవేషుండనై కౌస్తుభలాంఛనుని దర్శింప సమీపించునరికి నరుం డన్నారాయణుని పాదములొత్తుచుండెను. అదివఱకే ప్రధానవిషయముంగూర్చిచర్చించు కొనుచుండిరో కాని, యాదేవకీనందనుని మోమునఁ జిఱునగవును, ద్రౌపదివదనమునరౌద్రమును, సత్యభామముఖమున నిశ్చితార్థమును, నర్జునునాస్యమున విన్నదనంబునుమాత్రము వెల్లివిరియుచుండెను. చూచినయంతన కృష్ణుఁడెంతయో యానందముతో, ననుఁజేరఁదీసి, మనప్రభుసహితంబుగఁ గురుకుమారవర్గముతో నాగక కురువృద్ధా మాత్యబంధుసుహృజ్జనంబుల నేమమారసి మనకురుపతినెంతేని ప్రస్తు తించి, తా నుపయోగించునట్టి యన్నపానంబులును, దాఁగట్టఁదగిన యమూల్యవస్త్రాదులును, దా ధరించునట్టి యలంకారములును నా కొసంగి, నను నెంతేని సంభావించెను.

[ధృతరాష్ట్రుంజూచుచు] ఆంబికేయా, ఇన్ని మర్యాదలును, ఇన్ని గౌరవములును, నీకొనర్చినవిగ నేభావించుచు, నీయనుమతి నని

నే ననుభవించితిని.

—ధృతరాష్ట్రుఁడు—

సంజయా, నిను సంభావనఁ జేసెననుమాట కేమిగాని, నీపోయిన కర్జ మయ్యర్జునసఖునకు నివేదింపనే లేదు కావలయు?

—సంజయుఁడు—

ననుఁబంపినకార్యం బాయదుకులభూషణునితో మనవి యొనర్చుటయు నైనది; నాపలుకులు విని పాండవమధ్యముఁ డలిగి బలుమొగంబు సేసికొని నాపలికిన పలుకుల కుత్తరంబొసంగఁ దొడంగినంతన వారిజోదరుం డాతనిఁ దనకనుసన్నల నపవారించుటయు నైనది. అందేమియు మఱి మిగుల లేదు.

—ధృతరాష్ట్రుఁడు—

అంతలు వుట్టెనేమి? అన్నా, కార్యము మించిరాదుగద! అర్జునుం డేమనియె? కృష్ణుం డేమని యపవారించె?

—దుర్యోధనుఁడు—

(తనలో) ఈసంజయుఁడు కృష్ణునితోఁ బలుకుచుండఁ బాండవమధ్యముండు చొరఁబడనేల?

(కర్ణునితో రహస్యముగా)

అంగరాజా! వింటివా యర్జునుని త్రుళ్ళిపాటు?

—కర్ణుఁడు—

ఆత్రుళ్ళిప్పుడడంగునా? ఎన్నియేండ్లరణ్యావాసముఁ జేసినను, తిండికెన్ని తిప్పలువడినను, నింకను నాతని మొఱవడి సడలలేదు; మేను దొఱలంగినఁగదా మొఱవడి వీడుట!

—సంజయుఁడు—

కృష్ణుఁడు నాతోఁ బనిచిన పలుకులు వినుము—

"ధృతరాష్ట్రుని నిండుకొలువున నాతని పుత్త్రగణమును, భీష్మద్రోణకృపాచార్యాదులును, గురుమిత్త్రబృందంబును వినుచుండ నీవు పలుకుము"

అని నాకుఁ గట్టడిచేసి పలికిన పలుకులు:—

'ఏమి కానయియున్నను గాక, యుధిష్ఠిరునకు గినుక జనించుట మాత్ర మగ్ని నార్పసమర్థమగు నీరుల నగ్ని యుప్పతిల్లుటవంటిదైనది, మఱి యాయగ్నిఁ జల్లార్చుటెక్కడి శక్యమగును? కావున నీకైన, నాకైనను, నేర్పునం ద్వారిజగను నముననే గార్యములొనర్చికొని, వారి చేసినపంపు నారి కొసంగి కృతకృత్యులగుట కలమనసు విలయమురా నీయకుండుటయ మేలుమాటయగను. కానివో, నాలుబిడ్డల చేయేవిధాల నాదరింపనలయు నయ్యాయిబిడ్డంబుల నానంద మొందఁజేసియు, సత్పాత్రంబులెఱింగి తమకుఁగల సంపదలెల్ల దానంబుసేసియు, బంధుమిత్రాశ్రితజనంబుల సంతుష్టిపఱచియు, మఱి యాతనువు లంటవుగదా యని, వైళమ తమ తమ యిచ్ఛానుగుణంబుగ నింద్రియభోగంబుల ననుభవించియు, తనవారి కోట్లుపలయు నట్లులవిహరించియు, మఱియు నదులలోగించియు, మఱియుఁ జూడరే మను నిశ్చయముతో, నవవేళ ప్రాణంబులిడికొని, రణభూమిం బవ్యంతు. ఇట్లాలసటకే కానోపు నానాఁడు మీకౌరవరాజులంపఱునుగలసి విలాసమునబఱిసియున్న సమయానఁ బాపము, పాంచాలిభూకోటాని మీరంపఱునుఁ బంచినపాటున కాలేమ దిక్కులకు బాహువులొడ్డి, యెంతవేడినను మీలో నెవరునుంగూడఁ గరుణింపమి, నాసతీలలామ నిస్పృహఁజెందె, దప్పులనున్న నన్ను-గోవిందుఁడా! కావుమంచు బిలవించుట, మఱినేఁ దీర్పఁగఁజాలనిబుజమయి నను వేధించుట, రెంటుకొనలనుఁబూని గాండీవ మెక్కువెట్టి నేటరేపట ననికెత్తివచ్చు కిరీటి తే రేనుగడుపుచుండ మీరెందుఁబోఁగలరని యిపుడుపుగ నవకాశము చిక్కనది.'

అని ముకుందుం డనెను.

వైచిత్ర్యవీర్యా! అచ్యుతుని యప్పలుకులువినియు, పాండవుల యెత్తివచ్చు సన్నాహములంజూచియు, నీకొడుకుల విడుపోవమియుఁ బట్టుసడలమియుం దెలిసికొనియు, నామదిం దలంకితిని.

(దుర్యోధనుం జూపుచు-సభం దిలకించి)

ఈతండు వారల నెఱుంగఁడు. భీష్మద్రోణులపాలిపును, కర్ణ

గర్వంబును, శకుని దుర్మంత్రంబును, తనయనుజుఁడు దుశ్శాసనుని యవివేకంబును, దనదుర్మానంబును దన్నుఁ గెలిపించునని పొగరెక్కి యున్నాఁడు. ఇట్టిపట్టుల నీతని పట్టుడిపించు టెట్టుల?

అని మఱియు సంజయుం డింకేమి చెప్పఁదలంచెనో కాని ధృతరాష్ట్రుం డందుకొని "అర్జునుం డేమనియెనో?" యని యడిగెను.

—సంజయుఁడు— (సాశ్చర్యముగ)

అర్జునుఁడా—అతఁడు కను లెఱ్ఱజేసి యిట్లనియెను.

(దుర్యోధను నుపలక్షించుచు) ఈదుర్యోధనుండును, నీతనికి సాయమొనర్ప నెంచివచ్చిన రాజలోకంబును నాలకించుచు నుండ, నిట్టు లనుమనియెను—

"—మే మిన్నిపాట్లు బడియున్నను, మాయన్న పాంచాలిని యడుగుటయు నా సుయోధనుఁడీకుంటయు, నింకనుపటస్థించెనేని, దుర్యోధనుఁ డింతదాఁక మాకొనర్చిన యపకృతులకును, వాకొనినకటూక్తులకును, మెఱుంగువెట్టుటయె యగును. నేనును మాయన్న భీమసేనుండును అమందానందమందునట్లు కార్యపశ తిరిగినదిగదా యని పరితృప్తులమగుదుము. ఇఁకనట్టి పట్టుల మేము నోట ననుటకేమున్నది! మాయిర్వుర నాదుర్యోధనుతోఁ బోరం డలకొననిచ్చుకంటెఁ, దన యహింసాధర్మము చివరవఱకును బాలించి, జనక్షయము కాకుండుమార్గముల నెంచి యెంచి, తానును దనతోఁబాటు మేమును పడరానిపాట్లం బడి, యెంత వేచియుండినను మఱి సామ్యమునఁ బ్రయోజనము లేని యిట్టిగుట్టముల ధార్తరాష్ట్రులను హతాశులనుఁ జేయ సంసిద్ధులమయియున్న మమ్మిఁక మునుపటివలె వారింపక, మాకు ననుజ్ఞ యొసంగుట కంటె నలధర్మజునకుమాఱి మిప్పట్టున నుచితధర్మ మింకేమి కలదు? దుర్యోధనుఁడు యుద్ధావని నంపశయ్యపైఁ బన్నుండకున్న మాయన్నయా ధర్మజుఁడు వనవాసమున ధూళియ్యంబవలించిన యాయాసము దొలంగఁగలదా? తానుసమయధర్మమునకుంగట్టువడి కౌరవ్యులెంతకాలమునకైనఁగాని నైతికవృత్తిం బూని, మా కిడిన యిడుములం గూర్చి పశ్చాత్తప్తులగుదురో కాయని మాధర్మజుం డెంతకాలము నిరీక్షణచేసినను, ధార్తరాష్ట్రులుతమతమోవృత్తి నిఁగల్గినమార్గ్యము వీడమి నింతవట్టునుఁ దనలోన నడంచికొనిన

యుధిష్ఠిరుకోపదవానలము శత్రుజనాటవిపైఁబడి దహనమొనర్చుచున్న పుడుగదా, ధర్మపుత్రుని సైరణ నసమర్థతగా నన్వయించుచుండిన ధృతరాష్ట్రనందనులు యమనందనుని నిజసమర్థతనెఱుంగఁగలుగుట! అంత్యకాలకాలుంబోలె భీమసేనుఁడు గదఁద్రిప్పుకొంచు మదించినయేనుంగుల గుముల, హయసందోహముల, రథవ్రాతములఁ బొడిపొడిగాఁజేయుచున్న సమయానఁగదా, దుర్యోధనుఁడు మాకు భాగంబిచ్చుటకుఁ బరువెత్తివచ్చుట! సాత్యకి నకుల సహదేవాభిమన్యులు శత్రుసైన్యములనెల్లఁ జెల్లాచెదరుగఁగొట్టి, పేరుగలవారినెల్ల మంటఁగల్పుచుండ మా కౌరవులు సంధిసేయఁదలంతురుగాని, యిప్పుడెట్లగును? అప్రతీపప్రతాపవంతులగు నైదుగురు ద్రౌపదీతనయులును, కొదమసింగములు మదోన్మత్తగజాళింబొదివిపట్టినరీతి నరాతిబలంబులనెల్ల నెత్తుటినీటఁదేల్చ, నదిచూచికాని మీ రాజుమాయోపనలుకదిరఁదుగా! తమ చెలులును జుట్టాలును స్వసైన్యంబులుగా బ్రాణాలపైఁదీపులువీడి, రణావనింబ్రవర్తిల్ల విరాటపాంచాలురసేనలత్యుద్రేకమతిఘోరాకారముదాల్చి, సమరావనిన్విహారము సేయుచుంటఁజూడకకాని, గాంధారీనందనులు పట్టిమాటలకుసుగ్రిక్కుదురనుకొంట వెఱ్ఱితనముకాదె! అదిమ్కననున్న శిఖండియు ధృష్టద్యుమ్నుండును భీష్మద్రోణులపై గల తమ ప్రాఁబగలఁదీర్చుకొన వారినెదిరించి, వారిపై కులుకులుగాంచి గాని మీరూరక రాజ్యమిత్తురే! గాండీవగుణనిక్వాణమునఁ జెవులుచిల్లులువోవ, శరపరంపరలు గగనవీథిఁగప్పుచుండ, ప్రతివీరులశరములు ఖండఖండములుగ నేల రాల, మీగజతురగాదిబలంబులెల్ల జర్ఝరితంబులై, యథాయథలైన యవయవములు నేలఁగూల, నెత్తురు, నెనడు, ముమ్ములు, సమరతలమెల్లఁగప్పు నంపవానలచే నెత్తురుటేరులు ప్రవహించుచుండ భీభత్సంబుగ గన్పడుసమరావనిం గపిధ్వజమును, ధవళాశ్వములును, శోభిలుచుండ, నొగలపై నచ్యుతుండలర, దేవదత్త ధ్వానంబు నింగిముట్టుచుండఁ దానెందు దాగుందునన్నను దనకొఱకు వెన్నంటి దశదిశలును బర్వెత్తుచుండెడి మద్దివ్యరథంబవలోకించినఁగాని మాపాలుమాకిచ్చుటంగూర్చి యాలోచింపఁడు రాజరాజు!

పితామహ గురు కృపాచార్యాదులకు మేముమ్రొక్కి మఱియు, మా రాజ్యభాగంబుకై సమరంబుసేయుదుము. కౌరవులపక్షమునబూని, యెవ్వరుమాతో సమరము నేసినను, వారి శస్త్రాస్త్రంబులు, ధర్మముచేఁ బ్రతిహతంబులు కాకతప్పవని తలంతుము.

వనవాసాద్యాయాసంబులు పడిపడి వచ్చి, మాతండ్రిపాలు మాకిమ్మని పోరనున్న మేము వాసుదేవుని మాయందిడుకొని, మఱియు నడతుము గావున మాకు జయశ్రీ లభియింపక తప్పదు. ఇఁకనటు కాక యన్యాయంబునకుఁ జొరనొల్లని దేవతల సైతము తమపక్షము సేసికొనివచ్చి మముమార్కొని, ధార్తరాష్ట్రులే మముఁగెల్చిరేని, ధర్మంబుకంటె నధర్మంబె బలవత్తరంబగు కాలంబువచ్చె ననియొక మంతె కాని, నాచేయునది మఱి యప్పట్టున నకార్యంబని యననోపము. మఱియింకను జూపుదుమన్నను సైరణయను నది యింకలేనేలే దనునంత యైపోవుటను, నేమాత్రము సత్సంప్రదాయిక చిహ్నము లున్నను నీవఱకే పశ్చాత్తాప మునయింపవలసిన కాలముగూడఁ గడతేరుటను, దుస్సంకల్ప మా గాంధారీనందనుల దెస ప్రబలమై యోర్వలేమి ప్రకోపించుటను, మేమిపు డేమాత్రమును విలంబము సేయక, యుద్యోగించితి మేని, కర్ణసహితమా గాంధారీనందనస్కంధావారములఁ దునిమి, పుడమి గైకొనుటయె, సిద్ధించుట కెన్నేని నిమిత్తంబులు దోచుచున్నవి. కాకున్న గాండీవమెక్కువెట్టకయె గుడుసువడుటయును, బాణంబులు తూణీరంబులనుండి తమయంతటన పై వెడలుటయును, బొర విడిచిన మహానాగంబువోలె, కరవాలంబు తనకుఁదాన యొఱవెలికి నిగుడుటయును, దేవదత్తంబు తనకుఁదాన మ్రోగుటయుఁ దటస్థింపఁజాలవు. పరిసరప్రాంతపరిస్థితులును, వాతావరణస్థితియును, జనసామాన్యపుటభిప్రాయమును, గార్యకారణసమన్వయమును బరికించినచో, సమరమే సర్వవిధముల సంసిద్ధమయియున్నది.

సంజయా, నీవు మరవక యీపలుకులెల్లఁ గురువృద్ధులును, నాచార్యవర్గంబును, విదురాది మంత్రివర్గంబును వినునట్లు కౌరవేంద్రుని నిండుకొలువునఁ బలుకుము. పిదప వారేమినిశ్చయించిన నయ్యదియ కాఁగలదని కొంకేమియును లేక, యుచ్చైస్స్వనంబున ధనంజయుండు వలికె."

ధృతరాష్ట్రుం డాపలుకుల కదరిపడి, మనసుకలఁతనొందుటచే నోటమాటలేక మిన్నకుండెను.

సంజయుపలుకులన్నియు వినివిని,

దుర్యోధనుదిక్కు మొగంబయి నిలిచి భీష్ముఁడు—

"సుయోధనా! ఇపుడు బావమఱఁదులును, సారథియు రథి

యును, నగు కృష్ణార్జునులు, వెనుకటికాలపు నరనారాయణులే యనియు, వారిరువురును జీవాత్మపరమాత్మలకుఁగల సంబంధముకలవా రనియుఁ బెద్దలాడుమాటలు నీకుఁ బోధ్యములై నచ్చవు కావున వాని నటుండనిచ్చి యిటువినుము:—

మన వంశమునకు మూలపురుషుఁడగు కురువునాఁటి కుల గౌరవములును, హస్తినాటి ప్రభుత్వపటుత్వమును, మాతండ్రియగు శంతనుమహారాజుకాలముననే కొంతతగ్గినది. అది మొదలిప్పటివఱకును మనసామంతులలో నొక్కండును హస్తిపురసమ్రాట్పదవి నంగీకరించి నట్టులు కానరాదు. వాణిజ్యమందే లక్ష్మివసియించుచుండును. లక్ష్మికి ఆగమన హేతుభూతములై ఆర్యావర్తమున నున్న భిన్నభిన్న వణి జ్మార్గములెల్ల మనచిన్నచిన్న రాజ్యముల నుండియే నడచుచు మన స్వాధీనములోనున్నవి. స్వాతంత్ర్యసంస్థాపనమున కా వణిజ్మార్గములు స్వాధీనపఱచికొననెంచి, యేకకార్యార్థులగు కొందఱు రాజులు కట్టు కట్టుట తటస్థించినది. ఇది మనసామంతరాజుల ప్రయత్నముల పరిస్థితి.

ఇఁక వణిజ్మార్గములెట్లున్నవో చూచితివా: కళింగమగధచేది సాళ్వశూరసేన దేశములమార్గమున నొకవణిజ్మార్గమును, మాగధనుండి ప్రాగ్జ్యోతిషమువఱకు నొకవణిజ్మార్గమును, మనహస్తిరాజ్యమునుండి పాంచాలమార్గమునఁ గాలయవనునిరాజ్యముమీఁదుగాఁ గుశస్థలము వఱకునుగల ప్రదేశములమీఁదుగా నొక వణిజ్మార్గమును, నిట్లనేక మార్గములు మనసామ్రాజ్యముమీఁదుగనే పోవుచున్నవి. ఇన్నిమార్గ ములను బరిరక్షించుటయు నిరోధించుటయు మన పనియైయున్నది. మాతండ్రిగతించినపిదప మనసామ్రాజ్యమునుఁ బొందుని యనంతరము మఱిసమర్థుఁడగునాథుఁడు పరిపాలించుటకాని, శాంతి నెలకొల్పనెంచుట కాని, జరిపియుండమి, నెందఱెందఱురాజులో మనపైఁదిరుగఁబడుటకు సంసిద్ధులగుచున్నారు. అది నీవుగుర్తించి యట్టి ప్రమాదమునుండి,

నినునీవు రక్షణ మొనర్చుకొనుటకంటెఁ బాండుపుత్రులపై దాడివెడలుటయే ప్రథమ కార్యముగా నెంచుచున్నావు. ఇది యెంతయు శోచనీయము కాదా!

తొలి నీచే భంగపఱుపఁబడి దేశాలంబడి ద్రౌపదీస్వయంవర సమయమున బయల్పడిన పాండవేయులు, పదంపడి కురుసామ్రాజ్యమున కేనాఁటనుండియో ప్రక్కబల్లెమనఁదగిన పాంచాలముతో మైత్రి నెఱపికొనిన నాఁటనె, కురుసామ్రాజ్యపతన హేతువు లేర్పడినవి. ఆ యుదంతమంతయు నీతండ్రికిఁ దెలిపితిని.

కారణాంతరమున నేను రాజ్యముఁ జేకొనమి, నా జనకుని యనంతరము కొలఁదికాలమె రాజ్యమేలిన నాసవతితమ్ములలో జ్యేష్ఠుం డగు చిత్రాంగదుఁడు బాల్యముననే గతించుట నాతని తమ్ముఁడగు విచిత్రవీర్యునకు రాజ్యము సుప్రతిష్ఠితమైనది. ఆతండును నపుత్రకుఁడై దివికేగుట, నాతనిసతులగు అంబికాంబాలికలయందు వ్యాసకరుణను దేవరన్యాయమున నీతండ్రియుఁ బాండుండును జన్మించిరి. నాతండ్రియగు శంతనుననంతరము, నీతండ్రియుఁ బినతండ్రియు జన్మించువఱకును నేనును, నాసవతితల్లి యగుసత్యవతియు వ్యాసునను మతిని సామ్రాజ్యరక్షకవర్గముగా నేర్పడి రాజ్యవ్యవహారములు నడిపించితిమి. అట్లగుట నీరాజ్యంపుసంప్రదాయమును, ప్రజల యభిమతములును, సామంతరాజులమంతనములును నేను బూర్తిగ నెఱుఁగుదును. దేవరన్యాయమున వ్యాసుప్రసాదమున జన్మించినవారిలో జ్యేష్ఠుండగు నీతండ్రి జాత్యంధుఁడగుటను రాజ్యపాలన కనర్హుండగుట, సత్యవతియు, అప్పటిపెద్దలును, రాష్ట్రమునంగల సామంతులును నొకసభ జేసి జాత్యంధుఁడగువాఁడు ధర్మశాస్త్రములు చెప్పినచొప్పున రాజ్యాధిపతి కారాదని తీర్మానించి, దేశకాలపాత్రల ననుసరించి పాండునకే రాజ్యాభిషేక మొనరించి పట్టంబుఁగట్టి యాతనినె చక్రవర్తిగ జేసిరి. విమలచరిత్రుండగు పాండుఁడు తాఁ దఱచుగ

శత్రురాజులనదిమి, కప్పములు గొనుటకు రాష్ట్రమునఁ దిరుగుచుండ వలసియుండుటను, దనయన్నయందలిభక్తి పెంపునను, నీతండ్రిని సింహాసనముపైనిడి పోవుచుండెడివాఁడు. అట్లగుట నీతండ్రి సింహాసనము పైఁ గూరుచుండుట తటస్థమైనది. పాండుఁడు తఱచుగ దేశాలంబడి తిరుగుచుండుటను, నేనును విదురుండును నీతిధర్మముల ననుసరించి రాజ్యపాలనవిధుల సక్రమముగ నిర్వర్తించుచు వచ్చితిమి. అనంతరము కొంతకాలమునకుఁ బాండుఁడు గతించుటయు, నాతనిపుత్రులేవురను, నాతనిసతిని మునులు దోడ్కొనివచ్చి నీతండ్రి కప్పగించుటయుఁ బరిపూర్ణముగ నెల్లఱకును దెలియవచ్చుటచే, నయ్యేవురును బాండుపుత్రులుగ నంగీకరింపఁబడుటయు, నీతండ్రి పాండునియందుఁగల యభిమానము పెంపునను, ప్రజల యభీష్టము చొప్పునను, బాండవుల యందు జ్యేష్ఠుండగు ధర్మజునిసత్త్వవిఖ్యాతికిఁ దోడగు నట్లాతనికి యౌవరాజ్యపట్టాభిషేకం బొనఁగూర్చుటయుఁ దటస్థించినవి. ఇదియు నప్పటి పెద్దలతీర్మానము ననుసరించియే జరిగినది సుమా!

ఇంకను రాజ్యమునఁ బాండవేయులకు భాగము లేదందువేని, పితృపితామహాంబయిన రాజ్యంబునకు మీయట్లనెవారును అర్హులుగావున, వారల కర్ధరాజ్యంబిచ్చిన నీకును, నీబాంధవులకును లోకంబులకును బ్రియంబగు. అట్లుకానినాఁ డపకీర్తియగు.

దుర్యోధనా, ఇది మీతండ్రితాతల రాజ్యమని నీవెట్లు చూచెదవో, వారును అట్లే వారితండ్రితాతల రాజ్యమని తలంతురు. రాజ్యాభిషిక్తుఁడైన వానిపుత్రులే రాజ్యార్హులు కానియెడల నీకుమాత్రము రాజ్యార్హత యెట్లు కలుగఁగలదు? అజ్యేష్ఠసంతతివారగు పాండవులు రాజ్యానర్హులని యందువేని, యంధునిసంతతివారగు మీరెట్లు రాజ్యార్హులు కాఁగలరు? అట్లగుట నుభయపక్షములవారును రాజ్యానర్హులే యగుచున్నారు. ఆనా డింతదూర మాలోచింపక కాదు మా సవతితల్లి సత్యవతి ధృతరాష్ట్ర పాండుభూపతులలోఁ బాండునకే

యీసకలకౌరవరాజ్య మభిషేకముఁ జేయుటయు మీతండ్రిధర్మజునకు యౌవరాజ్య పట్టాభిషేకముఁ జేయుటయును. సంప్రదాయగరిమను పురముననున్న పెద్దలును, మనవంశముననున్న వృద్ధులును, పురోహిత హితామాత్య బృందంబును నెదినిశ్చయింతు రదియె కార్యరూపము నొందుచుండెడిది. అట్టికార్యక్రమమునకు భంగమురానిచ్చుట యక్రమముకాదా? నీవు ధర్మముచేత రాజ్యమునుబొంద నర్హుండవనంటివేని, నీవు రాజ్యము నేలుంగలముందే యౌవరాజ్య పట్టాభిషేకధర్మము చేతఁ బాండవులు రాజ్యమును నీకన్నమున్నుగనే పొందియున్నారు. ఇఁక నెటుజూచినను మిగిలినది నీమేనమామయొక్క దుస్తంత్ర మిళితమగు కౌతుకము, నీవంచనయును: ఇంతియేగద! ఇఁకవీనిఫలమో: స్వబంధునాశము, జనవినాశము, స్వవినాశమును!

సుయోధనా! ధర్మరాజాదులయెడనీవుఁజూపోపమిని వారలఁదవ్వుల కనుపనిచో, బ్రాయోపవిష్టుండ నగుదు నన, నీ నిర్బంధోక్తుల కడలి నీతండ్రి ధర్మజున కర్ధరాజ్యమిచ్చితి ననెను. అట్లనియు నింత విశాల కురుసామ్రాజ్యమందును వారికొసంగఁదగుతావు వేరొండు లేనటుల నెంచియెంచి ఖాండవము నొసంగి వారి నందుండ నియమించెను. అట్లు నియమించుటలో నొక ప్రత్యేకపు దురుద్దేశము మీకు లేకపోలేదు సుమా! అయినను వా రానాఁటనుండి మఱియు మఱియు విజృంభితతేజులై, విశిష్టకృతవీర్యులై నానాఁటను విశ్వ విఖ్యాతులై నెగడుచున్నారనుట నిర్వివాదాంశముకాదా! ఇట్టిపాండవులను మీయండ నుండనీయకుండ దౌదవ్వులకుం బనిపి, వారియెడ వంచనలువన్ని వారితోడివైరమున కీయకొనియున్నావు. స్వాతంత్ర్య సంస్థాపనమునకై చిరకాలమునుండి తఱి వేచివేచి యిదియె యదనని పాండవుల యండఁజేరియున్న మనసామంతరాజులతోఁగూడ నీ విపుడు శత్రుత్వ మభ్యర్థించుచున్నావు. ఇట్లగుట పాండవులను నీవే చేఁజేతుల ద్విగుణీకృతబలసంపన్నులుగ జేయువాఁడ వగుచున్నావు.

మనకుఁ జిరశత్రువులగు పాంచాలుర సహాయము పాంచాలీ వివాహానంతరమునను, విరటుని సహాయ్యము నుత్తరావివాహానంతరమునను, పాండవులు పొందియుండుట లోకసంగ్రహావృత్తము నెఱుంగని నీకెట్లు తెలియఁగలదు! ఇంతతోఁ బాండవపాంచాలము, పాండవపాంచాలమాత్స్యముగా నేర్పడినదికదా! ఇట్టి పరిస్థితులలో నీ త్రివర్గసమ్మేళన మిపుడు యదుకులశేఖరుండగు శ్రీకృష్ణుని సాహాయ్యముంగూడ నందుటను బాండవపాంచాలయాదవమాత్స్యముగా మారినది. ఇట్లు ద్వివర్గసమ్మేళనము త్రివర్గసమ్మేళనముగను, ఆ త్రివర్గసమ్మేళనమిపుడు చతుర్వర్గసమ్మేళనముగను దేలినదికదా! మఱియు నింతతో నాగక యీ చతుర్వర్గసమ్మేళన మింక విశ్వైకసమ్మేళనముగా మారిపోవును జుమ! అప్పుడు నిను దేర్చువా రుండరు!

తన ప్రత్యేక కార్యక్రమమునకు దారులుతీసి, తన బుద్ధికుశలత ప్రబలముగఁ జూపిన కృష్ణుఁడు పాండవోద్యమరథమునకు సారథియై యున్నాఁడని యెఱుంగకున్నావు.

ఈ పరిస్థితులిట్లుండ యదువృష్ణిభోజాంధకాదుల యౌజ్వల్యమునకుఁ బాటుపడుచుఁ దనకు జ్ఞానమువచ్చినదాదిగ యదువంశోద్ధరణమే ప్రధానకార్యముగఁ దనదృక్పథమును నిడుకొని, కంసవధతో నారంభించి, జరాసంధవధతోఁ బరిపక్వతనొందఁజేసి, తన రాజనీతిజ్ఞతచే, లోకహితకార్యములచే, భగవదవతారమునాఁ బఱగుచుఁ దనచింతిత కార్యక్రమమునకుఁ దోహదపఱచికొనుచు, భారతభూమి నుండఁదగరని తనకుఁదోఁచినవారిని, దనయుద్యోగమున కంతరాయముఁ గల్పించువారిని, కురుపాండవ కలహమను నెపమున నిర్మూలన మొనర్ప నెంచిన కృష్ణుఁడు ఇపుడు—"జయమొసంగద రావోయి" యని యరదంబుపయి నర్జునుం గూరుచుండఁజేసి, తాఁ దేరుగడపుచు సమరావని న్విహారలీలఁ దిరుగుచు, జరుగుచుండెడి ప్రతిఘట్టమును దన ధర్మసూత్రబలమ్మునఁ బరిరక్షణ మొనర్చుచుఁ గదనరంగమునను

సూత్రధారివై కార్యకలాపము నడపించుచుండ దైవ పౌరుష ప్రభాసముజ్జ్వలిత పరాక్రముండగు నా విజయుం గన్నెత్తి చూడ నా హరునకైన వశముకాదుసుమ! ఇదికార్య మిది యకార్య మని యైన యోచించుకొనఁజాలని నీవు కర్ణశకునిదుశ్శాసనుల దుర్మంత్ర దుస్తంత్రదుష్కర్మములచే నాడింపఁబడుచుండుకీలుబొమ్మవగుటవేగాని, తుదకీముప్పుఱును ఆహవరంగంబున వెల్వెలఁబోయి నిలిచియున్న సమయాన నీవుమఱి కానరాకుండ నెందేనిఁ దలఁదాచికొనఁ బరువెత్తవలసి వచ్చునేమోయను మాభీతికిమాత్రము తావులేకపోలేదుసుమీ! దుష్టనికృష్టాత్ములగు నీకర్ణాదులు పాండవులఁ బరిభవించుటకును, పాండవులను భండనమున నోడించుటకును నినుఁ బురికొల్పుచుండుటయు, నీచింతితకార్యముగడదేర్తురని నీవునమ్ముటయుం జూడఁ దుదకు నిన్నే కడతేర్తురేమో యని కురువృద్ధులమగుమేము దుఃఖింపవలసి వచ్చుచున్నది.

— కర్ణుఁడు

(భీష్ముని పలుకులకుం గనలి)

గంగానందనా, వయసునవృద్ధుండవును, రాజకుటుంబమునకుఁ బెద్దవును, పాలితపాలకసంబంధమునుఁ రాజభృత్య సంప్రదాయమును బాగుగ గుర్తెఱింగినవాఁడవును నగునీకుంగూడ, రాజునకును బుత్రులకును మనుమలకును రాష్ట్రమునకును, సంప్రీతియు క్షేమమునొనఁగూర్చు తెఱంగున నేఁబలుకుచుఁ బ్రవర్తించుట, భృత్యునకుఁ దగని పనియని దోఁచెనుగా? నే నాతనిమన్ననలకును ననుగ్రహమునకును దగనని నీకుఁదోఁచినదే కాని, రాజు నన్నింతవానిగఁ జేసియుండుటకుఁ గతంబేమో తెలిసికొనఁజాలక యీ నిండినసభలో నోరికి వచ్చినట్లెల్ల నెఱేఁదప్పిన మాటలచే నను దూరిన నీ కిది సత్సంప్రదాయకపు రాకొమరునకుం దగనిపని యనియైన నెఱుంగ నగును ?

— భీష్ముఁడు —

(కర్ణునిపలుకులు విని దుర్యోధను నుద్దేశించి) పాండవులలో నొక్క చిఱుతవానినైనఁ బోలం డీకర్ణుఁడు. మదిఁగొంకులేక, పాండవేయుల గెల్తునని పలుకసాహసించు నీ రాధేయురజ్జులు, తులువలు మాత్రమె వినఁగుతూహలపడుదురు.

[కొలువుఁ గలయఁ జూచి]

సర్వసుగుణాఢ్యులును, బలవంతులును, పలుకుఁబడి నెనలేని వారలునునగు పాండుసుతులమగఁటిమి కీసూతపుత్రుఁడె తగినయెదిరి యని పొరపడి పాండుపుత్రుల నీసుయోధనుఁడు విరోధముంగొని యవమానించెను. పాండుపుత్రులపై నీతనికిఁ జిన్ననాఁటనుండియు మాత్సర్యము పెరుగుచున్నను, సూతసుతుని కానిమాటలును, ఉల్లికుట్టుపలుకులును లేవేని, ఈసుయోధనుని మాత్సర్యమీతని సజీవునిగ దహింపఁగలదే కాని, యింతింతదుస్సాహసపుఁ గార్యము లొనర్పఁజేయఁ గలుగునా? పాండుతనయులలో నొక్కొక్కరుండె యనేకవిధయుద్ధములం జయంబులఁగొని చేవలుదేరి, యుక్కెక్కి యున్నారు. పసులమందల మరల్చుకొని పోవుసమయాన (కర్ణునిఁ జూపుచు) నర్జునుం డీకర్ణునితమ్మునిఁ గూలనేసినపు డీతండట లేనని యనఁగలఁడా ?

(కర్ణునుద్దేశించి ధృతరాష్ట్రునితో)

దుర్యోధనునకు మేలొనఁగూర్తునని బాసఁజేసి ధైర్యముఁ గొలిపిన యీరాధేయుఁడు గోగ్రహణమున నర్జునుండాగ్రహంబున మనమూకలనెల్లఁ జిందరవందరఁ జేసినపుడును, మమ్మందఱ మూర్ఛితులఁజేసి వీరివీరి శిరోవేష్టంబులనెల్లఁ దెగఁగోసికొని యర్జునుం డేగునపుడును, ఏమిసేయఁగలిగె? తానపుడట లేఁడో! ఎందేనిఁ దిరుగాడుచుండెనో! అర్జునిచే మూర్ఛితుఁడై యుండెనో! వేయేల? పలుకులు వేరు—పనులు వేరు!

రాయబారము.

ఆంబికేయా, ఘోషయాత్రకను వంకను మన సుయోధనుని గొంచుఁబోవునపుడు వలదువలదని యెన్నివిధాల మొఱవెట్టినను వినక, నీకొడుకీ రాధేయునిరజ్జులువిని, పోయి, తుదకటగంధర్వులచేతఁ జిక్కి పొక్కి 'వెక్కిరింపఁబోయి వెల్లకిలఁబడి' ప్రాణము ల్వోయునంత యయినపిదప నాభీమార్జునులేకద మనసుయోధనుని రక్షించిరి? అపుడీ యంగరాజేమయ్యెనో!

వేయేల! వైచిత్రవీర్యా, తాను పోటరినని, యర్జునునకుఁ దానే సరియని, తగిన యెదిరినని, దుర్యోధనునిచే ననిచేయింపనున్న యీ సూతజునిచే, భ్రమచే, మనగాంధారీనందనుండె మోసగిలుటకాక, భరతవంశపు బ్రతుకెల్ల నీసూతసుతుని వశమైనది. ఈతఁడెట్టుద్రిప్పిన నటుదిరిగెడిగతి పట్టిన దీధార్తరాష్ట్రకులమునకు! తన దుర్మానమే ప్రధానముగఁ జేసికొని వివేకవిహీనుండయి, నీతివిరహితములగు నీ రాధేయుని పలుకులె హితము లనుకొని లోకసంగ్రహవృత్తి నెఱుంగక, అనికని తత్తఱపడుచుండినయీదుర్యోధనునకుఁ బ్రతీకారము లేని పశ్చాత్తాపమునకు సైతము సమయములేకుండఁబోవు పరిస్థితులమరునేమోయనిమాయట్టివారు దలంకుటకన్న వేఱేమిచేయఁగలరు?

[కర్ణు నుపలక్షించుచు] ఈదుర్జాతుండు కార్యాకార్యము లెఱుంగక, గమ్యాగమ్యములు గమనింపక, నీచకులోత్పన్నుండగుట సంత్సంప్రదాయదూరుండై, రాజభక్తియనుమిషచే దుర్యోధనునకు నచ్చిన యిచ్చకములేప్రధానములనుకొని, నీతివిరహితుఁడై తనకర్జును దెసఁగల ప్రత్యేకపుటీర్ష్యను దీర్చుకొనుటకుఁ, దనపగ సాధించుకొనుటకు, నోరికివచ్చినట్లెల్లఁ బేలుచుండ, (దుర్యోధను నీక్షించుచు) ఔననుకొనుచు పీనికారుల నీసుయోధనుండు గైకొని వినుచుండును. భరతకులమునకంతకును సుడిపట్టినది. రాజులకు నీచసంపర్కము కలిగినపు డింతకన్న నేమి కాఁగలదు? ఇందులకు దుఃఖించుచుమే మూరకుండవలసినదేనా! ఔరా, కాలమహిమ!

ఎనిమిదవ ప్రకరణము.

— ద్రోణుడు —

(దుర్యోధనునీక్షించుచు) సర్వకురుకుమార సర్గంబునకుం గూడ మేరువుపూసయట్టి గంగాసుతుండిపుడు పలికినదెల్ల నీక్షేమము గోరియు, భరతవంశమును వినాశమునుండి తొలఁగఁజేయ నభిమతించియుఁగదా! దేశకాలపరిస్థితుల ననుసరించియు, నీపరిసర ప్రాంతముల రాజకీయపరిస్థితులఁ బరిశీలించియుఁ గురుకులమిమ్మహిఁ గల కాలమంతయు మనుటనభిలషించి పలికినపలుకులు విన ననునంత పంతము నీకుఁగలుగుట కురుకులాన కంతకును నంతమున దీర రానివంతఁ దెచ్చిపెట్టుటకేయగును. రాజకీయవాతావరణమిపుడు మనము కయ్యమునకుఁ దగమనుచున్నది. సంజయునితో సజ్జునం డపుడెంతాడెనో యంతయుఁజేయునంతటి దిట్టరియని మనకుఁదోపఁ జేయ సమర్థంబులగు ఘట్టంబులెన్ని లేవు! ఒక్కమాట యోచింపుము. ఎవరుమాత్రము బాణతూణీరములను బట్టలేరు? ఎవరుమాత్రము జయములఁ బడయలేదు? కాని, విజయుండను నామధేయమొక్క యర్జునకుమాత్రమే రాఁగతంబేమని యోచింప వలదా?

(ధృతరాష్ట్రునుద్దేశించి)

మనవారందఱును నడిపించిన యుద్ధములెన్ని లేవు? ఓటమి సమకూడని పోటొక్కటియైన మనవారికిఁ జిక్కలేదని యనఁగలమా? ఇఁక నటు అర్జునుం డలంతుమన్న, నాతఁడోడినవార్త నేయెడనైన నెన్నఁగలమా! వేయేల? అర్జును నిర్జించువాని నొక్కని మనవీఁటనె కా దీపదునాలుగుభువనములం దేకడనయినంగాని జూపఁగలమా? విజయు విజయముంగూర్చియు, రాధేయునోటమింగూర్చియు సందియమువీడియుందుము. ఇఁక మఱి చెప్పుటకేమున్నది?

ఇట్టుల భీష్మద్రోణు లిరువురును దుర్యోధనునితోఁ గొంతతడవును, దుర్యోధనునుద్దేశించిధృతరాష్ట్రునితోఁగొంతతడవునుహితోపదేశపూర్ణ సంభాషణములఁ జేయుచునే యుండిరి. కాని, వీరి హితోప

దేశంబుల నేమాత్రమును గైకొనకయే పాండవులవార్తలనడుగుటకుం బూనిన ధృతరాష్ట్రుండు సంజయుం బిలిచి, "సంజయా, మనకు సమకూడిన సహాయసంపత్తి విని నీతో యుధిష్ఠిరుం డేమనియెను? తన భ్రాతృపుత్రాదులలో నెవ్వ రాతనియాజ్ఞ ననువర్తింతురు? మనవారి వఱకె వారికొనర్చిన నిష్కృతిం జేసి, చేసినదాని కీసునడెదు నవ్వారి కెవ్వారు శాంతితత్త్వమును బోధించుచుందురు? అటుకాదేనిఁ బాండవేయుల కోపాగ్ని కింధనసంపాదన మెవ్వరొనర్చుచుందురు? వారు మనపైఁ గవియుటే తటస్థించెనేని ధృష్టద్యుమ్నుంగాని రారుకద! మనపై ధర్మనందనుండెత్తివచ్చినచో నెవరినిదోడ్కొని రాఁగలఁడు?"

ధృతరాష్ట్రుండట్లు ప్రశ్నించుచుండ సంజయుఁడు ప్రాస్పడి మూర్ఛిల్లెను.

విష్కంభము

— సభలో గుసగుసలు —

"ఔరా! యెంతయాశ్చర్యము! అంతయు వినియు సంజయు నెట్టిప్రశ్నము లడుగుచున్నాఁడీ కురువిభుఁడు!"

"కొడుకును దండ్రియు నొక్కరూపయగుట వస్తుతత్త్వములో భేదము లేదు; భిన్న భిన్న ముఖములు మాత్రమె యగును. తండ్రి కపటియగుట బయల్పడఁడు. కొడుకు దుర్మానియు దురహంకారియు నగుట బయల్పడును. ఇదియే భేదము."

"ఏది యెట్లయినను, మనమందఱమును బ్రాణాలపై నీఁకెఁ దీపులువిడవలసినదే గద! ఏమో, యేమాత్రమైనను బౌర్వాపర్యవిచారణ పేయునేమో యీపెద్ద శాఖని మన మనుకొనియుంటిమి. అట్లనుకొనుట మన పొరపాటేయగును. ఇప్పటికి

మన చూచినవారిలో నింతమూర్ఖతవహించిన రాజు నెఱుంగము. చెట్టుచచ్చుకాలానఁ గుక్కమూతిపిందెలు పుట్టుననునట్టు లీనాటికి శంతనువంశమున నిట్టి తండ్రికొడుకులు పొడమిరి. హితము చెప్పువారి నోటిచేదె కాని, కార్యమేమున్నది!"

"సంభవించిన దేశారిష్టమును, కానయియున్న జనక్షయమును, దొలఁగింపఁ గల మహామహిమాన్వితుఁడౌ నొక్క మహాపురుషుఁడే సమయానఁ బొడమినఁ గాక పరిస్థితులు మారుటో, మానుటో, జరుగఁజాలదు."

"ఏమీ, అట్లనుటేమి? ఇపుడీరంగమున జరుగుచున్నదంతయు, భగవంతుని సంకల్పమే యయినచో, మూర్తీభవించిన మాత్సర్యదేవతయే ప్రధానపాత్రధారిణియై ప్రవర్తిల్లఁగలదు; అటుగాక, దౌరాత్మ్యవృక్షజాతవిషఫలంబులఁ దెగఁగోయు సంకల్పమె భగవంతునిదైనచో, నింతతో నీకౌరవశాఖ నంతరింపఁజేయఁగల కార్యకలాపంబిట్టె పన్నఁబడి శీఘ్రముగనె ఫలోన్ముఖము కాఁగలదు. కావున నీశ్వరసంకల్పముననే యింతదనుక నంతయు జరిగినదనియును నిఁక ముందుజరుగ నయియున్నదనియు నని మనము సమన్వయించుకొనినచో, మఱి మనోవిచారమునకును బాహ్యక్లేశములకును దావు లేదే.

"మనము ప్రమాణము చెప్పలేక యీశ్వరసంకల్పమని యనుటయే కాని, ధార్తరాష్ట్రులలో నింతింత విడ్డూరముల నా యీశ్వరుండు సంకల్పించుటేల! మఱి యిపుడు వాని నడుప నీవిశ్వప్రయత్నములేల? ఇదియా భగవంతుని విలాసము! చేయుటయును జెఱచుటయునా? ఏమి విలాసము! విలపింపఁదగిన విలాసము!!"

"ఇపుడు మన కీశ్వరవిలాసముఁగూర్చి యాతగవేల! అదిగో ధృతరాష్ట్రుఁ డడిగిన ప్రశ్నములకు బ్రత్యుత్తరంబొసంగఁజాలక సంజయుఁడు మూర్ఛిల్లినాఁడు."

"ఆమూర్ఛిల్లుటకుఁ గారణమేమి? ఒకరడిగిన ప్రశ్నములకుఁ బ్రత్యుత్తరంబొసంగఁ జాలనివాఁడు మూర్ఛిల్లునా?"

"అడిగినప్రశ్నకుఁ బ్రత్యుత్తరమొసంగఁజాలమి కాదా మూర్ఛిల్లుటకు గారణము. తానంతమాత్రము పాండవబలముఁ దెలియఁబఱచినను, దనకొడుకు పట్టనున్న లోపము లుగ్గడించినను, రాజకీయపరిస్థితుల ననుసరించి పాండవులతోడి భండన మెంతయును గండమే యగునని తెలియఁజేసినను, నింకను ధృత

రాష్ట్రుఁడు వాయోడక, పాండవబలనిశ్చయ విశేషాదులంగూర్చియడుగుచున్నాఁడే యనియు, ధృతరాష్ట్రు హృదయ పరిమాణమును, హృద్భావనైర్మల్యపరిణామమును సంజయుండు తెలిసికొని గుండియ లవియ విషణ్ణుండై, యుల్లమున నొల్లవోయి మూర్ఛిల్లెంగాని, యాతండడిగిన ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరమొసంగఁజాలక కాదు. ఆంబికేయుండడిగిన ప్రశ్నయంవలి భావమును, తత్సంకల్పమును సంజయుని మూర్ఛ వోఁజేయకేమి!

"సంజయునిమూర్ఛకేమికాని— చూచితివా, సభనున్నవారంపఱు నేమనుకొనుచున్నారో! ఈసంజయుఁడు తనరాయబార నివేదన మా ధర్మజుమొఱల నెఱునవు డేపర్యవసాన మొనఁగూర్చునోకాని, ధర్మజుసందేశ మీధార్తరాష్ట్రుల సమక్షమున నీసంజయుండు తెలుపుటలో మాత్రము తేలిన యితర పర్యవసానములలో ముఖ్యమైనది వీరికి సాయమొనర్ప నెంచి వచ్చిన రాజలోకమునకుఁబాండవులదెసఁ గనికరమును, వారిపరాక్రమము వలనిభయమును జనింపఁజేయుట. ఈతఁడెంత దూరము ప్రసంగము చేసినను, బాండవులఁ గొండాడుటయును ధార్తరాష్ట్రులఁ దెగడుటయును జేయుచున్నాఁడు.

మన మాటలకేమికాని, అదిగో సంజయుఁడు లేచి నిలిచి వేఁడినిట్టూర్పు పుచ్చి సాశ్చర్యముగఁ జూచుచున్నాఁడు."

అని సభలో నున్నవారు తమలోఁ దామనుకొనిరి.

—సంజయుఁడు—

[వేఁడి నిట్టూర్పు విడిచి తనలో]

అక్కటా! ఈతఁడెంత మూర్ఖుఁడు! ఎంత తెలియఁజెప్పినను, 'ధర్మజుం డెవరిని దోడుచేసికొని, మనపై కెత్తి రాఁగలఁడని యడుగుచున్నాఁడు! ఇంతమాత్ర మెఱుంగఁజాలని వాని కేమిచెప్పిన నేమిలాభము! వయోవృద్ధుండయి లోకపుఁదెన్నెఱింగిన యీతఁడేఁ యిట్లనిన, నిఁక నీతని పుత్రులమాటఁ దలంప నేల? వీరి యవివేకమును, మౌర్ఖ్యమును, నహంకారమును రానయియున్న విప్లవమునకుఁగతంబులగుచున్నవని దుఃఖించుటకన్న మముబోంట్ల కింకేమికలదు! దేశకాలపాత్రంబుల నెఱుంగక, పట్టువిడుపులు లేక ప్రవర్తించునీతని నవివేకిగా నెఱింగి—"అయ్యో"యని, "మా పెద్దరాజును, చిన్న

రాజున, నెంతటి యవివేకు" లని జాలిఁదలఁచుచుండుటయా, దురాత్మనమునంగలిగిన యహంకారమును, బుత్రవ్యామోహమును, రాజ్యలుబ్ధతయునుంగలిసి, యింతలు చేయుచున్నవిగా యని ప్రతీకారముఁజేయఁబూనుటయా? హితబోధఁజేసి యీతని మూర్ఖ్యము మాన్పఁబ్రయత్నించుటయా? అట్లయ్యును శాపమా యుధిష్ఠిరుం డింత కాలము సైరణసైయుటయేకాక, మాటిమాటికిని, యుద్ధసన్నద్ధులగుచున్న తనతమ్ముల నెంతేని, నడిమిపట్టుచున్నాఁడు. నేఁడయు నాధర్మపుత్రు సైరణయు విసివిపోయినది. ఇఁక నాతఁడేమి యొనర్చినను సమంజసమే కానోపు. కురువిభుఁ డడిగినయర్థమదెట్టిదియైనను బ్రత్యుత్తరముసంగక తప్పదుగదా!"

అని తనమనమునఁ బరికించుకొని, తనను ధృతరాష్ట్రు నుపలక్షించుచు సంజయుం డిట్లనియెను.

——సంజయుఁడు——

రాజకంఠీరవా, ధర్మజుఁడుసంధియేకావలెనని కోరుచున్నాఁడు. ఆతనితండ్రికి రాఁదగిన సగంబును నీవొసంగఁ గోరుచున్నాఁడు. అది కాదందువేని, రాజసూయంబునఁ దాఁగొనితెచ్చిన భాగంబయిన నీ వొసంగఁదగు ననుచున్నాఁడు. అదియు నిదియుఁ గావందువేని, వారి యైదుగురకును, జట్టాలకును దినిమనఁదగినంతదియగు నైదూళుల పట్టునైన నిమ్మని కడువేఁడుచున్నాఁడు.

ఇందేమియు నెఱపఁజాలమని మీరనసాహసించినచో, ధర్మజుండింకఁ జేయునదిలేదని యెంచి, మన పదునొకండక్షౌహిణులను లక్ష్యముఁజేయక సమరము నెఱపినైనను నేలనేలు తలంపొంది యున్నాఁడు. వారియయ్య సగమో, వారి రాజసూయపుఁ బుడమియో, మీరీయక తప్పినపుడుగాని ముందఱ సంగరముఁ జేయ నొల్లఁడు. పాండవ శిబిరమునఁ జేరినయందఱును అట్లేయభిప్రాయము నొందియున్నారు. ఇందేమి తప్పు గలదు?

ఇఁక నీవడిగిన ప్రశ్నలఁ దలంచినచో నన్నియును భిన్నరూపముల నొందియున్నను, నేకముఖమునే పొందియున్నవి. నీవెఱుఁ

గని వారెవ్వరటఁగలరని చెప్పఁగలను? మనవలె వారెక్కడినుండియో పెక్కండ్రసహాయము వేడి, తోడ్కొని రానక్కరలేదు. ధర్మజు నను జన్మలే చాలు మనలోనున్న పెద్దలఁ గడ తేర్చుటకు! అయినను కోరితివి కావున నా కనినకొలంది నీకుఁ దెలియఁబలికెద వినుము.

ఒక జటు హిడింబాద్యసురుల యసువులఁ దా నొక్కఁడె కూలనేసి, కీచకుఁ జంపి, గంధర్వునిఁ బీచమడంచి, ఘోషయాత్రా తరుణమున మానముఁ గోల్పోవు గంధర్వులచేఁ బ్రాణంబులఁ బాయనుండిన మన దుర్యోధనను నరసి రక్షించి, నీకు పుత్రభిక్షఁ బెట్టిన భీమసేనుని గొనిరాకమానునా ధర్మజుఁడు!

అల ఫాలాక్షుని నెక్కటికయ్యంబున గడగడలాడం జేసి, యాతని మెప్పులందిన ఘనుండును, ఘనతర దుర్జయులగు పాంచాలుర పీచమడంచి ద్రుపదు నోడించి పట్టి కట్టి తెచ్చి గురుకట్నముగా నొసంగి మనకర్ణునిఁ గడ తేర్పఁ జననమందిన ఫల్గుణుని గొనిరా మఱచునా యమనందనుండు!

కొదమసింగంబులం బోలు నకులసహదేవులు మన బలంబులం జుట్టినచో మన మెందుఁబోఁగలమని కవల వెంటనిడుకొని రాక యేమఱునా ధర్మసుతుఁడు!

ఉక్కుముక్కలవంటి యల ద్రౌపదేయులను, వజ్రపుదునుకఁ బోలు సుభద్రా తనయుని మన కురుకుమార వర్గము పాలింటికిఁ దోడ్కొని యిమ్ముఁ జూమా యయ్యధిష్ఠిరుండు.

వృష్ణికుమారవీరులలో సత్తమోత్తముండును శ్రీకృష్ణుని తమ్ముండును శత్రు వనదవానలుండును నగు సాత్యకిని ఆధర్మజుండేలఁ దోడ్కొనిరాకుండును?

ఇకఁ బాండవులకు సాయ మొనర్ప వచ్చినవారిని, ధర్మజుఁడు దోడ్కొని రాఁగలిగినవారిని, వేర్వేఱ వర్ణించి చెప్పుటకంటె, నీవు కురుసమ్రాట్టువగుట కెవరెవరంగీకరింపకున్నారో వారెల్లఱును నీకుఁ దెలిసినవారే. కాని, నీకు పరాకుఁ దెల్ప నుడువుచున్నాను వినుము.

ఉజ్జ్వలశౌర్యధైర్యాన్వితుఁడగు పాంచాలభూనాథుని, మహావిక్రమ యుతుండగు మత్స్యవిభుని, పరితాపోన్నతులగు నేవురు కేకయపతులను, మగధసామ్రాజ్య

ధురంధురుండగు సహదేవుని, జయత్సేననాథుని, వీరవరుండగు ధృష్టకేతుని, వృషభుని, చేకితానుని, శైబ్యనృపాలుని, వారివారి భ్రాతృ సుత బంధు మిత్రగణంబులతోడ, సైన్యంబులతోడ మనపైనర్జునం డెత్తి రాఁగలఁడు.

వీరిలో, పాండుపుత్రులదుస్థితికి వగఁగుంది రోసినమనంబులతో వారివారి ప్రాఁబగలఁ దీర్చుకొనదెంచినవారు కాక, పెరవారు లేరే! ఇదివఱకు భీమసేనుఁడే మహాబలశాలియని మన మనుకొనుచుంటిమి. కాని యాతని సూనుఁడు ఘటోత్కచుఁడు తండ్రియంతయును నయి, మనలో నేరికిని లేని మాయాబలంబుల నసమాన ప్రజ్ఞావంతుండగుటను తండ్రినిమించిన కుమారుండు. తూర్పుననున్న రాజులును, ఉత్తరముననున్న త్రివిష్టపాధిపతులును, మనపైఁ దొలినుండియు రోషముగలిగి యున్నవారగుటను తమతమసేనలతో నగ్గిసైనను విదళింతు మనియును, మన నెత్తుటేట నెదు రీదుద మనియును ముందున కురుకుచున్నారు. ఇంకతం దోడ్కొని రాక మానునా యాపాండుని యగ్రనందనుఁడు!

వీరిందఱును నీవు కురుసామ్రాజ్య సింహాసనాధిష్ఠితుఁడ వగుట సైరింపకున్న వారేసుమ!

మఱొక్కమాట: ఇందఱు నరనాథుల వెంటనిడుకొని రాఁగల పాండుని యగ్రనందనుఁడు, పదునాలుగు భువనముల దన యుఱచేత నిడికొని, యిట్టె త్రిప్పఁచుఁ దాఱుమాఱొనర్పు మంత్రరక్షణ కళాకౌశలమున ననుపమానధీమంతుండగు దేవకీకొడుకుం దోడ్కొని మనపైకెత్తి రాకమానునా?

అని సంజయుం డూరకుండెను.

— ధృతరాష్ట్రుఁడు —

సంజయా, నీవిపుడు చెప్పినదంతయు నిక్కువము. నీ నుడివిన వారందఱును ప్రబలబలవంతులెయగుదురు; కానిబలప్రమాణములఁ బరికించినచో, వారందఱు నొకయెత్తును, భీమసేనుండొక్కరుండ యొక్కయెత్తును. ఆభీముఁడు తలఁపునకు వచ్చినపుడెల్లమనమున నెన

లేని భీతి కలుగుచుండును. ఆతఁడు తలఁపునకు వచ్చినవేళలఁ గంటికినిదుర రాదు. పగళ్ల నన్నము నోటికిఁబోదు. ఆతని మార్కొనఁజాలునట్టి మొనగాఁడీ మొనలేఁడు. ఆతఁడెచ్చపుఁగిన్కతో నెత్తినగద నిక్కముగఁ గాలదండమై విలసిల్లుచుండును. మన కురుకదంబములో నాతఁడు తనగదాదండముతో విహరించెనేని, మదమాతంగము సరసీరుహసమన్వితంబగు కొలనిం జొచ్చి, తామరతూండ్లఁ గూఁకటి వ్రేళ్లతో దుల్చినరీతి, కురువంశాంకురమైన మిగులనీకుండఁ బెకలించి వైచునుగదా యనునదరు గలుగుచుండును. కురువీరాధివీరు లీమాత్ర మెఱుంగలేకున్నారు. పిన్నటనాఁటనుండియు భీముఁడు నామాటవినఁడు; నన్నుసరకుసేయండు. నాశిక్షఁ బెరుఁగలేదు. వానితో విరోధపడియు, వానిచేఁ బీడవడియు, నింకను వానిపైఁ గసిదీర్చికొన నెంచుట మానరైరి. ఇంతవైరమునకును నిదియకదా కారణము! సమరావని నాతని దేవదానవులైన నెదుర్కొనఁ జాలరు. ఇఁక నాతని భుజాబలము నెన్నుదుమన్న, కౌరవసామ్రాజ్యమున కెదిరిగ స్థాపించెనా తనసామ్రాజ్యమని యనిపించుకొనిన యామగధ సామ్రాజ్యాధినాథుండగు జరాసంధు నెదుర్కొని యొక్కరుండె కదా యాతని నంతమొందించెను! నిబ్బరమైనకోపముతో, ముడివడినకన్బొమలతో, రౌద్రరసావిస్ఫూర్తి నెగురుచుండిన భుజాగ్రములతో, నా కెదురెవ్వరను శౌర్యస్ఫూర్తితో శోభిలుచు, గదాదండము నెత్తి, సమరావని విహారముసేయు నాభీమసేనుం జూచి, కురుసేనలెల్ల యథయథలై పాఱుచుండుటయే, జాత్యంధుండనగు నాకుంగూడఁ గన్నులకుఁ గట్టినట్టులయి నా గుండియలఁ బగులఁజేయుచుండును. ప్రళయకాల సముద్రముభంగి పొంగి పొరలివచ్చు నాభీమవీరవిహార సముద్రముఁగడవనీఁదఁ దలంపునొందుట వృథయని మందులగు మనవారు తలంపఁజాలకుండుట కేమందును!

సంజయా! నీ యెదుట నాధనంజయుం డెంతాడెనో,

యంతయుఁ జేయఁగలండు. రిత్తలు పలుకుట సుయోధనుని యిష్టమంత్రికివలె ఫల్గుణున కభిమతము కాదు. అక్కజమైనది కేశవుని తేజము. దానినాసింపకయే దనంతదానొక్కండ వైరిసేనలఁగొడ్డిన ఘంట యగువాఁ డర్జునుండు. మఱికెక్కువెలింగినది గాండీవము. ఇట్లొక్కడనగూడిన ప్రతాపమూర్తుల మహోగ్రపు వేఁడిమి కోర్వ వచ్చునే! విజయుచే నిర్జింపఁబడినవారె మనవారిలోఁ గలరుగాని, యుల యర్జునుని నిర్జించిన వాఁ డొక్కండును మనసేనంగాదు సరి కదా, మఱి యెచ్చటంగూడ నిప్పటికి గానరాఁడు.

సంజయా, భీమార్జునుల బలాబలంబులు భీష్మద్రోణు లెఱింగినంతకంటె నితరు లెవ రెఱుంగఁగలరు? గురుగాంగేయులకు ధార్త్తరాష్ట్రులును, బాండవులును, నొక్కరూపయగు శిష్యబృందంబును, బంధుకదంబంబును నగుట, వారి కీరెండు కుటుంబంబులును సామాన్యంబులయ్యెను, వారు 'మనలనంటియుంట' యను తప్పిదమునకుఁ దగిన ప్రాయశ్చిత్త 'మెఱిఁగి యెఱిఁగి మనకొఱకుఁ బాండవులతోఁ బోరఁదలపడుటే' కదా! ఇంతమాత్రపుఁ గారణమునఁ గురుభీష్ముల కింతవలసెనే! విధివశంబున నేనును, నాసుతుల నొప్పింపను, శాసింపను, జేయఁజాలకున్నాను.

ధర్మజునకు యౌవరాజ్యపట్టాభిషేకమొనర్చిన నాఁటికంటె, అనంతర మర్ధరాజ్యమున నాతని నభిషిక్తుంజేసిన నాఁటికంటె, అర్థరాజ్యంబిది యని ఖాండవంబొసంగి దవ్వులకనుపక తప్పనినాఁటికంటె, జూదమున దుర్యోధనునిమిత్తము సౌబలుఁ డోడింప ధరణియు రాజ్యమును బాండవులు గోల్పోయినపిదప ద్రోవదికి వరముల మూలమున ధర్మజుండెప్పటి యట్లనుభవించు కొఱకు, వారిరాజ్యసంపద వారికొసంగిననాటికంటె, నానాఁటికి నాకు ముదిమి కతంబున, మనోదార్ఢ్యము సడలి, వాక్పటిమతగ్గి, హృదయదౌర్బల్య మధికమగుట నిపుడేమియుఁ జేయంజాలకున్నాను. విదురుం డా నాఁ డా ద్యూ

కారంభమున నేమనినొ నంతయుఁ బాటిలుచున్నది. ఆతఁ డప్పుడు చాటి చెప్పినచొప్పునఁ గురుజాతికిఁ జేటొదవుట జూదముతోడన బుట్టె. భీష్ముండెంత చెప్పినను వినక యా సౌబలుం జేరఁదీయుటయు, ద్రోణుండెంతవలదన్నను నాకర్ణిం దరిజేర్చుటయు, నీ యవినీతుండు మానఁడయ్యె. వానివంశమంతయు మనసుయోధనుండంత మొందించిన పిదప నిఁక నీ సౌబలుఁడు మనవంశము మాత్రి మంతరించు పన్నాగముల నొనర్పఁ దలంపఁడా! అవియెంతమాయదారిపాచికలో కాని, నిర్జీవ పదార్థము లయ్యును, 'సౌబలుం డెంత సెప్పిన నంతియ చేయుచుండుట' యా పాచికలకెతగును. ఆ పాచికల యందును సౌబలుని హృదయమందును గలట్టి మాయాబలసాంకర్య మదెట్టిదో కాని యుద్ధానింగనుఁగొన నెంచినవారిలో నేరికిని ఇప్పటికిని హృద్గోచరమయినది కాదు. 'సౌబలుం జేరఁదీయుటయు, నాతని మంత్రాంగమును విశ్వసించుటయు, మన భారతవంశమునకె కళంక మాపాదించుట యగును—' అని మనశాంతనవుండు తలఁచుగ నాతోననుచుండుట మాత్రము సత్యము. ఏదియెట్లున్నను, మా భరతవంశంపుఁ బ్రదుకు కర్ణసౌబలులపాలఁబడియెఁగా యని మాత్రము నేను దుఃఖించుటేకాక యియ్యెలఁగలకాలమంతయు జనులాడుకొనక మానరు. ఏమికానయియున్నదో కాని, యీ గాంగేయుండును కుంభసంభవుండును ఎంత వాకొ్రిచ్చిరో, యంతయు సంభవమె యగుచున్నది. పాండవులపై ధ్వజమెత్తవలదని, లౌకికముగను, పారలౌకికముగను, బాంధవపరముగను, రాజనీతిపరముగను, నీతిపరముగను, భూతదయాపరముగనుంగూడ నెవరెన్నివిధాల బోధించినను జెవినిడక యీ మందబుద్ధి (సుయోధనుందడవుచు) లోభోపహతుండయి, ప్రజ్వలితదురభిలాషంబున నింతలు సేయుచున్నాఁడు.

— విదురుఁడు —

ఆంబికేయా, నీ విపుడు నుడివినయట్లు విధివశంబునఁ బుత్ర

వ్యామోహదోషంబు కతంబున నీ వాఁచిన పుత్రుని నింకను మందబుద్ధి యనియనుచున్నావు. తండ్రియనఁదగినపాటి మాటయె యంటివి. కాని నీవుగాక యితరులెవరును నీతని మందబుద్ధి యనరు. రజస్తమో గుణముల సాంకర్యముచే నుద్భవించిన హాస్యమని లోకులందురు. నీ వనిన మందబుద్ధి లేక బుద్ధిమాంద్య మొగులను బాధించువో మాత్సర్యమనియు, సహంకారమనియు నందురు. అంతియకాని నీ కొడుకును మందబుద్ధియని నీ వనినంత మాత్రమున నాతని యందున్న దోషము లేశమును తగ్గఁబోదు.

— ధృతరాష్ట్రుఁడు —

సంజయా! పుత్రప్రేమచే నే నేమనినను, వ్యక్తిసంబంధమగు ప్రకృతిగుణాన్వేషణ మొనర్చి నే నేమనినను దుర్యోధనుమూలమునఁ గారణము సడలిపోవుట కాక, మానంశమునకుఁ గడవరాని యవస్థ మాత్రము వచ్చినది. ఇంకేమి చేయఁగలను? ఎందుఁ బోఁగలను? ఇంకెందు దాఁగుదును? ఏవిధమునైనను భీమార్జునులఁ దప్పించుకొందమన్న, వారి తమ్ములును నట్టివారే కదా: ఇంకేది తెన్ను? పాంచాలురును, తదవనీశుండగు ద్రుపదుండును అంతకంటెను బలవంతులు. సద్వినయమును, వివేకమును, ప్రశాంతతయు, లౌకిక పారలౌకికోన్మేషములు శీలముగాఁగల యయ్యుధిష్ఠిరుం డెక్కడెక్కడి వారలనుంగూడఁ దనవశము జేసికొని, బంధు సుహృజ్జనంబుల నెల్ల చేరఁదీసికొని మనపైనెత్తివచ్చు. మనమాతని నాక్రమింపఁ దలంచుట మంటనార్చు ప్రయత్నమున మిడుతలా యగ్నిం దూకుటయె యగును. పాండవులతోడి భండనం బెల్లవిధంబులఁ గులక్షయ కారణంబగుట నిశ్చయము. శాంతిం బొందిన యునికియె యెల్లవిధంబుల మేలని యెఱుంగుదుము. మన కుఱ్ఱలకది యొప్పిదమయ్యెనేని, పాండవుల నిటకిపుడే రప్పించి, యందుకుఁ దగిన ప్రయత్నంబులు సేయుదము.

—సంజయుఁడు—

"దేవా, నీవిపుడు తలంచినదియె యుత్తమమార్గము. ఆ నాఁడు నీ వుపేక్ష సేయకుంటివేని, యింతలు పుట్టియుండకపోవును. ఇంతింతలయ్యును, వా రింకను, నీకు లోనయియే యుందురు. వారికిఁ దిన నింతయన్న మిడిన నీవెట్లనిన నట్లె సేయుదురు. వారు ధార్తరాష్ట్ర వంశవినాశమునొల్లరు. ఇంతకును వారిది వారికొసంగుటకు మనకేమి కష్టము? మఱియు వారు తుదిజూదమున వారి సంపద్రాజ్యము లోడ లేదే! దిక్కులం బట్టిపోలేదే! మనయానతి నేకద, మన నియమించిన కాలపరిమితి నేకద, పాపము వారలరణ్యావాసమును, గూఢచర్యయును నక్రమంబుగ సమయంబున నెఱపి మరలివచ్చిరికదా, తమరాజ్యము తమ కిమ్మని యనుచున్నారు. వారడవుల కేగునాఁడు, వారు రాజ్యము మన కప్పగించి యుండకపోయినను, తమ యధికారబలంబుకతంబుననకదా, వారి సంపద్రాజ్యంబులు దుర్యోధనాదికురుకుమారవర్గము స్వాధీన పఱచుకొనుట జరిగినది. వారడవులనున్న కాలాన నెంతెంతలగు పీడల నైన, మనవలనఁబడియు, నోగిలియుఁ బ్రత్యపకృతిం దలంపక తుదకు గంధర్వనిర్మితంబైన చెఱనున్న మనరారాజును బంధవిముక్తుం జేసి తన్మానప్రాణంబులు వారు రక్షింపలేదే! పాప మట్టి పాండవుల రావించి సంభావన సేయరాదే! మీరటుల వారిని రావించినను వారలుక వీడ రని తలఁచెదే! నీమాటకు మిగులనాదుదురనుకొన్నదే! ఏదీ-పిలువఁ బంపుము: చూత మేమగునో!"

నాఁడు భీష్మాదుల మాటలువిని రాజ్యమొసంగినయట్లు నేడు సంజయుని బెదరింపుమాటలకుఁ జెదరి ధృతరాష్ట్రుఁడు పాండవుల కర్ధరాజ్యమిచ్చివేయునను భీతిచేఁగావలయు దుర్యోధనుఁడు [తత్తర పాటుతో] "సంజయా! చాలదూరము నుడువితివి. కాని, యడవులను, గొండలనుబట్టి మహాపదనొందు, మనచే నెన్నోవిధముల వంచింపఁ బడి, యసమర్థులయి, మనల నేనాఁడును నెదిరింపలేక యూరును

చేరునులేక, యెందో పడియున్న వారి నిపుడు కృష్ణుఁడు సమకూర్చి, కొండకోయవారల నందఱఁ ప్రోవుసేసి—వీరే వీరపురుషులో పాండవు—లనినంతమాత్రమున మే మడలుగొందుమె? ఏమి, సంజయా నీ పిచ్చితనము!" అనియనెను.

(ధృతరాష్ట్రినుద్దేశించి మరల దుర్యోధనుఁడు)

ఏదోయొక సహాయసంపదచే వారిందనుక నిలిచియున్నారే కాని, యరణ్యావాసమున సంఘటిలిన యాపదల కీవఱకే సమయుటయో, లేక యజ్ఞాతంబున నైన నెఱుంగంబడుటయో నైయుండెడిని కదా! మఱియు గోగ్రహణఘట్టమున మన భీష్ముడడ్డుపడి యసంబద్ధమగు నొక కాలమానమునుదీసిచూపి వారి మానముగాపాడకున్నచో వారు మరల మరల నరణ్యాజ్ఞాతవాసములు చేయుచు నింక నట్లే జీవితకాలమంతయుఁ గడపవలసినవారలేకద! ఇంతదూరము కార్యకలాపము నడచియుండునా? ఇంతకును వారొకరిఁ గెలువ జన్మింపలేదు. గెలువఁబడుటయే వారిధర్మము. నాయనా! నీ వింత భయమందనక్కఱలేదు. మముఁ గెల్చుట వారి కలవికానిపని. మాపరాక్రమము నీవలుసుఁగాఁదలంచుటయే నీకింతవగపునకుఁగతంబు. భృగురాముని గెల్చిన పోటుమానిసియగు భీష్ము నెఱుంగవె! ఈతనిపేరు విన్నమాత్రాన పోటరి యనువాఁడెల్ల బాఱుచుండ, నింక నీపాండుపుత్రులన నీతనికొక్క లెక్కయగునె? అపరిమిత బలాఢ్యులును, సంగరకేళీనిపుణులును, అజేయులును, అయోనిజులునునగు గురుకృపాద్యాచార్యవర్గము వారచ్చముగఁ గినిసిరయేని హరుఁడైన వారి నెదుర్కొనఁ గలాఁడె! ఈశ్వర వరప్రసాదజుఁడగు నశ్వత్థామ మనపక్షమున నుండ మన మని కడలనేల? ఇందఱకన్న మిన్నయనందగువాఁడును, సహజకుండలమండితుండును, శౌర్యధైర్యశీలుండును, అసమాన బాహుబలుండునునగు, కర్ణుండుమనపక్షముననున్నాఁడు. ఈతనికిఁగుదురగు నెదిరి నొక్కని నాధర్మపుత్రుపాలఁజూపఁగలమే! తన నిర్వక్రవిక్రమమునకుఁ

ధోఁడుగ, నీకర్ణుదానశౌచాది కళ్యాణగుణముల నెంతుమేని, మహేంద్రుండు తన యర్థాంగి కొఱకే తనని నర్థింపఁ దన సహజకుండలము లొసంగిననాఁడు "దానసంపాదితకీర్తిధాముఁడు కర్ణుం" డనిలోకము లెఱుఁగకపోలేదే! వీరలేకాక బాహ్లికసోమదత్తాదులకుఁదోడు, మన తోఁబాటు సుఖదుఃఖములు సమానముగ ననుభవింపనెంచి వచ్చిన తక్కటి రాజలోకంబుగూడ నగ్గినైన నుఱుకఁదలంచియు సంద్రానైనఁ బడఁదలంచియు వేచియున్నది.

—సంజయుఁడు—

(తనలో) అయ్యో, రానున్నచెడు గెంతపంతమున నీతనినోట నిటు లశ్లీలములు వాకించుచున్నది! అగ్గినైనఁ బిడికిలింతమని పాండవు లువ్విళులూరుచుండ, వీరలగ్నినుఱుక సంసిద్ధులయియున్నారట! తుద కగ్గిలో నుఱుకుటయే యగునేమో పాప మీ కౌరవులకు!

అనుకొనుచు సుయోధనుపలుకులు వినుచునేయుండెను.

—దుర్యోధనుఁడు—

ఇఁకనాపాండవులకు మనకంటెఁ బ్రజానురాగంబుగలదంటేని మనకుఁ బదునొకండును, వారికి నేడును నక్షౌహిణులు సమకూడుటయే, నీమానసముననున్న యనుమానమును బాపగలదు. ఇట్లయ్యు మాకు సాయమొనర్ప నెంచివచ్చిన వారందఱును, మమువీడిపోయినపుడు, మాబలంబులన్నియు విచ్చిపోయినపుడు, మనవారందఱుం గలసి, వారికె గెలుపొసంగినయపుడు, ప్రాప్తకాలం బిట్టిదియ యనుకొనవలసినదేకాని, మా కితరలోపములవలన నట్టులయ్యె ననుకొనఁ దగదు. అంతియకాని, పాండవులను మాతో సమానులుగ నెంచి యాదరించుటకాని, వారితోడన గలసియున్కికాని, వారికి వెఱచి యేమేనొసంగుటకాని, వారి నెఱఁగి యొఱఁగి పారుటకాని, చేయంజాలము. సమరంబ సర్వవిధముల కార్యనిశ్చయము. ఇఁక నా నిశ్చ

యమొ, యలవాసుదేవు నిశ్చయమొ, జరిగితీరవలె. రాచకులములోఁ దలవంపుఁదెచ్చు పాలుపంపకమెక్కడిధర్మమిది నాయనా! జ్యేష్ఠానుక్రమంబగు రాజ్యం బవిభాజ్యంబుగద యనియైనం దలంపవేమి! వేయేల, యింతయైనపిదప నిప్పుడు పాలొసంగుట మన కెంతయు ధృతిచేటుగాక మఱేమగును? తుదకు ధార్తరాష్ట్రులు ధృతిఁదూలి, పాండవులం బిలిచి, పాలిచ్చి వారి యిచ్చకముంగోరి, వారికిచ్చిన తెఱంగున గార్యగతిం ద్రిప్పుకొనిరని లోకమువారలు మము నోనాడుట నీకుమాత్రము యశస్సును దేకమానునా? ఇంతయైనఁ దలంపవా? నాయనా నీవు నను నొప్పించి యొప్పింపను, బ్రతిమాలి నను మఱి మాలునట్లొనరింపను, నివియెల్ల నీకొడుకుఁజూపునకును, జేటునకును, సహియింపజాలకయ యగుఁగాక కాని, యీరీతి నోరువిడిచి నీవు చెప్పుట నెవరు వినిన నేవఁపడుదురుకదా! నిన్నేమనఁగలను? మానధనుఁడనగు నేనెట్లు క్రిందుకాఁగలను?

ఇఁక నీకున్న భయమెల్ల భీమసేనుని గదావిహారమునకేకద! గదావిహారమున నీమూఁడులోకముల నాకెదురు లేఁడని నీకెఱుక లేమినింతలు వాటిలుచున్నవి. ఎప్పుడైననాభీమునితో గదాయుద్ధముఁగోరకునా యను వేదనం బొదలుచుందు, నాకింతకాలానకుఁ దనకుఁదానసమకూడిన యీ గదాకదనమున వజ్రప్రహారమున నింద్రుండు గుబ్బలిని కుంభినిం గూలునట్లు భీముంగూలనేసినఁ గదా నాజన్మమునకు సార్థకత! పాండవసేనలకెల్ల నాతఁడేకదా మొనగాఁడు! అట్టి యాతఁడే పడుటతటస్థించెనేని మఱివారిసేన ననిమొననిల్చి పోరుసల్పఁగల మగటిమి గలాడింకొక్కఁడేడీ? పాపమా ధర్మజుఁడైదూఁళులనైననీఁగోరుచు మనకు వార్తనంపుటకుఁ గతంబైన దీవెఱపేకద! ఇఁక నర్జునుఁడు లేఁడాయని యందువేమో; నాగదాప్రహారమునకు భీముంగూర్చి యెదురుసూచుచుందు నా వలెనే, భృగురాము కరుణనుపడసిన యేకవీరాస్త్రశక్తికెపుడు బలివెట్టుదునాయని యర్జునుకొఱ కెదురుతెన్నులు చూచుచుందు

కర్ణుఁడు లేఁడా! ఇంతమాత్రానికే యింతవంతయేల? నీకొడుకు లోకశ్లోకశ్లై జగంబులనెల్లం జయింపంగల జగజెట్టు. అట్లగువీరందఱు నొక్కమొగంబయి త్రోచికొని నడచిరేని, ఒక్కఫల్గుణునేకాదు, ఒక్కభీమునేకాదు, కౌంతేయులనెల్లర నొక్కమొత్తున వైచికొన నోపుదురు. ఇక మాసైన్యంబన సారమ్ములప్రోవు. వారిసైన్యంబన నిస్సారంపుఁదావు. ఇట్లెన్ని వితముల నీయెక్కువతక్కువ లెంచి చూచినను వారుమముఁ గెలువ నలవి కాదనుటయే నిశ్చయమగుచున్నది. ఇది యిట్లుండ, మాకు నలవికానిపని యొక్కటి లేకపోలేదు. అది నీ వగపు నుడుపంజాలకుండుటయె. మము మిగులుపని యింకొకటి లేదు. నాయనా, యిఁక నీవు ధైర్యమూని, మాకు జయంబె కోరుచు, నందులకు వలయు ప్రసంగంబుల నుండుటదక్క నింకేదియు వలదు."

ఇంతదూరము తనతండ్రితో స్వవిషయముం గూర్చి ప్రశంసించియుఁ బరవిషయముంగూర్చి ప్రసంగించియు నంతతోఁ దనివి దీరకయు కావలయు, దుర్యోధనుఁడు, సంజయుదిక్కు మొగంబయి "సంజయా, ధర్మనందనుం డెక్కడెక్కడి కొండకోయ జాతులవారి నెల్లఁ బ్రోవుసేసికొని, యేమిసేయ నాలోచించుచున్నాఁడు?" అనియడిగెను.

—సంజయుఁడు—

ధర్మజుఁడా! హేతువాదమునగాని, భీతివలనగాని, లోభము చేతఁగాని, రోషవశమునగాని, సత్యమును ధర్మమును విడువజాలని ధర్మభృద్వరిష్ఠుండగు ధర్మసుతుఁడు యుద్ధము జీవహింసాకరమగుట మనవంచనకార్యము లెంతదూరము నడువనీయవలె, మనగర్వము నెంతకాలము చెల్లనీయవలె, నంతదూరమును, అంతకాలమును, నడువనిచ్చియుఁ జెల్లనిచ్చియుఁజూచి, యిట్లెంతకాలమూరకున్నను ప్రయోజనము లేదనియెంచియు, సంగరముకాని తెఱవున మరి కార్యము:

చక్కఁబడదని తుట్టతుదకు స్థిరపఱచినాఁడు అతనితమ్ములొక్క పెండ్లికిఁ బోయెడువారింబోలియున్నారు. ఇఁక నందున్న నాయకులమాటఁ దలంతుమన్న — నింకెన్నఁడోకదా, మాచేతుల తీఁటఁబుచ్చుట — యని యున్నవారు. ఆచమూ కింకేరియఁగను గానరాదు. అర్జునుని పాశుపతాది దివ్యాస్త్రములపెంపును భీముగదసొంపును నింపునింపుచుండ, వానిని నమ్మి, యక్కడి వారందఱును ముసుగు గవిసినట్లయి, యెల్లపుడును, గయ్యమునకె కాలు ద్రవ్వుచున్నారు.

— ధృతరాష్ట్రుఁడు —

సంజయా, మన దిక్కునంగల బలుమానిసు లెవ్వరికింగూడ నసాధ్యులును, నజేయులునుగదా! వీరినందఱను సాధించు మార్గము వా రూహించిరే?

— సంజయుఁడు — (తనలో)

అన్నా! ఈధృతరాష్ట్రుఁడింకను జయమొందఁగల యట్టులే తలంచుచు "పాండవపక్షముననున్నవారు మనబలంబులఁదలంచిరే" యని యడుగుచున్నాఁడు. ఇంత లోభగుణప్రధాను నిప్పటి కింకొకనిఁజూచి యెఱుంగను. నిజ పక్షముననున్న వీరుల గొండాడుచుఁ దనకొఱకు బలికిన పలుకులనెల్ల వినివిని నమ్మి, తనవారజేయులనియు, నసాధ్యులనియు, నిర్ధారణమొనర్చికొని, యట్టివారిని సాధించునట్టి మార్గము పాండవులూహించిరేయని యడుగుచున్నాఁడు. ఆశాపాశము లెంతబలవత్తరములైనవి! ఇంతకును ధృతరాష్ట్రుని సంశయముం బాపుకొఱకును, ఇటఁజేరి యున్న వారినందఱ సాహసప్రయత్నపరాఙ్ముఖులుగ నొనర్పను, నాకుఁదోచినరీతి నీతనికి జెప్పిచూచెదఁగాక!

(ప్రకాశముగా)

అంబికేయా! "ప్రథమమున దానిని నిర్ణయించుకొనియే కార్యక్రమమున కుపక్రమించి యున్నా"మని వారనిరి.

మనము వారికిఁ బాలీయము, మనశాంతనవుఁడు వారి శిఖండి పాలనియు, మనద్రోణుఁడు వారి ధృష్టద్యుమ్ను పాలనియు, మన

రారాజును దమ్ములెల్లరును వారి భీముపాలనియుఁ, గురుకుమార వర్గమంతయు వారియభిమన్యుపాలనియు, మనయశ్వత్థామకర్ణులును ఇతరులచేఁ దెగని తక్కిన దండిమగలందఱును, వారిసవ్యసాచి పాలనియు, మనకృతవర్మ వారిసాత్యకిపాలనియు, మన సోమదత్తుఁడు వారి చేకితానుని పాలనియు, మనశకుని వారి నకులుపాలనియు. మన యులూకాది సుతులందఱును వారి సహదేవుని పాలనియు, నిట్లు మన వారి నందఱు వారివారి వంతుల వరుసను బంచికొని మిక్కుటమగా వేడ్కతోనున్నారు.

—ధృతరాష్ట్రుఁడు—

(సాశ్చర్యంబుగ) అట్లయిన నిక ధర్మజుండు సేయున దేమున్నది?

—సంజయుఁడు—

ఏమున్నదా—శల్యసంహారము!

ఈమాటయును అక్కడఁపడకపోలేదుసుమా! అపుడక్కడికొందఱు 'ధర్మనందనునకు శల్యుండొక లెక్కయా' యనిరి. ఆపలుకులకు ఆహా! ధర్మజుండు-ఆనిర్గర్వచూడామణి-మనమునకైన నుబ్బక, శల్యుని శౌర్య ధైర్య సాహసాది వీరజనోచిత గుణగణము నభివర్ణించి, చెప్పి మఱియు "శల్యుంబొడుచుట సామాన్యంబుగా దది హృదయశల్యంబును నెమకఁబోవుటవంటిది" యనికూడ నొక్కి చెప్పి మద్రేశునకు నమస్కరించెను.

వైచిత్రవీర్యా! చూచితె, ధర్మజుని యౌదార్యము! తుదకుఁ దనపై కత్తివచ్చువారిని మాత్రమే కాక తా నెదుర్పఁబోవువారినైనను అగౌరవముగ జూడఁజాలని యౌదార్యవంతుం డగుటనే కదా మన మిపు డూహింపఁజాలని తెన్నున జయలక్ష్మి తనకుఁదానుగాఁబోయి యాతనినే వరించునని దలంచుటకుఁ గారణం బగుచున్నది! వారికి దోడాసంగవచ్చిన రాజులందఱును, వారివారియెదుట మనలో నెవ్వ రెవ్వారు వడిన వారివారి నక్కడక్కడనె మడియింతు మని యు

న్నారు. చిచ్చోడిం గట్టుకొని యోర్చి అసిధారావ్రత మిన్నియేడులు వారు నడపినను, మీహృదయములు మృదులత వడయమిం దాము పోరొనర్చినను, జరుగనైయున్న యాలమున నౌచితి తప్పినను, ధర్మచ్యుతి లేదనిగూడ వారలు నిర్ణయించిరి.

ఇఁక నీవును నీకొడుకుగమియుఁ గర్ణసౌబలులును ఏది నిర్ణయింతురో యయ్యదియె యూర్జితంబగు కార్యంబగును.

ఇంచుకతడవు నీరవృత్తి వేడినిట్టూర్పువిడిచి, ధృతరాష్ట్రుఁడు "సంజయా! ఇఁక నాకొడుకులకు బ్రదుకుఁ దెఱవెక్కడ? ఏమియుం దోఁపకున్నదే: ఇపు డిటఁగూడియున్న వారందఱకు, నీ విపుడెన్నిన యచ్చటి వీరానీకము నోర్వవచ్చునే! అది వట్టిమాట. అటు యుధిష్ఠిరుని రాజుంజేయ హరి సమకట్టియుండ, దానిని మన సుయోధనుండు సరకుసేయఁకుండుట తనబ్రదుకును దుఃఖభాజనమ్ముగఁ జేసికొనుటయ కాదే! ఈ కురువంశమునకె కాక, నిరపరాధులగు నీ కూడియున్న రాచవారికింగూడ గాల మాసన్నమగుట, వీరిని వారింప నాకెట్లు సాధ్యమగును! ఇఁక వగపుఁదక్కి గుండెఱాయి చేసికొని రానున్న ముప్పున కెదురుసూచుచు నూరకుండవలసినదేకదా!

—దుర్యోధనుఁడు—

నాయనా! యేమి నీ వెఱ్ఱితనము! మేమును ధర్మజాదులు నొక్కశిక్షం బెరిగి పెద్దవారమయి యుండ మాపై నెత్తివచ్చు పాండవులె జయమందుదు రనునొక్కనిశ్చయం బది యెక్కడ! ఇంతకును నీ మనోదౌర్బల్యమే కారణము.

(అని సంజయుదిక్కు మొగంబయి)

సంజయా, నీనోట నేమాట బయలువడినను నయ్యది వారిని, వారివారిని వర్ణనసేయుటయె యగుచున్నది. కాని మమ్మును మా వారిని దలంపనైన నొల్లకున్నావు; ఈ రాజ్యలక్ష్మి వారిని సంపూర్ణముగ శాశ్వతముగఁ బాయును దృఢముగ సోత్సాహముగ మముఁ

జేరను, విధిసృజియించియే యుంచుట సిద్ధము. దీనిని మాన్పను మార్పను, నెవ్వానికిని వశముకానిపని.

[కనుసెట్టుఁజేసి దుర్యోధనుఁడు సంజయునిదిక్కు సూచుచుండెను.]

—ధృతరాష్ట్రుఁడు—

నాకొడు కున్మత్తప్రలాపంబు లాడుచున్నాఁడు. సత్య ధర్మ నయ పరాక్రమసహాయ సంపన్నులౌ పాండవులను భండనంబున మడియింపఁ దనకగునని తలంచుట తన యహంకారమునకుఁ బ్రధానచిహ్నము. తానొక తెన్నునఁ బ్రబలబలుండై యుండుఁగాక కాని, పెనఁకువ యొల్లని మేలగునె!

సంజయా! ఇంకను నాకొక్క సంశయమున్నది.

—ఇపు డీయాహవమునకుఁ బురికొల్పుచు మామాట యాట వచ్చినపుడెల్ల నుల్లికుట్టు మాటలచే వారల నుడికించుచుఁ బాండవులకు ధైర్యముగొలుపు వారెవ రచ్చటఁగలరు?—

—సంజయుఁడు—

అంబికేయా, పాండవసాహసాగ్నికి ధృష్టద్యుమ్నాజ్యమె సహాయము. మఱేమికావలయును? కౌరవసేనాసముద్రంబునకుఁ దానొక చెలియలికట్టయై నిలుచునని, వారికిఁ జేయూతనొసంగె.

—ధృతరాష్ట్రుఁడు— (అధైర్యముతో)

కుమారా! నీకును, నీపరిజనమునకును, మనధరణిలో సగము చాలు; తక్కినసగమును ధర్మనందనునకొసంగి నెమ్మదిగ బ్రదుకుటకంటెఁ గురుసంతతికి శాంతిమార్గము మఱిలేదు.

సుయోధనా, మది నరమరలేక పలికెద వినుము. ఇపుఁడీ యుద్ధము నాకెకాదు. మనపెద్దల కెవ్వరికిని నుచితముగఁ దోఁపలేదు. ఇంతియకాక గురుగాంగేయాదులు తెంపునఁ బోరికింబోరరు. కావున నీ పోర గెలుపొందుట మనకుఁ బొందని కత యగునోకా యని తోఁచెడిని. తనకుఁ బ్రత్యేకవైరియగు నర్జునుపైఁ బగసాధించుకొను

Telugu

టకుఁ గర్తుండును, మనవంశము నిరంకురము సేయఁగృతనిశ్చయుండయి తద్విధాన మలజూదమునాఁటనే తనపాచికలతో నుపక్రమించిన సౌబలుండును, సంఘనియమముల నైనఁ బాటింపనొల్లని మూర్ఖ చిత్తుండును దుంటరియునగు దుశ్శాసనుండును, నీకెందాఁక మంత్రోగము సేయుచుందురో యందాఁక మనకు కులక్షయముతప్ప నీక నేయొకటి యెటులఁ జరుగఁగలదు? భీష్మాదులు మనసిచ్చి యనిచిచ్చుం జొచ్చువారు కారుసుమీ!

—దుర్యోధనుఁడు—

భీష్మద్రోణులు యుద్ధమొల్ల రనికదా యంటివి. కాని వారి సాయమునన జయశ్రీ గొనిరాఁగలను. కర్ణశకుని దుశ్శాసనులు నీ కంతచుల్కనగఁదోఁచినను, వారే ప్రధానులు. వీరునాయండనుండ, నాకార్యదశ మఱితిరుగదు. నాయనా, నన్నింకను మోమోటమి వెట్టకు. దాపరికమేల, వాఁడిసూదిమొనమోపినయంత నేలనైన నేను వారికీయఁజాలను.

—ధృతరాష్ట్రుఁడు—

సుయోధనా! నీకిపుడు నాపలుకులంత పథ్యములు కాఁజాలవు. నాకు వయోధికత కతమునఁ బుత్రవ్యామోహ మెంత యధికమగు చున్నదో, నీకు నహమికకతాన మూర్ఖ్యము నంతవిజృంభించుటఁ బాండవేయులకేమియునీయ ననుచున్నావు. నావార్ధక్యమును, దన్మూలమున నాకుఁగలిగిన మానవసహజ హృదయదౌర్బల్యమును, నీవు స్వపక్షబలముగా నెన్నుకొనుచున్నావు; కానివజ్రాఘాతంబువలనఁగొండలు పిండియగునటుల భీమగదాదండ ప్రహారంబువలన నీసేనయు, నేనుంగుల గములును, నేలఁగూలఁ దద్రక్తధారలు సెలయేటికాలువలై పాఱుచున్నపుడుగాని, నామాటలు [illegible]నకు రాఁజాలవు. విజయుని బాణపరంపరలచే సైనికులెల్లరు నేలఁగూల, సమరావని ఘోరవన ప్రవేశము దలపించుచుండు సమయానఁగాని నాసూక్తులయాదరి

గ్రహియింపఁజాలవు. వేయేల! పాండవస్కంధావారమును, దనమంత్ర రక్షణ కళాకౌశలమునఁ గాపాడుచు, కౌరవసేనలనెల్లఁ బుకళింబడఁ జేయుచుఁ గృష్ణుండతి సమ్మోదంబునఁ బాండవులయెడఁ బరమాప్తుండయి ప్రవర్తించుచుండ, నీవుత్రోవయుఁదెన్నును గానలేక, యాకసముదెసం జూచునపుడు కాక యంతముజూచినంతఁగాని పరితృప్తిం జెందని మూర్ఖుంబోలె, నీవు మతిమంతుండవు కాఁజాలవు.

ధృతరాష్ట్రుండిట్లుపన్యసించుచుండ, దుర్యోధనుండు మార్మోగముపెట్టుకొని నిలిచియుండెను.

—ధృతరాష్ట్రుఁడు—(తనలో)

నేనింతఁదలంచుచుంటినేకాని, యేమో, నాకొడుకులె జయమందుదురేమో! జయాపజయంబులు దైవాధీనంబు లందురే? కాని, జయశ్రీకాంతుండగు నా శ్రీకృష్ణుఁడె యాదిక్కుననుంట మాజయమునుగూర్చి సందియమునకుఁగారణమగుచున్నది. 'నిరస్త్రపాణినైయుందు'నని యర్జునసుయోధనులతో ననియె నాయదుశేఖరుండని యెంతుమన్నను, ధర్మసూక్ష్మవేదియగు నైతికుఁడుగదాయని కుందవలసి వచ్చుచున్నదికాని, కానిచో, నాకొడుకున్నతికిని, అతని చతురంగబలసమ్మేళనమునకును ఏంది వానినోడింప కన్నెత్తిచూడనైనఁ జాలుదురే? బలరామునొద్ద గదారహస్యము నెఱింగిన మాసుయోధనునితో సరిగదా గదాకౌశలము; భీముఁడీతనితోఁదులయగునా? సుయోధను ధనమెల్లఁ గదయేగద! కర్ణుఁడార్జించిన యేకవీరాస్త్రప్రదీప్తి కాయర్జునుండు నిలువఁగలఁడా? ఇట్లు భీమార్జును లిరువురును నిర్జింపఁబడిరేని, యిఁకపాండుపుత్రులఁగలవారెవరు? పాండవుల పంచగ్రామసంధి వార్త కిదియేగద కారణము! ఇక మిగిలినది ధర్మజానికోపదవానలము. అది తొలుత నేమియు లేనటులనేయుండి, యంతయు నైరణాయే యని స్థూలదృష్టికిఁ దోఁపఁజేయుచున్నను, తుదకేమిగాఁబరిణమించునో యనుచింతమాత్రము సూక్ష్మదృష్టికి సదా కలిగించుచునేయుండును. ఏదియెట్లున్నను పాండవులకెక్కుడ దైవశక్తిగానుండకతప్పదు. మనవారిది కేవలము మానవశక్తి.

(ప్రకాశముగా) సంజయా! ఏకాలమందైనను మానవశక్తి దైవశక్తికి లోఁబడియే తీ

అని సుయోధనుఁ దనచేతం దడవుచు:—

పుత్రకా, అగ్నిదేవు నుపాసించి కేతుస్ఫురణాదికంబులగు సంగరపరికరంబుల నర్జునుండు వరంబులుగాఁ గొనియున్నాఁడు. ఇంతియ కాదు; ధర్మదేవతయు వసుదేవుండును వాసవుండును ఆశ్వినేయులును పాండురాజుతోడి రాజులును వారికొక్కకీడునుం బొరయకుండఁ గాపాడు చుందురు. కావున భీష్మద్రోణప్రముఖులకు నైనఁ బాండవులం బరిభవింపరాదు. ఇది తథ్యము. దైవబలసంపన్నులగు పాండవులనని గెలుచుట యసాధ్యము.—అని యుచ్చైస్స్వరంబునఁ బలికి మిన్నకుండెను.

—దుర్యోధనుఁడు— —

నాయనా, పెద్దవాఁడవగు నీతో నేనేమి చెప్పఁగలను! దేవతలు వారికే సాయము సేయువారనియు, మాకు సాయము కారనియు ననుచుంటివి కదా! రాగద్వేషావేశమున పక్షపాతవృత్తి నొందిన వారేటి దేవతలు? అట్లగుట దేవతలు కానివారి సహాయము మాకును వారికిని సమానమె యగును. కావున దైవసహాయము, విధివిధానము, మొదలగు నీముసలితనంపుఁ బిచ్చి పలుకుల కేమి లే!

పెచ్చుపెరిగివచ్చు కార్చిచ్చు నార్పను, పాషాణవర్షంబు వాపను, మహాసముద్రముపై నీళులనభిమంత్రించి తత్ప్రదేశము భూభాగముగ మార్చి దానిపై సేనను నడిపింపను, వలసినచోట నభిమంత్రించి జలంబుల నుత్పన్నంబగునట్లొనర్పను, నానాక్రూరశస్త్రసంరంభణంబుల నిస్స్తంభనంబొనర్పను మిత్రశత్రు విషయంబులైన శుభాశుభంబులు వలయుభంగి నావహింపను, నే నేర్తు. నానావిధకార్యసిద్ధిప్రదంబులగు మంత్రాద్యనుష్ఠానంబుల సకలవిధదేవతల నారాధించియున్న నాకుంబోలె వారికిని మహామహిమంబులె కలవేని, వారన్నియేఁడు లడవులఁ గడునిడుమలు పడనేల? ఇంతమాత్రమూహింపవా; ఇంతయేల! పిపీలకాదిబ్రహ్మపర్యంతముంగల జగదీశుని యనంతలీలా

విశేషంబులు మొదలు పాటకజనముల సమక్షంబున నెఱపు మాంత్రికుని కనికట్టువిద్దెలవఱకును గల విశేషంబు లశేషంబుగ నెఱింగిన ననుగూర్చి, నావిజయముంగూర్చి, జంకును, సంశయమును వలదు. నేనేయలిగితినేని వారినిసురలైనను రక్షింపఁజాలరు. మఱియు దేవత లలిగి వారికపాయము వాటిలఁజేయఁదలంచినను, నేవారింపనేర్తు.

ఇట్లాదుర్యోధనుఁడు తనతండ్రితో నాడుచుండ, కర్ణుఁడు ధృతరాష్ట్రుని సరకుసేయక, దుర్యోధనునకుఁ బ్రియంబుదోఁపఁజేయనెంచి, స్వసామర్థ్యముంగూర్చి కావలయు, దుర్యోధనుం జూచుచు చెప్పఁబూనినాఁడు.

—కర్ణుఁడు—

ప్రభూ, నానేర్చినయస్త్రవిద్యగురునాగ్రహమున నాస్ఫురణం దప్పి ననుకొనుచున్నారేకాని మద్గురునారాధించి, యాతనికరుణను మగుడవడయుట వీరెవ్వరు నెఱుంగరు. ఇఁక నిక్కముగ నే నలిగితినేని దేవతలేని ననుగన్నెత్తి చూడఁగలరె! కర్ణుని దూలనాడ బుట్టిన యీగురుగాంగేయాదులు నీకడనె నిలచి చూచుచుండ విజయమ్ము నీకుంగరతలామలకమ్ము సేయుదును. నీకాసంశయమువలదు.

విదు:-(తనలో) విజయుం డాదెసయట: విజయం బీదెసయట! ఎంతయసంబద్ధము!

—భీష్ముఁడు—

రాధేయా, నీవెక్కడ? అర్జునుండెక్కడ? ఏకవీరాస్త్రమును సర్పముఖశరమును, గలవనిగర్వించుచున్నావేకాని, నరునకు బాసటయైన నారాయణునిచే నయ్యవి వ్యర్థములయి తునియలై, బూడిపొడియై నేలరాలగలవని యెఱుఁగకున్నావు. పసులంబట్టించునాఁటి యవ్వివ్వచ్చు మచ్చునింతలోనన మఱచితే! ఇంతకును సూతసూతివిగదా!

(తనలో) ఈతఁడనూఁతనేపికొనియేకదా యీసుయోధనుడింతవడి నడచుచున్నాఁడు—ఎట్లైనను దేశారిష్టమువాన్పను, జనక్షయమునుడుపను, జ్ఞాతివర్గమును చేతోమోదమున నుంపను, కౌరవసామ్రాజ్యమున నిప్పుడు తేజితమగుచున్న దౌర్బల్యము వాపను, పాండవసహాయము కౌరవసంపదకుం దోడుసేయను, కురుసామ్రాట్పదము

నంగీకరింపక స్వాతంత్ర్యము స్థాపించుకొననెంచి కట్టుఁగట్టియున్న సామంత రాజులనందఱ నడంపను, నేనెన్నియుపాయము లాలోచించి చూచినను, ప్రయోజనము లేకున్నది. పరాక్రమమున శరవిద్యాపాటవమున ఖండనపాండితీ ప్రభావమునఁ బార్థునకేమాత్రమును ఈకర్ణుఁడు దీసిపోఁడని నేనెఱింగియు, ప్రభుభక్తి తత్పరతచే లోకకల్యాణ ప్రణాళిక నీతఁడు మఱచుచున్నాఁడుకదా యని యీతనిఁ దనప్రయత్నమునుండి విముఖుంజేయ నేనెంతెంతమాటలాడినను ఈతనివ్యుత్పత్తిమ మదెంత కలదోకాని, సుంతయుఁ దలంకకున్నాఁడు. తుద కేమిమూడనయి యున్నదోకద! అయినను ధృతరాష్ట్రుం గదల్చిచూచెదఁగాక!

అని భీష్ముండమకొని ధృతరాష్ట్రుంజూచుచు మరలనందుకొనెను.

భీష్మ:-ఆంబికేయా, జ్ఞాతులు తమలోఁదాము పొందికతో జీవింప నెంతురేని సంఘీభావంబునఁ గలుగు సంపదతోఁ జెలంగుదు రట్లు కానిచో పేరుమాసిపోవుదురుసుమా. మఱియు జ్ఞాతులతోఁగలసి సంభాషణయును, సహజీవన సహభోజనాది సత్కారంబులును సవినయ వర్తనంబులును, ఇహపరసాధనంబులనికూడ పెద్దలు చెప్పుచున్నారు. ఇంత దెలియక సమరంబున మీ రర్జును నిర్జింపఁ దలంచుచున్నారు. కానియాతనితోఁ బోరి మానప్రాణంబులఁ దక్కించుకొనఁ గలవాని నొక్కనినైనం జూపఁగలమే! యుద్ధము సేయఁగోరికదా-వారు కలరు: వీరుకలరు; వారాదురు వీరాదురు;-అని మీరూహించుటలు! ఇంతయేల: ధర్మజునే నీలోనికిందెచ్చికొనినచో, నాతఁడే మనకన్నింటికింగాఁగలఁడే! ఇంతయెఱుంగవే!

బాహ్లి:-వైచిత్రవీర్యా, ఇదియంతయుంజూడ, నీసామ్రాజ్యపతన హేతుభూతమొనాఁ దోఁచుచున్నది. ఇపుడీ సుయోధనుపట్టుడిపింప జాలమేని, కురుసంపదయు, శంతనుసామ్రాజ్యగౌరవమును, కరినగర రాజరాజేంద్ర బిరుదమును, నశించిపోవునుగదా యనియెంచి, యీతని నెంతవారించినను, వెనుకకుతగ్గకున్నాఁడు. కానయియున్న కురువంశ వినాశ మంతబలవత్తరమయి యుండనోపు! ఓపినంతవట్టు మనము

చెప్పి చూచియు కురుసంతతిని వినాశమునుండి తొలగింపఁజాలమి, మన కార్యములకైనను మనము కర్తలముకామని స్పష్టపడుచునే యున్నది. ఇఁకనైన మనము విచారము తొలంగియుందుముగాక!

ధృత:-నందనా, నీకు నేనెటులనో, యీ బాహ్లికుండును నట్లేకదా! నీయెడ వాత్సల్యమున నేకదా యీ భీష్ముండింకను నినువీడంజాలక నీకు హితములుగఱపుచున్నాఁడు. నీవలన మన్ననల నందఁదగిన భీష్మ బాహ్లికులును, నేనునుంగూడ నిను బ్రార్థింపవలసివచ్చుచున్నది. ధర్మజునకుఁ బాలీకున్న మాటేఁగాని నీకుఁదోఁచినదియైన నొసంగుము. రాజులిచ్చువారేకాని పుచ్చుకొనువారు కాకపోయినను పాండవుల యీ యడిగికోల్తనమునందే నీచేయిమీదగుట సువ్యక్తమగుచుండ లేదా! "జ్ఞాతులకుఁ బాలీక వారినడవులంబట్టించె సుయోధనుం" డనుమాట కలకాల మియ్యేల నిలఁగలదు సుమీ! నీవెందఱకీయలేదు! ఎందఱు నీచేఁ దనియలేదు! మఱియింకను నాలోచనకుఁదావులేదు. తరుణము మించనీయకుము——ఔ ననుము.

మితిలేనియుద్వేగము నందినాఁడు ధృతరాష్ట్రుఁడు; జేవురించిన మొగముతో నిలచియున్నాఁడు దుర్యోధనుఁడు; కర్ణునిదెసమొగంబయి అదె, యేమోపలుక చున్నాఁడు ధృతరాష్ట్రుఁడు.

"కర్ణా, నీ బీరములు కార్యరంగమున కక్కఱకువచ్చునవియే యైనచో, నాఁటిగోగ్రహణఘట్టమున నర్జునుచే నిహతుండు కాకుండ నీతమ్ముని గాపాడుకొనకుందువే! నాఁడు నీకాలు సేతులాడకుండఁ జేసిన వాఁ డొక్కఁ నరుండె: ఇపుడో! అతనికిఁదోడుగ నరదంపు మొగల పైనున్న వాఁడాదినారాయణుండు; ముందునడచువాఁడు గదాధారి యౌ భీముండు; అంగరక్షకమైవచ్చునది యనుజతనుజవర్గము; నాఁ డొక్కఁడైవచ్చు నర్జును నిర్జింపఁజాలని నీ విపు డిట్లువచ్చువానిని గెల్తుననుట నోరుచేటుకాదే! నీమత్సరపుమాటలు మా సుయోధ నుఁడెంతయు నమ్ముకొని యింతలు సేయుచున్నాఁడు. ప్రభుభక్తియను

పేర భృత్యుఁడాడుపాటిమాటలచేతనే, మా వంశమునకు మచ్చదెచ్చి నావు. ఔరా! కాలమహిమ! భరతవంశపు బ్రదుకెల్ల తుదకు నీ పాలనా పడియెను! ఇఁక నీ వీరాలాపములు గట్టిపెట్టుము.

గాంగేయాంబికేయుల కటూక్తులచే సంక్షుభితమానసుండై కర్ణుండు భీష్ముంజూచి:

కర్ణు:—నాపరాక్రమసహాయము నీకు లేకుండుఁగాక! సమరావని నీవు పడుటఁ జూచినఁగాని నేనాయుధములఁ ధరియింపను. కార్యదశ నెఱిఁగి నావిక్రమముఁజూపెదఁగాక—ఇదె యస్త్రసన్న్యాస మొనర్చుచున్నాను.

అని తన బాణతూణీరమ్ములనేలఁదిగిచి అచ్చటు విడిచి రాజ్ఞసమ్మతిన శరవేగమ్మున వెడలెను.

భీష్ముఁడు:- సుయోధనా, కర్ణుండాడినంతయుఁ జేయంగలాఁడు ఇందనుక జరిగినఘట్టములఁ దాఁ జేసినయంత లేసి బాసలలో నేదేని వీటిఁబుచ్చెనే! ఆడినంతయుఁ జేయంగల కర్ణుఁడే యలిగిన నాహవమ్మున బాపమా కౌంతేయుల కెట్లు బ్రదుకనగును!

ఏదియెట్లు కానున్నను, నీవు భృత్యునాతగాఁగొని, పెద్దలన్న విశ్వసింపక క్షత్రసామాన్యధర్మము ననుసరించి యుద్ధముసేయక మానవు. ఇది నే నెఱుంగుదును.

పౌరుషమున కెట్టి లోపమును రానీయక కర్తవ్యాకర్తవ్యముల నెఱింగి మెలంగుచున్నవాఁడను నేను; పరాక్రమప్రధానుఁడై, కార్య పరిణామము నూహింపలేక, భృత్యుజనార్హ్యమనుకొని వీరాలాపములచే నిన్ను ద్రేకింపజేయుచున్నవాఁడు రాధేయుఁడు. నీ విభిన్నప్రకృతుల విభేదమునించుకయు నెఱుంగఁజాలకున్నావు. నాసమరవిధానంబు నీవును, ఈ బాహ్లీకాదులును ముందెఱుంగఁగలరు. సూతసూతిం బోలె వాగ్రణమున నీకుజయంబు నేఁజూపంజాలను. ఎదిరిచందంబును జయాపజయంబుల పోడిమియు నెఱింగినవాఁ డెవ్వండును జయలక్ష్మి తన యరచేతనున్నట్లు వలుకంజాలఁడు. ఊరక యలుకయేల? ఇపుడీ వ్యాజమున బాణతూణీరములువీడి, తనకురాఁదగునోటమిఁ దప్పించు

కొనఁజూచు నీకర్ణునిమగఁటిమి మనకు విదితంబయ్యెఁగదా!

బాహ్లి:—(తనలో) అవినీతుండునుకర్ణపక్షపాతియునగునీదుర్యోధనుఁడపథ్యాను రాగియగు రోగిలాగున స్వవినాశహేతుభూతములగు కర్ణుపలుకులె యమృతోప మానములుగ నెంచి కావలయు నేమోపలుకుటకు మఱలఁ దలపడుచున్నాఁడు.

—దుర్యోధనుఁడు—

పితామహా, తెలిసియో తెలియకయో నీవు తొలినుండియుఁ బాండునందనులె యుద్ధమున గెలువఁగలరని నిశ్చయించుచున్నావు. కాని నేనుమాత్రమునిన్నును, బాహ్లికుని, గురుని, ఇంకం దక్కినవారిని, నమ్మి యుద్ధమునకు సిద్ధపడుచున్నాను. జయమువడయుట కీబలంబులు చాలునని నేను తృప్తినొందకపోలేదు. కాని యిపుడీగతి మీరును మీరునుంగలసి వాగ్వాదంబులఁ బెంచుకొనుటచే నేనొక నిశ్చయము నొందవలసివచ్చినది.

కర్ణుఁడును, దుస్ససేనుఁడును, రణరంగమున విరోధిసైన్యములఁ దునుమాడుచుండ, సౌబలుండు మంత్రరక్షణ మొనర్చుచుండ నింకను నాకొరులేల? మాతండ్రి రాజ్యపాలనారంభకాలమునాఁటికంటె, కురుకాలమునాఁటికంటె, శంతనుకాలమునాఁటికంటె, బహుయోజన విస్తీర్ణమగు నేలమాకు దక్కఁగలదు. ఇపుడీయుద్ధమువలన జ్ఞాతిచ్ఛేదమగుటయెకాక, వారికి సాయమొనర్ప నెంచివచ్చిన రాజులెల్లరుంగూడ రణమునఁ గూలుటతోనాఁగక, కురుసమాశ్రితపదము నంగీకరింపక, కట్టుకట్టి స్వాతంత్ర్యము నెలకొల్ప నెంచిన రాజలోకముంగూడఁ దెగఁగలదు. కనుక, వారివారి రాష్ట్రములెల్లమముఁ జెందుటను కురుసామ్రాజ్యము ద్విగుణీకృత సామర్థ్యముతోఁ బునః ప్రతిష్ఠితము కాఁగలదు. ఇట్టి మా నిర్ణయము నీతియో, యవినీతియో తుట్టతుదకుఁగాని యెఱుఁకపడదు. ఏదియెట్లున్నను మానిర్ణయమునకు భిన్నముగామాత్రము మేము నడచువారము కాము.

ధృతరాష్ట్రుఁడు-"నాబ్రతుకెంతదుఃఖభాజనమైపోయినది!"అనియనెను

—విమర్శ—

వైచిత్రవీర్యా, మనవారు తమలోఁదామే అభిప్రాయభేదము లొంది విరసంపు వచనములచే మనోవైకల్యము నొందుచుండుట మనకు దౌర్బల్యము నాపాదించుటతో నాగక, మన పగటి కది మార్బల మగుచున్నదని గుర్తింపఁ జాలకున్నారు.

కొడుకునొడంబఱుపనియు, పాండుసుతులకు రాజ్యమున నొకభాగమిమ్మని యుం ఒకతెన్నున బాహాటముగా ధృతరాష్ట్రుఁడు చెప్పుమనేయున్నాఁడు. యుద్ధము మహాజనక్షయకారణ మగుటజూమాయని కుమారుని దురూహల వారింపఁబ్రయత్నించు చునే యున్నాడు. ఒకవంక తనకొడుకులేల గెలుపొందరాదనుఆశనుగూడఁబొందుచు నే యున్నాఁడు. అది కాదందుమేని, మరల నాంబికేయుండు సంజయునిక్కు-మొగంబయి- "సంజయా, నిను వీడ్కొలుపుసమయాన అర్జునుం డేమనియెనో తెలిపితివి కావు"-అని సంజయు నడుగనేల?

సంజ:—(తనలో) ఔరా, ఎంతయవివేకి యీతఁడు! ఇంకను "అర్జునుండే మనియె" నని యడుగుచున్నాఁడు!

(ప్రకాశముగా) తన తండ్రిపాలిమ్మని ధర్మజుఁడు కోరినను, ధార్తరాష్ట్రులు లోభమదక్రోధాన్వితులై దర్పమున నీయరేని, తన బాణాగ్నిజ్వాలలను వారలనెల్ల వరుసంబెట్టిమె యాహుతిచేసెదనని యర్జునుండు పలికి కడకు నీకుఁబ్రణామంబొనర్చితి నని, నాయెదుట నినునమస్కరించి, నన్గౌఁగిలించుకొని, నాకునమూల్యాలంకారాది కమనీయవస్తువులొసంగ, నేనును పాండవులకడను, వాసుదేవు సమ్ముఖముననను, సవినయంబుగ సెలవుగైకొని దేవరకిదియెల్ల విన్నవింప వడివడి వచ్చితిని.

'అర్జునుండేమనియె' నను ప్రశ్నము ధృతరాష్ట్రుముఖమునుండి వెడలిన యంత నాసభనున్నవారందఱును మొగమొగాలఁ జూచుకొనుచు మఱియట నుండనొల్లక యొకరొకరే లేచి వెడలిపోవుచుండిరి. దుర్యోధనునకుఁ దోడొసంగవచ్చిన వారందఱును నసంతుష్టినొందుటయు నాతనియెడ ననాదరము నొందుటకుఁదోడుగ సేవ

నొంది, సభలో నుటితడయఁజాలకుండుటయే, సంజయోపన్యాసఫలశ్రుతి కావలయును!

'అర్జుననిశ్చయము' సవివరముగ సంజయుండు దెల్పుచున్నంతసేపును దుర్యోధనుఁడు సంజయునెడ ననాదరంబును ఫల్గుణునిపట్లఁ దూష్ణీంభావమును జూపుచు వినుచుండ, ధృతరాష్ట్రుండును జెచ్చవడి కొండొకవడి యూరకుండియుఁ దనకొడుకే జయించునో కోయని తనమనమున ననయము ననుకొనుటను కావలయు మరల సంజయుం బిలిచి:—

“కౌరవపాండవశిబిరంబుల రెండింటినింగూడ నీవెఱుంగుదువు. వీని తారతమ్యంబులఁగూడ గుర్తించి యున్నావుకదా; ఇందెవరు గెలుపఁగలరో మాతము చెపుము—”

అని యడిగెనుగదా! ఇందు నిస్సంశయముగ దురాశాపిశాచావేశము దక్క నింకేముండగలదని యూహింపఁగలము! ధృతరాష్ట్రహృదయముఁ బరిశోధింప నీతనిప్రశ్నములందిమిడియున్న భావములకన్న పాఠకుల కింకేమి యాధారము?

—సంజయుఁడు—

(విసుగుఁదలతో) అంబికేయా, అది నన్నడుగఁదగినప్రశ్న కాదు. నేనుచూచినది చెప్పితిని. నేనుగ్రహించినది నీకుఁదెల్పితిని. పాండవులు నీసమక్షమునఁ జెప్పుమనినది చెప్పితిని. అంతియేకాని, యుద్ధమున నెవరోర్తురు; ఎవరుగెల్తురు; అనునీప్రశ్నముల కుత్తరము చెప్పవాఁడు మీయయ్య సాత్యవతేయుఁడు. ఆతనిసద్భక్తి నారాధింపుము. ఆతఁడు ప్రత్యక్షంబుకాఁగలఁడు. ఇంతకును నేనక్కడ వడిన మాటలు చెప్పుచున్నంతవడియు, నీవును, నీమానసంబున వారివారి బలంబులనెల్ల లెక్కలువెట్టుచు జోడించుచు బోలించుచు బలాబలంబులనెల్ల సరిచూచుకొనుచునేయున్నావు. ఈమాత్రము దెలియకున్నా ననుకొనుచున్నావా? గాంధారియు మీయయ్యయు నిశ్చయవిదులు; విపీతిరతులు. నీసంశయములఁ బాపసమర్థులు. నాకంతపట్టు పట్టువడదు.

ఎనిమిదవ ప్రకరణము

గాంధారి సభకువచ్చి కూరుచున్నది. వ్యాసమహర్షియుఁ బ్రత్యక్షమైనాఁడు.

వ్యాసు:- సంజయా, మీమీ ప్రసంగవిషయము నాతపోబలంబున నెఱింగితిని. నీవు సమస్తంబు నెఱుంగవలంతివి. రాజడిగినదానికి నీయెఱింగినంతవట్టుఁ దెలియఁజెప్పుము.

సంజయుఁడు:—మహాప్రసాదము—

(ధృతరాష్ట్రుని దిక్కు మొగంబయి) సేనలవాసికేమిగాని జగమ్ములనన్నిఁటిం దనవశముచేసికొని ఆవలనున్న శ్రీకృష్ణునకు సముండగువానిని, సారథియయ్యుఁగాక, నిరస్త్రపాణియయ్యుఁగాక, మన పక్షమున నొక్కనిం జూపుము-చూతము. ఎంత చెప్పినను మిగిలిపోవుచుండు చరిత్రముగల నావాసుదేవుండు, నరునకు బాసటయై, యాతని సర్వసమరసాధనంబులయందును సూక్ష్మరూపంబున బ్రవేశించియైన సర్వవిధముల విజయునకే విజయంబు సమకూర్చు; ఇదియెంతయు నిక్కువము. ఇఁక వారికిఁగల మానవబలం బెంతుమన్న భీమార్జునుల బలముచాలదా మూఁడులోకములఁ బూదిచేయుటకు! వారి యాధారసర్వస్వమును దైవబలమే. ఇంకొకదానిని వారపేక్షింపరు. వారికే కాదు. ఎవ్వరికైనను దైవబలమే బలము. అట్టి దైవబలమెట్టిదో దేవుండననెట్టిఁడో తెలిసికొననెంచెదేని, యడుగు మదె కృష్ణద్వైపాయనుండిందె కలఁడుగదా!

అని సంజయుండూరకుండెను. సాత్యవతేయుండును గొంతతడవు శ్రీకృష్ణుని మహాత్మ్యంబును, వాసుదేవశబ్దార్థంబును, మహాపురుషులజీవితములయందలి స్వార్థపరత లోకకళ్యాణ ప్రణాళికగాఁ బరివర్తనమునొందుచందంబును, విద్య-అవిద్యల లక్ష్యలక్షణంబులును గౌరవపాండవ గుణాగుణ విభాగంబును ధృతరాష్ట్రునకెరుకపఱచి, తుట్టతుదకు సుయోధనునుపలక్షించి,—"కుమారా, మనకీసంజయుండు పరమాప్తుండు. సమ్యగ్జ్ఞానముగల యీసంజయునుపదేశంబుచొప్పున శ్రీకృష్ణునివాఁడవుగఁ జొచ్చెదేని నీకిహమున సంపల్లాభంబును, బరమున సుగతియు సమగతిం బొందఁగలవు" అనియసెను.

—సుయోధనుఁడు—

పాపమా కృష్ణుఁడుజగములనన్నిటిం దిగమ్రింగఁ జాలువాఁడై యగుఁగాక! సృష్టినంతయు రక్షింప దక్షుండైయగుఁగాక! ఆతఁడర్జునుని చెలిమికాఁడని చెవులారవినుచుండియు, మనసార నెఱింగియు, నా కొకప్రమాదము ప్రభవించునో కా యను శంకామాత్రమునఁ గృష్ణు నాశ్రయింతు ననుమాట వట్టిమాట! నా కీజడిపింపులేల?

—గాంధారి—

నాయనా, లోకము మనలను గర్వులనియు, నసత్యవాదులనియు సాధుబాధకులనియు నిందించుచు, బుఱ్వదిట్టుచుండ మనకాయువును, శ్రీవిభవంబునుదొలంగును. స్వజనంబులెడ వెట్టుదురు. నిష్కంటకమగు నీచంద్రవంశమ్మున, నీవెట్లుబుట్టితివిరా! ఆర్జవశీలురగు నీతాతలనాటి యీసామ్రాజ్యము నేలగోలుపోయెదురా! పూరుని కాలమునుండియు లేని యీమాత్సర్యము నీకెట్టులబుట్టెనురా? మీకును పాండుతనూజులకును సమాన విద్యాశిక్షలే ప్రసాదింపఁబడినను, వివేకాదిసద్గుణములును సమయజ్ఞతయు వారికలవడ, అవివేకమును, అసమయకార్యచింతయు, అనుచితకార్యదీక్షయు నీకెట్టులలవడెనురా, తండ్రీ! శిక్షనొసంగిన గురుజనంబును, ప్రసాదించినవిద్యయు, ధార్తరాష్ట్రులకును పాండవేయులకును సమానమె యయ్యెను, మింటినుండి పడియెడు వర్షబిందువు శుక్తియందును, తప్తతైలమందును, నొక్కటియెయయ్యెను, భిన్నభిన్న పరిణామములు చెందినట్టులయ్యెను గద! శిక్షితుల సహజశక్తుల నభివృద్ధిపఱిచి వారి నైసర్గిక గుణములంబలపఱిచి, వెలికిదీయుశక్తిగల విద్య ధార్తరాష్ట్రులయెడ నిట్లు ప్రమాదకరమును, పాండవులయెడ సంస్తుత్యమానమును అయ్యెనే! ద్రోణాచార్యుని శరవిద్యాశిక్షయును, బలరాముని గదాపాండితీశిక్షయు మనవినాశమునకే యయ్యెనా? ఎవరిమనోవాసనల ననుసరించి వారి కాయావిద్యలయ్యాయిశక్తుల నిచ్చినవి; కాని నీకుఁగర్ణుని మంత్రాంగమును వారికిఁ గృష్ణుని మంత్రరక్షణయు లేకుండినచో నింతయలమట కలుగకుండునోటు! ఇపుడీయనిమొన నిలవలంచినవారికిఁగల ప్రత్యేక ప్రత్యేకస్వలాభచింత లవెట్టివైనను, మన భరతవంశము నిర్మూలనమగుటయు, భారతభూమి నిర్వీర్యమును నిస్తేజమును నగుటయు, ధార్తరాష్ట్రుల కపకీర్తి

యుఁ బాండవేయులకుఁ గీర్తియుఁ గల్గుటయే పర్యవసానముగఁ దోఁచుచున్నది. నాయనా, వారిపై నీకెంతమాత్సర్య మున్నను, నీపయి రానయియున్న ముప్పు చొప్పు నూహించియైన నొకింత నీ పట్టువిడఁజాలవా? జనులందఱు నైకకంఠ్యముగ 'వలదు వల' దన్న కార్యముమాత్ర మెన్నంటికిని సఫలతఁ జెందనేరదుసుమా! జనబాహుళ్యపుటూహయే భగవన్నియామకముగ గుర్తింపుము.

*　　　*　　　*　　　*

దుర్యోధనుఁడు తల్లిమాటలను గంటుపెట్టుకొనిన మార్గ్యోగమున మార్వాలుకనుండెను.

*　　　*　　　*　　　*

—వ్యాసుఁడు—

అంబికేయా, నీవు చెప్పఁదగినంతవట్టు నీ సుతునకుఁ జెప్పియే యుందువు. గాంధారియుఁ దనకుఁ జేతనైనంతదూరము వారియోచన చెప్పిచూచినది. సంజయుండును ప్రయత్నలోపముఁ జేసియుండఁడు. ఇఁక కార్యదశననుసరించియే దుర్యోధనుఁడు తన కార్యక్రమము నడిపించుకొనఁగలఁడు.

*　　　*　　　*

ఈవఱకే యేర్పడియున్న కార్యదశనే జను లనుసరింపగలరుగాని దానిని మాన్పను, మార్పను, మానవుల కలవికానిపని: కావున నీ విఁక చింతం దక్కియుండుము. వాసుదేవునందు నీచిత్తంబు బొత్తుసేసికొనుము. తరణోపాయంబుజూచుకొనుము.”

*　　　*　　　*　　　*

వ్యాసుం డంతర్హితుండయ్యెను.

గాంధారియుఁ దనయభ్యంతరమందిరమునకేగినది.

సంజయుండును దక్కటివారును దమతమ నెలవులకుం జనిరి.

ఉపసంహారము

ప్రభువనదగినవాఁడో, రాజకుటుంబములోనివాఁడో, జగమున బలుపలుకు బడిగలాఁడో క్లిష్టతరకార్యములు చక్కపఱుప బంపబడినచో నాతని రాయబారియను చున్నారు. వార్త చెప్పవచ్చునాతని దూతయనుచున్నారు. సంజయా, ఇందనుక నీవొనర్చినది దౌత్యమా? రాయబారమా? పాండవులు వనవాసాయాసము నిస్తరించి అభ్యుదయము నొంది యుపప్లావ్యముఁ జేరియుండ, ద్రుపదపురోహితుముఖమున నెఱిఁగిన ధృతరాష్ట్రుండనుప దూతవై, నీవు పాండవులం జూడ నేగినావు.

—నెయ్యము వాటించి కడుదియ్యమెసఁగఁ బాండవుల యలుక దీఱునట్టుల, యమనందనుఁడు కయ్యమనుతలఁపే మనమున మానునట్టుల శాంతిప్రకారంబునఁ గార్యంబునడిపి యొక్కటియైవనుట యొడఁగూర్చి, రమ్ము—

అని చెప్పికదా నిను ధృతరాష్ట్రుండనిపినాఁడు. ఆతనిపలుకులఁ బాండవులకేమేని యిత్తుమనుటయే లేదు. కాని కూడి మనునట్లు సేయుమని నినుఁగోరకపోలేదు. పాండవులిచ్చగించి, కరిపురింజేరిరేని వారి కింత యోగిరమిడఁ దలంచి నాఁడాంబికేయుండు. అదినీవు చక్కఁగ గుర్తించినవాఁడవగుటచే ధర్మజుందర్శించినంతనే "నీవును, అనుజులును ద్రౌపదియును బుత్రచయంబు నున్న యోగక్షేమంబున తెఱఁగారయ సస్నేహంబున మీయయ్య నను బుత్తెంచెను" అనియుంటివి. అదివిని ధార్తరాష్ట్రుల క్షేమము నరయు నెపంబున నెఱపిన ధర్మజు ధోరణి నడచి నడచి, తుదకు 'ఇంద్రప్రస్థంబో, వేఱొకపట్టణంబో మాకిచ్చి మనుచుటుచితము కాదా!' యని యనువఱకును బెరిఁగినది. అట్లగుటఁ బాండవుల యోగక్షేమముల నరయవచ్చిన దూతుండవగు నో సంజయా, నీముఖమున ధర్మజుఁడే తనకొకటియో, అయిదో పట్టణములో, గ్రామములో, యిమ్మని రాయబారము నడపినాఁడు. కావున కౌరవదూతవయిననీవు, పాండవరాయబారిగ మారినావు! ధార్తరాష్ట్రుల నేమమడిగి తెలిసికొనుఘట్టముననే ధర్మజునోట నెన్నియో యెత్తిపొడుపులు పుట్టుటనేకద కురువీరుల లావులు దెలు

పుటకు నీకు వలసెను! ఆ ప్రసంగమట్లు బహుముఖముల నడచినడచి తుదకు, తమయయ్యపాలు తారు పడయనినాఁ డెట్లని ధర్మజుఁడు యుద్ధము సేయక మానండని నీకుఁ దోఁపఁ జేయుటను ఆంబికేయుని పలుకుబడి నెట్లని సమరము కాకుండు తెఱం గేర్పడవలయుఁగదా యనియెంచి, "కందమూలములం దినుచు, నాటవిక జీవన మొందెడి భిక్షాటన మొందెడి శాంతస్వభావులకుం దగు" ననియు, "రక్తపుఁగూడు తగ" దనియు పాండవాగ్రజునకు బోధించి చూచితివి. నీవు బ్రాహ్మణ ధర్మము నూతగాఁ గొని, నృపధర్మము నవలింపఁ బోవుచున్నావే యని ధర్మజుఁడు కృష్ణపురస్సరణముఁ గోరుట, నాతఁ డా ప్రసంగమున బ్రసక్తిఁ గొని ధర్మజుచే నుపపాదింపఁబడిన సన్నద్ధయుద్ధవిధి సిద్ధపఱచి నాఁడు. కృష్ణుం డా ధర్మజుపక్షము వహింపక పోయినను, ధర్మజు స్వైరణయే విసువుచెందుటను, ఆతఁడు క్షాత్రధర్మ మవలంబింప సంసిద్ధుం డగుటను, తమయయ్యపా లెట్లని వదలక నిశ్చయించుకొనుటను, యమనందనుఁ డనుజ తనూజయుతుండయి సమరము సేయక మానం డని నీవును నెఱుంగుదువు. "మీ సంపద్రాజ్యంబుల నధర్మంబుగ గైకొనియుంట చెడఁదలంచిరేని, వారే చెడుదురు: అంతియకాని, యుద్ధము జనక్షయకార్యమగుటను, మీరుమాత్రము యుద్ధము నకు గడంగవల" దని ధర్మజునితో ననుటకు నీ వేమాత్రమును సంశయింపలేదు. ఇంతకును దూతకేమి సిగ్గు! అనంతరము ధర్మ జాదుల పలుకులు విని సమరము సేయ మానరని నీ వెఱింగి, పాం డవుల వీరాలాపములకు వన్నె వెట్టియు, వారి సన్నాహంబులకు మఱింత మెఱుంగు వెట్టియు, ధృతరాష్ట్రు సమ్ముఖమ్మునఁ బలికి, పాండవులకు వారిభాగమో, అయిదూళులపట్టో, యెట్టులేని యొ సంగకున్న దొసంగు పొసంగక తప్పదని యెంతదూరము పొరలవలె నంతదూరమును పొరలిచూచినావు. నిజపుత్ర విజయేచ్ఛ యొక వంకను, భీమువలని భయ మొకప్రక్కను, తన్ను బాధించుచుండ

నోరెత్తెన్నఁ బోఁజాలక, తనదెసఁ దోసంబులేకునికిమె లోకులకుఁ దెలియఁబ్రకటించుటయు, మానసమున గుటిలపు టూహలు వ్రేళ్లఁ దావిచ్చుటయు, నను నీరెండును దనప్రవర్తనకుఁ బ్రధాన చిహ్నములైయుండఁ దన ముదిమికతమున, నందను నదుమఁజాలక మిన్నకున్న వైచిత్ర్యవీర్యునకును, స్వపక్షవీరులపై నాధారపడి, పాండవుల ఖండనమునఁ బరిమార్పఁగలనని గర్వించియున్న సుయోధనునకును; పాండవేయుల స్వబలమును, సాయముసేయ నెంచి వచ్చిన వారిలావును దెలిపి, వారినెల్ల నిర్జించుట కౌరవుల కలవికాని పని యని స్థిరీకరింపదలంచియేకదా,—గంగాసుతుండు శిఖండిపాలనియు, గుంభసంభవుండు ధృష్టద్యుమ్ను పాలనియు—నిట్లు పాఁబగలఁ దీర్చికొనఁ దరుణముకొఱకు వేచియున్న ప్రతిపక్షుల పేర్వేరువరుసను నీవే యుర్జిలువైచి యెవరి నెవ రెదుర్కొనంగలారో, యెంచియెంచి చూపించితివిగా. నీవిపు డీకురుసభనాడినమాటలలో నన్నియును పాండవులపలుకులే కానక్కఱలేదని, పాండుసుతులసంకల్పములఛాయలయియుండినజాలునని యనుకొంటివి. పాండవులబలంబులును వారి సమరసన్నాహములును దెలియఁజేసినచో, ధార్తరాష్ట్రులలపాండు భూపాలుపుత్రతతి కేమేని యొసంగుదురేమో యని భ్రమించితివి. భీమార్జునాదుల దోస్సామర్థ్యములు వినుచున్నంతసేపును. వారివలని భయమును, తనకొడుకుల వీర్యాతిరేకములు వినుచున్నంతకాలమును దనకొడుకులకే జయముకలుగఁ గలదనియుఁ దలంచుచు, ఎత్తువారి చేతిబిడ్డయయి ప్రవర్తించుచుండిన వాఁడగుట ధృతరాష్ట్రుం డేమియు నీయఁజాలకున్నాఁడనికూడ గ్రహించితివి; కాని, శత్రుజనుల వీర్యాతిరేకములు నీవలనవినుటచే, దుర్యోధనున కీవఱకే పాండవుల యెడఁగల యీసునకుఁదోడిపుడు నీయెడంగూడ రోసముజనించుటను మఱియూతనివలనంగూడ కార్యముపొత్తువడినది కాదని నీవు పోల్చుకొంటివా ? శత్రుజనములబలముల నుగ్గడించి, తన్మూలమున

నీవు దుర్యోధనుని భయపెట్టి కార్యముపొత్తువడఁజేయఁ దలంచు టనే యియ్యాది భగ్నమయ్యెనని పోల్చికొంటివా? కాకుండిన మూర్ఖుండగుటను దుర్యోధనుఁడు మేల్నుడుల నూకొనఁడయ్యె నని యందువేమో గాని, నీపలుకులంగల శత్రుజనపరాక్రమోద్ఘాటన మాతని యలుకను మఱింత రేపెట్టినదని చెప్పకతప్పదు.

ఇట్లు ప్రసంగింపవలదనియేకద అలనాఁడు బలరాముం డుపపాదించెను! అది యెవరుమాత్రము పాటించిరి! తానుగాబయల్పడు నలవాటులేని కృష్ణుఁడు, తనయన్నకదా యని ఆనాఁడు బలరాముని పలుకులకప్పటి కెదురాడక మిన్నకుండెను. మాటదురుసరియగు సాత్యకియు నుద్రేకముఁజూపినాఁడు. కరినగరసామ్రాజ్యబిరుదము మాపనో, తానిదివరకే గోల్పోయిన ఉత్తరపాంచాలము నెట్లని మగుడ బడయ నిదియెయదనని యెంచియో, కాని ద్రుపదుండు బలరాముపలుకుల నవలఁద్రోసి తనపురోహితుమూలమునఁ దొలిరాయబార మనుపుటతోడన బరుసములాడు బీజముల వెదఁ జల్లినాఁడు.

అర్జునునెడఁ దనకుఁగల మాత్సర్యముందీర్చుకొనఁ గర్ణుం డీవలను, యాదవపరిరక్షణమును యాదవోద్ధరణమును అను కారణమున లోకకళ్యాణమొనర్చు పట్టుదలగల కృష్ణుం డావలను, బనిసేయకున్న బాందుసుతులకు ధార్తరాష్ట్రి లేదని కొంతభాగం బొసంగుటయు, ధార్తరాష్ట్రులయెడ నపవాదము ప్రసంగమియు జరిగియుండును. కాని కార్యదశననుసరించియే కావలయుఁ బరిస్థితులన్నియు నట్టి విషమపరిణామము నొందుచున్నవి.

* * * * *

పాపము కౌరవదూతయై తమయోగక్షేమము నరయవచ్చిన స్ంజయుని దనరాయబారిగ మార్చుకొని ధర్మజుం డాతనిముఖమున తమయయ్యసగము కాకున్ననుఇంద్రప్రస్థమొండె వేరొకపట్టణమొండె అయిదుగురకు నైదూళ్ళులొండె యీకున్న యుద్ధముసిద్ధమని యిపుడు

దనకడచటివార్త నంపినపిదప దానికేమి సేయనున్నాఁడో చూడవలసి యున్నది. కురుసభం బ్రభవించినవి కాంచినాము. ఇపు డుపప్లావ్యమునకు బోతిమేని ధర్మజుని ముందుచేత లేక చూతుము.

సంజయుపలుకులఁ గృష్ణుఁడు పురస్కరించుకొని:

'పాండవేయులం బ్రోత్సాహించి కురుసభకేనైన బోయి కౌరవులకు బుద్ధిగాఁ జెప్పెదను—రాజ్యంబుపాలు సేయకున్న మృత్యుముఖంబున బడుదు—రని ధార్తరాష్ట్రులకుఁ దెలియఁజెప్పెదు' నని యనియే యున్నాఁడుగదా!

కృష్ణుని యీపలుకుల నూతగాఁగొన ధర్మజుం డేలమానును?

ద్రుపదపురోహితుఁడొనర్చినదికూడ దౌత్యమో, రాయబారమో కాని, అతఁడు కురుసభనొనర్చిన న్యాయనిష్ఠురయుతమైన యుపన్యాసమువలన కురుసభనున్న వారిమనసులునొచ్చుటయాయి నది కాని, కార్యముమాత్రము సౌమ్యమున నొకత్రోవకువచ్చినది కాదు. ద్రుపదపురోహితుముఖమునవార్త వచ్చినదికదాయని సంజయుముఖమున ధృతరాష్ట్రుఁడు పాండవేయుల సేమ మరయు నెపమున దౌత్యమొనర్పఁజేసెను. కాని, పాండవ్యులకు తన్మూలమున జీవనసౌకర్యములైననేర్పడమి, ధర్మజాదులు వేగిరంపడి యుద్ధమునకే నడుములు బిగియించక, సమరసన్నాహములుమానక, మఱియొకతూరి ఉచితమగు తెఱంగున రాయబారమునడపజూచుట పాండవుల శాంతశూరతకు అనుగుణమేకద!

ఇఁక ముం దేమగునో చూచెదముగాక!

(మొదటిభాగము సంపూర్ణము)

రాయబార మను నీగ్రంథకథావస్తుసేకరణమునకు నాకుం దోడ్పడిన కొన్ని గ్రంథ నామములు :—

సంస్కృతభారతము.

ఆంధ్రమహాభారతము.

ఆంధ్రీకృతశ్రీకృష్ణభారతము. ... శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు.

రాజతరంగిణి - కల్హణుడు.

కృష్ణగీత, కృష్ణ— & పురాణములు... శ్రీ పండిత సీతానాథ తత్వభూషణ రాయిగారు.

మధ్యమవ్యాయోగము, పంచరాత్రము, దూతవాక్యము,
దూతఘటోత్కచము, కర్ణభారము, ఊరుభంగము. } భాసమహాకవి.

హరివంశము.

విష్ణుపురాణము.

బ్రహ్మాండపురాణము.

చాణక్యుడు- వ్రాతప్రతి ... జయంతి వెంకట కృష్ణారావుగారు.

భీష్ముడు- అచ్చుప్రతి ... డిటో

శ్రీకృష్ణుడు- వ్రాతప్రతి ... జయంతి వెంకట జగన్నాథరావుగారు.

భాగవతము.

బ్రహ్మాండపురాణము.

కర్పూరమంజరి.

మహాభారతచరిత్రము 1932, 1933 శ్రీ పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్య
పరీక్షిత్తు ముద్రణములు శాస్త్రిగారు.

భారతవిమర్శనము- భారతీపత్రికలోని వివిధప్రచురములు.

భారతనాటకములు: ... శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవులు.

విక్రమాంకదేవచరిత్ర. ... (బిల్హణకవి) శ్రీతిరుపతి వేంకటేశ్వరకవులు.

కర్ణచరిత్రము. ... నష్ఠుల చినసీతారామస్వామిశాస్త్రులవారు.

శ్రీకృష్ణుడు. (1, 2 వాల్యములు) ... బంకించంద్రుడు.

శ్రీకృష్ణావతారతత్వము (అన్ని వాల్యములు)

జయంతిపత్రికలు, భారతవిమర్శనములు,

ఆంధ్రభారతిపత్రికలు, గ్రంథాలయసంచికలు.

శ్రీకృష్ణుని జీవితచారిత్రము ... లాలా లజపతిరాయిగారి ఉర్దూనుండి కొణకంచి చక్రధరరావుగారి తెనుగుఅనువాదము.

కురుపాండవదాయభాగ విమర్శములు, ఖండనములు.

కురురాజ్యమునందు పాండవులకుగల స్వత్వవిమర్శ. ఆంధ్రపత్రిక 1927-28. — శ్రీ పింగళి లక్ష్మీకాంత కవిగారు.

దుర్యోధన విజయము, సుయోధనవిజయము.

Papers & Articles on Mahabharatha. ... — Bhandarkar's Oriental Research Institute, Calcutta.

The History of Panchalas.
The Asuras.
వ్యాసగీతలు & its Intro: — శ్రీమాన్ పరవస్తు లక్ష్మీనృసింహస్వామి అయ్యవార్లంగారు. ఐతిహాసికకులపతి

The Age of the Maha-Bharatha War. — Pro: N. Jagannadha Rao.

కళాప్రచారక సమితి,

బరంపురము, (గంజాంజిల్లా)

ఆశయము

సాహిత్య విషయముల కేవల ప్రాచీనపద్ధతులు యువజనుల యుత్సాహమునకు భంగము కలిగించుచుండగా, కేవల నవీన మార్గములు యువజనుల యుత్సాహమును వ్యర్థముచేయు చున్నవి. సాహిత్యపరిషత్తువారి ఛందోవ్యాకరణాది నియమములు యువజనుల యుత్సాహమును జంపివైచుచున్నవి; ఛందోవ్యాకరణాదులందు ఆధునికుల స్వచ్ఛందవిహారము లోకమునకు శుభోదర్కము కాకున్నది.

మహాప్రవాహమును గట్టుకట్టి యాపివైచినచో, నది గట్టుత్రెంపుకొని పారుటయేకాక, ప్రక్కనున్న పల్లెలపైబడి పాడుచేయుచున్నది. అటులనని, స్వేచ్ఛగా పోనిచ్చుచున్నచో, లోకమునకు పనికిరాక, అది వ్యర్థముగా సముద్రములో గలసి పోవుచున్నది. కావున, ప్రవాహము పారుచుండుట కడ్డులేకుండ ఆనకట్టు కట్టినచో నీరు కావలసిన కాలువలలో ప్రవహించి, తనకార్యమును తాను నిర్వర్తించుకొనుచు, లోకము నుద్ధరించు చున్నది. వాఙ్మయప్రవాహము నవసరమైనంత వరకు మాత్రమే యరికట్టి, దాని పారుదలకు కావలసినంత యవకాశమిచ్చి లోకకళ్యాణమునకై యా ప్రవాహము వినియోగించునట్లు చేయు నుద్దేశమున నీ కళాప్రచారక సమితి యేర్పాటైనది.

జూన్ దేవరాజు వేంకట కృష్ణారావు,

సర్వస్వామ్యములును
గ్రంథకర్తవే.

"వేగుఁజుక్క" ముద్రాలయమునకును
వేగుఁజుక్క "గ్రంథమాల" కును
లేశమును సంబంధము లేదు.
వేగుఁజుక్క "గ్రంథమాల" కును నాకును
1925 నుండియు
ఎట్టి సంబంధమును లేదు.
దేవరాజు వేంకట కృష్ణారావు,
కార్యదర్శి,
కళాప్రచారక సమితి
బరంపురం,
గంజాం.

ముద్రాపకుఁడును
ప్రకాశకుఁడును
గ్రంథకర్తయే.

వేగుఁజుక్క ముద్రాలయము
బరంపురం (గంజాం)
1934 జూన్.

పీఠిక

గ్రంథరచనా విధానము మున్నగు విశేషాంశములంగూర్చి చెప్పఁకొనదగిన విషయములన్నియును రాయబారము మొదటి సంపుటము అనఁగా సంజయ రాయబారముననే విన్నవించుకొంటిని. మఱల నా విషయములిందు బొందుపరుప నవసరము లేదు.

ఈ రెండవ సంపుటముకూడ నానాఁడే (1—6—33) ముద్రించియు శ్రీ లక్ష్మీకాంతముగారి ఉపోద్ఘాతము నాకందక పోవుట నియ్యది యింతవరకును బ్రచురింప ననువు పడినదకాదు. అనివార్యమగు నిట్టి విళంబమునకు సహృదయులు మన్నింప వేడుకొనుచున్నాను.

గ్రంథప్రాశస్త్యముఁగూర్చి పాఠకులు గ్రంథావలోకనానంతరము మిన్నకుండరనియు, పత్రికాముఖమున బలుకరించుచుందురనియు నే నెఱుఁగుదును గనుక మఱియిపుడు కథావస్తువును విన్నవింప నక్కఱ లేదు.

తానొక గ్రంథము రచించి సర్వవిధముఁ నది యుత్కృష్టమగు గ్రంథమని దలంచి యింకేరికిఁజూపనొల్లక, బ్రకటించు పండితమ్మన్యులట్లుగాక, దా రచియించిన "......గావ్యంబు సరసులైన। కవుల చెవులకు నెక్కినఁగాని నమ్మఁ। డెందు బరిణతి గలుగు కవీశ్వరుండు॥" అని తిక్కనకవివరుండు నుడివినటుల, నా రచియించిన రాయబారము మూఁడేడులు సుప్రసిద్ధులగు పండితకవులకు జూపుచు గురుజనంబుల నాజ్ఞలమేరకు సవరణలందీర్చికొని ప్రకటించుట యొక లోపము కాఁజాలదుకదా! ఏది యెట్లైనను తినబోవు కూరలకు వంటల నేర్పును, తద్రుచులును దెలుపనేల యని దలంతును.

గ్రంథము రచియించుటయు, సరిచూచుకొనుటయు, ప్రూఫులు చూచుకొనుటయు ముద్రించుటయు బ్రకటించుటయు మున్నగు

నన్ని కార్యములును నాయందే యుండుటను, ఎంత చక్కఁజూచి యున్నను పెక్కుతావులఁ దప్పులు దొరలుచునే యుండును. అట్లగుట సహృదయులగు పాఠకులు చూపెడు తప్పులు రెండవ ముద్రణమున నైనఁ జక్కఁజేసికొనుటకు సంసిద్ధుఁడను.

బరంపురం,
జూన్ 1934.

ఇట్లు విన్నవించు విద్వజ్జన విధేయుఁడు,
దేవరాజు వేంకట కృష్ణారావు.

పరిచయము

ఉద్యోగపర్వమున సంజయు రాయబారముతో నొక ప్రధానఘట్టము పరిసమాప్తి నొందును.

ధృతరాష్ట్రునిచే ధర్మజునికడ కనుపఁబడిన సంజయుఁడు ధర్మజునకు ధృతరాష్ట్రు హృదయంబెఱింగించుటయు, అనంతర మా ధర్మజుఁడు ధృతరాష్ట్రు సమ్ముఖమున నివేదింపుమని నుడివినదెల్ల సంజయుఁడు ధృతరాష్ట్రు సమక్షమ్మునఁ బలుకుటయు నదివిని కౌరవులా ముచ్చటనెల్లఁ దర్కించుకొనుటతో సంజయురాయబారము ముగియును.

తిక్కన మతమున నే పర్వమున కాపర్వమే యొక కృతి; ఏ యాశ్వాసమున కాయాశ్వాసమే యొక కావ్యము; ఏ ఘట్టమున కాఘట్టమే యొక స్వయంసంపూర్ణమగు ప్రబంధము. కనుకనే, శ్రీకృష్ణ రాయబారము నొక ప్రత్యేక గ్రంథముగ వేఱుపఱచి ప్రచురించితిని. ఇందు ధర్మజాదులు శ్రీకృష్ణుని గౌరవసభ కనుపుటయు, శ్రీకృష్ణుని రాయబారమును, తదనంతర కథాసంవిధానమును పరిశీలింపఁబడినవి.

కృతికర్త.

ఉపోద్ఘాతము

ఈ రాయబారమునకు వస్తువిమర్శపూర్వకమైన ఉపోద్ఘాతమును వ్రాయుదునని యేడాదినాడు ఈ గ్రంథకర్తకు మాటయిచ్చిదానిని మొదటి భాగపుపీఠికలో నుదాహరించితిని. గ్రంథమునెన్నడో పూర్తిచేసియు, అచ్చొత్తించియు, నామాట నేను దక్కించుకొనునంతవరకు దానిని ప్రచురింపక వేచియుండిన శ్రీకృష్ణారావుగారి సహనమెంతో కొనియాడదగియున్నది. నేను వ్రాయు నీ నాల్గు పంక్తులు లేకున్నను ఆ గ్రంథమునకు వచ్చు కొఱత లేదని ఆయనయు నేనును ఎఱుగుదుము. లోకమునకూడ నెఱుంగును. వస్తుగౌరవము, రచనా విశేషముగల గ్రంథములపట్ల ఉపోద్ఘాతములు కేవల లాంఛనములేగాని ఆవశ్యకములుగావు. ఆ గుణములు లేని గ్రంథములకు ఎట్టి యుపోద్ఘాతములును కొఱత దీర్పజాలవు. ఈ న్యాయమును బట్టి చూచినచో, సర్వథా మేలిగుణములుకల యీ రాయబారమునకు నాయుపోద్ఘాతము లోకాచారముననుసరించిన లాంఛనము మాత్రమే యగును. ఇట్టి లాంఛనము కొఱకు వేచియుండను గావుననే గ్రంథకర్త సహనము కొనియాడదగియున్నది యని యంటిని.

ఈ గ్రంథమునందలి ప్రధాన విషయము కౌరవ పాండవ రాజ్యదాయభాగనిర్ణయము. ఈ ధర్మరహస్యమును తఱచి చూచిన పండితులు కొందఱు పాండవులకు రాజ్యార్హత లేనే లేదనిరి. మరికొందఱు అర్ధరాజ్యార్హత మాత్రమే కలదనిరి. రాజ్యమంతయు వారిదేయని ఇంక కొందఱనిరి. ఏ సిద్ధాంతమునకు తగినట్లు దానికే ఉపపత్తులు ఆ మహాగ్రంథమున కానవచ్చుటయే ఈ భిన్నమతములకు మూలమైనది. ఈ గ్రంథకర్త

పైని పేర్కొన్న మువ్వురిలో తుదివర్గములోనివారు. ఈయన మతమున స్వత్వమంతయు పాండవులదే. ఈ నిర్ణయము చేయుటలో ఈయన రెండుపక్షములలో నేపక్షపువాదమును కప్పిపుచ్చక రెంటికిని సమప్రాధాన్యమునే యిచ్చి తాను మధ్యస్థుడై సారముదేల్చి లోకమునకు చూపుట కొనియాడ దగిన సరణిగనున్నది. కౌరవ వాదము దుర్యోధనాదుల ముఖముగ నెంత సాకల్యముగా నుదాహృతమైనదో అంత సమగ్రముగనే కృష్ణాదుల ముఖమున పాండవ వాదమును ఉదాహృతమైనది. ఒక్కొక్కయెడ రెండును తుల్యబల విరోధములుగనే కానవచ్చుచుండును. చదువరులకు నా భ్రమను నివారించుటకయియే గ్రంథకర్త సింహావలోకన వ్యాజమున తత్తర తమ భావమును వ్యాఖ్యానము చేయుచుండును. ఈ సింహావలోకన కథాభాగము మన పూర్వపు వీథినాటకములలో సూత్రధార పాఠమువంటిది. ప్రాచీన 'గ్రీకు' నాటకములలోగూడ 'కోరసు' (Chorus) అను నొక తటస్థవర్గము ప్రదర్శితమగు కథాభాగములను వ్యాఖ్యాన మొనర్చుచు దురవగాహములైన పాత్రప్రవృత్తి రహస్యములను విప్పి చెప్పుచు సామాజికుల కథార్థగ్రహణమును సుకరముచేయుచుండెడిది. సింహావలోకనము చేయు నీ గ్రంథకర్తయు నట్లే కథార్థగ్రహణవిషయమున పాఠకుల పనిని సుకరముచేసెను. అట్లే కొంతమంది కథాపురుషుల గంభీర ప్రవృత్తులగుట్టెఱుంగుటను సుకరము చేసెను.

రాయబారియగు కృష్ణుడును కౌరవ మంత్రి వర్గమగు భీష్మాదులును ధర్మపక్షపాతులేగాని అవిచారముగా లోకులనుకొనునట్లు పాండవ పక్షపాతులు కారను రహస్యము ఈ గ్రంథమున సర్వత్ర ఉద్ఘాటితమైనది. ఆ మహాపురుషులు లక్షించిన ధర్మము రాజనీతిశాస్త్రమున కలితమైన యొకానొక పర

మార్గము. దుర్యోధనాదులు లక్షించిన ధర్మము రాజనీతిని మాత్రమే ఆశ్రయించినది. దానినిబట్టి చూచినను వారి వాదమునకు బలమేలేదు. ఇక ధర్మపక్షావలంబులవాదము ఎదిరి దానిని పరాస్తము చేయుటయేగాక ఎన్నటికిని ఎవ్వరిచేతను తిరస్కరింపబడని మహోదార మూర్తియై ధర్మ్యమైన రాజ్య పరిపాలనకు మూలసూత్రమువలె వెలుగొందుచున్నయది. అనగా నది అపరిమితమై కేవలమైన మహాధర్మము. తదపేక్షచే ధర్మములుగానే కానవచ్చు కొన్ని రాజనీతులు నిర్జీవములే కాని సారవంతములు కావు. అదికూడ నీ మహాధర్మము ననుసరించి వచ్చినంతవరకే లోకకళ్యాణ దాయకములగును గాని లేని యెడ నశుభప్రతిపాదకములే యగును. ఈ రెంటికిని అనుకూల్యము సంఘటించుటం బట్టియే భారతము ధర్మాద్వైత మూర్తియయ్యెను. ఈ ధర్మాద్వైతస్థితి నెలకొల్పిన వాడగుటనే శ్రీకృష్ణుడు ధర్మాద్వైత ప్రతిష్ఠాపకుండయ్యెను. భారతాంతర్గతమైన యీ రహస్యమును కవిబ్రహ్మ తిక్కన యేనాడో పేర్కొనెను. అలసులమగుటచే తరచిచూచి యీ రహస్యమును గ్రహింపలేక అలవోకగా మనము కౌరవపక్షమునో, పాండవ పక్షమునో, పట్టి పెనగులాడు చుంటిమి. ఇయ్యెడ నీ గ్రంథకర్త చేసిన పరిశ్రమ మెచ్చదగియున్నది. ఈ రహస్యముల నన్నిటి నీయన శక్తివంచన లేకుండ చక్కగా విప్పిచెప్పెను. భారతము నందలి ఐతిహాసిక భాగమును బాగుగా గ్రహింపగోరువారి కీ గ్రంథము ఉత్తమమైన మార్గదర్శక మనుటకు సందియములేదు.

పింగళి లక్ష్మీకాంతం.

రాయబారము

రెండవ భాగము

మొదటి ప్రకరణము

(i)

— ఉపప్లావ్యము —

కరినగరమున కేగుమని శ్రీకృష్ణుని గోరుటకుఁ బాండవులు తమలోఁ దామాలోచించుకొని, యాతని మందిరమున కరుగుట.

మూలిక

సంజయుండు సగౌరవంబుగఁ గరిపురికి మరలి ధర్మనందనుని నిశ్చయముఁ గౌరవసభను దెలుపుటయు, ధార్తరాష్ట్రాదులావిషయముఁ జర్చించుటయు మనము తెలిసికొంటిమికదా!

సంజయుం డుపప్లావ్యమువీడి చనినమఱునాఁటియుదయమున ధర్మజుం డనుజన్ములతోఁ బరివేష్టితుండై వారినవలోకించియిట్లనియెను.

"సోదరులారా, మనము ద్రుపదపురోహితునంపితిమికదా యని వారు శుష్కప్రియోక్తులతో, శూన్యహస్తములతో సంజయునిమన పాలికనిపిరి. సంజయు సంభాషణ పరమార్థ మెంతదూర మాలోచించినను, అహింసయే పరమధర్మంబుగా నెంచిన నాకు రక్తపుఁగూడు కన్న బికిరపుటన్నమే మిన్నయని బోధించుటకంటె వేఱేమియుఁ గానరాదు. పలువిధముల ననుదూఱుటయె యాతనికార్యమై నెగడినది. అహింస పరమధర్మముగనుక ప్రాణిహింసాకరమగుయుద్ధము జరుగ రాదు: మన కర్థసిద్ధి కావలయును. కావున నిట్టిరూపమునఁ గార్యము

నడుప సమర్థుండగు మాధవుకడకు మనమందఱమును బోయి కౌరవ సభకు మనయనుపరిగా నాతని జనుపుదము మన మైకకంఠ్యముగఁ బ్రార్థించినచో, బంధుమిత్రగురుజనంబులతో యుద్ధముగాక, సంప్రీతికరముగఁ గార్యము నాతఁడు నడుపఁగలఁడను నాసకలదు. కావున మన మిపుడు మాధవుమందిరమునకుఁ బోవుదము"

అర్జు:—మీకు యుక్తమనితోఁచిన తెఱంగునఁ జేయఁదగును.

ద్రౌపది:—ఇఁక మాధవునకుఁగూడ మంగళహారతి వా రొసంగినఁ
గాని మీరు తృప్తులు కాఁజాలరు కావలయు!

భీము:-ఇంకను దీనాలాపములు గాచబిడ్డలకుఁదగునని మీ రెంతురో!

నకు:-గురుభీష్మాదులు ధార్తరాష్ట్రుల కింతవఱకు నీమాత్రము బుద్ధులు చెప్పియుండరని మీ రెంచుచున్నచోఁ, గృష్ణునటకనుపవలసిన దే!

సహ:-ఈనైచ్యానుసంధానములవలన మననీచోపజీవనము స్థిరపఱచుకొనుటయు, మనయసమర్థత మాధవు మూలమునఁగూడ నా కురుపతికి నివేదించుటయు, సాటిమన్నీండ్రనడుమ మనము పరిహాసాస్పదుల మగుటయుసిద్ధము. కాని సంధిమాత్రము వైకల్పికము.

అర్జు:-అటుగా దటుగాదు. ఎంతదూరము కార్యము సౌమ్యముగ నడచునో యంతదూరమును సౌమ్యముగ నడువనిచ్చి, యింకను మిగిలినదానిని విహితమార్గము ననుసంధింపఁ జేయుటే పరమధర్మమని యెంచి, అన్నగా రిట్టికార్యక్రమమున కుపక్రమింప నెంచియున్నారు. కావున నిదియుఁగూడఁ జాతముగాక!

అని వీ రిట్లుసంభాషించుకొనుచు, బంధుమిత్రామాత్యసహితంబుగ నుపప్లావ్యమున నెయున్న మాధవుమందిరమునకు వెడలిరి.

మొదటి ప్రకరణము

ఇవ్వలి కత (ii)

ఉపప్లావ్యమున నున్న మాధవు మందిరమునకుఁ బాండవు లేగి, కృష్ణుని గరిపురి కనుపుమ నెఱపిన సంభాషణములు. ధర్మ రాజాదుల స్వభావ పరిశోధనములు: గుణభావ పరిశీలనములు: నీతిధర్మముల ప్రత్యేకప్రత్యేకవ్యవస్థలు.

మాధవు మందిరముం జేరిన వీరినిఁ గృష్ణుఁడు సగౌరవంబుగఁ బ్రత్యుత్థానంబొనర్చి వారి నుచితరీతి గౌరవించి, యుచితాసనముల నలంకరింపఁజేసి వారి వచ్చిన కార్యం బడుగ ధర్మజుండు తనవచ్చినపని నిట్లు నివేదించెను.

ధర్మ:—మాధవా, ఆపన్నార్తుల నుద్ధరింప నీకంటె వేఱెవ్వరున్నారు? మేమిపుడాపన్నార్తులము. యాదవులవోలెఁ బాండవులు నీవ నేమందగువారు. మమ్మాపదనుండి గడువంబెట్టుము. ప్రద్యుమ్నాదికుమారులతోడి వారమగు మము దురితంబులు వొఱయకుండ నరసి రక్షింపుము. అవినీతుండగు సుయోధనుతోడి పోరాటదక్కి నీకతంబున మా భాగంబు మే మనుభవింతుము.

"నీతలంపెఱింగితిని: నీపంచినయట్లు చేయుట కేనిదె సంసిద్ధుండ" నని మాధవుండనెను.

ధర్మ:—నందనందనా, మా పెదతండ్రి తలంపును, ఆతనినందనులచందమును, నిన్న నా సంజయు పలుకుల నీకెఱుకపడియెఁగదా! యుద్ధమువలనఁగలుగు రక్తాన్నముకన్న భిక్షాన్నమె మే లనినాఁడు. సకలజనసంహారణంబొనరించి చేకొను సామ్రాజ్యపాలనము కంటె విపినావాసమె శ్రేయంబనినాఁడు. శాంతినె సతంబును గోరునాయట్టివానికి బిచ్చెపుఁగూడె కూడునఁట! ఔరా, ఏమిసాహసము! అప్పట్టున నాతండు దూతుండగుటనె బ్రతికిపోయినాఁడు! ఆ వేదాంతోపన్యాసమంతయు సంజయు స్వకల్పనమే యగును. కానిధార్తరాష్ట్రులకంతసమయస్ఫూర్తి యెక్కడ? మధుర మధుర ప్రసంగముల మమ్మలుకతీర్చి, మా పాలు మాకీయక, శాంతియ సర్వశ్రేయంబని మాకు నీతులు గఱుప నా సంజయుఁ బంపిన యావృద్ధరాజు నేమనవలయును? మాజననియు సమస్త బాంధవజనంబులును సంతసింపను, వారిని శాంతాత్ములఁ జేయను, ఏమును వారును ఒక్కటియై మననుంగోరి మీరందఱును వినుచుండఁగ నేననలేదా-మాయైదుగురకు నైదూళ్ళైన నిచ్చినఁ జాలు—నని! ఆ దుర్యోధనుఁ డింతమాత్రమును జేయంజాలఁడో! ఔరా!

ఎంతటిక్రౌర్యము! పెంపుదూలఁ గ్రూరతకే వోర్వఁజాల. నాయరయు నీమట్టాలకు గ్రాసవాసోదైన్యంబులురాకుండ సిరిఁగోరకుండ నుండఁజాల. శత్రుసంహననంబొనరించి, సామ్రాజ్యలాభంబునొందుటే క్షత్రధర్మంబని యెఱుంగనివాఁడనుగాను. అట్లని రక్తపుఁగూడే దినఁజాల. అట్లగుట రక్తసిక్తముకానియన్నమె మన్ననయు. కడు హేయమగుదారిద్ర్య మింకననుభవింపఁజాలను. పరస్పరవిరుద్ధపరిస్థితులలో నేమి సేయనుం దోఁపకున్నది.

శస్త్రజీవికయె క్షత్రధర్మముకదా యని, గుండెటాయిచేసికొని వంశనాశనకరమ్మగుయుద్ధమ్మునకేసిద్ధపడినను,జయమందఁగలమనునిశ్చయమొండులేదు.సమరంబునఁ బరాజయంబుకంటె మరణంబ శ్రేయంబు. కావునఁ జెనఁకువకాని యుపాయంబునఁ బగఱఁగడతేర్చుటయు, అర్థసిద్ధిపడయుటయు, మనకిపుడుశ్లాఘ్యావహంబు. పగచేఁబగ యెన్నండడంగనేరదు. పూర్తిగఁబగఁదీర్పకయుండినచో నదిక్రౌర్యము గాఁబరిణమించు పాముున్నయింటఁగాఁపురము సేయంజాలనట్లు పగఁగొన్నతఱిమారొక్కనకయు,బలుకకయు నుండరాదు. ఎన్నివిధాలఁజూచినను బగవలన మేలిమికానరాదు. కావున సమ-రంబులేకయె, కులక్షయంబుకాకయె, మాసంపద మేమొందుచందంబునఁ గార్యము చక్కఁబడుటయె వాంఛితము. నీవు మాదెసఁ బక్షపాతగతివీడి ధర్మనీతివర్తనముల నిరుదెగలను హితంబును దెంపును దనరుచందాన, విదురాదిసజ్జనుల చిత్తములకెక్కనట్లు, సౌమ్యంబుగ సంభాషింపుము. అట రాజుపలికెడు బెడిదఁపుమఁడులకోర్చి తగవునఁబోక కార్యదశ నేర్పఱుపుము. గురుత్వమును బ్రభుత్వమునుంగల పెద్దలమాట వినకుండుట యాసుయోధనునకె చెల్లవిమ్మ. ఆటనాంబికేయుపలుకులును, దలంపులును విచ్చలవిడి నింకను జననిచ్చిన నిచ్చలు జనంబులు మనలనుమెచ్చరే! సుతువాఁడగు ధృతరాష్ట్రుండు వినయంబులేక యేచొప్పునుంజెప్పలేక యవినీతుండయి ప్రవర్తించినను, నీవుమాత్రము కార్యసంధానవిధానంబును దటాలునఁ దెగంజేయకుమా! నీవటఁ దెంపుసేయకతప్పనిసరియైనచో, లోకమువారలు నినుమెచ్చునట్లు, ధర్మంబెదీపించునట్లు, మామనంబులు చింతారహితంబులగున ట్లొనరింపుము. ఇన్నివిధాల వంతలచే నెంతయు నొగులుచున్నమానొవ్వ మాన్ప దక్షుండవగు వెజ్జువీవకావె మాధవా! ఇంతయేల, నీ వేగతి మము నడపింతు వదియె మాకెంతయుఁ బ్రియము. ఎల్లయర్థంబు

లెఱింగిననీవు నయతత్త్వకోవిదుండవు: నిశ్చయతత్త్వవేత్తవు. నీయాదేశంబు మాకవశ్య మాచరణీయంబు. కావున నీవ కౌరవసభకు పోవలయు. అన్యులకిది దుర్ఘటంబు.

“ధర్మనందనా, మీకును ధార్తరాష్ట్రులకును సంధియొనఁగూడుటె నాకును వాంఛితమగుట నీయాదేశంబుచొప్పున గరిష్ఠప్రతిజ్ఞతో ధార్తరాష్ట్రుల పేరోలగంబునఁ జెప్పవలసినదంతయుఁ జెప్పిచూపెదను. కాని దుర్యోధనుఁడు నానుడుల నాలించుటరా యను సందియము లేకపోలేదు. నా పలుకుల కియ్యకొనిరేని యందునందుగలవా రెల్లరును మృత్యువువశం గాకయుందురు: లోకంబునకుఁ గల్యాణంబగు: నేనును బ్రమదితచిత్తుండనై నగుదును.” అని కృష్ణుండు నుడివెను.

ధర్మజుఁడు దీర్ఘముగనాలోచించుచు పలుకందొడంగెను “ముకుందా, నీవు సుయోధను పాలికిఁ బోఁగరాదనియు నొక్కబుద్ధి తోఁచుచున్నది; సుయోధనుండును, వాని మంత్రులును, కౌరవులనుట నీకార్యఘాతనములు పన్నింపఁజాలగు కుటిలమతులును, అవినీతులును, క్రూరకర్ములును, అగు నా సిద్ధులకడకు నిన్నంపుచు బుద్ధి వొడమకున్నది. నీకెగ్గుగలుగ నాకొదవు సురరాజ్యసామ్రాజ్యమైన నే నంగీకరింపఁజాలను. నీవొంటిగ నంపుగుట యుడుగుటె యుచితము.” అని తనయూహల వెళ్ళగ్రక్కెను.

కృష్ణుండు మందహాసమునర్చి—“ధర్మతనయా, నీవలం పెఱింగితిని: నీవనినది నిక్కము. ఒక్క సుయోధనుండె యననేల! ఆతనితండ్రియు నట్టివాఁడే. వారట్టిరైనను నన్నేమి సేయఁగలరు! నిక్కముగ నేనలిగిన నట నను మార్కొనఁగలవాఁడొక్కండైన గలఁడె! నేను కౌరవసభకుపోవుట యెట్లయిన మనకు మేలెయగును. అర్థసంసిద్ధియొండె, మనకు పాపంబురాకునికికి గతంబగు మంచిమాటలొండె కలుగును. తుంటరియైన సుయోధనుఁడు నామాటవినఁడని నే నెఱుంగనివాఁడను గాను. ‘మాధవుఁడేటికి సంధి సేయఁదలంపఁడు!’ అని జగంబు నను నోటాడును. దాన మీకును నిందగలుగును. మనలోప మిసుమంతయు లేకుండఁ గురుసభలో సంధికార్యంబొనరింతును. వారు మన నెంతురేని, నామాటలు విననెంతురు. అటుగాక నా కగ్గేమాత్రమొనరింపఁ దలంచిర యేని, వారినెల్ల నొక్కత్రుటిలో నిర్వీర్యులఁ గావింపనుందునే! మన కెట్లయినను మేలె. సంధిపొనుపడకున్న, వారియత్నంబులకొలందులును, వారిసహాయసంపత్తియు, వారి సేనల లావును, నెఱింగి వచ్చెదగాక.” అని సమాధానము చెప్పెను.

"నీకుఁ బోలినయట్లయిన నందరికి యేమును వారును నర్థింబొంది పొసఁగియుండు న ట్లొడబాటు గావింపుము. అది మనకు శ్రేయస్కరంబు. ఇఁక నీ వాకురుపతికడ నుడువందగినచంద మేమని నీకుఁదెలుపవలయు? మహాత్ముఁడవు: మాయెడిరి నెఱుంగుదువు: కర్తవ్యము నెఱుంగుదువు: అర్థసిద్ధిక్రమం బెఱుంగుదువు: మాటనేర్పెఱుంగుదువు: నీ కే నేమి చెప్పగలను! నీవు మాటలాడునట్లు నేర్చి యింకొకండు మాటలాడలేనిమాట నిజము: కావున అర్థసిద్ధికనుకూలంబగుచందంబున దుర్యోధనుపొంతఁ బ్రవర్తింపుము: నీకుశుభంబగును." అనిధర్మజుండనెను.

కృష్ణు:—యమనందనా, నిన్నటిసంజయుపలుకులును, నీపలుకులును, నేఁటి నీ సందేశవాక్యములును, విన్నవాఁడ. భీష్మద్రోణాదులుగలరని బిరుదులైయున్న ధార్తరాష్ట్రులు వైరంబువీడరు. మీవలన వారేమియిక్కట్టులంబడిరని, యిప్పుడునీపలుకులకుఁ మీపాలు మీకొసంగఁదలంతురు! ధార్తరాష్ట్రు లధర్మమునకును లోకపుసడికిని నెఱచువారుకారు. రాజుల కడిగికొని తినిమనుట ధర్మేతరంబు. సంగరమున నరివర్గమును జయించి మేదినియేలుకొనుట యిహపరములఁ జిరకీర్తియు సుగతియు సమగతింబొనుపడును. నాఁడు గురుభీష్మాదులు చూచుచుండగనేగద, నిండుసభ నట్లు మీకుఁ గీడొనరించియు పశ్చాత్తప్తులుకాక ముష్కరులయి యింకను తమ గర్వమునే చెల్లించుకొనుచున్నారు. అట్టిరుపట్లఁ గృపయును బంధుత్వమును ని న్నెట్లువీడకున్నవో కద! ఆదురాత్ములగర్వకార్యములంగాంచి నీవు కాక యింకెవ్వరేని సైపంజాలుదురే! కపటపునెత్తమ్ము నెపమ్ముగ మిమ్ము దేశమ్ము వెడలనడచునప్పుడు దుర్యోధన దుశ్శాసన శకునిసూతనందనులు పుయిలోటకక్కలకలనవ్వుచుంబల్కినపలుకుల నాలించిన సమస్తజనంబులును ధార్తరాష్ట్రులనిందించుచు, మీరుబలవంతులరయి యుండియు, సత్యంబువాటించి, యూరకపోవుటఁజూచి, యచ్చెరువాటున నుమ్మలించుచుండిరి. లోకదూషితులగువారు దైవోపహతులయి యున్న చెడియుందురు; కావున వారిని జయించుట మిక్కిలి చులకనిపని. క్రూరులును, గర్వులును, లోకైకదూషణులునగు కౌరవులెల్లవారికిని వధ్యులయియుండ, నీకేలయవధ్యులో! పాపాత్ములగు కులపాంసకుల పాములనువలె నిర్విచారంబుగ వధియించుట కర్తవ్యంబు.

కురుసభను నీవినయవివేకాది గుణగణం బభివర్ణించెదను. బంధుగులును,

మిత్రులును, పరిజనులును, నానాదేశరాజవరేణ్యులును, విన నీపుణ్యచరిత్రంబును, నీధర్మమార్గాభిలాషంబును, దెలియంజెప్పెద. దానికి దుర్యోధనుం డియ్యకొనక తెలుంగుమాలినమాటలాడుటయు, తండ్రి వానివారింప నేరమికిం దో డుపేక్షకుండగుట యుంజూచి, మీ తొల్లింటిపాట్లను దలంచి, యెల్లవారును, వారినే గర్హింతురు. మన కింకేమి కావలయును? నాయోపినంతయుం జేసి పొందికగల సంధియ కావింపంజూచెద. అవ్విధంబు సిద్ధించిన మేలయగు: కాకనిక్కిన యాచేటయగు నుత్సాహంబు పంపింబును, అందుచేయంగలవారివర్తనంబులను దెలిసి నీకు విజయంబగు విధంబునం జనుదెంచెద.

ధర్మ:— దేవకీనందనా, నీ వెట్లానతిచ్చినను సమ్మతంబె. నిస్సంశయంబున కార్యంబు సాధించి మా కర్థసిద్ధిఁ గావించుకొని వత్తువుగాక!

కృష్ణ:— (మందహాసంబు సేసి) పాండవాగ్రజా, నెయ్యంబు కాని తెలుంగున కార్యంబుసాధించి అర్థసిద్ధి నొడగూర్పవలయునే! కుటిలబుద్ధియైన ధృతరాష్ట్రుండును క్రూరకర్ముండగు దుర్యోధనుండును ధాత్రీభాగము సంగ వారు కారంటివి; కొడుకు వలచినవాఁడగుట నావృద్ధరాజు ప్రకృతిగుర్గీతుండగు కొడుకుపక్షత మాన్పఁ జాలఁడంటివి; జనవినాశకరంబగుట సంగ్రామంబు సలుప నియ్యకొనఁజాలనంటివి; నను నొంటరిగ గరుసభకనిపిన వారు నాకేమి యోగ్యసమగ్రులనియు వందింపలంకు చుంటి నంటివి; నాయొనర్చునయసంభాషణముల వారూకొనరంటివి; నను బొమ్మంటివి; నావలనం గార్యసిద్ధి కావలె నంటివి— ఇవియన్నియు ననన్వయములు. ఇంతయేల! అవినీతులయి కౌరవులు పాలీయక పెనంగునపుడు, వృద్ధరాజు తూష్ణీంభూతుండై మారాడకున్నపుడు, అర్థసిద్ధి కావలెనని యపేక్షించుచున్న నీవు వారితో పెనంగు లాడకతప్పునే! క్షత్రధర్మము దారుణమని, పరధర్మమాచరించుట పాపమని, యంటివి. కష్టములకోర్చియైనను పాపకార్యము లాచరింపకుండుటేకదా పరమ ధర్మము! నీవు కార్యరంగమున కలుకఁజాలనివాఁడవని రాయబారమునకై వచ్చిన సంజయుం డపుడు నీకు భిక్షాన్నమె మేలని యనినాఁడు! వన్యమృగములరీతి నాటవిక జీవనమునకె, శత్రుజనపీడితుండవగుటకె, నీవు తగుదువనియు, రాజ్యము నేలుటకె, అరాతివీరజనపీడనమునకె, ధార్తరాష్ట్రులు తగుదు రనియు, నెఱింగినసంజయుఁడె నీవూరకఁ గనలితివిగాని, పాపమతనిదేమితప్పు! సమరమునకె వారు గాలుద్రవ్వుచుండ

జనక్షయమున కియ్యకొనకుండుటకు నీ కేమియుత్తరవాదముకలదు? ఇంతకాదని అర్థసిద్ధి యక్కఱలే దనవాయెను!

గోగ్రహణఘట్టమున భీష్ముఁ డజ్ఞాతవాసవత్సరవ్యాప్తి నిష్కర్షించుసమయాన సుయోధనుం డాతనితో —"మనకును పాండురాజతనయవర్గమునకును పొం దెట్లుగలుగును? నేనయి వారికి రాజ్యభాగమీను. సమరభంగిక విక్రమనిరతిఁ బూనుటె నిశ్చయంబు" అని యొత్తిపలికియుంట నింతలోనె మఱచితే! అట్లగుట సమరమె సర్వవిధముల సంసిద్ధము. సమరంబున జనక్షయములేకునికి యెట్లు సంభవంబగును? పరాజయంబు సహింపఁజాలని నీకు, దారిద్ర్యమున కోర్వఁజాలనినీకు, విజయాభిలాషుండవగునీకు, అర్థసిద్ధివశ్యగోరుచున్ననీకు, అరిజనసంహారం బొనర్పక తప్పునే! సదా కదనమునకె గాలుద్రవ్వుచున్న ముష్కరులతో కయ్యములేని నెయ్యంపుదెన్నున కార్యసిద్ధి వడయనగునె! ఆసుయోధనుని ముష్కర్న నావిగలుఁగు నందనుక బుడమి నీ కీయఁడని నీకెఱుక లేదే! యుద్ధమె సిద్ధము. కయ్యంపుశకునంబు లెన్నేని నే గంటిని: నీ వనుత్సాహివి కావలదు. చతురంగబలంబుల నాయితంబు గావించుకొని దొరలం బురికొల్పుకొనుచు, నాలస్యంబు లేక, సమరంబునకె సన్నాహంబు సేయుచుండుము.

ధర్మ:—చాలక కాదు నేనుసమగపరాఙ్ముఖుండ నగుట: రక్తపుకూడు తినఁ జాలక—

"నేనదియు నిదియు నెఱుంగుదును. ఏది యెటువచ్చినను సంధియొనర్పఁ బోవుచున్న నాప్రయత్నము లన్నియు ధార్తరాష్ట్రులు వీటిఁబుచ్చిరేని, నీవు క్షత్రధర్మము నిలువంబెట్టెదవో, సంజయప్రోక్తబ్రాహ్మణధర్మమునవలంబింతువో! అనుత్సాహివిమాత్రము కావలదు." అని కృష్ణుం డనియెను.

భీమ:—మాధవా, సమరంబు సమకూడు నని మాటిమాటికిని మఱుమఱపింపవలదు. నిను గురుపతికడకు మాయన్న పంపుటయు, నీవు తగుదునని పోవుటయు, నీరెండును మీకేదగును. కావున నీనేర్పున 'నా కుమతియాదుర్యోధనుండు శాంతించు తెఱంగున కార్యంబు చక్కఁజేసికొనిరము.' ఆపాపాత్ముండు—అమదాంధుఁడు—అతులువ—నీయాదేశంబు ననుసరించువాఁడుకాఁడు. కురుసభనొక్కండును వాని వారింపంజాలఁడు. అహంకారోద్రేకమును, గర్వంబును, కోపంబును, వాని నెటుఁద్రిప్పిన నటుబోనిచ్చు

వారే వానియాప్తజనంబులు. కావున నాతఁడు నిను వినకుండుటకేమిగాని, నిను బాధింపకుండనుండఁడైననోపఁడు. నేనెటుబోయిన నటువచ్చి, నాచే పీడపడియును, బాహుగర్వమున నను మెచ్చక, ననుగడతేర్పఁగడంగుచుండు. అంతనీమందగు నాసుయోధనుతో నరమరలేక కూడిమనుటనాకువలసెనే! నడచినపంతయు నీవిన్నవచ్చుండును (ధర్మరాజుంజూపుచు) యీరాచవారును కురువంశవినాశమునకొప్పని కారణముననేగదా! దురాత్ముండగుదుర్యోధనుఁ డింతలుపుట్టించెగాని, కానిచో, మున్ను పాండవులును కౌరవులును గలసి క్షీరనీరంబులంబోలె నెమ్మినైనున్నవారుకారె! అతండె కులక్షయంబునకు గారకుం డను పెద్దలపలుకులు మాయన్నగారు కావనిపింపనుండ నీవేల కాదనవలె? ఓపినయంతవట్టు నీ వాఁడిరుదునఁగనిని-సుయోధనుని-నీసామర్థ్యముచేఁ ద్రిప్పఁజూడుము. తనబలం బుడివోనియంతకును ఆధృతరాష్ట్రసూనుండు కపటంబు నడుగంజాలండు విశాలయశోభరితంబగు భారతాన్వయమున కొకమచ్చ వచ్చు ననినైన యాదురాత్ముండు తలంపఁడు. తనకార్యమున దనకే హానివచ్చునని యెఱుంగనివాని ననుసరింపఁగోరుటకు మే మెంతటినీచులమొ నీవెయోచించుకొనుము. మాకును వారికిని బితామహుండగు భీష్ముండు వినుచుండ సుయోధనులోడఁ గురుకులేశ్వరునాస్థానంబున నాపలుకులుగా నిట్లనుము:

—అన్నదమ్ములమైయున్న మనలనోరులుచూచి పరిహసించునట్లు
మనలో మనమె యేల నిట్లు పెనఁగులాడుకొనవలెను? పెద్దలమాట
పాటించి యీనేలపంచికొని తిని మనుట మన కుచితముకాదె!—

కంసమర్దనా, ఏవిధముననైన నీవు సంధియ సమకూర్పవలయు. అదియే మాకును, వారికిని, లోకమువారికిని, సౌఖ్యావహమగుట హితమగును.

భీమసేనునిపలుకు లాలించియాలించి, యశోదానందనుండు మందహాసం బొనరించి ధర్మజాదులంజూచుచు: "ఎన్నండును విననిమాటల నేఁడీ భీమసేనునోటనె వింటిమి! ఔరా! అగ్గి చల్లవడినది! అత్యున్నతపర్వతరాజంబు బెండుంబోలె దేలికయై గాలిం దేలినది.

(తనలో) 'తనసహోదరు లాహవమున నాయాసపడవలసివచ్చునుగదా యని యెంచెనా? ధార్తరాష్ట్రులచావున కిచ్చగింపమి కారణమగునా? లేకున్న నిం

తలో నింతకరుణార్ద్రచిత్తత యెట్లలవడును? వీరికి బా లీయనని, వీరిపాండవుల నని వీరిమనికి నొల్లనని, యనికి రమ్మని యనుచున్న సుయోధనుకడకు ననుబొమ్మనుచే గాని అట నెటుబోయి యెటువచ్చునో యెవనికెఱుక? యుద్ధమేసిద్ధమయినచో, చల్లారిన భీమదవాగ్నితో నిఁక రిపుజనాటవి దగ్ధమొనర్చు టెటులు? అట్లగుట నీతని కుత్సాహము కలిగింపకతప్పదు.

(ప్రకాశముగా) "కీచకాంతకా, యుద్ధమునీద వేడ్కయు, మహోగ్ర విరోధులఁ జెల్లాచెదరఁజేయు నీవరోద్ధతియు, సుయోధను నున్నతిసుంతయు సైపని నీయేపును, ధర్మనందనునకు రాజ్యసంసిద్ధి సేయు నీపట్టుదలయు, నేఁడేమైనవి? వెఱపన నెట్టిదియో యెఱుంగని నీయట్టి జగజెట్టి కిట్టి పిఱికితనం బడిన దెవరోయీ!"

అని యాతండు కలకల నవ్వసాగెను.

భీము:— (నవ్వుచు) వాసుదేవా! నీ బంటుతనంపుపలుకుల నిఁక నాడకు. పాండు నృపాలు పాలు గైకొంటయు చాలు నన్ను నృపకుంజరు పలుకులకే నడ్డమాడరా దని నీ వెఱుంగవో! ఇపుడేల! అనిమొన నా సుయోధనుపాటు నీవు మున్ముందు చూపి నేఁటి నామాట నీవు నిరూపించెదవులే! నా కోలంది సుంతయు నెఱుంగక నను జాలకననేసి బలుకుచున్నావు! మిన్నువిఱిగి మీదఁబడినను నాముంజేతులనొడ్డి పైకెగఁద్రోయంగల నని నీకెఱుకలేదు. కానిచో నీవిట్టి పలుకుల నను నాడఁగలవే!

కృష్ణు:—పవనాత్మజా, నవ్వులాటలకనిన నామాట కింతనేయుచున్నావేమి! నీవు కేవలయోధమాత్రుండవెకాక సర్వసమర్థుండవని నీతో నింటిపనులవలన నే నెఱుంగని వాఁడనుకాను. ఇంతకాలమును మీశత్రుజనంబులు మీకొనర్చినయపకృతుల మఱచి, నీవు పౌరుషముఁ జూపక, చపట వగుట యుక్తముకాదనియంటిని. ఇంతమాత్రమున నెగ్గయ్యెనే! తనకుఁ బోరం దేరుగడవనన్నా నరుండర్థింప, నే ననురాగమ్మున నియ్యకొంటి. యుద్ధార్థులమైనమాకు నీసాయ మాసపడందగదే! విరోధివిజయంబునఁగాక, నన్యమున యశంబును, నానార్థసంపదయు నేకురంగలవే!

భీముఁడు:—ఏమేమి! నీవును బార్థుండును దండిమగలో! యుద్ధార్థులో! మీరేకార వ్యసంగాక్రమక్షోభమునంతయు బాహుదర్పమునఁ దీర్పఁగలరో! ఇఁక పిరికిపందల మగు మేమెల్లరమును భీతచేతస్కులమై పెద్దమిట్టెక్కి మీ యాహవకేళీవిక్రమముఁ

జామచుండెదము లే! సంధి యనుసంధింతువో!! ఈపాటికి పోయిరమ్ము-సంధియొనగూర్పుము. నీ వెంత నేర్పును ఓర్పును జూపెదో: చూచెదము లే! ఈరిత్త పలుకుల కీ భీముండు గోపింపఁడు లే! నీతో నాకు హాస్యము లేల? కయ్యమె యయ్యెనేని నేనొక్కరుండనే గంధగజప్రకరకుంభములు వ్రయ్యలు సేయుచు తురంగపంక్తులు ధరం బాలు సేయుచు, తేరిగములు పొడిసేయుచుండ, నే దయ్యముల కీ పబ్బగము సిందుచుండ, నే గదపండువు సేయుచున్నపుడుగద నా సంకల్పమునకు దైవసహాయము సమకూడెనని యనుట!

“భీమసేనా, నీ వెంతాదుముదువో అంతేకుమిగులువంతేయు జేయంగలగడింది మగండవు: నే నెఱుంగుదును ఇంతవఱకును బొనుపడిన దుఃఖవార్ధుల నిను దెప్పఁగాగొని పలుమఱు గడువనీదినమును నేకొఱంతయు లేకయె సుఖాత్ములను జేసినది నీవ యనియు నెఱుంగుదును. కాని ఎన్వరము నిదివఱ కెఱుఁగని నీశాంతము చూచి ఆశ్చర్యమునొందితిమి. రౌద్రరసమొప్పినట్లు నీముఖమండలమునకు శాంతరసమెప్పవి అట్లు నట్లుంటిని. ధర్మజు నానతి సంధి సేత కే నేగెద. కౌరవ్యులఁబదునుకు రాఁబటికి సంధి నాటింపఁ బ్రయత్నింతును. అటుగాక యుద్ధమే సిద్ధమయ్యెనేని యీపత్తుమానకంతకును నీవేకద ఆధారమవు!—”అని భీమసేనువీపుపై కృష్ణుఁడు వలచేతం దట్టెను.

అర్జునుఁడు:—(ముకుళితహస్తుండయి) ముకుందా, అజాతశత్రుండను నీకుఁ జెప్పఁగల యంతవట్టు చెప్పియేయుంట నే నేమి చెప్పఁగలను! అతిలోభమూషితుండగుట ధృతరాష్ట్రిం డుధాత్రీభాగమీ నేరఁడు: సుతువాఁడగుట కొడుకును మంపంజాలఁడు. దుర్యోధనుండు సామసాధ్యుండు కాఁడు పెద్దలమాట గైకొనఁడు: కఠినుండగుట మాకేమియు నీయండు. ఇదినీవును లోకమును బాగుగ నెఱింగినవిషయమె. కౌరవ్యులతో సంధి పొసంగదని నీవు సంపూర్ణముగ నెఱింగియు ధర్మజు నానతి నతిక్రమింపఁజాలక కౌరవ సభకేగుచున్నావు. గాండీవంబును దివ్యాస్త్రసంతతులును ముట్టవక్కఱ లేకుండగనే మాకర్థసిద్ధియయ్యెనేని, యికమాకు కావలసినదేమి? ఫలసిద్ధినొసఁగు దైవమవగు నీవే పురుషుండవయి ప్రయత్నమొనర్చుచుండ, కార్యము ఫలసిద్ధివడయకుండు టెట్లు? కావనినట్లుండియు, కార్యములు కొన్ని తుదకు ఫలసిద్ధినొందుట యెఱుంగమే! వారు మాకొనర్చిన యపకృతులన్నియు మేము సహించితిమి. వారువధ్యులని మే మెఱుంగుదుము. అట్లయ్యును మేము వారికొకకీడునుం బొరయఁజేయ నొల్లము. మాయందు

నీకున్న పక్షపాతవృత్తిని, మా పొందినపాట్లకు నీ వోర్వజాలమి నట్లంటివిగాని, పొందు సేయుటకు నీకు మాత్రమిష్టము లేదనఁ గలమా? ఆ మోటకుల నేవిధినైన నొడంబఱచి, మాకును వారికిని ధాత్రీభాగము పంపక మొనర్చి పొందొనగూర్చుట నీకును ఖ్యాతికరము కాదా! ఇట్టి తెఱంగు కానిదైన, మము నిట్టులవర్తింపుం డని మాకుఁ గట్టడియొనర్పుము. నీయాదేశంబు ననుసరింపుటయే కదా తొలినుండియు మమునున్నతికి దెచ్చినది! అట్లగుట నీమాట జవదాటువాటము మాకు లేదు.

కృష్ణుఁడు, "మానవుఁడెంతకష్టపడి ఉద్యోగించినను దైవసహాయము లేని కార్యములు ఫలవంతములు కాఁజాలవు ఉపాయము లెఱింగి ఎంతో సామర్థ్యముతో వ్యవసాయము చేసినను, ఎన్నివిధాలఁ గృషిసల్పినను, సరియగు తఱిని వర్షింపకున్నచో, వ్యవసాయము ఫలింపని పరిస్థితులెన్ని మనముచూచుచుండలేదు! కావున ప్రయత్నము చేసితీర వలెను. కార్యదశననుసరించియో, దైవసహాయము లభించును అట్లగుటనె కదా, నే సంధికిం బురుష కారమొనర్తుననుట! ఆపైన దైవానుకూల్యమెట్లుండునో, అట్లయగు కార్యపరిణతి! కాని ఆసుయోధనుండు, మీకు పాలిడు పాడియయ్యున్న, మి మ్మా బాల్యముగ నేవిధినైనం జెఱుప నంతంతపాపకృత్యము లొనర్చునే! ఇదియటుండ నిచ్చి, విరాటుపసుల కీవువోయిన యప్పుడా దుర్యోధనుండు-'సమరంబె కర్తవ్యంబు: పాండుతనయులకు భూభాగంబీయ' వని భీష్మాదులతో ననియుండలేదా ఇట్లెన్నని యాతనిగుణదోషము లెంచుట! కావున నిఁక నాకుఁ గర్తవ్యము ధర్మజు నాజ్ఞ నౌదలవహించి సంధికిం బురుషకార మొనర్చుటయ. నేనచ్చటి తెఱంగెల్ల నెఱింగి వత్తును." అని యనెను.

నకులుఁడు:-యదునందనా, మామనంబు లిప్పుడు తొల్లింటిచందంబున తీవ్రంబులు గావు. ఒకరు గోవునుగొట్టిన, నింకొకరు దూడంగొట్టవలయునే! చెడుతెఱ వాకార వ్యులువట్టినను, మేమును కాఠిర్యము వహింపవలయునా! గోగ్రహణంబునాఁటిచందము నకె వారు మెత్తనడియుండవలదా! గురుజనంబులును కురువృద్ధులును వారికి బుద్ధులు సెప్పి, వారిం జక్కఁజేయరా! ఇం దేదికాకున్నను రంధికే సిద్ధులయియున్నవారు, సంధికిబోవుచున్న నీపలుకు లాలింపకుందురేని, తత్ఫలము వారలె యనుభవింతురు.

కృష్ణుఁడు-సహదేవా, నీయన్నలందఱును చెప్పఁదలంచినవి చెప్పితి. నీ వేమందువు?

సహదేవుఁడు:— మఱి నే ననుటకేమున్నది! ఈ రాచవారందఱును మగఁటిమివీడి నిన్నా వీటి కనుపుమండ, నిఁక నే నేమనువాఁడను?

కాని, పాలుపంచి యిమ్మనియడుగుటకు నీవుపోవుచున్నావట కదా: ఏమి పాలది? మా యయ్యపాలన్న దేది? మేముపాలునకే యర్హులమైతిమేని, మా యన్నకు యౌవరాజ్యపట్టాభిషేకము సేయనేల? మా యన్న యువరాజయ్యెనేని, మము వారణావతంబున కనుపనేల? పాంచాలముననున్న మముఁ బిలువఁబంచి మా యన్నను నర్ధరాజ్యంబున కభిషిక్తుం జేయుటేల? క్షీరనీరంబులంబోలె మే మెల్లరమును గలసి జీవించుచుండ ఖాండవమ్మునకుం బొమ్మనుటేల? కురురాజ్యంబున ఖాండవ మర్ధభాగమగు నేమి? ఎన్నిటం జూచినను మాకుఁ బిత్రపైతామహంబగునది యనుపాలు లేనే లేదు. ఇఁక రాజసూయంబున నలవరచుకొన్నదియు, వారు వంచనమెయిఁ గయికొన్నదియు నను నీ సంపదివారలవాసము కలదు. జూదమున సమస్తము నోడితిమి. అట్లయ్యును మరలఁ గురుపతి గరుణించి యొసంగఁగదా యనియందురేమో! ఔను-ఒసంగెను: ఎవరి కొసంగెను? ఏమని యొసంగెను? ద్రౌపది పరిభవమొందిన యనంతరమా యంధనృపాలుఁ డామెను గరుణించి యామెకా సంపదయెల్ల నొసంగెనే కాని గాండీవమును గదయును ధరించువారలకొసంగలేదే. ఆమె దానియార్జన మధమాధమము కాదా! దాని నాసించువారు రాచవారో! మాయజూదమని మఱియిపుడన వాటము కాదు. అట్లని తెలిసికొనియుండిరేని అపుడే యాయాట నాపియుందురే! ఇవన్నియు నేటిమాటలు! మా యన్న నిన్నా కురుపతికడకుఁ బొమ్మన, నీ వానని పోవుచుండ, నేఁ గాదన నేల! నీవువచ్చితివిగదా యని నిను వారు గౌరవించెదరే!

ఇంతకును దుర్యోధనుని యాచింపఁబోవుటయే యుక్తమని నీకును దోఁచినది కదా! మాధవా, రక్కసమాటలాడుట కలవాటుపడిన రాజును దమ్ములును నినుఁ గష్టపెట్టుచుండ, నీవు వారిమాటలకుఁ గాదన కూరకొనుచుండుట అంతకన్నను మేలు. ఇంత లేసిదొరలయ్యు నింత దైన్యవృత్తి నవలంబించుటయా! ధర్మజుండు వేడుకొనుటయుఁ, గృష్ణుండడుగఁబోవుటయు, ధార్తరాష్ట్రులు పాలీయమని పెసంగుటయునా! ఔరా! కూడెంత తీపయ్యెను! మన వేఁడికోలును, వారిదర్పసంభావితమైనబుద్ధియుం గలసి సంధియొయగునేని, అట్టిసంధి యెంత కాలము నిలువఁగలదు! ఎంతయోచించిన

విప్రుఁడు రాచవారి కుచితమైనది యుద్ధమే కాని వేఁడుట కాదు. వంకమాటలే వచియింపనేర. సక్రమంబుగ సమయానుసారంబుగ నరణ్యాజ్ఞాతవాసంబులు నిర్వర్తించుకొని వచ్చిన మాకు మా రాజ్యంబొసంగక యింకను మాయలు పన్ని నేర్పు జూపఁదలంచెనేని యయ్యది యికఁ జెల్లనీయము. ఆతండు నుబదుమూఁడేఁడులుఁ దిరిగివచ్చి మముఁ బాలడుగ వలయుఁ గాని, మాకుఁ దాను పాలొసంగవలసిన యవసరము లే దని సుయోధను గుండెలు బ్రద్దలగునట్లు పలుకుము.

“చక్కఁగాఁ జెప్పితివి.” అని కృష్ణుండనెను.

సాత్యకి:- ఎంత యొప్పిదముగఁ బల్కినాఁడీ సహదేవుఁడు! దుష్టుండగు సుయోధనుండేమి! సుబోధనలు వినుటయేమి! ఇది వట్టికల్ల. మన మానము చెడును; కౌరవపక్షమున నున్న వారికి మనయెడ నశక్తి దోఁచు; ఇంకేమి కావలె మన కపజయము చేకురుటకు!—

అటఁ జేరియున్న రథికవరులలోఁ గొందఱట్లనుకొనిరి.

ఏమిది! యుద్ధమున కేర్పడియున్న పరిస్థితులం గని, సంధికని కృష్ణు నంపుచున్నాఁడే ధర్మజుం డను పలుకను గావలయు సహదేవుం డిట్లనుచున్నాఁడు! దుర్యోధను నివాదములో, ప్రజలనుకులో, ధర్మసందేహములో, కుతర్కములో, మఱి యవియేమియు నుండునో కాని, క్షత్రియోచితధర్మమగు సమరము మాని సంధియనుమిష నీ దీనాలాపములేల యనుదాగటున గావలయు నిట్లు పలుకుచున్నాఁడు. కాకుండినచో దుర్యోధనునిఁ గూడఁ దనవలెనే పదుమూఁడేఁడులును దిరిగి రమ్మనుటేమి! తమకు రాజ్యమునందు స్వత్వములం గూర్చి యున్నిక్కు శంక లేల! సుయోధను పైఁగల క్రోధమును, సంధిననుసంధింపు మనుచున్న ధర్మజుని మితిమీఱిన శాంతికిఁ దానొందిన యసంతృప్తియు, నిట్టి పలుకులఁ బల్కించి యుండనోపు!

* * * *

ద్రౌపది కృష్ణుని సమీపించినది.

సహదేవునుడు లొకింత చేయూఁత నొసంగినను ధర్మనందను పలుకులు తనకు హృదయ తాప మొనరింప భీముని ప్రసంగము తన యాస సమూలముగ నశింపఁజేయ, పార్థుని మాటలు తన కేవజనింపఁ జేయ నిజహృదయావేగమాగమి మోహమున దీనత్వము దోఁచుచుండఁ, బాపము పాంచాలి గద్గదకంఠియగుచు శౌరి దెసం జూచుచు నిట్లనియె:-

"ఆదురాత్ము లంతంతకీడులు మనకొనర్చియుఁ బ్రయోజనము లేనిపలుకులు సంజయుచేఁ బుత్తెంతురే! ఇట్టియూఱట కొంతయు మదిం బ్రియమంది యాయుధిష్ఠిరుండు తనంతన దా నైదుసరకు నైదూళులనైన నిచ్చినం జాలునని వార్తనంపిన నంపుఁగాక: కాని, కృపావిహీనమతిని నెక్కుడుమఱల మముఁ గుడువఁజేసినాసుయోధనుండీ మనుజపతి వేఁడికోలున కియ్యకొనునే! మును దాఁబడ్డబన్నములన్నియు నీధర్మసుతుఁడు తనతమ్ములపైఁగలకూర్మి సైఁచుట యెంతయు నొప్పిన నొప్పుఁగాక: కాని రాజ్యముపాలు లేని సంధి కా సుయోధనుఁడియ్యకొనెనేని, మనవారి యవివేకమునకును, నసమర్థతకును, సిగ్గులేమికిని లోకము వారాడిపోయకుందురే! వీరాలాపములె కాని, కార్యములపట్ల బలాతిరేకములఁ జూపఁజాలని మనము సంధననుసంధింపఁ ద్వరపడుటె బాగు. కాని, వీరికిఁగానివో సుయోధనుం డేలయొసంగఁడు. వీరుయాచించుచున్న గ్రామైదుల లంతిపల్లియలైన! అదియును ధార్తరాష్ట్రులకెకదా లాభకరము! ఇంతలేసిదొరలు, మహాపురుషుండవగునినుఁ గురుసభను యాచకునిఁజేయఁబంపుమండ్రు, లోకానకెల్ల వధ్యులసమన్న ధార్తరాష్ట్రులీపాండుతనయుల కనుజతతియయి యుండ, నీవుమాత్ర మేమిసేయఁగలవు? ఇంతకును సెన్నిపంచనలొనర్చినను గౌరవ్యులు బ్రాహ్మణులుగనుకనా మనము సైరింపవలెననుటకైనను! సంగరమున జయాపజయంబులంగూర్చిన శంకయొకవంకను, జనక్షయమువలననగు పాపభీతియింకొకవంకను, నిర్వీర్యులకుంబలెఁ దన్నుబాధించుచుంట సంధియొనర్ప నిన్నీ ధరణీపతి కురుపతికడ కనుపుచున్నాఁడు; కాని వీరపురుషోచిత ధర్మమున మెలఁగు నా సుయోధనుచిత్తమునం దోటమి యనుమాటయె లేమి నాతఁ డావంతయుఁ జలియింపఁడు. ఆత్మీయతకలవారి దురభిమానము నీపలుకులను మఱింత యెక్కుడగునె కాని మనకు ఫలదాయకము కాఁజాలదు. అటుగాక, నీపోయినచోట నీవొదుటనె సంగరంబగుచొప్పులెపుట్టినను, ఈపాండు కుమారులు పోఁటునకిచ్చగింతురు: మఱలఁ గందమూలఫలంబులఁగుడువ నడవులకు నడచెదరో! మాధవా, రాజును దమ్ములును నీవునుంగలిసి యోచించి, యుచితంబునారసి, మన కార్యంబును, మీసౌజన్యంబును చెడకుండ మీకనుకూలముగు తెఱంగున మీమీనేర్పు లేర్పడ నాకురురాజుతో సంధిగావింపుఁడు: కాదనువారెవరు?

కాని———మేము పడరాని పాట్లెల్లఁబడియు ఫలమంద లేకుండుటయు, లజ్జాకరములగు నక్రమకార్యములొనర్చుచును వారు సుఫలము లందుటయుఁ జూచి మఱి నోటమాటరామి; మాపడినపాటులు మనమున నింకను నిముడఁదావు లేమి మంచి చెడ్డలనరయఁజాలక, మనంబుడుకుటను, వెఱ్ఱెత్తి, వివేకముదూలుటను గార్యఁపు సాకర్యమును మువ్వుచొప్పునుం జూచుకొనలేక కాలుఁద్రేలనే నాకుమనసుకల్గుచున్నది. వరమున యజ్ఞకుండమున జన్మించితిని; భరతవంశమునఁ గాలు వెట్టితిని; పాండుభూపాలునకుఁ గోడలనైతిని; లోకస్తుతిఁ గన్నవారికి భార్యనై, సుస్థిరనీతివిక్రమాధుర్యులగు పుత్రులఁ గాంచి, యెంతయుఁ బ్రసిద్ధి వహించితిని; నీచే సుభద్రకంటెను గడు నెయ్యమునఁ గారవింపఁబడుచున్న, కృష్ణా, రాజసూయావభృథంబున శుచియై నెగడిన నా యీ వేణినొకండు పట్టి యీ నా యేవురుపతులును జూచుచుండఁగనే సభకీడ్చి పరాభవమొందఁజేసెను. ఇట్టియవమానము నేకులాంగననైన నోర్వఁగల్గునే? మఱియు నాసభ నేకవస్త్రనగు ననుఁ గొనివచ్చి యాతులువ దుశ్శాసనుఁడు ననునొవ్వఁజేయుచుండ, నా భర్తలు ననుఁ జూచుమనసంభ్రమములై నాయాసలు మాని, చిత్తరువులయట్లుండఁ దుడకు మూకుండ, నీవలని విశ్వాసమునఁగదా, నినుఁ గొల్వ మనసు పుట్టినది! ఇదియైనఁ బరికింపవే సంఘమర్యాదలనైనఁ బాటింపక నన్నుకాలమునఁ గోడలను మాటయుఁ బీకి దాసిగఁ జేసి యాడిగములనెఱపఁ జేసిన యామహాపురుషుపాలికె మరలఁ బోఁబోవుచోఁ గోడలికము నేఁ జూపవలెనో, మఱల యథారీతిని దాసినై మెలఁగవలయునో నీవే స్థిరపఱుపుము."

అనుచుఁ గనలి యార్తయై, బంధురమై యున్న తనక్రొమ్ముడి గ్రమ్మనవిడ్చి మనమునఁ బొంగు గాఢరోషవిషాదవేదనల వేగమున ద్రౌపది దిగ్గనలేచి కృష్ణసర్పమో నా విలసిల్లుచుఁ దన వలపలచేత వ్రేలు కురులను గృష్ణునకుం జూపి యశ్రుపూరితలోచనయై "అన్నా, చూచితివిగద, దురాత్ముండగు దుస్ససేనుని వ్రేళులను సగము త్రెవ్విపోయిన యీకురులు! ఇపుడు నీమూలమునఁ గౌరవుల కడఁ దీఱుమాటలఁగాని మిగిలిన సగమునుగూర్చి తలఁపలేము. ఈకురులు పట్టి ననునీడ్చిన యాతని చేయియుఁ ధనువును నింతలింతలుగాఁ దునియలై చెదరి రూపుమాయునందాఁక, నా సభ నేకవస్త్రనౌనను దులువతనాన నీడ్చుటను సగము సచ్చిరయే నేనటనిలచియుండ, 'రా రమ్మిటురమ్ము కూరుచుండు' మని తన యొడిఁ జూపిన దుర్యోధనుని తొడలు విఱుఁగు నందాఁక, జగద్విఖ్యాతిఁ గాంచిన నాపతులేవురునుండియుఁ దమ సహధర్మచారిణి

మానము గోల్పడు సమయమునన్నైనను, నాదిక్కునకు రారేమని దుఃఖరవిషాదవేదనానల పరితప్తచిత్తనయి పతులదెసఁజూచుచుండ 'నీకిట్టిఁబతులు లేరు: ఇందు నీకునచ్చిన వాని నింకొకనిఁ బతిగా నెన్నుకొను' మని యనార్యములును అమానుషములును నగు కర్ణకఠోర వాక్యముల ననునిందించిన కర్ణుని శిరము భూపతనమునొందుదాఁక నారని యీచిచ్చు, అలుపాలఁ బొనుపడని యీచిచ్చు, సుయోధనుముకొఱకెదురు చూచుచు నాయెడఁ గట్టికొనిన యీచిచ్చు, అన్యమున జల్లారునే! నేనును, ధర్మనందనమహీపతియును, రాజరాజుపెనుమంటను గన్నారఁజూచెదనైతినేని, ననుఁబోంగ దారిఘిష్ఠతకును, గదాగరిష్ఠత్వమునకును, బాహుబలంబునకును భీమసేనుఁడొంది యున్న గర్వంబును, దివ్యాస్త్రంబులకును గీర్వాణంబగు గాండీవ మనునొకవిల్లును ననకుఁ గలవను దాయని గర్వించు కృష్ణునిగ్రహంబును నేల-కాల్పనే! దుష్టనిగ్రహమునర్చును జగంబులఁగాచునని యెట్టికొట్టునును, బరాక్రమ సంపన్నులగు భర్తలును గలిగిన నాకే యీయనుభవము కాఁగలదా, ఎవతెకింకెవ్వనెక్కడనుతోడుండఁగలదు!" అని యామె యెలుంగురాలు పడ నేడ్చుచుండెను—

కృపాతరంగితాత్ముండగు ముకుందుండామె నోదార్చి కూర్చుండఁజేసి, యామెకనులుతుడువను, ఒక్కెడ్వేశిముడువనుం దగినవారిని నియోగించి, యమ్మానిని నూఱడిలఁజేసెను.

—కృష్ణుఁడు:—

అమ్మా, యాజ్ఞసేనీ, నీకింతవంత యేల! సంధికుదురునని కొంటివా? కౌరవ్యులర్ధభాగం బూరకయిత్తురనుకొంటివా? ధర్మజునానతిఁ జిరునవ్వుసను సంధియను సంధించు ప్రయత్నమొనర్చితిమను మాటకు లోపము రాకుండ, లోకమున నొకనింద మనకంటకుండ, నుండుకొఱకు నేఁ గౌరవసభకుఁ బోనుంటిని.

దురాత్మనమును, లోభమును, అసహనమును, వ్యామోహమును నెప్పటెప్పటి మితముమించి తమస్సులోఁజేరుచున్నవో యప్పటప్పటఁ గాఁడగిన దయెల్ల వినిర్మూలనమును బునర్నిర్మాణమును మాత్రము నైయున్నవి. కనుక నిర్దోషులును ధర్మరతులును నీతిపరులును నగుమీము, వారు రాజ్యలోభమునను, విషయవ్యామోహమునను దుస్సహముగ వేధించిన కారణమున, నీయిప్పటి యేడ్పుకొలఁదియె యిఁక ముందు కురునృపాలపుత్రకళత్రంబుల యేడ్పులుగా మాఱఁగలదు. వారియేడ్పులువిని

నీవు కలకలనవ్వునట్టికాల మాసన్నము కాకమానదు. ఇందు సందియము లేదు. సౌమ్యమున నెంతమాత్రము మనము ప్రయత్నించినను యమమహిషఘంటికాని నాదము వినఁ గుతూహలపడుచున్న కౌరవులు, సంధికార్యమున కిచ్చగింపఁగలరే? అట్లని సంధి ప్రయత్నములు మానవగునే? సంపూర్ణమగు బాధ్యతతో నొక్కమాటచెప్పెదవినుము. సమూలముగ రిపుజనక్షయము చూడఁగలదు; ఉజ్జ్వలపుణ్యలక్ష్మీ సమేతులగు పాండుకుమారులధికవిభవమును బొందెదరు. ఇది నీవు చూచెదవు. ఇందులకుఁ దడవును లేదు.

కృష్ణుని యీపలుకులువినినంతనె యాకృష్ణయుఁ గలఁతఁదేఱి యేడ్పుడిగె. వాసుదేవు మొగంబుచూచుచుండ నర్జునున కేమితోఁచినదోకాని మాధవుంజూచుచు "మహానుభావా! పాండవులును, ధార్తరాష్ట్రులును జుట్టఱికమున నీకుసమానమగుట మాయుభయపక్షములవారికిని నుచితమును హితమును నగు తెఱంగున, ధర్మార్థ సంగతంబుగ మాయన్న బల్కిన కార్యము నుచితగతిఁ దెలుపఁజేసికొని రాఁగోరెదము- అంతకునుంగౌరవులు నీమాటలు చెవినిడక, సత్కార్యమునకుఁజొరనొల్లరేని యుత్తర క్రియలు దైవమెఱుంగును. అంతతో ధర్మనందనుండు నీయందిడిన కార్యభారమును దీఱఁగలదు." అనియె.

కృష్ణుఁ డదివఱకు నుడివిన ధర్మవచనములువినిన యజాతశత్రుం డలరి— "కృష్ణా! మమ్మెఱిఁగి మాయెదిరినెఱిఁగి, మంచిచెడ్డలనెఱిఁగి, యర్థసిద్ధిమార్గమెఱిఁగి, సంభాషణక్రమమెఱిఁగి యున్న నీకుబుద్ధులుచెప్పుటకు నేనెపాటివాఁడను! జనక్షయమొల్లని నాయభిమతమెఱిఁగితివిగావున, నయ్యది మఱవక కార్యదశ స్థిరపఱిచికొని రమ్ము" అని దినశుద్ధి నిరూపించి శ్రీకృష్ణుని జన్మనక్షత్రంబునకు గార్యసిద్ధి కనువగునక్షత్రంబును, బయనంబున కనువగునక్షత్రంబును, సమన్వయపఱిచి చంద్రతారాబలంబులుగల రేవతీనక్షత్రంబు నిర్ణయించి, శ్రీకృష్ణునిప్రయాణమునకు సన్నాహపఱిచి, యుధిష్ఠిరుండు తనవారితోఁ దనయావాసంబున కేగెను.

శ్రీకృష్ణుండును బ్రయాణసన్నాహంబొనర్చికొని, మఱుదినంబున సాత్యకి సమేతుండై, చక్రగదాద్యాయుధంబులు రథంబుననునిచికొని యుచితగతిం బయలుదేరి సుశోభనంబుల నవలోకించుచు ధర్మజునావాసంబుతెన్నునఁ దనయరదంబుఁ బోనిచ్చుచుండెను. మాధవురాక కెదురుచూచుచుండిన యజాతశత్రుం డాతనిం గని యలరి యాతనిరథంబు నాపి యిట్లనియెను.

"కృష్ణా, నీవువచ్చుచున్నాడవనుమాట చెవింబడుటయెతడవుగ మాతల్లికిఁ బ్రాణములు లేచివచ్చును. అమందానందముఁ జెందును. మాపనుపున ననుపరిపైవచ్చితివి కదా యనియును, వచ్చిననీవు తన మేనల్లుండవుగదా యనియు, నొడఁబడదెలియనియానందముననుండఁగలయామెకుమాయందఱిసేమము సెప్పిమా మొక్కులఁదెల్పి నీసాంత్వనాలాపములచే నామె మనమ్ముననున్న యుమ్మలికమ్ము నిర్మూలనమ్మొనర్పుము.

"మేమానాఁడడవులకేగుచుంట మమ్మనంపకముసెట్టి నెంతయొదూరము మావెనువడివచ్చినప్పుడామె మోమున దైన్యరేఖయును, కనుదామరలనుండి జలజలరాలుచుండిన యశ్రుకణంబులును జూచియు మేమేమియుఁ జేయఁజాలక యామెనువీడిపోవలసివచ్చినది. మేమేపురము ప్రత్తులముఁడేయు లాక్షాగృహదాహము నాఁటనుండియు నామె దిక్కులేనిదానివలె నెన్నియేని యిక్కట్టులంబడుచునేయున్నది. దుఃఖకారణములైన నన్నియు నంతరించుసమయ మాసన్నమైనదియని నామాటగాఁ జెప్పి, నీవామె నూఱడిలఁజేయుము. నీవ తనకుఁ గలవని యామెయూహయు ననుచుండును.

"పురవృద్ధులును, సుహృద్బాంధవులును, ఇతరపురజనులును ప్రీతినొందు తెన్నునఁ బ్రణామాదివిధులనొనర్చి మఱియు నాపలుకుల నెఱుకసేయుము.

"ముఖ్యస్థుండును బరమహితుండునునగు విదురుంగాంచి నాకైయాతనిఁ బరిరంభణముసేసి బాంధవసాంద్రపరమున సంభాషింపుము. ఇంకేమి సెప్పుదును"

అర్జు:— కురుసభఁగలనారంపటు వినునట్లు: ధర్మభూపాలుఁడు సగమురాజ్యము గైకొనంగలవాఁడని జనపతికార్యనిశ్చయము, నిశ్చయవాక్యముల నీవు దెల్పినవిని, యనుజసమేతుఁడౌ సుయోధనుఁడు సామ్యమునఁ బాలొసంగెనేని మేమెంతయు నీయకొందుము. అటుగాక నీమాటకొకింతయెదురాడెనేని యాపక్షముననున్న యందఱను సపుత్రమిత్రముగ నేనొక్కఁడ నిట్టెపాతిపెట్టెద.— ఇదియె నామాట.

భీముఁడు:— మేలు-ఫల్గుణా! ఎంతయానందదాయకముగఁ బలికితివి! ఎంత జరుగఁదగినదియో, యంతయు జంకక చక్కఁగఁబల్కితివి. ఎల్లవేళల నొకరి ననుసరించిపలుకుటయె యలవాటైన నీ విపుడింతస్వతంత్రముగ నింతటియుద్రేకమునఁ బల్కితివి గావున నీకుఁ గాఁదగినకార్యమిపుడె నిశ్చయమైనదని స్థిరపఱుపవచ్చును.

నకులు:- కృష్ణా! సెహ్యమొనర్చికొనివచ్చినఁగదా నినునంపినందులకు సార్థకత|

సహ:—సంజయునట్లుకాక నెయ్యమొ కయ్యమొ తేల్చికొని రమ్ము.

ద్రౌపదీసహితులగుపాండవులు కృష్ణున కిదివఱకే నివేదించిన తమతమ సందేశపుఁబలుకులు చాలకయో యనునటుల నిపుడతఁ డరదంబునఁగాలుపెట్టి పోఁబోవుచున్నసమయానఁగూడ మఱలఁ జెప్పఁదగిన తుదిపలుకులుసయితము చెప్పి కృష్ణునుచిత ప్రకారంబునవీడ్కొలిపి వారలు తమతమమందిరములకేగిరి.

సాత్యకి సహితుండగు కృష్ణుండు దారుకుంజూచి "కరి నగరంబు పెంటదెరువుం గైకొని, నీచతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంతసమీచీనంబైన యానంబున, నరదంబు పోని" యని కట్టడియొనర్ప నతం డతిరయంబున రథంబు గడపుచుండెను. మార్గంబునం బడిపోవంబోవ నొక్కెడ నారదజమదగ్నికణ్వాది మహామునులం గని శ్రీకృష్ణుండును రథంబుడిగ్గి వారలకు నమస్కరించి సభక్తి తాత్పర్యంబులఁ గుశలమడిగి వారియాగమనకారణమునడుగ నారదుండిట్లనియె.

"పుణ్యచరితుండవగు నినుఁజూడ, నీవు కౌరవసభను జెప్పుమహోపన్యాసంపుభంగి నాకర్ణింప, విదురభీష్మాదులు నీ పలుకులువిను తెఱంగును, అందుకు కౌరవ్యులొసంగు ప్రత్యుత్తరంబులరీతియు, నెఱుంగువేడ్క నాహస్తిన కరుదెంతుము." అనుటయు నారాయణుండు హర్షమంది యట్ల చేయుండనియెను.

ఆమునీంద్రులును శ్రీకృష్ణునిదీవించి—"అనఘాత్మ, నీవుకరిపురికరుగుము-ఏము నటకేగుదెంతుము". అని వీడ్కొల్పిరి.

అరదంబు వడివడిఁ గడచుచుండెను. సాయంసమయ మగుసరికిఁ గుశస్థలిం జేరెను. అచ్చటి విప్రజనంబు లెదురుసని యదునందనునకు నర్ఘ్యపాద్యాదులొసంగిన తమతమగృహంబులకు రానాహ్వానింప నతండును బ్రసన్నవదనంబున నంగీకరించుచుఁ దగినవారల గేహంబులకుంజని వారొసంగు నాతిథేయసత్కారంబులకలరి మఱలివచ్చి విశాలరమణీయప్రదేశంబునఁ బటకుటీరంబునెత్తించి విడిసి నిజోచితప్రవర్తనలనుండెను.

మఱునాటి దినంబునఁ బయనంబుసాగించి శౌరి కరినగరమ్ముఁజేరఁగలఁడు.

రెండవ ప్రకరణము

(i)

కరిపురికరుదేరనున్నాఁడు కృష్ణుఁడని వినినధృతరాష్ట్రునితలఁపులు: కృష్ణునకు స్వాగత మొసంగు సన్నాహములు: దుర్యోధనుని యూహలు: ధృతరాష్ట్రదుర్యోధనుల సంభాషణము. కృష్ణుని బంధించుటకు దుర్యోధనుని ప్రయత్నములు: పుణ్యాత్ము లాతనివారించుట.

అన్వ్యాలి కథ.

శ్రీకృష్ణుఁడు పాండవపక్షమునుండి రాయబారియై వచ్చుచుఁ గుశస్థలంబున విడిసెననియు, మఱుదినమునఁ గరినగరముం జేరుననియు విని ధృతరాష్ట్రుండు తనసభకు నిజతనుజప్రతతిని బురోహితహితామాత్యవర్గంబును రావించి, శ్రీకృష్ణునియాగమనముం గూర్చి ప్రసంగించి "సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మనమభిగమ్యుల మైతిమి. మనకింతకంటెను జెంపెయ్యది! అట్లగుట మన మాతని కింపునింపు తెఱం గేర్పఱింపవలయు" ననియెను.

ఆపలుకులువిని దుర్యోధనుఁడు నగరెల్లను శోభనశిల్పముల నలంకారంబు సేయను, బురమలంకరింపను, నేర్పరుల నియమించి, వాసుదేవునకు విశిష్టంబుగాఁ దగియెడు వృకస్థలమందుఁ జప్పరములిడ నాజ్ఞల నొసంగి పురంబున నుత్సవంబుసాట నియోగించి, కృష్ణునకై దుర్గాలుగాఁ దగిన యుత్సవములు సేయఁ గట్టడియొనర్చెను.

—ధృతరాష్ట్రుఁడు—

విదురా, వృష్ణివంశశ్రేష్ఠుండగు నాకృష్ణుండేరి దెస సంతుష్టుండగు, వారికె శుభంబగు: ఏరిదెస నాతం డనాదరంబు సేయు, వారికశుభంబగుట తప్పదు; అట్లగుట నాతనికి వలయు పూజ లాచరించి, యాతనికమూల్యరత్నంబులు గానుకలొసంగియు నాతనిచూడ్కి కింపునింపువానినెల్ల నాతని కిచ్చియు సంతృప్తుం జేయవలయు.

—విదురుఁడు—

ఆంబికేయా, నీనుడివినదియెల్ల మేలయగుంగాని పాండునందనులకు నైదూళ్లైన నిచ్చుటకొప్పని నీయునికియు, నిచ్చుటకోపని నీకలిమియు, నవేల? ఎల్లని లంచమిచ్చి శౌరినివశపఱుచుకొని కార్యగతిమార్పఁ దలంచుచున్నావే కాని యాతనికి మేరుసదృశార్థము నొసంగినను, తనభక్తుండగు పార్థు నాతం డెడఁబాయునే! అట్లగుట నిట్టి యీవు లాతనిసంతృప్తు నొనర్పఁజాలవు. ఆతం డేపనికని మన కడకువచ్చు నద్దానిని వంచింపక చేయుటకంటె నాతనిఁ బ్రముదితాత్ముం జేయఁజాలిన దింకొకటి లేదు.

—దుర్యోధనుఁడు—

నాయనా! కృష్ణుని పదునెఱుఁగక మన మేమొసంగినను ఆతఁడు పాండుసుతులనుండి వేఱగునే! మన మిపుడేమిచ్చినను ధార్తరాష్ట్రులు బెదరిరని మనల నగరే నాగరకులెల్లరును! ఆతఁడుపూజనీయుఁడెయగు: నే నెఱుంగుదు. కానుకలొసంగిన మనయుపగతు లెంతయు ననదతనమాపాదింతురు. కావున నీఁగిమాటఁ దలపెట్టకుము.

—భీష్ముఁడు—

వైచిత్రవీర్యా, నీవును నీకొడుకును ఆతనికేమే నిచ్చిన నొకటియు నియకున్న వేఱొక్కటియుఁగాదు. అతఁడు సేయఁబూనిన పనిఁ దప్పింప నేరికింగాని కానిపని. ధర్మార్థాయాధమగు నాతనిపలుకుఁ గైకొని మీరలు తీర్చితిరేని యంతయు సానుకూలమగును.

—దుర్యోధనుఁడు—

కృష్ణుం డేమనినను విననొప్పుదు: ఆతని పనుపేమఱక నెఱవేర్తు: కాని, పాండుసుతులకు రాజ్యంబున నగపాలీఁ దగు ననకున్న నాతని కాతిథ్యం బొసంగి సగౌరవంబుగ నర్చింపువాఁడను. అట్లుఁ గాక తనపట్టిన కుంతిబొట్టెలకు రాజ్యంబు పాలుసేసి యియ్యక

తప్పదని నిర్బంధించెనేని వేఱొకపనిఁగూడఁ జేయఁదలంచితిని. వారి కేడుగడయగు నాజనార్దనునిఁబట్టి బంధించివైచినచో ధర్మజాదులు ఱెక్కలుదెగినపులుఁగులై, మఱిదిక్కులేక- నాకువశంవదులై, విధేయులై, మెలఁగుటయేకాక, వారిపక్షమున వచ్చియున్న పాంచాల యాదవమాత్స్యాదులును వారిబంధుమిత్రులును నాకువశవర్తులగుదురు. నేన సమస్తదేశముల నేలుదు. ఇందులకుఁ దగిన యుపాయ సహాయ్యంబులు ననువుసేసెద. ఇటుపైని కేమిచెప్పెదవో చెప్పుము.

— ధృతరాష్ట్రుఁడు —

జగద్ద్రోహముగా నాయన! ఇంతటిదారుణపుటూహ నీ కెటు దోఁచెను! మహామహుండగు నవ్వాసుదేవునిరాక మన కురువంశమున కెట్టులఁగీడయ్యెను! మధ్యవర్తియైవచ్చుచున్న మాధవుఁడు నీకేమిచేటొనర్చెనురా! ఇంతకును నాతఁడు దూతకార్యము నిర్వర్తింపవచ్చుచున్నాఁడేకాని మన కెట్టికీడునుం దలంచివచ్చుచున్నట్టులు గోచరింపలేదే! ఆతనిమాహాత్మ్యంబును, ధర్మోత్సాహంబును, దూతత్వమును నీవలన నంతటి కఠోరకర్మనొందింపఁ జేయఁదగినవి కావు. ఇట్టిప్రయత్న ముడుఁగుము. దూతను హింసించుట ధర్మవిరుద్ధము. ఇపుడు నీవిట్లొనరించినచో లోకమంతయు నొక్కపెట్టున మనపైఁ దిరుగఁబడఁగలదుసుమా. అన్నింటికంటె—నాతనిని వాసుదేవునిఁగా నెన్నుచున్నదీజగ—మనినీవుగుర్తింపఁజాలకున్నావు. ఇట్టి దురాలోచనము నిపుడైనఁ గట్టిపెట్టుము.

— భీష్ముఁడు —

వైచిత్రవీర్యా! నీకొడుకు మిగుల మూర్ఖుఁడయి ప్రాణగొడ్డంబైన కార్యముసేయఁ దలంచి యకారణ వినాశమభ్యర్థించుచున్నాఁడు. ఆచక్రియెడ వీఁడింతలుసేయ నుంకించెనేని, దానును బ్రధానులును సహాయులును దప్పక వినాశంబునొందుదురు. వీరీకార్యము సేయుదురుకాక-సేయకుందురుకాక. సంకల్పించి రంతియచాలు.

కార్యములకెల్ల సంకల్పముమూలము. ఇంతటిఘోరకార్య మామహామహునెడ విచారించిన దుష్టాత్ములు నష్టాత్ములుకాక తక్కుదురే! నే నిట్టిక్రూరవాక్యములు విని సహింపఁజాల.

అనుచు నంబికానందనునితో నైనను జెప్పకయ గంటునెట్టికొనినమొగాన దిగ్గనలేచి నిండుకొలువునుండి వెడలెను.

— ధృతరాష్ట్రుఁడు —

సుయోధనా! కొఱగాని కార్యంబులెప్పుడు మనంబునందలంచితివో యప్పుడె చేయంగలాఁడవు: నే నెఱుంగుదు. అట్టిది వలవ దుడుగుము: దీనం జేటుమూఁడునుజుమ్ము మనకొలానకు. నీకింత మంద బుద్ధి యెట్లు లలవడెనురా!

అని యాంబికేయుం డనుచుండ దుడుకుఁదనాన దుర్యోధనుఁడు కొలువుచావడివీడి వడివడి వెడలిపోయెను. ధృతరాష్ట్రుఁడును పత్సుయోచితవర్తనంబుల నుండెను.

రెండవ ప్రకరణము
(ii)

కుశస్థలమునుండి కరిపురింజేరుచున్న కృష్ణునెదుర్కోలు: కృష్ణుని హస్తిపురప్రవేశము: కృష్ణుఁడు ధృతరాష్ట్రుని సంబోధించి ప్రసంగించుచుఁ జంద్రవంశపురాజుల నుతిసేయుచు భీష్మద్రోణ కర్ణాదులతో నుపలాలనము సేయుట: విదురునింటికి మరలుట: కుంతిని దర్శించుట: కుంతీకృష్ణులు సంభాషించుట: దుర్యోధనుని నికేతనమునకుఁ గృష్ణుఁ డేగుట: కృష్ణునిఁ దనయింట విందారగింప దుర్యోధనుఁడు కోరుట: కృష్ణుఁడు నిరాకరించిపలికి విదురునింటికి మరలుట.

హస్తిపురమున శ్రీకృష్ణుఁడు.

మఱునాటి వేకువసమయానఁ గుశస్థలవాసులనుపఁ గృష్ణుండు పయనంబుసాగించి వృకస్థలంబుచేరి తనరాక కెదురుసూచుచున్న దుర్యోధనపరివారంబును జూచి తనకనియనిపిన మధురాహారంబుల ననుభవింపనొల్లక, పరిగ్రహణమాత్రమ్మున ననుభవించిన విధంబు తెలిపి యందునిలువక పయనంబు సెలిపి హస్తినాపురంబుసమీపించి తనకు స్వాగతంబొసంగవచ్చిన భీష్మాదికురువృద్ధులను, ద్రోణాచార్యాద్యాచార్యవర్గమును, దుశ్శాసనాదికుమారగణంబును గాంచి, దుర్యోధనుం డప్పుడటకు రామినెఱింగి, వారల నయ్యయి విధంబుల గౌరవించి తనవాఁడగు కృతవర్మకు సవిశేషస్నేహంబుసేసి, యతం డా నేరువకురా సమస్తజనంబులు బరివేష్టింపఁ దన రాకకు సర్వవిధమ్ముల నలంకృతమ్మైన కరిపురమ్మునఁ బ్రవేశించెను. శ్రీకృష్ణునిరథంబు రాజవీథిని నడచుచున్న సమయాన హస్తిపురవాసు లాబాలవృద్ధముగ శ్రీకృష్ణసందర్శనలాలసులై మ్రొక్కుచు, వినుతించుచు, రథంబు సమీపించుచున్నారు. వారి సందడినివారించువేత్రహస్తులనపవారించి, కేశవుఁడు తనయరదంబుమందగమనంబునం బోనిచ్చుచు, ముందట మణితోరణాలంకృత సుందరమందిరద్వారంబుఁ బ్రవేశించి, కక్ష్యాంతరంబులు గడచి చనిచని సింగంబువాకిలిఁజొచ్చి యటఁ దనయరదంబు డిగ్గి సానురాగవీక్షణముల నెల్లరంజూచుచుఁ దనప్రమోదమును బ్రకటితం బొనరించెను. తనకని తెచ్చిన యున్నతాసనంబునఁ నుపవిష్టుండై సాత్యకిం దగినవారితో యోగక్షేమాది కుశలవార్తలు నడుపంబనిచె.

ఆ రాజానుమతిని విహితప్రకారంబుగ నుచితమర్యాదలు శ్రీకృష్ణసాత్యకులకు నడచినవి. మహీపాలుండును దక్కటి దొరలును సామంతులును దత్తదుచితాసనోపవిష్టులయి ప్రఫుల్లవదనులయి యుండిరి. అప్పుడానిండు కొలువు సూర్యోదయసమయమునందలి కమలాకరంబుచందంబున విరాజిలుచుండెను. కృష్ణుఁడు ధర్మనందను పలుకులుగా నాంబికేయునకుం బెద్దవారలకుం బ్రణామపరిరంభణ ప్రముఖసముచిత సంభావనంబులువలికి సౌహార్ద్రభాషణంబుల సంభాషించుచు నెల్లరకుం బ్రమోద మొనఁగూర్చుచుండెను.

—కృష్ణుఁడు—

వైచిత్రవీర్యా, మరల నెంతకాలమునకీ కరినగరిం జేరితిని! ఆ నాఁడు—పాండవులను ద్రుపదపురమునుండి నీయిచ్చమెయిఁ దెప్పించి, సకలలోకకర్మసాక్షియు, నేనును, ఈకురువృద్ధులును సాక్షులమై యుండఁ బాండురాజవిభవ మంతయుఁ గొనుండని ధర్మజు నర్థరాజ్యంబున కభిషిక్తుం జేసిన నాఁడీనగరమునకు వచ్చితిని; మరల నీనాఁడు ధర్మజుధర్మమున రాఁగలిగితిని. ఈనడుమ నెంత ప్రయత్నించినను రాఁజాల నైతిని. మిమ్మునందఱ నిప్పు డిటఁ గాంచి, కృతార్థుండ నైతి. ప్రతిష్ఠగాంచిన పౌరరాజ్యరమనుగాంచిన నాదృక్కులు చరితార్థములు.

శశాంకునితోఁ బ్రారంభింపఁబడిన మీచంద్రవంశమున నాలవ తరపురాజగు యయాతి, శర్మిష్ఠయందుఁ బూరునిం గనెను. ఈపూరుని కాలమునుండియు మీవంశము పౌరవంశమయ్యెను. ఆతని కేడవతరపు మనుమండును రాజును నగు దుష్యంతునకును శకుంతలకును జన్మించిన భరతుని కాలమునుండియు భారతాన్వయమనిపించుకొనిన మీవంశ మాతని కెనిమిదవ రాజగు కురువునాఁటనుండియుఁ గురువంశమనిపించుకొనినది. ఈకురువునకుఁ బినతాతయగు నజమీఢునివంశమున నాఱవవాఁడగు పృషదునిపుత్రుఁడే యిప్పుడు పాంచాలరాజగు ద్రుపదుఁడు. కురువంశమున నాఱవవాఁడగు ప్రతీపుని కుమారుఁడగు శంతనుని మనుమలు మీరు. కావునఁ గురువంశమునుండి చీలి వేఱయి

పాంచాలమను స్వతంత్రరాజ్యమేర్పఱచి కొనిన పాంచాలురును మీరును 'తాతాసహోదర' వర్గములోనివారె. ఇప్పటిపాంచాలమును మీపౌరరాజ్యములోనిదె. శంతనుపినతండ్రియు రాజునునగు హస్తిచే నిర్మింపఁబడుట నీనగరమునకు హస్తిపురిమను కీర్తి నామముగల్గె.

శంతను ననంతర మాతనిమనుమలగు నీవును విమలచరిత్రుఁడౌ పాండుఁడును ప్రజాభిప్రాయానుగుణ్యముగఁ బ్రవర్తించితిరి. నీతమ్ముండగు పాండుఁడు హస్తిసామ్రాజ్యమునకభిషిక్తుండయ్యు నీవలని ప్రేముడికతమున, నినుఁబితృతుల్యుంగాఁదలంచి నిను రాజ్యంబుననిల్పి, తాను దేశాలంబడి తిరుగుచు శత్రుజనభయంకరుఁడై పరరాష్ట్రములఁగెల్చి కురురాజ్యము నభివృద్ధిపఱచి ప్రజాసౌఖ్యమునకె పాటుపడుచుండుటను, నందఱప్రేమమునకును నాతఁడు పాత్రుఁడయియుండెను. నీకును, నీతమ్మునకును భేదములేమి మీరిరువురును సమాన బాధ్యతఁగలిగియే రాజ్యవ్యవహారములు చక్కఁజూచుకొనుచుండిరి. మీవంశానుక్రమణికయు, మీరాజ్యవ్యవస్థయుఁ, జూచినచో, నీభ్రాతృవర్గములోనివారగుపాంచాలు రిపుడేలుచున్న పాంచాలరాజ్యము కూడ నీహస్తిసామ్రాజ్యమున నొకభాగమయియుండెను. వర్ణనాతీతమగు నింతటివైశాల్యముగల కురుసామ్రాజ్యమ్మున కేకఛత్రాధిపత్యమువహించినమీయన్వయముమిగులఁబవిత్రమై సంస్తుత్యమైనది. మిమ్మును మీరాజ్యమును మరలనింతకాలమునకుఁ జూడఁగంటిని.

(భీష్మునెడఁజూచుచు) నీకతమున రాజ్యప్రతిష్ఠాపనవహించిన వీరిచే రాజ్యభారము సక్రమముగ నిర్వహింపంజేయుచున్నావుకద! నీకుఁగా సంసారములేకున్నను నీతమ్ములబిడ్డలనె నీబిడ్డలుగనెంచి వారిలోవారికిఁ గయ్యములు రాకుండఁ గుటుంబకలహములు పెరుగకుండ రాజకార్యములు నిర్వహించుటకు నీకే సరి! నీవలననె యింత దూర మీయన్వయ మిట్లునడచినది బ్రహ్మవిద్యాధురంధరుండవై, రాజ్యపాలనాధూర్వహుండవై, బ్రహ్మచర్యవ్రతనిష్ఠాగరిష్ఠుండవై నెగడిననీసచ్చరిత్ర మాకల్పముగ నీయిలాతలమున వెలయఁగలదు.

(ద్రోణుం జూచుచు) కుంభసంభవా, నీచే నస్త్రవిద్య పునఃప్రతిష్ఠితమైనది: నీకతనంగాదె కోదండపాండితీమహిమాన్వితులగు భారత వీరవరేణ్యులెల్లరును వెలయంగలుగుట!

(కర్ణాదుల నుపలక్షించి, సుయోధనునిసాదరదృక్కుల నవలోకించుచు) గాంధారీనందనా, జాతిరత్నములలో నొప్పుదురత్నముల నెల్లేర్చికూర్చి నీకడనె యుంచుకొనిన నీనేర్పరితన మెంతని నుతింతును!

(ధృతరాష్ట్రినుద్దేశించి) అంబికేయా, వేళయతిక్రమించుచున్నది. నేనిఁక విదురునింటికిఁబోవలయు: నింకనుజూడఁదగినవారి నెల్లఁ జూచి మరలివత్తు: ననుజ్ఞ నొసంగుము.

అనికృష్ణుఁడు ధృతరాష్ట్రిననుమతిఁగొని విదురుసదనంబునకుం జనియెను.

విదురుం డాపలుకు లాలించినతోడన సంభ్రమోత్సాహంబులు మనమునఁ బెనఁగొన నిజగృహంబునకు మున్ముందుగఁబోయి వలయువాని నయ్యెడ నాయితంబు చేసి మంగళాచారప్రకారంబులఁ గృష్ణు నెదుర్కొని భయభక్తివినయస్నేహానందంబుల శ్రీకృష్ణునకు దేవోపచారంబుల నర్చనల నెఱవేర్చి, పాండవేయులసేమంబరసి తెలిసికొని యుచితసంభాషణంబు లొనర్చుచుండెను.

కృష్ణుఁడు, "విదుర, నేనిపుడు కుంతినిదర్శింపవలయు." ననియెను.

—విదురుఁడు—

చిత్తమట్లసేయందగును: నాయొసంగునాతిథేయసత్కారంబుల స్వీకరించి నేఁటికినాయింట నారగించి నన్ను ధన్యుంజేయఁ బ్రార్థించుచున్నాను. ఏతత్ప్రయత్నములనుండ నాకనుజ్ఞ నొసంగుఁడు.

కృష్ణుఁడు, "అట్లనె కావింపుము." అనెను.

అంతం దనవెంటనంటి వచ్చుచుండిన సాత్యకికృతవర్మలఁ దోడ్కొని కుంతీమందిరంబున కేగి, కృష్ణుండామెను దర్శించెను.

కుంతియుఁ గృష్ణుం గాంచినంతనె తనసుతులను సాక్షాత్తుగఁజూచినట్లు శ్వేగమొంది యడలుపుట్టుట నవ్వాసుదేవు మెడఁ గట్టిగఁబట్టుకొని పేరెలుంగున నేడ్వ సాతండును నామెనూరార్ప, నెట్టకేలకయ్యవ్వయు నేడ్పుడిగి యాతని కానవవిశ్వాస

వాద్యుపచారంబులు చేయించి, తత్సమీపంబున నుచితాసనంబునఁ దాఁగూరుచుండి గద్గదకంఠియగుచు నిట్లనియెను.

— కుంతి —

కృష్ణా, నీకుం దెలిసినవారగుటఁ బాండుపుత్రులు పుణ్యచరిత్రులై శూరులై నెగడినారు. పెక్కండ్రు మన్నింపఁగొలువ రాజ్యము లేలఁగలవారు భీకరంబులైన యడవులకేగి డొల్లటనించిరోకద! నాహృదయము గైకొనిపోయినవారు నాశరీరమునుగూడ వెంటనిడికొనిపోక పోయిరి! వారుపడిన యిడుములం దలంతుమన్న నిప్పటికినిఁ బారము గాంచఁజాలకున్నాను. జనకవిహీనులై, జననిం బాసి బానిసటీకమున విరటుపాలంబడి, భంగపాటును, దుఃఖపాటును, సంకటపాటును, నెట్లు సైరించిరోకదా!

ఆనాఁ డా జూదఁపుసభం బుట్టిన విడ్డూరంబులు దలంపునకువచ్చి నపుడెల్ల నాహృదయంబున నుల్కాముఖీజ్వాల లుద్భవిల్లి నట్లగుచుండును. సుగుణములకెల్లఁ గుదు రనఁదగిన మా విదురుఁడు దక్క దక్కొరులా యనయముఁ జూచియు నేమియు ననఁజాలకుండిరి.

అని తొల్లింటి వేదనల మరలమరలఁ గృష్ణునిమ్రోలఁ గొరలించుచు నా ఖేదవా పూర్ణహృదయయై అశ్రుకణపూర్ణలోచనయై విషణ్ణచిత్తయగుచుఁ గుంతి మరల నిట్లనియె.

ఈకష్టములన్నియు నొకయెత్తును, బావగారికొడుకులచే నదయమగు పట్టాన్నము గుడుచుట యొకయెత్తునునై నను వేధించుచుండ భర్త చావుకన్న, కన్నకడుపునకు దూరమగుటకన్న, నింకను నైచ్యమున్నదే! ఆ దుర్యోధనుఁడు వీరి కీనొప్పఁడనియుఁ, తండ్రి కుమారు నదల్పఁజాలడనియు నిందింప నేల? కురువృద్ధుఁడౌ బాహ్లికునిఁ బాడింప నేల? విదురుని వేధింప నేల? ఇట్టికౄరకుటుంబకునకు, ఇట్టియసుర సాంప్రదాయకులకు, ఇంతతమోగుణప్రధానులకు, నను నిచ్చివేసిన మన వారి ననవలె నంతేకాని, యొరుల నన నేమి ప్రయోజనము? ఇంతకును నా నొసటివ్రాత లిట్లుండ, నీయంతవారైన నేమి సేయఁగలారు!

వచ్చినదాని ననుభవించుటకంటె, సంఘటనలఁ బ్రతిఘటింపఁ బ్రయత్నించుటగాని, ధిక్కరించిపలుకుటగాని పలుగాకితనమెయగుం గాని కాకున్న నేమిచేసినను ఏమనినను దగినవిషయమెయగును.

రాచకూఁతు లేకొఱకయి కొడుకులఁగాంతురో యట్టిస్వధర్మోచిత కార్యములకుం దగినయదనిదియయని, ఇఁకఁ దడయఁదగదని, భీమార్జునులతో నామాటలుగాఁ జెప్పుము.

రాచపుట్టువుబుట్టినవారికి వేడికోలును, దైన్యమును గలుగుట
నిప్పుకలు వేఁడిమి సెడుటయె యగును: రాచబిడ్డలకు స్వభుజబలమున జీవిం
చుటయె ధర్మము: మెత్తపడుట నింద్యము.

అని యమనందనుతో ననుము. 'ఇఁకఁగార్యము నడిపింపందగు నీవిప్పటినమానస ముడుగరా' దనిద్రుపదాత్మజుతోఁ గొతుకుంచక వచియింపుము.

అచ్చపుఁగిన్కయే వహించిరయేని, భీమార్జునులకు నష్టము లేమి నేనెఱుంగనిదానను గాను. అంతంతలునయి, యహితనులు వడియు వాని నీగవలదా మనకు? అట్టియాపనికెల్లఁ బాండుపుత్రులె తగినవారు: వారు నీవెటులనడిపించిన నటులనడతురు. నీవిఁకఁదడయక నాదుఃఖానలముఁజల్లార్చి నాయలఁతఁదీర్చి మముఁ దరిఁజేర్పుము.

ఇంతకన్న నేనేమనఁగలను!

— కృష్ణుఁడు —

క్షాత్రధర్మముఁజూపునీపలుకులు నాకే యడలుపుట్టించుచున్నవి. నీపుట్టినయింటికిని మెట్టినయింటికిని వన్నెవెట్టినట్టిగట్టినడవడిగలనీహృదయతాప మడంగుసుసమయము వచ్చినది. నీతనయులును గోడలును సేమముననున్నారు. వారికై నీవావంతయుఁ వంతనందఁదగదు. నీకొడుకులును గోడండ్రును నీకు నమస్కారములుపెట్టి తమయుల్లముల నినుఁగౌఁగలించినారు. వీరజనోచితసౌఖ్యమాకాంక్షించునీసూను లన్యసుఖాభిలాషులగుట కంతయల్పబుద్ధులె! శత్రుకులోత్పాటనవిధి

యాచరించి యున్నత రాజ్యాభిషేకోత్సవమందు వారి ననతికాలము
నవె మీరాజీనకుతుకమ్మునఁ జూతువుగాక!
కుంతి:—నాయనా! ముందేమిజరుగనైయున్నదియు నీకుఁదక్క నొరులకుఁ దెలియకుండుట లోకానకెంతయు గోచరము: ప్రద్యుమ్నాదికుమారుల నెట్లుఁజూతువో యట్లుఁ జూతువు పాండుపుత్రులనందఱు; అల్లయ్యును నీకుఁ గడుంగూర్పుసఖ్యైన ప్పుసరసి పరిరక్షణ మొనర్తువు. నామానసపుటారాటము వోఁదోలుదువు. మాకన్న రక్షకులు నీకును నీకన్న రక్షకులు మాకును వేఱుగ నెవరునులేరు. మిత్రుండవును గురుండవును నగు నీవు హితమును గర్తవ్యంబును మదనెంచి నిర్ణయించునట్లు పాండవులు ప్రవర్తింతురు ఇంతకును నినుఁ జేరినవారి నాపద లాదవం జాలవుకదా! వారలకె యాన నేగి రవులకును, జగంబులన్నింటికిని, నీవ చేయుగడ. నీపలుకవ నిఖిలభువనంబులకును వేదప్రమాణముకదా?

కుంతీపలుకులిట్లు ప్రసన్నవదనుండై విని, నమస్కరించి యాశీర్వచనము నడసి, సెలవునైకొని, యచ్చో వీడి, దుర్యోధనుమందిరాభిముఖుఁడయి "సాత్యకీ, రావోయి-చనము కృతవర్మసమేతులమై సుయోధనుసదనమున కేగుద" మని గోవిందుండు వారిరువురందోడ్కొని, రసకైయలంకృతమైయున్న గాంధారీనందను మందిరముం ప్రవేశింపఁబోవుచుండ నచ్చటిద్వారపాలకులు ససంభ్రములై రారాజున కెఱుక పఱిచిరి. అంతనతఁడు దుశ్శాసనకర్ణశకునిప్రభృతులతో నెదురువచ్చి ప్రత్యుత్థానంబు గావించి యుచితమర్యాదల వారివారి కారిఁగ నాద్యుపచారంబులఁ దానుందమ్ములు నాచరించి సమాదరవాక్యములనడుపు మధుపర్కాద్యుపచారంబులు గావించినారు. అంత నమ్మురాంతకుండు సుయోధనాదులతో లోకవ్యవహారములంగూర్చి ముచ్చటింప గాంధారీసుతుఁడు బంధుప్రీతి నొప్పుచుండెను.

—దుర్యోధనుఁడు—

వాసుదేవా, నీ రాకరాకయుంబోలె మాలోచనచకోరంబులకుఁ బెనుపండువయొనర్చుచున్నది. అప్రయత్నముగ సమకూడిన నీయాగమనము కతమున మాయింటఁ బండువు సేయనెంచి, తదనుకూలప్రయత్నములఁ జేయుచున్నాను. నీకుఁ బ్రీతికరములగువంటకములు సేయింపఁ దలంచితిని. మానికేతనమున నినుఁగలసికొనుభాగ్య మబ్బినందున,

నేను భాగ్యవంతుండ నైతినని గర్వించుచున్నాను. నేడు మాకతిథివై మముఁ గృతార్థులఁ జేయుము.

కృష్ణుఁడు:—నేఁడిందుల కియ్యకొనంజాల.

'వింటివిగదా-అంగరాజా: తొలుతనే యీతనిపలుకెంత యొఱుసుగ నున్నదో! ఇఁక నీపెనుపరినందమెల్ల మున్ముందు విందువుగద.' అనుభావమును విస్పష్టమొనరించు చూపుల దుర్యోధనుఁడు కర్ణునిఁ జూచి రహస్యముగఁ బల్కెను.

దుర్యో:—(కృష్ణునిదిక్కు మొగంబయి) బావా, నీయాతిథ్యభాగ్యంబు గోరి నిన్నుఁ బ్రార్థింప నీవిట్లందువని నేననుకొనలేదుసుమా: నీవు కౌరవ పాండవులకు నారయనొక్క రూపగుబంధుఁగుండవును, అసదృశధర్మాచారపరుండవును, మాతండ్రికిఁ గడుంగూర్చు ప్రియుండవును, అగుట నినుసంప్రీతునొనర్చుటయ నాకుఁగర్తవ్యంబనియెంచి, యెంతయునినుఁ గోర, నీవిట్లంటకుఁ గతం బెఱుంగఁజాలకున్నాను. ఈ నీవర్తనము మాకాలమున కెంతయు మచ్చఁదెచ్చుంజుమ; ఇది నీతికిని, బాంధవంబునకును బాహిరంబనియైనఁ దలంపవలదా?

కృష్ణు:—సుయోధనా, నేనిపుడుదూతను: దూతకార్యభారవహుండై పరికడకువచ్చునో, వారియింట భుజింపరాదు: వారిచ్చుబట్టఁ గట్టరాదు: వారిదు కానికలఁ గైకొనరాదు. ఇది ధర్మశాస్త్రవిహితము. కార్యము దీఱినపిదప మీసత్కారంబుల నేనందుకొనఁదగును.

—దుర్యోధనుఁడు—

మాయూరరుఁ దెంచితివి: మముఁజూడవచ్చితివి. నినుసగౌరవంబుగఁ బ్రత్యుత్థానంబొనరించి యర్ఘ్యపాద్యాదివిధులఁ బూజించి మా తండ్రి మధుపర్కాద్యుపచారంబులొనర్చెను. నాకుఁ జేతనైనంతవట్టు నేనునుఉత్తమభంగినర్చించితిని. నీవు వచ్చితివికదాయని నాయింటఁ బెనుపండువు సేసికొననెంచి యింతదూరము ప్రయత్నించితిని. నీవుమా యింటఁగుడువనొల్లక యిట్టె వేగపడితివి. ఇట్టిది నీయట్టిచుట్టమునకుఁ బొందనిది. నీవువచ్చిన కార్యముదీఱుఁగాక: తీఱకుండుఁగాక. కార్యంబు

తెలుంగువచ్చినయపుడు దానితెలుంగునకుఁ దగినపోలిక యప్పుడాడు కొనవచ్చు. ఇపుడె నీవిటుల మునుఁద్రాటఁ గాలుఁ ద్రువ్వనేల? వచ్చిన వాఁడవు నాహ్వానయపూర్వకంబగు ప్రార్థనం బంగీకరించి మాయింట మాతోఁగలసిమెలసియుండి భోజనముచేసినయనంతర మన్నిపనులుం జెప్పుట యొప్పుఁగాని యిపుడె యిట్లనుట నీకు భావ్యమగునే? నాయెఱింగినంతవట్టు దీనికిఁ గారణ మెఱుఁగఁ జాలకున్నాను.

కృష్ణు:—ఇట్టిపట్టులఁ గారణంబు నీ వడుగరానిదయ్యును గ్రుచ్చి గ్రుచ్చినను నడుగుచుంటివి: కాన నీసందియంబుఁ దీర్చెద నాలింపుము.

అని రారాజుకరంబును, గజరాజుపల్లవంబుల్లనఁబట్టి లీలఁ బ్రీతింబట్టి యందున్నవారినెల్లఁగలయంజూచి, మందస్మితంబున 'సుయోధనా, నేఁడొలుదొల్లి మీయయ్యం దర్శించి యాతనితోఁ జాలసేపు ప్రసంగించి పిదప విదురాదులయింటికిఁ బోయి వచ్చుచు నినుఁ జూడ రా నీకిపుడేమి తోఁచినదో కాని, నను నీయింటఁ గుడువ రమ్మంటివి. నీతండ్రినిజూఁడ వచ్చిననన్ను, నాతఁడాహ్వానింపకుండఁగనే నీవు నీయింట నను భుజింపు మనుటయనుచితము. ఇంతకును బ్రేమతోఁ బిలిచి పెట్టెదు పట్టెడు కూడైనను నెంతయు నాదరణీయము. నేనిపుడార్తుఁడఁగాను. నాకు లేమిడియులేదు. నీవిపు డిడునది యదయుమగుకూడుకదా! అదయ మగునది పక్వాన్నమైనను నాకు విసర్జనీయము కాదా! నీవు మాకుఁ బగతుండవు. పగవారియింటఁ గుడిచిన నది యనుమానమునకు హేతువుకాదా? ఒడళుల కెపు డేవిధాన నేమి వాటిలుచుండునో యెవనికెఱుక? కావున పగతురకమృతమైనను గుడువంబెట్టుట యెటులైనను నీకును సమంజసము కాదు.

నేను పగతుండనగుదునె యనియందువేని పాండవుల నంత మొందింప నెన్నియెన్నిప్రయత్నము లొనరించినవాఁడ వీవు. వారనుప వచ్చినవాఁడను నేను. కావున నేనును బగతుండనయగుదు. ఆపాండవేయుల కాబాల్యముగఁ గీడె యాచరింతువు. పుణ్యపరులుము

ఆర్యులునునగుతోఁబుట్టినవారితో నింత వైర మెత్తుటదౌష్ట్యంబుకాదె! ఇట్లున్న మీయందఱయన్నంబు దుష్టాన్నంబు. ఇంతకును నన్నెవరు మీకడకు దూతగనంపిరో యట్టిపాండవులు కూటికై దేవులాడుచుండ వారిచే ననుపఁబడినైననేను మీయింట విందులారగించుచు సుఖించుట నైతికమునుగాఁజాలదు గావున విదురునియన్నంబు భోక్తవ్యంబని నిశ్చయించితి.

అనిచెప్పి దుర్యోధనుమందిరమువీడి చనునెడ బాహ్లీకభీష్మాదులు "మాయిండ్లఁ గానికలాయితంబుసేసికొని నీరాకకెదుళ్లుమాచుచున్నారు" మనిప్రార్థింప దామోదరుండును— నేనెల్లచోట్లకును వచ్చినవాఁడన; అందఱియర్చనలం గైకొనినవాఁడనని భావింపుఁడు. తత్ఫలంబును మీసంకల్పములందె యిమిడియున్నది. ఇఁక మీరిటనిలుండు— అనిసాత్యకిసహితుండయి విదురుగృహంబునకుం బోవుచుఁ గృతవర్మంజూచుచు, "సాత్యకీ, మనవాఁడ కృతవర్మయింట నీవు గుడువంబొమ్ము''- అని సాత్యకిఁ గృతవర్మలఁ దోఁడుసేసి యనిపి, తాను విదురుగృహోన్ముఖుండయ్యెను.

— దుర్యోధనుఁడు —

"ఔరా! ఎంతవిరసముగఁబ్రవర్తించినాఁడీకృష్ణుఁడు! బంధుఁడుగదాయని మాయయ్యకుఁగడుంగూర్చువాఁడుగదాయని, ప్రత్యేకముగనిలుసేసికొని యున్ననాయింటికివచ్చినాఁడుగదాయని వానినా యింటఁగుడువరమ్మనినేఁగోర నేమేమియో శాస్త్రమర్యాదలం జెప్పి ధర్మసూత్రములనుటంకించినామాటనిరాకరించినాఁడు. అందఱియెదుట నన్నుఁజిన్నఁగఁజూచుటే తనఘనతనుబెంపుసేసికొనుటయనియెంచి కానోప్పు నిట్లుప్రవర్తించినాఁడు. ఈతఁడెంతటికుటిలపుటూహలతో మాయూరుజేరెనోకాని తొలుదొలుతనె మాతండ్రియెదుట నెక్కుడెక్కుడిగొడవల నెత్తిపెట్టుట కారంభించినాఁడు.

మాతండ్రి, ధర్మజున కర్ధరాజ్యమొసంగినపుడు తానును ఒక సాక్షిగానుంటినని మాటలధోరణిలోసూచించినాఁడు. ఈతనిసాత్య

మెవరికిఁగావలయు? ఈతని మాటయెవనికిఁ గావలయు? వేలతనాన మాతండ్రిమాత్రమె యీతనియుబుసుపోని పలుకులనాలింపవలయు. తనవాక్నైపుణిఁబెట్టుకొని తానుదినములు గడపుకొన వలసినదే! తాతలనాఁటిపాత్రికకతల నాలింప మాతండ్రికే చెల్లినది: వృద్ధజనుల యొద్ద గాథలఁజెప్పుటకీతనికే చెల్లినది. సభకువచ్చినదిమొదలెవరెవరి తో నెట్లెట్లు బలుకవలయునో యెవరెవరి నేయే ప్రసంగంబుల నలరఁ జేయవలయునో వెదకికొనుచు నెంతఁగాఁబ్రసంగించినాఁడు!

మాతండ్రిని మెప్పించురీతి, పితామహాముల నలరఁజేయుతెన్ను, ఆచార్యాదులఁబొంగించుపణితియుఁ జూచికొనిచూచికొనిపలికెడుదకు ననుమెప్పించునెపమున నేమేమియోపలికినాఁడు. ఈమాత్రమెఱుంగఁ జాలననుకొనినాఁడుగావలయు! తనకంటెవేయింతలు మాయలు సేయు నేర్పుగలాఁడనని యెఱుంగక, తనపలుకుల కలరువాఁడనని యెంచి యు ట్లారంభించినాఁడు. తనవచ్చినపనికిఁ దొలినుండియు బీజములు వేయు టెపనిఁగాఁజూచినాఁడు ప్రతివాదమే ప్రధానముజేసి అందు కనువగు నుపపత్తుల నన్వేషించుకొనఁదొడఁగినాఁడు. ఈహేతువాదములు నీ గూఢార్థప్రతిపత్తులు నెవనికిఁగావలయు! నాబాల్యమున నాతండ్రి యిచ్చవచ్చినట్లిచ్చివేసిన రాజ్యం బేమార్గముననైన నేమి మరలసంపా దించి కాపాడుకొనుటయే నాకర్తవ్యము. సమయోచితపథముఁ ద్రొక్కి యెట్టెటోనష్టద్రవ్యమును మరలగ్రహించితి. క్షత్రధర్మము ననుసరించి నన్ను గెలిచి ధరణీభాగము గైకొనవలసినదే కాని యిన్ని కుతంత్రములేల? ఇన్నివార్తలేల? ఇందఱువార్తావహులేల? రాజ్యము వీరభోజ్యమని యెఱింగియు నిట్టివ్యాపారములేల? ఎట్లయిన నీ మాయదారిని నేర్పుమెయిఁ బరికింపవలసినదే. ఈతనిప్రతిపదము బరిశీలింపవలసినదే. నాయింటికివచ్చి నాయాహ్వానమంగీకరింపకున్న మానెఁగాని నను నెంతచిన్నఁబుచ్చినాఁడు! ఇంకేమేమి సేయునో!

ఇట్లెంచుకొనుచు దుర్యోధనుఁ డెంతయు సంక్షుభిత చిత్తుండయ్యెను.

రెండవ ప్రకరణము

(iii)

విదురునింటఁ గృష్ణుఁడు. కృష్ణవిదురులసంభాషణము. కృష్ణుని రాయబారపుఁబ్రయోజనము. తత్పరమార్థము.

విదురునిగారాతిథ్యంబునఁ బ్రముదితచిత్తుండగుకృష్ణుండు రాత్రిభోజనానంతరము మృదుశయ్యాంబరుండై తనసమీపముననే వేఱొకయాసనముపైఁగూరుచున్న విదురునితో సముచితసంభాషణంబుల నెఱపుచుండెను.

విదురుఁడు:—వాసుదేవా, ఇప్పటినీరాకకేమైనఁబ్రయోజనమూండఁగలదా?

కృష్ణుఁడు:—ప్రయోజనమే లేకుండునా?

విదురుఁడు:—నాస్వల్పబుద్ధికిఁ బ్రయోజనము యోజనమాత్రమైనఁ లేదు.

కృష్ణుఁడు:—అనఁగా?

విదురుఁడు:—దుష్టుండగుదుర్యోధనుండు నీకఱపుహితమావంతయు విననొల్లని దురభిమానధనుఁడు.

కృష్ణుఁడు:—ఆతనిప్రకృతి కనుమూపంబున గూడ నెఱిఁగియేకదా.

విదురుఁడు:—ఇంతయుఁ దెలిసియు నేలవచ్చితివి? నీవువచ్చుచుండె డిచెలిసికొనినంతనె ధార్తరాష్ట్రులందఱుంగూడి నీశాసనముల్లంఘింపనిశ్చయించినారు. పాండవుల కేమాత్ర మీయకుండ నరసినంతయు నీరువోవసంతఁ దార యేలుదురఁట!

కృష్ణుఁడు:—అయిన నేమాయె! ధార్తరాష్ట్రులు పాండవులకు నేల నేలయొసంగుదురని నే ననలేదే!

విదురుఁడు:—ధార్తరాష్ట్రులకు సాయము సేయవచ్చినవారు గూడ వారింబోలినవారలేయగుట వారేమియును నయములు వలుకఁదలంపరు. ధర్మజుదిగ్విజయంబునాఁడు పాండవేయులచేభంగపడి పగసాధింపఁ బదివేచియున్నవారును, ఒకప్పుడు నీమొద శత్రుత్వంబువాటించినవారును, ఈవలఁ బ్రాగ్జ్యోతిషముమొదలావల నాభీరముననుఁగలభూపతులందఱును, రారాజుపక్షమున నిప్పుడువచ్చినిలచి కర్ణునితో నేకార్థసముపేతులై సంగరమొనర్చి గెలుతుమెండెః చత్తుమెండెః వేఱొండు లేదనునిశ్చయమనస్కులైయున్నవారు. పెచ్చుపెరిగివచ్చుసైన్యంబుఁజూచికొనియు, భీష్మద్రోణులలావునమ్మియుఁ గర్ణువిక్రమంబువిశ్వసించియు, దుర్యోధనుండు గండుమిగిలియున్నవాఁడు. కావున సంధియెంతమాత్రముఁ గాఁజాలదు. తమ్మెఱిఁగి యెదిటి నెఱుంగఁజాలని మూఢులనడుమ నీవు రేపటిదినమ్మునఁ గూరుచుండుటయు

నాగర్వోష్ఠులు ప్రేలెడికాఱులను వంకలొత్తి మాటుచెప్పుటయు నీకొప్పనిపని. వారు నెపెఁగులనుటఁ గార్యనవనంబులెఱుంగరు: మోసకులనఁట ప్రతాపభావంబులను నెఱరు. తమోగుణప్రధానులను వారియెడ నీసాత్త్వికప్రసంగములు నిరుపయోగము లగుటయేకాక వారి యహంకారాగ్నికి నాజ్యాహుతులగును. నీమహానీయ ప్రభావమును లోకమెల్లయుంగనినకాదు. నీమాటను మహాపురుషులనట్టి కేటికి నీపోవుట! ధార్తరాష్ట్రులిదివఱకే పాండవు లనర్ఘులగు సెంపునఁబోఁగుచున్న వారనియు నూహించుచున్నారు ఇపుడు వారికే మీరలుపయుక్తమను నీయుపదేశకోల్తు నను కౌరవ్యులకనఁ బాండవులకు నూఁతంగ్రిందు నేయుటకే యగును. నానాయకా! నీయెడభక్తికతమ్మునను బాండవులయెడఁ జేయు నాటి ప్రేమకు వెంపునను సేనింతగా విన్నవించుకొనుచున్నాను.

కృష్ణుఁడు:—నీవనియుచినయది సత్యము. కాని నాదౌకనుఁగారణము నెఱిం గినపిదప నేమి చేయుదుమో యది యోచింతమునంతే.

ఇంతవఱకుఁ బాండుపుత్రు నోదాహ్యకముగఁ బన్నుకొనిన యన్నుండు
లేని సూర్యమంతి మాటలనిట్లు చెప్పఁదొడఁగెను.

సుశర్మునిలోఁ గామితిగ్రంగెల్ల నాకుఁ దెల్లంబు. ఆతనికి సాయము నర్పపచ్చినవారంద ఱెఱుంగుదుము. వారు పాండవులయెడ శత్రువైరముంబూనియుం డిరో, నాయెడ సౌహార్దపరతఁబూనియుండిరో, దూరదూరంపుటాశలతో వారికి సాయ మొనర్ప వచ్చిరో యెఱుంగనివాఁడను గాను. ఇపుడీరాజులసాయమున ధార్తరాష్ట్రులె గెలిచి రేని, మఱికొంతయు సెలవిచ్చి యీసాయమునచ్చినవారందఱును, బ్రత్యేకముగ సమ్మెకట్టి యున్నత్యాసనముపైఁ దిగుఁగఁబడి యూతనిఁబదమ్యుతునిఁగ నొనర్చి యొక్కొక్కరు స్వతంత్రముగ రాజ్యముల స్థాపించుకొనఁదలంచిన వారలే. ఇట్టిగు కొందఱు పాండవపక్షమునఁగూడఁ గూడియున్నారు. నేను బాండవపక్షమునున్నానుగదా యని నాపైఁగల పగఁదీర్చుకొనుటకుఁ దనతండ్రియగు నరునకు నినుపయింపు మునుమున నిడికొని కౌరవపక్షముఁజేరినాఁడు భగదత్తుఁడు; తనతండ్రియగు జరాసంధుని నేవధి యింపఁజేసినను నాచేరినపాండవపక్షంబున నే చేరినాఁడాతనికుమారుఁడగు సహదేవుండు. సత్యావివాహంపువేళ మనమునవిడుకొని కృతవర్మ మాకూఁపపుఁదెయయ్యును కౌరవ పక్షముఁజేరినాఁడు. ఇట్లెవరెవరేవేకారణముల నయ్యయి పక్షములంజేరిరో సర్వము నెఱుంగుదును. పగఁబగలందీర్చుకొననున్నవారు పెక్కండ్రే ధార్తరాష్ట్రులం జేరుట సంధిప్రసంగమిప్పుడు కాకకారణమనియూడ నే నెఱుంగుదును. లోకమెల్లనొక్కతూరి

మునువెనుక లాలోచింపక మూర్ఖతమెయి మృత్యుముఖముం జొచ్చుటకుం లేని యుద్రేకించుచుండ నాయుద్యమమునుండి వీరినిమందలించుట యధికతరధార్మికవృత్తి యని యెంచి వీరికి ధార్మికనైతికసంబంధము నెఱుకపఱిచి చూచెదను. వారద్దానియెడ నంగీకారమునూపిరయేని వారికిని వారివారికిని బ్రదుకుఁదెఱు వేర్పడును. నాప్రసంగంబునఁ గౌరవులదుర్వ్యాపారంబునకుఁ గురువృద్ధులమనంబు లెరియవె? పాయమొ నర్పవచ్చినరాజలోకముగూడ నాధార్త్రరాష్ట్రుల దెసననూయం జెందదె! పాండవుల యెడ సానుభూతియు నక్కటికమును బొడమదె! మానవుఁడు పుణ్యమొ, పాపమొ యొనర్చుచునే యుండును. అట్లొనర్చుటయం దాతఁ డొకింత త్రోవఁ దప్పినను, ఆ పరిణామఫల మాతఁడొందుననియే ధర్మవిధిజ్ఞులు నుడువుచున్నారు. మఱియుఁ జుట్టాలలోఁ గలహముపుట్టి వారు చెడనున్నసమయమున వారితోఁ బోరిరైన వారి జగడము నుడుపఁ బ్రియత్నింపకున్నవాని నెంతయుఁ గ్రూరకర్ముఁడని కర్మకాండవిదులు నిర్వచించుచున్నారు. కావున నీ రెండుతెఱంగులవారికిని సంధి గావింపఁ బ్రయత్నము సేసెద. ధర్మార్థసహితంబైన తెఱుంగుమాటలు మంత్రిజనసహితుండైన సుయోధనునకుం జెప్పెద. తనకును బాంధునంపనులకును లోకంబునకును హితంబయినవిధంబు వంచనలేక చెప్పెదునన్న—పాండవులవాఁ—డనిశంకించి యతఁడు నామాటవినండయ్యోనేని మే లగుఁగాక. ఇట్లువొచ్చిచెప్పకున్న 'నన్నదమ్ములు తమలోవంబోరఁ గృష్ణుండు వారింపక యుపేక్షించె. తనచేతఁ జక్కంబడదా' యని యజ్ఞులైనజనులాడుదురు. సమరంబెయనివార్యంబైనఁ గౌరవ్యులసంగ్రామసంరంభంబులును, సమరసన్నాహంబులును గుర్తించి పోయెద: ఇంతకన్న నింకేమికావలయు!

విదురుఁడు:—నీయూహలును నీ దూరాలోచనములును అస్మదాదులకు దురూహ్యములుకదా! మధుసూదనా, నీ నిద్రించుసమయమైనది. నేఁబనివినియెద.

అని విదురుఁడు కృష్ణుననుమతివడసి తనపడకతావుం జేరికొనియెను.

సింహావలోకనము

కృష్ణా, తనకష్టములు నీతోఁ గలియఁబోసికొని, సంగ్రామంబు గాకుండఁ దనకర్థసిద్ధివాడమునట్లు, సంధికార్యంబు కావలయునని ధర్మజుఁడు నీతోఁ బ్రసంగించునపుడు నీ సంధిప్రయత్నపరమార్థముం గూర్చియేమని యాతనితో నాడితో, యావిషయమే మఱింత మెఱుంగుపెట్టి యిపు డీవిదురునితోఁగూడ నంటివి. నీపలుకులవలన

నొక్కటి విస్పష్టమగుచున్నది. సంధియ యగుట కెంతయు నుపకార మొనర్చవలె నంతయు నొనర్చును, సంధియైనం గూడక సమరమె సంసిద్ధమైన నందుకు వలయు తెఱంగునం బట్టినుం దాంచినాఁడు. కౌరవపక్షమున నడువవచ్చినవారియుల్లములెల్లఁ బాండవపక్షపాతమైన వాక్యములనల్లఁ బల్లవింపఁ జేయుచున్నాఁడు. లోకానకుఁ గౌరవ్యులయందు నసూయయు నేవయుఁ గలుగఁ జేయుచున్నాఁడు. నీ వే కార్యము నొనర్చుచున్నను గార్యకౌశలముగలిగియే తదాచరణమునకుఁ గడంగుదువుగదా. కార్యాకార్యవసానమునుఁ జూచి, కార్యాచరణమునకు సంకల్పమునారోపింపఁ బోవువారి వివేచనా పరిజ్ఞాన మెంతయు ననభిమతము. ధర్మరాజసమ్ముఖమునను, విదురు నెదుటను, నీవు జేసిన పలుకులెల్ల నీమనోగతవిషయములకు ముకురఫలకములై నెగడుచున్నవి కావా! ఇంకేమి వలయు నీపథము గుర్తింప!

ఇంత తెలియక సంధియైనం గూడదనియు, సంధి కారాదనియు, యుద్ధమే కావలెననియు, నీవు మనసారఁ గోరియె యీకరణి పురికొల్పితివని యనువారి నేమనవలయు!

రెండవ ప్రకరణము

iv

విదురునింట మఱునాటియుదయము శ్రీకృష్ణుఁడు కృతవర్మతో వివిధ విషయంబులఁ బ్రసంగించుట. యదువంశచరిత్రసంగ్రహము. దుర్యోధనాదులు శ్రీకృష్ణునిఁ దోడ్కొని కురుసభకు వెడలసన్నాహములు.

కృష్ణుఁడు సుఖనిద్రం జేసినాఁడు. విదురునింటముంగల దుర్యోధనుని నానతి మాగధమంగళతూర్యారావంబులు సెలంగుచున్నవి. మహానుభావుండును, బరమయోగీంద్రుండును నగు నవ్వాసుదేవుండు ప్రభాతంబున సమున్నిద్రుఁడై మేల్కాంచినాఁడు.

కడచినరేయిఁ గృతవర్మయింట నాతిథ్యమును సత్కారముల నందిన సాత్యకియుఁ గృతవర్మతోఁ జెండలకడ విదురుసదనంబునకు వచ్చి కృష్ణునకుఁ బొడసూపెను. తగిన యాసనములు దెప్పించి వారినిఁ గూరుచుండఁ జేసి శ్రీకృష్ణుం డపుడు వివిధవిషయ

ములంగూర్చి ప్రసంగంబులు సెఱపుచుఁ గృతవర్మనుపలక్షించుచు, నాతనితో నిట్లనియెను. "కృతవర్మా, మరల మన మెన్ని దినంబులకుఁ గలిసికొంటిమో యీ! ధర్మజు ధర్మమున నేనీపురమునకు రాఁ దటస్థించుటం జేసి నినుఁ గలిసికొనఁగలిగితిని.

"తొల్లి మనవంశకర్తయగు యదువు తనతండ్రియగు యయాతికోరికఁ దీర్పఁజాలకపోవుటను జ్యేష్ఠుండయ్యును, రాజ్యాభిషేక మొందఁజాలకపోయెను. యయాతి యీభరతసామ్రాజ్యమునంతను తనకనిష్ఠపుత్రుఁడగు పూరునకభిషేక మొనరించుట నాతఁడు జాలకాలము దేశముల ద్రిమ్మరవలసివచ్చినది. పూరునకు రాజ్యము లభించుట నాతనివంశము వారె చక్రవర్తులైనారు. అనంతరము కొన్నితరములు గడచినపిదప మన వంశమున నప్పటికిఁ బ్రాముఖ్యతవహించిన మన పెద్దలు కొందఱు యమునాతీరమున నున్న మధురానగరము నాక్రమించుకొని స్వతంత్రరాజ్యస్థాపన మొనర్చి ప్రభుత్వ మహత్వ మొందినారు. అందు ప్రధానుఁడు మాధవుఁడు.

"కృతవర్మా, మనలో యదువృష్ణిభోజాంధకకుకురవల్లమత భేదము లెన్నియున్నను మీభోజకులు లేక నప్రభుత్వగరిమ నొందినారు. యదువంశోద్ధరణార్థము మావమందఱము నేకీకృతమనస్కులమై పాటుపడవలదా; మనలో మన కెన్ని భేదాభిప్రాయములున్నను స్వవంశమునకు దుర్బలము నాపాదింపరాదు కదా! కృతవర్మా, నీయట్టి విలుకాఁడు, మనవంశోద్ధరణమునకు సంబంధము లేని యీకురుపాండవసమరమునఁ జోక్యము కలుగఁజేసికొనుట యసమంజసము కాదా! ఇరువాంగులవారును నాసాయముగోరినను, నిరస్త్రపాణినై వచ్చితిఁ గాని యొకరిపక్షమున నింకొకరి కెదురిగ నస్త్రముఁబూని నిలువలేదే! అస్త్రపాణినైన నీవుగాక మనలో నింకెవరును ఈయన్నదమ్ములగీసులాటలో జోక్యము కలుగఁజేసికొనలేదే! యదువీరులసంఖ్య నశింపకుండుటకె కదా, యదుప్రముఖులు సురక్షితముగనుండుటకె కదా, యదుకులమును బరిరక్షణ మొనర్చుకొనుటకె కదా, నాయన్న యగు బలరాముండును, నా కొమరుడౌ సాంబాదులును, నీకురుపాండవసంగ్రామరంగంబున నేపక్షమునం జేరక, తటస్థులై యుండుట. యదువీరులలోఁ బ్రధానపురుషుండవును, మేటివిలుకాండ్రకెల్ల గండుమగండవును నగు నీవే యిట్టుల నీరంగంబున కుఱుకుట స్వకార్యవినాశహేతుభూతము కాదా! మనకున్న పనియేమి? మనమిపు డొనర్చుచున్నదియేమి? స్వవంశోద్ధరణదీక్షాదక్షుండవగు నీవు, స్వకార్యవిధ్వంస మొనరించి, స్వకులవినాశహేతుభూతమగు యుద్ధమునఁ జొఱఁబడ దలంచుట యీ సమయమున మనకొప్పనిపని.

ఈ యసురసంప్రదాయకులమూలమున మనకేల యీబాములు. నీయట్టి

వాని కింతకన్న నే నేమి చెప్పఁగలను? మనబలము నశియింపని విధమునఁ బ్రవర్తించుటయే మేలు." అనియిట్లు కృష్ణుఁడు భావగర్భితప్రసంగంబుల నొప్పుచుండెను.

అంత వేగంబె కటకపు జనకునాజ్ఞను దుర్యోధనుం డంపఁ గాంచనమయమందిరమున నంపనంపునకు స్వాగతంబొసంగనలయు నిస్తులవస్తుసంతానంబు సేకరించు కర్జంబునఁ దగినవారిని నియోగించి కొలువుకూటంబునకుం గృష్ణునిఁ గొనిరాఁ గురువృద్ధులను దన యనుజతనుజమిత్త్రామాత్యవర్గంబును వెంటఁబెట్టుకొని వైభవంబుమీఱఁగ విదురునివసనంబునకు వచ్చెను. కర్ణశకునిదుశ్శాసనసహాయుఁడయి దుర్యోధనుండు శ్రీకృష్ణునిదర్శించి ప్రణామంబొనర్చి యాతనిచే వెనలుపడసి నిలఁబడియుండఁ, గృష్ణుండును వారి నెల్లర నుచితాసనంబులఁ గూరుచుండ నియోగించి, యథోచితరీతుల వారి నెల్లర నాదరించెను. దుర్యోధనుండా దినము బాంధవ్యంబును, వాత్సల్యంబును జూపు పలుకులఁ బల్కు-డయ్యైకమత్యము నెఱపుచు, హితమును ధర్మమును లోకసంగ్రహార్థమును మేళగింపఁ జేసి, తనసహజమృదుమధురసౌజన్యపూర్ణసంభాషణంబులు నెఱపి వారి నానందవివశులుగ నొనర్చి, తన దెసకు వారిహృదయంబులు వ్రాలునట్టి ప్రసంగంబులు సేయుచుండ దుర్యోధనుండు నిలచి చిఱునగవున:

—సాధుసూచనా, కురుసామ్రాజ్యపట్టభద్రుండు బంధుమిత్త్రాది సమస్తపరిజనసమన్వితుండయి పేరోలగంబుండి నీ యాగమనంబున కెదురుచూచుచున్నవాఁ డొక్కఁడ నిరామయు నీసమక్షమున కనిపె – ననియె.

కృష్ణుఁడు:—అవశ్యము బయలుదేరుదము గాక.

అందఱును లేచి నిలిచి బయలుదేర సన్నాహములనుండిరి.

మూఁడవ ప్రకరణము

(i)

శ్రీకృష్ణుఁడు కురుసభకేగుట; సభావర్ణనము; మునులరాక; ధృతరాష్ట్రు నుద్దేశించి కృష్ణుఁడు చెప్పిన ఆరంభోపన్యాసము; సభాసదుల నుద్దేశించి చేసిన అర్థవాదము; దుర్యోధనునకుఁ జూపిన ఉపపత్తులు; కురువృద్ధులకుఁ జూపిన. తనవాదమునందలి అపూర్వత; సభాస్థారులకుఁ జూపిన ఉదాహరణములు: ఉపసంహారము.

మంగళవాద్యములు మిన్నుముట్టుచుండెను. గరుడధ్వజంబు ముంగలఁగాఁగ, ఛత్రచామరప్రముఖభద్రచిహ్నంబు లలర, సాత్యకికృతవర్మలనంగం బొకప్రక్కను, కర్ణశకునిదుశ్శాసనదుర్యోధనులనంగం బొకచక్కిఁ జనఁగ శ్రీకృష్ణునిరథంబు రాజమందిరోన్ముఖముగ నడువఁ దొడంగెను. గోపాలసందర్శనలాలసులై నగరపురజను లాబాలగోపాలమును రాజమార్గమునఁ గిక్కిఱిసి మెల్లమెల్లఁగ నడచుచుండిరి. పౌరులకు నేత్రోత్సవముగ నయ్యరదంబులు సనిసని రాజమందిరము సమీపించి సింగంపుమొగసాలఁ జేరనరిగె. జనార్దనుండు రథావరోహణ మొనర్చెను. అప్పటి యొకివునకుం గొలువువారెల్ల నత్యుత్సుకులై, యచ్యుతునిరాక కెదురుసూచుచుండిరి. ఎదురువచ్చినవిదురు నందిచ్చుకరమును, సమ్ముఖచేయును, తన రెండుచేతులం బట్టి యయ్యశోదానందనుండు కొలువుకూటముం జేరనరుగుచుండ, ముందలఁగదియుసందడిని గర్ణదుర్యోధనులు దొలఁగఁజేయఁదలంచియు కృష్ణుఁడేమనుకొనునోయని యట్లొనర్పకుండిరి. కృతవర్మాది యాదవులులోనుగాఁగల యత్యంతరంగులైన బలుమానసులు కృష్ణుని బొదివికొని సభాభవనంబునకు మార్గంబుజూప నయ్యాదుకులశేఖరుండును గొలువుకూటమునం బ్రవేశించెను. బాహ్లీకభీష్మాదిరాజబంధువులొకప్రక్కను, ద్రోణాచార్యాద్యాచార్యవర్గ మొకదిక్కునను, కృతవర్మాదియాదవులొకవంకను, బారులుగఁ దీర్చియున్న సభామధ్యంబునకు శ్రీకృష్ణుం గొనిరా నాతండును వనకని సిద్ధముగనున్న కనకమణిమయోన్నతపీఠరాజంబునఁ గూరుచుండఁ బెంచి యెదుటం బొడసూపిన నారదాదిమునిముఖ్యుల నవలోకించి ముందుగ వారికి నర్ఘ్యపాద్యాదివిధు లొనరింపఁజేసి వారాసనాసీనులగునంతట వారికిం బ్రణమిల్లి తానుపవిష్టుండయ్యె. ధృతరాష్ట్రాదులు నారదాదులకు నమస్కారములు సేసి రమణీయాసనములపైఁ గూరుచుండిరి. దుశ్శాసనవివింశతులు గొనితెచ్చినగద్దియలపై సాత్యకికృతవర్మలు కృష్ణున కిరుదెసలం గదిసి కూరుచుండిరి. చేరువ నొకగద్దెపైఁ గర్ణదుర్యోధనులును, వెన్నునివెనుకదెసఁ గరంబత్తి

మిక్లి యొక మణిమయపీఠంబున విదురుండును, గూరుచుండిరి. ఇట్టి నిండుపేరోలగమ్మున నీలనీరదనిభశ్యామలకోమలగాత్రుండును, కమలదళసదృశవిశాలవిలోచనుండును, శాంతగంభీరసుందరవదనమండలుండును, పీతాంబరధరుండును నగు శ్రీకృష్ణునిఁ జూడఁబడసిన లోచనయుగమ్మే కదా లోచనయుగమ్ము! కొలువునంగలవారందఱును సాధువుముఖారవిందవీక్షణలోలుపతఁ దన్మయత్వం జెంది యుండిరి. శ్రీకృష్ణుండు నిలిచి సభ్యులకు నమస్కరించి జలధరధ్వానగంభీరంబగు నెలుంగున నిట్లు చెప్పనుపక్రమించె.

సామ్రాజ్యవిభూతితో నున్న కురుకులపతీ, నే నిపుడు నీకడకు యాచకుండనై వచ్చితిని. భారతభూమికి వీరభిక్ష నిడుమని ప్రార్థింప వచ్చిన యాచకుండను. కురుపాండవపక్షములనున్న వీరాధివీరుల నింకనుగొంత కాలము బ్రదుకనిమ్మని ప్రార్థింపవచ్చిన యాచకుండ. అంతేయకాని యీవచ్చియున్న నారదాదు లనుకొనినట్లు నీతులుగఱప వచ్చినవాఁడనుగాను. హితబోధ కొందఱిపట్ల నుపకరించియు, మఱి కొందఱిపట్ల నుపకరింపకయు, బోధనయధికమైనకొలఁదియు మూర్ఖతయు, నమానుషచర్యయు, నధికమై తుట్టతుదకు బోధకునిబంధింపఁ జేయుటయో, బోధితునే ప్రమాదము నొందింపఁజేయుటయో నే నెఱుంగనివాఁడనుగాను. పుట్టువుతోడనే హితాహితములను న్యాయాన్యాయములను బరిశీలింపఁగల సమర్థుండగువానివివేకము, హితబోధనమున మఱింత మెఱుంగువెట్టఁబడి తేజఃపుంజమై వెలుంగఁగలదు. ఇంతకును హితబోధచేయుదమన్నను రాజేంద్రా, నీ యెఱుంగని ధర్మము లేవికలవని నేనుగ్గడింపఁగలను! ఒకకుదుటికి చెందియున్న మీరెండుశాఖలవారిలో నెవరు కాపథమువట్టినను దానవచ్చు న్యూనత ననుగూడఁ జెందఁగలదని యెఱుంగనివాఁడనుగాను. పాండుమహీపతియు నీవును ఏభ్రాతృభావమున, నేయభిమానమున, నేవాత్సల్యమున నుండిరో ఆవిధముననే పాండవేయులును, ధార్తరాష్ట్రులును, నుండుటతగును. చిన్నవాఁడయ్యును పాండుఁడు విధివశమునను గాలవైపరీత్యమునను మున్నె కాలధర్మమునందెను. నీపుత్త్రులను పాండుపుత్త్రులను సమముగఁజూచుకొనుస్వభావముకలనీవుంటివి కదా

యని లోకులును ఈసామంతరాజులును నేనునుం గూడఁ గొంతయూ ఊట నొందితిమి. నీపుత్రు లవినీతులనియు ననలేను. పాండుకొమరు లధర్మపరులనియు ననలేను. ఇందెవ రవినీతు లైనను అధర్మపరు లైనను ఆయప్రతిష్ఠ నాకును జెందునదగుట నట్టిది విననైననోప. పుత్రవ్యామోహమున నేదియు నీవు పిశ్వయింపఁజాలకున్నావని నేనెఱుంగని వాఁడగాను. మాకెల్లరకును గురుస్థాన మనఁదగిననీవట్లు నిట్టిపుత్రవ్యామోహదోష మారోపింప నీప్రజలకే కాక, నాకును మనసు రాకున్నది. విపినతుల్యమగు ధార్తరాష్ట్రులయందు లేకున్న సింహములవంటి పాండుపుత్రులు బయల్పడి సురక్షితులు కానట్లుఁ బాండుకుమారసింహపరిరక్షితము కాని ధార్తరాష్ట్రవనమును జెడఁగలదు. సహాయమును సంపదయును అన్యోన్యాశ్రయములు కావా! అట్లగుట, నీసంపదననుభవింపందగు నాపాండవులనుగూడ నీయంపనుండఁ జేసి విడువదగని వారిసహాయము నేల వీడవలయు?

—ధృతరాష్ట్రుఁడు—

యదునందనా, రూపొందిన పరమాత్మవగు నీయడుగుదామరలు సోఁకుటను మా రాజ్యమును గులమునుం బవిత్రమైనవి.

కాలమంతయుం బీఁకి, చేయునది లేక, ధర్మోజయతి యని దినములు లెక్కించుకొనుచున్న నాకు నీయాజ్ఞ నెరవేర్పఁగలుగునంతటి భాగ్యమా! నాకొడు కవివేకి: భుజబలప్రధానులౌ కర్ణదుశ్శాసనులు వానికిఁ బ్రధానులు: అహంకారమును దుర్మానమును వానికిఁ బ్రధానగుణములు: పశుబలముపై నాధారపడుట వానికి రానైయున్న ప్రమాదమునకుఁ బ్రధానచిహ్నము. ఇట్టిపట్టుల నే నేమియొనర్పఁగలను?

—కృష్ణుఁడు—

నీచేయఁగలయవి పెక్కులున్నను ఆంబికేయా, నేనేమియొనర్పఁగలననియూ యంటివి! నీయధికారము చెల్లుచుండ, నీప్రజలలో నీకుటుంబములోఁ గలఁక పుట్టినపుడు, నీవు కాకున్న నింకెవ్వరు దీర్పవలయును?

భరతకులంబు సకలధర్మసంస్థానమని పేరెన్నికఁగన్నది: అందు నీవును, నీతమ్ముండును సద్గుణోత్తరులరు. నీతనయులు యశోధురంధరశుభశీలురు. నీనాఁడీపావనవంశంబునకుఁ గళంకముకలుగరాదు. ఈవంగడంబున కీవుమూలకందమనగుట నింపెవ్వారిచందంబు లెట్లు వర్తిల్లినను, మంచిచెడ్డలు తూఁచి నిన్నుం జెందును: గావున, మంచి నెంచి, లోనిపొత్తును వెలిపొత్తును జనస్తుత్యములుగావించి కార్యంబు సక్కఁజేయుము. కౌరవపాండవులొక్కతెఱవొంది శాంతత నొందియుండుట నాకును నీకును ఈ వచ్చియున్న నృపకోటికిని సమస్త వసుంధరకును మేలగును. ఘోరితమైనచో నియ్యిలాతలమ్మునకెల్ల మహాపదదాఁపురించును. కావున నీవించుక యోజించి, కరుణించి, సంధియొనరింపుము నీవు చేయఁదలంచితేని వీరినిఁ జేర్చి, వారిం జేర్చి కూర్చిన నేసౌఖ్యముఁ నొందఁగలవు. అట్లుఁగాక ఘోరితఁపుటూహయే నీకు బలవత్తరమైనచోఁ గీడొక్క కౌరవులకె కాదుసుమా: బాగుగ నాలోచించినచో భారతభూమి నిర్వీర్యమై, కాలకాలములపర్యంతమును తేజోవిహీనమగు; అస్త్రవిద్యయునడుగంటునుజుమ! చివరకు నీవును నీవారును దుఃఖించి, దుఃఖించి, యాకసముదెసఁజూచుటయె తటస్థించినచో, నపుడు మముబోంట్లమియుఁ జేయఁజాలమినె కదా యిపుడె 'యింతదూరము' చెప్పవలసివచ్చుచున్నది. యుద్ధమునకు సిద్ధమయియున్న మీయిరువాఁగులవారిలో నావఱిఁగల భీమార్జునులం బోలెడువీరుల నెందఱి నిందుఁ జూపఁగలము? ఇందుఁగల భీష్మద్రోణుల గ్రేణిసేయంగలవారి నెందఱి నాదెసం జూపఁగలము! భండనపాండితిమహిమాన్వితులును, విక్రమాఢ్యులును, బాహుగర్వదుర్వారులునునగువారిని వీరినింగూడ బవరంబున దెగమిడించికొనుటకంటె, వీరందఱును నీబలంబులై నీకడనఁగూడియుండుట నీకు వాంఛనీయము కాదా! ఇంతటిశూరాగ్రేసరులు నీకుఁబాసటలై, అంగరక్షకులై, నీ విడుకూడుఁ గుడుచుచు, నీచరణపీఠమునుగొలుచుచుండ, నీవ ధరణీ

చక్రమేలుటనంగీకరింపవే! నీప్రాభవమును నీతియు శాంతియు జగంబులు వొగడునట్లొనరించుకొని, తండ్రినిచ్చినబిడ్డలగు పాండవుల నెంతయునరసి బాల్యమునుండియుఁ బ్రోచినవాఁడవు, నడుమ నిష్కారణముగ నీగతి నిపుడు దిగవిడచుట నీకుఁదగునె! నీకుఁబరమభక్తిం బ్రణమిల్లి వారందఱునొక్కమాటగ నీతోఁజెప్పుమని నాతో ననిన పలుకులువినుము:—

తనయాజ్ఞను బండ్రెండువత్సరంబులు విపినంబులఁజరియించితిమి: పదమూఁడవయేట జనపదంబున నజ్ఞాతంబుసలిపితిమి మాతండ్రిసమయంబుపరిపాలించి, మీ యర్థరాజ్యం బెట్లునుంబడయుదు మని కృతనిశ్చయులమై యున్నియుంబడితిమి. తల్లియుఁదండ్రియు, నెల్లచుట్టంబులు నేదుగడయు మాకుఁ దాన. మావలన నేరము గల్గిన నిట్లుగా దట్లని మముఁజక్కసేయు భారము తనయది. నేర్చినను నేరకున్నను బుత్రులను జనకులు విడనాడరుకద! ఏదియెట్లయినను దనగలపదివేలేండ్లకుం దన్నకాని యన్య మెఱుంగము. మే మెట్టివారమైనను మమ్మును దుర్యోధనాదులను ఒక్కరూపున మను పఁదలఁచినచో, కులధర్మంబు చెడకయుండు. పాపముచే ధర్మమును, బొంకుచే సత్యమును, చెడనున్న సమయానఁ జక్కఁబెట్టఁగల సమర్థులైన పెద్దలుండియును తెలింగియు నుపేక్షచేసినచో, నదివారికే చేటొదవం జేయును గాని ధర్మనిస్తారకమై సత్యశుభదాయకమై విజయమూలకమైన దైవముండు లేకపోలేదు.
——అనికూడ నిందుఁగూడియున్న యెల్లరకుం జెప్పు మనిరి.

కావున నోకౌరవేశ్వరా, యిపు డీపాండుకుమారవరులసందేశముంగూర్చి యీరాజులును పండితులును మునివరేణ్యులును, యోచని మొద రనుండు; ఇంకను గార్యము తీరుటకుఁ దడవు మఱిలేదు.

ఏనుధర్మంబును, నీతియునుముందిడికొని మనోవాక్ప్రకారంబుల నైక్యరూపంబె సత్యంబనినమ్మి యింతదూరంబుచెప్పితిని. ఇత్తెఱంగె మీకుమేలు. మీరు క్రోధమానమత్సరంబులు వీడి, రాజ్యంబు పంచి, పాండుభూపాలుపాలు వారికిచ్చివేసి మీరందఱును నేమమున బ్రదికియుండుటకంటె ధర్మమైనదియు, సముచితంబైనదియు నగువిధ మింకేదికలదో యిందుఁగల వాక్యవిదు లానతీయఁదగును. ఇటుఁ

గాక నీవంతును నీతమ్మునివంతును నీవ యాచికొనఁ దలంపుఁగొందేని రాజ్యలుబ్ధతచే, వంచనమార్గమునఁబోయి; జూదపుసిరి యనుభవించుచున్నదోసమును, అప్రతిష్ఠయు నాచంద్రార్కముగని యుండునిలఁగలవు సుమీ! ఇంతకును నయ్యజాతశత్రుని ధర్మపరాయణతయును, నీతిపరత్వమును సత్యనిష్ఠయును నీ వెఱుంగనిదికాదే! ఇఁక నీ కొడుకులమాటఁ దలంచుచున్న (దుర్యోధనాదులఁ జూపుచు) వీరు సమర్థులుగాక, కార్యములొనర్పక, మహాత్మసిద్ధినొందఁదలంతురు; తమవంశగౌరవమునకిది తగినపద్ధతియుకాదన్నయెఱుఁగక పలుకు ప్రల్లదనముచే బంధుకోటిమనములు కలఁతబొందఁజేయుట క్షేమకరమును దలంపరు; తమయవగుణంబులెఱుంగుటలేదు. కావున నోరాజేంద్రా! యిది యంతయు, నెంతయు యోచించి మఱియుఁ గార్యమునకుఁ గడంగుము. అప్పుఁబొందొనఁగూర్చి తలంపెడు నిక్కముగఁగల దేవి, నీవుచేయలేనికోటిదే! నిన్నష్టపఱుచుం గలరే! నీవశమై నీవాచరింపక తీరనిపని యొకనీవుచేకొంచినచో, అకార్యాచరణమునందునిదోసము నీకు గలుగుఁ నని యెంచుము. తండ్రివగు నీవు సజీవుండవగుట, నీకొడుకులు నీయండనుండి వారికిఁగావలసిన కార్యములు నీకిష్టమున్నను లేకున్నను నీచేఁ జేయించుకొనుచుండ, జనకవిహీనులగుటఁ బాండవులు దవ్వులపాలు కావలసినదే నా? పాండురాజు జీవించియుండెనేని, యింతలు వాటిలునా? నీ కొడుకులు కొక్కఁ నీసహాయమే కాని, సచ్చరిత్రులగు పాండవులకు సకల లోకసహాయమున్నదసుమా! సంఘసహాయము నెదుట, వ్యక్తిసహాయ మక్కఱకు రాజాలదని నీ వెఱుంగనివాఁడవే! ఇఁక నయ్యజాతశత్రుం గూర్చి చింతలందుచున్న నాతఁడు నీచేతనుపడియె యింద్రప్రస్థంబుననుండి యు, నీకుఁ బేరును బెంపును గూర్చుటకై పరరాజులనెల్లర నోడించి, వారలునిను గొల్చునట్లొనర్పఁదలంచి, పూనికతో దిగ్విజయ మొనర్చినాఁడు! అతఁడట్లు మహావిభూతితోనుండుట నీసుతుండును మంత్రివర్గంబునుగని యోర్వఁజాలక, సౌబలుని చేజూదమాడించి పాండుపుత్త్రుల

సంపదయంతయునాచికొనియు, నంతతోనాగక, అమానుషమనిమైన దలంకక, ద్రుపదాత్మజనానాఁడుభంగపెట్టుట నీవెఱింగియు నీవారిని వారింపక నీవొడంబడుటయు లోకమెఱుంగకపోలేదు. అట్లయ్యును ధర్మరాజుండు సత్యముంబూని నీసభనుబుట్టిన యమానుష కార్యములకు దుఃఖించుచుఁ గన్నీటి నరచేతనొత్తికొనుచు సోదరులతో, భార్యతో, నుగ్రాటవులకుంజని, కడుఁబడుములువడియు, మరలమీతోఁగూడిమనఁ దలంచినాఁడు. ఇంతకునునయ్యజాతశత్రునిచిత్తశాంతతయు, వినయంపునడవడియు, సహనంపుగౌరవమును, ఔచితినెఱుంగువివేకమును ఇంకేనరపతులందైనను గనఁగలమే! నేనింతాడుట నీమనమునకు వెగటుగఁ దోచినఁ దోఁచుఁగాక! పాండవులయెడ నిదివఱకే తామారోపించినయసమర్థతను అశక్తిని యీనారాకచే నిపుడునిజముఁగా సమర్థించుకొను నీకొడుకులయవివేకముమఱింత పెరిఁగినఁ బెరుగుఁగాక. నీకు సమానప్రేమాస్పదులగు పాండుపుత్రవర్గమునకును, నీపుత్రచయమునకును హితముకోరియె యింతదూరము చెప్పసాహసించితిని. కావున నీసూనుని యతిలోభమాత్సర్యములను మాన్పి పాండవులం దెచ్చి నీయండనుండఁజేసి నీవుశాశ్వతకీర్తినొందుము. నీపుత్రులకసమానసంపద నొనఁగూర్పుము. ఒక్కత్రుటికాలమున రానున్నవినాశమునుండి భరతభూమిని దొలఁగించి లోకకళ్యాణ మొనఁగూర్పుము. మరొక్కమాట:—

పరస్పరమైత్రిగల నీతిధర్మములు ప్రత్యేకప్రత్యేకములయ్యును సమముగ నడిపించుకొనఁ దమవివేకముతోఁ జర్చించి చూచుకొను సామర్థ్యముగలపాండవులు, శాంతశూరులగుపాండవులు, నీచరణయుగళముఁ గొలుచుచు నీపదదాసులై యెప్పటియట్ల, నీవలనఁ బుత్రవాత్సల్యతనొందఁ గోరికవడియున్నారు. నేఁటిదనుక, నీయుపేక్షాకారణమునను, నీకొడుకులమూలమునను, వారికిఁగలిగినయగచాట్లెల్ల మఱచిపోనున్నారు. ప్రీతిమెయి నీవిడుపట్టెడోగిరము నీచరణసన్నిధిం

గుడుచుచు, నీసేవలఁ జేసికొనుచు, నీకనుసన్నల మెలఁగుచు నుండుట కంటె రక్తపాతమువలనఁ గలిగినపక్వాన్నమునైన నొల్లమనుచున్నారు. అటుగాదని, నీ వలనాఁడు వారల నడవులకనుప నెట్టియనుజ్ఞ నొసంగితివో, యట్టియనుజ్ఞయె నేఁడును నీ వొసంగితేని, తప్పనిసరి యగుటఁ బోరికిం దలఁపడుదురు. కావున నీయిరువెలంగుల నెయ్యది నీకుఁ గీర్తిప్రదమును, లోకమునకుఁ గల్యాణదాయకమును నగునో యీ నయకోవిదుల నడిగి తెలిసికొని, నీవివేకముతో మేళగింపఁజేసి, తగినరీతిని వారల కనుజ్ఞనొసంగుము. ఇంతేలునడియును, వారు నీమాటజవదాటు నలవాటు కలవారు కారుసుమా!

అని దేవకకొడుకు మిన్నకుండెను.

సభలో గుసగుసలు

"ధర్మార్థకామముల పరస్పర సమ్మేళనమే యిహపర సాధనమని నిరూపించుచు నెంత యొప్పిదముగఁ బల్కినాఁ డీ వాసుదేవుండు!"

"అమృతోపమానములై, కర్ణపేశలములై యెంత యింపునింపుచున్న వీతనిబోధనలు!"

"ఇంతనయకోవిదు నింకొకనిని గని విని యెఱుంగము."

"ఇంతధీరుండయి, యింతచనవరియై యిట్లుపలుకఁగలిగినవాఁ డింకొకఁడుండునా!"

"ఇపు డీతఁడు చెప్పినచొప్పునఁగాక యన్యమింకేది యనుసరణీయమగును!"

అని సభలోనివా రనుకొనుచుండిరి.

పరిశీలనము

కేశవా, ఏమినీవాక్ప్రణీమహిమము! నీప్రసంగమంతయు మూఁడుభాగములుగ విభజింపఁదగినదిగఁ జేసినావు! నీచెప్పఁదలంచినవిషయమున కుపోద్ఘాతంబుగఁ దొలుదొలుత భారతాన్వయము ధర్మమును గరుణయు బాడియు సత్యమునుగలది యని లక్ష్యములంజూపి ధృవపఱిచినావు.

పాండవులతో సంధిసేసికొనుట న్యాయమును, శ్రేయోదాయకమును, నని నీయభిప్రాయమును వెల్లడించుటయే నీయుపన్యాసములోని ప్రథమభాగపు సారాంశము కాదా!

రెండవభాగములో ధర్మజుని వినయమును, రాజభక్తియు, వెల్లడించి యాతనికి రాజ్యభాగమిచ్చినచో, ధృతరాష్ట్రిని కేముప్పును బాటిల్లకపోవుటేకాక, యాతనియధికారమే సాగఁగలదనియు, పాండుపుత్త్రులును, అతనిపుత్త్రులును అతనికంగరక్షకులై, కైదండయైయుండ, శత్రుసంహారమును సంపల్లాభమును అతనికిఁ గలుగఁగలవనియు నొక్కి పలికినావు.

ఇఁక మూఁడవభాగములో యుద్ధము తప్పదని యుద్ఘాటించిపలికినావు. నీవెంతసేపు ప్రసంగించినను దుర్యోధనుని స్పృశించి యేమియుఁ బలికినావు కావు. కాని సామోపాయము చతురులయెడ సంధిమాత్రమును ఫలదాయకము కాదనియు, లోభియైన యాంబికేయుని పట్టఁగట్టి నిర్బంధింపకున్న లాభము లేదనియుఁ దోఁచినందియు నేతఁగినవాఁడవగుటను శీఘ్రముగ ధృతరాష్ట్రుని కార్యోన్ముఖుఁ జేయఁదలంచి సామదండోపాయంబుల రెంటిని ప్రధానముగఁ జోడించి, ప్రసంగించినావు. ఇంతచతురత్వ మింకొకనియెడఁ గానఁగునే!

కృష్ణుఁడు ధృతరాష్ట్రునితోఁ బ్రసంగించి యూరకున్నంత నటఁ జేరియుండిన ఋషులు శ్రీకృష్ణునిపలుకులఁ బలపరుప నారంభించినారు.

పరులయుద్ధతికిఁ జూపోపమిం జెడినదంభోద్భవుండను రాజుచరిత్రము నితిహాసరూపంబున జామదగ్న్యమహాముని బోధించినాఁడు.

ఎట్టివారికిని నిర్బంధవిధానము తగదనియు దురాత్మనము తుదకు దుర్దశ నాపాదించుననియు యయాతిచరిత్రంబు సోదాహరణంబుగఁ జూపినాఁడు కణ్వమహాముని.

ఇంకను గొందఱు పెద్దలు నీతిధర్మములను జోడించిపలికినారు.

కృష్ణునిపలుకులకు వశంవదుఁడై, మునులమాటలకు వెఱచి, తనతండ్రి యేమే నిచ్చివేయు నను సంశయమునఁ గావలయు గాంధారేయుండు రాధేయుం గాంచి, చేయుప్పళించి నవ్వి—"అంగరాజా! యీమును లెంతవెఱ్ఱులు!" అని మునిపుంగవుల నవలోకించి, పెదవివిఱిచి, వికటహాసంబుసేసి "మునులారా, మును నను విధి

యేమనిప్పుడియుంచెనో," "యట్టులె యయ్యెడు; కావున నిప్పుడీ వినఁజనిగానిపలుకుల వలన నింకను బనియేమి?" అని తూష్ణీంభావముఁ జూపినాఁడు.

ధృతరాష్ట్రుండమ్మహామునులనుద్దేశించి వారికిఁ గినుకజనింపకుండుటకొఱకు: "మునీంద్రులారా, మీహితోపదేశంబులఁజొప్పున కార్యము నడపింపఁగలయంత ఘన్నెమా నాకు! నామూలమున మఱికార్యమునడువమి, నేమిసేయువాఁడ ననిచింతిల్లుచున్నాను." అని వారితోనని శ్రీకృష్ణునుద్దేశించి: "యదునందనా, నాహితమును బరమును గలుగునట్టివిధమున నిప్పుడీవు తెలిపినను, తద్విధమున నడుపఁబోయినను నాకుఁజనవు లేరవులేమి నేమియుఁ జేయనేరకున్నాను. నానందనుండు మందబుద్ధి; దయార్ద్రచిత్తుండవును, మహానుభావుండవునునగు నీవు పొరానిచుట్టమవు. నాకొడుకు నెట్టులైన నీహితోపదేశములచే ననునయించి, బుద్ధులుచెప్పి, మిత్రకార్యముఁదీర్చుకొనుభారము నీవవహింపుము." అని యనెను.

—కృష్ణుఁడు—(తనలో)

ఔరా యేమిమాటనేర్పరితనముఁ జూపుచున్నాఁడీ కురువిభుఁడు!

—నానందనుఁడు మందబుద్ధి: నీవేవానిని వివేకిగ నొనర్చి, వానిబుద్ధిమరలంజెట్టు— మనుచున్నాఁడే! ఔరా, తనయాత్మజున కొరులు నీతులు గరపవలెనట! ఈయాంబికేయుం డెంతటియుపాయశాలి! అయినను మందలించి చూచెదఁగాక!

(ప్రకాశముగా) సుయోధను సంబోధించుచు—

—రాజకంఠీరవా, విమలతరవంశమునం జనియించి, సమస్త గుణంబుల నహీనుండవగు నీకు దురాగ్రహముతగునే! తులువలేకాని నీయట్టిదొరబిడ్డ లిట్టిదుర్నయవృత్తికిఁ బాల్పడుదురే! నీకుటుంబము వారును, నీహితులును, పరరాజులును నినుమెచ్చునట్టికార్యము లొనరించుటయొప్పును: కాని, అల్పబుద్ధులమాటలు పాటించి యకార్యము లొనరించుట యిహపరముల కెగ్గొనరింపదే? శాంతశూరులగుపాండుసుతుల నీకడ నిడికొని రాజకీయముల నెఱపఁ జేసికొనుట నీకుమేలొనఁ గూర్చుకొనుటయేకాక నీకుఁగూర్చుహితులును, కురుకులమునకెల్లఁ బెద్దలును నగుభీష్మబాహ్లీకవిదురులేకాక, గురుండును మానసికముగఁ గోరుచున్నదానిం జేసినవాఁడవు నగుదువు. నీవెవరెవరిసహాయము మభ్యర్థించుచున్నావో, వారివారిమనోగతభావములను బరిశీలింపఁ

జాలకున్నావు. అసత్యము, లోభము, వంచనము నగుమార్గమున సంపాదించినసంపద నీ కెట్లాపోవఁగలదు? ముసిఁడిదినిన దేహమున కెంతక్రొవ్వును లావును గలుగునో, శకునికర్ణ దుశ్శాసనులమంత్రితంబును నంతియె గార్యతంత్ర మగును. నీతోఁబుట్టువులును పరాక్రమవంతులునునగు భీమపార్థులు నీపఱచిన పాట్లకు మానసముననైన నీపైఁ బ్రతిక్రియ నెంచక, యింకను నీమైత్రినె కోరుచున్నవారి బాంధవమీవొల్లక, దుర్బలులగులాతివారినె బలవంతులుగను స్వజనములుగను నెంచుచున్న నిబాల్యంపుఁజేష్టల నేమనవలయును! ఇంద్రాదులకైనన జేయులగు పాండవులునీతో భ్రాతృభావమున మిగిలినకాలము గడపఁదలంచియున్నారు. కావున వారి నెడవెట్టకుము. దోసమగుంజుమీ—ఈయున్నరాజులందఱు నొక్కవాయుసుతునకు సరికారుసుమా! ఆతండలిగెనేని దేవాసురవ్రాతముగూడ గడగడ వడకునుజుమా! అమానుషవిక్రముండగు చిత్రసేనుఁడు భీమసేనున కోడిపాఱుట నీ వెఱుంగనివాఁడవుకావు. మీసకలసైన్యములలో నర్జునునెదుర్కుగ నిలువఁదగిన మొనగానినొక్కనిఁజూపఁగలవా? ఫల్గుణుఁడొంటిపోటుమానిసియొ స్వానుభవముకల ఫాలాక్షునకె తెలియును. అట్టిభీమార్జునులు బాసటలైయుండ, రాజ్యభారమెల్ల నీధృతరాష్ట్రునందవెలుంగుచుండ, వారు మీపక్షమున మగటిమిం బరరాజులఁగెల్చి, మీకును సామ్రాజ్యము నభివృద్ధిసేయుచుండ, వలదని నిరాకరించుట, సిరిరామోకాలొడ్డుటయకాదె! వారును మేమునుంగలసియుందు మంటేని, వారిపుడిట్టెయుటవారింఁగలరు. అట్లునుగాదందువేని, మఱిచెప్పకేమి: నీవును, తమ్ములును, కొడుకులును, చెలులును, చుట్టాలును, నొక్కపెట్టున నడుగుమాలిపోవుదురుసుమ! వంశనాశనుండనువాడు నీయట్టి రాకొమరునకుందగునే! అప్రతిష్ఠవచ్చునని యైనఁదలంపఁజాలకున్నావు! ఆపదవాటిలు ననియైనఁ దలంకకున్నావు! అంతలెవ్వుటైనేని, ముందుయుగాలవారుకూడ నిను దూఱుదురుసుమ !

నీతండ్రిపరిపాలనను గౌరవించుచు, నీవును నీ సహోదరులును ఒకవంకను, నీయనుజన్ములగుపాండవు లొకవంకను, అతని కంగరక్షకులైయుండి, స్వధర్మము వీడక, పరధర్మము గుర్తెఱింగి, రాజ్యాంగచింతన మొనర్చుచు, పరరాజుల నోడించుచు, రాజ్యము నభివృద్ధిపఱచుకొనుచు, మీరుసుఖముగజీవించుచుండ, మీకులము తామరతంపరయై విజృంభించునుగదా! అందులకు నీవంగీకరింపవేని యయ్యది నీకొకదూఱగునని చెప్పకతప్పదు. అట్లగుట పాలిది వారికొసంగుట కర్తవ్యము. మీరునుమీరునుంగలసి, మీశత్రురాజులపైఁబడుటధర్మము కాని, మీలో మీ రంతఃకలహములఁబెంచుకొని రణమునఁగూలుట నయదూరతయు, స్వవినాశతయు, నని నీ కింకనుఁదోఁపకున్నదోయి!

నాఁటి యుత్తరగోగ్రహణసమయమునఁ దోము లేకుండ నొంటరిగఁ గిరీటిచేసినపని నెఱింగియేయుంటివికద! ఇపు డేను తోడువడియుండ, విజయు నాహవమున నెదురుకొనఁ దలంచుట మతి తేర్పఁగరాని కీడగుటయెసుమ నీకు! యుద్ధసన్నాహము లిఁకవలవదు సుమ! గెలుపుమాటఁ జెప్పలేముసుమ! నీవు కేవలము పశుబలముపై నాధారపడుచుండుటను పౌరుషము నిర్వర్తింపఁగల దైవమొకటి కలదనియైన గుర్తింపఁజాలకున్నావు. అదియె నీకుఁ బ్రమాదప్రదమై, పరులకుఁ బ్రమోదదాయకమగుంజుమా!

భీష్ముఁడు:—సుయోధన, నీతండ్రిజీవించియుండఁగనే, చేచేతులఁ బ్రాణహానియు సంపన్నాశమును, యశోవినాశమును, ఏలచేసికొనఁ దలఁపడుచున్నావు? నీ జనకునిమాటవిని, రూపొందినపరమాత్మయే యనఁదగిన నీయదుపుంగవుమాటఁ బాటించి, ప్రవర్తింపకుంటేని, చెడుగొందెదవుసుమ!

ద్రోణుఁడు:—రాకుమారా, పితృపితామహ గురులమై నీకును లోకమునకును గల్యాణమునుగూర్పఁగోరుచున్నమాహితోపదేశములవిని, దుర్మంత్రంబులవినక, నీబంధుజనంబులతోడను, లోకులతోడను, పొంది, పొసఁగి, మనుటయె యొప్పును. నిర్బంధాధికార మెన్నంటికిని జిరాయువ్యంతము కానేరదుసుమీ! ఇంతకన్న నిన్నునిండిన కొల్వ్యన నింకేమననగును!

రాయబారము

ధృత:—కుమార, యీ దామోదరువాక్యము లవశ్యాచరణీయములగుట నాయజాతశత్రు నొకకంటఁ జూడుము. అందువలన మన కార్యము లన్నియుఁ దీరఁగలవు. ఇంత దూరము మనకొఱకు శ్రమంపడి, పాండవనిర్దిష్టుఁడై వచ్చిన యీ నారాయణుని పలుకుల నామోదింపవేని మన మెల్ల చేటుకును నిదాన మగుదుము సుమ.

భీష్మ:—యుద్ధమున నీకుసాయమొనర్ప వచ్చిన యెల్లరాజులను జందనాది లేపనమర్యాదలతో పక్వాన్నభోజనసత్కారములతో వారి వారి తావుల కనిపెట్టి తిని లోకమువార లెంతయు శ్లాఘనము నొందదగో యనియైన నూహింపవలదా!

భీష్మద్రోణాదులపలుకులు వినివిని, దుర్యోధనుండు శ్రీకృష్ణునిదిక్కు మొగంబయి నిలచి, రూక్షంబగువీక్షణంబు నిగిడ్చి యిట్లనియెను.

—దుర్యోధనుఁడు—

—యదునందనా (భీష్మాదులం జూపుచు) వీరికన్నులయెదుటఁ బుట్టి పెరిఁగినవాఁడనగుట, నీగురుఁడును పితామహుండును, మాజనకునితోఁ బాటు నను నెల్లవేళలఁ దూరుదురు. నీవును నదేవిధమున నను దూరదొరకొంటివే కాని, తగవొకింతయైనఁ దలంపకున్నావు కదా! పాండవులయెడఁ బ్రేమమున్నదికదా యని, నను నిందించుటే పనిగా నాలోచించితివో! నను నిందించుటవలన నీవారిప్రతిభ మరింత యధికమగునని తలంచితివో! ఇంతకును బాండవులకీవు మూఁడుతరములనాఁటి చుట్టమవు. నీ తండ్రి నాఁడు నీమేనయత్తయగు కుంతిని మాపినతండ్రికిచ్చుట ధర్మజాదులకీవు మేనబావవైతివి; నీనాఁడు నీచెలియలు సుభద్ర నర్జునునకిచ్చి మఱఁదివైతివి. నీయన్నకూతురగు శశిరేఖను నీమేనల్లునకిచ్చి వియ్యంకుఁడవైతివి. ఇట్లీవు వారలకు మూఁడుతరములకుం బెగనిచుట్టమవౌట నెకదా, నీసాయముం గోర నీకడకలనాఁ డేనరుదెంచియు, నీసేన నెగోరుకొని, నినువీడితిని. పాండవేయులకుఁ గనుంగూర్చు చుట్టమవైన నీవును, దూతవైవచ్చియు వీరువలెనే, ననుదూరుచునుంట వింత కాదు కాని, నీవుకూడ, ధర్మమావంతయుఁ దలంపకుండుట మిగులశోచనీయము కాదా!

ఇపుడు నీవు క్రొత్తగ రాయబారినని మఱి యననక్కఱలేదు.

ఈరాయబారములు నీచేనటనాటనె ప్రారంభించినావు. నీవైననేమి; నీ వారైననేమి? నీవుమాకుటుంబకలహములలో నానాఁటఁజోక్యము కలుగఁజేసికొంటివి. మా రెండుపక్షములవారిలో, నిపుడుమాదాయలు నీసాయముగోరుట నిటకువచ్చితి మంచిదేమో! అట్లయిన పోఁ గుంతీ సహితులైనపాండవులు మాయూరునేరి, ఘూంఘటంపెనున్న కాలా సనె, నీవు అకూర్యనిదూతగా మాకు ప్రకటించినను లేదా!

మాటిమాటికిని—మీ రాఁజుదాని నష్టాలుపెట్టితిరి: మేఁ వుడవులఁగడుపిడుమూఁ బడితిమి—అది తా మకారణముగ మాయుడన్లో స్వాషును రోసమూని, తామే యుద్ధవిఘ్నము మన కొని, మమ్ముఁ జంపుటకునుఁ జెఱచుటకును పాండవులుసిద్ధపడియున్నారు. నానుఁ ననావంత యుఁ దప్పులేకుండుట నీకెఱుంగవు. ధర్మరాజుండె జూదరియై సౌబలుని చే నోకపరియోడియు నింకను మూర్ఖుఁడైమఱలనాడినాఁడు. నాకతఁడు విద్యయందాతురమె కాని, ప్రేషిమ లేమి, నాకు మారుగ సౌబలుండె యాడిధర్మరాజుగెలిచి మేఁడనిగై కొనియెంగదా! ఇందుకునేనెట్లుత్తరవాదని కాఁగలనో నీవుఁగూడ యోచింపవలదా? ఇందు నాయందేమి తప్పున్నదందువు? ఇట్లయ్యును ద్రుపదవిరాటాదుల వెంటనిడికొని, తామె తొలుతఁ గయ్యంబునకుఁ గాలుద్రవ్వుచు మాపైవిడిసివచ్చి రంతియ కాని,యిట్టియుగ్రకార్యంబున కేముదొడఁగితిమే? చాలక బలహీనులగతి నలసురపతికైన నెన్నండును మ్రొక్కెడువారము కాము. రాజధర్మము చొప్పునఁ బేరును బ్రతిష్ఠయు నొందియున్న యీయుల నేరఁగాము. శాస్త్ర ధర్మానుగుణముగ సనిమొననిల్చి జయమువడసి భూలోకమొ, రణ రంగమునఁజచ్చిస్వర్గలోకమొ, చూరగొందుము. అంతియ కాని, నా చిన్నతనమునఁ దగవును ధర్మమును నేనెఱుంగకున్న కాలాన, మజ్జనకుండును బితామహుండును, అప్రదేయమును, అవిభాజ్యమునునగు కురుసామ్రాజ్యమునఁ గొంతభాగ మాపాండవులకిచ్చివేసినను, నేరని వాఁడనౌట నేనపుడూరకుంటినే కాని, యిఁకముందువారిమాటల సాగ

నిత్తునే! మానవరుధిరమును జవిచూచిన శార్దూలమెల్లప్పుడును మనుజ రక్తమే కోరుచుండులాగున, దొలిదామనుభవించిన రాజ్యసుఖముల మఱువఁజాలక నేలయేలుదుమనుకొంట పాండవుల దోసముకాకున్న మానెఁగాని, నేనుమాత్ర మానాఁటిమాటలు మఱిముందఁకుఁ జెల్లనీను. కృష్ణా, నీవనుకొనినట్లు భీష్మద్రోణాదులు వారలవారు కారు. ఇది నమ్ముము. వేయేల! ఎవరెవరి పక్షమున నున్నను, వారును మేమును బంచికొని తినియుండుట, మఱిపొందనికత. ఇదిగో చెప్పుచున్నాను వినుము: వాడిసూదిమొన మోపినయంత నేలనైన నే నీయను. మాలో నెవ్వరమైనను, యుద్ధముచేసి గెలిచి రాజ్యమేలవలసినదేగాని, యిక భాగములమాట దలపెట్టకుము. నీనైతికసంభాషణము లికవలదు.

శ్రీకృష్ణుం డీదుర్యోధనునిమాటల కక్కజంపడి "సాంత్వవచనములచే మృదుభాషణములచే మూర్ఖజనహృదయములు ప్రసన్నతామహిమనొందనేరవు. నేనిపుడిటు పరోపదేశములు సేసిన నేమియు లాభముండదు." అని తలంచియుండెనోపు.

— కృష్ణుఁడు —

దుర్యోధనా, నీ పితృపితామహాదులు వెఱఁగులని సూచించితివి; చనువున నినునెల్లప్పుడును దూరుదురంటివి. తగవు నొకింతయు వారు పరికింపరంటివి. నేనును అట్లే తగవుపరికింపనైతి నంటివి.— నినుదూరుటయే మొదటితప్పు; అందునను దగవు దలంపకుంట తప్పులోఁ దప్పు అట్లగుటఁ దగవే తొలుదొల్తఁ బరిశీలింతుము గాక!

నీవు తగవుమాటఁ దలపెట్టి, యలనాఁటి జూదముమాటనెత్తితివి. ధర్మజుం డెబలుజూదరింబోలెఁ దమకించి, సౌబలునిచే నోడి భూమి గోల్పోయియు, ముష్కరుఁడై మఱలినాడ, సౌబలుఁడే గెల్చెననికదా యంటివి. కాని ధర్మజుఁడా జూదమునకుఁ దనకుఁ దావేగిరంపడియెనా! ఎట్లైననేమి, మీ రా జూదమున గెలిచియుఁ, బాండవేయుల ధన సంపద్రాజ్యంబులఁ గైకొనినను మీ తండ్రి వానినెల్ల మరల వారికిచ్చివేయుటకు నీ వవరోధము గల్పింపఁజాలక, యిట్లెన్ని మారు

లోడించి వారిరాజ్యముం గైకొనుచున్నను మీ తండ్రి యిచ్చివేయు
చునే యుండునుగదా యని యెంచి విస్తారమైన పణంబుతో నను
ద్యూతం బేర్పరించి యింద్రప్రస్థంబున నున్న పాండవులను మఱల
రప్పించితివి. పెద్దయుం బుద్ధదేశసస్త్రులుగా నొనర్చినవో, నీ కర్మ
జాదాలు ప్రజాభిమానమునకు పాలియగుదురని యెంచి జూదమున
నీకే తప్పక జయము లభించు నన్నట్లుగా, యోడినవారు
బ్రహ్మచర్యంబునఁ బండ్రెండేండ్లు అరణ్యవాసము నేయవలయు
ననియు, జనసంఘంబున నొక్కయేఁడు అజ్ఞాతవాసంబును జేయవలెననియు
నంకేతింపఁబడి రేని, మరల నజ్ఞాతవాసంబు లోనర్పనుండ
వలెననియు, సమయానుసారంబుగఁ బదుమూఁడేండ్లుమిందరిగి వచ్చి
యఘాతింతి నెవరి ధరాభాగము వారు గైకొనవలెననియు నేర్పఱచితివి.
నిశ్చయించినట్టి వారరణ్యంబుల వన్యమృగంబులకుం జిక్కకయు,
అజ్ఞాతవాసమున నెఱుంగఁబడకయు, మరలివచ్చులోపల వారి ధన
సంపద్రాజ్యంబులను వంచనమొయి నీవశము సేసికొంటివి. ఇపుడు
వారు జయప్రదంబుగ సమయంబు నిర్వర్తించుకొని మరలివచ్చి,
మాయయ్య సగపాలిండని—మా రాజసూయంపుమేదిని నిండని—
నే మూరలేని కాలాన వంచనమొయిమీ రాచికొనిన నేల నిండని—
యడుగ నీవు జూదంపు సమయముల విడిచి, రాజ్యము వీర
భోజ్యముకావున నెవ్వరైనను యుద్ధముచేసి ధరించి గైకొన వలసి
నదేకాని భాగముమాటఁ దలపెట్టవలదని, వాఁడిసూదమొన మోపిన
యంతమైన నేల నే నీయననియన సాహసించితివి. మొదటి
జూదమున నోడిన ధనసంపద్రాజ్యంబులు ధృతరాష్ట్రుఁడు మెచ్చి
యిచ్చివేసెఁగదా యని మఱివానినొడ్డి క్రీడింపఁదగదని యు
ద్ఘాటించినలికి రాజ్యముతో నేమాత్రమును సంబంధములేని విస్తా
రంబైనపణంబుగల యనుద్యూతంబున మీరు గెలిచినదేది? మేదిని
కాదే! అట్లయ్యు నీవు మేదిని గెలువలేదనుమాట విడిచి 'నాకై

శకుని జూదంబాడి మేదిని గెలిచె'నని యంటివి. ఇట్లే నీకర్ణుండుగూడ నా నాఁడా ద్రుపదపురోహితునితో "దుర్యోధనుకొఱకు శకుని జూదంబాడి మేదిని గెలిచె" నని నీమెప్పువడయుటకుఁ గావలయు ననియె. ఇది పట్టి కొఱగానిమాట. మీకు మేదినిచిక్కుట వంచన మార్గముననేకాని జూదమునఁ గాదయ్యె. అట్లగుటనెకదా మీరొనర్చినది యన్యాయాక్రమణమని యొక్కపెట్టున మిములోకమువారాడిపోయుచున్నారు.

ఇఁక రాజ్యార్హతంగూర్చి యోచింతుమన్న జాత్యంధుండగు మీయయ్య రాజ్యపరిపాలనా సమర్థుండగుటయె పాండురాజు జన్మించుటకుఁ గతంబని యుండెఱుంగనివారెవరు? అనంతరము పాండునకె రాజ్యాభిషేచనము సేయుట నాతనిసంతతికె రాజ్యపాలనార్హత కలదని నీతండ్రియు, పెద్దలును నిశ్చయించినారు. చక్రవర్తియగు పాండుని జ్యేష్ఠపుత్రుండగు ధర్మజునకు మీతండ్రి యౌవరాజ్యాభిషేక మొనర్చినాఁడు. నీతి నవలంబించి ధర్మము పాటించి పాండవులపట్ల నీతండ్రి యెంత నయోచితంబుగ నడునఁబోయినను నీనిర్బంధము కతమున నెకదా ఖచితముగఁ బ్రవర్తింపఁజాలకున్నాఁడు. కావున నిఁక నీకొఱగాని మాటలు గట్టిపెట్టుము.

— దుర్యోధనుఁడు —

ఏమాట యెట్టిదైనను నాయెఱింగిన దొక్కమాటయే. నా చిన్నతనమున నాతండ్రితాతలు నాశక్తిసామర్థ్యము లెఱుంగక యేమిచ్చిననిచ్చిరి కాక; మరల నట్లే వారును నీవునుంగలిసి—వారికి పంచి యిచ్చెదము: రాజ్యము పరులపాలుచేసెదము—అనియనిన నేనెటుల సమ్మతింపఁగలను? ఇపుడీకౌరవరాజ్యలక్ష్మియెట్లైననేమి నావశమైనది; నాస్వాధీనానుభవములనున్నది. పెద్దయుంబొద్దు నాకుఁగల యనుభవమే నాస్వామ్యమును స్థిరపఱచుచున్నది. కావున నిపుడు మఱలఁ బంపకపుటాలోచనము సేయవలదు.

యదునందనా, నీకుఁ బాండవులయందు నభిమానమున్న నుండుఁగాక; ఆయభిమానవశమున సామాన్యధర్మములఁగూడ మఱచి పోవుచున్నావు. అంతియేకాని ధృతరాష్ట్రసుతుఁడను, పాండుపుత్రదోషములు నీవు గుర్తింపఁజేయకున్నాఁడవు!

పాండవులందఱును మా తండ్రి రాజ్యమునకు [illegible]: రాజ్యార్హతలేనివాఁడనంతరాగమున మొక్కఁడైన రాజ్యార్హతా యసియుంటివి. అట్టి రాజ్యార్హతాపేరు రాజనంగాని, ఆతనిసంతానమును గాని, పాండవులకుఁ బాలివ్వఁగలరని నీవిట్లు పలుకుట యెట్టిమాత్ర మేమి సమంజసముగనున్నది? పాండుఁడు సంపాదించిన మేలుఁదము నేలఁగక దేశాంతరము పోయినను, త్రిసంపద్రాజ్యమును, సైన్యములంగానుండు, మా తండ్రి పేరఁ బ్రవర్తించినను, ఆతనికి గౌరవముగ దనకుసంతానము కలుగకయున్న రాజ్యము వీరిదేయగునా? హరింపుకొనఁ బోయిన పాండుని కొడుకులు రాజ్యార్హులా? ఆతఁడు జీవించియుండఁగనే మన మోహనాంగులైనసంతానము కర్కశమూరి యయ్యెడుగు రసి కుంతి దేవర్ష్యకృపనిచ్చినవారమాతాత్రిస, వారికి రాజ్యమున భాగమీయవలె నేమి? ఇఁక పాండురాజు రాజసూయంబున నలవరచికొనినదని నీవనిన రాజ్యభాగముగాఁజ్ఞ యోచింతమన్న కౌరవరాజ్యపక్షమున మా తండ్రిశ్రేయముకోరుచు నాతఁడు నెఱపినరాజసూయమున నయిన నేలయెల్లఁ గురురాజ్యవిస్తారమునకె యగునుగాని, పాండునిస్వకృత పుటనుభవమునకుఁగాదని ప్రాజ్ఞులైనను దెలుపకమానరు. అల్లుగుట్టఁ బాండునికొఱకి ధరణీకరణములెల్లఁ గురుభూపతిగా నాసింహాసనముకొని సింహాసనమునఁ గూర్చుండినవానికే సంక్రమించినవి. పిదప మా తండ్రిదయచే ధర్మజుండుఁ దనదిన ఖాండవమునఁ ఆ నింద్రప్రస్థము నిర్మించుకొనిన పిమ్మట, దాని సరి గుల రాజసూయమువలనెల్ల కురురాజ్య విస్తారంబునకును, కురుమహీపాలుని యశోవిజృంభణమునకును నని యాభీష్మాదులు మాతండ్రితోఁ దొలి ప్రసంగించియుండుటకాక, నీవును

నుద్ఘాటించియె యుంటివి. కావునం “పాండవులు దిగ్విజయంబు సేసి యలవరించికొనినదగుట” యనునీమాటకు మఱి ప్రయోజనము లేదు. అట్లగుటం బాండవులకుం బైతృకంబగునట్టిది యనియనుట కేదియు నట్లులేదు. దిగ్విజయంబున వారు వడసినది యనియనుట కేదియునిట్లు లేదు. ఇంక మిగిలినదేది? మేము వారిని పరిభవించినను, వారు సైరణ నొంది మాపైం దెగి యింతవరకును, మాకుం గీడు రోయమి, మేము మెచ్చి, యనుద్యూతము నాంటికి వారియనుభవముననున్న సంపద వారి కొసంగవలయు నన్న నీ సిద్ధాంతమె మిగిలియున్నది. నీ విపుడనిన వారి సైరణ సమర్థులయియుండియుం బారమార్థికచింతతోం జూపిన సైరణయెయైనచో, నొకింత చింతింపవలసినదే! కాని యటుగాక, అసహాయులై, అసమర్థులై, నేమి సేయుటకును వలనుపడక, అనుద్యూతంబునం దెగి దేశాలంబడి పోయి, యిప్పటిదాంక వారికి నుసము యమూచిక్కమి కాలానుగుణముగ నలవడిన సైరణ చూపిచూపి మాకుం దొలినుండియు శత్రువర్గములోనివారును ముష్కరులును నగు పాంచాలురతో సంబంధ బాంధవ్యముల నెఱపికొని, తదనంతరము కొండకోయజాతులవారగు మాత్స్యులతో నిచ్చిపుచ్చికొనుటలు సలిపికొని, యెట్టకేలకు వారివారి సహాయమున మాపై నెత్తివచ్చినంత మాత్రాన సామ్రాజ్యధురంధరులమగు మేము వారికి లొంగుపాటు సూపి, మఱియుం గ్రిందుపాటును దన్మూలమున దుఃఖముపాటును బొందునంతటి యవసరము మాకు లేదు. మాలో నెవరమయినను, యుద్ధమునం గెలిచి, రాజ్యమును నిరాఘాటముగం బొందవలసినదే కాని, యింకొకమార్గము లేదు.

కావున నింక నా నేరమేమియు నెన్నందును లేదు.

— కృష్ణుండు —

ఏమేమీ! నీ నేరమె లేదందువా? నీ జన్మించినదాదిగ నీవు చేసినవన్నియును నేరములే-ఒకనాండు తప్పుచేసియు, నింకొకనాండు

మానియు, నుంటివికనుకనా? ఎన్నియని చెప్పఁబూనుదును! విషాన్నము వెట్టించినావు; పాములచేఁ గఱపించినావు; నీటఁ ద్రోయించినావు; లక్కయింటనుంచి కాల్పించినావు; ఓర్వలేక కపటద్యూతము గల్పించి, అడవులం బట్టఁజేసినావు. అంతతోనాగక, జూదపుఁబందెముతో సంబంధములేని రాజ్యమును వంచనమెయి నాక్రమించినావు. ఇపుడు దాని నపహరింపఁజూచుచున్నావు. మీయన్నదమ్ములతోగవ్వులలో నిండుపేరోలగము నడుమకుఁ గులాంగనను జుట్టువట్టి యీడ్పించుటతో నైన నాగక, వలువ లొలిపించు నంతటి రాక్షసకృత్యమునకు వెనుదీసినావు కావు. అందుదాని బట్టనట్టి యక్కటులు పెట్టుటా యన్నియైన నెపద నపఖ్యాతిగానినావు కావు. నీభార్యయగు భానుమతి నందన్నను నామెమాటలం జెవిఁబెట్టినావు కావు. మానభంగమునకు నిలువెల్లనచ్చి నిలచియున్న యమ్మానినిం గూరుచుండరమ్మని నీతొడఁజూపించినావు. నీమాటలవిని, నీయూహల పోకడగమనించి, పాపము! కర్ణుఁడుగూడ నినుసంతోషపఱుపనో నీయిచ్ఛకముగోరియో, పడితమ్మన్యులు దలంచురీతిని రాజభక్తినో తనకుసంబంధములేని యధిక ప్రసంగముల నెఱపినాఁడు. ఇన్నియుఁ జూచియు, వినియు నెఱింగియున్న యలనాటిపెద్దలందఱు నిపుడు వినుచుండగనే నీమెడ నిసుమంతయు నేరములే దనుచున్నావే! ఇంకేటి దుర్మానము నీయట్టి రాకొమరునకుఁ దగదుసుమీ!

(స్వగతము) ఇంతమాత్సర్య మీతఁడా పాండవేయులయెడ నొందుటకుఁ గతం జేసియో, వినిముఖమున నె రానిచ్చెదఁగాక!

(ప్రకాశముగా) పోనిమ్ము, సుయోధనా! నీకువారియెడనింత క్రౌర్యమేల నావహించె? ఒకింత వివరింపఁగలవా?

— దుర్యోధనుఁడు —

మహాపురుషుండవనియు, దైవమవేయనియు, జనంబులచే స్తుతియింపబడుచున్న నీయట్టిదు మాకుటుంబకలహములలో, రాష్ట్రము

లోఁగొన్ని సేగంటకు సంభవించిన తగవులలో, జోక్యము కలుగఁజేసికొనుట తగియుండలేదు. ఇపుడు మాపూర్వవైరకారణముల వెలివెట్టుమని నన్నేల చెప్పెదవు? వారియెడ నీకుఁగల యభిమానంపుఁ బెంపున నీకివు సవియన్నియు సత్యములుగాఁ దోఁపవచ్చును. గాని మాకవి యన్నియు ననుభవములైనవి.

నిజముగ ధర్మజాదులు పాండురాజపుత్రులే కారు. గాలికిని ధూళికినిఁ బుట్టి పెరిఁగిన వారిని పాండుపుత్రులని కుంతి తోడ్కొనివచ్చినది. మాయయ్య యనాథనుకొని వారిని జేరఁదీసి తిన నన్నమును, గట్టబట్టయు నొసంగి, మాతోఁబాటుగ శస్త్రవిద్యాభ్యాసమును, శాస్త్రపాండితీగరిమయు నొదవఁజేసి రాజమర్యాదలనెల్లఁ జరుపుట, మాకెంతటి పరిభవమునకైనను గతమైనది.

ఇఁక రాజ్యమునఁ బాండవేయులు కొంత యధికారము కలదో యోచింతుమన్న సింహాసనమునఁ గూరుచుండిన మాయయ్య యనుమతిని, మా పినతండ్రి దేశాలపైఁబడి సామంతరాజులనుండి కప్పములఁ గొనుట, విరోధివర్గమును కడఁగించి వారి దేశాల స్వాధీన పఱచికొని కురురాజ్యము నభివృద్ధిసేయుట, లోనుగాఁగల కార్యములొనర్చుచుండెను గదా! అట్టిపట్టున, సింహాసనముపైఁ గూరుచుండి, రాజనిపించుకొనిన మా తండ్రిదే రాజ్యమగుంగాని, కన్నుగలిగి నలుదెన్నులఁ దిరుగుచుఁ బ్రజలకుఁ దలలోనాలుకయై అందఱిమంచితనమును బొందినంత మాత్రమునఁ బాండునకు రాజ్యమునందు స్వత్వ మెక్కడ నుండియుండఁగలదు? అట్లు తండ్రికే లేనియధికారము కొమరులకెట్లు లభింపఁగలదు? ఏ రాజ్యమునైన, నే కాలమునైన నిద్దరు రాజులుండుట కాని, రాజ్యము పంచికొనుట కాని సంప్రదాయము కాదే! ఇఁక పాండుపుత్రులని పిలిపించుకొనిన ధర్మరాజాదుల మాటఁ దలంతుమనిన వారికి రాజ్యమున భాగమిమ్మని మాతండ్రిని భీష్మవిదురాదిపరిపాలక వర్గము వారు వేధింప వేధింప మాతండ్రియు వేలతనానఁ దన

తమ్ముఁడగు పాండునియందలి ప్రేముడికతమునఁ బరిపాలక వర్గము వారియెడఁగల భక్తి పెంపున నప్పటికిఁ జిఱుతవాండ్రమగు మాశక్తి యుక్తుల నెఱుంగమి పాండవాగ్రజునకు మాయాఖండ కౌరవ రాజ్యలక్ష్మికి యౌవరాజ్యపట్టాభిషేకము నొనర్చెననుమాట నే కాదనను. కాని యప్ప టికే మాతో నాటపాటలసమయాన. విద్యాభ్యాసన కాలాన, నప్పటా లని, యాటలని, మమ్మాభీమసేనుఁడు, పట్టిచినవాళ్లనిపుడు నీసమ క్షమునఁ జేర్పానుటు, యింకను నేము క్రిందగుటకే యగును. మఱి కొంతకాలమునకు నేనుమాతండ్రిచెవినిలుగట్టుకొని మొఱపెట్టమొఱ పెట్ట, తుట్టతుదకెట్టులైననేమి, మాతండ్రి ధర్మజునర్ధరాజ్యమున కభి షిక్తుం జేసెను. పాండురాజపరిపాలన విధానమును, భీముఁడు నెప బా యని ప్రజాభిమానమును, ఎఱింగిన ప్రజలు పాండుపుత్రులని యనిపించు కొనుతిగుగు ధర్మజాదులనుఁగూడ, నాదరము పెంపున, ప్రేమమెయిని, గౌరవించునంతదూరమైనను, కౌరవ రాజ్యలక్ష్మి ధూర్వహాని పుత్రులమగు మము గౌరవింపమి, మేమోర్వఁజాలక, క్షత్రియసామా న్యమగు నూపోషమి నొందియుండుట యనహాజమెట్లగునో యిప్పటి కిని మాకుబోధపడలేదు. సంబంధము విస్పష్టము కాకయె, పాండు పుత్రులమని ప్రకటించుకొనుచుఁ దిరుగుచుండినవారు మాప్రజలచే గౌరవింపఁబడుటయును, ఉత్తరాధికారమువహింప నర్హులమగు మేము ప్రజాభిమానమును బ్రజాగౌరవమును, దొలంగియుండుటయును, తెలిసి కొని, ధర్మజాదుల దవుదవ్వుల కనుపనిశ్చయించితిమి. ఎట్టకేలకు మాతండ్రిచేవారికి ఖాండవమొసంగఁజేసి వారి నటకనిపితిమి. మాకు స్వప్రతిష్ఠితముచేసికొనిన రాజ్యమును మేము నిశ్శంకంబుగ, నిరంకుశం బుగ, నిర్విఘ్నంబుగ పరిపాలించుకొనుచు కర్ణునిచేదిగ్విజయయాత్రలఁ జేయించుచున్న సమయాన, నావివ్వచ్చుఁడు ఖాండవవనమున నున్న కొండకోయజాతులవారిని, సింహశార్దూలాది వన్యమృగములను, నిర్మూలన మొనర్చి, మయాచార్యుని ప్రాణములరక్షించి, యాతనిచే

మయసభఁగానుకగాఁగొని, రాజసూయము సేయ నెంచి అందఱరాజులతోఁబాటు ననుఁగూడ నాహ్వానమొనర్చెను. నేనును జూడఁబోతిని. ఆమయసభ మాయసభయని యెఱుంగక దానివిన్నాణముఁ జూడఁబోవ భ్రమాకరములగు పెక్కుతావుల మోసపోయి నే నిలుగులొందుచుండ, అట్టినాపాటులఁ జూచుటకే యొకమూల పొంచివేచియున్న ద్రౌపదీభీములు దారుణాట్టహాసమున ననుబరాభూతుం జేసి మఱింత నొగులఁజేసిరి. ఆజన్మమును మఱుపునకురాని యుమ్మలిక మొక్కనఁ గూర్చిరి. ఆపరిభవభూతము నను నెందిప్పిన నేనెటుదిరుగుదును. నే నొందినపరిభవప్రతిమకొలఁదియే, వారి నెంతకాలము జనావాసముల నుండి దూరము సేయఁగలదో, ఎన్నెన్ని విధాలఁ బరిభవమొనర్పఁగలదో, వారికెన్నెన్ని యిక్కట్టులు సమకూర్పఁగలదో, అన్నన్ని విధాలఁ బ్రయత్నించెనను మాట నేను కాదనను.—విషాన్నము పెట్టితిరి; నీటిలోఁద్రోసితిరి—యని మాపై నిందలు మోపఁజూతురే కాని, యవియన్నియు భీముని బాధలకోర్వఁజాలక చేసినపనులని నీకుఁదోఁపకున్నమానెగాని, ఆపూర్వగాథలన్నియు నానుపూర్వముగ నెఱిఁగిన యీకురువృద్ధులు గూడ, వారియెడ నక్రమముగ నీవు పక్షమూనుటను, నీయెదుట వాకొనుటకైన సమ్మతింపకున్నారు.

జ్యేష్ఠకుటుంబములోనివారమగు మాకు ధర్మజుని రాజసూయసమయవైభవముఁ జూచి క్షత్రియసామాన్యపుటీసు జనించినదనుమాటయు నసత్యము కాదు. మయసభలో భ్రమప్రమాదముల వలనఁ గాలుజారిపడినప్పుడు ద్రౌపదీభీములు పరిహసించుటచే ద్విగుణీకృతమైన పరిభవము ద్యూతకార్యమున కంకురమైనది. పిదపఁ జరిగినదంతయు నీ కెఱుక లేనిది కాదు.

తన నేర్పులేమిని ద్యూతానుద్యూతములయందు మేమే గెలిచితిమి కాని, ధర్మజుండే గెలిచినచో, మా సంపద్రాజ్యంబులఁ దాఁగైకొనకుండునోటు! మమ్ముఁడవుల కనుపకుండునోటు! మొదటిజూదమునఁ

దానోడియు రెండవతూరి ధర్మరాజుఁడు ద్యూతమునకు సిద్ధపడుట మమ్మోహించుననూహపొందకాదో! తానేయోడి యరణ్యాజ్ఞాతవాసములనలుప నిచ్ఛకలిగియే జూదమునకుఁ బూనెనని నిక్కైన ననఁగలవా! తననేర్పులేమిఁ దెలిసికొనమియని నిక్కైన నూహింపఁజాలవా! తొలియాటనోడియు రెండవతూరి యనుద్యూతమునకు సిద్ధపడుచున్న ధర్మరాజుని భీమార్జునులో, పరిమవుత్రి, ద్రౌపదియో, యడ్డగింపియు నేల వారింపకుండిరో? అప్పుడే నీతిమయముగాని, మఱియు నిప్పుడో పనుదుమా-యని వారు దలంపకుండిరని నీవనఁగలవా? 'ఈతూరి ధర్మరాజు జేజయించును: అనుద్యూతపు సమయము ననుసరించి దుర్యోధనుఁడే వనవాసాదులకనుభవించునన్న' యను దురాశచేతనే మఱియనాఁడిరి: కాని జూదమాడరమ్మనిన రాక యుండరాదని కాదు ధర్మరాజుఁ డనుద్యూతమునకు సమ్మతించుట! మఱియు జూదమునఁ దప్పక తానే గెలుతునను నూహయే తనకు లేకున్నచో, భార్యనొడ్డుటకియ్యకొనునే? జూదాన భార్యనొడ్డినవాఁ డీలోకమున నుండునే? తనభార్యనొడ్డి, మాఁకప్పగించి వేసి, తానుతమ్ములకుఁ గొప్పు పశ్చాత్తాపముననే యన్నిరొచ్చె ననఁగలవా! తొలిజూదమున వారోడినపిదప ద్రౌపదిని సభకీడ్చుకొనవచ్చుట ధర్మరాజుని రాజసూయ సమయమున మయసభలో తను హేళనము చేసినదానికిఁ బ్రతిగాఁ జేసిన యవమానముగా నేల నీవూహింపరాదు! నేనా సభకుఁ దోకొనిరమ్మని ప్రాతికామిని రాణివాసమునకనుప, నాయభిమానవతి, ద్రౌపద, మా ప్రాతికామినిఁ దిరస్కరించి పలికి తన ప్రౌఢతనము సూచించుచుఁ బెంకిప్రశ్నలు వేయ తాత్కాలిక క్రోధముచే దుశ్శాసనుఁడు ద్రౌపదీకేశగ్రహణము చేసిన చేసియుండును. అది నే నెట్లు కాదనఁగలను? కాని తన్నా సభకు రప్పించితినిగదా యనునీర్ష్యచేఁ దనసమయస్ఫూర్తిచే నపవాదమును నా నెత్తిని బెట్టుటకే రజస్వలా వేషము వేసినది. చెఱగుమాసెనని పలికినపలుకులు తనయయుక్త ప్రవర్తన కనురూపకములై నెగడునవే కాని సత్యములు కాఁజాలవు.

సభనున్న వారిమనసులఁ గరఁగించుటకును, మమ్మెంతయును నిందించుటకును, మేమవినీతులమను ప్రవాదమును బలీయము చేయుటకును గుఱి చేసి, పాండవులును, వారిపక్షమువారునుం గలిసి పుట్టించిన గాలివార్తలే కాని నిక్కువములు కాఁజాలవు. వానినూఁత గాఁగొని, నీవేమో గొడవలుపలుకుచున్నావు. ఇంకొక్కమాట! పాండవులైదుగురకును నైదుగురు ప్రత్యేకపుభార్యలుండఁగా నయ్యేదుగురకును నొక్కతె యగు ద్రోవదినిమాత్రమే మేము సభకీడ్పించం బనిచేమి? అర్జునుభార్యయగు మాసుభద్రకలదని మేమెఱుంగమే? సహదేవు సహధర్మచారిణియగు విజయ నేల తలంపకుంటిమి? నకులుకులాంగన యగు రేణుమతి నేల సభకు రప్పింపమైతిమి? ఇంతమాత్రమేని నీవునుం గూడ నూహింపకుంటివో? మముఁ బరినట్టి పరిభవించిన నాబంధకినే మేమును బరిభవమొనర్చితిమి. ఇందేమియు మా నేరము లేదు.

వారికి రాజ్యమున భాగమే లేదనియు, వారు బ్రదికియున్నంత కాలమును మాతండ్రి యేదేనొకమిషచే వారికిచ్చుచునే యుండును గదా యనియు నెంచి శత్రువినాశ మొనరించి మా సామ్రాజ్యరక్షణ మొనర్చికొనఁ బ్రయత్నించుట మాతప్పని నీవనవలె నంతేకాని వేఱొకరిట్లన సాహసింతురే! మఱియు మేమెన్ని చేసితిమంటివో యవి యన్నియు నీకౌంతేయుల మొఱవడిగలచేష్టలవలన నయ్యినవి; అంతే కాని, ప్రత్యేకముగ మాయింటఁబుట్టినవారిని మేము బాధించితిమని నీవును, నీయట్టి పాండవపక్షపాతులును గాక యన్యులెవరును నన సాహసింపఁజాలరు. వేయేల! మాకును మాకునుంగల వైరకారణము లీనాఁటివి కావు. ఇట్టి చిరకాలమునాఁటి కారణములు మమ్ములను వారినిం గూడ గాసిలఁ జేయుట సత్యమె. కాని సంధిపలుకులకు వచ్చిన నీవేమాత్రము ధార్మికుండవైనను, నీయందున్నదని కొందఱు వాకొనుచున్న దేవాంశ యేమాత్రమున్నను, దేవాంశకు విరుద్ధముగఁ బక్షమూనక మాకును వారికిని బరస్పరము సంభవించిన పరాభవములును, యిక్కట్టులును

నీప్రమాణ్యఁగలిగినఁగదా, నీపలుకులయందును, నీవచ్చిన కార్యమునందును మాకువిశ్వాసమును గౌరవమును గలుగుట!

—కృష్ణుఁడు—

చాలు-చాలు-నీ కుతర్కములును,నీతుచ్ఛపలుకులును! నీవు కోరినటుల యుద్ధమేసిద్ధములే. కాని నీవాడినమాటలలో నెన్నియో కానిమాటలున్నవి నీవాడినప్రతివాక్యమును ఖండింపఁబడఁదగినదియే. యైయున్నను, ప్రధానవాక్యములలో నొకటి రెండు మాత్రమే సూచించి నీవాంఛితకార్యమే సిద్ధించునట్లొనర్పఁగలను.

ధర్మరాజాదులు పాండునందనులే కారనియుంటివి. వారుగాలికిని ధూళికినిబుట్టిపెరిఁగిన వారంటివి — నీవొకమాట యొకరిని బాధింపఁగాక యనినమ్మించి యెంతొమనువో, వారంతయునునాడిన నీవోర్వఁగలవో లేదోతొలి యాలోచించుకొనియేనీవంతయునాడియుందువు. పాండవులు పాండుభూపాలతనయులే యని నేనిపుడీసభను పూర్వోక్తసిద్ధాంతములు సేయఁబూని, యీపూరువంశమునెత్తిపెట్టినచో, నీవును నేనుమంగూడఁ గ్రిందయి, యీయున్నవారలంగూడ మఱియుఁ గ్రిందుపఱచుటయె యగును. అది కానిపని. కాని ప్రజాభివృద్ధియుఁ ధర్మసమన్వయమును బ్రధానములుగా నెంచినమన పెద్దల నగౌరవించి, వారొసర్చిన కార్యములు దలక్రిందుసేయఁబోయినచో మనమె యెంతేని గ్రిందగుదుము కదా! మనతండ్రితాతలచేతలఁ దెగడుసంతతివారమె మనమయిన, నిఁకమనసంతానవుమాత్రమేనా, మనలం దెగడనోడు?

ఇంతకు, నీ మునీశ్వరులును, నీపెద్దలును రాజ్యపాలకవర్గమువారును, పాండునందనులని ధర్మజాదుల సంగీకరించి, కురుసామ్రాజ్యపట్టభద్రుఁడగు పాండునియగ్రనందనునకె యౌవరాజ్య పట్టాభిషేకముచేసియుండిరి. ఇపుడదికాదని నీవనఁజెల్లునే? కావున నిపుడిక జన్మములవృత్తాంతములను, వంశచరిత్రములను నెన్నికొనుటకంటె కౌరవరాజ్యమవిభాజ్యమనియు, నప్రదేయమ్మనియు నీవనిన పలుకులె పరికింపఁ దగినవి.

రాయబారము

మీ ప్రతీపునిచే ప్రేమమెయి నొసంగఁబడిన బాహ్లీకదేశమును బరిపాలించుకొనుచు,—అదెవాఁడును (బాహ్లీకునిం జూపుచు) బాహ్లీకుఁడు స్వతంత్రుఁడై మైత్రిమెయి మీకుఁ జేదోడును వాదోడునునై యిపుడు మీచే నెలుపఁబడు సమరాధ్వరమున ఋత్విజులలో నొకఁడుగా నిలఁగలఁడే!

అజమీఢుని తృతీయపుత్త్రుండగు దుష్యంతుని సంతతివారు తొలి పౌరరాజ్యమునం దొకభాగమగు పాంచాలమును జగడము సేసి వేరుపఱచికొని, తాము పటుకుఁబోయి, తద్రాజ్యము నేలుకొనుచుఁ బాంచాలురను నామమున వ్యవహరింపఁబడుచుండలేదా! అట్లగుట మీ రాజ్య మవిభాజ్యమని మఱి యనకుము.

కర్ణునకు నీవంగరాజ్య మొసంగలేదా! కావున నిఁక నీ భారతభూమి అప్రదేయ మని మఱి యనకుము.

ఇఁక మీ రాజ్యము జ్యేష్ఠక్రమానుగతము తప్పెనే యనుటకు నుదాహరణములు నూఱువా! ప్రప్రథమముననే నహుషచక్రవర్తి కుమారుండగు యయాతి కాలమున నాతని జ్యేష్ఠపుత్త్రుండగు యదువునకుఁ గాక కనిష్ఠుండగు పూరునకు రాజ్యము దక్కెను.

ప్రతీపుని జ్యేష్ఠపుత్త్రుండగు దేవాపి పాషండమతావలంబకుండగుట చక్రవర్తిపదమున కనర్హుండగుటను, ఆతని తమ్ముండగు శంతనుఁడే రాజ్యాభిషేచనమందెను.

శంతను జ్యేష్ఠపుత్త్రుండగు, నీ దేవవ్రతుఁడు రాజ్యము వీడి పెండ్లియాడక బ్రహ్మచర్యంబున నుంట భీష్ముని తమ్ముండగు విచిత్రవీర్యుండే రాజయ్యెను.

అనంతరము, విచిత్రవీర్యుని సంతానములో జ్యేష్ఠుండగు నీ తండ్రి జాత్యంధతచే రాజ్యమున కనర్హుండగుట విమలచరిత్రుండగు పాండుఁడే, రాజ్యాభిషేచనమందినాఁడు. కావున మీ పౌరసామ్రాజ్యపాలనాధికారము జ్యేష్ఠానుక్రమముగ నడచెననుమాట మఱి యనకుము.

కావున పౌరరాజ్య మవిభాజ్యమనిగాని, అప్రదేయమనిగాని, జ్యేష్ఠక్రమానుగతమే యనిగాని మఱియనకుము.

*   *   *   *   *

ఔను—ఏమనుటకైనను, నీ కౌరవసామ్రాజ్య విస్తీర్ణత యైన నీవెఱింగియున్నఁగదా! నీ తండ్రి ధర్మజుని యౌవరాజ్యాభిషిక్తునిగా నొనర్చిన పిదప నీవు చూపోపమిని పాండవుల లక్కయింటఁ గాల్పింప, వారి వసిపిన వారణావతమును, ద్యూతసభాప్రవేశమునకుఁ బాండవుల రావించిన ఇంద్రప్రస్థమును, పాండవులకు విషాన్నము పెట్టించిన వృకస్థలమును మాత్రము నీ కొసంగుదువు. అట్లగుటనె కదా యింతవంతకుఁ గతంబగుచున్నది.

ప్రజాభివృద్ధియు, ధర్మసమన్వయమును ప్రధానములుగా నెంచిన మన పెద్దలను గౌరవింపక, వారాకాలమున నొనర్చిన కార్యములను మన మిపుడు తేలికసేయఁ బోయినచో మన మేయుండఁ దేని గ్రిందగుదుమనుట నిర్వివాదాంశము కాదా! మాతృశ్రీ తాతలఁ జేతలఁ బెగడు నంతటి వారమె మనము? మనుస, నిక మనసంతానము మాత్రమేనా మనలం బెగడనోపును!

తమతండ్రియగు పాండురాజు రాజ్యరక్షణ చేయుటను, ధర్మరాజు నీజనకునివలన నీపూర్వరాజ్యాభిషేకము చేయఁబడినను భారతసామ్రాజ్యము నంతకును జక్రవర్తియయ్యెను, జగద్విఖ్యాతమైన నఖండమగు భరతఖండమును వైశాల్యమును బలమును గలిగియు, జనక్షయకారణమగు యుద్ధము నొల్లమి నేకద, తమ యర్ధరాజ్యమైన నొసంగ వలదాయని ధర్మరాజు డడుగుట!

దుర్యోధనా, ఇంక సంవాదములలో నేను ఖండింపక మిగిలిపోయినవి మఱి లేవు. కాని చెప్పఁదగినదిమాత్రము మిగిలిపోయినది.

ఎట్లయినను బాండవులు నియ్యాలు మన నీయకుండఁ జేయఁదలంచిన నీ మొదటిప్రయత్నములన్నియు వితయగుట నేవంచనమార్గముననైన వారిని ప్రజాభిమానమునకు దూరులుగ నొనర్ప నెంచి కపటద్యూతమున నీవు వారి నెంతెంతలు పఱిచి మాచినను, వశీకృతచిత్తుఁడగు ధర్మజుఁడు పరమవివేకియగుటను, నీదురాత్మనమునింతవట్టు చెల్లనిచ్చినాఁడు! ఆతనివశీకృతచిత్తత నీమెప్పవడయుటకు బనికలుగ, నీవలన వారియందసమర్థత నారోపింపఁ జేసినది. మాయురే! దురాత్మనులును, దురహంకారులు నిట్లెకదా వర్తింతురు! ఇన్నియునైనవి కాని, యింక మిగిలినది, నీకోరినది, యుద్ధమెకదా! అదియు సిద్ధములే! రేపే ప్రారంభమగులే! సరియా! ఇంకనైనను దృప్తిమైనదా? నీహృదయధర్మము నీవలన నెఱుంగఁ దలంచితిని. సౌమ్యసంభాషణంబున నేమాత్రమువీలున్నను సంధిజరిగితీరవలెనని పొరలితిని. మీపూర్వవృత్తము నెఱుంగఁ జేసితిని.

మీకుటుంబగౌరవములపోఁడిమిఁ దెలిపితిని. వేఁడుకోలు నంబలికితిని. నిను వంటివీరపురుషులను భారతభూమి గోల్పోవునట్లు చేయవలదంటిని. భారత భూమికి వీరభిక్ష నిడుమని యాచింపవచ్చిన యాచకుండనంటిని. మఱి మఱి యెంతో క్రిందయి పలికితిని. నామాటలకు జీదకన్నిడిన నీతండ్రివలెనే, నీవును నామాటలఁ బెడచెవినిడి, యుద్ధమే కావలె నంటివి. జ్ఞాతివర్గమనియెడు నగ్నిని సంపూర్ణముగ నార్పసమర్థమగు మార్గము యుద్ధముదక్క నింకొకటి లేదని దృఢముగ నమ్ముటను గావలయు పౌరుషమునఁ గార్యము మఱి జక్కఁబడనిచ్చినావు కావు! లోకమున కెంతకళ్యాణప్రదమైనదైనను, అది నీయూహాల కేమాత్రమేని భిన్నమైనదైనచో, మఱి నీవు విననైన నోపవు కావలయు! 'కృష్ణుఁడే యీసంధికార్యమునకుఁ దానుగఁ బోయి ప్రయత్నించినచోఁ గార్యము సానుకూలపడదే' యను లోకమువారి సంశయము దీర్చివేసినావు. దూరమున నున్న నీభ్రాతృవర్గమును దరిఁజేర్చుకొని అభిమానము చూపినావు కావు. జనకవిహీనులగు వారిపై నీతండ్రివలెనైనను జాలిఁ దలంచినావు కావు. నీతో నింతదూరము ప్రసంగించిన నాయెడనైన నావంతయుఁ గౌరవ ముంచినావు కావు. కృష్ణునకు సంధియనూహా సంకల్పముననే వికల్పమగుట, మఱి సంధి కుదిరినదికాదను రవ్వకు మాత్రము నను బాల్పడఁజేసినావు!

—సంధిచెడఁగొట్టికొనియా వచ్చితివి— అనుధర్మజుమాటకు నను లోఁబడఁజేసినావు. సిద్ధపఱచికొనియున్న యుద్ధముమాననని, పాండవుల ప్రార్థన నంగీకరింపనని, వారి కేమియు నీయనని, యుద్ధమే కావలెనని నీవు భీష్మించుకొనియుంట నీసంధి మఱి పొసఁగలేదేమో యనియైనఁ జనసామాన్యమే కాక పండితపుంగవులు కూడ నూహింపఁ జాలక, సంధికార్యవిధ్వంసమునకు నేనే కారకుండనని నాపైనిడునట్టి రట్టునకు నను లోబడఁజేయ నిశ్చయించినావు. నా ప్రయత్నములన్నియును, ఇంతవఱకును నా నెఱపిన ప్రసంగములన్నియు, నిపుడిటఁ జేరియున్న యీమునుల తత్త్వబోధనలన్నియు నిట్లు బూడిదం బోసిన పన్నీరయి

యింతసంపూర్ణముగ విఫలములగుటకుఁగారణ మింకేదియో నీమనోగతమైనది యుండియుండకపోదు. ఏకారణ మెట్లున్నను నైతికముగ నేవ రెంతచెప్పినను నీవువినక తుదకు ననుఖిన్నతతో మరలఁజేసినావే కాని మఱిసంతోషమునఁ బోనిచ్చినావుకావు. కాని ఆహావము మాత్రమువినోదముకాదు. నీపట్టినపట్టునకింత సడలింపుము. అటుగాక సంగ్రామమె సర్వశ్రేయమంటని సామ్రాజ్య లోభమున సంపూర్ణజ్ఞాతిచ్ఛేదనేచ్ఛచే నీవును, మీ రెవలకొనరించిన అమానుష, అనైసర్గిక వంచనవ్యాపారములచే వారును, దందహ్యమానమానసులై యున్నారు. కావున, నింక నిట్టివారికి యుద్ధమేజరిగినచో, నేసమయమున కేదిసంఘటిలిన నాసంఘటనకుఁదగిన ధర్మసూక్ష్మము లప్పటికప్పుడేర్పడి, మఱియుఁబ్రవర్తిల్లఁగలవుసుమా! రాజనీతియు, మంత్రరక్షణ కళయు బహుదారుణములై, మిక్కిలిసూక్ష్మములై యెట్లుద్రిప్పిన నట్లుతిరిగెడిస్వభావమున భిన్నభిన్నరూపములందాలిచి, పరివర్తింపఁగలవుసుమ!—పదునొకండక్షౌహిణులు మాకుఁగలవు: వారి కేడేకద-యనియనుకొనకుమా! కేవలము సైన్యములే ప్రధానములుకావు జయమునకు! దైవానుకూలతయు నుండవలెను. నీవనుకొనుచున్న నిమిత్తమాత్రోపకరణములగుసైన్యములపై నాధారపడుట కేవలము పశుబలముపై నాధారపడుటయే యగునుజుమా! దుర్యోధన, నిర్బంధమును, దుర్మానమును దుర్బుద్ధికెకాక తక్కొరులకుఁదగవు. పెక్కండ్రుమహీకాంతుల మ్రొక్కులందిన ఘనులగు పాండవులను నీనిర్బంధాధికారముచేఁ బడరాని పాట్ల నలయించినావు! నీదుర్మానముచే వారలఁ బలుతావుల నవమానించినావు! నీపలుకుఁబ్రల్లదనముచేఁ దులువలవలె వారినాడిపోసినావు. వారింకను బ్రతికియుండగనే వారిని పండతిలలని యధిఃకరించి మృతాశౌచ స్నానమునుచుఁ దానమాడినావు. వారుపాండుపుత్రులే కానపుడు నీవూరక తానమాడనేల? నీదుర్మానఫలము ఘోషయాత్రాసందర్భమున నీకు వ్యక్తపడినను

దానికిఁ గారణము వేఱొకటిగా భావించినావు. ఇదియేకద యిక్కడి జనముల మానసపరిపాటి!

ఇఁక యుద్ధపుఁ బోకడ మాటదలంతుమన్న, అమానుష కారణములుగల యుద్ధములలో రణధర్మములకుమాఱుగ మారణధర్మములె ప్రధానములు కాఁగలవు. మఱియు నారంభించినది మొదలు యుద్ధ మెప్పటికప్పుడు మంత్రరక్షిత మగుచునే యుండును. కావుననే నీవాంఛితసమరపర్యవసానము నిపుడొకింతయైనఁ దలంపరాదంటిని.

దుశ్శా:—(తనలో) అన్నా! కార్యము ముదురుచున్నదే!

(ప్రకాశముగా) మనపితృపితామహాదులు, నీకాప్తులై, నీకు మేలెఱిగించు తెఱంగివికాదు. వీరుచెప్పినచొప్పున నీవు సేయకున్న, నీకృష్ణునకు నిజమనవారే యొప్పగించి, నిన్నేని యొప్పించి, తుదకు నినునొప్పింతురు. ఇంతవట్టు నిజము. ఇచట నీవుండుట నీతలంచిన కార్యమునకును, నీకునుంగూడఁ గీడుకల్పించుకొనుటయే యగును. ఇంతకును నీకిక్కడఁ బనియేమి? రమ్ము— లేచిరమ్ము— ఇది యీ పెద్దలకేతగినసభ!

దుశ్శాసనుఁడిట్లనుచుండుతడవుగ, దుర్యోధనుండు దిగ్గనలేచి సభాభవనము వీడి వెడలినాఁడు. కురువృద్ధులనెల్ల ననాదరపఱచినాఁడు. దుశ్శాసనునివిశ్వసించినాఁడు.

దుర్యోధనుఁడట్లు వెడలుటయె తడవుగ నాతనివెనుకఁ గర్ణుఁడును, శకునియు, ననుజబృందంబును, తనుజతతియు, సఖులగుమనుజపతులును దోరణముంబోలె, చీమల బారులాగున నచ్చటువీడి వెడలిపోయిరి.

సభ వెల్వెలవోయినది. నిశ్శబ్దనినదములు పెల్లుగ నుద్భవిల్లినవి.

భ్రమనొందినభీష్ముండు కొండొకవడికి లబ్ధచేతస్కుఁడయి—

"ఔరా! దురభిమానియై, అహంకారపూరితుఁడై, క్రొవ్వి, తానుం గూడ నొకమహారాజుననుకొని ఈర్ష్యాగ్రహము లొకవంకను, మదమాత్సర్యము లింకొకవంకను, దనుద్రిప్ప, దుర్బోధనములచే మతిసెడి, యీదుర్యోధనుఁడు లేచి పోవుచున్నాఁడు. మఱి యాతనిమిత్రగణంబుమాత్ర మిందుండఁగలదా! మాయురే! ఏమిపౌరుషము! వీరందఱకును జేటుకాల మాసన్నమయినది!

యదువంశోద్ధారకా, నీవువచ్చినను, నింతయగుటను మఱినీనేరము లేదులే! నీవనినట్లు, జనసామాన్యముగాని, విపరీతబుద్ధులగు పండితమ్మన్యులుగాని, దైవ పౌరుషముల సంప్రదాయ మెఱుంగఁజాలనివారుగాని, యేమనుకొనినను మానవ

ప్రయత్నమునకు లోపము రానీయకుండఁజేసితివి: అంతియ చాలదు; నీవెల్లయం దిమిడి యున్న జగత్కళ్యాణపరంబగు మూలసూత్రమును బోల్చుకొని సంచరించెడివాఁ డొక్కండైన నీ విశాలజగత్తునం దేకాలమునందైన నుండకపోవునే!"

—కృష్ణుఁడు—

మహామానియు గర్వాంధుండునగు నీతఁ డిప్పు డిటనుండి యిట్లు లేచిపోవుట, నామాట ప్రత్యేకముగ నటుండనిచ్చి, యీ సభాసదుల నవమానమొనర్చుట యగునట్లుండదు గాని యేమగునో చూచుచున్నదా!

ఇందు కేమియు మాఱు ప్రత్యుత్తరము లేదా!

వీరిచే నానాఁ డబ్బయిలో కృష్ణుఁడును నిప్పు డీ కృష్ణుండును నవమానితులైనారు. ఔరా! సమస్తసంపదలయుక్త నీకృష్ణుండు కార్య గౌరవమున నింకను మిన్నకుండవలసిన దేనా? ఇంత దుర్మానముతో నున్న యీతని గర్వ మింకను జెల్లనీయవలసిన దేనా? పరధర్మము విన నైన నొల్లని యీతని నిర్బంధాధికార మిట్లింకను నడువనీయ వలసిన దేనా? తనకిష్టులు కానివారు మఱియెట్టివారైనను నుండరా దను నీతని యీ ప్రతిపత్తియు నిక నెరవేరనీయ వలసిన దేనా?

ఔరా! యెంతటి దీమాత్సర్యమహిమము! మనయవయవము లలో నేడ దుష్టాంగమైన దాని జికిత్సకుఁడు శస్త్రముచేసి, శేషాంగ శ్రేణినైన రక్షించునట్లు, కృష్ణుఁడును, రాజ్యాంధుఁడు దుస్సంకల్పక్రీడి యును గుకంసుని వధియించి యాతని తండ్రియగు నుగ్రసేనుని, కంసకృత కారాగారమునుండి విముక్తుం జేసి సింహాసనమున మఱల నాతని బ్రతిష్ఠితుం జేసి, తత్కులము నిలువంబెట్టినరీతి, నిప్పు డీ దుష్టుని, నీ యమానుష కార్యావలంబకుని, నీయలౌకిక పాటంతుని, వధియించి యేల కులమును రక్షించుకొనరాదు! అంతతో నీవిపత్కాలాంధకార మడంగి భారతభూమి తేజోమయము కాఁగలదే!

— ధృతరాష్ట్రుఁడు — (తనలో)

అన్నా! కాలము తప్పివచ్చినదే! కృష్ణుఁ డిట్లు ప్రశ్నించి సభాసదు లేమి ప్రత్యుత్తరంబిచ్చి, నాకొడుకును గృష్ణవశంబొనర్తురో కద! అన్నా! నే నేమియుఁ

చేయంజాలనయితినే! కృష్ణుఁడు పౌరుషమున నెంతసేయవలయు నంతయుఁజేసిచేసి, తుట్టతుదకు దండనమునఁగాని జరుగనిపనియిదియని తలంపవలసివచ్చినపుడు, మఱి కార్యాచరణముపట్ల వెనుదీయువాఁడుకాఁడు! నీతిధర్మములసమముగఁబాలించు ధీరుల మెచ్చుకొనునట్టికార్యములేయయ్యును, నాకొడుకును నేనువధియించుట, వంశము నిష్కళంకముగా సేయుటకేయగుంగాక తాను తనమేనమామయగు కంసుని వధియించుటవంటిదిగా నీతఁడు తలంచుటయును. శస్త్రచికిత్సకుఁడు రోగియొక్క దుష్టాంగముఖండించి శేషాంగశ్రేణినిరక్ష సేయఁగలఁడేకాని, స్వాంగములలో దుష్టాంగమున్నట్లే స్వయముగఖండించుకొనసమర్థుఁడు కాఁడనియు నీకృష్ణుఁడు తలంపఁజాలకుండుటయు, నెంతయుశోచనీయము కాదా! అట్లయ్యును దుష్టజనసంహారము తనపూనిన మార్గమును, శిష్టజనరక్షణము తనకభిమతమును అనిలోకులనుట నిక్కమియుండును.

(ప్రకాశముగా) వాసుదేవా, తొందరపడనక్కఱలేదు! వీనితల్లి బుద్ధిమంతురాలు. ఆమె బుద్ధులుచెప్పి వీనిని దేర్పఁగలదు. కావున నామెను బిలిపింతును.

తమ్ముఁడా, విదురా, నీవుపోయి గాంధారిం దోడ్కొనిరమ్ము.

* * * *

విదురుండేగి గాంధారిందోడ్కొని మరలివచ్చెను.

కృష్ణుని చివరమాటలతో సిద్ధమయిన యుగ్రపరిస్థితుల నెంతేసులువుగ నీయాఁబి చేయుండుమార్పఁ బ్రయత్నించెను! అపాయమేతటస్థించునని తలంచియు, శిశుపాల వధ తనమనసునకుఁదట్టియు, కావలయు, నీవైచిత్రవీర్యుం డిపుడేయొత్తు నెత్తి, తాననుకొనినపరిస్థితుల నిట్టె తారుమారొనర్చి, తాను దప్పుకో నెంచినాఁడు! కాని గాంధారివచ్చినపిదపనైనఁ బరిస్థితులింకెట్టినూతనాకారముఁదాల్పనున్నవో!

* * * *

గాంధారియు విదురుండును సభలోనికివచ్చి కూరుచుండిరి

— గాంధారి —

మహాప్రభూ, నీకొడుకవినీతుఁడు. నయబోధవలన వినువాఁడుకాఁడు. కురువంశము నంతరింపఁజేయఁబుట్టినాఁడు. మనవాసుదేవునకుంగూడ విసువుజనింపఁ జేసె, సభవారినెల్లర నవమానపఱచి, సభాపతియనుమతినైనఁగొనక, యావలకేగి తనతోడియవినీతులతో నేమోమో దుర్మంత్రంబు లొనర్చుచున్నాఁడట!

ఎవరేమన్నను, నీచేతికడ్డముపెట్టువారెవరు! నీవ సర్వాధికారివి. ఇచ్చిపుచ్చుకొనుటలలో, నీకొడుకుతో నేమిపని? అవినీతుండగు దుర్యోధనునెఱిఁగియెఱిఁగి

వానినె యనుసరింతు వదియేమి? నీవు పాండవులకె కాదు నీకును క్షేమ మొసంగినం గావున వారెవరు? కొడుకుమీఁదఁ బెట్టి—యాతఁడు సహాయము నియ్యకొనకున్నాఁడు. ఈతనికి—మీరు బుద్ధులుగఱపుఁడు, మీరు బుద్ధులుగఱపుఁడు—అని యందువే కాని యింత సుయోధనుని నడఁపఁదగిన దావంతయు లేదు. సాధుసాధ్వులగు పాండవులం బిలిపించి నీకుఁ దోఁచిన దిచ్చి చూడుము. కొడుకు [illegible] మూఁగలతో చూడుము! నహా మానధనియగు సుయోధనునకు శత్రువులైన [illegible] ప్రయత్నమైనం తియుఁ బ్రయోజనకారి కాఁజాలదు. [illegible] శత్రువులు నుక్త శాస్త్రములనెడి [illegible] అన్నదమ్ముల [illegible] దుర్యోధనునిఁ జెప్పుటకుఁ జేయుఁ బ్రయత్నము ప్రయోజనకారి కాఁజాలకుండుటయే కాక ప్రమాదప్రదమై నిన్నుఁ జెఱుపఁగలదు. ఇట్టి కార్యమును [illegible] పాండవుల క్షేమమునందు నీయుక, నా కొడుకు నిచ్చలు నని నా భార్య [illegible] రాజ్యమునీయకనియు, కొడుకుపై [illegible] నీవు [illegible] యున్నావే కాని, యిప్పటి [illegible] ప్రధాన [illegible] యగుదువు. ఇది యె, తనకుఁ గలకాలము నిలువని వారు కాఁగలరు.

ధృత:—విదురా, నీవుపోయి నంపనుం దోడ్కొనిరమ్ము.

విదురుఁడు చిత్తమ్మని పని దుర్యోధనునితో మరలఁ బ్రవేశించెను. క్రోధతామ్రితనేత్రుండయి నిలచిన దుర్యోధనుని మొగము రాజము నేయుండెను.

— గాంధారి —

సుయోధనా, నీతండ్రి యెంత చెప్పినను నీవు వినకుంటివని వీరనుకొను చున్నారు. కాని భీష్మద్రోణాదులు నుడివినట్లుల, శ్రీకృష్ణుండు చెప్పిన చొప్పున నీ వొప్పుకొంటివేని, మనకు హానియు లోకనిందయుఁ దప్పును. అశాశ్వతంబగు నియ్యైశ్వర్యమంతయుఁ గావలెనన్నను రాదు; అట్లు వచ్చెనేని యునద్దాని ధరియించి కాచి రక్షించుకొనుటయుఁ గారానిపని. కోరికకు మేర యుండవలయుఁగద! ఈధాత్రినేలను మేమమాత్రమును తీరు [illegible] నాకెవరిక్కలయు నను కామమును, సాధుసాధ్యులగు పాండవులపై నింతక్రోధమును, ననునీయంతశ్రతువుగను నడంపఁ జాలని నీవెట్లు బహిఃశత్రులఁ గొంపఁగలవు? కామక్రోధములను దాగు రాజ్యాంగంపుల గెలువఁ జాలనివానిచే ధరాభారంబు నిర్వహింపంబడనేరదు. అట్టి [illegible] నిందను భూమండలికి నేనధిపతినని విఱ్ఱవీగుచుఁ గావ్యములొనర్చువాఁడు తన కార్యములయందు జయమందలేక పోవుటయేగాక, తనకుఁ గలదనుకొనుచున్నదియుంగూడఁ గోలుపోవక తప్పదు.

ఒరులఁ జెఱుపఁబూనినచోఁ దానె చెడును. ఒకరిని వెక్కిరింపఁబోరాదు: నాయనా, వెల్లకిలఁబడుటయె తుదకగును–మఱినీఘోరయాత్రయం దేమాయెనది? ఆపదలలోఁ బడిరక్కసిమూఁకలచేతనో, క్రూరమృగములచేతనో, చత్తురనియెంచి పాండవులను ఖాండవమునకుఁ బంపిన వారేమైరి? మఱింతవర్ధమానులైనారు! వారికి మఱింతబలము చేకూరినది. నీదుష్ప్రయత్నములలో నొకటరెంటనైన, నీయాశ్రితుల నెరవేరమింజూచి, యంతలి యీశ్వరేచ్ఛనెఱింగి యంతతో నీసంకల్పముల నీప్రయత్నముల ఖండించుకొని విరమించుకొనవలసి యుండెను. కాని నీవట్లొనర్చినావు కావు.

నీతండ్రి చేతులయందే సర్వాధికారము నిమిడియున్నను, దానిచ్చివేసినఁ దన్నడ్డువారేరును లేరని యెఱింగియు, ఒకయెడ నీవే యుద్ధమున జయించినచో, మఱి ముందెన్నంటికిని దాయసామంతములు లేగవు కదాయని కానోపు, ఈకురురాజ్యాణి పాండవులకుఁ దవకుఁదోచిన దిచ్చి వారితో మైత్రి నెఱపఁ బ్రయత్నింప సాహసింపఁ జాలకున్నాఁడు. వారెంతకావలెనన్నారని ద్రుపదపురోహితుఁడన్నను, వారికెంత యిమ్మని సంజయుండును డిగినను, యిపుడీకృష్ణుఁడు సంధియొనర్పవచ్చి, యేమేమియో గొడవలు చెప్పి, నీపాపములెల్ల ఖండించుచుఁ బాండవుల సంగలస్వత్వమును అధికారమును వృథ పఱచుచు, నేమిమ్మనినను వానినెల్ల నటుండనిచ్చి యేదో–యెంతయో కొంత–యిచ్చి చూడుము–ఏమాత్రమిచ్చినను, ఏమిచ్చినను, ఏతావున నిచ్చినను, వారు సంతుష్టాంతరంగులై మిన్నకయుండక పోరు. వారట్లూరకుండక, యింకను మనపైనెత్తి రాఁదలంతురని, నేఁబోయి వారలఁదూఱియైన నియ్యకొల్పెదఁ: కాదేని, యీవచ్చిన రాజలోకమె వారికిబుద్ధిచెప్పును. అట్లునుంగాని నాఁడు వారలఁదూఱుటకు మనకవకాశ మొదవదు.

భీష్మద్రోణాదులును కర్ణశకునిదుశ్శాసనాదులునుంగలసి నీకుజయ మొసంగుదురని భ్రమసెందియున్నావు. కాని నీకే అపజయము కలిగినచో నదియిపుడు నీకు నేఁ జూపఁబోవు పరిస్థితులవలననే కలుగఁగలదు. కనుక జయముకలుగుటకు కావలసిన పరిస్థితుల నేర్పఱచుసామర్థ్యము నీకున్నచో, యుద్ధమునకు సన్నద్ధుండవు కాఁదగును. కానిచో నీక నట్టితలంపు విడుచుటయే కర్తవ్యము.

నీవు—నీబలము—నీపరిస్థితులు.

నాయనా, కంసభీమజరాసంధశిశుపాలాదిమహావీరులంబోలిన వాఁడవు నీవు. నినువంటి మహావీరులు భారతభూమికి అమూల్యాలంకారప్రాయులై, యాదర్శపురుషులై కలకాల ముండఁదగినవారు. నీవు గదాయుద్ధమునఁ బ్రావీణ్యము నొందియున్నావు. దేహబలమున జరాసంధాదులం బోలియున్నావు. నీవు నీవారు

పటెనే దేవబ్రాహ్మణపూజాధురంధరుండవయ్యును పెద్దవారితోడి సాంగత్యము నేసి పెద్దలసేవించి యుక్తాయుక్తము నేర్చినవాఁడవు కావు. నీకు దుర్మంత్రాంగము ప్రధానమైపో యినది. నీయంగ్రదాఘిష్ఠతకుఁ దగినంత బుద్ధిబల మలవడమి నీపరిస్థితులను, దేశకాల పాత్రములననుసరించి, పరిశీలనతో వివేకముతోఁ బోల్చుకొనఁజాలకున్నావు. నీవెవరెవ రిని నమ్మియున్నావో, వారివారి మనోగతులును, భావములును, తెలియంగలేక, చెడి పోవుచున్నావు. నీవు సంపూర్ణముగ నమ్మియున్న యీ భీష్మాదికురువృద్ధులును, ద్రోణాదిగురుజనములును నీ మేలుగోరువారేకాని నీ కనిమొన జయమొసంగలేరు.

—తన మేలుగోరి, లోకకళ్యాణ మభ్యర్థించి, మే మెంత చెప్పినను చెవినిడని యీతని ననుసరించుటయేకదా మాకును దప్పనిసరియైన దీనపరిస్థితి యౌను— అని మానసమున నిట్టూర్చి విసువును, అసంతుష్టియు నొంది, అనిష్టముతోఁ జూమి యుద్ధమునకుఁ దిగుచున్నారీ భీష్మద్రోణాదులు! నీహీనకార్యములవలన నీయెడ ననాదరమును, నీపలుకుఁబల్లవములవలన నీయెడ నేవయు, నీదుస్సంకల్పములవలన నీయెడ విరక్తియు వారొందియున్నారు.

నీ పెట్టినపాట్లను, నీ వొనర్చిన మోసకార్యముల నప్పటికప్పుడు నేర్పున సహియించి యనుభవించి యెప్పటికప్పుడే మారుసేయనొల్లక తగినతరుణమునకై సుమా, పాండవులు వేచియున్నారు. వారియెడ సానుభూతియు, కనికరమును బ్రేమయుఁ గలిగిన భీష్మాదులె కాక, వారికి సాయ మొనర్పనెంచి వచ్చిన వారందఱును వారియెడ సంపూర్ణసానుభూతితో నున్నారు. ఇఁక నీకు సాయ మొనర్పనెంచి వచ్చిన వారందఱును దమతమ ప్రత్యేకకార్యముల నెరవేర్చుకొననెంచి వచ్చినవారేకాని, నీయెడ సంపూర్ణముగు నభిమానము కలిగి వచ్చినవారు కారు.

ఎవనిని నీవు రాజునుజేయఁదలంచి అంగదేశమునిచ్చి నీకడసచివునిగఁ జేసి కొంటివో యా కర్ణుఁడు నీవైరిబృందములో నొక్క యర్జునుమాత్రమే తనకుఁ బ్రధాన వైరిగ నెంచియున్నాఁడు. తనకర్జునుపై నలనాటి యస్త్రవిద్యాకౌశలపరీక్షాసమయ మునందుజనియించిన మత్సరము వైరివర్గమునందలివారే రాతని కనులయెదుటఁబడినను పిడుఁజేయఁదగినంతటిదిగా యున్నది. ఆహవరంగమున సర్వదా యర్జునునే యన్వే షించు నీకర్ణుని దృష్టి యన్యవైరులఁ జూడంజాలదు సుమా! ఈతండింతటి తీవ్ర ప్రయత్న మొనరించుచుండ నా యర్జునుం డీతనికిఁ జిక్కునా? చిక్కినను వీనికపు డేదేని చిక్కు తటస్థించియుండకున్నకదా యర్జును నెదిరించుట! కర్ణుఁ డలసిపోవక యస్త్రములన్నియుఁ దనస్వాధీనమునమున్న తరిఁజిక్కినచో, యర్జును నిర్జింపఁగలఁడేమో;

కానిచోఁ బ్రాణతుల్యుం డని నీవనుకొనుచున్న యా కర్ణుం డేమిమేలు నీకొనఁ గూర్పఁగలఁడు! నీ వపు డనన్యగతికుండవై, చింతించుచు నీతలఁదాచికొనుటకుఁ దగిన తావు వెదకికొనవలెనేమో, యెవనికెఱుక?

శల్యుం దోడ్కొనివచ్చినావే! పాండవులలోఁ గలవారి కీశల్యుం డేమగునో యెఱుంగుదువా? శల్యునిసోదరియగుమాద్రీసుతులు కారా యాకవలగు నకుల సహదేవులు! మఱియుఁ దనకూతువిజయను సహదేవున కిచ్చినవాఁడు కాఁడా!

నీశిబిరమున నశ్వత్థామ శేషము ఉన్నదని గ్రహియింపలేకున్నావో లేక రానయియున్న వినాశహేతువు నీబుద్ధికి మాంద్యత ఘటిల్లఁజేయుచున్నదో? కాని నీసేన,నీనాయకులు, వారివారి బాహుబలము లటుండనిచ్చి నీకుసాయమొనర్పవచ్చిన వారిమనోవృత్తులను, వివేకముతోఁ జర్చించుకొనువారి కీమాత్రము తోఁపకపోదు.

మఱియొక పెద్దమాట:—

నిరాయుధుండనైయుందు నని యందున కద, శ్రీకృష్ణునివీడి యాతనిశిక్షణం బెరిఁగిన పదివేలకంచురథాల నారాయణగోపాలుర నెంచుకొని, వచ్చితినని మొన మున్న నాతో ననియుంటివి. కేవలము బాహుబలముపై నాధారపడువారండఱు నజ్ఞులందురు. అట్లగుటనెకద, నీయెంపికలోనున్న యొక పెద్దలోపము దెలిసికొనఁజాలకున్నావు. నీవు తోడ్కొనివచ్చిన యానారాయణగోపాలురు కృష్ణుని సేనయగుటను, అర్జునరథముపై నొగలఁగూర్చుండి రథమునడుపుచుండిన కృష్ణుని మొగముచూచుచు, నాతనిసైనికు లాతనిరక్షకునిపై శరపరంపరఁ బఱపఁజాలరు. మఱియు నిప్పటివఱకును నెవనిచేఁ బరిపోషితులయియుండిరో, యీయుద్ధమునఁ దాముచావక మిగిలియున్నచో, యుద్ధానంతరము వారల నెవనితావునకుఁ బోవలసియున్నదో, అట్టి కృష్ణునిమొగముచూచుచు ధనువు నెత్తఁగలరా? ఎత్తినను, బాణము వేయఁగలరా? వేసినను, నయ్యది గురితప్పెడి, వృథయయి, నీకున్యాయ మేకూర్పకుండునా? కావున వారిపైనీ వాధారపడకుము. నీ విఁక నెవరిపై నాధారపడఁగలవు? భీష్మద్రోణకర్ణశల్యులమాటయట్లయినది. పదివేవురుకంచురథాలవారిమాటయిట్లయినది. ఇఁకమిగిలినది నీబాహుశక్తి! నిరాయుధుండయ్యును, బరమాప్తుండయి రథముతోలుచుండు ననినకృష్ణుండు, కదనరంగమునఁ బాండవులొనర్చునట్టి కృత్యములకేని, యకృత్యములకేని, ధర్మసూక్ష్మముల నెత్తిచూపించుటో, కల్పించిచెప్పుటో, చేయుచుండుటయేగాక, వారికష్టముల ధైర్యమునొనఁగూర్చుచు, సానుభూతి నెఱపుచు, మీ రిప్పటిదాఁక వారికొనర్చినయపకృతుల, అవమానములకుమిథ్యాపచార

ముల నుగ్గడించుచు, గోరంతలు కొండంతలు సేయుచు, నెప్పటికప్పుడు తన పంతారంగముచే పాండవేయులను, వారి సేనను, బరీక్షణము సేయుచు తనకేమియు సంబంధము లేనియట్టులఁ బ్రవర్తించుచుంటివి, నీకు కాదు సరిగదా, నిను బుట్టఁజేసిన యా బ్రహ్మకైనను వశము కాదు సుమా వారిని నిర్జించుటకు! నీ సేనానాయకులో, నీమిత్రులో నీ మేలుగోరువారో, వారెవరెవరేయే పేరులఁ బ్రవర్తించినను, వారందఱు నేకీకృత మనస్కులుమాత్రము కారు. ఏకవాక్యమే లేనియప్పుడు, ఏకకంఠ్యతమాత్ర మెట్లు వచ్చును? నీకుఁ బ్రాణమిత్రుండని నీవనుకొనుచున్న కర్ణునకును, భీష్మద్రోణాశ్వత్థామలకును, పోరు పుట్టియేయున్నది కదా! ఒకరి పరాభవ మింకొకరు కోరుచున్నారని వినుచున్నాను. వీరందఱును సాటిలేని సమరపాండితీ మహిమాన్వితులై యున్నను, వీరేకీకృతమనస్కులు కారు. వారు నీకుఁ బ్రోత్సాహమిచ్చుటకుఁదోడు పాండవులనె యభిమానింతురు. విలుపట్టినవిదురున కెదురే యను నానుడి విందుమే కాని, యాతఁడెన్నండును కార్యసాధకుండు కాఁజేరఁడు. కార్యసాధకుఁడైనను, గినుకను నీజనకుండాతని నొకపరి యుపేక్షించియున్న పాండవుల కడకుఁ బోవునేమో సమూహ్యదయా వేవన నోగులుము సేయుంచుట నాతఁడేమి సాయమొసఁగఁగలఁడు? శల్యుఁడుగూడ పాండవులనే యభిమానించునని తోఁచుచున్నది. కాకుండిన, నీకు సహాయమొసర్ప వాగ్దానమొసర్చియు వారినిఁజూడఁబోనేల? ఇంతకును దనయల్లుండగు సహదేవుని గెలుపుమి కోర్వఁగల్గునే! తుదకు, నీకుప్రాణపదమని నీవనుకొనుచున్న కర్ణుఁడుగూడ, ఒక్కయర్జునునిపైఁ బగసాధింపనెంచుటచే నొకరీతి నాతండును పాండవులయెడ నభిమానమునూపినవాఁడే యగునేమో! ఇట్లగుట నీసేనానాయకులందఱును, ఏదో విధముగఁ బ్రతిపక్షుల నభిమానించువారే యగుచున్నారు. ఇది నీవుపోల్చుకొనఁ జాలకున్నావు. పాండవులదెసనున్నవారిలో నెవరేని యేకారణముననైన నీయెడఁ గనికరమును సానుభూతియుఁ జూపఁగలవారున్నారా! ఉన్నారని తలంచుటకైన నవకాశమున్నదా!

పాండవులకు నీకున్నంత సైన్యమును, ఇంపగువీరులును, లేకున్నను, నీపక్షమునందలి దౌర్బల్యసూచకములౌ బహునాయకత్వము, నీశిబిరమున భిన్నాభిప్రాయములు, నీసహాయులలో నంతఃకలహములు, ఇతరరాజలోకము వలని సానుభూతి లేమి, జనసామాన్యపుటభిప్రాయవైముఖ్యము —నను మన లోపములు వారికి మార్బలములయి యున్నవి. ఇందుకుఁదోడుగ పాండవులు మిక్కిలినేర్పున, రాజనీతి నుపయోగించి కొన్నిచోట్లను, మానవమానస తత్త్వవిదులై, లోకపు

టభిమానము తనపైఁ బురిగొల్పుకొని కొన్నిచోట్లను, భిన్నభిన్న రూపములతో జయముఁ బొందఁగలుగు నభయముమాత్రము నాకు మెండుగఁ గలదు. అస్త్రవిద్యా ప్రతిభయు, ఖండనమండితీప్రాభవమును, రాజనీతియు, మంత్రరక్షణ కళయుఁ దీనికిఁ దోడ్పడుచున్నవి కదా! కృష్ణుఁ డర్జునునకు సారథియైన రథచోదకుఁడే యనిమాత్రము తలఁపకుము. సారథియునుఁ బాండవుల కీ యుద్యోగమున సారథియని యెంచుము. ఆతని మంత్రాంగశక్తికి, నీవనుకొనిన నర్జునుని ప్రభుభక్తియు రాజనీతియును అక్కఱకు రావు సుమా! బుద్ధిబల మెల్లప్పుడును దేహబలమును గ్రోసిరా జనిపింపఁ గలదు సుమా! కౌరవుల కపజయము మీకగిన నో నదిమోసినమాత్రమును దేహబలలోపమునఁ గాఁదేరదు. నీపరాజయమునకు నీ రాజనీతిబలలోపమును, అరలయున్న మంత్రాంగరక్షణ కళా కౌశలప్రాభవమును గారణములగు. ఇది నీవు దోషదోషములకైనఁ దెగినంత వ్యవధియుం డునో, యుండదో కదా! కాలము సమబలమునంటిపెను బాహుబలముపై నాధార పడుచున్న నీ కింకేమి చెప్పఁగలవాఁడను!

ఏమి! కుత్సా! పలుకఁ బ్రతిచేమి! నీవానసకిరాని బల్కెడుచున్న యుద్దా లనెంతబలవత్తరమైనవో కాని, నీ నోటనోపలుకైన నశక్తి రానియున్నవే! హా రా! ఎంతమూర్ఖ మెంతపరాభవము!

సుయోధనా! ఒక్కమాట: నీతో సరిగ గదాయుద్ధము నంబని సేయఁగలవాఁడా భీమసేనుండొక్కఁడే యనియు నాతనితో నింతకాలము నపలగబా, గదాయుద్ధము దొరకవని యానందించుచున్నానని యొకపతి యంటివి. మఱియు నర్జునునకు సరియగు నెదిరి కర్ణుఁడే యనియు, నర్జునుండును కర్ణునకే సరియనియు నంటివి. ఇదియే నిక్కమ మైనచో, భరతవర్షమంతయు నొక్కపెట్టున సంహరించునీతి నిట్టిదారుణసమరసన్నా హము లేలనోయి! నీకును భీమునకును గదాయుద్ధమో, కర్ణార్జునులకు శరవిద్యాపాటవ పరీక్షయో ప్రవర్తిల్లఁజేసి, అందోడినవారును వారిపక్షమువారును ఓడినవా రనుచుఁ గని నిర్ణయించి, యీ వచ్చిన రాజుల నెల్లర బహూకరించి, చందనతాంబూ లాదిమర్యాదలతో, వారివారి తావుల కనిపి మన మేల సుఖముగనుండరాదు! అట్లొ నర్చుటనలన నింతజనక్షయమును అపకీర్తియు రాకుండునుగద! ఇదియైన యోచించి చెప్పుము. ఇపుడీ కృష్ణుఁడు పలుకకున్నన్ని యన్నియు సవిస్తరముగఁ దెలుపుము. సంశయించినఁ గార్యము చెడఁగలదు సుమా! జరుగనున్నట్టుల నాకు స్ఫురించినవాని నెల్ల నీమేలుఁ గోరియే, యింతమాత్రము చెప్పితిని. కాని నీకొకింతయుఁ దలకెక్కకున్నది. నీ కింతమొండిధైర్య మెటులకలిగెనురా! తమభావి నెఱుంగఁజాలక, యొరులభవిష్యదర్థము

లెఱిగింతువను జ్యోతిశ్శాస్త్రవిశారదు లేరేని, నీకు విజయము కలుగఁగలదని భావిం దెలిపిరా? లేక స్వప్నావస్థలో నీకేదేని జయమొనఁగూడకతప్పదను నూఁతదొరకెనా? ఇట్టివృత్తాంతములు స్వప్నప్రాయములై, స్వప్నభూతములై, మొదట ధైర్యమొసంగి తుదకు దుర్బలునిఁజేసి, మోసగిలఁజేయునుగాన! స్వప్నవృత్తాంతములు నిజములను గొని పాడుపడుదువని యీపు డింతమాత్రము తెలుపవలసివచ్చుచున్నది.

*　　　　*　　　　*

అయ్యో! గాంధారీ, యెంతోమాత్రము చెప్పినావు! ధర్మంబును, నీతియును, జూట్టలీకంబును, మున్నెనవైచి, నీసుతుబ్రదుకుఁదెరువును ముందువైచి, లోకసంగ్రహవృత్తమను సూత్రంబునుజూపినావు! నిజశక్తిని తెలియఁజెప్పినావు! దుర్యోధనునకు దొఱకినసహాయంబులకొలందియు బోధించినావు! కులజనచిత్తప్రకారంబులఁ బ్రకటించినావు! పాండుపుత్త్రుల బలపరాక్రమంబుల నుగ్గడించినావు! కన్నకడుపని బుజ్జగించినావు! కూళయని కినిసినావు! ఇట్లనేకవిధంబులఁ దెలుంగుపడం బోరలినావు! కాని యిసుమంతయుఁ బ్రయోజనము లేకపోయినది.

నీవెంతమాత్రము కొడుకునకు బోధించినను, నీవూహించి నట్లాస్వప్న భూతమునకెంతటిదారుణశక్తికలదియో కాని, దుర్యోధనుని సహజమూర్ఖతతోఁబాటు మొండిధైర్యమును మఱింత దృఢపడుచున్నది.

*　　　　*　　　　*

ధృతరాష్ట్రుఁడు తనపైనేమియుఁ దోషమువ్రాలకుండుటకును దనకొడుకు గృష్ణునకుఁ జిక్కకుండుటకును, అప్పటికిరూపించిన యుగ్రపరిస్థితులను మార్చివేయుటకును, నిను సభకుఁదెప్పించుట యనుయెత్తువేసినాఁడేకాని తాననుకొనిన యుగ్రపరిస్థితుల మార్పుటయు కొడుకుమనసుద్రిప్పుటయు లోనుగాఁగలఅభ్యర్థిత కార్యముల నడిగొనర్చెనో లేదో కాని చక్రవర్తియు, సర్వాధికారియునగు నీవచ్చిన నీచేతి కడ్డమెవ్వరను నీ పలుకులచే, నిన్నును గొడుకును నడ్డముపెట్టుకొని తప్పుకోనెంచిన ధృతరాష్ట్రుని దెసకే భారమంతయు నొఱగినది!

గాంధారీ, నీవు సభాభవనమునకువచ్చి క్లిష్టపరిస్థితుల నన్నింటిని యిట్లా మార్చివేసినావు! భర్తకదాయని యాతనియెడ, నేమాత్రమును బక్షమువహింపక ఉన్నదియున్నటుల వచియించినావు! నీభర్తకుఁగలస్వాతంత్ర్యము దెలియఁజెప్పి ధైర్యము గొల్పినావు! ప్రయోజనముండునేమో యనిచూచినావు! కాని హృదయధర్మమును, మనోవృత్తమును, వాక్ప్రకారంబును నేమాత్రము నేకంబుసేసి

కానఁజాలని ధృతరాష్ట్రునిపక్షమున నేమియుఁ గార్యకారి యైనదికాదు.

అదిగో! నీవెంత చెప్పినను ఔననక, కాదనక, మాఱుమాటాడక, దుర్యోధనుఁడదె మరలసభవీడి, మగిడిపోవుచున్నాఁడు. ఔరా! ఏమిమౌర్ఖ్యము! ఎంతదురహంకారము! ఎంత మెయివడిగల వడవడి!

దుర్యోధనా, పోయినవాఁడవు అట్టెపోవక యల్లటనిలచి, నీమంత్రులతో యోచనల నెఱపుమన్నా వది యేమోయి? దుర్మంత్రము కాదుకద? అశక్తిచే దుర్జనులుచేయు మంతనపుటాలోచనలు కావుగద!

సభాభవనమునకావల సుయోధనుఁడు:—

అంగరాజా, వింటివికదా యాసవుని ప్రసంగమంతయును! తానుపూర్వము కంసునిఁజంపినట్లు నన్నును బరిమార్పఁదలంచి ఆభావములను సూచించినాఁడట! శిశుపాలాదులంబోలె నంతకునకుఁ బ్రియుఁగఁ జేయఁదలంచినాఁడు కావలయు!

తనమాటకెగ్గినదికాదుకదా యని తుట్టతుదకు మాయమ్మనుగూడ సభకుఁ దెప్పించి నాకుబుద్ధులు చెప్పించినాఁడు! నీతులుగఱపు నెపమున నిండుకొలువున నన్నెంత పరిభవమొనర్చినాఁడు!

దుశ్శాసనా, మఱి మన మాలసింపఁదగదు. మొదట మనమనుకొనిన ట్లీ యొక్కనింబట్టి చెఱవెట్టినచో, ఱెక్కలువిరిగినపక్షులయి పాండవులు తేజముం దూలుదురు. కార్యప్రణాళికయు మన కిట్టె సూక్ష్మము కాఁగలదు. అట్లయ్యును వారుప్రయత్నంబులుడిగి యూరకుండక మనపైనెత్తివచ్చిరేని వారి నిట్టె నిర్జింపనగు. కోఱలులేనిపాము లేమిసేయఁగలవు! కావున దుశ్శాసనా, మున్ముందుగ నీకార్యమున కాయత్తపడుము. మఱి యాలసింపకుము. బలమైన బలుపగ్గముంగొని తెమ్ము.

అని తనవారికిఁగట్టడసేయొనర్చి సుయోధనుండును బ్రియతోఁ సమ్ముఖుండయ్యెను. ఈలోపల సభయందు దద్దయువిల్లిన అపూర్వమగునిశ్శబ్దనినదంబులు పెల్లుబ్బెను. ఒకరిమొగ మింకొకరు చూచుకొనుచుండిరి. కృష్ణుం డేమోయోచించుచుఁ దలపంకించుచుఁ దన నునుబొజ్జ సరిదిద్దుకొనుచునేయుండెను. సభాప్రవేశసమయమున దుశ్శాసనునిచే స్వయముగఁ గొనితేఁబడినపీఠములపై కొందఱుప్రక్కల సాత్యకికృతవర్మలు గూరుచుండియే యుండిరి. దామోదరునకుఁ గుడిప్రక్కనున్న సాత్యకి బహువ్యాపకదృష్టికలవాఁడౌట సభవీడి వెడలినదుర్యోధనుఁడు తన యనుజబృందముతోఁ దన మంత్రివర్గముతో మాటమున నెఱపుచున్న బుడిబుడిమాటలసవ్వడియు, చెవులలోఁ జెప్పుకొనుచున్న రహస్యముల లీలలును, మంతనపుటాలోచనలస్ఫురణాలును, సౌజ్ఞలును, దృటికాలమున

వంపఱు నేడకోపోవుటయును, మూలలఁగలియుటయును, నురియాడుటయు, నెఱుంగు టను దవ్వులనుండి నడిచడి పగ్గముపట్టికొని యారుదేరనున్న దుశ్శాసనుంజూచి హరింబట్టి కట్టఁదలంచినమంత్రాంగముగా నద్దానిఁ నెఱింగియట్టినిలిచి "కృతవర్మా, ఈపాపులందఱును నన్నుదెస నిర్భయముగ ద్రోహపుటూహ నొనరచేయుచున్నారు. కార్యముతప్పివచ్చినది. మనమింకను నాలసించితిమేని పరిస్థితి భీషణాకారము దాల్చును. కావున నీవు మనబలములతో వాకిటఁ గాచియుండుము. ఈలోపలికెల్ల నేనొక్కరుఁడనే జాలుదు. లోపలిపరిస్థితులంగూడ నిదలోకించెదను." అని సాత్యకియును కృతవర్మయు నప్రమత్తుండయి ద్వారములఁ గాచియుండఁబోయెను.

సాత్యకియు "అన్నా, వింటివే!" యని, తానెఱింగిన దానినెల్ల రహస్యముగఁదెలియఁజేసెను.

— కృష్ణుఁడు —

(మందస్మితముగ)— ఐననేమాయె! ఇం దేమిరహస్యమున్న దని నా చెవిలోఁ జెప్పుచున్నావు? ఇంతకును నేనొక్కరుండను— వారందఱును గుమిగూడి నను బట్టవచ్చిన నేనేమిచేయఁగలను! కురువృద్ధులతో నీవిషయముం జెప్పిన నుత్తరాధికారిని యనుకొనుచున్న వాని ధీమహిమా విశేషమును, ఆతనిప్రవర్తనయందలి యోగ్యతయును దెలిసికొని వారెంతేని యానందింతురు. కావున నీయుదంత మంతయు వారికి నివేదింపుము.

— సాత్యకి —

కౌరవేశ్వరా, భీష్మబాహ్లీకవిదురాది కురువృద్ధులారా, అదె చూచితిరే! కౌరవు లశక్తులగుట దౌర్జన్య మొనరింపఁబూనినారు. ఈకృష్ణునింబోవిపట్టి కట్టి వేయఁదలంచుచున్నారు. సర్వత్రజయశ్రీకాంతుండగు నీరమాకాంతునింబట్టి పగ్గములచే బంధింప వీరికి సాధ్యపడునే!

విదురుం డపరిపడి, "వైచిత్రవీర్యా, వింటివే యీవిడ్డూరము! రాజ్యతృష్ణ యనెడితంతువులచేబద్ధులగు నీతనూజులు రాధేయాదుల దుర్మంత్రంబులకులవకానోపు దృఢసూత్రసంతతులచే నానిగమములైనను బంధింపఁజాలని యీరూపొందినపరమాత్ముని నెఱుంగఁజాలక మోహితులై బంధింపఁ దెగుదంబూనుట వీరికిఁజేటుకాలమె కాక జగత్ప్రళయమే దేని కలుగకమానదని తోఁచెడిని." అని యనెను.

—కృష్ణుఁడు—

కౌరవనాథా, నాపయిఁగల్గినరోసముకతమున బహుసంతాప కారణమగునదియైన నెదందలంపక నీసంతానము నాయెడనుద్రేకించి కూరిమిగా నిటుసేయంబూనుట నాకును బరమసంతోషమెయగును. ఇఁక నీప్రభుత్వమర్యాదలతోఁ దగురీతిని నాకు ననుజ్ఞనొసంగితేని నే సెలవుఁగైకొనిపోయెద: దౌర్బల్యముచేత దుర్జయులమనియనుకొనుచున్న వారివిద్వేషముఁ నాకుఁజేతనైనరీతి నిట్టిచక్క నెట్టఁ బ్రయత్నమొనరించెద. నేనొక్కరుండ నేకదాయని వీరందఱును భ్రమసెందియున్నారు. తానును దనవారునుఁగలసి నన్నాక్రమింపఁ దలంపందియున్నారు. కాని నేనొక్కరుండనని భ్రమించుచున్న వీరలకుఁ దామనుకొనుచున్న దిక్కల్లయనియుఁ దామిపుడుచూచుచున్నది సత్యము కాదనియుఁ దెలియఁజేసిమఱియుఁ బనివిసియెద. దుర్యోధనుండునను బంధింపందలంచి యుధిష్ఠిరు. నిట్టిగృత్యాఘంజేసెనని నేదలంచెద. భారతభూమికి వీరభిక్షనిడుమని యాచకుండనైవచ్చినన న్ను, బంధుగుఁడనై వచ్చినన న్ను, మీహితమునుగోరుమిత్రుఁడనైవచ్చినన న్ను, దూతనై వచ్చినన న్ను, దానును దనమంత్రివర్గమునుంగలిసిబంధింపం దలంచుట అకార్యమనియైనఁదారుతలంపకున్నను నిట్టియమానుష కార్యమొనర్పవచ్చినవారి నెల్ల నిట్టనిర్దించి భస్మమొనర్చి సునాయాసముగ నప్రయత్నముగ నిక్కడనుండికదలకుండగనే యీకౌరవరాజ్యలక్ష్మినాయుధిష్ఠిరునకుసమర్పించుసామర్థ్యమున్నను క్రోధపాపజనితంబులును గర్హ్యంబులును నగునట్టికార్యంబులు నేనాచరింపనొల్లమి నీవారుబ్రదికిపోయినారు ఇంతకును నీవాప్రయత్నములకేల నేనంత రాయము గల్పింపవలె! కానిమ్ము-రానిమ్ము:బంధనకార్యమ్మొనర్పనిమ్ము: రాజబిడౌజా. ఇఁక నీవల పౌరుషమునను,ఆవలపాండవేయులవలనను, నడుమ నావలననుంగూడ దోసములేదని యీమునిమనీషులు నిందలిపెద్దలునుం దెలిసికొనిరి. అంతియచాలు—

అంత వైచిత్రవీర్యుండు దుర్యోధనుం దోడ్కొనిరమ్మని విదురు నంపెను.

ఒరవెలికిన కరవాలము దనకుడిచేతంగొని జకీలునఁ గృష్ణునిసమీపించుచు 'పగవాఁడీతఁడు: రాయబారియనితలంపవలదు. పట్టుఁడు కట్టుఁడు:' అనుచువచ్చుచున్న దుర్యోధనుని, ఆవెనుక నొకపగ్గముంగొని సభం బ్రవేశించుచున్న దుశ్శాసనుని, గాంచిన సాత్యకి 'అన్నా! మించివచ్చెఁగదా!' యని తనకుడిచేతఁ గృపాణమ్ము దాల్చి సింగంపుఁ బిల్లగతిం దూకి ముందుకువచ్చి నిలువ, నాసభయెల్లం బెల్లుఘూర్ణిల్లుచుండె; కాని మఱి యాలతాంతాయుధుకన్నతండ్రి నూనసపుధైర్య మదెంతకలదో కాని యాతఁ డయ్యెడ నేమేని వేగిరంపడియెనా? రమ్యాననంబందు చిర్నగవు నాఁగనఁడు; దీర్ఘములౌ నెన్నొసలు ముడువఁడు; చరణయుగళమ్మైనఁ గదల్పఁడు; పల్లెవాటును జక్కఁగఁజేసి కొనఁడు; నునుబొజ్జం గదల్పఁగబోఁడు. కత్తిఁ దూసికొని తనపైకవియవచ్చిన యాతనిం జూచియుఁ దనగద్దెనుండి డిగంవలంపకయె సుఖాసీనుండై యింకను దనహాయిశే బయల్పఱచుచు దుర్యోధనునెదుర్కొనఁ గత్తినెత్తిన సాత్యకిచేయివట్టి యడ్డిన యద్దానవాంతకుని నిబ్బరమే నిబ్బరము!

శ్రీకృష్ణుని శాంతిగంభీరముఖమండలముపై నెల్లరచూడ్కులును నిల్చియున్నవి. సాత్యకిచేయిపట్టుకొని శ్రీకృష్ణుం డడ్డుటయె దుర్యోధనుని దురుసుదనమ్మున కొకింత యంతరాయము కల్గించినది. అప్పటి నందనందనుని వదనభావగోచులఁ జూడఁగోరిక వడికావలయు నాతనిశిరోభాగమ్మునయున్న మయూరపింఛ మించుక ముందున కొఱగుచు తొంగితొంగి చూచుచున్నది. శ్రీకృష్ణభగవానుండును దనయెదుట రాజసతామసగుణాకీర్ణమై, రతనాలకలికితురాయి కాంతులతో రవరవలాడుచున్న దుర్యోధనుని ముఖమండలముపైఁ దనప్రశాంతగంభీరవీక్షణముల సారించుచు దరహాస మొనర్చెను.

—కృష్ణుఁడు—

ఏమి, రాకుమారా! కత్తిఁబట్టితి వేలనోయి! నీవెనుక నీతమ్ముని చేత నాపగ్గ మదేలనోయి! నే నిపు డొకరాయబారి ననుమాటయు మఱవఁజేయసమర్థమైనదోయీ నీరాజసతామసప్రవృత్తి! ఒంటిగ నీయింటఁజిక్కిననను బట్టికట్టి చెఱంబెట్టినచోఁ గాఁగల నీకార్యమదెల్ల సులభమగు ననితలంచి యీచిన్నతనంపుఁ జేయిదములకుం దలపడఁ జేయదగినంతదైనదోయీ నీయాసురప్రవృత్తి! నీ వనుకొనినట్లు

నేనొక్కరుండనుమాత్రముకాను! నేనన,నీవునుంగలసియే యున్నావు. మఱియు నేనన విశ్వమనియు, విశ్వమన నేననియును నీకుం దెలిపి యిటపై వచ్చు కార్యమునకు బాధ్యత మఱియింక నేరికిని లేదనియు నిందున్న వారి కెఱుకపఱచి మరలెద.

అనుచుండ నమ్మహాత్మునంతఃకరణమునకుం గలుగు నలఁతి నగవు పొలుపు తన మొగమున క్రొక్రొత్త చెలువొసంగ నింతకింతకుం బెరుగ బెల్లుబ్బోయి యరుణ కమలాక్షుండయ్యెను. అప్పుడాతని విశాలలోచనములనుండి యపూర్వమై దుర్నిరీక్ష్యమైన దివ్యదీప్తి వెలువడి సభాభవనమంతయు నొక్కపరి గ్రమ్ముకొన్నయ్యెను. సభా భవనమంతయు నీరవమై, నిర్మానుష్యమైనట్లయ్యెను. సభాప్రవేశద్వారము దాటి లోనంబ్రవేశించి కృష్ణుని సమీపింపఁబోవుచున్న దుశ్శాసనుఁడింక నొక్కయడుగైనను ముందిడంజాలక యక్కడనే గ్రమ్మని నిలువఁబడియున్న ప్రాఁతకట్టె నేలవ్రాలియెను. శ్రీకృష్ణునిం జూచుచు ఖిన్నహృదయుఁడై వెలవెలఁ బోయియున్న సుయోధనుం డచేతనుం డయ్యెను. ఆతని చెయిపట్టు సడలుటచే గాలియందు నల్లాడుచున్న కృపాణము నేలరాలెను. —పగవాఁడితఁడు: రాయబారియని విడువఁదగదు: పట్టుఁడు: కట్టుఁడు— అని కృష్ణుని దెసఁజూపుచుండిన నాతని వామబాహువు కట్టె వలె బిగిసిపోయినది. రాజునకు వెనుకవైపునఁ గూర్చుండి 'చెల్లుబడో!' యనుచున్న కర్ణుఁడు కృష్ణునిమాట లాలించుచు నాతని ముఖమండలముపైఁ జూపు నిగిడ్చియున్న కన్నులను వ్రేల్చి నిలిచి పోయినాఁడు. ఒగులకుం గానరాని యట్లాడుచు పొంచి పొంచి కృష్ణునిఁ జూచుచున్న శకునియు నచేతనుండయ్యెను. ఆవలఁ గావలియున్న కృతవర్మ సభాభవనాంగణమున హఠాత్తుగ వ్యాపించిన నీరవతకుం గారణ మరయఁగాఁ దలఁచుచు లోనికరుదెంచి, చూచి చిత్రితప్రతిమాంగుఁడై నిలిచినాఁడు. తనకు తెలిసిన మాపున్ద్రేఁగు వింతగ గద్దెమున నిలిచికొని అక్కజముసూపు మాపుల మాధవు నవలోకించుచున్న ద్రోణుండును స్తంభితుఁడై యుండెను. శ్రీకృష్ణుని కట్టు ప్రయత్నపు నడలు వినంబడనుండఁ గనయుగమునఁ గన్నయుగళము మూసుకొనియున్న కురుపితామహుండును అనిమిషుఁడయ్యెను

చేతులు నులుపుకొనుచు ధృతరాష్ట్రుఁడు:—

ఏమి! యీసంరంభము! నిక్కముగ శ్రీకృష్ణుంబట్టి కట్టిరా యేమి యీతులువలు! నలుగు నలుదంత లేని పనులు! ఇంత లేసివార లుండియు నిదియూ సేయఁబోవఁగిరి! ఈయరిభంజనుని శక్తినెఱుంగక,

యాతనికే మీరు గీడువాటిలఁ జేయనెంచుట, గాలిని బట్టఁబట్టఁ జూచుటయె యగునుజుడీ! మనసభకు వచ్చెఁగదా యనియు, నొంటరి యనియుఁ దలంచుచుండు మీరెల్లరును బలుతుంటరులు! తొందరపడి కార్యమొనర్చి కంఠాగ్రమునకుఁ దెచ్చుకొని, మము దుఃఖమునఁ బడఁద్రోయకుఁడు!

ఔను. పాపమీధృతరాష్ట్రుఁ డెంతేని బలుకఁగలఁడుగాని, వాని నిప్పట్టున వినువాఁడేడీ!

'తన విశ్వమయాకృతం బ్రదర్శించుచు కృష్ణుండు సభాస్థారులఁ దన్మయులం జేయు మహాసంకులంబిది' యని యాంబికేయునకు సంజయుండు దెలుప ధృతరాష్ట్రుండును దన యంధత్వంబుదొలంగి విశ్వాత్మకు స్వరూపంబు దర్శింపఁ దగు దివ్యదృష్టిఁ బ్రసాదింపఁ బ్రార్థించి, తద్భాగ్యంబు వడసి విశ్వరూపాకృతిం గాంచి కృతార్థుండయ్యెను. సభాస్థారులందఱును నన్నివిధంబుల నవ్విశ్వమయుం గీర్తించిరి. నారదాదుల ప్రార్థనం బంగీకరించి, తననిజవిశ్వరూపప్రపంచంబు నుపసంహరించి శ్రీకృష్ణుండు నిలచి, "సభాయై నమః" యని యనుజ్ఞవడసి, మునీంద్రుల నామంత్రణంబు సేయ నమ్మహాత్ము లంతర్ధానంబు సేసి తానును సముత్థానంబు సేసి యంతకుమున్నె సన్నిహితులైయున్న కృతవర్మకరంబును సాత్యకి చేయియు నవలంబించి యారక సభాభవనంబు వీడి చనిరి. జరిగిన కథాక్రమంబునకును, శ్రీకృష్ణుండత్తెఱంగున వెడలుటకును నడలుగొని, విస్మితయై గాంధారియు నభ్యంతరమందిరంబున కరిగె. కౌరవులెల్లరును బంధుమిత్త్ర సహితంబుగఁ దనతోడన వెడలిరా కృష్ణుండును మొగంబు గంటువెట్టుకొని కక్ష్యాంతరంబులు గడచి చనఁజన నవ్వల దారకుండు తేరినొగలపైనుండి పాదనూపి కేలుమొగిచ్చి ఫాలభాగంబునం గదియించె. కృష్ణుండును దత్ప్రదేశంబున నిలిచి వారలదెస మరలిచూచి 'మీ రికనిలువుం' డనిపలుక సంజయుండు తన్ను బోదివికొనినడువ నాంబికేయుండు దైతేయమర్దనుం జేరి నిజతనూజుల నుపలక్షించుచు:—

—హే కృపాజలనిధే! నేను నీకు వశంవదుండనగుటఁ దెలిసికొంటివికదా! సమస్తబంధుమిత్రగురుజనకోటికిని, నీధాత్రీజనుల కెల్లరకును, దెలియుటయెకాక, నేను నిర్దోషినని నీకుఁగూడఁ దెలిసిన దంతెచాలు నాకు— ననియె.

భళిర! ధృతరాష్ట్రా, భళి! అక్రూరుని నీకడకుఁ గృష్ణుఁడంపిన దాదిగ నాతఁడు నినుగుర్తించియే యున్నాఁడని యెఱుంగవోటు! సంజయుచే నీవంపిన

వార్తల పరమార్థము నాతఁడెఱుంగలేడని దలంచితివో! ఇపుడు సభను నీవు నెఱపిన కార్యవిధానము నాతఁడు బోల్చుకొనలేడని యూహించితివో! నీ మానస పరిపాటి యాతని కభేద్యమని తలంచితివో! లేక విశ్వరూప ప్రదర్శనముతో నాకృష్ణుం డికముందేమి సేయునో యని దిగులుపడి యిపుడాతని వెంటఁబడి నుడివిన నీ లొంగుబాటుమాటలను, నీకలుపుగోలుతనము జూపుపలుకులకుఁ గృష్ణుఁడు నిను మెచ్చుననియో యూహించితివా? కృష్ణుఁడిపుడు నీవచోరచన నెట్లు పరిగ్రహించునో, ఆతని ప్రత్యుత్తరమువలన నేకద మేమనుగ్రహింపవలెను! అదె కృష్ణుఁడే మోయనుచున్నాఁడు.

— కృష్ణుఁడు —

భీష్మద్రోణకృపబాహ్లీకప్రముఖవిశిష్టులారా, ఇపుడు సభను జరిగిన సంభాషణంబులును, పుట్టిన విడ్డూరంబులును, గాంధారీదేవి పలికిన పలుకుల ప్రకారంబును, వినియుఁ, జూచియు, గ్రహించియు నున్నారుకదా! ఇపుడీకురురాజు—తనవలన నేరమే లేదనియు తాను నాకు వశంవదుండననియు,—తప్పుకోలు పలుకులచేఁ దన నందను కార్యకలాపమునకింకను మెఱుంగు వెట్టుచున్నాఁడు. తానిందు లేకున్న నింతలు పుట్టవనియు, నీతగ వింతదూర మిట్లు నడువదనియు, నే నొత్తిచెప్పి జరాభరంబున నున్న యీతని మఱింత కంపితగాత్రు నిగఁజేసి, నొవ్వఁజేసిన కొలఁ గట్టుకొననేల? ఈ మేదినీవిభుఁడే యిట్టులనియెంగావున నిఁక నా కిటఁ దడయంబనిలేదు. ధర్మజునకీయుదంతం బంతయు, నివేదింపవలయు.

అనుచు మోమునఁ జీకాకు దోఁపఁ గృష్ణుండు రథంబు నెక్కి కుంతియింటికిఁ దేరునట్టుమని సూతునకానతిచ్చెను. సంజయుం దోడ్కొని యాంబికేయుండును నిజమందిరంబునకేగెను. కురువృద్ధులును, ధార్తరాష్ట్రులును వంశీయవర్గంబును, బంధుకోటియుఁ దనయరదంబునంటెరా శౌరి కుంతీమందిరోన్ముఖుండయ్యె. దుర్యోధనుండును యాఁదఱఁ గలిసి నడచుచుండెనేకాని యాతని మానసమెన్నెని వికారములనందుచునేయుండెను.

— దుర్యోధనుఁడు —

ఔరా! ఎంతలెంతలొనర్చి మఱలుచున్నాఁడీకృష్ణుఁడు! సభకు వచ్చినదాదిగ నెంతవినయముఁజూపినాఁడు! బంధువుండనియెంతసంప్రీతి

నెఱపినాడు! భారతభూమికి వీరభిక్షునిడుమని ప్రార్థింపవచ్చిన యాచకుండనని యెంత నైచ్యానుసంధాన మొనర్చినాఁడు! తొలి మాతండ్రిని మంచిసేసికొననెంచి, వృద్ధజనపరితోష మొనర్పఁగల వివిధవిషయములతో దీర్ఘోపన్యాస మొనర్చినాఁడు! ఏమివాక్చతురిమఁ జూపినాఁడు? ఏశక్తి వలన నాతమ్మునిచేతనున్న త్రాటిని పట్టుసడలించి క్రిందఁ బడఁజేసెనో, యెంతప్రయత్నించినను నేనిప్పటికిని దెలిసికొనలేక పోవుచున్నాను. ఏయద్భుతశక్తులసమ్మేళనమునఁ దనయాసనమునఁ దానట్టులఁగూర్చుండియే, సభనంతయుఁ బెల్లు ఘూర్ణిల్లఁజేసెనో, సభాభవనమంతయు గప్పున గప్పునంతటి దివ్యప్రభాపటలి పరిభవింపఁజేసెనో, ఎత్తిన నా వామబాహువు వట్టి స్తంభింపఁజేసెనో యిప్పటికిని సుబోధ్యము కాకున్నది. ఇది అపూర్వమైన జాలకమగును.

నా మొగంబు సూచుచు దరహాసంబు సేసినయంతనే యాతని ఫాలభాగంబున బ్రహ్మయు, వక్షోభాగంబున విరూపాక్షుండును, వదనతలంబున వహ్నియు, పార్శ్వప్రదేశంబుల నింద్రయమవరుణకుబేరులును, నాదిత్యమరుద్విశ్వదేవాశ్వినులును గానవచ్చిరి. బలదేవార్జునులును, యుధిష్ఠిరాదులును, యమవృష్ణిభోజాంధకవీరులును, యిట్లింకొంప ఱంపతో యున్నవిల్లిరి సధూమధూమకేతుజ్వాలాజాలంబులును, తరణికిరణనిభప్రభలును ప్రభూతంబులయ్యె.

భిన్నభిన్న ధర్మములుగల దృశ్యములన్నియును రాశీభూతముగ నొక్కయెడఁ గానవచ్చునట్లొనర్చినాఁడు. ఈమాత్రమైంద్రజాలము నెఱుంగనని తలంచి కావలయు పెల్లుబ్బినాఁడు! కాని బంధనకార్యమునకు నాకవరోధము గల్పించి తాఁదప్పించుకొని తనమానము గాపాడుకొని, మఱియు వెడలినాఁడు. ఇది జాలకవిద్యాపరిశ్రమ ఫలమని యెఱుంగక ముదిమదిదప్పిన వీరందఱు నీతని ననుసరించుటను నేనును వీరివెంట నుండవలసివచ్చినది!

ఇదియేమనియైన, ఇదియెట్టి జాలకవిద్య యనియైన విదురాదులా వెంగళులుగాని, ముక్కిడులా నా రుసిమూకలుగాని

యోచింపక యూరక పీనింబోఁగడ నారంభించినారు. ఏదియెట్లు జరుగనైయున్నను, ఈతని ప్రతిపదమును ముందుముందు జాగరూకతతోఁ బరిశీలించుకొనుచుండవలెను. ఇఁక నొకపెద్ద యెత్తు నెత్తినఁగాని యీతఁడు మనకు స్వాధీనుఁడు కాఁడు—కానిమ్ము.

అని యనుకొనుచు, దుర్యోధనుఁడు కృష్ణుని వెంట నడచుచునే యుండెను.

నడచి, నడచి, తేరు డిగి, శ్రీకృష్ణుండు కుంతి కడకరిగి యొఱఁగి కురుసభం బుట్టినవన్నియు నున్నవి యున్నయటుల విన్నవించి వినమ్రుండయి:—

“అత్తా, కుడిచి కూర్చుండలేక, పాండవుల రాజభాగంబు వంచనమెయిఁ గైకొనియు సంతతోనాగక, అమానుష క్రియలఁ ద్రోవదిని నొవ్వఁజేసి, పెద్దల నుడులఁజీరికింగొనక, మోఱకులై ప్రవర్తించుచున్న ధార్తరాష్ట్రుల యెదుట, పాండవేయులు లొంగియున్నారనియుఁ దుదకు నేనునుంగూడ వారికడకు యాచకుండనై వచ్చితిననియెంతవిధేయతానుసంధాన మొనర్చినను, సరకుఁగొనక, గొనకు ననువారు బంధింపఁ బ్రయత్నము లొనరించినారు.

ఏమిచేసినను వారికె చెల్లినది. నన్నును, నీపుత్రులను వారెంత పఱచిన నంతశీఘ్రముగ కార్యము గడతేరు సమయ మాసన్నమగు ననుమాట మాత్రము సత్యము. ఇచటఁ బుట్టిన వెల్లఁ బాండవులకుఁ దెలియఁజేయఁ బోయెదను, వారికేమేని నీవుచెప్పఁగలబుద్ధులున్నఁ జెప్పి నన్ననుపుము.” అని కృష్ణుండు మిన్నకుండెను.

కుంతి:—నందనందనా, నీశిక్షణఁ జెరిఁగిన పాండుసుతులు నీతిమంతులును, బుద్ధ్యాపరులును, శూరులునుగదా! అట్టివారికి నీకన్న నేనేమి బుద్ధులు చెప్పఁగలదాననుఁ! విక్రమోపజీవనముచేయకున్న, పాండుపుత్రు లనిపించుకొనరనియును, నిస్తేజపుఁ గూటి కాసపడఁ దగదనియుఁ నంటిననుము. తుదకు లోకాన నపకీర్తిభాజనులు కారాదుకద! నినునిటకనిపి చెప్పించిమాచుట యన్నింటికిని మొఱుంగువెట్టినట్లయినదనియుఁ గురుసభకుఁ దూతయైవచ్చిన కృష్ణుఁడే యింతలు వడుట వారిదుష్కృత్యములకెల్ల మేరవు పూసయైనదనియు, మరిమనమున ననుమానము మానుమంటిననియుననుము. నీయండనుంట, నీ మంత్రరక్షణ కళాకౌశలముచే సర్వదా

పరిరక్షితులగుటయు, పాండవేయుల విజయముం గూర్చి సంశయింపం బనిలేదని నా నమ్మకమని యొత్తి పలుకుము.

అనుచుఁ దన మేనల్లుని గౌఁగలించుకొని, శిరంబు మూర్కొనెను. అచ్యుతుండును నామెకు మ్రొక్క నయ్యమ దీవించి "—రాజులు దినియెదు నన్నుం దినుట రాజకుమారుల లక్షణ—మని ధర్మజాదులకో నామాటలుగాను" మని కృష్ణునకుఁ బో సెలవొసంగెను.

కృష్ణుండును, దన నంటి నింకను గంటి యుండెడి ధార్తరాష్ట్రుల కడను, తమ్ముఁ గల కురువృద్ధుల యొద్దను, గురుజనంబుల సమక్షంబునను, సెలవు గైకొనుచుఁ, దన తేరెక్కి—యింక మీరు నిలుం—డని మరల వారితోనని, యటదుర్యోధనుప్రక్కను నిలిచియున్న కర్ణుంగాంచి,—నన్ననిపి నచ్చెదుగాక—యని తనకరంబు సాచి యాతని చెయిపట్టి యిట్టె తనయరదంబు పయి నెక్కించికొని, తనవెంటనంటి యున్న కృతవర్మ సుచిత్రప్రకారంబున సగౌరవంబుగ నిలిపి, సాత్యకిని వేసరిపై నల్లంతదూరమున రమ్మని మందగమనంబునఁ దనయరదమ్ము వోనిమ్మని సూతున కానతిచ్చెను.

ధార్తరాష్ట్రులును, నగరోన్ముఖులై చనుచుండఁ దన పెదమేనయల్లుని శకుని త్వరపెట్టినేగాని, వాని మానసపు టారాట మదెంతో బలవత్తరమయి యుండెనో, మనమున నే మనుకొనుచుండెనో కాని, దుర్యోధనుఁడట్టె, కర్ణకృష్ణులు పోవుచుండిన తేరిపయినే దృష్టినిగిడ్చి యా మార్గము దెసనే చూచుచు నిలిచినిలిచి, కొంత వడికిఁ జేయునదిలేక సర్వస్వమును జోరులపహరించిన పిదప నొందఁగల వ్యాకుల చిత్తముతో, దిగలాగుచుండు కాళ్ళ నడతో, వెనుకకు మరలి పోఁబోవుచు దుఃఖావృతమైన హృద్వేగముతో, మాటిమాటికిని వెనుదిరిగి చూచుచు, ముందుకుఁ బోవుచు మరల వెనుదిరుగుచు, బలవంతపు నడ నెట్లోని నిజగృహోన్ముఖుండయ్యెను.

మూఁడవ ప్రకరణము

(ii)

కర్ణునిఁ దనరథముపై నిడికొని కృష్ణుఁడేగుచున్నాఁడు. ఆవెనుకఁ గర్ణసారథి కొంతదూరమునఁ గర్ణునకై రథము దోలుకొని పోవుచున్నాఁడు.

కర్ణునితోఁ బ్రసంగింపుచుండిన కృష్ణుఁడు దారకుంజూచి రథగమన వేగ మించుక హంసగింపుమని యాదేశించి మరల కర్ణుం జూచి:—

— కృష్ణుఁడు —

అంగరాజా, నీవు వృద్ధజనోపసేవివి. మఱియు ధర్మార్థ సంవేదివి. ఇంకను నీకడ దాపరికమేల !

(అని యాతని చెవిలో నేదియో చెప్పి)

కావున నీవు జ్యేష్ఠుండవు. ధర్మరాజాదులగు నీతమ్ములందఱును నినుఁగొల్చుచు సకలపుత్రమిత్ర బంధుసేనాసమేతంబుగ రాజ్యానకు నినునభిషిక్తుంజేయ సంసిద్ధులగు నట్లొనర్చెద. అగ్రజుండవగు నీవిట నుండ వారు రాజ్యంబభిలషింపనొల్లరు. ఎట్లయినను వారు పెద్దలకడ సేవసేసికొని బ్రదుక నిచ్చలు నిచ్చఁగలవారు. కావున సకలరాజ్యభారంబు నీవ వహింపుము. నీ తమ్ములసేవల నందికొనుము. చిరకీర్తి నొందుము. రమ్ము—నాతోడన రమ్ము. కుంతీజ్యేష్ఠపుత్రుండవగుట నిను బితృసమానుగ నెంచి గౌరవించుచు వారు నీయెడ విధేయులయి యుందురు. నీ కిపుడె రాజ్యాభిషేకము సేయుదురు. నీసామ్రాజ్యాభిషేకసమయమున నీరథంబున నె యుండి ధర్మజుండు నీకు ధవళచామరంబులు వైవ, భీముండు నీకు శ్వేతాతపత్రంబు నెత్త, అర్జునుండు నీకు సారథి కా, నల కవలవారును, అభిమన్యుప్రభృతి కుమారవర్గంబును, పాంచాల యాదవపాండ్యమాత్స్యాదిసకలరాజలోకంబును నినుఁగొలుచుచుండఁజూచి, — నేన కాదు — ఆనందింపనివారేరుందురు? మహేంద్రవైభవంబున మహనీయప్రతిభావిశేషంబున అఖిల మహీమండలం బేలుకొన రమ్ము! మఱియాలసింపంజనదు. రమ్ము—నాతోడనరమ్ము. మఱొక్కమాట:—

పాంచాలరాజపుత్రియుఁ గ్రమముగ నిను నారవవానిగ నంగీకరించు. మహాపుణ్యమూర్తివగు నీ కింకేమి కావలయు? అఖిల మహీమండలమునకా మూర్ధాభిషిక్తత: రాణికా జ్యేష్ఠభర్తృత్వము: నేకముహూర్తమ్మున నందుచున్నావు! ఇంకేమాత్రము నాలసింపం దగదు. మఱి నేరగు నాలోచనయేవలదు. రమ్ము... నాతోడనరమ్ము.
* * * * * మఱియు నీవిట్లుసేయుట నినుగనినతల్లియగు గొంతికిని, సమస్తబంధుజనంబులకును బ్రియంబగు. ఇన్నియు నటుండనిచ్చి యన్నింటికిని దల మానికమునఁదగినచందము నీకీర్తినామంబు సార్థకంబగునట్లీవచ్చిన ననంఖ్యాకులగు రాజులెల్లఱకును బ్రాహ్మణదానంబు సేయుటయ. ఇఁక మఱిమాటకుఁ దావులేదు ... నీ వౌనని తలయూపిన యంతన నంతయు నిట్లు సమకూఁడు. * * * ఏమట్లూరకున్నావు!

వేడినిట్టూర్పునిడి తలపంకించి చెవివిడి—

— కర్ణుఁడు —

తొలుత నను వృద్ధజనోపసేవి వని ధర్మార్థసంవేది వని యిపు డిట్లు నీతిబాహ్యునిగ ధర్మచ్యుతునిగ జేయనెంచితివే? సామాన్య జనవాంఛితములగు కాంతాకనమ్ముల నా కెరసేయుచున్నావే! నీ ధర్మార్థములా జోడింపులోఁబడి నను నలిగిపొమ్మని యుపదేశించుచు న్నావే! ఇదనీకు న్యాయమని తోఁచినదేమి? నేనుమాత్ర మంగీక రింపఁజాలను. ఇపుడు నాకెఱుక పఱచినది రహస్యముకాదు. కర్ణా కర్ణిగ నేనిది యిదివఱకే వింటిని. ఇందుకు నేఁడేమి సేయవలయు! నన్నుఁగనినకుంతి, యేకారణముననైననేమి, గంగలో నను బారవేయ సూతుండును రాధయు నను జేకొని, చాకుండఁగ సాకి, పొత్తిళ్ళనిడి, నామూత్రపురీషాదులుదమశరీరములందిడికొనుచు, పెక్కుయిక్కట్టు లంబడిపెంచి జాతకర్మాదులొనరించి [illegible]లం గఱపి, పెద్దఁజేసి, వివాహాది కార్యములొనర్చి, నన్నొక[illegible] వానిగఁ జేసినారు. సూత

కులప్రసూతను బెండ్లిఁగూడి సంతానంబు వడసి, యిచ్చిపుచ్చుకొను సంబంధంబు లేర్పరించుకొంటి. సీలనుసీలయామర్చినట్లన్నియు నమరినవి. ఇంతదనుక నేను సూతపుత్త్రుండనని లోకమునఁ బ్రకటితంబయి యుండ, ఇపు డదికాదని పాండవేయుండ నని కౌంతేయాగ్రజుండనని చెప్పకొని యుధిష్ఠిరాదులం జేరినచో, అర్జును పరాక్రమమునకు వెఱచియె సన్నద్ధయుద్ధసమయమునఁ గర్ణుండిట్లొనర్చె నని లోకమువారలు నన్నెంతయు నాడిపోయరే! అట్లే "కర్ణునకు వెఱచియె యీతనిం దనపక్షమునకుఁ జేర్చుకొనియెనర్జుం" డను నప్రతిష్ఠపాపము ఫల్గునిమాత్రముఁ జెందకయుండునే! రారాజు నాపైనాస వెట్టుకొని నామీఁదనే రాజ్యభారమంతయునిడి సంపూర్ణవిశ్వాసముతోనున్నాఁడు; అట్టిప్రభువును నే నిప్పుడు దిగవిడచుటకంటె స్వామిద్రోహకృత్య మింకొకటి కలుగంగలదె! నీతిధర్మముల కుపదేశికుఁడవనఁదగిన నీ వింతఁ దలంపకుందువే! ఇదియంతయునొక యోరనుంచి, నేనే కౌంతేయాగ్రజుండనని ధర్మజున కెఱుకపడకుండ గుప్తముగానుంచి ధార్మికుండవు కమ్ము. ఈమాత్రము పున్నెముం గట్టుకొమ్ము. కర్ణుఁడు, కుంతీజ్యేష్ఠపుత్త్రుం డని తెలియగనె ధర్మజుండావాహప్రయత్నముల నొల్లఁడు. ఆమీఁదవచ్చు తెఱంగు మనమూహింపఁజాలముసుమా! రూపొందినధర్మమొనాఁదగు ధర్మజుఁడేయిమ్మహీచక్రము నేలవలెనంతియ కాని, యన్యులీసామ్రాజ్యమేల వలంతురే? అన్యులవలన నిద్ధరాభారంబు నిర్వహింపఁబడఁగలదే! యదుకులశేఖరా, నేనొక్కటి చెప్పెద వినుము; మహాయోధాగ్రగణ్యులెల్లరుందోడుపడ, జగదారాధ్యుండవైన నీవు సారథ్యంబు సాగింపఁ బెంపుమిగిలి నిలింపనాథనందనుండు రథికుఁడై విజృంభింప మహాయుద్ధంబున ధర్మజునకు విజయంబు సిద్ధంబని యే నెఱుంగుదు. కురుక్షేత్రంబున విద్యావయోవృద్ధులగు క్షత్త్రియులకు వ్యర్థమరణంబుగాక సార్థకంబైన పార్థశస్త్రనిధనంబు పొనుపడుట వీరస్వర్గంబు నివాసభాగ్యంబగు. సంగ్రామంబె సర్వ

విధంబుల విధిసంకల్పితంబు. దాని కెవ్వరెన్ని విధంబుల నడ్డంబువెట్టఁ దలంచినను బ్రయోజన మొందఁజాలరు. ఏదియెట్లైనను పుణ్యభూమి యాకురుక్షేత్రంబున మాబోంట్లెల్లరును సద్గతి నొందఁగలరు. జరుగున దింతియ: నిక్కువమింతియ.

—కృష్ణుఁడు—

రాధాగ్రేసరా, మిక్కిలి ప్రేమతో నేనాడినమాటలనాలింప కున్నావు. తుట్టతుదకిది నీకు సంతాపంబునకుఁ గారణమగునుజుమ! అర్జును నెడ మాత్సర్యంబుకతంబున, నీకుఁ బరాజయమో, కాక మృతియో, నీ వెంట నేదేని యొక్కటి సమకూడు: అంతియ కాని, యాతనిం గెలువఁజాలవు. ఎట్లయినను, నీమనసునకు శాంతియొనఁ గూడదు. దుఃఖమునకె కారణంబగుట నిశ్చయము.

ఇదియిట్లుండ, దివ్యాస్త్రసంవేదియా ఫల్గునుండు తనగాండీవముధరియించి, యుద్దండత మాకంజెందుచుండ నాతనియరదంపు నొగలపై నేనుండి నీవు పరాజితుండవగు నుపాయంబె నెమకుచుండ నీ కలఫాలాక్షుండు తోడువచ్చినను ఫల్గునుం దేరిచూడ వశమా! ఎట్లైనను విజయ మలపాండుతనూభవులపాల నిలుగట్టుకొనియున్నది. ఇఁక దాపరిక మేల? నీవంటివీరపురుషుఁడు భారతవర్షమున కమూల్యాలంకారప్రాయముగ నుండఁదగినవాఁడగుట, నింతదూరము నిను గూర్చిప్రసంగించితిని. నీ వెంతకును మనమును ద్రిప్పుకొనఁజాలకున్నావు. అట్లగుట నీవిపుడె పోయి రానున్న యమవసదివసంబె పుణ్యాదివసంబగుట, ఖండనంబునకు సంసిద్ధులరుకండని, మీవారలకుఁ దెలియఁజెప్పుము. మఱి కొంతు కింకేమాత్రమును లేక చెప్పఁదగినదంతయుఁ జెప్పితినికదా!

—కర్ణుఁడు—

గోవిందా, మరినీవు చెప్పనక్కరలేదు. రణముకాకతప్పని నిమిత్తంబులె పెక్కులుకలవు. పాండవులె గెలుతురు. యుధిష్ఠిరునకే

యీ రాజ్యంబంతయు బీరువోవకుండఁ దక్కును. ఇంతకును మూలము నేనును, శకునియు, దుశ్శాసనుండును, నని యే నెఱుంగుదును. అటుగాక యిపుడు నీ చెప్పిన చొప్పున, నేను కాంతాకనకమ్ములనాసించితి నేని, సంపూర్ణముగ ననునమ్మికొని, యుద్ధరంగమునకు దిగుచున్న నాస్వామికి విద్రోహము నెంచుటకాదె! ఇంతకంటె నధర్మము కలదే!

ఇఁక కురుసామ్రాజ్యంబున కేనె పట్టభద్రుండనగుదునుకదా, యనునాస నాకుండకుండునా యని తలంతువేమో! కళింగదేశాధీశుండగు చిత్రాంగదుని గూతురౌ శుభాంగి స్వయంవర సమయమున, మగధేశ్వరుండగు జరాసంధుని ద్వంద్వయుద్ధమున నే నోడింప, ననుమెచ్చి యాతఁడిచ్చిన మాలినీనగరమును నే ననుభవింపనొల్లక మత్ప్రభుసామ్రాజ్యవిస్తారముకొఱకుఁ గురురాజ్యమునకె చేర్చిన నాకు రాజ్యతృష్ణ యెక్కడిది? సుయోధనుండొసంగిన యంగరాజ్యమును ప్రజలే పాలించుకొను ప్రభుత్వసూత్రములననుసరించి పరిపాలింపఁబడవలెనను నాశయమున, అంగదేశప్రజలకే తద్రాజ్యము విడిచిన నాకు రాజ్యకాంక్ష యెక్కడిది? రాజ్యపాలన యందు నా కభిరుచి యుండకపోవునా యని దలంతువేమో? రారాజు తాను ప్రభువుగనుండి నన్నమాత్యునిగా నెంచుకొని, నాచేతనే ధరాభారంబు నిర్వహింపఁజేసినాఁడు. అట్లగుట రాజ్యపరిపాలనాభిలాషయును నాకుఁ దీఱిపోయినది. కావున నాకు రాజ్యముఁజూపి, అధికారమొసంగెద ననునాసలుగల్పించి నను నీభేదనీతికిలోఁబడఁజేయఁబ్రయత్నింపకుము. ఇఁకమిగిలినది ద్రౌపది ననునాఱవభర్తగాఁగైకొన నేనానందించుట! ఇది యేతీరునఁజూచినను సరిపడనిమాట. నేనామెను వాంఛింతునేమో యని నీవు దలంచినను, నే నేకపత్నీవ్రతుండను. అట్లగుట నీనుడివిన రెండుమార్గములును నను నాకర్షింపఁజాలవు. ఇఁక మత్స్యయంత్రము గొట్టఁబోయిన నేను ద్రౌపదిని వాంఛించియుండనా యని యూహింతువేమో: మత్స్యయంత్రభేదనశక్తి కర్ణునకును గలదనుమాట లోకము

నకు వెల్లడిసేయుచే నాపని. 'మత్స్యయంత్రభేదనానంతరము ద్రౌపది నీకుఁ జిక్కనుగదా: అప్పుడైన నంగీకరింపకుందువా?' అనియుందు వేమో: సత్యమేయగును. కళింగసుభాంగిని దుర్యోధనచక్రవర్తి కొసంగినట్లే యీద్రౌపదినిఁగూడ మాదుర్యోధనున కొసంగియుందు నని యేల యూహింపఁగాదు!

అర్జునుఁడు గాండీవసహాయమ్మునను గెలిచి మఱి నన్నుఁదెప్పఁ జాలును. ఇప్పటికి ననుమన్నింపుము. నీరాజనీతిజ్ఞతకును, అందునను నీ భేదనీతినేర్పు చేర్పునకును, మాత్రమె మొగ్గినవాఁడనే కాని, యిప్పటి నీపలుకు కొలఁకికిఁ గినుకఁ జెందకుము. ఈసమరసముద్రము గడవనీది నిను మఱలఁ జూచెద ప్రియురాలింపుమా: నల్లకాదేని, సమరావనింగూలి, నినునాధ్యాత్మలోకంబునం జూచెద. ఎట్లయినను, నినుంజూడఁగల నను స్థైర్యమునకు గాదు. నిన్ను గలియుటయె నాకు ప్రధానకార్యము. మఱియీ ప్రసంగము సేయఁబోకుము. నాకు సింహాసంగము. చాలినడవయ్యెను.

నాను చెప్పనట్లు కానీనుఁడు ప్రమొక్కనిలువ, నయ్యవ్యక్తుఁడును, నూతనూతిం గవ్వంగేంచుకొని,—చుట్టుకాని—మ్మును రంగేయుండును కృష్ణనిరథంబు దిగ్గెను. కృష్ణుఁడును, దనప్రక్కను సాత్యకింగూరుచుండ నియమించి, తనమోమున నిర్మలగవ్వు చిందులాడ 'పపపపపాని' మ్మని దారుకునకుఁజెప్పి, లక్షితాలోపకళితుం డగుచు, ముందురాఁగలకార్యంబులంగూర్చి కావలయుఁ దలపోయుచుఁ జనియె—

కర్ణుఁడును కలినగర్వమ్ముఖుండయి మఱలెను.

రాయబారము

నాల్గవ ప్రకరణము.

(i)

"మాయురే! ఎంతదురంతము! పంతమున గృష్ణుఁ డెంత సేకరఁ జేసినాఁడు! ఎవనిని నాబహిఃప్రాణముగ నెంచియుంటినో, యెవనినూఁతగాఁగొని యీపాండవ స్కంధావారవారాశి నెదురీదఁ దలంచితినో, యెవనియండఁ జూచుకొని, పాండవ వీరులనెల్లరఁ దృణప్రాయులుగఁ గణించితినో, ఎవనిసాకుఁదలంచి, కృష్ణునంతవానిం గూడ నిరసించితినో, ఎవనిప్రథిమ నద్వితీయముగ నెంచి, యర్జునునకుఁ దులయగు ప్రతివీరుగ భావించి, ద్రోణకృపాచార్యాద్యాచార్యవర్గమును, భీష్మవిదురబాహ్లికాది కురువృద్ధులనందఱ సరకుఁగొనక తూష్ణీంభావమునఁ జూచితినో, అట్టి నాయనుఁగు సఖు నిట్టె తనతోఁ గొంపోయెనే! ఆ మాయదారి నాపెన్నిధానమును నాకు మఱి దక్కనిచ్చునా!

*　　　*　　　*

"కర్ణుఁడు దేవకీనందనునిమాయలలోఁ జిక్కుటేమి! మఱి నాకుపక్కుటేమి! అనైసర్గికము! అప్రాకృతికము! ... ... దక్కినను తేజమును, వీర్యమును, దూలి నిస్తేజుండును నిర్వీర్యుండును గాకుండునా? తేజోవంతుండును వీర్యవంతుండును నై, మరలివచ్చినను, మఱి మాలోనివాఁ డెట్లగును! పాండవపక్షపాతి యైన పిదప మాయెడ నాతఁ డెట్లు నిష్కల్మషప్రేమాన్వితుఁడై యుండఁగలఁడు!

"రాజభక్తితత్పరుఁడగు కర్ణుఁడు రాజభక్తి మఱచి మిత్రకార్యము నెడనెట్టి రమ్మను నంతనె బుజములెగురవేసికొని, నామొగము నైనఁ జూడనొల్లక నాతోఁ దా నొనర్చియుండిన బాసలనెల్ల వీటఁబుచ్చి సమయానుసారముగఁ బ్రవర్తించు స్వభావముగలయాశౌరిమంతనమునకులోనై యాతనితో నేమని పో మనసు వడెనో కద! మగుడివచ్చినను మఱల నేమొగముతో ననుఁ జూడఁగలుగును! సిగ్గును బోఁద్రోలి, మతిమాలి, మరల నను జేరినను, అన్యపురాజపుత్రుండనగు నే నేమతితో నాతని విశ్వసింపఁగలను! కర్ణుఁడన విశ్వాసమునకుఁ బుట్టినిల్లని నే ననుకొంటిని! అన్నా! యెంతపొరవడితిని! ఇంత పొర రానయియుంటనేకావలయు నే నంతపొరబడియుంటిని! సమస్తమును సిద్ధమయి కార్యదశయొకతీరున విజయకళ నొందినపిదపఁ గూడ నెంతటివిపరీతపరిస్థితు లేర్పడినవి! తనయెడ నాకుఁగల యభిమానమునైనను

జ్ఞప్తికిఁ దెచ్చుకొనఁజాలియుండుఁడు! ఇంతటను గృష్ణుఁడు మోసనీతి నెఱపియుండును! ఆతఁ డెంతటివాఁడు! ఆ నిర్మోసనీతికి లోఁబడిన యీతఁడు పసాలనాకడుకు రాకుండుటయే మేలు! మాటి మాటికిని తిరిగి వచ్చిన దేమి—రాకున్న నేమి!

"కడునిస్వార్థ, మహాప్రభుని, సమస్త సామ్రాజ్యానికిఁ జేయఁ బ్రయత్నించితిని! ఏమని నా కడ నా యొద్ద కర్ణు మనుష్యు లెవ్వరు! ఆతఁడే మనవాఁడు! ఇంతియు నెంచి కట్టి కంటిపాపవలె నేనాతని! వానికై బట్టి సంతరింపఁ బ్రయత్నించితి! ఇంతవఱకుఁగాక తొలుత నిట్టి కార్యము సమకూర్పఁ బెంచిన నన్ను నేఁడు నమ్మకము లేనికాని పగలు నేనానిన దేమి పరిణామము! మిత్రులనే పెద్దలను నమ్మకుండఁ గురుజనములను మిత్రవర్గము విడనాడి, జ్ఞాతులను సంహరింపఁగోరి, ద్యూతమునకుఁ గాలు ద్రవ్వితిని. సామ్రాజ్యమును బొంది, పాండవుల యెడ నన్యాయ మొనర్చి మేలు జేకూర్చిన యేమి యిచ్చెను. నా ప్రేమ మోహవేశమువలన నిద్రానిద్రయందు స్వప్నగతుఁడనై స్వప్నదృశ్యమును ప్రతిగ ఁజూచితిని. అట్టి సమయమున, మామగారిని వెల్లవేళల నాసంగమునందుండి నన్ను యోచనకుఁ గొనిపోయి రాజ్యలక్ష్మిని, విభాగ మొనర్చి దేశమాత్రమును, బాండవులకొసంగవలెనని నేను, అంగరాజ్యము నీకిచ్చినయటుల యొసఁగితిని. నా రాజ్య మహాభాగ్యమనియును, వ్రతదీక్షయనియుఁ దెలిసి మూర్ఖులమువలె నీచమైన యత్నమునకుఁ బ్రదానము నొనర్చిన నన్ను నిరంతరము కాపాడు కృష్ణుఁడుకూడ,—నీ యాప్రదేయంబగు రాజ్యమునుండి నీవు పాండవరాజ్యమును విడఁదీసి, పెద్దలకొసంగఁజాలితి—యని నన్ను ధిక్కరించినప్పుడుకూడ మొండితనముతో, మార్గము తప్పితిని, అప్పటికైన్నా గమనింపలేక పోయితిని! ఇంతయు నింతెవంతో సమకూడుటకే కదా యని, యిప్పుడు విచారింపవలసివచ్చినది.

"కాని అస్ఖలితమై, అద్వితీయమై, అనుపమానమైన విశ్వాసము గల కర్ణుఁడు కృష్ణుఁ డెంత మోసనీతిఁ జూపినను, కర్తవ్యవిముఖుఁడయిపోవునా? ఆ బాల్యముగ ప్రభుభక్తి నిరతుండగు కర్ణుని, నేను నా కార్యభారమునెల్ల మోసలము భ్రమప్రమాదములచేత నా యూహాప్రపంచమున కర్తవ్యచ్యుతునిగ నొనర్చిన కొలఁది కొఱగట్టుకొనుచుంటినా? ఏమి స్థిరపడిన మనసును జలనుపడనున్నదే! మా యమ్మరే! ఏమి పరిశోధనయ మైపోయినది?

"ఈ మాధవుని బంధించి, పాండవుల నంతయుసహాయులుగ నొనర్పనెంచితినో, అట్టి కార్యము కొనసాగనీయకుండ, సభలోఁ దానట్టెయుండి, యింద్రజాలము నెఱపి, మాకు విభ్రమము కలుగఁజేసియు నల్లరూమ, పెరొందక, తుదకు నా కర్ణుని

దనపక్షమొనర్చికొని, నన్నసహాయునిగా నొనర్చి, నేచేయఁదలంచినపనిని దానే యొనర్చి, నన్నే ఱెక్కలువిరిగినపక్షిగా నొనర్చెనే! ఎంతకుఁ దగఁడీతఁడు!

"సర్వదా నాశ్రేయమె గోరుచు, నాకని యెన్నో శ్రమల నొందిన కర్ణుఁడింతలో నిట్టెమారుననుకొనుటకు నాహృదయదౌర్బల్యమె కారణమగునేమొ!

"మగధ సామ్రాజ్యాధిపతియగు జరాసంధు నోడించి యాతనివలనఁ గానుక గైకొనిన మాలినీనగరముసైతము తనకువలదని నాకొసంగిన యుదారపురుషుండగు కర్ణుఁ డామాయదారి మంతనమునకు లోబడునా? పరమవిశ్వాసియు వీరాగ్రేసరుండ నగు నామిత్రుఁడు కొంచెపుటూహలుగల సామాన్యునివలె దన ప్రథమ నిశ్చితకార్యక్రమమునకు భంగము రానిచ్చునా?"

అని దుర్యోధనుఁడు తనమనసునొకింత దృఢపఱచికొని జరిగిన కురుసభాభవనమునందలివిశ్వరూపప్రపంచప్రదర్శనదృశ్యము దలంచుకొనుచుఁగృష్ణుపలుకులనే స్మరించుకొనుచు నదివఱకే సభఁగూడియుండిన భీష్మాది కురువృద్ధులఁగలసికొనెను.

నాల్గవ ప్రకరణము
(ii)

కుంతీకృష్ణుల సంభాషణము సాంగముగ వినినపిదప కృష్ణు నంపకము వెట్టి కురుభూపతులును, గురువృద్ధులును, గురుజనంబులును, మగిడివచ్చి కూరుచుండి కృష్ణునిగూర్చియే ప్రసంగంబులు నెరపుచుండిరి.

భీష్ముఁడు:—కుంతి యెంతెంతమాటలాడినది!

ద్రోణుఁడు:—ఆమాటలువిని నిశ్చేష్టుండనైతిని.

బాహ్లికుఁడు:—కుంతియు, కృష్ణయు, కృష్ణుండును, కార్యవాదులు. ఖడ్గమునకాని యన్యమునఁగానిపని తామెఱింగినకార్యములపట్ల ఖడ్గధారణమే సిద్ధాంతీకరించి శత్రునిబర్హణమునకుఁదాశార్హునె యర్హునిగా నెంచి, కార్యక్రమమునకురుకఁ దమవారినెల్ల సంసిద్ధులఁ జేయుదురు.

భీష్ముఁడు:—ఏమోకాని, ధర్మజునితాల్మి యనుమహాసముద్రమునకుఁ జెలియలికట్ట తెగిపోయినది. ఇఁక మనచే కాఁగలకార్యవిధాన మెట్టులుండునో యని మాత్రము తలంకకతప్పదు.

ద్రోణుఁడు:—దుర్యోధనా, సుశ్లోకుండగు ధర్మజుపాలికి నీవుపోయి యతని శాంతినొందింపుము. [illegible]లనెల్లరఁ గాచికొనుము. యుద్ధభూమిని నీ

వారలనెల్లరఁ దిగమ్రింగి, నీవును జివరకు నేలఁగూలకుము. ధర్మజు నీవశము నేసికొంటేని జనస్తుతిఁ గాంచెదవు. కానిచో శోకమునొందుట సిద్ధముసుమ! కృష్ణుఁ డింకను నుపప్లావ్యముం జేరకమునుపే మనము ధర్మజుపాలికరుగుట కర్తవ్యము. ఆలస్య మొనర్చిన విషమించుం జుమీ!

దుర్యోధనుఁడు ఆవేగపూర్ణమును—సంక్షుభితమును—యోచనాశూన్యమును నగు హృదయముతో, శూన్యములును నిర్లక్ష్యములునునగు వీక్షణములతో నీరవుఁడై నిలచియేయున్నాఁడు.

భీష్మాదులపలుకులు వినుచుండెనేకాని దుర్యోధనుని మొగము రాజుచునే యుండెను. కన్నులఁ జింతనిప్పుకలు రాలుచునేయుండెను. మరుమాట లేదు.

* * *

ఏమి దుర్యోధనా! కురుకులము నంతరింపఁ జేయ జన్మించితివా! కేవలము బాహుబలముపై నాధారపడువానిని, దన కార్యములవలనఁ దనపలుకులవలనఁ దనకప్రతిష్ఠ వచ్చుచున్నదని యితరులెత్తిచూపినను గ్రహింపని మూర్ఖుని, దైవిక మనుదానికి మనసునఁ జోటీయని వానిని, దుర్యోధనుఁడను నామమున నికరాగల కాలాలవారు గూడ వ్యవహరింతురుసుమ! * * *

"ఎంతచెప్పినను లాభము లేదు. ఇఁకమనపైఁగూడ నపోహము నొందఁ
గలఁడీతఁడు. కావున మనవిధికృత్యము మనమాచరింపక తప్పదుకదా!"

—యని తలంచియో కావలయు, భీష్మద్రోణాదులు లేచినిలిచినారు. అందు భీష్ముండు తా జనూనుంజూచుచు, "దుర్యోధన రాజా, మాకేమికావలయు! సంసారము లేనివాఁడను నేను; సంసారము కడద్రొక్కినవాఁడీ ద్రోణుఁడు. ఇంకను బ్రాణాలపై దీపితీయ యుండు ననుకొనుచుంటివే! ఏమివచ్చిన నది రానిమ్మని యున్నారము. సంగరము ప్రాపాని కరముకదా యనియు, జయాపజయములు యుద్ధమునఁ దొలి నిర్ణయింపఁజాలము కదా యనియు, నెట్లయిన బ్రాణనష్టము నాపఁగలమేమో యనియు కురుసామ్రాజ్యమున మీ కెంతస్వత్వము కలదని మీరనుకొనుచుంటిరో, అంతస్వత్వమునఁ బాండుపుత్రుల కింతకుపూర్వమే లభించియేయున్నను, మీకుఁ దెలుపఁదగినదంతయుఁ

తెలిపి, యుద్ధముమాన్ప నెంతదూరము పోరలవలె నంతదూరమును బ్రయత్నలోపము లేకుండ నెత్తియొత్తి చెప్పి చూచితినే గాని, విధివిహితము కాదని కాని, యిప్పుడు యుద్ధమునఁ జానున్నవా రందఱును యుద్ధము కాకున్నను మఱి చావరని కాని, యిందఱి చావునకును ఇంతటి యుపద్రవమునకును నీవు నిమిత్తమాత్రుఁడవు కావని కాని, తుదకీయుద్ధపర్యవసానమున, నీమూలమునఁ గర్ణుకారణమున, శకునివశమున, నేమి కానయి యున్నదో యంతమాత్ర మూహింపఁ లేక కాని, లోకానుభవమును గార్యకారణసమన్వయజ్ఞానమును లేక కాని కా దింతదూరము నీతో ప్రసంగించుట! మే మెంతదూరము చెప్పవలె నంతదూరముఁ జెప్పిచూచితిమి. కార్యదశ ననుసరించియె ఫలము కలుగుచుండు నను మాటసత్యము. ఇఁక మాకుఁ గర్తవ్యము, నీకొఱకు యుద్ధమునర్చుటయ. ఇంతయైనపిదప సంగరమునకుఁ దలంకెదమనుకొంటివా? ఆసంశయము నీకక్కరలేదు. యుద్ధమునకు సంసిద్ధుండవు కమ్ము. మేమును అప్రయత్నమున నేయున్నారము. ఇఁక నీవు సేనానాయకనిర్ణయము, సమరంబునకు సుముహూర్తనిశ్చయము, మొదలగు కార్యములయం దప్రమత్తుండవై యుండుము.'' అనియనెను.

అంత భీష్ముండును ఆతని వెనుక ద్రోణాదిగురుజనంబులును వెడలిరి. సాయంసమయము కావచ్చినది. దుర్యోధనుండును నిజోచిత ప్రవర్తనల నుండెను.

నాల్గవ ప్రకరణము
(iii)

శ్రీకృష్ణుండు కుంతీసదనమునుండి మగిడిపోయిన పిదప చింతాకులస్వాంతుం డయిన విదురుండు కుంతి నపనయించి పోనెంచి యామెయొద్దకేగి, "అమ్మా, అన్నియు వింటివికదా! కౌరవాన్వయమహార్ణవ మింకెడు దుర్ణయములును దుర్నిమిత్తంబులును బుట్టినవి. కేశవుం డెన్నివిధంబులఁ జెప్పవలయు నన్నివిధంబులఁ జెప్పిచూచెనే కాని కౌరవసభనున్న వారిలో నొక్కరుండైనను —ఔ— నన లేదు. ఒంటరియౌ విజయువిక్రమంబు మొన మొన్ననె చవిజూచియు, నంతయు నెంతలో మఱచిరీ కురుకుమారులు! పాండవులు నారాయణుని పంపున నాతని సాయమున సమరము నడపెదరు. 'విజయునకు సారథినై నేనుండ నెదిరికి జయంబరిది' యని గూడ నా కేశవుం డుద్ఘాటించి పలికినాఁడు. [illegible]కేమియు నుండనీయలేదు. పాండు

సుతులు ధార్తరాష్ట్రుల వలన [illegible] బంధుక్షయంబును జీవహింసయును సేయ నొల్లకయుండగా తామనుభవించిరియు, మనవారికి శాంతింపుమంటివియు నేనిచ్చిన దానినే మెచ్చుము [illegible] బుద్ధిచెప్పుచుంటివియు నెన్నోవిధముల రాయబారములు నడపినారు! [illegible] సాక్షీభూతుండవు [illegible] కృష్ణుండును [illegible] నిల్పిరి! ఇంతటి ధర్మమూర్తులైన పాండవేయుల [illegible] సౌభాగ్యము [illegible] నింతటి దోషములు [illegible] సహింతును.

— పంపి —

ఇంతకాలమును [illegible] ఆపదయందున [illegible] సంగర [illegible] నిల్పిన [illegible] కృష్ణుని [illegible] వలన నా [illegible] భాగ్యమా!

విదురుం [illegible] "అన్నా నీ [illegible]—" అని పలువిధముల [illegible] బలికినియును.

విదురా, నీయనునయములు మిగుల ప్రశంసార్హములు!

పాండవులానాఁడడవులకేగు సమయమునఁ గొడుకుల వెనుబడిపోనున్న గొంతిని నీయింటనిలిపి నీ సంరక్షణమున నుంచకపోయియున్నచో నెట్టి విస్ఫారంబులు పుట్టియుండునో నీ వెఱుంగుదు కనుకనే అట్లొనరించితివి! ధర్మజాదులతో నేగిన ద్రౌపది యొకవంక పాండవుల నుల్లికుట్టి పలుకులచే నెత్తిపొడుచుచు ధార్తరాష్ట్రుల యెడ నుద్రిక్తులుగ నొనర్చుచునే యుండ, నామెకుఁదోడుగ నీ గొంతియువారితోఁ గలిసియున్నచోఁ,—కుంతి యెంత గొంతుకలదో చూచితిమి కద—యిఁక నేమున్నది! అరణ్యాజ్ఞాతవాస దీక్షలు జరుగకుండగనే యెప్పటికప్పుడే కురుపాండవ సంగరము సంసిద్ధము యయియుండెడిది. అట్టి ప్రమాదావస్థ రానీయకుండఁగాపాడిన దూరదర్శి వీవని మేమును గుర్తించితిమి!

కుంతియుఁ దనబ్రదుకుంగూర్చియుఁ దనవారింగూర్చియుఁ బెద్దయుం బ్రొద్దుచింతించి చింతించి శ్రీకృష్ణునంపకము వెట్టుటకేగిన కర్ణుఁడు మరలి వచ్చినపిదప నాతనిం గలిసికొనుటకుఁ గృతనిశ్చయయై భాగీరథీతీరంబున సాయంసంధ్యాద్యనుష్ఠాన తత్పరతఁ గర్ణుఁడున్నాఁడని విని యిదియెయదనని యెన్ని యాతఁడున్నయెడ కేగుచుఁ దనలోఁ దానిట్లనుకొనియెను.

“రాజ్యలోభంబునఁ దనవారిని వధియించుటది సద్ధర్మంబె? శత్రునిబర్హణ మర్హమగు కార్యంబు కాదె! అట్లని జనక్షయకార్యం బక్లేశకృత్యమె? భీష్మద్రోణకృపకర్ణాటోపములు మాన్పుట లల్పములం దీఱునె? ఈ నల్వురలోఁ గర్ణుని హృదయము పార్థుపై నెల్లప్పుడును గ్రోధదీప్తము. భీష్మద్రోణాదులకైనను యుద్ధముపై నుత్సాహము లేదు. ఉత్సాహ ప్రభుమంత్రశక్తియుతము కాని కార్య మనివార్యముగాఁ గొనసాగుటెట్టుల? అట్లగుటఁ గర్ణుని పట్టుదుపుజతనము దక్క యింకొక్కటి నాకుఁ బనికాదు. నేనిపుడు గర్ణుంజూచి యాతనిపుట్టువు తెలంగెఱింగించినంతనె యాతనికి ధర్మజాదులతోడి సహోదర ప్రేమంబు పుట్టకపోవునే! ధర్మజునకుఁ దానగ్రజుండని యెఱింగినంతనె పట్టు సడలఁడె! అర్జునుపైఁ గలక్రోధమును నుడుగఁడె! ఎవనిని జూచుకొని దుర్యోధనుఁడు నా తనయుల నింతంతవంతల పాలుసేసెనో, అట్టికర్ణుని నా జ్యేష్ఠపుత్రుండని తెలియఁ జెప్పి యిటుతిప్పితినేని దుర్యోధనుండప్పుడె తనత్రుళ్ళుడిగి యూరకుండకతీరదు. అంతయు నప్పుడె శాంతినొందును.

అనివితర్కించుకొనుచు భాగీరథీతీరంబు తెన్నునఁ గుంతి పోవుచుండెను.

నా ల్గ వ ప్ర క ర ణ ము

(iv)

భాగీరథి సుమనస్కునిమనంబుభాతి నిర్మలంబై, దూరాలోచనాపరుని హృదయమువలె గంభీరంబై, మత్తకాశిని చందంబున గమనవేగంబువీడి, ప్రశాంత చిత్తుని తెన్నునఁ గలఁకయుడిగి, మెల్లమెల్లగఁ బ్రవహించుచుండెను.

కుంతి కర్ణుంజూడఁగోరి భాగీరథీతీరంబున కేగెను. అచ్చట సంధ్యాద్యనుష్ఠా

నంబులు నిర్వర్తించుకొని కర్ణుండు నిమీలిత నేత్రుండై ధ్యానముననుంటఁ జూచి కుంతియు వాతని వెనుక వలనం గూర్చుండ గొండొక సేపునకు జపంబుదీఱి కలయం గనుంగొని యమ్మహాదేవిం గాంచి కర్ణుండును సంభ్రమ వినయంబులు దోప నయ్యామం జేరి "అమ్మా, రాధాధిరథుల గోత్రంబునకగు వాఁడ: రాధేయుండను. నీ పాదరాజీ వంబుల కభివందనం బొనర్చుచున్నాను. నీవిట విజయం చేయుటకేమి కతంబు? నేఁ జేయుంగల కార్యమెద్ది—యానతిమ్ము." అని యడిగెను.

—కుంతి—

ఆగు మాగు మో పుత్రకా, నీవు కౌంతేయుండవు: రాధేయుండవు కావు. నా జ్యేష్ఠపుత్రుండవు.

అని కర్ణుని జన్మవృత్తాంతమాతనికిఁ గుంతి యేకాంతంబుగఁ దెలిపెను.

— కుంతి —

అట్లగుట నీవు ధర్మస్థితినిఁ బొందుమనందనుండవు; కావున నీ వన్యులఁ గొలువ నేటికి? ధర్మతనయాదులైన నీతమ్ములకును ధార్తరాష్ట్రులకును నీవ తగిన విభుండవు. వారె నినుఁ గొలుతురు. ఈలోకమెల్ల నేకముఖమున నేలఁదగిన మహాపరాక్రమవంతుండవు. సకలలోక కర్మసాక్షి కీవుబుట్టి పాండుపుత్రుండవై, కౌంతేయుండవగు నీకు సూతపుత్రుండ నెడుసొంపుమాలిన పేరును, రాధేయుండను కొంచెపుఁబలుకును నీకుఁ దగునటోయి? పాండవాగ్రజుండవగు నీవు నీవారితోఁ గలహించి, పరులతోఁ గలియఁ దగునే? నీ తండ్రిరాజ్యమేల నేల దలంపవు? ధరణీచక్రంబు నేల సమర్థుండవగు నీవు ప్రభువయియుంట నాకును సకలలోకంబునకును సంతసంబుఁ జేకూర్చు. కౌంతేయాగ్రజా, రామకృష్ణులఁబలె సౌభ్రాత్రంబునఁ గర్ణార్జునులును నుండిరను పలుకు విని నామేను వీడఁదలంచితిని.

కుంతిపలుకుల కలుగక కర్ణుఁడు వినుచుండె నేకాని యాతని మనంబు తిరుగ దువడలేదు

— కర్ణుఁడు —

అంతయు నిజమగునే కాని, అమ్మా, నే నొక్కటి సెప్పెద,

వినుము: క్షత్త్రియ సంస్కారమునకుఁ బాత్రముగా నీవు నన్ను పాటింపమిఁగఁ శూద్రజాతి సంస్కారాదులకయి సూతసూతినైతిని. ఇంతకును మాతృచేష్టయె కతంబగుట మఱి యిపుడిట్లనుట యుచితమగునె! ఇంతకాలము నూరకయుండి యిపుడు పాండవులు నాకుఁ దమ్ములనుచు నేనటు చేరితినేని, 'లేవి బాంధవం బిపుడిపుడు గల్పించుకొని పాండవపక్షముం జేరినాఁడీకర్ణుఁ' డను నపకీర్తి మోయుటకు నేను సమర్థుండఁ గాను.

కుంతి వేడికన్నీరు నించుచుఁ గొంతవడి నిశ్శబ్దముగ నిల్చి దీర్ఘోచ్ఛ్వాసము విడిచెను.

— కర్ణుఁడు —

సన్నద్ధమైన యీ యుద్ధ సమయాన, నేను రాధేయుండను గాననియును, పాండవాగ్రజుండననియును బ్రకటించుకొనుచుఁ బాండవేయులఁ జేరఁబనుగుట, నాకె కాక ధర్మజాదులకుం గూడ లఘుత్వంబుఁ జేకురఁ జేయును. ఇంకొకమాట!

నే నింతకాల మెవ్వని యన్నముదిని యింత వెలయఁ గలిగితినో, అర్జునున కేన తగిన యెదిరినని, ననునమ్మి యెవ్వఁడు భీష్మద్రోణ బాహ్లికాది కురువీరులనైన మన్నింపఁడో అట్టి నా స్వామియెడ, ద్రోహముందలంచిన కాలయుఁ గిరీటి కిటీపలఁ జంకి యావలఁ జేరితి ననువాదును గాలకాలములదాఁక నిలచియుండునవినీతియు, ననుదాక, కుండునె! ఎవరెవ రేమాత్రము కురురాజుచేత నింతదనుక గుడిచి, కట్టి, కొనియున్నను, నిట్టి పరీక్షాసమయమున నట్టివారు రాజును విడువనగునే! అట్లయిన లోకులు దిట్టరే!

నీ వెట్టి కార్యభారము వహియించి నాకడ కరుదెంచితివో, నేను గ్రహించితిని. కాని, సవ్యసాచి కొఱకే నను దనకడ నిడికొని నాఁడు నా స్వామి—సవ్యసాచిని సమయించుటకే జన్మించినవాఁడను నేను. నాచే నర్జునుండీల్గుటో, నేనే యర్జునుచేఁ జచ్చుటో జరుగవలె నంతెకాని, యీ నిర్ణయమునకు మాత్ర మేమాత్రమును భంగము

రానీయను; కావున నే నవశ్యంబును దుర్యోధనునకై నీ కొడుకుల తోడం బెనఁగుదుఁగాని వీడంజాల. నీవచ్చిన కార్యం బెఱింగితిఁగాన మది నరమరలేక సెప్పెద వినుము.

సవ్యసాచిపై నాకుఁ గడుమచ్చర మగుటం జేసి సమరంబునఁ బట్టువడెనేని, వానిఁబట్టరఁ జంపుదు. వీడు వాఁడనుగాను. సవ్యసాచిచే నేఁ జచ్చుటయు నొకరీతిఁ గీర్తియె యగును. ఎట్లయినను; నీ కొడుకు లార్వురనుమాట నీకదలంపకుము. అట్లగుటఁ గర్ణుఁడీల్గినన్ ఫల్గుణుం డీల్గినను, నీకైదుగురె పుత్రు లగుదురు. పాండవులలోఁ గవ్వడిగాక యింక నెవ్వఁ డెదురైనను, నేఁజంపనని నమ్ముము. ఇది మాతృభక్తి సూచకమగు సూక్తి; పాండవులు నాతమ్ములని యెఱింగియు నిప్పట్టున వారిఁ జేర నరుగకుంటయె నారాజభక్తికి బలవచ్చిహ్నము. ...
......అమ్మా, మఱి యింతకన్నను గ్రిందువడఁజాలను.

—కుంతి—

కుమారా! ఏదియెట్లయినను, నీవిపు డనుపమసత్య విస్ఫురణ నాడినమాట మాత్రము మఱువకుము. అర్జును నిర్జింప నీ వొంది యున్న దలం పది యెట్టిదైనను, తక్కటి నీ యనుజుల నల్వురం గడపు మంతియచాలు.

అనుచుఁ గుంతి కర్ణునిం గౌగలించుకొని, శిరంబు మూర్కొనెఁ గర్ణుండును ఆమె పాదకమలంబులకు మ్రొక్కి నిజావాసంబునకుం జనియె. కుంతియు మరలెను.

సింహావలోకనము

అన్నా, కర్ణా! ఎంతచిక్కు తటస్థింపఁ జేసితివోయీ, నీకల కృష్ణుండును కుంతియు! కాంతాకనకమ్ముల నాసఁగొల్పి కృష్ణుండు నిను బాండవులం జేరఁ బ్రోత్సహించియు నాతఁడందుత్తీర్ణుఁడు కాకపోయెను. ధర్మజాదులు నీకు తమ్ములని నీ మనమున నొకింత బాంధవ్యము భ్రాతృభావము నుదయింపఁ జేయ నాతఁడు ప్రయత్నించెనుగదా! కృష్ణుఁడు నిను బాండవులలోఁ జేర్పఁజాలకున్నను, మానవ మానస తత్వ

వేఁడియగుట, నాతఁడు వివిధవిధములఁ నీ యుల్ల మూఁచియూఁచి కలంచఁ బ్రయత్నించెనే కాని యాతని ప్రయత్న మంతఫలవంతము కాకుండెను. ఇపుడు కుంతియు నట్లే ప్రయత్నించినది! కృష్ణుఁడు నీతో నొనర్చిన ప్రసంగమున నీ హృత్క్షేత్రమున నాతఁడు నాటిన బీజము లిపుడీ కుంతి పలుకు చినుకులచే మొలక లెత్తక తప్పదు. ఏది యెట్లున్నను సర్వసిద్ధమయి యున్న నీ యుద్ధసమయమున నీ కడకు వచ్చి కార్యభారము మనమున నిడికొని నీతోఁ బ్రసంగించిన కుంతి, నీ హృదయరంగమున రాజభక్తి యొకవంకను, మాతృభక్తి వేఱొకవంకను నిలిచి హోరాహోరిగఁ బోరునట్లొనర్చి, కురుపాండవ యుద్ధమునకుఁ బూర్వము నీ మనోదార్ఢ్యత కొకింత దౌర్బల్య మాపాదింపఁ బ్రయత్నించినది. ఇదియు నొకరీతిని గార్యకారియే యగు నేమో! నీవు తన కగ్రజుండవని యర్జునుం డెఱుంగమి పోరొనర్చి నినుఁ బరిమార్పం గలఁడు. నీ వర్జునుని నిర్జింపంగల వీరుఁడవై యున్నను, అర్జునుఁడు నీకు సోదరుఁడని యెఱుంగుటను నీ వర్జునుని దీవ్రబాణపరంపరల నేయం జాలక యుండుటో, నీకస్త్ర స్ఫురణ మెడలుటో, గురి దప్పుటో జరుగక తప్పదు! ఇంత యెఱుంగక కాదు కుంతీ కృష్ణులు నీతో నట్లు ప్రసంగించుట! అటు కాదేని నిజజననీజనకులనే యెఱుంగని నీవు రాధాధిరథులచేఁ బెనుపఁబడి, రాజరాజు నాదరణమున నింతవాఁడవయి యతుల విక్రమాఢ్యుండవగు నీవు, రాజభక్తినిరతుండవగు నీవు, మహేంద్రవైభవముల, ననుభవించిన నీవు, అర్జును మడియింపనె జన్మించితివని దలంచుచున్న నీవు, ఏకపత్నీవ్రతుండవగు నీవు, అర్జునునకు వెఱచి కాని, రాజ్యవైభవములకు లోభించి కాని, కాంతాకనకమ్ములకు లోఁబడి కాని, రాజరాజును భండనమునకు పురికొల్పి పురికొల్పి తుట్టతుదకాతని సంగరమహార్ణవమునఁ బడద్రోసి, తగుదునని నీవు పాండవేయులఁ జేరుదువని కుంతీ కృష్ణులు దలంచియుందురని మేమనఁగలమా ?

శరసంధానవిధాన పాండితీ గరిమమున నయ్యర్జునుని మించఁగలశక్తి నీ కలవడియున్నదని నీవు నమ్ముటనో, అతనిమిగులఁగల ననుమనో ధైర్యముననో, నర్జునుఁడే విశ్వవిఖ్యాతుండగుచున్నాఁడే యను మాత్సర్యదగ్ధిమనో, నీవాతని నెట్లయినను జంపఁ దలంచినావు. కాని యిప్పటిదాక నడచిన ఘట్టములఁ జూచితిమేని అర్జునకన్న నీకక్కుడు ధనుఃకళాకౌశలమున్నదన్న చో బెద్దియుఁ గానరాదు. మత్స్యయంత్ర భేదనానంతరము జరిగిన దొమ్మిపోటున అర్జునుఁడే నినునోడించెను. పసులంబట్టించు నాఁడు దుర్యోధనుని వెంటఁదరుముచు నర్జునుఁడేగుచుండ, నీ ప్రభువును రక్షింపఁబోయి యర్జునునకు నీ వడ్డుతగిలి, అతనిచే నొడలు తూంట్లువడువాఁకఁ బోరి మరలితివి.

నీయోటమికేమి! నినునోడించిన వారినే యాతఁడోడించుట నీవెఱుంగవోటు! ఘోష యాత్రాసమయమున బంధితుండగు కురురాజును విడిపింపనేగిన నినుబరాభూతుంజేసిన చిత్రసేనుఁ డర్జునుచే నిర్జితుఁడుకాలేదా! ఇట్లింకను వెదకువాని కింకెన్ని ఘట్టములు దొరకునేమో! కావున, నీవాతని మించువాఁడవని యనుకొనుటకు నుదాహరణములు కానరావు. ఇఁక కుమారాస్త్ర విద్యాకౌశల పరీక్షనాఁటి నీ పిలువని పేరంటమున కేగుటనుగూర్చి తలంతుమేని: అట 'నీ ధనుఃకళాకౌశలమును జూపఁగలిగితేని, నీ వపుడు సకలజన సంస్తూయమానుండవయియే యుందు' వను జన బాహుళ్యపుటూహ మాత్రమేమిగిలినది. జరిగినవానిలో నింతైనది. ఇఁక జరిగియుండనిది జరిగియుండి నచో,-నిట్లయ్యెడి: నట్లయ్యెడి-నను పలుకులనేమిప్రయోజనము? కాని ఒక్కటిమాత్రము బహిర్గతమై కానవచ్చుచున్నది. 'అర్జును నిర్జింపఁగల'నని, నీవు సంపూర్ణవిశ్వాసములోనుంటివి. నినువిశ్వసించిన దుర్యోధనుఁడు విశ్వప్రియమాపాదింపనున్నాఁడు. నీతిధర్మముల సమముగ నిర్వహింపఁబోయి తత్తఱపాటున నెంతదుఃఖపాటునైనఁ నీవు తెకూర్చుకొంటివని యనక తప్పదు. * * *

ఏదియెట్లున్నను అర్జును నెడ నీకుఁగల శరవిద్యావిషయైక మాత్సర్యమెంతటి విపదం బుధినిసృష్టించుచున్నదోయీ, యీ భారతాన్వయమునకేకాక భారతభూమికింగూడ!

కాని, కర్ణా, ఒక్కపనిమాత్ర మప్రతర్క్యముగా జరిగిపోయినదిసుమీ! నీవది గమనింపఁజాలకున్నావు. నీవింక నది తెలిసికొన నవకాశమునులేదు. అర్జునుపై నీకుఁ గల పగ కొలఁది యెంత యగ్గలమైనదో కాని, "అర్జునమాత్రము బిట్టరఁ జంపుదు"నని యూరకుండక, 'పాండవులలోఁ గవ్వడికాక నిఁక నెవ్వఁ డెదురైనను నేఁజంప' నని, 'నమ్ము' మని నీతల్లితో ననఁజేయఁగలిగినది. అట్లనుటను, 'తెలిసి తెలిసి భీష్మద్రోణ విదురులు పాండవుల నభిమానించినవా' రని జను లాడుచున్నట్లే, 'కర్ణా, నీవును ఒక పక్షమునఁ బాండవుల నభిమానించువాఁడవే' యని జనులాడుటకు మఱిగొంకరుసుమ! ఔరా! అర్జునునెడ నీకుఁ గల పగ యెంత దారుణమై దీర్ఘమైనదోయీ! కారణ మేదైననేమి, అప్రతర్క్యముగనే "పాండవులలోఁ గవ్వడికాక యిఁక నెవ్వఁ డెదురైనను నే జంపనని నమ్ముము" అని కుంతితోనంటివని యనక తప్పదు. నీతి, ధర్మము, సత్యము, దానపరత మొదలగువానికి లోఁబడి యింకెన్నెన్ని చిక్కులు గొంటి మీదికి దెచ్చికొంటివోకద! ఇఁక నిన్నేమందుము! కాని యింకను నీతో సంప్రదించ వలసినవిషయములుండుట నింకొకతరుణమున మరలఁగలసికొందుములే!

నాల్గవ ప్రకరణము

(౪)

మయసభలో సుయోధనుఁడు.

"దురంతచింతాపరిశ్రాంతున కీబాహ్యోపచారము లన్నియు నపచారములును మనోవేదనాభివృద్ధికరములును నగునేకాని క్షణక్షణవిజృంభమాణహృదయతాపము నుపశమింపఁజేయఁజాలవుకదా!

"మయాచార్యుఁడు తననేర్పు పెంపున నెంతేవింతగనిర్మించిన శైత్యదాయకములగు నీచంద్రకాంతశిలాఫలకముల రామణీయకత నాయంతస్తాపము నుడుపంజాలకున్నదికదా!

"అది గదిగో! అదియేకదా! ఆసూర్యకాంతశిలయేకదా ఆ మెత్తనిపులి యొనర్చిన రాజసూయముంజూచునాడు నను భ్రమఁ గొలిపినది! ఆనాఁడు నాకుఁదీరని మనోవ్యథ సేకూర్చినయీసభ, యీనాఁడుమాత్రము నా కూరటగలిగించునా? హృదయదహనపాటవము జ్ఞాతికేకాదు జ్ఞాతివానివస్తువునకుంగూడ నున్నదనుట కీమాయసభ యొక్కటియే జాలును. ఇదియే నన్నానాఁడు పరాభూతుంజేసినది! కపటద్యూతమునకుఁ గారణభూత మిదియే. కావివనిలోకులు నన్నధిక్షేపించిననధిక్షేపింతురుగాక, కారుటడవులే కలకాలము బాండవులకు నివాసముగఁజేయుదును. పాండవుల నిఁక నీలోకమున లేకుండఁ జేయుదును. కాని, కర్ణుఁ డామాయదారిమాటలకు వశపడియెనేని, ఇఁక నేనేమి సేయఁగలను? ప్రభుభక్తితత్పరుఁడును, పరాక్రమవంతుండును, పావనచరిత్రుండునునగు కర్ణుఁడు నన్నువీడిపోవునా? కృష్ణుని మాటలాలించి, ననుమోసము సేయునా? అసంతుష్టియు, ఫలాభావవిరాగమును,విసువుఁగలయుఁగృష్ణుని మోమునఁదోఁచుచుండెననికదా చారుఁడు చెప్పిపోయినాఁడు. కృష్ణునిమాటలకుఁగర్ణుఁడువల్లెయనినచోఁ గృష్ణుఁ డట్లుకానరానేల?—లేదు—లేదు—నాకర్ణుఁడు-కృష్ణునకు,

వశంవదుం డయియుండఁడు—తప్పక మరలి రాక తప్పదు.

"పాండవులను సమరమున మడియించియో, జయించియో యీసభాభవనమునను నాచే రాజసూయము నెఱపఁజేయుదునని విలు ముట్టి బాసఁజేసినకర్ణుఁడు తప్పక మరలివచ్చును.

"ఘోషయాత్రాసందర్భమునఁ బ్రాయోపవిష్టుండనయియున్న సమయమున ననుసమీపించి కర్ణుఁడు, 'ఎట్లైనిపట్టుపించిన యీపరాజయమునకు ననుక్షమియింపవలదు. పదమూఁడవయేఁడుగడపి పాండవులుమరలిరానిమ్ము. అర్జునునిర్జించెద' నని యొట్టిపలికెనే! ఇట్టిపరీక్షాసమయమునం దేల ననువీడును! కృష్ణుఁడు భేదనీతిపరుఁ డగుఁగాక—కర్ణుఁడు మాత్రము రాజద్రోహి కాఁజాలఁడు-కానేరఁడు.

"కర్ణుఁడు—రాజభక్తితత్పరుఁడు—ప్రాణమిత్రుఁడు- ఆదర్శపురుషుఁడు-కర్ణుఁడు"

ఉత్తేజితుండగు కర్ణుండు సభాభవనముం బ్రవేశించెను.

కర్ణుం జూచుచు దీర్ఘోచ్ఛ్వాసంబువుచ్చి, దుర్యోధనుఁడు:

"ఏమోయీ, యంగరాజా, త్రోవఁదప్పి యిటు వచ్చితివో?" అని ప్రశ్నించెను.

"త్రోవ ద్రప్పు స్వభావమే నాదికాదు. మీ దర్శనముజేయఁ గోరియె వచ్చినాను" అని కర్ణుండనెను.

"యాదవ దర్శనానంతర మింకను మా దర్శన మాసించుట వింతయే యగును." అని దుర్యోధనుఁ డనెను.

"ఎవరేమిచెప్పినను వినినపిదప వేగపడక, వివేకముతోఁగార్యదశనిర్ణయించుకొనునేను, యాదవదర్శనమె కాదింకెవరిదర్శనమైనను జేయవచ్చును. అందువలన నాదర్శితుని మనోభావములఁదెలిసికొనినవాఁడ నగుదును. అందేమియు దోసములేకుండుటయె కాక, అది మనపక్షమున నెంతేని బ్రయోజనకారియు నగునుకదా!"

"అది కాదదికాదు...పోఁబోవుచు, నా వసుదేవతనయుండు నీదెసం గనుంగొని, తనకరంబుసాచి, నీచెయివట్టికొని, తనయరదం బెక్కించుకొనిచనుట నేఁ జూచితింగావున, నీ వాతనిమాయలలోఁ బడియు, మరలిరాఁగలుగుట కబ్బురంపడి, 'మేలు- కృష్ణుని యురులలో మాకర్ణుండు జిక్కుకొనలేదు కావలయు-' నని యానందము నొందుట నిట్లంటి."

"ప్రభుశేఖరా, కృష్ణుఁడైనను, మఱి జిష్ణుఁడైనను- నామనో నిశ్చయమును భగ్న మొనర్పంజాలఁడు. చక్కఁగఁజింతించి చింతించి యేర్పఱచికొనిన కార్యకలాపమునకు నడుమ నెట్టి విఘ్నములు కలిగినను, కార్యక్రమమునకు భంగమురానీయని స్వభావముగలవారు మీరనుకొనినటుల శత్రుజనపక్షముం జేరఁజాలరు. ఇంతకును శత్రులఁ జేరఁదలంచినచో మఱల మీదర్శనముంగోరుచు నిటకురానేల?"

"విశుద్ధచరితుండవగుట, యాదవు నిర్బంధంబున రిపుజనపక్షముం జేరవలసివచ్చెనని నాకుఁ దెలియఁజేయుటకై ననుఁజూడవచ్చితివనియే భావించితిని. ఇందేమియస్వాభావికమున్నదని యనఁగలవు?"

"అన్నా! నందనందనునిం గొంతదూర మంపకము వెట్టివచ్చుటకేగుటయె నీ కింతసందేహమునకుఁ గారణమయ్యెనే!"

"అది మాకుఁ దెలియుటెటుల? ఆతని ననుచుట కేగితివో- మరియెందుల కేగితివో- ఎవనికెఱుక?"

"కురువృద్ధులందఱును నిలిచియేయుండ, రహస్యమునఁగాక, అందఱును వినునట్లు-నన్ననిచివచ్చెదుగాక-యనికదా యాకృష్ణుఁడు నను దనయరదముపై నెక్కించికొనియె! ఇందేమిరహస్యముకలదు?"

"ఇందుబాహ్యమున నెట్టిరహస్యమును లేకుండవచ్చును. కాని నీతోఁ బ్రత్యేకముగఁ దనకవసరమగునట్టిదియును, మేమువినరానిదియు నగువిషయముంగూర్చి సంభాషింప నవసరముగలిగియే యుండును. కానిచో, ని న్నొక్కనినె, తీసికొనిపోనేల?

"ఎవ రేమియొనర్చినను స్వకార్యనిర్వహణార్థమెకదా! అట్లగుటఁ గృష్ణుఁడెందులకయి ననుబిలచినను, దన చింతిత కార్యము విఫలమగుటఁ దుదకువిసుగును, అసంతుష్టియుంగూడఁ జెందినాఁడు. 'కర్ణుఁడు కూడఁ దన చెప్పినచొప్పున యొప్పుకొనలేదే' యని పాప మాతఁడు నిర్విణ్ణుఁడై మరలినాఁడు"

"ఏమేమీ! కురుసభలో నన్నాపియూపి, నాయుల్లముంగలఁచి కలంచి, తనప్రయత్నము సఫలముకామిఁ గొన్నికొన్ని వెడమాయలు పన్నియంతతో నాఁగక, నినుగూడఁ గెరలింపఁజూచనేమి? ఆతఁడెంతకుఁ దగఁడు? ఇంతమాయలాడింకొకఁడు కానరాఁడు! —నిరాయుధుఁడనై యుందును: పరమాప్తుండనై యుందును—అనినాఁడనిన యీకృష్ణుని మాటలకిదియె కానోపు నన్వయము! అన్వయము—కృష్ణునకునన్వయము సంకీర్ణాన్వయము—అంతయునుసంకీర్ణములే! కనుకనే ఒక్కపక్షమునం జేరి యున్నారు. భీష్మాదులుగూడ—ఆ జన్మవాసన యదయెంతకలదో కాని పాండవేయులఁగూర్చి యేమాత్రము ప్రసంగమువచ్చినను, తాము ప్రసక్తి కలిగించుకొని వారిపక్షమె వాదించుటతో నాఁగక, ఆయాదవుని భగవంతునిగా నెంచుచు, స్తోత్రము సేయుచుందురు. కృష్ణుఁడే భగవంతుడైనచో, ఒకరిపక్షమునవహించునంతటి నీచకార్య మేలయొనర్చును? పక్షమువహించుట, మనవంటివారిస్వభావమునకు నిసర్గముగాని, భగవంతునకుఁగాఁజాలదే! భగవంతుం డొక్కనివాఁడు కాఁజాలఁడే! ఇట్టి పట్టులఁబాండవాదులును, భీష్మాదకురువృద్ధులును, కృష్ణునిభగవంతుండని పొరపడి నమ్మి, బట్టులవలెఁ బొగడుచుందురు. అంతతో నాఁగక వారింబోలె నేనుఁగూడ నాయింద్రజాలకునిభజియింపనని ననుదూఱు చుందురు. విషయవిజ్ఞానముతో, కార్యకారణసూత్రములగుఱుతించి, వస్తుతత్త్వము నెఱింగి, భగవద్గుణనికాయమును, మానవస్వభావగుణ ప్రచయమును, వేరుపఱచికొని సరిచూచుకొనఁగల నేనుమాత్రము పామరజనముంబలె వినినదంతయు సత్యమెయని కాని, గుడ్డి

నమ్మకముతో నొననికాని, యనుకొనఁజాలను.

— కర్ణుఁడు —

ఇపుడు మనకు విషయవిజ్ఞానముతోఁగాని, భగవద్విషయైక చర్చతోఁగాని పనిలేదు. ఎట్టివాఁడు భగవంతుఁడు? కృష్ణుఁడు భగవంతుండగునా కాఁడా? యను సంశయము లంతకన్నను మనకుఁబ్రస్తుతాంశములు కావు. కృష్ణుఁడొనర్చిన కార్యములు కొంద అమానుషములనియు, మఱికొంద అతిమానుషములనియు, నింకంగొందఱు వెడమాయలనియుఁ బ్రసంగించుచున్నారు. ఇం దేదిసత్యమైనను, మనయభిప్రాయములతో నేమాత్రమును సంబంధము లేకయే, కృష్ణుఁడుపొందఁ దగిన పేరుపొందియే యున్నాఁడు. ఇంతకును నిం దేదియు మన ప్రస్తుతాంశముతో సంబంధముకలది లేదు.

మనకును వేళయైనది. ఇఁకఁ గార్యక్రమమును నిర్ణయించుకొనుట, కార్యనిర్వాహకులను నియమించుకొనుట మొదలగువానికి మఱి తడవు లేదు.

కర్ణుఁడు ప్రభువుననుమతిని వెడలినాఁడు. దుర్యోధనుండును నిజావాసంబున కేగెను.

రాయబారము

అయిదవ ప్రకరణము

(i)

ఉపప్లావ్యము

"అల్లదె, కృష్ణుని యరదంపు వడిసడి...అదె వచ్చుచున్నాఁడు ... ..."

ఆ ధర్మజాదులందఱును లేచి కృష్ణుఁడు రాఁగల తెన్నున దృష్టిసారించి చూచుచుండగనే కృష్ణుని యరదము వచ్చినిలచెను. కృష్ణుం డరదంబు డిగ్గి తన కెదురయిన భీమసేనాదులను, విరాట ద్రుపదాదులను నభినందించి, ధర్మజు నాశీర్వాదంబు వడసి యప్పైనిలచి, ధర్మజు నుపలక్షించుచు:

"—కౌంతేయాగ్రజా, ఉన్మత్తులగు ధార్తరాష్ట్రులేల తగవుఁ బలుకులచేఁ గలయికమునికి కిచ్చగింతురు! స్వ పర బల విచక్షణాజ్ఞానులగుదురేని ఇందనుక వారలంతలు సేయఁగలుగుదురే! ఇంతఁదనుక వారి వంచనాఘట్టములె మీకుఁజవిచూపి, వారిబలాతిరేకములకె మిమ్మెర సేసిరి గాని, మీచే మీచేవ వారించుకేనియుఁ దెలిసికొనినఁగదా, మీతోసంధిసేసికొన దలంచుటకైనను! మీ కొఱకా కౌరవసభను శాంతిని యాచించుకొని, లోకకళ్యాణమునకై భారత వీరుల నింకం గొంతకాలము బ్రదుకనిమ్మని వేడికొని, యాచకుఁడనైతిని. ఇట్టిట్టుల నేనెంతవఱకు గ్రిందుకాఁగల నంతవఱకును గ్రిందయి సంధిని కోరుచు నెంతయుఁ బొరలితిని. నా ప్రార్థన మధికమైన కొలఁదియు నాతనిమహాగర్వమును, విడుపోకమియు, దుర్మానమును మిగులఁ బ్రబలినవి. చివఱకుఁ బ్రయోజనము లేకపోయినది."

అని తనపోయివచ్చిన కార్యంపుఁ దెఱంగెఱింగించి, "ధర్మజా, పథశ్రమంబున నున్నాను. సావకాశముగఁ గలసికొని, యీవిషయము ముచ్చటించుకొందము. ఇప్పటికి విశ్రాంతి నొంద ననుమతిఁ గైకొందును—" అని కృష్ణుండును నిజమందిరమ్మున కేగెను.

ధర్మజుండును, దనయనుజవర్గముదెసఁ జూచుచు, మాన్పడి గొంత వడికి నిజోచిత వర్తనముల నుండెను.

అయిదవ ప్రకరణము

(ii)

కౌరవసభనునడచిన కార్యపర్యవసానము ధర్మజునకునివేదించి కృష్ణుఁడు దనమందిరమునకు మరలినక్షణమునుండియుఁ దామరాకు మీఁది నీటిబిందువువడువున నిల్కడలేని మానసముతోఁ దనప్రాంగణమున నిటునటుఁదిరుగుచు ధర్మజుఁడు, కృష్ణునిపలుకులె మఱల మఱల నెదఁ దలంచుచుఁ జింతిలుచుండెను.

—ధర్మరాజు—

మానవుఁడు తన కుచితమౌ తెలియంగని యెంచింగినదానింగూర్చి పొరింబొరిఁ దలంచుచు దదనుగుణముగఁ బ్రవర్తింపఁదలంచుచుండును; కాని తనప్రవర్తనకితరులు ప్రధానులగుపట్టుల వారి వర్తనముతోఁ దనకుఁ బ్రసక్తియున్నంతవఱకును, దన ప్రవర్తన మెంత నియమబద్ధమయినదయినను, దాని నొకింత సడలించుకొను నవసర మెడనెడఁ గలుగుచునే యుండును.

నేనెన్నివిధాలఁ బ్రయత్నించినను యుద్ధముకానిమార్గము మఱిస్ఫురింప లేదు. ద్రుపదపురోహితుచేఁ గబురంపిచూచితిని. సంజయు ముఖమున మరేమియు మిగులనీయక, యనవలసినవన్నియు నంటిని. దుర్మానియు, దుస్సాహసుఁడు నగు దుర్యోధనుదెసఁ గార్యంపుఁదెన్నుచక్కఁబడదని తెలిసియుఁగృష్ణునంపి రాయబారము నెఱపి చూచితిని. ప్రయోజనము లేకపోయినది. పౌరుషమున నింతకన్న నేనేమి చేయఁగలను? పాపమీకృష్ణుఁడుకూడ నాకొఱకెంతశ్రమంపడవలెనంతయుఁ బడియె విడచినాఁడు; కానికౌరవ్యులు తమదుర్జనత్వముచేత, కురుకులమునకు వన్నెదెచ్చిన యలనాఁటి సౌశీల్యమునుగూడఁ బారఁద్రోలి యెంతలొనర్చిరి!

ఆదుర్యోధనుఁడా భీష్మబాహ్లీకవిదురాదులేమైన నైతికముగను, పారలౌకికముగను జెప్పఁబోయినను, వారిని సరకుసేయఁడు. తానునుకొనినమార్గముగాక,

ఇంకొకటికలవనియైనఁదలంపఁజాలఁడు. 'తనకుఁదానుగా నైతికమార్గమీతనికిఁదోఁచునేమో; నేనేలతొందరపడవలె'నని చాలకాలము సైచి చూచితిని. ఇప్పటికిని బ్రయోజనము లేకపోయినది.

దుర్యోధనుండు దేవబ్రాహ్మణ గురుజనపూజాధురంధరుఁడయి నేలయేలుటలోఁ, బ్రజలసౌకర్యము లెఱింగి వారిని సంతృప్తులంజేయుచు వారి నోముటలో, నర్థిజనంబుల కీవులొసంగుటలో, గ్రతువు లొనరించి తత్తదుచిత ప్రకారంబుల గౌరవించుటలో, మాయయ్యపరిపాలనను, మాపరిపాలననుంగూడఁదోసిరా జనిపించునట్టుల రాజ్యంబుపాలించుచున్న మహామహిమాన్వితుండయ్యెను, మహామానియు దోర్గర్వియునౌటఁ, బాండవేయులయునికి దలంపునకు వచ్చినయంతనె, నిప్పుకలం ద్రొక్కిన కోఁతిగతిఁ జెందుచుండు. సామ్యమున మఱి కార్యము గడతేఱునని యేయొకనైనఁ దలంప వలనులేదు. కార్యభారమువహించి కురుసభకేగిన కృష్ణుఁడే మంగళహారతినంది మరలివచ్చినపిదప నిఁక నెవఁడంతకన్న సమర్థుఁ డున్నాఁడు! కాని కృష్ణునిధార్తరాష్ట్రులకడ కనుపుటమాత్రము లౌకికముగ నెంతేని మేలగుపని యైనదని సంతసింతును.

యుద్ధము సన్నద్ధమై యైనను, ఎట్లేని మాన్పనగునో కా యని నే నెంతే విలపించితిని; ఎంతో ప్రయత్నించితిని; ఎంతయో సైరించితిని; కాని నిర్బంధమును, దుర్మానమునుగల దుర్యోధనుని, ఎవరెంత చెప్పినను విననొల్లని యాదుర్బుద్ధిని ప్రేమచే, సైరణచే, అణకువచే, గౌరవముచే, మరల్పఁజూచినను, మరి వలనుపడినది కాదే యని, నేఁజింతిలుచున్నను, అతం డేరును మరల్పరాని చేటును సంభావనసేయుచు, నన్నెంతో పరిభవమొనర్చియు, నింకను బరితృప్తిం జెందఁజాలకున్నాఁడుకద!

ఘోషయాత్రాకాలమున గంధర్వులచేఁ జానున్నసమయమున నాతని రక్షింప విడిపించినమాప్రయత్నము, వానికి మాపైఁగల మాత్సర్యముమాన్పి పశ్చాత్తాపము నుదయింపఁజేయఁజాలక, అవమానకరముగఁదోఁచి వాని దుష్ప్రవృత్తినిమఱింత రేచుటకే కారణభూతమయ్యెను.

ఆనాఁ డేకవస్త్రయౌ ద్రుపదాత్మజను గొప్పవట్టిసభకీడ్చుకొనివచ్చి యవమానమొనర్చినయాతని యవినీతిని మేమెంతయు నోర్చియుండుట నించుకేని యోచింపక దానిని మా యసమర్థతగాఁదలంచి, మఱిమఱి పైకొనమొదలిడెను. ప్రేమ మూపి యాతనిహృదయకాఠిన్యము మెత్తపఱుపనొనర్చిన మాప్రయత్నమాచందము

నను, సైరణనూపియాతని యవినీతిని బోఁదోలి నీతిమంతునిగా నొనర్పనెంచిన యీ ప్రయత్న మీచందమునను, బటాపంచలయ్యె.

'సమయానుసారముగ వనవాస్యాజ్ఞాతవాసములు నిర్వర్తించుకొనివచ్చినపిదప నైనను వారుమా రాజ్యభాగమును మాకుఁ దమంతఁ దా మొసంగ లేదుకదా' యను నీర్ష్యనొందక, తొలుదొల్త నే వారిపై దాడివెడలనైన నిశ్చగింపక, లోకము నెడ నణకువయును, వారియెడ నింకను గౌరవమునుజూపుచుఁ దొలుత ద్రుపదపురోహితుని బిదపఁ గృష్ణుని వారియొద్దకనిపియుఁ జూచితిని; కాని ప్రయోజనము లేకపోయినది. మాకుఁ జైత్యకంబగునట్టిదియు, దిగ్విజయంబున మే వశపరించుకొనినదియు నగు రాజ్యంబు మాకొసంగు మని కోరినను, మా కొసఁగకుండుటకుఁదోడు, మాయైదుగుర కును, మాచుట్టాలకును, దగినట్టుల నైదు లులనైన నీయ సమ్మతింపనట్లే తెలిసినది. మాకు వారలు గావించిన పరిభవములకుం దెగి, మేము వారిపైఁ గీడు రోయమియుం దలంప లేదు. సర్వవిధములవారు సమరమునే గృవపఱచుచున్నారు. తుదకన్నింటికిని గిరీటమువంటి శ్రీకృష్ణుని మాటఁగూడ నిలువనిచ్చువారు కారు. ఇట్టిపట్టున సమరంబు కానివిధంబు దోఁపకున్నది.

ద్రౌపది తనపడ్డ బన్నముల నెన్నుచు సదా భీమసేను సుద్రిక్తుం జేయుచుండ నాతండును సమయవిచక్షణ లేకుండ నెప్పటి కప్పుడే గదాధారియై దుర్యోధనుపైఁ గవియ సంసిద్ధుం డగుచుండును. యుద్ధమే లేకుండఁ జేసికొనఁ జేసాచి క్షత్రధర్మ నిర్మూలన మొనర్చి, వారేమిచ్చినను నిచ్చిన కుతుకమ్మున నే నందికొనఁదలంచియె కద తొలి భూదేవుని, మలి వాసుదేవునింగూడ నంపియు తుదకు కృతకృత్యుండను కానైతిని. మాధవుమాటఁగూడ దక్కినది కాదని తెలిసికొనినది మొదలు భీమసేనాదులు రేపకడ లేచి, సమర సన్నాహంబులు సేయుచ మనుచున్నారు. నే నింతలో మాధవు మందిరమునకుఁబోయి యాతం డేకతమ యున్నపుడు, చర్చింపఁగల విషయములనెల్ల సంశయముదీరఁ జర్చించిచూచెదఁగాక!"

ధర్మజుఁడు సమరంబన మిగులఁ గటకటంపడుచున్నాఁడు. మనసునకుఁ దెంపు లేక ఒక తెన్నునఁ బోజాలకున్నాఁడు. మాధవు మందిరమునకుఁ బో నుద్దేశించినాఁడు.

"ఇంతరాత్రియైనదే! కృష్ణు డింతకు నిదురించియే యుండును. ఐనను దెలిసికొని వచ్చెదఁగాక", యని ధర్మజుం డనుకొనుచు, వెడలి, మాధవు మందిరము సమీపించునంత నదివఱకెంత సాద్దుపుండెనొ, తనమందిరప్రాంగణమున నిటునటుదిరుగు చుండెనో కాని, ధర్మజుం జూచినయంతనె, శ్రీకృష్ణుండు, "పాండవాగ్రజా, ఎంత

వల దనినను యుద్ధమే సిద్ధమైనదే యని నీ మానసము కుదుటలేమి, నిదురరామి, నేమియుందోఁపమి, నిటకువచ్చినట్లున్నది——''. అని యనెను.

"మాధవా, మన మిరువురము గలసి యోచింపఁదగిన విషయ ముండుట నీ యొద్దకురేయి నిను శ్రమపెట్టఁదలంచి వచ్చితిని."

"నీ యీప్సితము నెఱవేఱినదికాదు కదా యనియు, నెన్నివిధాలఁజూచి నను పోరికింపఁబడుటకాని శాంతి నెలకొల్పఁబడినదికాదే యనియుఁ జింతిలుచు నిదుర లేక, యిటునటుఁదిరుగుచున్నాను. సర్వమానవప్రయత్నమునఁ బర్యవసానము ననుసరించి, లాభనష్టములకును, నిందాస్తుతులకును బ్రధానధాముఁబరగు, నీకు మానసపుటారాట మదెంతకలదో కాని యీనాటిరేయి నిట్లొంటరిగ నిటు కరుదెంచుటవలన నీ కార్యభారము గోచరమగుచున్నది. భవిష్యత్కార్యముంగూర్చి మన మేమేమాను కొనవలసియున్నను, కలియఁబోసికొనఁదగిన సమయ మిదియొకదా!''

"ప్రధానముగ నొక యంశముంగూర్చి నీతో సంప్రదించుకొనఁ దలంచివచ్చితిని."

"యుధిష్ఠిరరాజా, నీయాజ్ఞల నౌదలవహించి, నీ కనుసన్నలమెలఁగవలసిన మము బోంట్ల శాసించి కార్యక్రమము నడిపించుకొనఁదగిన నీవు నాయెడఁగల ప్రేమచే నాతోఁ బ్రసంగించి, సంప్రదించుకొనఁదలంచితి నని యంటివిగాని, వివేకమూర్తివగు నీ వొరులకడ విషయవిమర్శఁ జేసికొనఁదలంచు టేటిమాట!''

"స్వయముగఁ గురుసభకేగి సవిమర్శంబుగ నన్నియు నవలోకించి యేతెంచి వచ్చిన నీతో సంప్రదించుకొనుట యత్యవసరముకాదా!''

''నందనందనా, కురుసభలోని యంతఃమానసపరిస్థితులం బరికించితివి: మాయావస్థల నరసితివి: కురువీరులఁజూచి వారిసేనలసన్నాహములఁ దెలిసికొంటివి. అంతటివీరులు మనసేనలో లేరు. కాని మనకున్నవా రందఱును వారికిఁ దీసిపోరు. ఇఁక వారి బలగమునఁ గల లోపములును, వారికి దౌర్బల్యకారణములై మనకు మార్బలములు కాఁదగినవియును, నీకుఁ దోఁచినంతవఱకును నాకుఁ దెలియఁజేసినచో నేనును యోచించుకొందును.''

''నను బరీక్షించుటకడిగిన ప్రశ్నమిదికాని, వారిదౌర్బల్యములలో నేవి మనకు మార్బలములుకాఁజాలునవని నీ కెత్తి చూపఁగలను? అందు నీ వెఱుంగనివేవి! అయినను నీవడిగినదానికి సదుత్తర మొసంగకతప్పదు కనుక నా చెప్పఁబోవుదానిని సావధానముగ విని విమర్శింపఁదగును ''

రా య బా ర ము

బాహువిక్రముండై, అఖండమహీమండలంబేలుచు, రారాజనిపించుకొని, దేవబ్రాహ్మణపూజాధురంధరుండయి, మిముమఱపింప, మీ పరిపాలనకన్న మిన్న యనిపింపఁదగినరీతిని, మీరడవులనున్న కాలాన ధరణీచక్రము నేలినఘనుండు దుర్యోధనుండు. పాండవులు దక్కఁ దక్కొరులంగూర్చి యాతనికి దుర్భావంబైనను మఱిలేదు. ప్రత్యేకపుఁ బగలు గలవారిని వీడి యాలోచించినచో నిఁక నెన్నదమన్నను-ఏదీ మందునకైనను- ఒక్కచెడ్డ, ఆతనియందు! అట్టివాతఁడిపుడీ యాహవమున ముఖ్యముగ భీష్మద్రోణకర్ణదుశ్శాసన శల్యులపై నాధారపడుచున్నాఁడే కాని, వారి వారి వ్యక్తిత్వవిశేషములు మనకు మార్బలములు కాఁగలవనియైన నూహించుకొన నసమర్థుఁడు. సర్వసమర్థుండనని దుర్యోధనుండు సర్వదాతలంచుకొనుచుండుటయె తన యసమర్థతా చిహ్నముగాఁ దలంపఁజాలకున్నాఁడు. దుర్మానముతో దుర్యోధనుఁడు మీయెడ నిర్బంధాధికారము వహించుటయె, తనకు దౌర్బల్యహేతువయి, మనదౌర్బల్యము వాపుటయే కాక, మనకుమార్బలముగూడ నగుచున్నదని తనకుఁ దోఁచకున్నది. ఇంతకన్న నింకేమికావలయును?

తాఁ గార్చిచ్చు నార్పఁగలననియుఁ, బాషాణవర్షంబు నాపఁగలననియుఁ, ప్రచండవాయువును స్తంభింపంజేయఁగల ననియు, నీటిని నాటుగను, నాటును నీరుగను దన మంత్రబలంబునఁ జేయఁగల ననియు, మిత్ర శత్రు విషయంబులైన శుభాశుభంబుల మార్పఁగల గ్రహగతులపైఁగూడ సంపూర్ణాధికారము గలవాఁడ ననియుఁ దన ధీమహిమంబును, దన యశేష సేముషీ సనాథత్వంబును, గొనియాడుకొనుచు స్వశక్తులపై నాధారపడుచున్నాఁడే కాని, తానెఱిఁగినమహిమములకు మార్మహిమములును, ఉపసంహారమంత్రములును, ప్రతిమంత్రములును, దనయెదిరి యెఱుంగునోకా యనియైనఁ దాసంశయింపఁజాలఁడయ్యె. మిత్రశత్రుగణంబుల విషయంబులైన శుభాశుభంబుల

నెఱింగినవాఁడననియు, వానినిమూర్ఖఁగల గ్రహగతులపైఁగూడ నధి
కారముఁగలవాఁడననియు, ధైర్యమూనియున్నాఁడే కాని, తనకు రాఁ
బోవు శుభాశుభంబులంగూర్చిన భవిష్యద్విషయంబుల విచారింప
నోపఁడు. ఇట్టివాని ధీరసాహసత్వము మనకు మార్గబలముకాదా!

మీకుఁగొంతయైన ధరణీభాగ మొసంగుఁడని యెంతచెప్పినను,
వినని దుర్యోధనునికడఁ దన ఖండనవాదత్వము చూపఁజాలక, యాతని
వీడనేరక, చేయునదిలేక, యిపుడు యుద్ధమొనర్చు వారి సర్వసేనా
నాయకత్వము నంగీకరింపనున్నాఁడే కాని,— పెద్దవాఁడనగు నామాట
వినకపోవుటకుఁ దోషము కృష్ణునిఁగూడ నిరసించినాఁడే — యాని దుర్యో
ధనునిమీఁద నసహ్యములేక కాదుసుమా, భీష్ముఁడు మనతోఁ బోరఁ
దలఁపుట! ఇదిమాత్రము మనకు మార్బలముకాదా!

కుమారాస్త్రవిద్యా కౌశలపరీక్షా సమయమున నుద్రేకించు
చున్న కర్ణునాపి, యర్జునుని గౌరవము గాపాడిన శిష్యవాత్సల్యుండగు
ద్రోణుఁడు- దుస్సాధ్యమగు గురుదక్షిణను, ఉత్తరపాంచాలమును,
శిరోమణిని కిరీటివలనఁబడసి యనుభవించుచుఁ బ్రసన్నచిత్త హృదయు
డగు ద్రోణుఁడు- తొలి రాజరాజు పోషణమును వడసిన కారణ
మున నిపుడు యుద్ధమున నిలునట్టి నిలుచుట వారికి దౌర్బల్యమును,
మనకు మార్బలమును గాదా?

నిశ్చలము, నిష్కళంకము, నిరవధికము నగు ప్రభుభక్తిగల
కర్ణుఁడు రారాజునెడఁ గల దురహంకారమును- దురభిమానమును
మాన్చి, ప్రమాదము లావహిలుపట్టుల నెల్లప్పు వానిని మందలింపక,
మఱలింపక రాజానుగ్రహమునకై యిచ్చకములాడుచు వానినేయను
సరించి దుర్మంత్రముల నెఱపుచుంటయు మిమ్మందఱ నరకుసేయక
యొక్క యర్జునునందే దృష్టిని కేంద్రీకరించుటయు దుర్యోధను
నాశమునకుఁ గారణములును- మనకు మార్బలములును గావా?

ఇఁకమద్రనాథుఁడందువా? అతఁడునీకోరినచందమున నాహవ

రంగమునఁ బ్రవర్తించెనేని గర్ణుఁడు నిర్వీర్యుఁడును నిస్తేజుఁడును నయి యసమయుద్ధక్రీడను జేయాడక దిక్కులుసూచు పరిస్థితు లేర్పడక మానునా? కనుక మీవాఁ డగు శల్యుం డావలనుండుట మన కెంతయు మార్బలము కాదా!

వారి శిబిరములో, వారి సేనలలో, వారి సేనానాయకులలో భిన్నాభిప్రాయము లుండుటయును, గురు వీరులలో నొక్కొక్కరుఁ బాండవ పక్షమున నున్నవారిలోఁ బ్రత్యేక ప్రత్యేకముగ నొక్కొక్కరిపై వేర్వేరఁ బగలసాధింపఁదలంచి యుండుటయును, జయలక్ష్మిం గూర్చి వారివారియాశయములు భిన్నభిన్నములౌటయుఁ, గౌరవ పక్షమువారి గమ్యస్థానములును, కార్యగౌరవదృష్టియుఁ గేంద్రీకరణమునొందక చెదరియుండుటయును, మనకు విజయప్రదములౌ మార్బలములు కావా!

ఇఁక వారిపక్షమున నన్నింటికిని బ్రధాన దౌర్బల్య మేమన: ‘బాహుబల సమన్వితులము, దశదశలఁ జూచుకొని సేనల నడిపించుకొనఁగలవార’మనుకొని గర్వించుచు దారుణాతిదారుణములగు పౌరుషశక్తులనెల్ల భస్మమొనరింప సమర్థమగు దైవము నెడవెట్టుచుండుటయేకాక, దైవమునకుఁబౌరుషము లోఁబడియుండుననియైనఁదలంపఁజాలకుండుటయేసుమా! అదియే మనకుఁగల “స్వల్పసంఖ్యాక”మను నామమాత్ర దౌర్బల్యము నిట్టె పోఁగొట్టఁగలదుసుమా!

కాని యుధిష్ఠిరరాజా, నీమానసకాసార మిపుడెంతేని గల్లోలమునొందియున్నదనుమాటమాత్రము నిశ్చయమనితోఁచెడిని. ఎంత కాలము వేచియున్నను, వారిపై ధ్వజమెత్తక యెన్నియిక్కట్టులువడినను, కౌరవ్యులకుఁబశ్చాత్తాపముకాని, మంచిబుద్ధిగాని, కలుగలేదే యనువేదనయొకవంకను, ‘నయ్యో! గురుబంధుమిత్రజనంబులందఱితో యుద్ధమునెఱపి, జయమందియు, రక్తసిక్తమౌగూడెటులఁదిందు’ననుచింత యింకొకవంకను, ‘యుద్ధమేచేయక కందమూలాదులందినుచు

మునులపోలిక నడవుల దపంబొనరించుకొనుచుం గష్టముగాలము బుత్తు మన్నచో, స్వధర్మమును వర్జించిన పాపమున కొడిగట్టుకొనిన వార మగుదుమే'యను ననుతాపము మఱియొకవంకను, 'పౌర్వాపర్యములు జక్కగఁ జర్చించికొని యేదగుచుంటి మాహవరంగమునకని యనుకొను చున్నామేగాని పారలౌకికముగా నిదియే పొరఁబడిన కార్యముగాఁ బరిణ మించి, తుదకు దుఃఖభాజనమగు నరకప్రాప్తియే సిద్ధపఱచునేమో' యనుభయ మన్నిదెసలను, నిన్నలమికొనుట నింతవంతకుఁ గారణ మగుచున్నట్లు తోఁచెడివి. అట్లయిన నిప్పట్టునఁ జెప్పఁదగినమాట యొకటి లేకపోలేదు. కార్యాచరణముపట్ల మానవప్రయత్నమునకు లోపము రానీయకుండఁ జేసికొని, మనోగతిని వాక్ప్రకారంబును నేకంబు సేసికొని, కార్యదిశ నేర్పరచికొని, యామార్గంబున కార్యమును బ్రవర్తింపఁ జేసికొనినచో మఱినీయందు, గార్యావసానముపట్లఁ దోస మావహింపఁజాలదు. నిన్ను లోకము దూఱంజాలదు. ఇది యెంతయు సిద్ధము. ఎన్నివిధములఁ బ్రయత్నించి చూచినను యుద్ధము మాన్పు మార్గము మఱిదొరకినది కాదే యని నీకుఁ దోఁచినచో, వంచనమార్గ మున మీ రాజ్యమును మీసంపదయును మీరు గోల్పోవుట సత్యమే యయ్యెనేని యా నష్ట సంపదలనెల్ల యుద్ధము చేసియైనను, మరలఁ గైకొనుట యే ధర్మమని నీకుఁ జక్కగఁ దోఁచెనేని, ఇఁక నాలస్యము సేయక, శిబిరమున కేగి యుచితప్రయత్నములనుండుటయె నీకుఁ గర్తవ్యము."

శ్రీకృష్ణుని నుడుల తదేకధ్యానమున వినుచున్న ధర్మజుం డిట్లు పలికెను

"నందకుమారా, నీనుడులు సమంజసములయ్యు, 'దారుణా శనిపాత తుల్యములు'. ఆహవకార్య మనివార్యమని యెఱింగియు, నెంతేని ముమ్మరమ్మగు నుమ్మలికమ్మున నే ననిచిచ్చుం జొరవలసి వచ్చు చున్నది. అమానుషమగు మూర్ఖత యెదిరియైయుండ, సైరణ కార్య కారి కాఁజాలదు కావలయు!" అని యూఱకుండెను.

"వేకువయగుచున్నది. మన కార్యక్రమము బహుదారుణమై, సర్వతోముఖప్రజ్ఞను గోరునదై యున్నది.

అదె, దిక్కులు తెలివొందుచున్నవి! ఇంతవఱకును దిక్కుల నలమికొనిన చీకటుల వెందుబోవుచున్నవో కాని, రాబోవు నీవిజయశ్రీ వోలె నిష్కళంకమైన ధవళిమ దిక్కుల నావరించుచున్నది. అదె చూచితివా! ఆ ధవళిమయును శరవేగమున విజయు విక్రమంబుం దలపించుచు వచ్చుచున్నది. మఱి జాగుసేయం బనిలేదు.”

అని శ్రీకృష్ణుండా ధర్మనందనునకు మ్రొక్కి యాతనిదీవెనల వడసినిలువ, యమనందనుండును, మాధవుననుమతింగొని, తనమందిరమునకు మరలుచు మాధవుదిక్కు మొగంబయి మరల “దేవకీనందనా, రేపటియుదయము మఱియొకతూరి మనము గలసికొనవలయు” నని పనివినియెను.

అయిదవ ప్రకరణము

(iii)

మఱుచటి వేకువ శ్రీకృష్ణుండు సాత్యకిసహితుండయి ధర్మజుం జూడనేగెను. ధర్మజుండును సగౌరవంబుగ శ్రీకృష్ణున కాతిథ్యంబొసంగి కూర్చుండఁజేసి ప్రసంగంబున కారంభించెను.

— ధర్మజుఁడు —

వాసుదేవా! మము మన్నించి మాపలుకుల నీవు కురుసభం బలికిన ప్రకారంబును, వారి పలుకుల చందంబును, నీ వెఱింగిన తెఱంగును మాకు సకృచ్ఛముగఁ దెలుపఁ గోరుచున్నాము.”

—కృష్ణుఁడు—

ధర్మనందనా, ఆంబికేయ గాంధారేయుల సమక్షమున సుఖమును, పథ్యమును నై, కయ్యముగాని తెఱంగై, నెయ్యము సమకూర్చు మార్గమున నెయ్యది జరుగఁదగినదియొ, నయ్యదియె విస్పష్టముగఁ బలికితిని. కర్మమును, జ్ఞానమును జోడించి, నాచెప్పిన పలుకులెల్లఁ జీదకన్నిడి, పెడచెవినిబెట్టి, తానునుం దనవారునుంగలసి

నను నీచపఱచి, అపహసించి, మఱియు విడిచినారు. ఆ ధార్త రాష్ట్రులఁ గూర్చి యేమనఁగలను?

ద్రౌపది—ఐనదా, నే ననిన ట్లయినదా? మీ యందఱకు కడవఱ కయి నదిచాలక మా యన్న సంతానము గనిపి, యానాటనకుఁగూడ మంగళ హారతిం బట్టించిన గాని మీ యన్న దమ్ములకుఁ దృప్తి యయినది కాదు! నాకతన, మీవలన, మా యన్నయు నన్నుగాపు మన్ననను సంది మఱలవలసివచ్చినది! ఒక్కొక్కరి కార్యములవల్లఁ గష్టమును, నప కీర్తియుఁ దత్కార్యసంధానకర్తకు సంక్రమించుచుండును.

ధర్మ:— అప్పుడైనను మా పెదతండ్రియు నుచితము సెప్పక పోయెనా? భీష్మవిదురాదు లాజ్ఞులైనను జెప్పలేకపోయిరా?

కృష్ణు:— చెప్పకేమి! వైచిత్రవీర్యుండు సాధుభావంబుబూని, పలువిత ముల నీతులు గఱపినను అగ్రాహ్యుండు వినడయ్యె.

అంబికేయుండు మొగమాటదక్కి శంతను పుణ్యవంశ ప్రకారంబును, దా జన్మాంధుండగుటను మీయయ్య పాండునృపాలుండె రాజ్యాభిషేచనమందిన విధంబును, తత్కారణంబుననె నీవు యావ రాజపదవి నొందుటయు, ననంతరము మీరు కౌరవాన్వయంబున కెల్లఁ బెంపుగా దిగ్విజయంబు గావించి సంపాదించిన సంపదల నెల్ల వారు వంచన మొయి నాచికొనిన చందంబును, నీవు సత్యంబు దప్పక సమయంబు నడపిన భంగియు, నీ తండ్రిపాలు నీకీక తప్పదను ధర్మంబు పద్ధతియుఁ దేటపడం జెప్ప పాడితొలంగినయెడఁ దన వారు నశింతురనియును దెలియఁ జెప్పెను.

పరిశీలనము

మాధవా, ధర్మరాజాదులు తనతో నాడని మాటల సంజయుం డెట్లుఁ గురుసభం బలికెనో, అదేవిధంబున నీవును గురుసభను, ధృతరాష్ట్రుఁడు తనపుత్రునితో నీసమక్షంబున ననని మాటల— నేకొఱకయిన నేమి,— యిపుడు ధర్మజుతో ననుచున్నావు.

నీకార్యకలాపము విమర్శించువట్టుల నిను విడిచిపెట్టము సుమ!

పెద్దలందఱును వారమోడక పాడి చెప్పి చూచిరి, ప్రయోజనము లేకపోయినది. కణ్వాదిమహర్షులు కొతుకుంచక దుర్యోధనుని దురభిమానమును, దురహంకారమును, దుర్మానమును నిర్బంధాధికారాదులు నెత్తిచూపి, వలదని వారించిరి. ప్రయోజనము యోజనములు దాటిపోయినది. పెద్దల సదుపదేశములలోఁ దానెంతవఱకుఁ గువాదము పెంచఁగలుగునో, అంతవఱకును దన కుతర్కము పెంచి చూచి, తన కెప్పట్టునఁ బ్రతివచనంబులు నెంచనైన ననువుపడకుండె నప్పట్టున నాతఁడు కటకటంబడి తత్తనుజానుజసుహృదామాత్యసహితంబుగఁ దా నకార్యంబువీడి యట్టె చనుటకేమాత్రంబును గొంకలేదు. తేఁడును గొడుకు నవినీతికిని, దురహంకారమునకును మదిం గలంగి, గాంధారిని రావించియు, విదురుచేఁ గొమరుని మఱల రప్పించుకొనియుఁ, దల్లిచేఁ దనయునకు వగయును, గూర్మియును, వెఱపును మిగిలిన చల్లనిపలుకులును జెప్పించియుఁ జూచెనే కాని ప్రయోజనము నొందలేకపోయెను. ఎవ రెంత చెప్పి చూచినను, విననొల్లనని, యుల్లంబల్లన చాయి సేసికొని కూరుచుండు వాని కెన రేమి చెప్పిన నేమిలాభమగు? నా యోపినంతవట్టు నేఁ జెప్పి చూచియు, నారదాదిమహర్షులచే నీతిగలనడవడి నెఱింగించి చూచియు, ప్రయోజనము లేమి నెఱింగి సమయానుకూలముగఁ దెచ్చికొల్గినుకను, సుయోధనుం జంకించియు, భంగించియు, ధిక్కరించియు, వేయేల, తృణీకరించియుం జూచితి కాని లాభము కలుగలేదు. అట్లయ్యును భగ్నప్రయోజనుండనై మరలివచ్చి నిను దర్శింపనొల్లక, శాంతవచనంబులుఁ బలుకాడితిని. న్యాయనిష్ఠురములఁ బలికితిని; బాంధవంబున సంప్రీతి నెఱపితిని. అనుబంధము చూపితిని. కాని మహామానియని యంద ఱనుకొనుచున్న యా దుర్మానియగు దుర్యోధనుఁ డశక్తిచేఁ దన సహజదుర్జనతఁ జూపంబూని, చెలరేఁగినాఁడు. అట్టివాని నప్పట్టున వారింప వేఱొకమార్గములేమి-

మఱి చెప్పనేమి- కొన్ని అమానుషంబులగు వేషమాయలు వన్ని పెక్కు పోకలఁ బోయితి. సంధియ కావలయునని యెంతఁ బోరల వలయు, నంతయుం బోరలితినే కాని యప్పాపాత్ముం డెన్నిటం జక్కంబడి నాఁడు కాఁడు. ఎవ రేమి చెప్పినను వినవొల్లక, దుర్యోధనుఁడు పంతగించి, 'నడుములు బిగియించి, నడువుండు కురుక్షేత్రంబున' కని తనవారలకుఁ జెప్పఁబంచె. వారలు సేనాముఖంబున భీష్మునునిచికొని యెత్తి విడియంగలవారు. మిమ్ముం బట్టి పల్లార్చినంగాని యాతని మానసము గుదుటువడదు. ఇంతకు సంధియంబు లేదు. కయ్యంబ యాతని కవశ్య కర్తవ్యంబు. సామవాక్యంబుల నాతనిమతి మఱల్ప నా కనువుపడినది కాదు. మీకు రాఁదగినదని మీరు మొర వెట్టుచున్న యంశము మీ కెంతమాత్రము నొసంగువాఁడు కాఁడు. ఇంతకును గౌరవులయెడ దండంబు దక్క వేఱొక్క యుపాయంబుఁ బొనుపడదని మీకు ద్యోతకము కామి, నింత దవ్వయినను గథాక్రమము నడచుట కవకాశము కలిగినది. ఇఁక నీవును నీ తమ్ములు నేది నిర్ణయింతు రయ్యదియె మీకుఁ బోలిన తెఱంగు కాఁగలదు."

— ధర్మజుఁడు —

కేశవా! ఇఁక నీవును, నీ తమ్ములు నెట్లు నిర్ణయింతు రట్లే జరుగఁగలదని నీవు తప్పించుకొను పలుకాడిన నయ్యది చెల్లఁబోదు సుమా! ఇట్టిపట్టుల జనక్షయంబున కొల్లని నేను, తిరిపమెత్తుకొని తిని మనఁజాలని నేను, స్వధర్మచ్యుతివలని నరకంబునకు వెఱచు నేను, చేయఁదగిన కార్యమెద్దియో నీవ పరిష్కరింప వలంతివి.

— కృష్ణుఁడు —

మీ కార్యముఖము పరిష్కరింపవలసివచ్చినపుడు కొన్ని ముఖ్యాంశములు చింతించి, కార్యదిశ నేర్పఱచికొనినవో, కార్యదశ తనకుఁదానుగ నేర్పడఁగలదు.

రాచబిడ్డల కడిగికొని తిని బ్రతుకుట ధర్మశాస్త్ర నిషిద్ధము.

రాయబారము

అడవులఁ గందమూల ఫలాదులఁదిని, మరల నారచీరెలఁగట్టి కటికనేలఁ బవళించి, చెట్లనీడ విడిసేసికొని, యుండవలెనన్న మరల నంతటి యాయాసము పడనోపరు.

నీ వచ్చు చుట్టాలకు నాదరంబును, నతిథి యభ్యాగతి జనంబులకు సత్కారంబును నొనర్పకుండుట ధర్మవిరుద్ధము.

కులధర్మంబగు క్షాత్రధర్మంబు వీడుటను నరకము సిద్ధము. అట్లగుట నన్నిన్ని విధాలఁ జూచినను, యుద్ధమె సంసిద్ధము.

పరిస్థితులిట్లుండ 'జనక్షయకారకమగు యుద్ధము నేఁజేయనోప' నని యనుట యెంత వింత!

ఇపుడా కురురాజు నేలుబడి యెట్లున్నదో, ప్రజాభిప్రాయ మెట్లున్నదో మీరు గమనింపకున్నారు. సిద్ధమైయున్న ధార్తరాష్ట్ర వంశ విధ్వంసమును, కురుసామ్రాజ్య తనమును మీరలు వారింపఁ జాలరు. అయ్యో, నాయన్నదమ్ములే, నా పెదతండ్రియేయని మీరు వాపోవుటే కాని వీరందఱును నిహతకాయులె; మఱియు నిఁకఁ బతితకాయులగుట కాదినమున కెదురు సూచుచున్నారు. అది యెఱుంగమి మీకింత పరితాప మొదవె. ఏ జీవమునకైనను లోకమున శాశ్వతత్వ మున్నదా? ఇది కాదందువేని, ఏడీ మీ క్షేత్రనిర్మాతయగు 'కురు' రాజు! ఏడీ హస్తిపురనిర్మాతయగు 'హస్తి' రాజు! ఏడీ మీ పితామహుండగు 'శంతనుండు'! ఏరీ మీ పితామహులగు 'విచిత్రవీర్య చిత్రాంగదులు'! ఏడీ మీతండ్రి 'పాండుభూవిభుఁడు'! యమనందనా, మనమెవ్వరమును శాశ్వతముగ నిలుచువారము కామని నీవెఱుంగవే!

- ధర్మజుఁడు

దేవకీనందనా, కురువంశ నిర్మూలనంబు సేయంజాలకుంటయు, రక్తపుఁగూడు దినఁజాలకుంటయుఁ గాని, నా చాలమి కాదుసుమీ, నేను నిశ్చయ రహితుండనగుటకుఁ గల కారణము!

మఱి పొందొడవు నుపాయంబు లభింపదే! నా మనోగతియు

నా తమ్ముల చందంబును నీ వెఱుంగుదువు. ధార్తరాష్ట్రుల తలంపులును, భీష్మద్రోణ విదురాదుల చిత్తవృత్తియు నెఱింగియే కద వచ్చితివి! ఇఁక మాకు ధర్మచ్యుతి తగులకుండ, నుచితంబగు కార్యంబును తత్సాధనంబును నీవ నిశ్చయింప సమర్థుండవు.

కృష్ణుఁడు

(తనలో) తన మానసమున నీతఁ డెంత గుసుసువడుచున్నాఁడు! జనక్షయమునకు, అందునను భ్రాతృవర్గ వినాశనమునకు ఈతఁడు తలంకియే కద మనసు కుదుటుపఱచుకొనఁజాలకున్నాఁడు! ఎన్నివిధములఁ బ్రయత్నించినను, మఱి వలనుపడినది కాదుకదా యని యోచియె యిపు డింతదూరము పౌర్వాపర్య చింతం దగిలియున్నాఁడు!

(ముహూర్త కాల మూరకుండి—ప్రకాశముగా)

యమనందనా, ఎందఱెందఱెన్నెన్నివిధాల బుద్ధులుసెప్పినను, వినక, కడు మోఱకుఁడై, రాజపుత్త్రినకుఁ దగని విధాన, నను బంధింపఁ దన తమ్మునిచేఁ దాఁటిని దెప్పించి, తా నొఱవెఱికిన కరవాలమ్మును వలనుగఁ బట్టి; కొంచెపుబుద్ధితో, నను బంధింప నా ముఖమున నిలచిన నయ్యాసంబద్ధుండగు దుర్యోధనునితో నింకను, సంధి ననుసంధింపఁదగు నుపాయము నామదిఁ దోఁచుటలేదు. యుద్ధముగాక కొండొక వెఱవునఁ గార్యము నెఱవేరు నటరాదు.

— ధర్మజుఁడు —

ఏమేమీ, నిను బంధింపుటకే ప్రయత్నించెనేమి! రాజ్యతృష్ణా సూత్రములచే బద్ధుఁడగు నాతఁ డుపనిషచ్ఛాస్త్ర సంతతులచే నా నిగమంబులైనను బంధింపఁజాలని నిను సామాన్యుగాఁ దలఁచి, బంధింపఁ దలంచెనేమి! ఔరా, యెంతటి మౌర్ఖ్యము! ఆదటఁ కురువృద్ధు లుండియుఁ, దెలిసియుఁ, జూచియు నూరకుండిరే?

— కృష్ణుఁడు —

కౌంతేయాగ్రజా, కణ్వ నారద జామదగ్న్యాది మహాముని

మనీషు లెంతదూరము బోధించినను సుయోధనుఁడు పాటింపలేదు. వా రెంతదూరము ఐతిహాసికముగఁ బలికినను నాతఁడు గైకొనలేదు. కురువృద్ధులమాట వినలేదు. అట్లగుటనేకదా, భీష్మ ద్రోణ బాహ్లీకాదులగు పెద్దలకుఁగూడ ధార్తరాష్ట్రులయెడ, నసూయజనించినది!

ధర్మ:-వాసుదేవా, దుర్మానం బీతని నెంతదూర మహంకారమయునిగ, మూర్ఖునిగ మార్చివేసినది!

కృష్ణ:-యమనందనా, నీకును దుర్యోధనునకును గుణమున నేమాత్రమును భేదములేదు. గుణకళాభేదముచేత, నొకటిలోకవ్యథాకరముగను, నింకొకటియాత్మవ్యథాకరముగను పరిణమించుచుండె.

ధర్మ:-ఏమి కృష్ణా అట్లంటివి!

— కృష్ణుఁడు —

రసావిష్టంభముచేత మీ యిరువురును నొకేజాతికి చెందియున్నారు. మీ యిరువురియందును అహంకారమే ప్రధాన గుణము.

దుర్యోధనుపక్షమున నహంకారము—యిదియంతయు నేనే చేయఁగలను; నేనే చేయుచున్నాను; నావలననే యగుచున్నది; అన్నింటికిని నేనేకలను;—అను నీ మొదలగు తలంపులఁ గలుగఁజేయుచున్నది.

ఇఁక నీయందున్న యహంకారము—వీరందఱును నావారు. జనక్షయకారకమగు యుద్ధము చేసినచో, నావలన వీరందఱును మృతులగుదురు. నేనే వీరందఱ మృతికిని గారణము కానగునా! చేసేతుల నేనేవీరినందఱ వధియింపఁగలనా?—అను నీ మొదలగు తలంపులఁ గలుగఁజేయుచున్నది. వారందఱును మీచే మృతులగుటకు నీ "యహంకర్తృత్వమే" ప్రధానమని తలంచుచున్నావు. నీయందు మమకార కళా మిశ్రితంబగు నహంకార మావిర్భవించుటచేత, నీవు దుఃఖితుండవగుటకుఁ గారణమైనది. దుర్యోధనునందు గర్వ కళా మిశ్రితమగు నహంకార ముద్భవిల్లుటచేత, "యుద్ధమున నందఱ నోర్తును: నే నెంతేని సేయనేర్తును: నా కెదురు కలదే" యని

విజృంభించుచు, నానందమందుటకుఁ గతంబైనది. మీ యిరువురపట్ల నది ప్రత్యేకప్రత్యేకముఖములఁ వేర్వేఱఁదోచుచుండినను, అహం కర్తృత్వభావమే, ప్రధానగుణమయియున్నది. ఇందు సందియములేదు.

యుధిష్ఠిరరాజా, మనకిపుడుకర్తవ్యము ముందు సేయఁగలసేతల నెన్ని నిర్ణయించుటెకద! కావున ననుజసహితుండవయి, కార్యనిరూపణ మొనర్పుము —.

మఱియుఁ దన కుమారులకుఁ దెలుపు మనిన కుంతీ సందేశంపుఁ బలుకులును, దన కేకాంతంబుగఁ జెప్పిన విదురుని వాక్యంబులును, కౌరవులు వినంబలికిన కుంతి నుడులును, ధర్మజునకుఁ దెలియఁబలికి యుపుడు భండనంబొనర్పను, రిపుజనంబు లగు భ్రాతృవర్గంబును సంగరంబున నిర్జింపను, ధర్మజునకుఁ బాపంబులేకుంకియుం దెలిపి, సమరంబె యవశ్యకర్తవ్యమని కృష్ణుఁడు సుబోధకము సేయుచున్నంత సేపును, తమ్ములందఱు నన్న దెసం జూపులునిలిపి యూరకుండ; ధర్మజుండును దన భ్రాతృవర్గము నవలోకించుచు నిట్లనియె.

— ధర్మజుఁడు —

తమ్ములారా, కౌరవులవలన మనముపొందిన కష్టములు దలంచినచో, మన మనంబు లెరిసెడిని. మన బాంధువర్గమును, జేసేత వధియించుటకు నాబుద్ధి గోల్పోవకున్నది. వీరపత్నియగు మనతల్లి కొంతి, బంధువధకు నొడంబడినది. మనకు హితమును, ధర్మమును, నయ్యెడు మార్గమిఁక మీరలె నిశ్చయింపుడు ఏదేనొకమార్గము నిశ్చయించి నిర్గమింపఁదగు తరుణ మాసన్నమైనది.

— అర్జునుఁడు —

అగ్రజా, మనకు హితమును, ధర్మమునునై, ధర్మచ్యుతిలేనిదై నెగడినమార్గమిదియని మన యచ్యుతుఁడె నిర్ణయించెనుగద! సమస్త ధర్మపరిశోధకుండగు విదురునిపల్కులును, వీరపత్నియగు మన తల్లి పలుకును, నా మనంబునంగల సంశయంబులఁ బాపినవి. ఇఁక నఖిల

విద్యాజాలసంవేదియగు నీ కృష్ణుండె రణంబు సేయుండన మఱి సంశయమును, విచారమును మన కేటికి?

— ధర్మజుఁడు —

ఐన నట్లనె కానిండు. అఖిల ధర్మవేదియు, మనకు నేడుగడయు నగు శౌరియె యుద్ధము నిశ్చయింప నింకేటికి సంశయము? తమ్ములారా, యిఁక నుగ్రసమరంబునకై సన్నాహంబు సేయుఁడు.

బాహుపరాక్రమంబు గలిగి వివిధవ్యూహ విధిజ్ఞతతో, మన యేడక్షౌహిణులును, దన కనుసన్నల నడుపఁ గలిగి భీష్మోత్సాహంబున కోర్చు ధన్వి నొక్కని మన మేర్చుకొనవలెను.

— కృష్ణుఁడు —

ధర్మనందనా, ఇఁక మనము సేయఁదగినది సేనానాయక నిర్ణయము గావున మన సంగర సమాలోచనా స్థలమునకుఁ బోయి కాఁదగిన కార్యమ్ములనెల్లఁ బరిష్కరింతము రమ్ము.

అనుజసమేతుండగు ధర్మనందనుండు శ్రీకృష్ణునితోఁ బ్రత్యేకస్థలమునకేగెను. ఇఁక నపుడట వారొనర్పఁదగినవి సర్వ సేనానాయక నిర్ణయాదులెకద.

రాయబారము

ఆరవ ప్రకరణము

(1)

ఎంత వేగరులగు వేగువారిని నియోగించెనో కాని, దుర్యోధనుఁడు పాండవశిబిరములలో నెప్పుడెప్పు డేమేమి జరుగుచుండెనో, సకృచ్ఛముగ నన్నియుఁ దెలిసికొనుచునే యున్నాఁడు.

దుర్యోధనుఁడు తనమందిరమునఁ గర్ణ శకుని సైంధవదుశ్శాసన ప్రముఖులతోఁ గాఁగల కార్యములం గూర్చి ప్రసంగించుచుండ గూఢవిచారులగు చారులువచ్చి—కురుసభాభవనమునుండి మరలిన కృష్ణుఁడు పాండవులకడ నివేదించిన విషయములును, పాండవస్కంధావారము మహాసేనాకారము నొందియుండుటను, పాండవుల రణోత్సాహమును, అక్కడి వారి ప్రయత్నములును—దుర్యోధనునకుఁ దెలుపుచుండ, దుర్యోధనుం డాపలుకులు వినియు విననివానివలెఁ దనమనమ్మునఁ జనియించిన వేదనవికారము లొకింతయేనియుఁ బయల్పడనీయకుండఁ దన యుమ్మలికమ్ము పెరముఖమ్మునఁ దెలుపఁబూని, ప్రసంగింప నారంభించినాఁడు.

— దుర్యోధనుఁడు —

"వింటిరే కృష్ణుని ప్రయత్నములు! వచ్చినవాఁడు వచ్చినట్లు లూరకుండక తనమాట నెగ్గినదికాదుకదా యనువలుకను, నా ప్రాణసఖుండగు కర్ణుని ననునుండి విడఁదీయఁదలంచె; నదియుం గొనసాగమిఁ, బాండవశిబిరముం జేరి, వారికిఁ గినుక యధికముగు తెలంగనఁ బ్రసంగించె. ఆ యాదవుఁ డొనర్చిన కుతంత్రము లేమనందగును! దూతకార్యము తనకుఁ జయప్రదముగ—కుంతీనందనుల కానందసంధాయకముగఁ గొనసాగకున్న మానెఁ గాని తాను పాండవులతో మనపై నుబ్బికుట్టుమాటలం జెప్పనేల! ఎట్టులైనను జరుగనయియున్న సమరము విజృంభితమగుటయే యాతని యాప్సితము కానోపు! తాను వారికి సాయపడకున్నఁ బాండవు లేడ; మనపై కత్తి వమ్చఁజాలేడ! వట్టి భ్రమ! మాత్స్య పాంచాలాదులతో నిచ్చిపుచ్చుకొను సంబంధంబు

లోఁదవినపిదపనైన మనపై నెత్తివచ్చుటకు వారికి సామర్థ్యము కలిగియుండెనేని ఈకృష్ణుని రాయభారపురస్సరణము కలుగునంతదనుక వేచియుండుటకుఁగతంబేమి? మనమొనర్చిన వంచనల నెన్నింటినైనను, భరియించి, యూరకుండుటకుఁ దగినంత కారణమేమి? లోక మింతమాత్ర మెఱుంగఁజాలక, ధర్మజుని సైరణ యొక్క పెద్ద గుణముగా నెన్నుచుండును. మన వెఱపునఁగాకున్న సైరణయును, అనుకూలతరుణాన్వేషణమునఁ గాకున్న, మనకు మారుసేయమియుఁ, దనపక్షమున జయసంశయ కారణమునఁ గాకున్న రాయబారములు నడిపించు బుద్ధియుఁ, బాపము, పాండుసుతుల కలవడియుండునా! మనచే నీవఱకుఁ దామొందిన భంగపాటులు మఱువరానివగుటను, ఇపు డుచితసహాయంబు దొరకొనుటను, కృష్ణుని యుక్కెక్కించు పలుకులఁ గృతోత్సాహులగుటను, బాండునందను లెల్లని మనపై నెత్తివత్తురు. సంగర మిఁక సిద్ధము; కావున దుశ్శాసనా, నీవును, గర్ణుండును, గాంధారపతియును సర్వంబు సమకట్టుఁడు. సేనానాయక నిర్ణయాభిషేకాదు లొనర్పవలసియున్నది; కావున మన పక్షమున వచ్చియున్న సకలోర్వీపతులను రావింపుఁడు. మనము మరల నపరదిశా ముఖంబున సభందీర్చెదము.

అని వారికిఁ గట్టడియొనర్చి దుర్యోధనుం డంతిపురంబున కేగెను.

ఆ ర వ ప్ర క ర ణ ము

(ii)

భానుమతీమందిరమున నుచితాసనములపై దుర్యోధనుఁడును భానుమతియుఁ గూర్చుండియుండిరి. ఈభానుమతి దుర్యోధనునిభార్య.

— భానుమతి —

మీరు పౌర్వాపర్యములఁ జక్కఁగఁ జింతించియే సమరసన్నాహము లొనర్చుచుండిరని తలంతును.

— దుర్యోధనుఁడు —

ఇపుడిఁక నీకును నాకును బౌర్వాపర్యచింతలేల? మొట్టమొదట జాత్యంధుండని మాతండ్రిని కాదని మా పినతండ్రియగు పాండునకు సర్వరాజ్యపట్టాభిషేక మొనర్చిన వ్యాస భీష్మ ద్రోణ బాహ్లిక విదురాదుల ప్రప్రథమాక్రమకార్యాచరణకాలముననే యవినీతిపుట్టినది. సంజయున కింత తెలియక, మా జూదముననె అనయము పుట్టెనని

పడిరినాఁడు. కాని, కురువృద్ధులగుటలమునను గురుజనముల కారణమునను అనయము వానాటనెపుట్టెనని బీరింపలు నెంచఁజాలకున్నారు. ఏది కానయియున్నదో అదియే జరుగుచున్నది. కానిచోఁ దానురాజ్యాభిషిక్తుండయ్యును మాతండ్రినే సింహాసనముపయిఁ గూరుచుండఁజేసి పాండుఁడు దేశాలపయిఁబడి పరరాజులంగెలిచి, కానుకలందెచ్చి, మా తండ్రికిచ్చి, మా తండ్రిచే నశ్వమేధమ్ముల నొనరింపఁజేసి, కౌరవ రాజ్యలక్ష్మికిం బరరాష్ట్రములంజేర్చి కురురాజ్య నిస్తారమునకై పాటుపడి, తుట్టతుద కడవులంబడి, తా పరివ్రాజకుండై రాజులాంఛనములనెల్ల మా తండ్రికడ కంపివేసి దిక్కులేనిచావు చావనేల? మాతండ్రి రాజ్యపాలనము దేవుని కనభిమతమేయయ్యేనేని పాండునిచే నట్టుల మా తండ్రినేల నేల నేలునట్టుల సింహాసనముపైఁ గూరుచుండఁ జేయును? మాచేయఁ బాండుని సంతానమే కౌరవరాజ్యలక్ష్మీభారమును వహించుట దైవసంకల్పమై యుండునేని, సంతానవంతుఁడు కాకపూర్వమే పాండుఁడు రాజ్యమువీడి యడవులం బోనగునే? ఇంత స్పష్టముగ మానవప్రయత్నమును దైవాభీష్టమును దలఁచియుండక నింకను నీవు—"పౌర్వాపర్యము"లని యేమో పలుకుచున్నావు.

— భానుమతి —

మీరింతసూరము నుడువుచున్నారు: కాని, నేను వచించఁదలఁచుచున్నది వేఱు. తమ యుద్యమముంగూర్చి లోకాభిప్రాయము భిన్నముగానున్నది. సాధారణముగాఁ గార్యాకార్యవివక్షత సేయవలసివచ్చినప్పుడు జనాభిప్రాయము ప్రధానమై నెగడుచుండును. లోకాభిప్రాయము వలపండురేని లోకస్తుతి, జనసంప్రీతి, సర్వజనేష్యత, మనము కోరకనే కోరరాదు. లోకమాన్యత మీరు కోరలేపండురేని బాండుని పరిపాలనాకాలమున జనులకాతనిపైఁ గలిగిన అభిమానముచొప్పున నాతని యనంతర మాతని సంతనులపయింగూడ జనులుచూపెడి భక్తి గౌరవములఁ దామెఱింగి, ధర్మనందనాదులపవ్వులనున్న కాలాన వారిపూర్వపరిపాలనము ద్రోసి రాజనిపింపఁజేయు తలంపునఁ మీరును నిర్వ్యాదానసమ్మానంబులం [1]బ్రకృతిజనంబుల సహస్రగుణాధికంబుగ సంతుష్టులం జేయలేదే! అయ్యయ్యును, నప్పటికింగూడ, నింకం గొందఱు దుష్టజనంబులు ధర్మజు పక్షంబు వహించినవారుండెదరని యట్టి పక్షపాతు లెఱుగఁబడినవారిని, నెల్లని యుపాయాంతరమున [2]సమాత్యకంబుగ భృత్యామాత్యవర్గ సహితంబుగఁ బాండవుల వారణావతంబునకుం బుచ్చితిరని మీరే సెలవిచ్చుచుండ వినియుంటిని. ఏ ప్రజాభిప్రాయము మీకు వన్నె

1, 2;—ఆంధ్రమహాభారతము-ఆదిపర్వము షష్ఠాశ్వాసము-129 వచనము.

తేఁగలదని యెంచియుంటిరో, అట్టి ప్రజాభిప్రాయ మిపుడు 'జ్ఞాతివర్గమున కింత యన్న మిడనని, సమరమె సద్ధర్మంబని, పరిజాత్యయమునకైన నెడఁ దలంకనని యనుచున్న సామ్రాజ్యాధిపమును, సామ్రాజ్యవిభూతిని, అంగీకరింపఁజాల' ననుచున్నది. కావున నొకప్పుడు మన మభ్యర్థించిన జనాభిప్రాయము నిపుడు మనమే గైకొన నంగీకరింపమేని, మనకు కాఁదగినట్టి కార్యము కాకయుండుటె కాక, ముందు యుగాలవారుకూడ, మనలను నిందింతురు. కల్పనాసామర్థ్యము గలవారిదియె అవనని, మీ రొనర్చినవి ఒకటి రెండయినచో, వాటి పదిసేయుదురు. మీకు దుష్కీర్తి నాపాదింపఁగల పలుకులు పలుకం గొంకరు. జనసామాన్యమున కిదియొక గొప్ప నానుడి కాఁగలదు. పాండవులను మీ రన్యాయముగ బాధలు పెట్టిరను ఱట్టు మాత్రము మిగులును. తొలినుండియు భీమసేనాదులు మీకొనర్చిన యకృత్యములు గాని, పాంచాలి మీకొనర్చిన పరిభవముగాని ప్రజ లెన్నఁబోరు. నేరమంతయు మనదెసఁ గలదనియే లోకము భావించును. అట్లగుటఁ మీ రొకింత పునర్విమర్శన మొనర్చికొనియే యీ సంగరమునకుఁ బ్రారంభింపఁ బ్రార్థించుచున్నాను.

— దుర్యోధనుఁడు —

అయ్యో! వెఱ్ఱిభానుమతీ, "జనాభిప్రాయము-జనాభిప్రాయ" మని యనుచున్నావు గాని, జనాభిప్రాయ మెంత యనవసరమని యందువో కొన్ని వేళల నది యంత యనవసర మనికూడ యనఁగలను. జనాభిప్రాయ మెల్లప్పుడును నొకతెన్నున బోఁజాలదు. ఒకేవిషయమునుగూర్చి కొందఱొకవిధమునను, మఱికొందఱింకొక విధమునను, వేఱొకకొందఱు మరియొకవిధమునను అభిప్రాయ మొందుచుందురు. ఇంతియ కాక, ఒకేవిషయము దేశభేదముచేతను, కాలభేదముచేతనుం గూడ భిన్నాతిభిన్నాభిప్రాయములఁ బడయుచుండును. అట్లగుట జనాభిప్రాయమె మన ప్రవర్తన యందు ప్రధానము కాఁజాలదు. అట్లని జనాభిప్రాయమును గేవలము త్రోసిరాజనిపింపరాదు. కావున జనాభిప్రాయమును, స్వార్థమును, ఎంతవఱకేకీకృతము కాఁగలవో, అంతవఱకు ఏకముఖమునఁ బోనిచ్చి, తదనంతరము స్వార్థమునే చూచుకొనవలసియున్నది. ప్రతిమనుజుఁడును శైశవమునుండియు స్వార్థమునే చూచుకొనుచున్నాఁడు. స్వార్థము వీడినవాఁడు మఱిజీవింపనోపఁడు. నిజముగ స్వార్థత్యాగి యోగీశ్వరుండగుచున్నాఁడు. కుటుంబి కానివాఁడు సంఘమున కెంత యుపయోగింపఁడో, యోగీశ్వరుండగువాఁడు ఆధిభౌతికవిషయములం దంత యుపయోగింపకున్నాఁడు. స్వార్థమునం దాధిభౌతికవిషయములే ప్రధానములగుట, స్వార్థము

వీడినవాఁడు సంఘమున కుపయోగింపఁడు. కావున స్వార్థము ప్రధానము.

దురుద్దేశముతో మానగరిఁ జేరిన కృష్ణునియెడను, మనరాజ్య మవిభాజ్యమనియు, అప్రదేయమనియుఁ దత్కారణమున వీరభోజ్యమనియు నాతనితో వాదించితిని. తుద కాతని బంధించి పాండవులను రెక్కలుద్తెగిన పక్షులుగాఁ జేయఁదలపడియు నాతఁ డొనర్చిన కొన్ని విచిత్రమాయలవలన నప్పటి నాపూనిక విఫలమైపోయినది.

ఏది యెట్లయినను, భానుమతీ, నీతో నాకీ కంఠశోష యేల? నీ వనుకొనినట్లు గాక, నా వర్తమాన కార్యమునఁ బౌర్వాపర్యము లశేషముగఁ బరిశీలించి, చింతించి, తుదకుఁ దేలిన పర్యవసానము ననుసరించియే యీ ప్రస్తుత కార్యనిర్వాహము నచ్చి చేయఁదగినదియే నిర్ధారణపఱచికొంటిని. కావున నీచర్చ యనవసరము.

— భానుమతి —

ప్రభుశేఖరా, మీతో వాక్యార్థము నర్ప సిద్ధపడలేదు కాని, కలకాల మప్రతిష్ఠ నిలుచునట్లుగఁ బాప మా ద్రౌపది నవమానించి, మీరు లోకనిందకుఁ బాల్పడినారు కదా యని మనలక్ష్మణకుమారుఁడుగూడ, నెల్లవేళలఁ దనమనమునఁ గుందుచుండును. మానసోద్రేక కారణమున స్త్రీపురుషులు లోకమున నొక్కొక్కయెడఁ ద్రోవదప్పి చరియింతురు, మైమఱచి విద్రోహము లొనర్చియుఁ గటూక్తులం బలికియు, నింకను నెదుటివారిపయి నేరము లెంచు పరిపాటిం దొరగుచుందురు.

తమకు కలవని యనుకొనుచున్న యధికార మెంతెంత కటూక్తులనైనను, ఎంతెంత యశ్లీలములనైనను బలుకఁ జేయుచుండును. దానికిఁ దోడుగ, నెవరేని దమ ప్రయత్నములనున్న అమానుషత్వమును, అసంప్రదాయమును, ఎత్తిచూపిరేని, మరింత రేగి, తొంటి వివేకమును బోద్రోలుకొని, యెదుటివారిని దూషించుటయే ప్రధాన కార్యముగా నెంచి, తాము లోకకంటకులగుచున్నారు.

—దుర్యోధనుఁడు:—

భానుమతీ, మతిమాలి నీతో నింతదూరము ప్రసంగించుటయందు నేనొనర్చిన పొరపాటునకు నే నేదుఃఖించుచు, సిద్ధమైయున్న సమరమున బాల్గొనఁ బోవుచున్నాను. మరల నిన్నింతలో నిక్కడఁ గలిసికొన నవకాశ మొదవకపోవచ్చును. కావున మన లక్ష్మణకుమారుని దీవించి, నావెంట నంపుము. నే నిదే పోవుచున్నాను.

అని దుర్యోధనుఁడు నిష్క్రమించెను.

'తుద కేగతి నడిపింపఁ దలంచి, మన్నాథున కా విధాత యింత బల

సంధి సేతమాని యలిగి యేమని మగిడివచ్చినాఁడు మాకృష్ణుఁడు!

వీరునువారును సంబంధబంధువిషయబంధులగుట మాకృష్ణున కీరెండువీడులవారును సమానులెకదా! అట్లయ్యును, దానర్జునునకుఁ బక్షపాతంబుసేయుటఁ బాండవుల నొకతెన్నునఁబోనీయక, తనకుఁ దోఁచినట్లెల్లఁ ద్రిప్పుచున్నాఁడు. వీరిమాటయెమీఁదగుటకుఁ దానెన్ని పోకలనైనఁబోకమానఁడు. ఇట్లగుట నింక మాకృష్ణునిమూలమునఁ బాండవులకె జయంబు గలుగకతప్పదు. కౌరవుల కురక చావునిజంబు. సంశయింపనైనఁదావులేనియీదుర్ఘటనముగన్నులఁజూడఁజాలను: వినంజాలను: నేర్పరితనమున, వశీకృతచిత్తమునిమిత్తమునఁ బాండవులకు జయంబును, పలుకుపొందెఱుంగమి, మొఱకుఁదనముకతన, అసంప్రదాయకవృత్తిని, గౌరవులకు వినాశమును సిద్ధమయ్యెంగదా!

మాయురే! నేనేగదా గదాయుద్ధమున సమస్థులం జేసితిని సుయోధనభీమసేనుల! అట్టి వీరిరుగురు నొండొరుఁజంపుకొన నేఁజూడఁ గలనే! ఇంతకును మాకృష్ణున కెఱుకలేనిధర్మసూక్ష్మములు నాకు మాత్ర మెఱుంగనగునా! కాని మావాని కేమిదోఁచినదో, ఏనిమిత్తమున నిట్లారడిబోకనెంచెనో, యెరికెఱుక! ఏమైనంగాని, యీనిష్ఠురతం జూడఁజాలక విననేరక సరస్వతీతీర్థమునకుఁ బోఁదలంచి మీకుఁ జెప్పిపోవచ్చితి.

అనిబలదేవుండనియె. బలదేవుండు మఱికొంతసేపటికి వాసుదేవధర్మపుత్రులొడంబఱియనుపఁ దీర్థయాత్రవోయె.

బలరామా, సరస్వతీతీర్థమునకాపోవుచున్నావు! ఆగుమాగుము: నీతోఁ దొలి యుత్తరాభిమన్యుల వివాహానంతరము అతివాదులును, మితవాదులును హితవాదులును గలిసి జరిపిన (1) వాదోపవాదముల మేము జక్కగఁ బరిశీలించుపట్టులనే నీతోఁ బ్రసంగింపఁ దలంచితిమి: కాని ఆవాడినుడులకోడియె నీతో నుడువ నుడిగితిమి. అనంతరము దుర్యోధనుఁడు నానారాజులసాయముంగోరిపోవుచు నీసాయముంగూడ నభ్యర్థించినపుడుమీయిరుగురి సంభాషణయు మేము వినినప్పుడైనను, నీతోఁ బ్రసంగింప

(1) రాయబారము 6—12.

వనువుపడినదికాదు. ఇప్పుడో, తీర్థయాత్రకుఁ బోవుచున్నావు. మాకీ నీవన్నన మే మాకొదవదేమో. ఆనాఁటి వివాహమంటపమున నీవొనర్చిన సంభాషణక్రమముచేతనే మాటలపొందెఱుంగనివారితో, మూర్ఖజనములతో నెట్లు ప్రవర్తింపవలెనో కార్యము నక్కఁ జేసికొనవలయునో, తెలిసికొంటిమి. అనంతరము దుర్యోధనునితో నీవు సంభాషించు పట్టున నీతమ్ముఁడగు కృష్ణుఁ డేమతినుండెనో వివరముగాఁ దెలిసికొంటిమి. ఇప్పుడు ధర్మ రాజాదులును, నీతమ్ముండును, చక్కఁగలవారందఱును విను మంచు నేనంటినో మేము గుఱుతించితిమి. కాని యొక్కవిషయమాత్రము విస్పష్టమగుచున్నది. నీయొద్దనున్న నీతమ్మునితో నీ వేమియు ననక, నాతనిపై నేరము-ఆరోపింపను నొక్కటివారును వినుచుండఁగ నేమియుంగాక-మోపితివి: ఆతండును నీపలుకాలించి యు, నీ వాతనిపై నిడిన భారము భరియించియు, నీతోఁ బలుకఁడయ్యె. అన్నవను గౌరవమున నాతఁ డూరకుండెనో, నీతో విభేదముఁ బెంచికొనినచో ఆనాఁడా పుండెనగరాన, భీష్మునివిందుఁ బాసపుత్రాబ్సమాగాన నీవే దుర్కీయుఁగలింగుండును బొందిన గతి జ్ఞప్తికివచ్చుటనో యూహించియుండుము!

నీవు నీతమ్మునితో 1. "పరసంభు మాటలు వలుకఁజాలమి నాతనితో నీవిషయమున వాదమునకుఁ బూనుకొనకైతిని. అని కృష్ణునిఁ బాసి యే నొక్క నిముసమైన నుండఁజాల" నవిన నీ విపు డెట్లు పోవుచున్నావు తీర్థయాత్రలకని!

భగవంతుని యవతారము లనియనుచున్న నాపదింట నినునేలచేర్చిరో, నీ తమ్ము నేలచేర్పలేదో కారణములుమాత్రము మాకెఱుకరాకున్నను ఒక్కటిమాత్రము విస్పష్టముగఁ గానవచ్చుచున్నది. కౌరవులకును బాండవులకును సంఘటిల్లినవివాదమున 2. ధర్మనందనుని దెస దోసంబు కలదనియు, దుర్యోధనునం దెన్నదమన్నను దోసంబు లేదనియు, నీవు విస్పష్టపరచి నీశిష్యుండగు దుర్యోధనునెడ వాత్సల్యంబు సూచించుచున్నావనియును, అర్జునునెడఁ దనప్రేమాధిక్యమున కృష్ణుఁడు పాండవులవల పక్షమువహించెననియును, జనులాడుచున్నారు. ఈ రెంటను సత్యమును అసత్యంబునుఁ గూడ నున్నవి. మానవుఁడు తనస్వత్వముల నితరులచే వంచనమెయిం బోఁగొట్టుకొనినపుడు తనతమస్వత్వములను నష్టసంపదలను బునస్సంపాదనమునకెన్నివిధములనైనఁ బ్రయత్నింపనుద్యోగింపవలెననియు, నాయుద్యోగంబునకవసరంబగు నుపాయంబుల నెన్నేని- తనకు యథావిధానమైన-పన్నవలెననియుఁ గృష్ణుండనుచుండు మోఱకులైన వారిని బలుకుపొందెఱుంగనివారిని మంచిమాటలచే నొప్పించుకొని వారిచేఁ

రాయబారము 1:- 33 ; 2:- 7--8.

దనకు కావలసినపనులొనరుపఁ జేసికొనవలసినదనియు నీవనుచున్నావు: మీయిరువురి సూత్రములును బలీయములైనవే కాని బలరామా, నీ శిష్యుండగు సుయోధనుపట్ల నీ పలుకుచల్లఁదనము పనిచేయదని నీవింతవఱకు నెఱుంగకున్నావని కొందఱనుచున్నారు. ఇందుకు నీవుమాత్ర మేమనఁగలవు! అభిమానముగలతావుల సూత్రబలము సుంతయైన సడలుచునేయుండు నను మానవ మానసతత్త్వవేత్త లిందు కేమనఁగలరో!

ఆ ర వ ప్ర క ర ణ ము

(V)

దుర్యోధనుఁడు దండనాథుల నెంచుకొని వారివారి సైన్యములం దోడ్కొని కురుపితామహుం జూడఁబోయినాఁడు.

— దుర్యోధనుఁడు —

ఆర్య, పితామహా, మాకును పాండుసుతులకును పోరు నిశ్చయమైనది. పురంబున నెల్లి దండని జాటఁబంచి, సర్వంబును సిద్ధంబునేసికొని, శత్రుభయంకరుండగు ద్రోణాచార్యుని, రణోత్సాహలంపటుండగు రాధాసుతుని, శరతత్త్వవేదియగు నశ్వత్థామను, బాహుబల విలాసుండగు బాహ్లీకపితామహుని, శౌర్యశాలియగు శల్యుని, శౌర్యనిధియగు కృపుని, దుర్జయమూర్తియగు భూరిశ్రవుని, దర్పోజ్జ్వలుండగు గాంధారపతిని, తేజస్వియగు కృతవర్మను, ప్రతాపఘనుండగు కాంభోజుని, పరాక్రమఘనుండగు సింధురాజును, క్రమంబున మనపదునొకండక్షౌహిణులకును బదునొకండు గురుపతులనభిషేకించి వీరినందఱం దోడ్కొని నీ దర్శనంబుసేయ వచ్చితిని. ఇన్ని సైన్యంబులు నొక్కలావున వర్తించు చందంబు చూచికొనవలసినపని యున్నది. నానా దేశవాసులును, భిన్న భిన్నములౌ మనోవాసనలు గలవారును, నగు వీరులుగల యిమ్మహాసైన్యము,—అమర సైన్యమైనను దనకుఁదానుగ వర్తింప నేరదు గావున— నీ వరసి యొక్క మొగి నని మొన నడుపంగల మేటివగుట, నీ సేనానాయకులనెల్లర నీమ్రోల నిలిపితి. తారకాగణంబునకుఁ జందురునిపగిది, నీవ సర్వసేనానాయకత్వంబున కభిషిక్తుండవయి, మాకొఱ కేకాగ్రచిత్తతతోఁ పాండవులతోఁ బోరి, మాకుఁ బూర్ణవిజయము సేకుఱఁ జేయుమని నిను బ్రార్థింప వచ్చితి

దుర్యోధనుండు నిటలతటఘటితాంజలియై భీష్మాచార్యునకుఁ జాగిలి మ్రొక్కి నిలువ, భీష్ముండును, దుర్యోధను నాశీర్వదించెను.

— భీష్ముఁడు —

ధృతరాష్ట్రనందనా, రాజ్యకాంక్షను త్యజించితిని, సంసారకాంక్ష లేనివాఁడ నయ్యును, వ్యాససత్యవతులవలన నాజ్ఞాతుండనైనగుట, మీకు మనఁగాలము పెద్దనందాకయుం డఁదలంచితి. ఇపుడింత విద్వేషములు పుట్టినవి కావున, నిఁక నేను కనుగొనుము? నీ కోరిక ననుసరించి, నీపక్షమున సమర మొనర్పక తీరునా? ఇంతకాలము మీతోఁ గలిసియున్నందుల కుచితకార్యము మీకొఱకుఁ బోరొనర్చుటయే. కావున నీ యిష్టముచొప్పున సర్వసేనానాయకాధిపత్యము వహించుటకే నేనాగ్రహమున నంగీకరించువాఁడను కాను. నను నాక్రమింపఁగలిగిన పురుషు లిప్పటికి జగానఁ గాన, కాని నాకన్న నెక్కుడు శరవిధానం బెఱింగిన కిరీటికి మాత్రము నే నోర్వఁజాల. ఇఁక మిగిలిన వారి నందఱ నా నిశితశరాఘాతముల నోర్వఁజేయఁగలను. కాని పాండునందనులమాత్రము నాచేఁ జంపఁబడరు. వారును నాపై నుగ్రశస్త్రములు రాఁజాలరు. ఇంతేకాదు నప్పటికి కెల్ల సాధనము నల్లఁ డెవ్వఁడు.

ఒక్కమాట— కర్ణుఁడైనను, నేనైనను, ఒక్కఁడుగ యుద్ధముసేయ నవశ్యము. అట్లగునచో, నే నీ యాధిపత్యము వహింపనోపుదు.

దుర్యో:- పితామహా, అట్లే కానిమ్ము.

భీష్ము:- అట్లయిన వసుపూర్ణకంబుగ నీ సర్వసేనాధిపత్యభారము పట్టబంధంబున కే నియ్యకొందు.

దుర్యో:- కృతకృత్యుండనైతి. కృతజ్ఞుండను. ఇదె నమస్కరించుచున్నాను.

*   *   *   *   *   *

దుర్యోధనుం డనంతరంబు హాస్తిన నలంకరింప ననుజ్ఞ నొసంగెను. కనకకలశంబులఁ బుణ్యతీర్థజలంబులఁ దెప్పించి, మణిపత్రికరంబునఁ గుసుమనికరంబున, మంగళతరువత్ప్రచయంబున, మహార్ఘనిచయంబున, విహితమంత్రంబుల, నుచితతంత్రంబుల, ఋత్విక్పురోహితామాత్యసహితుండయి, ద్రోణకృపాదిగురుజనమ్ములసమ్మతిని, బాహ్లీకసోమదత్తాది కురువృద్ధులను మోదంప, భీష్మాభిషేచనంబొనరించి, తన యక్షౌహిణీపతుల వేర్వేర భీష్మునకుఁ జూపుచు— "పితామహా, వీరలకును వీరివీరిసైన్యములకును, మీరయొడయలు." అని యనుచు శంతనుతనూజునకుఁ బట్టంబుగట్టి యుద్ధసన్నాహంబున, స సైన్యంబుగఁ గురు

క్షేత్రంబు దఱియంబోయి యటనొకరమణీయప్రదేశంబు విడిదలగా నిరూపించి, తనవారినెల్ల నటనిలిపెను. గాంధారేయుండును, రాధేయుండును, నచ్చోట నెవరెవరి కేయే తావుల నేమేమి యెప్పుడెప్పుడు వలయు నవియెల్లసిద్ధపఱచి, సల్లాపంబుల విహరించిరి.

* * * *

కురువీరులనెల్ల సభఁదీర్చ రావించి అందఱును ఉచితాసనమ్ములఁ గూరుచుండిన పిదప, సర్వసేనానాయకుండగుభీష్మునితో, సుయోధనుండు స్వపరబలవిచక్షణలంగూర్చి ప్రసంగింపఁదలంచి, మాటలు రానిచ్చి యిట్లు ప్రసంగంబున కుపక్రమించెను.

— దుర్యోధనుఁడు —

పితామహా, మాయిరువాగులవారిలో నీయెఱుంగనివారులేరు. సేనలనడిపింపను, బాఁడిపింపను, అపుగాఢమైనపుడు గలిపింపను, గడు నేర్పరివీవ. అట్టినిన్నుఁగూర్చి వేఱుఁ బ్రస్తుతిసేయనేల? మనయందును వారియందును జేవగలవారినెఱింగినవాఁడ వీవగుట, నెవరెవ రెంతంత వారో, నాకు వినిపింపుము.

— భీష్ముఁడు —

ఆసమయమున నడుగుచున్నావు: కాని నీవిట్లడిగితివి కావున, నేనూఱకుండఁదగదు. ఉన్నదియున్నయటుల చెప్పఁగలను. మనవారలను, వారివారలను, వేర్వేరుగ బలశౌర్య పరాక్రమ విక్రమోస్మల ములఁజేసి చూపెద: వినుము.

అతిరథుండవు నీవు. నీ తమ్ములందఱును సమరథశ్రేష్ఠులు. వీరందఱును పాంచాల సేనల నిర్జింపఁగలరు. భోజ వృష్ణికులములకుఁ గల తగవుల కారణమునను, కృష్ణునెడఁగల ప్రత్యేకద్వేషము కతమునను, వచ్చి మిమ్ముఁజేరిన కృతవర్మ అతిరథుండు. నకుల సహదేవులకు మేనమామయు సహదేవునకుఁ దన కూతునిచ్చిన మామయు నగు శల్యుం డతిరథుండు. వాసుదేవుతోడి యీసువాఁడల్లభూరిశ్రవుం

డతిరథుండు. మన సైంధవుండు మహారథుండు. నీకొడుకు లక్షణ కుమారుండు సమరథుండు. ద్రోణాచార్యుం డతిరథోత్తముండు. నేనును ఆతండునుంగూడ వృద్ధులమని భావింపరాదు. అని మొననిల్చి మేము పరాక్రమముం జూపుచుండ, మా మా యంగవిస్ఫురణభంగి చూచి మెచ్చుకొనవలసినదే కాని, యిపుడు చెప్పుటకు వలనుపడదు. కాని ద్రోణుండు శిష్యవాత్సల్యంబున నర్జును నోనేయంజాలండు. శరములెక్కుడెఱుంగుట నర్జును నొక్కని మాత్ర మెనోర్వంజాలను. ఇఁకంగల వారినందఱ నట్టెయుడి, నీకుఁ బ్రేగడయును, జెలియునునై కయ్యమునకై కాలుద్రవ్వుచుఁ బాండుపుత్త్రులపై నీకుఁగల పగను మఱింత వృద్ధిపఱచుచు, నీకువిజయలక్ష్మిని గొనితెచ్చి యిచ్చెదనని ధైర్యము గొలిపి ప్రోత్సహించుచుఁ దనశరవిద్యాకౌశలమున నర్జును పైఁ దనకుఁగల యసహనంబుఁ జెప్పున, నీ పురస్సరణమునఁ, దన పగఁదీర్చికొనఁ దలంచి కొలువున ననత్యములు వలుక నలవాటు పడిన రాధాసుతుం డర్ధరథుండు. కవచకుండలములఁ గోల్పడిన నాఁట నుండియుఁ బాప మీతఁడు పిఱికియైనాఁడు. కరుణారసంబున నీతఁడు పిఱిపియఁగుట నొరుల కొసంగఁ గలవాఁడు. దాతృత్వంబు కారణంబునఁ బ్రఖ్యాతవంతుండే యగుఁగాక! కాని పాపమీతని యస్త్రవీర్యం బెల్ల పరశురాముండు చెఱచె. కావునఁ బార్థునిం జెనకి యీతఁడు గెలువఁజాలకుండు మాటకేమిగాని, ప్రాణములనైనఁ దక్కించుకొని మఱలి రాఁగలుగునా యని వగం జెందుదుము. ఇది యుండ రెఱింగినదే!

— ద్రోణుఁడు —

రాకుమారా, ఈ కర్ణునిచంద మెవ్వరు నెఱుంగనిది కాదు. కర్మగతిచేతఁ బాప మీతనికి సమరమున కవసరమగు నస్త్రములు స్ఫురణకు రాకుండుట, సంఘటిల్లఁగలదు. ఎదిరి నెదుర్చు సమయమున ముందు తనకురాఁగల యాపద నెఱుంగఁజాలఁడు కావున, నీతని మూలమున మనకు జయమొసఁగూడు సూచనలు లేవు.

అట్లగుట నీతం డర్ధరథుండెయగును. ఇందుకు సందియములేదు. దైవగతి కెవరు మాత్ర మేమి సేయఁగలరు?

గాంగేయుని పలుకులకుఁ గనలి, ద్రోణుని నుడులకుడికి, తామ్రాక్షుండగు కర్ణుండూరకుండఁజాలక, భీష్ముండా దుర్యోధనుతో మాత్రమే పలుకుచున్నాఁడని యెఱింగియుఁ, దనను గూరిచిన పలుకునఁదనకుఁజిన్నతనమును, విక్రమగౌరవహానియు నయ్యెంగదాయని, తనమనసు నిలువరించుకొనఁ జాలక, నిలచెను.

— కర్ణుఁడు —

శాంతనవా, ననుజూచి యోర్వఁజాలక, గాలివార్తలు విని, 'ఆకాశపుఁ బంచాంగ' మనినట్లు నను నోరికి వచ్చినట్లెల్లఁ దూలనాడితివి. నాయందేమి తక్కువకలదని, నను నర్ధరథుంగా రాజు సెదుట నిరూపించితివి? ఇది రాజసమక్షమునఁ బలుకఁ దగిన పలుకనియే యిట్లాడితివో? నీతో వావాదేల యనియు, రాజు మొగమైనఁ జూడవలదాయనియు, విశ్వభారముగల యొకగొప్పపని ముందుండుట సభాగౌరవ మెఱింగిన నేను నీయట్టి తులువపలుకులు పలుకఁ జాలక, ఇంత నిండిన కొలువున నినునోర్వఁ బలుకకుంటి యనియు నూఱకుండ వలసివచ్చుచున్నది కాని, కానిచో నీవు లోకమునకేమియైన నగుదువుగాక, నాకంటమాత్రమర్ధరథుండవెయగుదువని నినునధిక్షేపింతును.

కొలువుం జిలకించుచు—దుర్యోధను నుద్దేసించి,

ఈ గాంగేయుఁడు మనకు హితుఁడని నమ్మవచ్చునే! కార్యభారము వహించినవాఁడిట్టులఁ బలుకునే! రాజునకు నాదెసఁ గూర్మిఁ గోయుతలంపున సామాన్యమర్యాదమైనం దలంచినాఁడు కాఁడే యీతఁడు! ఇట్టి యెక్కువ తక్కువ పలుకు లింతనిండినసభను బలుకుట యిటఁ గూడిన మేదినీపతుల సమక్షమున నను జిన్నగఁ జూచుటో, వీరెల్లరకుంగూడ, నాయెడ నెగుసు జనింపఁ జేయ నూహించుటో. యగుంగాని, కురుపతికిని, గొడుకులకును, సేమముగోరి మాత్రము కాఁజాలదుకద! ఇట్టిరాజద్రోహిత్రోడితగులము వలనఁగౌరవకుటుంబచ్ఛేదమును, కౌరవ గౌరవహానియుగాక యింకేమగును ?

(దుర్యోధనుం డాడుచుండు)

రాజేంద్రా, నీయెదుటనె మన కార్యము చెడిపోయినది. దుర్జనుండగు నీ గాంగేయుఁడు, నినుముంచివేయుటకే తలఁపడియుండెనిచో, నిందఱయెదుటను నిట్లింతలు పలుకఁడు. నినుఁ దర్జించి, కులమునిలువం బెట్టుకొనుమని నీ జనకునితో నా కృష్ణుం డసియుండఁగాని, అంతకన్న నీ గాంగేయుని నొక్కని విసర్జించుకొనుమని యని యుండినచో, మన వారందఱు దుఃఖించుటయును పోవును: నీకు జయమును సమకూడును. ఈతఁడున్నంత కాలమును నీకు జయశ్రీ లభియింపనేరదు. అర్జునునందుఁ బక్షము వహించినా, యింతంతలు పలికినాఁడు! ఈ కథాక్రమ మింతతో నాఁగదు. ఈతఁడర్జునుని నెదిరింపఁడు; రాజద్రోహి యనుకీర్తినామమును వహియింపఁడు. ఈతఁడు సమరసన్నాహమే సేయును గాని, ఉదగ్రసంగరకేళి నొనర్పఁడు. వయసు ముదిరినంతమాత్రమునఁ బాలుదనియు, బుద్ధిచే వృద్ధులగుటయు యనసరమయి నెఱుఁగక చతురమతులగువారె వృద్ధజనంబులు బుద్ధులవినుచుండురు. ముదిమిచే బుద్ధి పెడతలఁ బట్టుటను నోటికి వచ్చినట్లెల్ల వదరుచుండెడి వారి మాటలవినుట పాడియగునె?

మహారాజా, నీ వేమో యనుకొనుచున్నావు కాని, యీతఁడే నేనకు మొగమై నిలిచెనేని, యీనృపవర్గము నీసేమముంగోరి పోఁడవఁ జాలరో కా యని తలంతును. అందుననేకదా, దురమున నీతనితో నడుమనె సంగీకరింపకున్నాను.

వేయేల, నీకీసమరమున నపాయమె తటస్థించినచో, నయ్యది యీ భీష్మునితో సంబంధము లేనిదిగా నుండదు. ఇదమాత్రము సత్యము.

— భీష్ముఁడు —

సూతపుత్రా, ముసలినగు నాచలమును, నాబలమును, నా వివిధాస్త్రసంపదయును నిజముగఁ దెలిసికొనఁదలంపుకలదేని, నీ విపుడపోయి, నీగురుఁడగు భార్గవరాము నడిగి తెలిసికొనరమ్ము.

కదనమున, న న్నెదిర్చిన వారందఱును, నెక్కడెక్కడ నేమయిరో యాతండును, లోకంబునుంగూడ నుడువు. నీతో వాగ్వాదం బేల యని దలంచుటనుగాని, కానిచో, నే నెవ్వని సనిమొన నొవ్వ నేయ నసియంటివో, యట్టియర్జునుండు నాముదిమియు, నీ కుమార తయు ముమ్మార్ర తెఱింగియే యున్నాఁడని చెప్పవలసివచ్చును.

సూతసుతా, దుర్జాతుండవగు నీకతమున నీసభలో నను నేన చెప్పుకొనవలసివచ్చిన పాపమునకుఁ బాల్పడితిని. కార్యమునకును ఖడ్గమునకుంగూడ, నగుదు ననుచు, నీ వెవ్వండవో యెఱుంగక, మఱియు నెఱుంగఁగోరక, వీరిలో నొకరునిగా ననుకొనుచు బలవంతపుదీవనవలె బలవద్విరోధము పాండవులపైనఁ బెంచుటను, కౌరవుల కింత చేటువాటిల్లెఁగదా: ఇట్టిపట్టుల నన్నియుఁదీర్చ మము బోఁటు లెట్లుసాలెదరు? బలుపోటరివగు నీవ యంతయుఁ జక్కం జేయఁజాలుదువు. పాప మేదే నొకనెపము దొఱకునాయని వెదకి వెదకి తుదకిపు డిట్లుకలిగిన యీ వాగ్వాదము నొకనిమిత్తముగాఁ జేసికొని యెల్లని దప్పించుకొనుట కిట్లు సేయఁదగునే !

మన గండుమగలెల్లరును గతించినపిదప నీ వెన్నైనను రణభూమింబడకయుఁ దప్పదు: అట్లుపోయి, అలనాటిజూదపు [illegible]గమునఁ బాంచాలిని నీవాడిన వాడిమాటల నింకను మఱువఁజాలక రోషారుణలోచనుఁడై, కుపితమనస్కుఁడై, నిన్నెదుర్కొను ఫల్గుణుచే నీవు చావకయుఁ దప్పదు. అప్పట్టున హతశేషంబగు పరివారంబును, నీపత్నియును, నినుగూర్చి విచారించుచు, నీపోటరితనమును, నీమగటిమియు నెఱుంగకయుఁ దప్పదు.

(దుర్యోధను నుపలక్షించుచు మరలఁ గర్ణునితో)

సూతజా, మనసుయోధనుఁ డిప్పట్టున, నాపై పెద్దభారముంచి యుండుట నెఱింగి, నినునిపుడెగ్గిందు సేయనాకుఁ గాదని సైరించుటను, నీవు బ్రిదికిపోయితివి. ఇఁక నైన నూరకుండుము.

హృదయమునఁ గోపము నౌద్ధత్యము నెక్కటొనిగ గ్రమ్మింగి, మిన్న నున్న భీష్మనక్షత్రమునా నిలబడియున్న భీష్ముంగాంచి, కంపితశరీరుండగు దుర్యోధనుండు శాంతనవు నుద్దేశించి, పలుకందొడంగినాఁడు.

— దుర్యోధనుఁడు —

పితామహా, ఇట్టిపట్టుల నీవిట్టులఁ గోపింపందగునె! కార్యభారంబునైనఁ దలంపవలదే! నా మొగంబైనఁ జూడవలదే! నా బ్రదుకు నీవపేక్షించితేని, సర్వంబును నీవు సహింపవలయును.

(కర్ణుం జూచుచు)

అంగరాజా, విరోధులను నీవట్టున నేకమై కార్యభారంబు సంపూర్ణముగ వహించి, మనపనిఁ జక్కఁజేయుట మాని యిరువురు మాటలిచ్చట్టునఁ దగునె! ఇంతమాత్రమును దలంపవే!

— భీష్ముఁడు (తనలో) —

అన్నా, కర్ణుఁడెంతటి యాసువహించియున్నాఁడో యర్జునుఁ డెస! ఈతనియాసుం గోసినఁగాని జనక్షయం బుడుగదుకదా యని, వీని నెన్ని తరుణముల నెంతెంత నీచపఱచినను, ధనంజయుఁడెస నీతని పగ యడంగకున్నది. కర్ణుని జన్మవృత్తాంతమంతయు నెఱింగియు, 'సూతపుత్రా' యని, నే నీతని నెంతకిందుచేయుదు: నెంతకును బట్టుదుగఁడు. అతిరథులలో నొకరుండనఁదగిన విక్రమాఢ్యుండనియు, అసమాన తేజోవిరాజితుండనియు, నే నెఱింగియు, నీతని నర్ధరథుండని యధిక్షరింతును: తా గ్రిందువడఁడయ్యె. అర్జును నిర్జించుటయో, ఆతనితో సమపడుటయో, చేయఁదగినవాఁడనియును, అర్జునునకు సమవైరి యీతఁడేయనియును నే నెఱింగియు, 'నీవే యర్జునుచే రణమున నిహతుండవగుదు' వని, యెన్నిసారు లీతని నిస్తేజంజేయు పలుకులు పలుకుదు: ఈతండేమాత్రమును దేజముందూలఁడు. ఒక్క కర్ణుఁడు లేనిచో, బహుళ ప్రజాక్షయకారణ ముండదుకదా యని యెంచి, యీకర్ణు నెక్కిన దుర్యోధనుఁడు పీడుఁగాక యని, యెంత

పాటులితి నంతయు వమ్మయినది. ఎట్లేని సంధి పొసఁగఁగాక యని కృష్ణుఁడు, కౌరవసభను దానెంతయుఁ గ్రిందయి, యాచకుండననియు భిక్షుకుఁడ ననియు, నెంత పొరలవలె నంతయుఁ బొరలెను. నాఁడు కృష్ణుఁడును, నేఁడు నేనును సమముగనే మనోవాంఛాఫలదగ్ధుల మయితిమి. సత్సంకల్పముతోఁ బ్రయత్నముచేసియు, భగ్నమనోరథులగుటకు నిదియు నొక తార్కాణము కానోపు! సంకల్పము, కర్మముసేయువాని స్వభావమును గుణశీలములను దెలుపుచుఁ గార్యదిశ నేర్పఱుపఁజాలునేమో కాని, కార్యదశనుమాత్ర మేమాత్రమును మార్పఁజాలదనుట కిదియే ప్రధానలక్ష్యమై నెగడుచున్నది కాదా!

అని భీష్ముండు తనలోఁ దాననుకొనుచుఁ 'గర్ణునింకెట్లు నిర్వీర్యునిగ, నిస్తేజునిగ నిర్విక్రమునిగఁ జేసిజనక్షయము వాపఁగలనో కద!' యని చింతించుచు విషణ్ణవదనుండై విచారించుచుండ, మరల దుర్యోధనుండా గంగాసుతుం దిలకించుచు నిట్లనియెను.

— దుర్యోధనుఁడు —

మహాత్మా, మనలో మనవారింగూర్చిన పలుకుల కేమి కాని, పాండవపక్షంబునంగల తారతమ్యంబులఁ దెలుపుచు, మనలో నెవ రెవరితో వారివారిలో నెవ రెవరుసాటివారలో యొకింతఁ దెలియఁబలుకుము. ఉభయపక్షంబులం గల వీరుల నీ వెఱింగిన ట్లెవ్వ రెఱుంగుదురు!

— భీష్ముఁడు —

నీ వడుగకూడని ప్రశ్న యడిగితివి. పాండుపుత్రులను, వారి దెసఁగల దండిమగల నేనొత్తిచెప్పినచోఁ బ్రథమమున నీ కర్ణునకే కర్ణవేదనయు శిరోభారమును గలుగకమానవు. పిదప నీకును మనసునొవ్వ పుట్టు. పదంపడి నీచిత్తవృత్తి యెత్తెఱంగునఁ దిరుగఁ గలదో యెవరి కెఱుక? ఇంతకును మధ్యస్థుండనగు నాకేల నీగోల? ఊరకఁ గ్రుక్కుటయు నెత్తుటయు నాకుం గాని పని.

— దుర్యోధనుఁడు —

పితామహా, విషయవిజ్ఞానము నొందుదునని నిన్నడిగితిని.

— భీష్ముఁడు —

నన్నడుగవలసినది నే ననుట యసమంజసమని యెంచి
కావలయు మఱల మఱల నను గుచ్చిగుచ్చి యడుగుచున్నావు?

— దుర్యోధనుఁడు —

వారిపరాక్రమముల నెఱుంగఁదలంచిన నేను నీపైఁ గినియుదునే?

సభనువచ్చిన ప్రసంగవిషయ మెఱింగియుండియు, నా ప్రార్థనంబు వినియు, నూరకుండుట ధర్మముకాదు.

— భీష్ముఁడు —

నీవింతదూరము నను దఱిమి తఱిమి యడుగుట, నానోట ననకుంట మేల్మాటకాదని చెప్పవలసివచ్చుచున్నది. అడిగితివి కావున వినుము.

అగ్నికల్పుండగు యుధిష్ఠిరుం డతిరథుండు. అమానుష విక్రమాఢ్యుఁడై రణమున నప్రతిహతుండగు భీముం డతిరథశ్రేష్ఠుండు. తమ మొనలను మించి పర్విడు కవలు సమరథులు.

ఇఁక నాయైదుగురిలో మిగిలిన అర్జునుంగూర్చి చెప్పఁబోదు మన్నను, అతఁడీమానము వాఁడని నుడువఁజాల. అంతవాఁడింకొకఁ డెక్కడ నెవ్వండును లేఁడు. అతని కతండెసాటి. ఇట్టి నరునకుఁ దాఁ జేయఁదలంచినపని నితరు లాపంజాలనంత సమర్థుండగు నారాయణుండు దోడుగనుంట నిం కేమిచెప్పుదును! అట్టి నారాయణుండు సారథిమాత్రమె యయ్యును దా నొక్కరుండె పాండవ పక్షముననున్న సేనల నన్నింటినిఁ గాపాడుచుండ గాండీవ దుర్దాంతుండగు నర్జునుం డొక్కరుండె చాలు నీబలమును నీ సేనల బలమును గీటడగింప! ఇంతకును వాఁడయ్యును పాండుఁడె రాజ్యాభిషేచనం బందియుఁ దనయన్న యందలి గౌరవంబున ధృతరాష్ట్రుని సింహాసనంబున గూరుచుండబెట్టినంత మాత్రమున నింతలు విడ్డూరంబులువుట్టఁదగునేయని వారందఱును దుఃఖించుచునుండుటను మనపన్నిన యురులంజిక్కి మనచే నవమానముపాటును దుఃఖము

పాటును బొందినవారగుటఁ బ్రాణాలపై నాసలుగోసికొని మన సేనఁ వెఱగొందఁజేయుచు రణకేళిని, మనలమార్కొని తుత్తునియలు సేయుచుండ, నాహాళాహాళికోర్చి నిలుచుట మనకు వశముకానిపని. ఇంత మాత్రమెఱుంగక కాదు తొలినుండియు నేనర్జునుంగూర్చి యాతఁడు పేర్చిన కార్చిచ్చని యనుటకుఁ గారణము! ఇంత తెలియక యర్జునుపై బ్రత్యేకంపుఁ బగసాధింపంబూనిన వెంగళులు దీపప్రసెగం బడిన శలభప్రాయులై మండిపోవుదురు.

శాంతనవుని పలుకుల కటఁగూడియున్న రాజులెల్లరును వెలవెలవోయి ధైర్యము దిగజారఁ జేవదక్కి దిక్కులు సూచుచుండిరి.

మహారథులు ద్రౌపదేయులు. వారితో సమానుం డుత్తరుండు అర్జునవాసుదేవులకుఁ దీటువచ్చు నభిమన్యుఁడు లఘుచిత్రములు నేర్చియుంట బెడిదంబుగాఁబోరు. పాండవస్నేహితుఁడై అతిరథోత్తముండగు సాత్యకిమనపైఁ బెనుగినుకను గనలియుండుట, మన యోధవరులనెల్లరఁ బెల్లుగడుల్లఁ జేయఁగలఁడు. పాండురాజసుతసంబంధప్రియస్నేహంబు కతంబున మహారథులౌ ద్రుపదుండును మాత్స్యుండును, అడవులంబడి కడునిడుములఁ బడియుండిన పాండవుల దైన్యమునకుఁ గడునొచ్చియుంట, నేకీభూతమనస్కులై చచ్చుటకైన నోర్తురేకాని, పాండవులం గెలిపింపక విడరు. ఇంకంగల యతిరథ మహారథ అర్ధరథానీకమును, దక్కటిజోదుల బ్రోదిని వివరింపం బూనుట పిష్టపేషణమ యగు. ఈ రెండువీడుల గండు మిగిలిన దండి మగలె పెక్కండ్రుగలరు. ఇంతటి వీరాధివీరులను మఱల భారత భూమి నెన్నండును జూడఁబోము. కనుక నే తుదకు జయలక్ష్మి నెవ్వారు చేకొనినను 'కుటుంబకలహకారణమున జ్ఞాతివర్గమున కింతఁ దిన నన్నమిడ' వనిన నీకొంచెపుఁ బలుకులవలన నెంతమూడనయి యున్నదో కద యని దుఃఖించుచున్నాము. మహావీరజనక్షయమున కోర్వఁజాలక, మహాజనక్షోభము విననసహింపఁ జాలక, ప్రాణనష్టము

చూడనోపక, నీ ద్రోహావప్రయత్నావిరమణమున కెంతపొరలవలె నంతయుఁ బ్రయత్నించియుఁ బోరలియుఁ జూచితిని. కాని కార్యదశ భిన్నముగానుంట నేమియుఁ గార్యకారి కాఁజాలకపోయినది.

దుర్యోధనా, జనక్షయము నాటిల్లనున్న యప్పుడు, తెలిసినంత వఱకును ఆ క్షోభము నుడుపఁ బ్రయత్నింపకున్నచో, విలయకారకుండు తానయగు నని ధర్మశాస్త్రంబులు పలుకుటను, గొన్నివిశేషంబులు తెలియఁజేయవలసియున్నది.

నీచిన్నటనాటనుండియు నీవు భీమాదులచేఁ బీడపడియుండుటను, పాండవులపైన నీరోసము దీర్చికొనుట కెంతయో వేదనంపడుచుండ కుమారాస్త్రవిద్యాకౌశలపరీక్షాసమయమున నవాహూతముగా నేర్పడిన కర్ణుని యీర్ష్యాయుద్ధము నన్నిగొను నంతదియగుట నాతఁడు నినుజేరుటయు నీ వాతని జీవనమునకుఁ జేయూఁత నొసంగుటయుఁ దటస్థించినవి. అదివఱకే ఈర్ష్యాబాధితుండవగు నిను నాతఁడు రేపెట్టి పాండవులయెడ నీకున్న దారుణక్రోధాగ్నికిఁ దనయీసుపలుకులగాలినిఁ దోహసేసి నీ పగ నగ్గలమొనర్చుచు నర్జునుపైఁ దన పగ సాధించుకొన నదను వేచియున్నాఁడే కాని నీకు జయశ్రీ లభింపఁజేయుటే తనకు బ్రధానకామితార్థముమాత్రము కాదుసుమ! తనపగఁ దీర్చికొనుటయుఁ, దన్మూలమున నీకు జయశ్రీ లభించుటయుఁగావలసినదే కాని, ప్రత్యేకముగ నీకు విజయము నభిలషించి కాదీకర్ణుని తుళ్లు. తనత్రుళ్లడగించు నంతటి శాపావళి తన్నుసమయించు సమయముకొఱ కెదురుసూచుచుండఁ దా నది మఱచియో, తనలోఁ దా నద్దాని నెట్లో సమర్థించుకొనుచునో, శాపఫలముంగూర్చి తనకు నమ్మికలేమినో, నినురక్షింతు ననియు, నీకుఁ గెలుపందిత్తు ననియు, నను నాతని మిథ్యాలాపంబులం బడియుంట, నీవు పోరఁ బొరగిలుదువు.

చిన్ననాఁటఁ ద న్నవమానించిన ద్రుపదు నింకొకతూరి తూలఁగొట్టవచ్చుఁగదా యను నూహాకల ద్రోణునిసంరంభ మాతని

సంగరారంభశీలునిగ నొనర్చుచున్నదే కాని తన ప్రియశిష్యుండగు నర్జును నేయంజాలమి నాతనిఁ మనంబుఁ గడుదిరుగుడువడఁ జేయుచునే యున్నది—అట్లగుట ద్రోణ కర్ణులమాట యాంతర్యైనదికద!

ఇఁక ననుగూర్చి: నేను దొలుదొలుతనే చెప్పికొంటిని. మీరును బాండవులును నాకు సమానులంటిని. బాంధవమున నొక్కటఁ గలిమియు, వేఱొకటలేమియు నుండవుకద! ఇఁక నాసంగరకేళీవిక్రమ మెంచిచూతునందువేని, సన్నెదిరించి, నిలిచి, గెలుపొంది, ప్రాణములఁ దక్కించుకొని మగిడిపోయినవాఁ డీయిల నిప్పటికి లేకున్నను, ఫల్గునునకున్న నానావిధ శరసంధానశక్తి నాకు లేకునికియు, నా యందలి గౌరవంబుపేర్మి వారు నను నేయంజాలమియు, వారియెడ వాత్సల్యంబుకతంబున వారినేయ నాకుఁ జేయాడమియు నే నిది వఱకే నీకు నివేదించితిని. నీతో నింతకాలముఁ గలసియుంట కను గుణంబగుటకు మాత్రముగా నీదెస నిలిచి పోరవలసివచ్చినదే యని యనుకొనుచుఁ బోరవలసినదే కాని, ప్రత్యేకవైరము నాకెవ్వరిపట్లను లేకుంట నీయోధవరులలోఁ గొందఱవలెఁ బ్రాణములైనను బోవు గాక యని పోరఁజొరనొల్ల. లోకధర్మమును క్షత్రనీతియు మాత్రము నీపక్షంబున నను నిలువంజేసి నా శరవిద్యాపటుత్వ మహత్త్వమును జూపఁజేయుచున్నవి.

ఇఁక మనపక్షమున సాయము సేయవచ్చిన పెక్కండ్రు రాజులు ద్రుపదునెడనో, కృష్ణునిదెసనో, పాండవేయులవలననో, భిన్నభిన్న కారణములచే శత్రుత్వము నూనినవారే యగుదురు. పాండవులు మనతోఁ గలసియున్నకాలమునఁ గలకులయందు కలిగిన యొత్తుడు నణచుపట్లను, గప్పమున కొప్పని పుడమిపతుల నణచి నొప్పించి, యొప్పించి కప్పములఁ గైకొనినపట్లను, భీమార్జునులదెస వైర మూనిన వారేని అయి, వారిదెసఁ దమతమ పూర్వవైరముల సాధింప నెంచు చుండ, నయాచితముగఁ దటస్థించిన యీతరుణమున నినుజేరినవారే

యయియున్నారు. ఇన్ని కారణములుండుటనేకద యిపుడు నినుఁజేరిన సైన్యము పదునొకండక్షౌహిణులయినది. అట్లయ్యును, మఱియేడుం తలు సైన్యము మనకుఁ జేరినను, మనకు జయమగుటది. మనయెదుటి యుద్ధతిఁజూడలేక, నీవు మాచే వారిని నిర్జింపఁజేయఁ దలంపొందితివి. ఇఁక వారనిన మనచే నవమానితులై, మనచే వంచితులయి, మనచేఁ బెక్కిడుములఁగుడిచి సిలుకులనొంది, మానసమునఁ గడు కుంది కుంది మనకన్న చిన్నసైన్యములతోఁ బెక్కండ్రగు మహారథులతో, లెక్కకుమిగిలిన అతిరథశ్రేష్ఠులతోఁ జక్రరక్షకుండును, వివిధోపాయ పరాయణుండును, సకలభువనములనఱచేతికిఁదేఁజాలినవాఁడును నై, మంత్రరక్షణ కళాప్రావీణ్యుఁడై, తన మంత్రాంగశక్తిచే నీ కర్ణుని మంత్రాంగము ద్రోసిరాజనిపింపఁదగిన సామర్థ్యముగల కృష్ణుని సారథ్యముతోఁ బాండవులు మనపై విడియుచున్నారు. పార్థునకు సారథియగుట శ్రీకృష్ణుని, తురంగంబుల పటుత్వం బెఱింగి చతురత్వం బున రథముందోలు సారథియని భావింపకుమా! శ్రీకృష్ణుండే యీ సమరమునకు సూత్రధారుండై, పాండసైన్యంబను నోడకుఁ గర్ణధారి యై నెగడునని నీ కెంతఁ దెలియఁజెప్పినను నేమి ప్రయోజనము? నీ కర్ణుని పలుకులు విశ్వసించి, నను రాజద్రోహిగఁ దలంచినను నే నంతవంత నొందను కాని, నీవిపు డీసూతపుత్రు మాయావాగురం దగులువడి విశ్వవిలయకారకుండ వగుచున్నావని మాత్రము దుఃఖిం తును. తమ కార్యములవలనఁ దమ పలుకులవలనఁ దమ కప్రతిష్ఠ యుఁ బరులకు హానియుఁగలుగుపట్టులుఁగూడ గుర్తింపనోపనివారికిని, ఎంత బోధించినను విననివారికిని, నీవు సామ్యుఁడవై లోకకంటకుండ వగుచున్నావే యని కటకటంబడక తప్పనిసరియైనది.

— దుర్యోధనుఁడు —

ఓ నాను పితామహా, నీ వింతదూరము చెప్పిన దంతయు నొప్పైగ నున్నది. కానున్నది కాకమానదు. ఒకటి ఈశ్వర ప్రేరితమై

యింకొకటి కాకయుండునా? ఈ వివాదసూత్రములును, జర్చయు నటుండనిచ్చి పాండవబలంబుల నెల్ల సంపూర్ణంబుగ సమయింప నీ కెన్నిదినంబులు వలయు; ద్రోణకృపాశ్వత్థామల కెన్నేసిదినంబులు చాలు; అది తెలియఁజేసి, నను గృతార్థునిఁ జేయవేఁడుచున్నాను.

— భీష్ముఁడు —

గాంధారీనందనా, పాండవసేనలఁ జంపను జెఱుపను దగు తెఱంగును, అందుకువలయు కాలప్రమాణమును సంశయమువాయ నట్లీవ నన్నడుగుటయె పరమసంతోషము. నే నెంతవఱకుఁ జాలుదు నంతయుఁ జెప్పెద. తక్కటివారెల్లఁ దమతమ లావుకలుములును, దమతమ చాలుటలు తామె చెప్పవలంతులు. వారివారి పలుకులు తరువాత విందువుగాక— మున్ముందు నీ కొక్క బాస యిచ్చెద వినుము.

——రాజరథికుల మేటిమగల దినమున కొకవేవుర నే వధియింతును. నరుశరపరంపరలు నా మేననాటి నను నేలఁదొరఁగఁజేయు నందాక మనకుఁ బ్రతిపక్షమున నున్నవారినెల్ల వేటాడెద—నని బాససేసెద. ఇం దేమాత్రమును సంశయము లేదు.

మఱియు, నా నాయకత్వంబున నే పనిసేయు కాలంబునఁ బది వేలనైనను జంపనోపుదును. అంతియకాక, మన పదునొకం డక్షౌహిణులను జతురతరంబుగ నడిపింతును; ఎదటిం బొడిపింతును. అడుగడమైనం గలిపింతును; దవ్వగు పరచమూసమూహంబులం గలంతును. ఆ సందియంబును నీకుఁ బాపెద.

—— ఆ పాండవబలంబుల నెల్ల నా శరవిద్యామహిమంబున నొక్కమాసము కాలంబునఁ దెగంజేయఁ గలాఁడను—.

— దుర్యోధనుఁడు — (గురుకృపాశ్వత్థామల దిలకించి)

మీమీ బలంబులకొలంకుల నెఱింగి వర్తమానసంప్రశ్నిత విషయంబును నానతిండు.

— ద్రోణుఁడు — (దుర్యోధనుని వీక్షించుచు మందస్మితాననుండగుచు)

రాకుమారా, నేనును ముదిసినవాఁడ నని యెఱింగియు, నన్నిట్లడుగుచుంటివి. ఇంతకును, గురునకే పరీక్షాసమయ మాసన్నమైనది. ఇంకేమని చెప్పఁగలను?

నా ముదిమికతంబునను బ్రతిపక్షమున నున్న యసమాన శరవిద్యామహిమంబు కలిమిని, నీ యనుంగుతాత చాలినన్ని దినంబులును శత్రుబలంబుల సమయఁజేయ నాకును వలయు.

— కృపాచార్యుఁడు —

రాజేంద్రా, ఆచార్యుండు నుడివిన కాలప్రమాణమునకు ద్విగుణంబుగ నాకు వలయును.

— అశ్వత్థామ —

పరసైన్యంబుల నెల్లఁ బదదినములలోఁ గడతేర్తు.

— కర్ణుఁడు —

నా నేర్చిన నానాస్త్రశస్త్రచయ మనెడి బడబానలముచేఁ బాండవసేనాసాగరము నేనాళ్లనే నివురుఁజేయుదు నని యీసంగర సమాలోచనాసమితియందు రారాజు నెదుటఁ బ్రతిన సేయుచున్నాను.

— భీష్ముఁడు — (సభం దిలకించుచుఁ బకాలున నవ్వి)

మనరాజునొద్ద మార్పలికెడివారు లేరుకాన, నెన్నియైనఁ బలుకవచ్చును. పలుకులకును బనులకును నెంతేని వాసి కలదు. ఈ సూతసూతి రజ్జెడువాఁడు కాఁడని తెలిసికొనుటకైనను, అంతఁదనుక నేనును మన యాచార్యుండును మిగిలినఁగదా! రాజపుత్రా, మన సూతపుత్రుని సత్యవాక్యపరిపాలనము నీవు దెలిసికొనఁగలవు. మిథ్యావాది యీతండని నీకుఁ దెలిసినపిదప నీవుచేయఁదగిన కార్యమేదియు మిగులక నీ వెందేని దలఁదాచికొనవలసివచ్చునేమో!

రాధేయా, ఇంతకును నీ విప్పట్టున నిట్టి మిథ్యావచనంబులు వలుకకుండ నెట్టులూరకుండఁగలవు? ఫల్గుణుని గాండీవదీప్తులచే

మిఱుమిట్లుఁగొన్న కనుదోయియు, తద్గుణధ్వనిని వ్రయ్యలైన వీనుంగవయు, తన్నారాచప్రచయమునఁ జిల్లులువడిన మేనిజల్లెడయు, నేర్పడినపిదపఁగదా, మఱి పలుకులేక నీవు పుల్లవడుట! అంతదనుక నిట్టట్టు పెట్టన ప్రేలుచుండవలసినవాఁడవే.

— కర్ణుఁడు —

రాజబిడౌజా, వింటివికదా యీ ముదుసలి పలుకులు! ఈతఁడు పోటరి యని నెత్తిపై కెక్కించుకొని యూరకుండకఁ సర్వసైన్యాభిషేచనముంగూడ నొసర్చితివి. కొఱవిం దలఁగోకికొంటివని తుదకు విచారింతువులే !

— భీష్ముఁడు —

తుదకు విచారించునది నీకొఱకే యగును. నరుని శరప్రవాహమునఁ దొలుదొల్తఁ గొట్టుకొనిపోఁబడువాఁడను నేనే. నావెంటం జనుదెంచు నీ గురుఁడు. తుదిదాఁక నీపలుకులచే రాజున కాసఁగొలిపి యుఁ బాప మీఁజేని ననహాయునిజేసి, నీ వెవనిపై నగ్గలంబగు పగఁ బూనియుంటివో, యాతని బాణాగ్నినె భస్మము కాఁగలవు నీవు. మాయందఱపైనిఁక నేడ్వకుము. మేము మాధర్మము-విధ్యుక్తకర్మము-విహితకర్మము-కామ్యములేనికర్మము- రాజునాన నాచరింప నున్నారము. మా కెవ్వారిదెసం బ్రత్యేకంపుఁ బగలేదు. ప్రత్యేకపుటూహ లేదు. ప్రత్యేకపు టాస లేదు. మఱియు మాకిదిక్షత్రధర్మము. రాజునాజ్ఞ నొదల ధరియించి కర్మముకొఱకు కర్మము, నిష్కామకర్మము, సేయంబూనినవారము. కౌరవ పాండవులలో నెవరు జయమందినను, రెండవవారింగూర్చిన దుఃఖము మాకు విధివిహితము. ఇందు నీ ప్రసక్తి, నీ పురస్సరణము, నీ పట్టుదల, నీ విడుపోపమియు ప్రత్యేకకామితాకర్షకములై, యీర్ష్యాసమ్మిళితములై, పండితజననింద్యములై యున్నవి. పూరునికాలమునాఁటంగోలె, హస్తినుండి మత్పితృపరిపాలనము దనుక, నెంతేని గీర్తిఁగన్నదన్న కౌరవగౌరవ మీ

నాఁట నీయంటున, నీ టక్కరికొంకుపలుకులకలన, నీమృషాలాపమ్ముల కతమ్మున, నీ ప్రగల్భప్రలాపప్రచయమ్ము కారణమ్మునఁ జెడుటతో నాఁగక బంగారువంటి భారతవంశము నిర్మూలనమైన దను నానుడి జనులాడుకొనుటకు మాఱు జడియరు సుమీ! ఇంతమాత్రమైన నే పలుక నిఁక నద నోపవదని, యిప్పటి యింతాడితి.

— దుర్యోధనుఁడు —

పితామహా, అంగరాజుతో నీకేమి పని? కర్ణా, మా కందఱ కును వందనీయుఁడు మత్పితామహుండు: విశేషించి నీప్రభునకు వందనీయుండు. నీకుమాత్రము కాకుండునా? ఆతఁ డెంతాడినను నీప్రత్యుత్తరము కూడదోయి. రాధేయా, కార్యభారము నైనఁ దలఁపవలదా?

అని యింకేమియనఁబోయెనో కాని, యింతలో నొక ప్రతీహారి వచ్చి, రాజు నెదుట నిలచి,—"మహాప్రభో, పాండవులకడకుఁ దా నంపిన యులూకుఁడు వచ్చి రాయబారకార్యము నిర్వర్తించికొని, యేమో కొన్ని వార్తలు సభాముఖంబునఁ దెలుపవలయునని వేచియున్నాఁడు." అన దుర్యోధనుండును నులూకుం బిలువ నాజ్ఞయొసంగెను.

ఉలూకుఁడు ప్రవేశించి రాజునకు నమస్కరించి యేమో చెప్పఁబోవుచుండ దుర్యోధనుఁడు: "ఇపు డిచ్చట నక్కఱలేనిపలుకులఁ బలుకవలదు-భీముం డేమనియె?" నని యడిగెను.

— ఉలూకుఁడు —

భీముం డేమియనియుండునో కాని, కృష్ణుం డాతని నపవారించెను.

— దుర్యోధనుఁడు —

అంగరాజా, వింటివా! ఎవరినిఁగూడ నాలుక మెదల్ప నీయఁడోయీ! తా నొండె - తనయర్జును నొండె: పలుకవలె; చేయవలె. అంతే కాని, తక్కొరుల కిఁక నటఁ జోటు దొరకనీయఁ డమ్మాయలాఁడు!
——ఆఁ— తరువాత ?——

— ఉలూకుఁడు —

మీ రట నుడువుమనిన విషయములెల్ల కొంకు లేక పలికితిని. వినివిని కృష్ణుఁ డిట్లనియెను.

— కృష్ణుఁడు —

ఉలూకా, మఱల నిప్పుడీరాయబారమేలనోయీ? అందఱును వినునట్లు సుయోధనునితో నిట్లనుము.

'రేపేకద యుద్ధప్రారంభము- మఱియింకేల యీ పొల్లుపలుకులు?

'సంగరరంగమునైన నీవుపోరక నీవారియందఱిచావును వినివిని, దిక్కులేక, నీవెందెందుఁ దలఁదాచికొనఁజొచ్చిన, నందందే-వచ్చుఁజుమ కృష్ణసారథికంబగు విజయరథము.

'మింటను, మంటను, నీటను, నాటను, గాలిని, నీవెందుదాఁగియునైనను గృష్ణార్జునుల కనుఁగప్పఁజాలవు. సుయోధనుదెస నెవరెవరేయేమాటల ననియు నిర్వహింపఁజాలుదురో లేదో: చాలకుందురో లేదో- కాని పాండవులలో నెవరెవరేయేవిధమునఁ గౌరవులను సేయుదుమని యలనాఁడా ద్యూతసభను గొంతెత్తి పలికియుండిరో, ఆయాతీరుల నందఱును బ్రతినలఁదీర్చికొనక యూరకుండరు.' అని నుడువుము.

అని కృష్ణుండు మిన్నకుండ—

— అర్జునుఁడు:—

తనకుస్వతస్సిద్ధముగ శక్తిలేక, యెల్లప్పుడును-వారుకలరు, వీరుకలరు- అనియే యనుచుండు మీసుయోధనుండు. ఆ కలవారినందఱిఁ ద్రోణుని, మాపైవచ్చి వారిలో నందఱుఁగూలినపిదపఁ దాఁబలికిన కటూక్తులును దానొనర్చిన వంచనకార్యములును, ఒక్కొక్కటిగ మఱలమఱలఁ గెరలించుచు మాయన్న భీమన్న గదాప్రహారములిచ్చుచున్న సమయానఁగదా మమ్మును మాకున్నవారి నెఱుంగుట!

ఉలూకా, మఱిపలుకులేల? రేపకడను మీరాజునకుంగలవారినెల్లఁ గలనికి వలనుగ నడిపింపుమని చెప్పుము.

అని యర్జునుండనఁ, మహాప్రభూ, ధృష్టద్యుమ్నుండును, శిఖండియు, నెచ్చటనుండివచ్చిరో కాని, 'ద్రోణుందోడఁబడసితి'ననియు, 'భీష్ముండలపడఁగంటి'ననియును గ్రమంబుగ గొంతెత్తి యఱచుచుండ, ధర్మజుండును వారిని వారించి, నాకుఁ దాంబూలాభరణంబు లిచ్చి ననువీడ్కొలుపఁగొంతదవ్వునుప నన్ననుసరించినడచుచు, 'భీష్మ

ద్రోణకృపబాహ్లికాది భద్రజనంబులకు 'మద్దండవత్ప్రణామంబుల, దెలియఁబలుకు' మని నాతో నని మఱలెను.

ఈపలుకు లులూకుఁడు పలుకుచున్నంతతడవును నాసభంగల కురువృద్ధామాత్యాచార్యవర్గంబెల్ల-"ఔరా, యెంతయొప్పదముగఁబల్కెఁగృష్ణుఁ" డనియు, "ఆహా! అర్జునుండున్నది యున్నటులఁబలికె" ననియుఁ "దానంతటిదురవస్థనున్నను సాంఘికమర్యాదల నెంతదిటముగఁ బాటించు ధర్మజుం" డనియుఁ దమమనంబుల ననుకొనుచు, నుల్లంబుల నొల్లవోవుచుండ, సుయోధనునకు సాయమొనర్పవచ్చిన రాజలోకము మనోధైర్యమువీడి నిర్వీర్యమై స్థలాంతరమునకు నడచెను.

ఉలూకునిపలుకుల యనంతరము సభముగించెను, దుర్యోధనుండు భీష్ముంజూచుచు, "పితామహా, శిఖండి ధృష్టద్యుమ్నులు నిన్నును గురునిం జేర్కొనం గతంబేమి?" యని యడిగెను.

"అది ప్రత్యేకవిషయము-అల్లయ్యను జెప్పెదవినుము" అనిభీష్ముండని, అంబ తనపై నెట్టిపాపఁబగఁబూనియుండెనో, యిపుడు శిఖండియై, తనపగసాధింప కొన నెట్టిప్రయత్నములు సలుపుచుండెనో, ధృష్టద్యుమ్నుఁడు తనజనకుండగు ద్రుపదునిమాటఁదీర్ప, ద్రోణునవమానించిన క్రోధముకతమున నేమి సేయఁదలంచెనో, నీ మొదలగు విషయములెల్ల సకృత్స్నముగఁ దెలియపఱచెను.

సభనున్నవారొక్కొక్కరె మెలమెల్లగలేచి వెడలుచునేయుండిరి.

రేపకడ నడుములుబిగియించి బోటికలనికి నడుపసన్నాహములు నడచుచునేయున్నవి.

కర్ణదుర్యోధనులు ప్రత్యేకస్థలమునకుఁబోయి యేమో ప్రసంగించుకొనుచుండిరి.

భీష్ముండును నిజోచితప్రవర్తనల నుండెను.

సింహావలోకనము

కర్ణభీష్మసుయోధనులారా, మఱి మీరు మాకు గానరారు. కావున మీ ముగ్గురితోఁ బ్రత్యేక ప్రత్యేకముగ నొకింత ప్రసంగింపవలసి యున్నది. ఆఁగుఁడు—ఒకింత తాళుఁడు.

కర్ణా, నీవు సుయోధనుచే బహూకరింపఁబడి దిగ్విజయమునకు బయలుదేరి ద్రుపదునోడించి యాతనిచే ధన కనక రత్న వస్తువాహనాదులఁ బన్నులుగా గొనియుంటివి. ప్రాగ్జ్యోతిష పురాధీశ్వరుండగు భగదత్తునోడించి, అనేకధనరాసులఁ

గానుకగాఁ గొనియుంటివి. హిమవత్పర్వత ప్రాంతమున నున్న రాజులనెల్లర జయించితివి. పూర్వముననున్న వంగమగధాది దేశములం జయించి, దక్షిణ దేశాలపై దాడి వెడలి విదర్భచేది పాలకులగు రుక్మి శిశుపాల తనయాదుల నోడించి, పాండ్యకేరళాది దేశాధిపుల వశపఱచుకొని, యవంతీనాథు సాధించి, వృష్ణివరులను సామోపాయంబున వశపఱచుకొంటివి. పశ్చిమ దిగ్విజయయాత్ర నెఱపుచు మాళవ యవన శకముల నోడించి అనంతములగు ధనరాసులు గొని తెచ్చి దుర్యోధనున కిచ్చియున్నావు. నీచే సమర్పితమైన యనంతమగు ద్రవ్యముతో ధర్మజుని రాజసూయమును ధిక్కరింపనట్టి వైష్ణవమను మహాయజ్ఞమును జేసి దిగంతవిశ్రాంతమగు కీర్తిని బడసి, 'దుర్యోధనుఁడు మహావైభవముతోఁ బాండవులవలననున్న కాలాన భూవలయమును బరిపాలించుచుండె' ననుమాట మాత్రము మే మెట్లు కాదనఁగలము! నీచేఁ జయింపంబడిన సకలపర్వతారణ్య పట్టణ గ్రామ ద్వీప జలధి సహితమగు నబ్ధిమేఖల నెల్ల దుర్యోధనునకు సమర్పించి యాతని మెప్పుల బడసినావు.

నీ దిగ్విజయమును నీ యభేద్య కవచ పరిధానమును రాజరాజు రాజ్యవైభవంబును నాతని ప్రజానురంజకతను ధర్మరాజు చారులవలన విని మిక్కిలి పరితపించుచు నిద్రాహారములపై నభిరుచి లేక యింతకాలమును కుందుచుండెననుమాటయు మే మెఱుంగుదుము. నీయౌదార్యము, సాహసము, సత్యవ్రతము, ధైర్యము మొదలగు మహాగుణములు లోకమున దృఢముగ నెలకొల్పఁబడినవనియు మే మెఱుంగుదుము. నీ ప్రతిభయు, నీ విక్రమమును శరవిన్యాస శక్తియుఁ దలంచికొనిన కొలంది నెంతయు నానంద మొదవుచుండునే కాని, నీ వొనర్చిన కొన్ని కొన్ని కృత్యములు దలంచికొనిన మనమున ఖేదజనింపక తప్పదుసుమా! "అరణ్యవాసము చేయుచున్న పాండవులకును ద్రౌపదికిని నీ వైభవమును జూపి మయసభా దర్శనము నాఁటి యవమానమునకుఁ బ్రతీకారమును జేసి విఱ్ఱవీఁగుటకంటె నీకుఁ గృతార్థత వేఱుగ లేదు"—అని నీవు దుర్యోధనున కుపదేశించుట కేమందుము? ఇదియును నీ రాజభక్తియే యనువారి వాదమునే బలపఱచుననని మేము తలంపవలెనే! నీయట్టి మహాపురుషుఁ డిట్లుపదేశించుట యనుచితమనుట యెట్లుసంగత మగును? ఈ పాపము కట్టి కుడుపుటకే కావలయు నీకీ సంవత్సరమున నాద్వైతవనమునఁ దగని యోటమియు, నపకీర్తియు నాపాదించి యాచంద్రతారముగ నీకీర్తి శరీరముననుఁ బాయని కళంకము కలిగించినది. నీ వెంత రాజభక్తి తత్పరుఁడవైనను, ఎన్నెన్ని విధములఁ బాండవపరాభవమునకు నీవు ప్రయత్నించి, నీ ప్రభువున కానంద మొదవఁజేయనగు మార్గములననుసరించిన ననుసరింప

నగు నేకాని, మహాపతివ్రత యని యనుపించుకొనిన ద్రౌపదిని ద్యూతసభను—ఆమె విపద్దశనైన నెంచక,-బంధకి-యని పరాభవించుటో, "నీ కిట పతులు లేరు; వీరుజూదమున నోడి నినువిడిచిరి; కావున నీపైఁగూరిమిగల మగని నింకొకని నెన్నుకొనుము." అని యమ్ముల్ల సమాడుటో, మఱియదియేమునునో కాని, అదిమహాద్రోహముతప్పుగాకపోదనియే మనీషులు తలంతురుసుమా!

వీరపురుషోచితముగఁ బాండవులను సంహరించి వారిసిరికై కొనుటే యుక్తమని పలుమాఱు నీవుదుర్యోధనునకు బోధించుచుంటివి. బాండవులంజెఱచుటకు శకుని ప్రభృతులు దుర్యోధనునితో నెంచు కపటోపాయములందు నీ వేకీభవించుచు వారితో నీవు పాల్గొనక పోలేదని మేమెఱుంగక పోలేదు

ప్రభుభక్తి నీ కనుగప్పుటనే కాఁబోలును దుర్యోధనుని దుర్వ్యాపారముల కేవగింపక, సదుపదేశము సేయక, నీప్రభువును మఱింత ప్రోత్సహించుచునే వచ్చితివి !

స్వామిభక్తులకుఁ దమయజమానుల వ్యాపారములలో మంచిచెడ్డలను, విమర్శించుచు వారి దుర్వ్యాపారముల నడంచుచు సదుపదేశములు సేయుట, లక్షణము కాదనువాదము సేయువారే యానందింపవలెఁగాని, తక్కుటి వారెవరును నిన్నీపట్టున మెచ్చుకొనరు సుమా!

నీకు నిజమయిన స్వామిభక్తికలదని పెక్కుఱు నమ్ముచున్నను, బాండవులం గూర్చియు, వారి ప్రవర్తనలం గూర్చియు నీ ప్రభుసముఖమున నీవాడిన పలుకుల యందు గొంతయుక్తి యున్నదని సంతసింతుమన్నను, బాండవులచేతను ద్రౌపది చేతను నీ ప్రభువగు దుర్యోధనుఁడు పరాభూతుఁడగుట నీకు దుస్సహమయినను, మహాదాతవును, నిత్యసత్యవ్రతుండవును, ధర్మాత్ముండవును, తపశ్శాలివియు, నౌచిత్యసంపన్నుండవును నగు నీవిట్టి యనుచిత కార్యము లొనర్చుట అద్భుతమును, ననుచితమును నని యనుకొనక తప్పదు. ఇఁక నీ కార్యములును, నీ పలుకులును సమర్థింపనెంచితిమేని, సృష్టిలో నెవ్వని చరిత్రమును నిష్కళంకమైయుండలేదని యనుసంభావించుటదక్క మఱియొక మార్గము లేదు.

"నిజమయిన స్వామిభక్తులు స్వలాభనష్టములను బాటింపక స్వామి కార్యమునకై తమ శరీరమును ధారవోయుట వింతకాదు" అనుమాట యేపాటిమాట!

పాండవులను బయలుపెట్టుటయే ప్రయోజనమని బయలువెడలివచ్చిన దుర్యోధనునకు హఠాత్తుగా భీష్ముఁడు వారి సమయముపూర్తి యయ్యెనని చెప్పుట

చేతను, భీష్మాదియోధులు పరాజితులయి పాఱిపోవుటచేతను, ద్రోణుపడియున్నట్టియు, నప్పు డర్జునునితో యుద్ధము సంభవించునని తలంచి యుండనట్టియు, విరాటునోడించుటకుమాత్రము తగిన సన్నాహముతో వచ్చినట్టియుఁ గర్ణుఁడు పరాజితుండగుట వింతకాదు అని మేము సమాధానము చెప్పుకోవలెనందువా?

మఱియు వనవాసాద్యాయాసంబుల మిక్కిలి కినిసియున్న యర్జునుని వాఁడి నారసముల నోడలు కోసికొనియున్నట్టియు, నెట్లయిన జీవించియుండి యర్జునుని వధించి, నీప్రతిజ్ఞను నెఱవేర్పఁగోరి యున్నట్టియు, నీ వొక్కఁడుండవు నిలువరింపఁజాలకుండుట యద్భుత మెట్లగునని బలవంతముగ సమర్థించుకొన వలసినదే కాని మఱియొక మార్గము లేదు!

కాని, కర్ణా, నినుబాండవ పక్షముం జేరరమ్మని కృష్ణుండును, గుంతియు, నినుగోరినపుడు నీ నడకత్తుటబడినట్లయితి ననుటమాత్రము సత్యము. నీవనామకుఁడవై నీచకులజుండవని నిరసింపఁబడు సమయమున నిన్నాదరించి, యుత్తరోత్కర్షముగ మన్నించుచున్న దుర్యోధనునిఁ గార్యము మట్టివచ్చినప్పుడు నీవు ఆదుర్యోధనుని వీడవలయును—ఇది కాదందుమేని, అట్టి దుర్యోధనుఁడు నీకుఁజేసిన మన్ననలకు మెచ్చి నీవు—అర్జునువధియించెద—ననియాతనికిఁ బ్రీతికరముగఁ జేసిన ప్రతిజ్ఞను విడువవలయును; లేదా కడుపారఁ గన్నతల్లియొక్కయు, మేనమామ కుమారుండగు శ్రీకృష్ణుని యొక్కయు, సకలకర్మసాక్షియు నిష్టదైవతమును, దండ్రియు నగు సూర్యభగవానుని యొక్కయు హితవాక్యముల నుల్లంఘించి, యఱచేతం బడనున్న సామ్రాజ్యంబును, త్రిలోకసుందరి యని వాకొనఁబడుచున్న ద్రౌపదిని విడుచుకొని, తన్నెఱుంగని సోదరుని, దానెఱిఁగి యెఱిఁగి నీచేతఁ జంపికొనవలయును! ఇంతియేకద నీవుచేసినచోఁ జేయవలసియున్నవన్నపనులు! కాని మహాధైర్యశాలివియు, స్థిరప్రతిజ్ఞుండవును, సత్యసంధుండవును, నగుటనేకదా, ఇట్టి సమయములందుకూడఁ, జలియింపక నీవు సామ్రాజ్యముకన్నను, దుర్యోధనుని సేవకత్వమునే యున్నత పదవిగ భావించియుంటివి! మహాపురుషులు సామ్రాజ్య సంపాదనమునుగూడ ననుచితమార్గమున నైనచో, నంగీకరింపరు. అట్లగుట నీప్రభువు ననుసరించియున్న వారిలో, భీష్మునికన్నను నీవే యెన్నో మడుంగు లుత్కృష్టుండవని యంగీకరింపవలసివచ్చుచున్నది.

* *

భీష్మాచార్యా, పితామహా, మహానుభావుండవు నీవని కీర్తిగన్న మిన్నవయ్యును, కౌరవులును పాండవులును నీకు సమానులయ్యును, నీవు కౌరవుల ననుసరించి యున్నందుకుఁ దగినట్టులఁ బ్రవర్తింపక, పాండవపక్షపాతివై, సముద్ధండుడవయ్యును, స్వామియగు దుర్యోధనుని కార్యము నెఱవేర్చినావు కాదను నపవాదము నీపై ప్రబలతరముగ నున్నదిసుమా!

విరటుపసులఁ బట్టిననాఁడు నీ శిష్యునితోఁ బోరుచున్నతఱి, నాతని సమ్మోహనాస్త్రము నుపసంహరింపఁజాలమియు, నీ వూరకుండలేదా!

పాండవుల సమయముదీరుట నీ వెఱింగియుండియు, పాండవులబయలు వెట్టుతలంపున దుర్యోధనుఁడు బయలుదేరుసమయమున, నయ్యది చెప్పక పోయితివే!

తుట్టతుద కష్టమున నర్జునుఁడు ధనుర్బాణధారియై వచ్చుచున్నప్పుడు పదుమూఁడేఁడులును నిండెనని సాక్ష్యము నీయలేదా!

కర్ణుని మూలమున సంధి కుదురలేకున్నదని నీవూహించి యాతనిం బేరోలగంబున నిస్తేజుం జేయ బ్రయత్నింపలేదా!

ఇంతకును గౌరవ మామూర్ఖజనములే యని నీవనినచో, ధర్మశాస్త్రములు చెప్పినచొప్పున నట్టివారి నేల వీడి వెడలవైతివి?

వ్యాసునిచే, సత్యవతిచే నాజ్ఞాతుండనగుట నే నెట్టుల దుర్యోధను వీడఁగల ననుటకుఁ నీవు గొంకవు. ఇంతకును, ఆనాఁడు గౌరవముచే నీకును, బ్రసను కథకుం డగుట నేఁడు మాకును వ్యాసుఁడేకదా ప్రమాణము!

* * * *

సుయోధనా, ఎంతయో శ్రమపడుచున్న నిను మా మాటలచే వలనుట నొందనీయములే!

విమలచరిత్రుండగు పాండుఁడే రాజ్యమేలెనని నీవు స్వయముగ నెఱిఁగి యున్నను లేకున్నను, నీతండ్రియు నీ పితామహుండును చెప్పఁబడినను నీవెఱుంగుదువు. అటుకానందువేని, ధర్మజుండు యువరాజయిన పిదప నీతండ్రితో * నీవు ప్రసంగించినప్రకారం బేమెఱుంగమా! తుదకు నీవు ప్రాయోపవేశంబు నొందుటకు సంసిద్ధుండవగుటయు, అందుకు నీవుజూపినయుపపత్తులును, నిను బ్రాయోపవేశమునుండి తప్పించుటకు నీవు నీ తండ్రితో చెప్పిన యుపాయములును మేముగ్రహింపలేదా! మీమీ ప్రసంగముల నెఱ నెఱింగిన వ్యాసునకును, తద్వచనముల జక్కఁగఁ దెలిసి కొనిన మాకును విస్పష్టము కాకపోలేదు లే!

* ఆంధ్రమహాభారతము: ఆదిపర్వము: షష్ఠాశ్వాసము: పుటలు 160—164.

నీవు కనుదెఱచి చూచునప్పటికి పౌరసింహాసనమున నీ తండ్రియే గూరుచుండెను. నీవే యువరాజు ననుకొంటివి. అట్టి యాసనే యుంటివి. ఇంతట మునిమూకలు గొంతిని యామెయైదుగురు సంతానమునుగొని తెచ్చి వీరు పాండు విభుపుత్రులని నీ తండ్రి కప్పగించిరి. నీ తండ్రియు తన తమ్మునివలని ప్రేమమ్ము కతమ్మున వారలకు విద్యాబుద్ధులు గఱపి పెనిచి పెద్దవారలఁ జేయుటయు, నా కాలంబుననె నీవు భీముని బలాతిరేకంబులకు మనంబున నోర్వంజాలక, [1]నాతని మారణోపాయంబుల నెంచుటయు, కుమారాస్త్ర విద్యాకౌశల పరీక్షనాఁడు భీమునితో నీ కొదవిన గదాకౌశలప్రదర్శన సమయమున నీ వాతని మించఁజాలకుండుటయు [2]"వీరులని పాండుసుతులకు వెఱతునేను" అని నీవు దుఃఖించుచుండుటయు నవంతరము నీ తండ్రి [3]యుధిష్ఠిరుని రాజ్యభారధురంధరుంగా నెఱింగి, భీష్మవిదురులతో విచారించి, యౌవరాజ్యాభిషిక్తుం జేయుటయు, పిమ్మట నీ వాతని యౌవరాజ్య పదవికోర్వంజాలక కుంతీసహితులగు పాండవుల వారణావతంబున కనుపునట్లొనర్చుపట్టుల నీతండ్రితో నీ వనినమాటలును, అనంతరము వారల వారణావతంబున లక్కయింటనిడి నిప్పుపెట్టి కాల్పించు ప్రయత్నములును, తదనంతరము దుశ్శ్రవమై దుస్సహమగు ద్రౌపదీ వస్త్రాపహరణమును, వరుసగా మే మెఱుంగుదుము. అరణ్యాజ్ఞాత వాసములా పాండుసుతు లనుభవించునటుల బన్నగించిన జూదమున వారు రాజ్య మోడకున్నను, వారూర లేనిసమయము వెదకి వారి రాజ్యమాక్రమించినావు. 'చిక్కినది తగ' వనియెంచి మరియీయ ననినావు. వారికీ రాజ్యమున స్వత్వము లేదనినావు. ధర్మజాదులు పాండుపుత్రులే కారనినావు. నీచిన్నితనాన నేదియెట్లు జరిగినను యిఁక భాగముమాట దలపెట్టవద్దనినావు. ఇంతదూరము పరువెత్తుచున్నావే, నీ వాదమున నేమాత్రము బలమున్నను, నీకే సర్వకౌరవరాజ్యమును, అభిషేకింప దలంచి వ్యాసుని ప్రత్యక్ష సాక్ష్య మంగీకరింప మని, తదితర పరోక్షసాక్ష్య మంగీకరింప మని నిన్ననుసరించువారి యభిమానము విడయఁదలంచి యొంతశ్రమంపడి పర్యాలోచించినను నీయెడ నిర్దోషత గానరాదు. ధర్మజాదులు గడసరులనియు, నీపై నొకకొన్ని యపవాదములం బ్రబలఁజేసిరనియు, నీవు వారిపై నిడునేరములో, దోషములో, టకటొంకుపలుకులో గాని—అవిమాత్రమే కానవచ్చుచున్నవి కాని, నీకు రాజ్యముపై నున్న స్వత్వముల నిరూఢ పరచుటకుఁ దగిన యుపపత్తు లెందును

---

[1]ఆంధ్రమహాభారతము: ఆదిపర్వము: షష్ఠాశ్వాసము. పుటలు 160—164.
[2]ఆంధ్ర ... ... పద్యము 121. [3]ఆంధ్ర ... పుటలు 160—164.

గావరావు. కార్యముగఁదీరు సమయూనమైన నీ హక్కు స్థిరపరచుకొను పలుకుల నైన ఉలూకునిచే గిబరంపియుండిన నన్నింటికన్న మిన్నగ నుండెడిదే! అదియును తలంచినావు కావు. అపవయమున చిట్టంబులుకులఁబలుకరింపఁ బంపినావు. నీ యులూకుని రాయబారమున నేమి ప్రయోజనము యోజించినావని తర్కించుకొనినచో నేమియు ప్రయోజనము తేకునికికిఁదోడు పాండవులకు మఱింత యుద్రేకము గలుగుటకును, గాఁగల కార్యములను మఱింత త్వరపెట్టుటకును మాత్రమే గుట్రిచేసిన ట్లగపడుచున్నది.

ధర్మజుని యౌవరాజపదవికి నీ చూపోపమియు, అనంతర మాతనియర్ధ రాజ్యాభిషేకమునకు నీయంగీకరింపమియు, నాతని రాజసూయంపు కలిమికి నీ యోర్వలేమియు, ఆ మయసభను నీ వొందిన జారపాటులకు ద్రౌపది నగినదనిన నీ పరిభవమున కోర్వఁజాలమియు, నిన్నెంత ద్రప్పుటలకైన నొందఁజేయుచున్నవి. ఇదియొండుఁగక, నినుగూర్చియు, నీ సత్వంపుఁడన్ననఁగూర్చియు విచారింతుమని "సుయోధనవిజయ" మని "దుర్యోధనవిజయ" మని పలుకాడువారి నేమనవలయు!

ఇంతకును అంతము జూచినఁగాని వీడని నినుగూర్చి కాలము వృధ సేయుటకన్న నీవలనఁ జెడనున్న నీతండ్రి సంజయుతో నేమనుచున్నాఁడో వినఁ బోయెదములే! నీ గుట్టు బయల్పడక పోదులే అప్పుడైనను!

రాయబారము

ఏడవ ప్రకరణము

పాండవశిబిరము :

— ధర్మజుఁడు —

అర్జునా, వింటివా, మనచారులు దెలిపిన యంశములు! దుర్యోధనుండు తనసేనానాయకులను, సర్వసేనానాయకుండగు భీష్ముని రావించి, మన సేనల నెల్ల దుల్లఁజేసి సమయింప వారిలో నొక్కొక్కని కెంతెంత కాలము సాలునో, అడిగి తెలిసి కొని యానందించినాఁడఁట! ససైన్యంబుగ మనల సమయింప మనభీష్ముం డొక నెల యు, ద్రోణుండొక నెలయుఁ, గృపుండు రెట్టియుఁ, గృపికొడుకు పదిదినములును, బాహు వీర్యఘనుండగు కర్ణుం డైదుదినములును మనలను మాపఁజేయఁ గడువుఁ గోరిరఁట!

— అర్జునుఁడు —

అగ్రజా, యిపుడు నీనుడివిన వారందఱును నంతింతవారలు కాకపోయిరే! ఇంతకును రాజు నెదుట నంతలు బోసలు సలిపి చెప్పుట యొప్పని పనికదా?

ఇఁక మన బలంబులఁగూర్చి నీమనంబున ననయము వేధించుచున్న యనుమానము వాయ నే నొక్కమాటయె చెప్పఁదలంచితిని. యదుకులనాథుని సాధనముగఁ జేసికొని నా చేవఁ జూపి దేవదానవ సహితంబగు నీ ముల్లోకంబుల నొక్కట్రేటి పాటున నిట్టె చూర్ణంబు గావింపఁగలను. అది యెట్లనువుపడు నని దలంతువేని, వెనుకటిసంఘటన మొకటి నీకు జ్ఞప్తికిఁ దెత్తును. మున్ను పశుపతి నా భుజపరాక్రమమును, శరవిన్యాసశక్తియుఁ బరీక్షింపఁ గృత్రిమకిరాతరూపమునఁ బందికై నాతోఁ బవర మొనర్చి తా నలసిపోయి తుదకు నను మెచ్చి జగత్సంహారసమయమునఁ దాఁ బ్రయోగించునట్టి పాశుపతమహాస్త్రము నా కనుగ్రహించి, యొసంగుట నా యందది సన్నిహితంబై యున్నకతన, శత్రునిరాసం బనాయాసంబయి యుండును. అట్టి పాశుపతమహాస్త్ర మహనీయ ప్రభావంబు భీష్మద్రోణ కృపాశ్వత్థామలె యెఱుంగరన నిఁక గర్ణున కెఱుంగ నెట్టు లనువుపడఁగలదు! కాని అనన్యగతికం బగు నవసరంబు కలుగకమును పె, సమస్తంబును సమయింపఁజేయగలట్టి ఘోరసాధనంబుఁ బ్రయోగించుట యుక్తంబు కాదని, తక్కటి యాయుధంబులం బ్రయోగించి ధర్మమార్గంబున శత్రునిబర్హణం బొనర్చి పౌరుషంబు దీపింపఁజేసెదః సమరంబున సందిగ్ధావస్థలు దటస్థించుపట్టుల, నప్పటికివలయు విధంబులు సేయుచుందును. శత్రు సంహారక్రియాకలనవలన నీవు దిగులొందుచుఁ బలవింపం బని లేదు. ఇంతియగాక యిచ్చటి నీవా రచ్చటి యేరికిఁ దక్కువ? మనకడనున్న వా రందఱును వీరాధివీరులు-

అతిరథులును మహారథులును నగు వీరాగ్రణులు. ఇంతటిమాట యటుండనిచ్చి, దివిజులకుంగూడ నజేయుండవును, త్రిభువనంబుల నెదురులేని విక్రమోపేతుండవును నగు నీవు నేనుండఁగవోలె, నిమనీక సెఱుంగని యింతచింతనుఁ గాంచుచున్నది. మనకు విజయానందంబు సులభం బని తలంపుము. — (శ్రీవనము నభినయించుచు)

అదె పాంచజన్యంబు వినవచ్చుచున్నది! శ్రీకృష్ణుం డదె దెంచుచున్నట్లున్నది. అదియె విజయానందసూచకమగు చిహ్నముగాఁ దలంపుము

అని శ్రీకృష్ణున కెదురుగ నర్జునుం డరుదెంచి, యాతిథ్య మిచ్చి, మ్రొక్కి నిలచెను.

— కృష్ణుఁడు —

ఫల్గుణా, నేఁడే యుద్ధప్రారంభమనియుఁ, గౌరవసేన లెల్ల బలసి కోలాహలముగ వెల్వరిసియున్నవనియు నిఁక మనమును ససైన్యముగఁ బోరికలనికి నడువఁ దలఁచుచున్న దనియు నెఱుంగక యూరకేమి యీ యుత్సాహోక్తి!

— అర్జునుఁడు —

మిమ్ముల, మా సేనలను నిర్మూలింప నెవరెవరి కెంతెంతకాలము కావలయునో తెలియఁగోరి సుయోధనుండు పరువీరులఁ జేర్చఁ బిలిచి యడిగి తెలిసికొనెనఁట!

— కృష్ణుఁడు —

అతం డట్టులడిగి తెలిసికొనియెం గావున నీ కౌంతేయాగ్రజుండును కౌరవ బలంబుల నెల్ల విధ్వంసము సేయ నీ కెంతకాలంబు వలయు నని యడిగినా నేమి?

— అర్జునుఁడు —

కాదా మఱి— అట్లడుగఁదగదా! మా యన్నకు మాత్రము ధైర్యము నొసంగఁదగిన నీ మహదార్ధ్రవృత్తి వలదా! అం దేమి దోష మున్నది?

— కృష్ణుఁడు —

యుధిష్ఠిరుం డడుగుటయందును దప్పులేదు. నీ వుడిపిన ప్రత్యుత్తర మొసంగుటయందును దప్పులేదు. చాలు— మఱి తడయకుము. లెమ్ము; కవచధారివై బాణతూణీరమ్ముల ధరియించి, ధర్మజునకు మ్రొక్కి రథారోహణం బొనరుపుము. ససైన్యంబుగ సేనానాయకులందఱును సమరక్షోణీముఖులై పోవుచున్నారు. ధృష్టద్యుమ్నాదులు సమరప్రారంభమున కనుజ్ఞ నొసంగు శంఖారావంబుల కెదురుచూచుచున్నారు. భీష్ముశంఖారావము వినరాక పూర్వమే మన మట నిలువవలెను.

అర్జునుఁడు ధర్మజునకు సాగిలి మ్రొక్కి— యుధిష్ఠిరప్రభూ, నీయాజ్ఞానువర్తులమయి సమరాంగణం జేరబోవుచున్నాము— అని కృష్ణసహితుండయి నడలెను.

రాయబారము

ఎనిమిదవ ప్రకరణము

— ధృతరాష్ట్రుఁడు —

సంజయా, ఉలూకునిచే నాకొడుకు పాండవేయులకడ కనిపిన నోరిచేటులకు వారొసంగిన ప్రత్యుత్తరములు నాకుఁ దెలిపితివి. చివరవఱకునుఁ బాండవులదెసఁ దనకుఁగల బగల వెలువఱచుచు, నాసుతుఁడు తిట్టుంబలుకులు మానినాఁడుకాఁడు. ఉలూకునితోఁ గృష్ణుం డెంత తీవ్రముగ నాడెనో, అంతతీవ్రముగ కార్యములను జేయఁగల సమర్థుఁడు. నాకొడు కెవరెన్ని విధాల ధర్మమార్గ మనుసరింపుమని కోరినను రానయియున్న వినాశహేతువునఁగావలయుఁ బాండవుల కింతయిడుటయన నొల్లకున్నాఁడు. ఇఁక నా కొడుకులకు బ్రదుకెక్కడిదని, యహోరాత్రములును దుఃఖించుచు, ధర్మమే జయమందు నని, యూరకుండుటకంటె నింకేమి సేయఁగలను!

— సంజయుఁడు —

ఇల్లెల్లవేళలను నీకొడుకుపయిఁ దప్పుమోపి, నీవుగాఁ దప్పించుకొనఁ జూచుచుందువు. ఇది నీకుఁ దగదు. నీచలని తప్పు నీవు తెలిసికొనఁజాలకుంటివో; దాని నోరు లెఱింగియుంట నీ వెఱుంగవో! నీయందున్న లోపము నోరు లెత్తిచూపిన నెఱుంగనివాఁడుంబోలెఁ బ్రవర్తింతువు. ఇది కా దందువయేని నీ వెఱుంగకుండఁ బాప మప్పాండుసుతుల నీకొడు కంతంతలు సేసియుండెనే! జరిగినవంతయు నెఱింగిన వారొమటనె నీ విట్లుపలుకుచుండ, నిఁక నోరులయొద్దమాటఁ దలంప నేల! నీ నయనేంద్రియ మంథతనొందినను, జరుగుచున్నదియు, జరుగనయియున్నదియు కార్యకారణముల సమన్వయపఱచికొనుచు జ్ఞానేంద్రియముచేఁ దెలిసికొనఁగలవాఁడవు, పాప మనురాగాంధతచే నీవు కొడుకువలదినవాఁడవౌట, నేయఁదగినది యెఱింగియు, సుతుమతి కది విరుద్ధంబని యెంచి యేమియుఁ జేయఁజాలకున్నావు. పాండుసుతుల బలపరాక్రమంబులు వినుచున్నంతసేపును, భీముని గదావిహారము నీ హృదయమునకుఁ దట్టినంతవట్టును బాండుకుమారులె జయింతురనియు నీ కొడుకులకు పరాజయమనియు మదినిశ్చయించి దలంకుచుందువు. నీతనయుని సామర్థ్యాతిశయాభివర్ణనము నీవు వినుచున్నంతఁదడవును, నీ కుమారకవర్గమె జయించుననియుఁ బాండుపుత్రచయమె పరాజయమొందుననియుఁ దలంచుచుందువు. ఇట్లొకతెన్నునఁ బోఁజాలకున్నావు. ఇంతతో నాఁగక లోకము నినుగూర్చి చెడుగుఁ దలంపకుండుకొఱకు

నీమనమున నీ వొందుచున్న ఆరాట మెన్నిముఖములనో అప్రయత్నముగ వెలువడుచునేయున్నది. అట్లగుటనెకదా:—

కృష్ణుఁడు నీతోఁ దొలిపలికినయపుడు గాంధారిని సభకురప్పించి, నీకొడుకునకు నీతులుగఱపఁజేయుసమయాన నీయందున్న భారము దించికొనుటను నీకొడుకుపయి నేరముమోప నెంచితివి? అట్లయ్యును, గాంధారి సభకేతెంచి, పాలకుఁడవుగా నీకుఁ గల స్వేచ్ఛ, తండ్రివిగా నీకుఁగల స్వాతంత్ర్యము, కురువృద్ధుఁడవుగా నీయం దవహితమయియున్న యుత్తరవాదిత్వము నీకు సుబోధకముగావించి నీయందున్న బాధ్యతనెల్లఁ దెల్లమొనర్చెను. అంతతో నీయం దదివఱకుండిన భారము ద్విగుణీకృతముకాలేదా! నీ వాచరింపనలసియుండియు నట్లాచరింపని కార్యములును, నీ వుపేక్షింపరానివయియుండియు, నీవుపేక్షించిన ఘట్టములును, ఇంకను గృష్ణాదులకు సువ్యక్తములు కాకపోలేదని నీ వెఱుంగక కానోపు, పాపము మఱలిపోవుచున్న కృష్ణుని వెంటనంటి [1]నీవనినమాటలు మాకుజ్ఞప్తిలేకపోలేదు. ప్రజ్ఞాచక్షుండనగు నిను బోల్చుకొనఁజాలండని నీవు తలంచుట నట్లుంటివి. కాని, విశ్వచక్షుఁడు కృష్ణుం డని నీ వెఱింగియుండేని నట్లనియుండవు. కాని [2]కృష్ణుఁ డయ్యుత్తరక్షణమున నేమనియెనో మఱచితివే? కృష్ణుం డదియంతయు గ్రహించియె మనలనువీడి కుంతియింటికి వెడలినాఁడు. నివు నాతో, "ధర్మో జయతి యని యూరకుండునాఁడ" నని మఱి యనకుము. నీ వేమనుచు నూరకున్నను, నింతకాలమును, నీ వుపేక్షించిన కార్యములును, నీ వాచరించిన అకార్యములును, వాటివాటి పర్యవసానములయందు తదనురూపఫలముల నందఁజేయకమానవు. ఇపుడు నడచుచున్న కార్యకలాపమున నేది ధర్మమో యేది యధర్మమో యెఱింగియే- ధర్మోజయతి- యని యనుచున్నావో, కార్య మకార్యముగను, తారుమారుగను, దలంచి ధర్మోజయతి యని తలంచుచున్నావో కాని, నీవు పొరపాటొందుచున్నావు సుమా!

— ధృతరాష్ట్రుఁడు —

సంజయా, నీవింతదూరము చెప్పుచుంటివి, మఱి దాపరికమేల? మది నరమర వీడి చెప్పెదను వినుము.

నాతమ్ముఁడు లేకున్నను, ఆతనియెడ నాకుఁ బ్రేమలేకపోలేదు. సహజముగా ధర్మానువర్తనము పండితజనవంద్యముగుటను, నాతఁడు కురుకులమునకు మండనాయమానుండగుటను, నాకొడుకులకన్న మిన్నగ నే నాతని నెంచి తొలుదొల్త నాతని

1 రాయబారము పుట 275. 2 రాయబారము పుట 276.

యౌవరాజ్యమున కభిషిక్తునిగా నొనర్చితిని! కాని నాకొడుకుమతి నతిక్రమింపఁ జాలక పాండవులను వారణావతమున కనిపితిని. దానంజేసి తదనంతరచర్య లన్నియు నడచుట యసత్యముకాదు. వినుము సంజయా, ఒక్కటిమాత్రము సత్యముసుమా: పాండవేయు లెంతబాగుపడిన నే నంత సంతసింతును. కాని నాకొడుకులు నశించి వారేమాత్రము బాగుపడినను, నే నోర్వఁజాలను. మఱియు నాకొడుకులకు వినాశ హేతుభూతమయ్యెనేని, వారి మనికియె యియ్యకొనఁజాల. నాకొడుకులఁ గడతేర్ప నెంచియున్న వారెట్టివారైనను నే సహింపఁజాలమియు,-వంశనాశనకరుండే యగుఁ గాక- ధర్మశాస్త్రములు చెప్పినవని, కొడుకును త్యజింపఁజాలమియు, నాయం దుండు లోపములని మీరందఱు నాడ సాహసించుచున్నారు. కాని, వంశద్రోహకుం డని తన మేనమామ యగు కంసునివధియింపఁ గృష్ణునకుఁ జేయాడినట్లు నాకొడుకును వధియింపఁ నాకుఁ జేయాడదు. కార్యాచరణము ఇతరుల కుపదేశించుటవంటి సుకరకార్యము కాదుసుమా! కావున నే కృష్ణుఁ డెంతలు సెప్పినను, నే నేమియుఁ జేయంజాలక ధర్మాత్మజయతి యని మిన్నకుంటి. జగత్ప్రభుండని, విశ్వనియంత యని, సృష్టిస్థితిలయకారణకారకుండని, మహద్విఖ్యాతిఁ గాంచినవాఁడుకదా యని కృష్ణు నే మనుటకును వీలుచిక్కకున్నది. కాని, కానిచో జగత్కంటకుండను కారణ మున నే యాగాక, ప్రాగ్జ్యోతిషపురాధినాథుండగు నరకుని వధియింపఁబోయియు, నరకుఁడు దనకుమారుఁడనిలోకులనినంతమాత్రమున నెకద, తావధియింపఁజాలక, యాతని సవతితల్లియా సాత్రాజితిచే వధియింపఁజేసె. ఈమాట నే ననినచో యధిక్కరణం బగునని వెనుకకు తగ్గవలసివచ్చుచున్నది. నరకు నట్టుల లోకకంటకుండని నాకొడు కనిపించుకొనలేదే! కృష్ణుఁడువలచిన పాండుకుమారులకు ధరణీభాగమీని యేక మాత్రకారణమున నాకొడు కెట్టుల లోకకంటకుండగును? రాజ్యపరిపాలన యందేమి, అర్థిజనంబుల కీవు లొసంగుట యందేమి, తన లక్ష్మణకుమారునట్టులఁ బ్రజల సర్వ విధముల సంరక్షించుట యందేమి, పాండుకుమారవర్గమును ద్రోసిరాజనిపించుచునే యున్నాఁడే మాసుయోధనుఁడు! మీ కోరినరీతి నొనర్ప మావాఁ డిచ్చగింపమికి నేనే కారణమనియుఁ, జిన్ననాఁటనుండియు నేనే సుయోధనుని బెచ్చుపెరుగనిచ్చితి ననియు, మాయిరుగురను మీరందఱు నన్నన్నివేళల నిందించుచున్నారే కాని, ఒక్క లోకధర్మము మాత్ర మాలోచింపఁజాలకున్నారు.

ఎంతకాలమువఱకును లోకమునఁదమపిల్లలు జననీజనకుల మాటలఁ జవదాటరో, అంత కాలమును నాపిల్లలును, నామాట దాటనేలేదు. పుత్రులకు యుక్తవయసువచ్చిన

పిదప, నుచితానుచితజ్ఞ నారి కలుషితపని వారికిఁ దోఁచినపిదప, వారిచిన్నతనమున జననీజనకు లొనర్చిన కార్యములయందుఁ బుత్రులకు లోపములు పొడఁచినపిదప, వాని నెల్ల సవరింపవలె నని వారికిఁ దోఁచినపిదప, జననీజనకులు మఱి జీవింపకుండుట మేలగుఁగాని కానున్నఁ దా మొనర్చిన వెనుకటి కార్యముల కంతరాయములు గలిగించుచున్నారే పుత్రులని జనకులును, దమ స్వతంత్రపు జనకు లవరోధములు గల్పించుచున్నారే యని పుత్రులును, ఏహ్యభావము వహించుచుందురు. అట్లగుటవలనఁ గదా ముదుసలులగు జననీజనకులు లోకపుసడికిఁ బాల్పడుటయుఁ, గొడుకులు లోకకంటకులై యుండుటయు నగుచున్నది! లోకములో నందఱివలెనే నా కొడుకును తనకు బదేండ్ల వయసున, దండ్రినగు నేను చాల చదివినవాఁడనని యెంచినాఁడు; తనకు బదునారేండ్లు పైఁబడఁగనే నాకుఁ దెలిసినంత దనకును దెలియునని తలంచినాఁడు; తన కిరువదేండ్లు వచ్చినవి- సరి - నాకన్నఁ దనకు ద్విగుణముగా దెలియునని నిర్ధారణ మొనర్చికొని యింటింటి కుటుంబకలహములు జనింప నేర్పరించినాఁడు. ఇదియంతయుఁ బురాకృత కర్మానుభవము కాకుండిన, నే నింతవృద్ధుండనయ్యు, నెవరి నుద్ధరించుటకని నే నింకను జీవించియుండుట! వాసుదేవుం డెవ్వరిని వరియించు, నవ్వారలకే జయశ్రీ లభియించునని నే నెఱుంగనివాఁడను కాను; అట్లయ్యును, నా కొడుకుల విడుపోవమి నే నుపేక్షింపఁజాలమియే యింతవంతయుఁ గతంబయ్యె; కొడుకులవలచిన వాఁడనియు, మూఢవాఁడనియు, నను నీవును భీష్ముండునుంగూడ గదుమాయుచుందురే కాని మాశంతనునకు భీష్మునట్టి కొడుకుఁగాక, సుయోధనునట్టి కొఱగాని కొడుకు, కులము జెఱుపఁ బుట్టిన కొడుకు, ఎవ రెంత చెప్పినను విననట్టి కొడుకు గలిగి, ఆ శంతనుఁడు నను బోలి జనుమాంధుండయి, కాలముదీరి, కాటికి కాళ్లు చాచికొనిన తండ్రియై యుండి, యిప్పటి పరిస్థితులే యప్పుడు వానిను దటస్థించియుండిన నేమయియుండెడివో! ఇట్టికష్టములఁ బడినవానికే కదా యిందున్న కష్టములు దెలియుట! ఇంతయును 'ఒకరీతి కర్మవిధాన మీశ్వరవిలాసమును, యింకొకటి కాకుండునే' యని మనసు కుదురఁ జేసికొని మిన్నకుందును. మిన్నకుండక నేఁ జేయున దేమున్నదికనుక!

నా కన్నకొడుకును ద్వేషింపుమనిన భగవంతుఁడో, భగవదవతారమో కాని, నా సుతు నే నట్లు విసర్జింపఁగల హృదయకాఠిన్యతయు, సాహసమును దానే నా కొసంగవలదా! ఇంతయేల! నా కొడుకు మనసుఁ ద్రిప్పి, వానిం దన తెన్నునకేల మరల్ప రాదు! పరిస్థితులన్నియు నొక తెన్నునకు రాఁగలవే—!

నే నెంత దుఃఖించుచుంటినో, యెవని కెఱుక? ఇన్ని దుఃఖము లనుభవించు

చున్న నన్ను నిందించుటకంటె, పెద్దకాలము జీవించుచు నింకను అంతముదెలియక దుఃఖపడుచు, నెప్పుడేమి దుఃఖవార్తలు వినవలసివచ్చునో కద యని సదాసంశయించుచు నెప్పుడెప్పుడని చావున కెదురుచూచుచున్న నాకుఁ దడవులేని చావు గలుగునట్లాశీర్వదించి పున్నెముగట్టుకొనరాదో!

— సంజయుఁడు —

మేమెవరము నెట్టిపున్నెమును గట్టుకొన నక్కఱలేదు. నీ వింతదూరము చెప్పినదియును పుత్రవ్యామోహావస్థను సమర్థించుకొనుచుఁ జెప్పినదియే యగును. ఈమాత్ర మెఱుంగక కాదు, దేశమునకును, కులమునకును, వంశమునకును, నాశన మాపాదించువాఁడు కొడుకైనను, వధ్యుఁడనియును, వర్జనీయుఁడనియును, అంటిమి. కాని లోకమునఁ గుమారు లందఱును భీష్ములు కారనియు, జనకు లందఱును శంతనులు కారనియు, మేమందఱ మెఱుంగక కాదిన్నినాళ్లును నీతో నింతదూరము ముచ్చటించుటకుఁగతంబు. నీ వనినను, అనకున్నను గూడ ధర్మమే జయమొందును లే!

— ధృతరాష్ట్రుఁడు —

కాటికిఁ గాళ్లుసాచుకొనియుండి, కూడనంతకాల మియ్యిలజీవించి, పెద్దల యెడఁ ననాదరముంజూపు కొడుకులుగల జనకుల బ్రిదుకు లిట్లేయగును.

కాని సంజయా, యిపు డేకార్యక్రమము నడచుచున్నది?

— సంజయుఁడు —

మఱి నడచుట కేమున్నది! ఏకార్యక్రమము మనసార నీ వభిమతించితివో అదియే నడచుచున్నది. ఇరువాఁగులవారును కురుజాంగలమునఁ గలసి విడిసియున్నారు. ఇదిమొద లెవ రెవ రెప్పు డెప్పుడు గతించిన నావార్తలు దెలుపుటకు నేనును, వినుటకు నీవును, సిద్ధపడు కార్యక్రమముదప్ప నింకే కార్యక్రమము మిగులఁగలదు!

వినియు విననివానింబోలె నాజీకు శ్రుతి నభినయించుచు మిన్నకుండెను.

సంజయుండును ఎప్పటి సంఘటనల నపుడు తెలుపుటకు ధృతరాష్ట్రు సమీపముననె కూరుచుండెను.

రాయబారము.

తొమ్మిదవ ప్రకరణము

యుద్ధప్రారంభము—యుద్ధప్రదేశము.—

ఇప్పటి పాశ్చాత్య యుద్ధప్రదేశములవలెఁ గొన్ని మైళుల ప్రదేశము యుద్ధప్రదేశముగా నిర్ణీతము కాఁబడి యుండినట్లు, కౌరవపాండవ సైన్యములు విడిసియుండిన ఆ ప్రదేశము, నిర్ణీతము కాబడియుండలేదు. ఇప్పటి యుద్ధ సేనలు బ్రిటిషు ప్రభుత్వము క్రిందనున్న వన్నియు నొక్కెడ గుమిచేసి నిలువఁబెట్టిచూచిన నైనను, భారతయుద్ధ కాలము నాటి యొక దెస నిలచిన సైన్యభాగములో నెన్నవ వంతు కానగునో, యలనాటి కురుపాండవ సైన్యములు నిలిచిన ప్రదేశపుసరిహద్దులు దిఙ్మాత్రముగా నైనను పరిశీలించి చూచినచో మనమే గ్రహింపగలము.

మొట్ట మొదటఁ గురుపాండవసమగసమయము నాటి భరతవర్ష మిప్పటి పాశ్చాత్యలేఖరు లనుకొనుచున్నట్లు బ్రిటీషుయిండియా మాత్రమె కాదు.

(1) హిమాలయోత్తర భాగమున గల నేటి టిబేతులోనివగు, ఉత్తర కురుకాంభోజ, ఉలూక దేశములును,

(2) తూర్పున చైనా ఆసాందేశములలోనివగు ప్రాగ్జ్యోతిషమును

(3) మధ్య ఆసియా, అఫ్ఘనిస్థానములలోనివగు ఉశీనర, మద్ర, బాహ్లీక దేశములును,

భరత ఖండస్థరాజ్యములుగా నానాడు పరిగణింపబడినవి.

వేదకాలమునందును, మహాభారతకాలమునందును, నేమను మహాప్రసిద్ధినే పొందియున్న యీ కురుదేశమునే మనువును, మహాకవి కాళిదాసునుంగూడ, బ్రహ్మావర్తమనియే వర్ణించియుండిరి. అట్టి యీ కురురాజ్యమునకు:—

1. ఉత్తరమున:—హిమాలయమును,
2. తూర్పున:—పాంచాలదేశములోని అహిచ్ఛత్రమును, మాకందియు కాంపిల్యము నను భాగములును,
3. దక్షిణమున:—మత్స్యదేశమును, నాడు మరుస్థలమని పిలువబడుచుండిన యిప్పటి రాజపుత్రస్థానపు టెడారియును,
4. పశ్చిమమున:—నేటి కాంధహారు లేక కాంధార్, పశ్చిమోత్తర పరగణాల లోను, పంజాబులలోను గలసిన గాంధారదేశమును,

కలవు.

గాంధారదేశమునకు పశ్చిమోత్తరభాగములలో బాహ్లీక, మద్ర, కాశ్మీరములును, నైఋతి దిక్కున: కేకయసింధు సౌవీర దేశములును, నేటి రాజపుత్రస్థాన గుజరాతి దేశములలో నున్న మరుస్థలమును నెడారియు, మత్స్య త్రిగర్త దశార్ణదేశములును, శూరసేన, అవంతి, సౌరాష్ట్ర దేశములును,
నేటి మాల్వా, మధ్యరాష్ట్ర భాగములలోనివి యగు నిషధ హైహయ, విదర్భ చేది, దక్షిణ కోసల దేశములును,
పాంచాలమునకుఁ దూర్పునఁ గాశీకోసలదేశములును,
బీహారు బంగాళారాష్ట్రములలో విదేహ, మగధ, అంగ, వంగ, పుండ్రదేశములును,
ఆసాం, చీనా బర్మా భాగములలోనిదగు ప్రాగ్జ్యోతిష రాజ్యమును,
ఉత్కళ ఆంధ్ర మహారాష్ట్ర దేశములలో కళింగాంధ్ర, మణిపుర శోణముల్ల దేశముల భాగములును,
ద్రవిడ కర్ణాటక మళయాళ మహారాష్ట్ర భాగములలో చోళ పాండ్య కేరళ కొంకణ, సాళ్వదేశములును,
చేరియున్నవి.

మహాభారత యుద్ధమునఁ బదునెనిమిది యక్షౌహిణుల సైన్యము పోరియుండెనా? అట్లయినచో నన్ని సైన్యములు నిలిచియుండుటకుఁ దగినచోటు కలదా యను సంశయ మేలని? ఉద్యోగపర్వమున 18వ అధ్యాయమున నీ విషయము వ్యాసుఁడు విస్పష్టము గావించియే యున్నాఁడు.

నేటి అలహాబాదు మొదలు రమారమి రాజపుత్రస్థానపు టెడారివరకును గల ప్రదేశమంతయు యుద్ధరంగమె. అందు వారణావతము, అహిచ్ఛత్రము, పంచనదము, కురుజాంగలము, రోహితకారణ్యము, కాలకూటము, గంగాకూలములలోఁ గౌరవుల సైన్యము నన్నబడి సుమారైదువందల మైళుల ప్రదేశము యుద్ధరంగమని సకృచ్ఛముగ వర్ణింపబడియుండ నింకను సంశయ మేల? అట్టి యుద్ధరంగము కౌరవులలోనివారగు భీష్మద్రోణాదులకుఁ బాండవుల లోనివారగు శిఖండి ధృష్టద్యుమ్నాదు లెదురుగ నొడ్డనములఁ దీర్చుచుండిరి. విచిత్రవీర్య చిత్రాంగదులవివాహకాలమునాటి భీష్మునెడ పగదీర్చుకొనుటకు శిఖండియు, తన తండ్రిమాట దీర్ప ద్రోణునెడఁగల ప్రాఁబగఁదీర్చుకొన నాతనినవధియించుటకు ధృష్టద్యుమ్నుండును సమయముకొరకు వేచియుండి కేంద్రీకృత దృష్టులతో నుండిరి. ద్రోణునందొక గొప్ప యౌదార్యగుణము గణనీయమైయున్నది. ద్రుపదుని తనకు శత్రుఁడని యెఱిఁగి

యుండియు, నాతని పుత్రుండగు ధృష్టద్యుమ్నుడుం గూడ, తదితర రాజపుత్రుల తోపాటు అస్త్రవిద్యయం దమితకౌశల మువడంజేసెను. ఇపుడీ యుద్ధమున స్వపక్ష పరపక్షములం జేరిన యోధవరులలో పెక్కండ్రు ఘనద్రోణాచార్యునొద్దసుశిక్ష నొందిన వారే యగుచున్నారు.

కురుక్షేత్రమున నానాడా కౌరవపాండవభండనము జరిగిన నాటనుండియు ఆస్థలమున కేమి యంటుతగిలినదో గాని, (1) క్రీ॥శ॥ 1192 వ సంవత్సరమున పానిపట్టునొద్ద పృథ్వీరాజు మహమ్మదుఘోరీలకును, పిదప (2) క్రీ॥శ॥1526వ సంవత్సరమున స్థానేశ్వరమునొద్ద బేబరు యిబ్రహీంలోడీలకును అనంతరము (3) క్రీ॥శ॥ 1761వ సంవత్సరమున పానిపట్టునొద్ద మహారాష్ట్రులకును అహమదుఅబ్దాలీలకును, జరిగిన మహాఘోర యుద్ధములు హిందూదేశచరిత్రయందు ప్రసిద్ధిగాంచి ప్రతియుద్ధమునందును ప్రబల రక్తపాతమును, ప్రజాక్షయమును, మిక్కిలి ఘోరముగ కలిగించుచునే యుండెను.

అట్టి తావున మనదుర్యోధనుని సేనలును, తనకు సాయముసంగవచ్చిన రాజవరుల సేనలును నిలచి యుండ, ధర్మజు సేనలును, తత్పక్షమున సాయము సేయ దమతమ సేనలతో వచ్చిచేరిన జోదుల వరుసయు ప్రతిపక్షుల క్షణకాలమున కక్షతో గబళింపనెంచి నిలచియుండిరి.

అప్పుడట నెందుమాత్రమున్నను అందరును సాధారకనములే! అందరును ఆబద్ధతూణీరులే! అందరును ఆకలితకార్ముకులే! అందరును ఆరూఢరథులే!

రణభేరి మ్రోగుచుండెను. శ్రీకృష్ణుని పాంచజన్యధ్వానము, పంచభూతములును కలసిరాశియై తుక్కుక్కుమ్మడిరేగి లోకముల పరమాణువులం బోలె నెగిరింప నెంచి సంయుక్తధ్వానమొనర్చినచో కలుగగలనిక్వాణము సృజియించియుండనో పునవిదోపఁ జేయుచుండెను. అప్పటిశంఖారావములే యూరమున నున్న వారికి సంజ్ఞలయియుండెను. పాండవ వీరులందఱును యుద్ధభూమిం జేరినారు. అప్పటి సేనల నిలువరింపు ఇప్పటి మనము బోధపరచుకొనవలెనన్న ఆధునిక భాషిక శబ్దములనే ఉపయోగ పఱచి వ్రాయుటకంటె సముదరంగము బహుభయంకరమై నెగడుచున్నదనినఁ జాలును.

ఇన్ని సైన్యములును చేరియుండిన స్థలమునుగూర్చి వ్యాసుడభివర్ణించుచు, సైంధవవధ నాడన్ని సైన్యముల నొక్కటిగా గూర్చవలసి వచ్చినప్పుడైన పుఁజూచినను గౌరవ సైన్యము పండ్రెండు యోజనములస్థలము నాక్రమించినదై యున్నదనినాఁడు. కావున ప్రదేశ పరిమితినిగూర్చిగాని, సైన్యముల నిలుకరింపు ప్రకారమునుగూర్చి గాని మఱి సంశయింపఁ బనిలేదు.

శా య బా ర ము

తొలి పాంచజన్యము నొత్తినాఁడు కృష్ణుఁడు. తనదేవదత్తము పూరించి దిక్కులు బ్రిద్దలగునట్లొనర్చినాఁ డర్జునుండు. యుధిష్ఠిరుం డనంతవిజయము నూది నాఁడు. భీముఁడు పౌండ్రమును, నకులసహదేవులు సుఘోషమణిపుష్పకములంబూరించి నారు. కౌరవపక్షమునంగూడ వీరజనోచితముగ శంఖారావములు వినవచ్చుచున్నవి. ఏక్షణమున ప్రారంభింపబడునో యుద్ధమని యెల్లరు నెదుళ్లు సూచుచుండిరి. అర్జును నమోఘ రథరథ్య ధనస్తూణీరసారథులం బలకించుచున్నాఁడు భీష్ముఁడు. శ్రీకృష్ణ నియంతుఁడై తనధనుర్బాణముల నొకటనుంచి, కవచమువీడి, రథంబుడిగ్గి, పాదచారి యై, గ్రిక్కిరిసియున్న యిన్నిసేనల నడుమం ద్రోవఁజేసికొనుచు, యుధిష్ఠిరుండు భీష్మంజేరి—'ఆర్యపితామహా, ఆచార్యా, నీ వలన నింతవారమై పెరిగిన మాకు, గాలకర్మవశమునసంప్రాప్తించిన యీ యుద్ధప్రారంభమునకు సెలవొసంగి, మాకు జయముకలుగునట్లాశీర్వదించి పంపుము'—అని శాంతనవునకు నమస్కరించి, సవినయంబుగ నిలచెను.

భీష్ముం డాధర్మజుని సాదర దృక్కుల నవలోకించి యాశీర్వదించి, —ధర్మజా నీవిపుడిట్టులవచ్చుటయె నీ జయమునకుగారణమగు. నీకే జయము కలుగ గలదు—అని ఆశీర్వదించి అర్జును నంపివేసినాఁడు. ఇదియంతయు జక్కగ గమనిం చుచునేయున్నాఁడు కృష్ణుఁడు.

* * * *

ధర్మరాజా, ఏ సమయమున కేది ధర్మమో, అదిచక్కగ గుర్తెఱిగి, అట్లొనర్పఁగల మేటివని నిను ధర్మరాజనియందురా యని దోపఁజేయుచున్నది నీ ప్రతిపదమును! ఇపుడీ వొనర్చినపని, ఈసమయమున నీపరిస్థితులకు ధర్మమైనదియె యగును. సన్నద్ధయుద్ధసమయాన పాదచారివై పోవుట యుద్ధభూమిని నిలచియున్న వారికబ్బురముగొల్పినది. ప్రతిపక్షముననున్న భీష్మునకు నమస్కరించుట దుర్యోధను పక్షమున నిలిచియున్న యెల్లరకును మేని గగుర్పాటొదవఁజేసినది; భీష్మునకు నమస్కరించుటయు, యుద్ధప్రారంభమున కాతని యనుమతి వడయగోరుచు సవిన యంబుగ నిలచుటయు, నాతని సగము బలము దిగజారినది. ఇట్లెంతవాని నిట్టె దుర్బలు నొనర్చినావు! ప్రతిపదమందును మానవ మానసతత్త్వవేదివయి బ్రవర్తిం చునీకు తత్తత్త్వమునకు మీమాంసకుండు కృష్ణుండు నీకు గురుండు. ఔరా! యింకెట్లె ట్లి ప్రభవింపఁజేయుదువో స్వవిజయదాయకములగు కార్యములు!

* * * *

అక్షయతూణీరముల ధరియించి అకుంఠితమువుంబూని అవక్ష్యరథ్యములంబూన్చిన దివ్య రథంబధిరోహించి నారాయణుండు సారథిగా నారథంబుగడుపుచుండ, అర్జునుండు పాంచజన్యంబొత్తుచు సంగరావనింజేరినాఁడు. నలుదిక్కులం గలయఁ జూచినాఁడు. కురువృద్ధులందరను జూచినాఁడు. గురుజనమ్ములఁజూచినాఁడు. ఎందుఁజూచినను దవవారే; తనయాప్తవర్గమే; తనమిత్రవర్గమే; తనబంధుకోటియే. అర్జుననిష్కృపయామున వికారోదయమయ్యెనన అనందేమి ప్రాకృతికమున్నది. ఆతనిముఖముననయ్యాదిప్రతిబింబించినది. ఎక్కుపెట్టినవిల్లునుగూర్చనికోలయురథముననొకయోరగుని దివేసినాఁడు. ముచ్చెమ్మటలు పోసినవి. శరీరసంధులబలము సన్నగిల్లినది. గొంతుకపడి యూరినది. క్షణకాలమూరకుండి 'యదుకులశేఖరా, మఱికనేనీయుద్ధము సేయఁజాల. ఇందరు నావారలఁ జంపుటకన్న మాఱల నడవులంజేరుటయె మేలు. ఇందర వధియించిన పాపము గట్టుకొని, భారతభూమిని వీరపురుషరాహిత్యమొనర్చి తన్మూలమున వర్ణసాంకర్యమొదవఁజేసి, పితృలోకముననున్న నావారల సంతతికిను గతులు లేకుండఁజేసి, నేనొందెడిదేమున్నది? దేవకీనందనా, మోహాంధచేతస్కుండనై సంశయాత్ముండనగు నాకజ్ఞానము దొలఁగఁద్రోసి, నన్నుద్ధరింపుము'' అనియర్జునుండనెను.

— కృష్ణుఁడు —

(తనలో) అన్నా, చిక్కు తెచ్చిపెట్టినాఁడే యింతవీరపురుషుఁడును! నేనెంత యనుకొనుచుంటినో, అంతయు నైనది. కాని ''పితృలోకము—నరకము—పాపము'' అనుచున్నాఁడు: కావున ఆస్తికత్వమీతనియందు దొలంగలేదు. తనమోహాంధత బోఁదోలుమనుచున్నాఁడు: కావున నిదియె సమయము: ఈతఁడె తగినవాఁడు: నేనీతనికి, యిపుడే, యుపదేశింపవలెను.

(పరిహాసముగా) అర్జునా, మంచిసమయమున నేకలిగినదే నీకీ నిర్వేదము ఏమో మహావీరుండవనుకొంటిని: భారతభూమిని శాశ్వతముగ నీపేరు నిలువ గలదనుకొంటిని. బాణతూణీరముల విడిచి, చలికిలబడితివే!

పోనీగాని—నీతాతలు, తండ్రులు, గురులు— వీరిని జంపజేయూడదని యంటివి గదా, ఈ యుద్ధభూమిని వీరుకాక, ఖాండవమునందువలె వేరెవారైన నీ యెదుట నిలిచి నీతోఁబోరనున్నచో, వారిని వధియించినచో ప్రాణహానికాదో! నీకు పాపము రాదో! నీకు నరకప్రాప్తి లేదో! ఎవరిని బోదువవచ్చితివోయీ యుద్ధభూమికి పటుపోటరిననని—చాలుఁ చాలు— నీవును: నీ తొలివీరాలాపములును! అనార్య

జుష్టమై- అస్వర్గ్యమై- అకీర్తికరమును- దుష్కీర్తిప్రతిపాదకంబును- నగు పలుకులు నీ నోట వెలువడుట యెంత శోచనీయము !

— అర్జునుఁడు —

యుద్ధమున నావారిని జంపుకొనుటకంటె హేయమైన దింకేమికలదు ?

— కృష్ణుఁడు —

ఓహో, చాలా పెద్దమాటలు నేర్చినావే! వీరంతయును నీవారగుటయు, తక్కిన వారు పెరవారనియుఁ దలంచుచున్నావో! సృష్టిలో మానవులందఱును ఒక్క మూల పురుషునుండి వచ్చినవార మేయని యెఱుంగకున్నావు. నీ వెవఁడవోయీ వీరిని జంపుటకు! ఇదివరకు నీ శరములంబడినవారందఱను నీవే చంపితివనుకొని గర్వించుచున్నావు: కావుననే యిపుడీ మోహాంధత నీ కొదవినది. నీవు చంపువాఁడవును-వీరు చచ్చువారగునా? ఏమివింత! నీతాతల నేరుజంపిరోయి? వారి తండ్రితాతల నెవరుజంపిరోయి? ఒకరు చంపుట-ఇంకొకరు చచ్చుట— వట్టిమాట! కొఱగానిమాట!! ఎవరి ధర్మము వా రాచరింపవలెనే గాని తక్కిన సంగతులతో నేమి ప్రయోజనము! శూద్రుఁడు కార్మికవృత్తు లేలచేయవలెనో, వైశ్యుఁడు వాణిజ్యము నేల నెఱపవలెనో, బ్రాహ్మణుఁడు ధర్మాధర్మముల నేల లోకమునకు బోధింపవలెనో, క్షత్రియుఁడందుకే యుద్ధము సేయవలెను. ఇట్లు స్వధర్మపరిరక్షణమే గాని యుద్ధము పాపకృత్య మెట్లగును? చెడినది-చెడునది-యీ శరీరమే గాని ఆత్మ కాదాయెను. నిత్యమై శాశ్వతమైన జీవుని నెవరు చంపగలరు? వినశ్వరములగు శరీరము లెల్లప్పుడును నిమిత్త మాత్రములు. నాశనము లేని జీవుఁడు మృతుఁడని గాని-నీవు చంపిన చచ్చెనని గాని-నీ వవివేకమున దుఃఖించుటకంటె నీచమున్నదా? నీ విపుడు వీరిని యుద్ధమున జంపకున్న వీరందరు నీయిల నట్టెగట్టుకొని శాశ్వతముగ నూఁగుచునే యుందురనుకొనుచున్నావో! ఏ యుద్ధమున నెవరుజంపిరోయీ నీపితామహప్రపితామహులను? చావునకు యుద్ధమే కావలెనను కొంటివో! కాలమాసన్నమయియున్నవారు నీవు యుద్ధముమానినను వారు చావక తప్పదు. ఇంతయును చీకు గుడ్డల విడచి నూతన వస్త్రముల ధరియించులాగున శిథిలమైయున్న యీ పాతశరీరముల విడిచి కోమలమైన నూతనశరీరముల వారుధరించుటకీ వోర్వఁజాలవా? నీవు యుద్ధముచేసి వీరినందర జంపివేసినచో ధర్మనాశనమగు ననుచున్నావే గాని, నీ క్షత్రధర్మము చొప్పున నీ విపుడు యుద్ధ మొనర్పవేని నీ కది ధర్మహాని కాదా: అందువలన నీకు పాపము రాదా? సర్వమును సిద్ధపఱచికొని,

రాజ్య కాంక్షతో యుద్ధము సేయవచ్చి పిఱికివై వెనుదీయుదువేని యిప్పుడీ వచ్చిన రాజులందఱును నిను గూర్చి యేమనుకొందురు? నీ కపకీర్తి తెచ్చుకొన గోరిక వొడమె నోయీ! తరువాత నా యవమానాగ్ని భరియింపగలవా? ఈ కనబడుచున్న వారి నందఱిం జూచి, వ్యామోహితుండ వగుచున్నావే గాని నీ విప్పుడు పోయి మఠల కందమూలాదులం దినుచు కాలము బుచ్చ నారంభించినను అంతకాలము సాగగలదు? ఆ జీవనము కలకాలము సాగజాలదని యెఱిగియుంటివేని యేల జనావాసములకు మరలితిరి? యుద్ధమునకేల సిద్ధపడితిరి? వీరందఱును ఈనాటికే చచ్చియున్నారే; నీ వంతమాత్రము నిమిత్తముగా నిలిచియున్నాండవు — కాగలకార్యము నీయొప్పు దనకుం దాన నెరవేరును. కావున నీ వెఱ్ఱి వెఱ్ఱి మాటలాపలనుంచి కార్యరంగమున నురుకుము.

అర్జు:— అట్లయినచో, యుద్ధము చేయవలసినదేనా! ఇది అకార్యము కాదా?

కృష్ణు:— కార్యాకార్యవిచక్షణ నీ కేలనోయి? నీకు సారథియందు విశ్వాసమున్న కదా నీవు సారథి ననుసరింతువు!

ఎవని కర్మఫలము వా డనుభవించుటయు, ఎవని ధర్మము వాఁ డాచరించుటయు విహితములు కావా? ఇక చావుమాట దలంతువా? సంపూర్ణముగ కర్మక్షయమగువఱకును జన్మము పుట్టుచు నుండుట మెయిదాల్పులకెల్ల సాజము.

అర్జు:— అట్లయిన కర్మక్షయ మగు టెట్లు?

కృష్ణు:— బ్రతికియున్నంతకాలమును నరునిఁ బ్రకృతి ప్రేరేపించుచుండును కదా; కావున నాతఁడు కర్మము నొనర్చుచునే యున్నాఁడు. కాని ఫలాపేక్ష లేకుండ, కర్మము నొనర్చుచుండువాని కర్మము క్షయమగుచుండును.

అర్జు:— ఏమి బావా, అట్లంటివి! ఫలాపేక్ష లేని కార్యమెవఁడైన నొనర్చునా? రాజ్యకాంక్షయే నాకు లేకుండిన నే నీయుద్ధమున కేల సంసిద్ధుండను కావలయును?

కృష్ణు:— లోకక్షేమము కాపాడవలసిన క్షత్రియుఁడు, రాజ్యభోగము లనుభవించుటకే జన్మించినాఁ డనుకొనుటవలన కలిగిన ప్రమాద మిది! ప్రజలను ధర్మానువర్తులనుగా చేసి అధర్మము నణగద్రొక్కుటే క్షత్రియునకు విహితకర్మము. అట్టి విహితకర్మము నొనర్చునప్పుడు ఫలాకాంక్ష యెట్టుల సమంజసంబగును? వివేకముగలవారు విహితకర్మ మొనర్చినామను సంతృప్తి నొందుదురు. విహితకర్మానుష్ఠానముకన్న ఫలాకాంక్ష యేమున్నది! విషయానంద ఫలాకాంక్ష ప్రమాదప్రదమగుచుండ, విహితకర్మాచరణము ప్రమోదప్రదమగుచున్నది.

అధర్మముతో లోకము నిండినప్పుడెల్ల వివిధరూపములతో నే నవతరించి,

ధర్మసంస్థాపనము చేయుచుందును. కర్తను నేనే—భోక్తను నేనే; నేనే భగవంతుండను. ప్రపంచమిప్పు డధర్మముతో నిండియుండుటను నిను నిమిత్త మాత్రుఁడుగా నిలువఁబెట్టి అధర్మమును బోఁద్రోలి, ధర్మరాజ్యప్రతిష్ఠాపన మొనర్పఁ దలంచియున్నాను. అందుకు నిమిత్తములగువారి నొకొక్కరి నొకొక్క ఘట్టమున నెంచి కార్యవిధానము నడిపించినాను. ఇపు డీసమయమున నిను నిమిత్తముగా నిలువఁజేసి, కార్యమునడిపించ దలంచినాను. అట్లు చేయుటకు, నీవు మహావీరుండవనియు నీమూలముననే ఇదియంతయు కాఁజాలునని కాఁబోలును దలంచుచు గర్వించుచున్నావు. వ్రిజాత్మయ మిపుడెయి యేతీరవలెను. నీవందుకు నిమిత్తమాత్రుఁడవు: తన్మూలమునఁ గీర్తియు నీ కొసఁగుదును. అంతమాత్రము నీవు నిలచియున్నం జాలును; తక్కినపనియంతయు నే నొనఁగూడఁజేసెద: ఫలముతో, కార్యవిధానముతో, నీకు నిమిత్తము లేదు. కాని క్షత్రియుండవగు నీవు క్షాత్రధర్మముచొప్పున బ్రవర్తింపవేని, నీకు నరకము సిద్ధము ఇంతకును నాయందు నమ్మిక ప్రవర్తించిన వానికి పాపము రాదు: నరకము లేదు: లెమ్మి—యుద్ధమునకు సిద్ధుఁడవు కమ్మి.

అనుచు కృష్ణుఁడు నర్జును గనుదమ్ములఁ దన కరపద్మమున మూసి దెఱచెను.

అర్జునుఁడును శ్రీకృష్ణునివిశ్వరూపము జూచి—'విరాడ్రూపా', యనుచు నెన్నో నుతులొనర్చినాఁడు. విశ్వాసము గుదిరినది.

* * *

మోహాంధకార మడంగుట, విడిచిన ధనుర్బాణము లర్జునుండు మరల ధరియించినాఁడు.—సరి—పటుపోటరియయినాఁడు.

* * *

శంఖారావములు చెవులు చిల్లులువోఁజేయుచున్నవి. నానా సేనాసంకులము, భీకరవీరజనారావములు, దిక్కులు ప్రతిధ్వనించుచున్నవి.

ఇంత భయంకరమగు భండనభూమిని మాటి మనము నిలుపలేము.

వారిపోరాటము వారికే దగును—మన కేల నీగోల!

(సంపూర్ణము)

పరిశిష్టము

సింహావలోకనము.

యాదవకులశేఖరా, పుణ్యకీర్తీ! ఇంతవఱకును నీయందుగాంచిన కార్యక్రమము! నీరాయబారపు కలాపములో నీపని ముగిసినదని యనుకొంటిమి కాని యిపు డిట్టి నిర్ణయములో నీవొక శాస్త్రరూపమున గొప్ప సూత్రముల నిర్వచించి, యాతని యారాటముతోఁ ద్రోలి మానసు గుదుబుచ్చి, యుద్ధమునకు బురికొల్పినావు. ఈ యూహలు నీ నాటకపు యుక్తివిల్లు కేగదా? ఉత్తరాభిమన్యుల వివాహానంతరము తత్సభారంగము 1 సంగమమునాల్లో నారంగముగా నిటు మాధ్యస్థము ద్రుపదునితో చెప్పి, యాతని వాకసము పైగూర్చుండబెట్టి యాతని పురోహితునే మొదటి రాయబారిగ నంపఁజేసినావు. ధార్తరాష్ట్రులకు ద్రుపదునకుఁ బ్రాఁబగ కలదని నీ వెఱుంగుదువు. అట్లెఱింగియు ద్రుపదుపురోహితునే రాయబారిగ నంచినావు. తొలి బ్రాహ్మణునే కురుసభ కనుపుటలోఁగూడ నీకార్యకౌశలము దెల్లమగుచున్నది. కౌరవపాండవులకుఁగల పరస్పరవిరోధములును, కురుపాంచాలములకుఁగల ప్రాఁబగలును బాగుగ నెఱింగినవాఁ డీపురోహితుఁడు. ఏమిచెప్పిపంపిన నంతియ చెప్పక అధికప్రసంగము సేయు స్వభావమువాఁడు. విప్రస్వభావముచేతనే శ్రుతికఠోరంబైన సంభాషణము సేయువాఁడు. తత్సంభాషణవిధానము విని కురువీరులు శౌర్యమునఁ గినిసి దూతుఁడైవచ్చిన బ్రాహ్మణుని నొగులఁజేసిరేని, కౌరవగౌరవము నశించును. బ్రాహ్మణహాని గావించిరని ధార్తరాష్ట్రులను రాష్ట్రంపుఁ బ్రజలెల్ల నిందింతురు. తన్మూలమునఁగూడఁ బాండవులదెస యాశయము సెకురఁగలదు అపుడుప్పుట్టిన సాత్యకిప్రభృతుల మాటనొప్పక నొకదూతను పంపుటే మానియుండేని లోకపుసానుభూతి యింతసంపూర్ణముగా నొడఁగూడదని నీ వెఱుంగకపోలేదు.

కృష్ణా, నీ వక్తృత్వమహిమముంగూర్చి మేము తొలుదొలుతనే పరిముఖమున బరిశీలించియే యుంటిమి. మఱి యావిషయముంగూర్చి యిట దలఁపంబనిలేదు. కాని 2 దుర్యోధనార్జును లేకకార్యార్థులై నిను దర్శింపఁబోయినపుడు దుర్యోధనునకు నీ నారాయణగోపాలురబలము నిచ్చివేసి నీవుగా నర్జునునకు సాయముసేయంబోవునపుడు పరమాప్తుండవయి యుందునని, 3 "నిరాయుధుండనయి, సంగరారంభరహి

(1) రాయబారము 1-12; (2) ... ... 22-26; (3) 27;

తుండనగు నన్నుఁ గోరుకొనుట నీ కేమిప్రయోజనకారి యని యనుకొంటివి?" యని యర్జునుతో నీ వనుటలో నీవు తలంచినది మే మిట్లూహింతుము. "అన్యసహాయముపై నాధారపడకుము; స్వయంసహాయమే బలీయము" ని నీవుపాఠముచెప్పియుందువు. నీవు సాయుధుఁడవై అర్జునునకు సాయ మొనర్తు ననినచో నాతఁడు నీపై నాధారపడి స్వప్రయత్నముల విరమించునని నీవు సంశయించియుండుటే సత్యమైనచో, మహా పరాక్రమశాలియగు అర్జునుఁడు నీ కప్పట్టున నిచ్చిన ప్రత్యుత్తరము చాలదా!

1 "యుద్ధమునకు నేను సహాయము కోరను. సుప్రసిద్ధుండవగు నీవే సమర మొనర్చినచో, యుద్ధమున నే నెంతశ్రమంపడినను పేరును బ్రతిష్ఠయూ నీవియె యగును." అని యాతఁడు నీతో నుడువుట నాశంకకు మఱి తావు లేదు.

అనంతరము జరిగిన సంజయు రాయబారమునంగూర్చి యోచింతుమన్న నందును నీవు జోక్యము కలుగఁజేసికొనకపోలేదు. శుష్కప్రియోక్తులతో, శూన్యహస్తములతో — అది దౌత్యమో రాయబారమో కాని — సెలవు మనిన సంభాషణవిధానమును సంజయుఁడు ధృతరాష్ట్రు హృదయము పరిశీలించినవాఁడగుట నొకతెన్ను పట్టించినాఁడు. సంగరమునఁ దాఁ జాలకకాకున్నను, జనక్షయకారణంబగు యుద్ధము నలనఁ దా వడయు రక్తాన్నము నొల్లనని ధర్మజుని మానసఁపుఁదెన్నెఱింగిన సంజయుండు, యమనందనుని సంగరపరాఙ్ముఖునిగ నొనర్ప 2 నెన్నో యుపపత్తుల వెదకి వేదాంతవాక్యోపదేశమునఁ బాపము తనవిహితకర్మము నివ్వర్తించుకొనినాఁడు. అతఁడైనను 3 "కురురాజునొద్ద నొకరిమాట యింకొకరి కెక్కనివారు పెక్కండ్రు కలరు. అవినీతులును నీతిమంతులును సత్త్వసంపన్నులును దురహంకారులును నై కురుసభనున్నవారి నంతయునం బనిలేదు. * * " అని ధర్మజుతో నని తన దౌత్యము నిర్వర్తించినాఁడు. ఆ ప్రసంగానుసరమున వచ్చిన హేతువాదమున నీకు గోసమును ధర్మజునకు గినుకయు జనించుటను, నీవు సంజయుతోఁ బ్రసంగింపవలసి వచ్చినది. నీ వపుడు ధర్మజుపలుకులను వ్యాఖ్యానము సేయఁబోయి, 4 'పాండవాగ్రజుని పలుకులకిటఁ జూడ, సంధిపొసఁగదు కా యని తోఁచెడిని —' అని సంజయుతో నంటివి. 'అట్లగుట సంధికార్యంబు జయప్రదంబుగ నొనసాగఁజాలదని నే నెఱుంగుదు' నంచువేమో? నీయొఱింగినంతపట్టు ధార్తరాష్ట్రు లిమ్ముమన్నుకాంని సంజయుం డెఱుంగఁడందువా? అట్లాతఁడెఱుంగకుండెనేని,— 5 'దుశ్శీలురగు కౌరవులు

(1) రాయబారము 27; (2) ... ... 67, 70, 75; (3) 63;
(4) ... ... 78; (5) ... ... 70, 94.

మీరుఁ బాలికఁ జెఱఁదలంచిరేని ... .. ' అనియనం బనియేమి? పాండవేయులను ధార్తరాష్ట్రు లిచ్చువారుకారని నీ వెంతయు నెఱుంగుదువో, సంజయుండును నంతియ యెఱుంగు. ఇఁక నీవనునది 1 సంజయోద్బోధితధర్మము నృపధర్మము కాదందువు. 2 బ్రాహ్మణధర్మ మందువు. నీవేమన్నను సంగరము బొసఁగకుండఁ జేయుటే సంజయుని సౌత్య పరమార్థముగా విస్పష్టమైనది. కాని యూతఁడొకటి సేయబోవ నింకొకటి పనుపూసినట్లయినది. కురువీరుల బలాతిరేకముల పాండవేయులకుఁ దెలుపుటచే ధర్మజాదులకు మానసోద్రేకము జనింపఁజేసినాఁడు. అనంతరము గురువీరుల సమక్షమున పాండవుల వీర్యాతిరేకముల గీర్తించి చెప్పుటచే 3 మహామానియగు దుర్యోధనుని యహంకారాగ్నికి శత్రుజనవిగ్రహోద్దీపనాజ్యము నొసఁగుజేసినాఁడు. ఇదియంతయు నప్రయత్నముగనో, అప్రతర్క్యముగనో, గాని జరిగిపోయినది.

ఇఁక నీరాయబారమో బహుముఖమై, భిన్నభిన్నాశయములకుఁ దావైనట్లు ప్రతిపదమందును స్పష్టమగుచున్నది.

సంజయుఁడు ధర్మజుతోఁ బ్రసంగించునపుడ, నీవు ప్రసక్తి కలుగఁజేసుకొన వలసిన యవసరము కలిగినంతనె అప్పటి కాసభను— 4 రాజులను యుద్ధము ధర్మ మగునా కాదా—యను ప్రశ్న ముట్టినమీఁద—ధర్మజుఁ డందించినమీఁద నెట్లగుఁగాక— నీవందుకొని సంజయునితోఁ బ్రసంగింపుమనఁ దుదకు 5 ఇతఁడొప్పినను, ఒప్పకున్నను నేనీపని కటుపు స్వయముగ వచ్చితిని. ... ... ' అనియంటివి. అప్పటి కింకను బాండవాగ్రజుండు నిను గౌరవసభకనుపు నూహసేయకున్నను, నీ చివరమాటలతో ధర్మజున కట్టియూహ నొసంగినావు. నీవే 6 స్వయముగఁ గౌరవసభ కేగుదునని నంతనె ధర్మజునకు మఱింత పన్ను దొరికినది. మఱియు నప్పట్టున నినుగాక వేఱొకని నాతఁడెట్లా కురుసభ కనుప సాహసింపఁగలఁడు!

సంజయుండు మఱలిన మరుదినమునఁ బాండవేయులు నినువర్కించి, కౌరవ సభకు నినుబుత్తెంచు నవసరమున ధర్మజాదు లొక్కొక్కరె నీతోఁబలికిన పలుకులు నీవు చక్కఁగ గుర్తించితివి. వారివారి మనోవాసనల సంపూర్ణముగ గ్రహించితివి. కాని నిను జక్కఁగ నెఱుంగుట కాకొంతే యగ్రజున కేమాత్రమేని వశమయియుండ వలయునే కాని, తక్కొరు నినుగ్రహియింపనట్లు కానరాదు.

ఎట్లేని సంగ్రామంబుకాని తెఱంగున గార్యసిద్ధియొనర్చుకొని రమ్మని ధర్మ

(1) (2) రాయబారము 73; (3) 141-17౧;
(4) ... ... 73; (5) ... ... 84; (6) 83;

జుండు నినుగోరుచుండ, నీవాతనితోఁ గౌరవుల దుర్ణయంబులు చెప్పిచెప్పి-1 ‘ధార్త రాష్ట్రులిచ్చువారుకారు. సంగరముకాకతప్పదు’ — అని నిశ్చయించియే వెడలితివి. అట్లగుటనెకదా, సంగరముతప్పదని నిశ్చయించిన నీయట్టిఁడు సంధివాక్యమ్ములు చెప్పఁబోరాదని పెక్కుండ్రనుటకుఁ గతంబయ్యె. ఇంతకును సంధికిఁబోవుచున్న నిను భీమసేనాదులు సంశయింపకపోలేదే! 2 ‘ఏవిధముననైన నీవు సంధియె సమకూర్ప వలయు. అదియే మాకును వారికిని లోకమువారికిని సౌఖ్యావహంబగుట హితమగును’ అని వృకోదరుండు నీతోనన నీవాతనికిఁ గౌరవులదుర్ణయంబులు చెప్పి యాతని 3 నుద్రేకింపఁజేసిన పలుకులలో నీయూహలపోకడ బయల్పడకపోలేదే! 4 ధర్మజుఁడు సంధిజేసుకొనిరమ్మని నిను బుత్తెంచుట నట్లు కావించిరమ్మని నిన్నర్జునుండు సంభావింప నాతని కీవుధర్మోపదేశమొనర్చి, 5 ‘హేతువాదములఁ జెప్పి, విరాటుపసలం జెట్టింప నర్జునుండువోయినప్పుడు భీష్ముండు దుర్యోధనునితోఁ జెప్పినతెఱంగును, దానికతం డుత్తరంబిచ్చినపోడిమియు, నీవు మఱలమఱలఁ గొరించుచు, మందెమేలములఁ బలికితివి. అమాయికుండని యెంచి కావలయు నకులుపలుకులకుఁ బ్రత్యుత్తరం బిచ్చినావు కావు: సహదేవుని సహజసాహసత్వంబుదెలుపు నాతనిపలుకులు నీమదికెక్కుటంగావలయు నూరకుంటివి. అట్లయ్యును నీమనమున నానందించియుండకపోవు!

ఇఁకమిగిలినది కృష్ణ: నామధేయసామ్యమున మీయిరువురు నొక్కటి యగుట యుచితంబయ్యె. ‘పంచిపెద్దల నడియఁజాలక, గాలిత్రేలనే మనసు గల్గుచునున్నదనిన ద్రోవది వీడిడియై యాడినపలుకులకు నీ వామె నూఱడిలఁజేయఁ బలికినపట్టున, శత్రుసంహార మగుననియు, 6 నీయేడ్పుకొలందియు కురునృపాలపుత్ర కళత్రంబులయేడ్పు లగుననియుఁ బల్కి 7 “ఆజ్వాలపుణ్యలక్ష్మీసమేతులైన పాండు కుమారులు రిపుక్షయంబునేసి అధికవైభవోపేతులగుట నీవు చూచెదవు: తడవులేదు. ఇది నిజంబు” అని యంటివి. ఇట్లు జరుగుటే నీయుద్దేశమని కొందరును, నీవనినట్లే జరుగుటచే నేదిజరుగకతప్పదో, అదియే మున్ముందుగ దెలిసికొని మఱియు నంటివని కొందరును బలుకుచుందురు. కాని యెవరేమన్నను, నీవుమాత్ర మిట్లెన్నిఘట్టములనో స్పష్టముగనే నీమనోగతవిషయమును విశదీకరించితివి. ఇట్టిపట్టుల నన్నింటి నెత్తి చూచినచో, యుద్ధమే నీకభిమతమా యను సంశయముమాత్రము జనింపకమానదు.

పిమ్మట నీవు కరినగరముఁజేరఁబోయినది మొదలు కర్ణుని నీతోఁ దోడ్కొని

---

(1) రాయబారము 193-196; (2) ... ... 197; (3) 196;
(4) ... ... 199; (5) ... ... 196; (6) ... ... 205; (7) ... 206

వచ్చి యాతనితో మాటలాడి, యాతనినొడిపించినదాఁక, నీవు నడిపించినవిధాన మఱచిన నీపోకడ డిల్లము కాకపోదు. అదు గడుగునకును నీవు ధర్మసూక్ష్మముల నరయువాఁడవు గదాయని మదిం దలంకవలసివచ్చుచున్నదే కాని, కానిచో చెప్ప తగినది లేకపోలేదు. నీవు హస్తినయందుండఁగనె, నీవు కరినగరము వచ్చుచున్నావు కదాయని, నిను సంభావనసేయు దలంపున, ధృతరాష్ట్రసుతుఁడు నీకుఁ బ్రీతి నొసఁగిన కజ్జంబులును, బస్సులు లోనుగాఁగల వాని నెల్ల (1) నేస్తు వనుభవించిన విధంబు నెఱిఁగి యనుభవింప నొల్లనంటివఁట యెంత మెలఁకువతో నుంటివి! సంధిసంధానము దుర్యోధను నావాసంబున కేగినపు డాతఁడు నిను బంధుఁగాఁగోర (2) నీను పలికినపలుకుల యందేమి భావముంచితివి! నీకుఁ బ్రియులైన పాండవుల కాతఁడు వైరియగుట, నీకును వైరియగుననియు, వైరియింట కుడువరానిదనియు, మాకునకుఁ దోలిగుడువను, గట్టను, వైకొనవలెనని నొప్పిని, యింక నన్ని కొలఁదినాయుధుల నెగడఁజేసి నీవు పాండవపక్షపాతివని నీయందు దనివలికే దుర్యోధనుఁడు పొందియున్న (3) పీడనెంపు మాటంతో హెచ్చిపలికితివి. మాటమాటికిని, పాండవులయెడ దుర్యోధ నాదులకుఁగల యలుకను బలపఱచు పలుకులే పలికితివి. నీవు కరినగరముఁ జేరిన పిదప దుర్యోధనునితో ముఖాముఖిగాఁ దోసిపలుకులే విరసములయ్యెఁగదా! అది మొదలుగ దుర్యోధనునకు నీయెడ ననాదరభావము కలిగెనను టయందసత్యమే మున్నది! నిన్నాదరించి నిను బహూకరించి, నీయెడ బంధుప్రీతి నెఱపఁజేయఁ దలంచిన దుర్యోధనుని యుత్సాహంబునకు భంగంబు వాటిలఁజేయుటతో నాగక నీయెడ నాతఁడు విద్వేషమువహించుచు తేన్నె దేస్పతివి. ఇఁక కాకున్న దుర్యో ధనుఁ డసురసంప్రదాయముగలవాఁడగుట నాతని కన్నియు నట్లే తోఁచుచుండునని సమర్థింతువేమో! అట్లయిననో, ధార్తరాష్ట్రులొసంగువారు కారని దుర్మార్గులని రోజెంగియు నేల నీసురుపతికడ కటు దెంచితివి! ఇంకను నీసమాధానమును మే మెఱుంగుదుములే! చేయఁదగిన విహితకర్మ మాచరించుటయును, దత్ఫలముపై నాసక్తి నొందకుండుటయును, మానవుని కర్మవిధానమని యనుటకు నీ వేమాత్రమును గొంకవనియు మే మెఱుంగుదుములే! నీయనుసంధానప్రయత్నమున సంధి కాకున్నను సంధిమాట నా సుయోధనుఁడు వినినను, వినకున్నను, మనస్సు నిశ్చింతమగుననియును, జనులందఱును బాండవుల సేమమె కోరుదురనియు, దుర్యోధనాదుల నిందింతురనియు సామంతనృపాలురు పాండవులయెడ ననుకంపవహింతురనియు, శత్రురాజుల బలా

---

(1) రాయబారము 213; (2) ... ... 221-222; (3) 223;

బలసంపదఁ జూడవచ్చుననియు, ధర్మజుమానసమున నెలకొనియున్న యనుమానముఁ దీర్పవచ్చుననియుఁ, గురువృద్ధులును, ఆచార్యవర్గమును, పాండవులనె సంభావించున ట్లొనర్పవచ్చు ననియుంగూడ నెంచి సంధికార్యమునకని పోయియుందువు. నీవుగా సొచ్చి చెప్పకున్న లోకమువారలు నిను నిందింతురో కా యనితలంచి పోతివి. అనుసంధింపంబడినచో, సంధియే కావలెనని తలంచి, కురుసభం జేరియుందువు. నీవు కరినగరుం జేరిన తొలిరేయి కుడిచికూర్చుండి విదురుతో నిష్టాగోష్ఠిం బచరించుచు నీచెప్పిన దేమి? 1 నీయభిప్రాయ మెఱుంగగోరిన మాకు నీవు ధర్మజునితో నెఱపిన సంభాషణవిధానము చాలును; 2 విదురునితో నీపనినవి చాలును; ఇంకను మే మెఱుంగగోరుదు మేని: ధృతరాష్ట్రునితో నీవు పలుకుచు దుర్యోధనుఁ డటనుండగనే, అతనింజూచుచు 3 "—సుయోధనాదులకు—వీరలు" అని సుయోధనుంజూపుచు 'సధర్ములును, సమర్థులును గారనియు, నింకెన్నెన్నియో, నిందావాక్యము లానిండిన సభలో నాడి వారిని జిన్నఁబుచ్చితివి. సుయోధనుని వైరులగు పాండవుల, నందు నను 4 భీమసేనుం బొగడుచు సుయోధనుం దెగడితివి. వైరిజనవిక్రమంబాతఁడు విన సహించు ననియెంచియే యంతాడితివా? భీమాదులబాహుపరాక్రమం బుగ్గడించి నీవు దుర్యోధనుని బెదరఁగొట్టఁదలంచియే యుండినచో, నదియెల్ల దుర్యోధను నీర్ష్యా గుణమును వృద్ధిపరచుటకే యయినదికాని మఱి సంధికూర్చుటకు పనికివచ్చినదికాదు. ఇదియంతయుఁజూచిన నీవు సంధికాకుండుటకే ప్రయత్నించితివనుటకు వీలగుచున్నది.

సుయోధను నీయంతరంగికకన్న నాతని కన్నతల్లియగు 5 గాంధారియు నాతని గురుండగు 6 బలరాముండును, నాతని నెఱుంగకపోలేదు. అంతే యెఱుంగక కాదు ఉత్తరాభిమన్యుల వివాహానంతరమున దద్వివాహమంటపమునఁ జేరిన రాజులకూటమిని దుర్యోధనుకడకు మాతనంపుమాట నడిచినయప్పుడు, ఆదూత కురుసభను నెఱపవలసిన సంభాషణవిధానముపట్ల బలరాముండు 7 "కౌరవేంద్రుని చిత్తవృత్తిం గనిపెట్టి విధేయుఁడై, వారిమనంబులు వీరిపైఁ బ్రాలునట్లు చేయు ప్రసంగంబులు నెఱపి......" అనియనుటకుఁ గారణము. 8 దుర్యోధనుం దూరక సవిశేషస్నేహబాంధవముల నెఱపి కార్యంబు సక్కనేసికొనవలయునని బలరాముండనుటకుఁ గారణంబు దుర్యోధనుని మహామానిగఁ జక్కఁగ నెఱింగియుంటయే. అటుకాదనియు, రాజ్యమునందు స్వత్వముగల మీరలు దుర్యోధనుకడ నింత క్రిందగుటేల ననియు, నప్పటి కాసభం

(1) రాయబారము 194-195; (2) ... ... 226; (3) 235:
(4) ... ... 240; (5) ...... 263-269: (6), (7), (8) ...... 7.

జేసియున్న పెక్కండ్రు నేకిరి. మృదుసంభాషణములవలనఁ దన యసమర్థతయే బయల్పడునని యెంచిరేకాని, కార్యసాధనము మఱియంచినారు కారు. బలరాముని మాట యవలఁద్రోసినారు; ద్రుపదపురోహితుని నుపతికడ కనిపినారు. ఆతఁ డెప్పుడెట్లు దౌత్యమొనర్చినాఁడో కాని 1 బ్రాహ్మణుఁడనుటచేఁ బ్రతికిపోయినాఁడు. అనంతరము కౌరవసభను దౌత్యమొనరింపవచ్చిన నీవును, ఆ 2 కలిబీజములనె బలపఱచినావే కాని, దుర్యోధనుని మనోవాసనల నెఱింగియు మంచి సముచితమార్గము పట్టినావుకావు. కన్నతల్లియగు గాంధారియైనను దుర్యోధనుని మనోవాసన నెఱుంగక పోయెనని యనుకొన వీలులేదు. 3 "శత్రుబలోత్సాహమున దుర్యోధనుని జకితునిఁ జేయఁ బ్రయత్నించుట ప్రయోజనకారి కాఁజాలకుండుటయే కాదు, ప్రమాదప్రదమై నిల్వఁటిలఁగల" దని గాంధారి నుడివినట్లు గ్రహించినవారేని మాత్రము దుర్యోధనుని మానసపుఁ దెన్నెఱుంగఁజాలరు! అట్లగుట గాంధారీ బలరాములె దుర్యోధనుని జక్కఁగ గుర్తించినవారయియున్నను, వారింపు పనిసేయుట కనువుపడినది కాదు. నీ వీకురుపాండవ వివాదమునఁ జేయిఁ జేసికొనినదాదిగ నినుఁ జక్కఁగ గుర్తించిరే. బలరాముండే పక్షమును వహింపనొల్లక, తాటస్థ్యమూనియుండెను. దుర్యోధనుండు రణసాహాయ్యముకొఱకుఁ బోవుచు బలరాముని నర్థింప, నాతఁడు దుర్యోధనుతో— 4 "కృష్ణుని బాసి యే నొక్కనిముసము నుండఁజాలమియు, నాతనితో విరసంపుమాటలు పలుకఁజాలమియు నేనేమియు ననఁజాలక......... యేపక్షమును వహింపనైతి నని యనియెనే!" అట్లగుట దుర్యోధను నెఱింగిన గాంధారీబలరాములు జక్కని యూహలనే పొందియుండిరనవలసి వచ్చుచున్నది. అట్లగుటను దుర్యోధనుని నీవు పోల్చుకొనఁజాలనంటివను నూహ మాకులేదు. గాంధారీబలరాములాదుర్యోధను తెన్నెఱుంగినవారగుట, సంధికార్య మొనఁగూడు విధానముఁ దా మవలంబించి, యొకరుల నవలంబింపు మనిరి. వారికన్న మున్నె దుర్యోధనుమార్గం బెఱింగినవాఁడవగుట నీ వేమార్గ మవలంబించిన నాతఁడు సంధికి కొనమికిఁ దోఁడు, మఱింత చెలరేఁగి, కార్యభగ్నంబానకే దోహదంబగునో, అట్టి మార్గమునే అవలంబించితివి. సంధికిఁబోయినవానికి వలయు కార్యకౌశలము నీవు కురుసభం జూపలేదనువారికి, 'కాఁదగిన కార్యమునకు వలయు కార్యకౌశలమే చూపితి' నని నీవు బ్రత్యుత్తరం బొసంగ సంసిద్ధుండవె యగుదువు. ఏపద్యనపానేము తంష

(1) రాయబారము 191; (2) ... ... 1-16; (3) ... 253; (4) ... 33.

కొదవు నయ్యెదియొ రాఁదగినదనియు, విహితకార్య మొనర్చుటేగాని ఫలముతో నిమిత్తము లేదనియు, తత్పర్యవసానముం గూర్చి యూరాడరాదనియు నుడువఁ గొంకని నీవు, కురుసభకు నిను ధర్మజుం డనుపు సమయాన నీతో నర్జునుండు, —1 ఫలసిద్ధి నొనగూర్పం దగు దైవమగు నీవే పురుషుండవై సంధి సేయ ప్రయత్న మొనరించుచుండఁ గార్యము ఫలసిద్ధిం బడయకుండునే—" అనియు,—'కావని నట్లె యుండియుఁ గార్యంబులు ఫలసిద్ధిగాంచుచుండుట మే మెఱుంగమే' —'నీ వొనరింపఁ బూనిన పనిని గీడు పుట్టునే!'—యనియు నీతోనన, నీవది యెంత సమయస్ఫూర్తికల ప్రతిభాశాలివో కాని, చప్పున నాతని పలుకుల మరలింపం బోయి కావలయు 2 'దైవ సహాయంబు లేనికార్యంబులు ఫలవంతంబులు కాఁజాలవు.' —— అని పలికితివి. —3 అప్పటి తెరం గెఱంగివత్తు నంటివి. దైవముచేత యెట్లగునో దాని నెఱుంగ— నంటివి. ఇట్లనుటయందును నీయూహలన్నియు సంగరపుఁదెన్నునె సూచించుచున్నవి. అది కాదందువేని, 4 "సహాయార్థము రాజులనెల్ల రావించి చివరను మమ్మును బిలువఁబంపుడు—" అని తొలిసంగరసమాలోచన సభయందుఁ బల్కి వెడలఁ గతం బేమి? అనంతర మీరాయబారము నెఱపవచ్చుచు, ధర్మజునానఁ బ్రయాణోన్ముఖుండవగుచు, 5 "—కావున యుద్ధంబు సిద్ధంబు: ... ...నీ వనుత్సాహివి కావలదు. చతురంగబలంబుల నాయితంబు గావించుకొని, దొరలం బురికొల్పికొని, ఆలస్యంబులేక సంగరంబునకు సన్నాహంబు సేయుచుండవలయు—" నని చివర మాటలాడి, నీమనోనిశ్చయంబు నెలఁవరచినావు. అట్లగుట నీ పడుగడుగునకును యుద్ధమె సూచించినావా? సన్నద్ధపఱచినావా? పాండవులను యుద్ధానకె సన్నద్ధము కమ్మనినావు. సంధికిఁ బోవువాని కట్టిమనోనిశ్చయముండరాదను వారిమాటకేమి కాని, సుయోధనుచందమెఱియ నీసంధికార్యము బొనుపడకున్నఁ బొనుపడకుండుఁగాక, కాని నీ ప్రసంగఘణితియు, నీ వాగ్ఝరీపరికారంబును యుద్ధమునకే తగియుండెను; గాని, సంధినేత కనుగుణమయియుండ లేదు. కానిచోఁ దుష్టతుదకు కుంతిని దొలి దర్శించబోయినపుడు నీచెప్పినమాటల కర్థమేమి? 6 "శత్రుకులోత్పాటన విధియాచగించి యున్నత రాజ్యాభిషేకోత్సవమందెదు వారిని నీ వనతికాలముననె మీ జెనకుతుకమ్మునఁ జూతువుగాక!—" అని నీవా కుంతితో ననలేవా! ఇట్లెంత

(1) రాయబారము 193; (2), (3) ... 200; (4) ... 12;
(5) ... 196; (6) ... 218.

కని నీయెడ దోసములెన్నుట యని పలంతువన్న, నీయన్నయా బలదేవుండె నిను 'ద్రోషి' యనినాడని మాపాఠకులనుటకు సిద్ధముగనున్నారు. నీస్వజనులె నినుగూర్చి చెప్పునప్పుడు 1 "ఇరువాగులవారిం జెగ్పునని నే నెంత చెప్పినను, గృష్ణుండు నను వినండయ్యె. పలుకుపొం దెఱుంగనివారికి బూజావాక్యముల ననవయాములఁ దెలిపి సంధిసేతమని యలిగి యేమని మగిడివచ్చినాఁడు మాకృష్ణుఁడు!" అని బలరాముండనుచుండ, యిఁక మేమె ట్లూరకుండగలము!

కాని యొకవిశేష మీబలరామువాక్యమున నే విస్పష్టముగ గానవచ్చుచున్నది. ఆబలదేవుఁడే అదేసట్టమున, 2"ఇంతకును మాకృష్ణున కెఱుకలేని ధర్మసూక్ష్మములు నాకుమాత్ర మెఱుంగనగునా!" అని యనినాడు. అట్లనుట నాధర్మసూక్ష్మముల నీకార్యములందిమిడియున్న అంతసూత్రముల మేము బరీక్షింపబ్రయత్నింతుము గాక. ఎంతయో శ్రమంపడి సంపూర్ణప్రయత్నమొనర్చినయనంతరముంగూడ సంధియనువుపడకున్న మాలిమి సేయవలయు ననుమాటగూడ ముందే నిశ్చయింతువు నీవు: నీయన్నకు రెండవపక్షము చక్షుగోచరమే కాదు. కృష్ణా, సంధికుదిరిపోవునేమో యను ననుమానమున, సంధి యనుసంధింపబడకుండుగాక యని, నీవెంతో పోరాడితివనియును ననువారికెంతో ప్రబలసాక్ష్యమున్నదనుచున్నారుగో, సంధియే జరుగవలెననియు, తత్ప్రయత్నములే నడిపించితివనియు, ప్రకృతిదుర్లలితుల, వంచకుల, నొకద్రోవకుఁ దేఁ బ్రయత్నించుచు నెఱపు సంధికుదురకున్న నేమిజరుగవలెనో అదియు నీవెఱింగియుంట, నిట్లు కార్యక్రమము నడచినది యని యనుటకును నంతప్రబలసాక్ష్యమున్నది.

సంధిజరుగవలెనని, పాండవపక్షముననున్న నీశక్తిసామర్థ్యములు దెలుపఁగోరియో, దుర్యోధను బంధనకార్యమునకు నీవు లొంగిపోయినచో, ధర్మజాదుల కపకీర్తియు, నీయసమర్థతబయల్పడుటయు దటస్థించుననని యెంచితివో, గాని నీవపుడట విశ్వరూపముఁ జూపుట సమంజసమును అప్రతర్క్యమును సంధిప్రయత్నములలో నిదియును ఒకరీతిని బలపరచునదే యగుచున్నది. అట్లే నీవు కర్ణుని కౌరవపక్షమునుండి చీల్చి పాండవపక్షమునకు రమ్మనియుంటివని యందుము. కాదందురేని, కర్ణునకు పాండవపక్షముననున్న ద్వేషోద్రేకదర్పిష్ఠిమను సడలించుటకే యగునందుము. ఇందు కేమందువు?

ధార్తరాష్ట్రహస్తగతమైన పాండునిరాజ్యభాగమును దానిని, మఱల సము

(1) రాయబారము 327; (2) 328;

పార్జించి పాండవుల కంటఁజేయు ప్రయత్నమున నీకన్న, పాండవులయధీనమందున్న రాజ్యభాగము కౌరవుల కిప్పించుటలో శకునియే మిన్నయనిపించినాఁడనుచున్నారు. వంచనమార్గమున నెయగుగాక, మణులమణుల దగవులు మొలకలెత్తిన నెత్తుగాక, గాని జీవహింసకాకుండ కార్యమొనర్చినాఁడు శకుని. నీవో, జీవహింసయగుటయు నసుర సంప్రదాయకులను, వంచకులను మఱికానరాకుండ జేయుటయు, దాయభాగపు దగవులు మఱి జాతముకాకుండ జేయుటయు, నెగడఁజేసినావు.

తుట్టతుదకు యుద్ధప్రారంభసమయమున నర్జునుండు దనకుఁ జేయాడదనియు, యుద్ధముసేయఁజాల ననియు ననినప్పుడు సైతము యుద్ధము నెఱపించునేర్పునదె, నీవు గీతోపదేశ మొనర్చినానని నీయం దొక భారము మోపఁబడినదిసుమా; కాని కొన్ని వైదికకార్యములలో అలౌకిక కారణములలో కనపరచి లౌకికకార్యము లొనర్పఁజేసినావు. అట్లే లోకమున నంపరుపెద్దలును-ఈకార్య మొనర్పకున్న నరకముప్రాప్తించు-ననియు, -పాపమావహిలు- ననియు, జెప్పియే విహితకార్యము లొనర్పఁజేయుచున్నారు. అందు కొన్ని కొందరకును, మఱికొన్ని మఱికొందరకును బాధకములో సాధకములో అగుచునేయుండును. అట్లే అర్జును విషాదయోగము, అప్పటికార్యమును, కాలమును, పరిస్థితులును నీవును దర్శించుకొని యికకాకతప్పదనియు అయితీరవలెననియు నీకుఁదోచినది అర్జునునకు బోధించి అట్లా సమరమునొనర్పఁజేసినావు. ఇది నీవుమాత్ర మెట్లుకాదనగలవు? నీవప్పు డర్జునున కాయుపదేశ మొనర్పకుంటేని, ఆతఁడప్పు డాహవరంగమున కుఱుకఁజాలఁడు. మఱల నుపప్లావ్యమునకు మఱలును.—కాని యనంతరమాదరిద్రావస్థలో నుండజాలఁడు. సాటిరాజులలో దలవంపు ఘటిల్లును. కౌరవులయెడ దనమునమున నున్న నమ్మకత్విక మ్మత్లై నిలచియె యుండును. మరల రేగును. అపుడాతనికిఁ దెన్నుగానరాదు. దుఃఖమునకుఁ గారణమగును. అట్టిపరిస్థితు లేర్పడనీయకుండఁ గాపాడుటే నీ ముఖ్యోద్దేశమగుట నెట్టి తెగింపుమాటలచేతనైనను, నీ వర్జునున కేమిబోధించినను, యెట్లు బోధించినను, అదియును సమయజ్ఞతయే యగును.

నీవు స్వార్థపరుండవయి పాండవులకు సాయమొసంగ బూనితివని యనుచున్నారు. నీయందు స్వార్థపరత యను దోసము నెన్నుచున్నారు. స్వార్థము కానిదిలేదు; స్వార్థములేనివాఁడీయిల మనఁజాలఁడు. స్వార్థముతోఁ బ్రారంభింపబడనిది పరార్థమును జూపఁజాలము. స్వార్థపరార్థముల వ్యత్యాసములును, ప్రయో

జనములును, దౌత్యము ముగించుకొని, 1 ఉపప్లావ్యమునుండి కరిపురికి మరలుచుండిన సంజయుఁడు మార్గమధ్యమున వేగువానితో నెఱపినసంభాషణమున మే మెఱింగితిమి. అనంతరము ధృతరాష్ట్రునకు విదురుఁడు 2 నీతులుగఱపు తెఱవునంగూడ నీ స్వార్థమునుగూర్చిన ప్రసంగమును దెలిసికొనియుంటిమి.

ఆపన్నమయమున నున్నవానిం జూచినయంతన మనసుగరఁగి, యాతని నాయాపదనుండి విముక్తుం జేయు నంతవఱకు మాకు మనసు బాధించుచునే యుండును. ఆతఁడుద్ధరింపఁబడిన తక్షణమె మామనసులు తేలికయయి యుత్సాహపూరితములగుచుండును. కావున నాపన్నుల నుద్ధరించుట యను కార్యము మా మనసున కుత్పన్నంబైన బాధనడంచుకొనుట యను స్వార్థపరతను సూచించుచునే యున్నది కాని యిట్టి స్వార్థపరత లోకకల్యాణప్రదమని, ఆర్యులు నిర్ణయించియే యుండుట, కృష్ణా, నీయందున్నదన్న స్వార్థపరత్వము లోకకల్యాణప్రదమైనదగుట, సర్వజనసమాదరణీయమును, చిరస్మరణీయమును అగుచున్నది. ఇట్టి దృష్టిగల స్వార్థపరత్వము లోకమున నెల్లకాలములందును వాంఛనీయమే యగుచున్నది.

పద్మమున జనియించుటో, పాలవెల్లిలో శయనించుటో, కానరానిస్వర్గప్రదేశమున గాపురముండుటో, ప్రకృతినున్న విశేషముల బానసీనాటకపు తెరలవలె మాటిమాటికి నిట్టె మార్చివేయుచుండుటో సేయక, మాలో నొకఁడవుగా మాతృగర్భమునం జనియించి, పెరిగి పెద్దవాఁడవయి, అవంతీపురమున సాందీపునొద్ద నీవును సుచేలుండును, విద్యాభ్యాసము జేసినది మొదలు నీవు సకలకళావిశారదుండవయి, అఖిలవిద్యాజాలసంవేదివయి సాందీపునొద్ద సెలవుగైకొని మగిడి స్వస్థానముం జేరినది మొదలు కంస నరక శిశుపాల దంతవక్త్ర జరాసంధ కాలయవనాదుల వధియింప నెఱపిన విధానములును, అందొకొక్కొక్క ఘట్టమున నీవు చూపినబుద్ధికుశలతయు మేము బరిశీలించి చూచియేయున్నాము.

వాసుదేవనామంబున నీవు భరతఖండంబున నపారమగు గీర్తి ప్రతిష్ఠల నార్జించుచుండుటగాంచి, సహింపలేక కరవీరపురాధీశుండును, పౌండ్రకనాయకుండును, పవిత్రమగునీనామమును ధరియించి యనిపించ వికారమును నప్రస్తుతమును నగు *రాయబారము లోకమెఱుంగకపోలేదే! అంతమాత్రమున హారధిసులుకాలేదే! నీవు క్రిందువడుటయు లేదే! కాని తుద కాస్సృగాలవాసుదేవుండును బౌండ్రకవాసుదేవుం

(1) రాయబారము 96; (2) ... ... 120-121.

* ఉత్తరహరివంశము—నాచనసోమన.

దును జేరైనలేకమాసిపోలేదా! అట్లు సామ్యముగలనామముల ధరియించి లోకమును మోసపుచ్చదలంచిన వంచకుల నడంచుపట్ల నీనేర్పును బరిశీలించియేయున్నారము.

ఇట్లన్నిపట్టుల నీ విశేష శేముషీసనాథుండ వగుటచేతను, శత్రుజనములబారి నుండి దొలంగి సురక్షితముగా నుండుకొరకు ద్వారకకు రాజధానిని మార్పించుటయు లోనుగాగల రాజ్యతంత్రజ్ఞుల కుండవలసిన సుగుణసంపత్తియు, విద్యావైశద్యమును, మంత్రాంగవేత్తల కుండదగిన బుద్ధికుశలతయు నీయందు బొడసూపుటచేతను, ఆదర్శ పురుషులగు శ్రీరామాదులవలె, నీవును ఆదర్శములఁ జెడనీయకుండ, వారినుండి భిన్నుండవయి బలక్షమాగుణములకు నడిమిమార్గమున ధర్మసూక్ష్మముల నెంచి చూపుచు, సంఘములో నపరాధములొనర్చు వంచకులనందఱ క్షమించినచో సమాజ మొక్కసారి ధ్వంసమయిపోవుననియు, సకలాపరాధులును శిక్షితులైనచో మానవ కోటికిఁ బశుత్వమే ప్రాప్తించుననియు, నట్లగుట శిక్షాక్షమలమర్మ మెఱింగి తత్సామంజస్యమే ప్రధానమని ఆదర్శము, ఆచరణము.—నను నీరెంటికింగల అన్యోన్య సంబంధముం దెలుపు నెన్నో యుదాహరణములు నీ ప్రవర్తనమం దిమిడియుండుట చేతను, ఒక వైదికాచారమో కారణమో, చూపుచు, ఒక లౌకిక కార్యమొనర్పఁజేయుచుండుట యందు నీకుగల మహామహిమయుఁ జూచిజూచి, యింతవరకును నీతోఁ బ్రసంగించి, ప్రశంసించిన మేమును మాపాఠకులును, జాలయాయాసము నొందినాము. ఇప్పటి కింతతో సెలవుఁగైకొని, యెంత తరచిచూచినను తనివితీరక యింకను మిగిలిపోవుచునేయున్న నీచరిత్రయే యొకగ్రంథముగా బ్రకటించి సఫలీకృతమనోరథుల మయి తరియించి మాపాఠకుల యామోదము నడసెదము.

ఓం తత్సత్.

ఉపసంహారము

(ముండపాక పార్వతీశ్వరశాస్త్రి)

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం॥
పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే॥
కర్మణా మనసా వాచా సర్వభూతేషు సర్వదా
అక్లేశసృతిర్యా ప్రోక్తా త్వహింసా పరమర్షిభిః ॥
అహింసా పరమోధర్మో నాస్త్యహింసా పరంతపః
విధినాసా భవేద్ధింసా త్వహింసైవ ప్రకీర్తితా॥
పరద్రవ్యాపహరణం చౌర్యాద్వాథబలేనవా
స్తేయం తస్యానాచరణ మస్తేయం ధర్మసాధనం॥
కర్మణా మనసా వాచా, సర్వభూతేషు సర్వదా
అక్లేశసృతిర్యా ప్రోక్తా త్వహింసా పరమర్షిభిః॥
పరద్రవ్యాపహరణం చౌర్యాద్వాథబలేన వా,
స్తేయం తస్యానాచరణ మస్తేయం ధర్మసాధనం॥

జన్మమెత్తినదాదిగ మనుష్యుఁడు సంపాదింపఁ దలఁచుకొను వానిలో ప్రధానమైనది యానందము.

ఆ యానంద సంపాదనమునకై మనుష్యుఁడు రెండుమార్గము లనుసరించుచుండును. అందు మొదటిది హింసామార్గము. రెండవది యహింసామార్గము. ఈ హింసామార్గమునకే స్తేయమార్గమనియు, నహింసామార్గమునకే యస్తేయమార్గమనియు, నామాంతరములు. చౌర్యమువలనగాని, బలమువలనగాని, పరద్రవ్యాపహరణము సేయుట స్తేయము. ఈమార్గము ననుసరించి లోకమును నాక్రమించుకొనువా రాసురసంపత్తిగలవారు. హిరణ్యకశిపు, రావణ ప్రముఖులీగణములోఁ జేరినవారు.

సర్వభూతములయందును, సర్వకాలములందును, క్లేశరహిత వృత్తితోఁ బ్రవర్తించుట యహింసామార్గము. ఈ మార్గమునఁ బ్రవర్తించువారు దైవసంపత్తిగలవారు. ప్రహ్లాద, వశిష్ఠ, జమదగ్ని, శమీక ప్రభృతు లీగణములోఁ జేరినవారు. అసురసంపత్తిగల వారీమూఁడులోకముల నాక్రమించుకొనఁగలరు గాని, వారియధికారము లోకమునకు బాధకలిగించును గావున, వారిని లోకము చాల కాలము భరింపలేదు.

దైవసంపత్తిగలిగి, యహింసామార్గమునఁ బ్రవర్తించువారిని లోకము ప్రేమించుచుండునుగాని, వారు సాత్త్వికప్రవృత్తియే ప్రధాన వృత్తిగాఁగలవారగుటచే, రాజసతామసప్రవృత్తులతో నిండియుండు నీలోకము వారి మహత్త్వము గ్రహింపలేదు. కావుననే, బ్రహ్మర్షులగువా రరణ్యములలో నాశ్రమములు కల్పించుకొని, జ్ఞానయోగము నవలంబించి, ముక్తి చెందుచుండిరి.

అసురసంపత్తిగలవారిది కేవల కర్మమార్గము. దైవసంపత్తి గలవారిది కేవల జ్ఞానమార్గము. పర్యవసానమున నీరెండుమార్గము లును లోకమునకుఁ బనికిరావనియే చెప్పవలెను. కావున, నీరెంటు మార్గములకును మధ్యమార్గ మొకటికలదు. అది భక్తిమార్గము. ఈశ్వరార్పణబుద్ధితో కర్మమునాచరించుట దీనియందు ప్రధానము. ఈశ్వరార్పణబుద్ధితో మనుష్యుఁడుచేయు ప్రతికార్యమును లోక కళ్యాణప్రదమగుచుండును. గాన, నీమార్గమున,కర్మజ్ఞానమార్గములు రెండును గలసియున్నవి.

ఈమార్గము ననుసరింపవలసిన క్షత్త్రియులు యుద్ధముచేయ వలసియున్నది. యుద్ధమున హింసకలదు. కాని లోకకళ్యాణమునకై చేయవలసివచ్చిన యుద్ధము భగవదర్పణబుద్ధితోఁ జేసినచో, నందు హింసయున్నను, అది యహింసాతుల్యమై లోకమునకును, భగవంతునకును, నామోదము కలిగించును. భగవదర్పణ బుద్ధితో

లోకకల్యాణమునకై మనుష్యులు కర్మమార్గమునఁ బ్రవర్తింపవలసి యున్నదను నీ మధ్యమార్గమును లోకమునకుఁ దెలియఁజేసిన మహాగ్రంథము శ్రీభగవద్గీత. ఈమార్గమును లోకమునఁ బ్రవర్తింప జేసిన మహాత్ముఁడు శ్రీకృష్ణుఁడు.

దైవాంశసంభూతుఁడును, క్షత్రియుఁడు నగు నర్జునుఁడు, అసురాంశసంభూతులగు కౌరవులతో యుద్ధముచేయవలసినప్పుడు జ్ఞాతులయందలి మోహముచేఁ దత్కాలమున నర్జునునియం దావేశించిన యహింసాప్రవృత్తిలోని లోపములను జూపును, భగవదర్పణబుద్ధితో నసురాంశసంభూతులగు కౌరవులను వధించుట లోకకళ్యాణకరమని చెప్పి, హింసారూపమైన యహింసామార్గము నుపదేశించి క్షత్రియుఁడగు నర్జునునిచే స్వకర్మమగు యుద్ధముచేయించుటకై యీ భగవద్గీతాశాస్త్రము శ్రీకృష్ణుఁడు ప్రవర్తింపఁజేసెను.

మహాత్ముఁడగు శ్రీకృష్ణుఁ డీనూతనమార్గము నర్జునున కుపదేశించుటమాత్రమేగాక, తాను బాల్యమునుండియు నామార్గముననే సంచరించి, లోకమున కాదర్శప్రాయుఁడయ్యెను గావున, గీతాశాస్త్రములోని ప్రధానమతము శ్రీకృష్ణుని ప్రవర్తనలో నెట్లున్నదియును బరీక్షింపవలయును.

ద్వాపరాంతమున భారతవర్షమునఁ బ్రధానస్థాన మాక్రమింపఁదలఁచుకొన్నవి రెండు రాజకుటుంబములు. అవి యాదవ మాగధ రాజకుటుంబములు. యదువంశసంభూతుఁడగు శూరసేనుఁడు శూరసేనదేశమునకుఁ బ్రభువై మధురపర్యంతముగల దేశ మాక్రమించుకొని, మధురానగరము రాజధానిగా, యాదవుల నందఱను బరిపాలించెను. అతని కుమారుఁడగు వసుదేవుఁడు యాదవలోకమునకుఁ బ్రభువై, పెక్కు రాజకుటుంబములలోని కన్యకలను వివాహమాడి, యారాజకుటుంబములతో మైత్రిసంపాదించి, బలవంతుఁడై యుండెను.

రాయబారము

మగధదేశాధీశ్వరుఁడగు జరాసంధుఁడు గిరివ్రజము రాజధానిగా మాగధులను బరిపాలించుచుండి, భరతఖండమునఁ దన యధికారమును వ్యాపింపఁజేయుటకై పెక్కురురాజులతో మైత్రి గావించుకొనియు, పెక్కురురాజులను జంపియుఁ, బెక్కురను గారాగారమున నిలిపియు, బలవంతుండను ఖ్యాతిగడించెను. ప్రీతివలననేమి భీతివలననేమి, జరాసంధుని యధికారము మధురానగరము వరకును వ్యాపించెను గాని; మధురకు ప్రభువగు నుగ్రసేనుఁడు, తనయన్న గారి కుమార్తెలను వసుదేవున కిచ్చి వివాహముగావించి, మైత్రి చేసికొనుటచే, జరాసంధుని యధికారము మధురలో వ్యాపింపలేదు. జరాసంధుఁ డది సహింపక, యుగ్రసేనుని కుమారుఁడగు కంసునకుఁ దనకుమార్తెల నిచ్చి వివాహముచేసి, యాతనితో మైత్రి సంపాదించెను. జరాసంధుని యాదేశమున నేమరుపాటున నున్న వసుదేవుని నాతనిభార్యను దేవకిని, బంధించి, కారాగృహమున నుంచి, తండ్రి యగు నుగ్రసేనుని కారాగారమున నుంచి, కంసుఁడు తానే మధురా నగరమునకు రాజయ్యెను. దీనితో జరాసంధుని యధికారము భరత వర్షమున పరిపూర్ణమయ్యెను. అతనితో సమానుఁడగు రాజు మఱి యొక్కఁడు లేకుండెను. జరాసంధుఁడు హింసామార్గమునఁ బూర్వపు రాక్షసులందఱను బోలియుండెను. నిత్యమును భైరవపూజ సేయుచు భైరవునకు రాజాముకులను బలియిచ్చుచుండెను. బలియిచ్చుటకై రాజులను గారాగారమున సిద్ధముగా నుంచుచుండెను. జరాసంధుని యీహింసామార్గముసే యాతని మిత్రులగు కంస నరకాదులుగూడ నవలంబించియుండిరి.

కంసుని కారాగారమున నున్న వసుదేవుఁడు తనకు కారా గారమున జనించిన శ్రీకృష్ణుని తనమిత్రుఁడును, నాభీరుల ప్రభువును నగు నందునియింటఁ బెరుగునట్లుచేసి, యాతనికి యుక్తవయస్సు వచ్చినవెంటనే, కంసుని దుర్ణయముల నాతనికిఁ దెలియఁజెప్పించెను.

వెంటనే శ్రీకృష్ణుఁడు బయలుదేరివచ్చి, కంసుని బరిమార్చి, వసుదేవుని, నుగ్రసేనుని, కారాగారమునుండి విముక్తులను గావించి, యుగ్రసేనుని మధురకు రాజుఁగావించెను.

కంసుని మరణము లోకమునకుఁ గొంత బాధ తగ్గించెను. గాని, యది జరాసంధునకుఁ గోపముఁగల్గించి, యాదవులకు బాధను గల్గించెను.

శ్రీకృష్ణునిపైఁ గోపమున జరాసంధుఁడు పదునేఁడుపర్యాయములు మధురపై దండువెడలెను. కాని, యొక్కపర్యాయమైనను జరాసంధుఁడు మధురను ముట్టడింపలేక, శ్రీకృష్ణునిచేఁ బరాజితుఁడయ్యెను.

జరాసంధుఁడు కాలయవనునితో సంధిచేసికొని, యుభయులును గలసి మధురానగరమును ముట్టడించుటకై సిద్ధపడిరి. మ్లేచ్ఛసైన్యములతో కాలయవనుఁడు మధురానగరమును ముట్టడించెను. జరాసంధుఁడుకూడ వచ్చునట్లు కన్పట్టెను. వెంటనే శ్రీకృష్ణుఁ డీసంగతి గ్రహించి, సముద్రమధ్యమునఁగల ద్వారకానగరమునకు యాదవులను బంపి, జరాసంధుఁడువచ్చులోపల, కాలయవనుని మ్లేచ్ఛసైన్యములతోఁగూడ సంహరించెను కావున, జరాసంధుని యీప్రయత్నముకూడ వ్యర్థమయ్యెను.

జరాసంధుడు జీవించునంతకాలము తనకును, యాదవులకును, లోకమునకును బాధతగ్గదని యాలోచించి శ్రీకృష్ణుఁడు తనకు బంధువులును, మిత్రులునునగు భీమార్జునులను తోడ్కొని గిరివ్రజమునఁ బ్రవేశించి, భీమునిచే జరాసంధుని మల్లయుద్ధమున జంపించి జరాసంధుని కారాగారముననున్న రాజులందరిని విడిపించెను. అట్లే జరాసంధుని మిత్రుఁడగు నరకాసురుని సంహరించి యతని కారాగారమున నున్న రాజకన్యలను విడిపించెను. పిమ్మట లోక కంటకులగు శిశుపాల దంతవక్త్ర సృగాలాదులగు రాజులనుసంహరించి లోకోపకారమొనర్చెను. జరాసంధుని, దన్మిత్రులను వధించుటచే యాదవు

లందఱకును క్షేమముకలుగుటయేగాక, లోకమునకంతటికిని మేలు సమకూడెను. శ్రీకృష్ణుఁడవలంబించిన యీమార్గము హింసామార్గమే యయ్యును, లోకమునకు బాధకలిగించుచున్నవారిని వధింపకున్నచో లోకమునకు శ్రేయస్సు కలుగఁజాలదు.

ఇంతలో కౌరవపాండవులకు ద్వేషకారణములు ప్రబలుచుండెను. కౌరవపాండవ విరోధములను శ్రీకృష్ణుఁడే యొకసందర్భమున నీరీతిని క్లుప్తముగాఁ జెప్పెను.

సీ॥ దేవాంశభవులఁ గౌంతేయులఁ గల్యంశభవులు దుర్యోధన ప్రభృతు లహహ,
సహజవైరము గల్గి, శైశవంబాదిగాఁ బహురానిబాధల పాలుఁజేసి
రనధికారికి రాజ్యమర్పించి తనభుజాబలమున బహురాజ్యముల గడించె,
నట్టి తమ్మునిపుత్త్రుఁడని ధర్మమున ధర్మసూనుని యువరాజుగా నొనర్చె
జనకుఁ డని వారికల్మికి సైపలేక, కైతవద్యూతమున వారి కల్మిబన్న
నొడిసి, పాలైన నిడెనె దుర్యోధనుండు? వానికంటెను దులువ లెందైనఁగలరె?॥

సభకున్ ద్రౌపది నీడ్చితెచ్చి, యకటా, సభ్యుల్ వినన్, దుర్వచో
విభవంబేర్పడ, మానభంగమునకై విప్పించెఁ దద్వస్త్రముల్
శుభవృత్తంబు, సతీత్వ మత్తరుణిఁ దచ్ఛోకాబ్ధి దాటించె, నా
టి భృశాఘాగ్నియె ధార్తరాష్ట్రవనవాటిం గాల్పగాఁ జాలదే?

కపటద్యూతమునం జయింపఁబడి, తత్ కౌంతేయు లెంతేనియున్
గృపణత్వంబున నున్నవారనుచు వారిన్ నవ్వ రారాజు, మి
త్రపరీతుండయి, ఘోషయాత్రఁ జని, గంధర్వుల్ దనుం గట్టఁగాఁ
గృపచే మున్విడిపించమైనఁ గనెనే, హీనుల్ గృతఘ్నుల్ గదా.

గాంగేయాదు లెఱింగిచెప్పినను, శం ♦ కాపంక నిర్మగ్నుఁడై,
యంగీకారములేక, నాగవిభుం ♦ డజ్ఞాతవాసంబునన్
భంగం బింతయులేమి ధర్మసుతుఁడే ♦ పల్కంగ నాలించియున్
భంగం బాహవరంగమం దెనసియున్ ♦ బైకొన్నఁ జేటబ్బదే!

(శ్రీకృష్ణాభ్యుదయము)

కౌరవపాండవుల విరోధకారణములలో కౌరవులయందు బాధ కలిగించు స్వభావమును, పాండవులయందు బాధభరించు స్వభావము ను వ్యక్తమగుచుండెను. శ్రీకృష్ణునకు రెండుపక్షములవారును స మానులేయయ్యును, హింసాప్రధానులగు కౌరవులకు పశుబలసూచ కమగు తన మూలబలమొసంగి, యహింసాప్రధానులగు పాండవు లకు వాక్సహాయమే సహాయముగా నొసంగెను.

ఉభయపక్షములకును సంధికావించుటకై యెంతయో ప్రయ త్నించెనుగాని, కేవల హింసాప్రధానులగుటచేఁ గౌరవులు సంధికియ్య కొనలేదు. కావున యుద్ధము తప్పనిసరి యయ్యెను.

భారతవర్షమునఁగల రాజులందఱును రెండుపక్షములలో నే దో యొక పక్షమును జేరిరి. పదునెనిమిది యక్షౌహిణుల సైన్యము యుద్ధమునకు సంసిద్ధమయ్యెను. యుద్ధమారంభింపవలసిన మహాతరుణ మున నర్జునునకు విషాదము కలిగెను. ఆతఁడు హింసామార్గమునఁ బ్రవేశించుట తనకిష్టములేదని చెప్పి, గాండీవము నేలఁబడవైచి చెమట లూర్చుకొనుచు చతికిలఁబడెను. అప్పుడు శ్రీకృష్ణుఁడు భగవద్గీతాశాస్త్ర ము నాతనికుపదేశించెను. లోకమునకు బాధకలిగించిన పెక్కురు దుర్మార్గులను దానుసంహరించెను. దానివలనలోకమునకు శ్రేయస్సు కలిగెను. కౌరవులు దుర్మార్గులు. కావునతనవలెనే యర్జునుడుకూడ దుర్మార్గులను సంహరింపవలెను. కంసాదులు తనకుబంధువులయ్యును దుర్మార్గులగుటచే లోకోద్ధరణకై తానెట్లువారినిసంహరించెనో, యట్లే బంధువులయ్యును కౌరవులు దుర్మార్గులగుటచేతను వారిని సంహ రింపవలసియున్నది.

ఐహికబంధుత్వములు శరీరముతోసంబంధించినవి గాని, యాత్మకు సంబంధించినవికావు— అని చెప్పుచు నీవిధముగా శ్రీకృష్ణుఁ డర్జునునకు సుసమయమున నుపదేశించెను.

—గీతాసారము—

ఆత్మకు లేవు బాధ్యతయు బాధకతయు నని తెల్పుచు, విషాదమునకు, దయకుఁ
గరణంబులగు నహంకారమ్ము మమకార ముడిగించి, సంగరోద్యోగమునకుఁ
గారణంబైన స్వకర్మంబు విడువక, ఫలకాంక్ష విడిచి, నిచ్చలు నొనర్చి,
క్రమముగా సర్వధర్మములను విడిచి, నన్నే యాశ్రయింపుము, నే నశేష
దోసములఁ బాపి, యుద్ధరింతు నిను మమత వలపటంచు వచించి, విశ్వాసమునకు
విశ్వరూపంబుఁ జూపి, యవ్విశ్వభర్త పార్థుఁడు నిమిత్తముఁగ మహీభార ముడిపె.

(శ్రీకృష్ణాభ్యుదయము)

శ్రీకృష్ణుని యీగీతోపదేశము విని యర్జునుఁడు విషాదము విడిచి శ్రీకృష్ణుని వాక్యములయందు పరిపూర్ణవిశ్వాసముంచి యాతనియందు సర్వాత్మభారార్పణ మొనర్చి, భక్తితో, విశ్వాసముతో యుద్ధమొనర్చెను. కౌరవులను సంహరించి యుద్ధమునఁ బరిపూర్ణవిజయమందెను. జరాసంధుని వధవలన శ్రీకృష్ణుఁడును, కౌరవులవధవలన అర్జునుఁడును భూభారము నడఁచిరి.

శ్లో॥ యదాయదాహిధర్మస్య గ్లానిర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం॥
పరిత్రాణాయసాధూనాం వినాశాయచ దుష్కృతాం।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥

అని శ్రీకృష్ణుఁడు సెలవిచ్చియున్నాఁడు.

—Great men are the external images of the internal ideals of society—

అని యొకమహామహుఁడు సెలవిచ్చియేయున్నాఁడు. దుర్మార్గులు కలిగించు బాధలచే సన్మార్గులు బాధనొందుచుందురు. అట్టి దుర్మార్గులను నశింపఁజేయవలసినదని భగవంతుని ప్రార్థించుచుందురు. ఆప్రార్థనలకు ఫలితముగా నాదుర్మార్గులదుర్మార్గమునడంపగల మహాత్ముఁడా సంఘములోనే యుదయించును. శ్రీకృష్ణుఁడు, బుద్ధుఁడు, క్రీస్తు మొదలగువా రట్టి మహాత్ములు.

కేవలకర్మకే ప్రాధాన్యమొసఁగి, పాపములకుజంతుయజ్ఞములును, భౌతికప్రాయశ్చిత్తములునే పరిహారములని వాదించుచుండినయూదులకు జంతుయజ్ఞములవలన ప్రయోజనము లేదనియు, భౌతికప్రాయశ్చిత్తములవలన ప్రయోజనము లేదనియు చెప్పి, ఆత్మయజ్ఞము, పశ్చాత్తాపము ఈ రెండుమాత్రమే పాపములకు పరిహారము గలిగించుననియు చెప్పి క్రీస్తు అవతారపురుషుఁడయ్యెను.

జీవహింసారూపమైన వైదికతాంత్రికయజ్ఞములు చేయుచుండిన హిందువులకు అహింసారూపమైన సన్యాసమునుపదేశించి బుద్ధుడవతారపురుషుఁ డయ్యెను.

కేవల హింసాప్రధానములగు వృత్తులచే లోకము నాక్రమించుకొన్న దుష్టనృపాలురను సంహరించి అహింసాప్రధానులయిన బ్రహ్మర్షులు లోకులతోఁ గలసిమెలసి యుండగలుగునట్లు సంధానము చేసి, సకామకర్మమువలన లోకమునకు బాధయు, కర్మసన్న్యాసము వలన లోకమునకు బనికిరాకపోవుటయును, నిరసించి, ఈశ్వరార్పణ బుద్ధితో జగన్మంగళమునకై నిష్కామకర్మము చేయవలసినదని లోకమునకుబోధించి, తానటులాచరించిన శ్రీకృష్ణుఁడు క్రీస్తుకన్నను, బుద్ధునికన్నను మిన్నయగు నవతారపురుషుఁడని చెప్పుటలో నెంత మాత్రము సందేహము లేదు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

PRINTED BY
D. V. KRISHNA RAO
AT
VEGU-JUKKA PRINTING WORKS,
Berhampur (Ganjam)

Published by the Author: **D. V. KRISHNA RAO,**
BERHAMPUR, GANJAM.

అభిప్రాయములు

రాయబారము - మొదటి సంపుటము - సంజయ రాయబారము ప్రచురించిన పిమ్మట వచ్చిన అభిప్రాయములలో కొన్ని:—

ఆంధ్ర విశ్వకళాపరిషత్ కళాశాల తెనుఁగు సంఘపత్రిక:

దసరా సంచిక - అక్టోబరు - 1933.

“......వేంకటకృష్ణారావు పంతులు గారెంత కృషిసల్పిరో గాని, గ్రంథమునం దంతటను భావగాంభీర్యమును, శబ్దబలమును, అందుకు దగిన కారకము, తదనుగుణ ముగు శైలియుం గలవు.

ఇది తిక్కన హృదయమునంటినది; కవిబ్రహ్మ తిక్కయజ్వ సూచ్యార్థ సూచనలకు విపులార్థ వివరణ మిది.. ...”

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక—సంపుటము ౨౨; సంచిక ౬.

“......విమర్శకులచే వ్రాయబడిన రాయబారపు కథాభాగములను, ద్యూతవాక్య కథాసందర్భాదులను, ఈ భాగమునుగూర్చి కొన్ని పుస్తక రూపక ముగా బయలు వెడలిన వానిని, భారతమును ముం దిడుకొని, శ్రీ వేంకట కృష్ణారావుగారు రచించిన రాయబారమున మొదటి సంపుటము సంజయ రాయ బారమును, పరిశీలనాదృష్టితో జదివితిమి. భారతకథాభాగమునిట్టియపూర్వరచనతోఁ బ్రారంభించుటకే సంజయరాయబారమే నూతనమని నిరూపింపవలసియున్నది. ఇయ్యది పాణిని కృతసూత్రములకుఁ బతంజలి భాష్యము పగిదిగా భారతకథా భాగమునకుఁ బరమోపకార భూతమగు భాష్యమయి యొప్పారుచున్న దనుట స్వభావోక్తియే......”.

సుబోధిని - నెల్లూరు తే 20—1—1934.

శ్రీ కృష్ణారావుగారు రచియించిన సంజయ రాయబారము మిక్కిలి జాగ్రత్తతో జదివితిమి.

“..... ప్రకరణాంత సంవిధానము చవుల నమకరించును. రాజనీత్యాది వర్ణనం

కథనడపించుచు పాత్రలచేతనే సంభాషణ క్రమమున విమర్శచేయించుచు, వ్యాఖ్యా నమ్ము తనకు దానుగా నడచుచుండు నట్లొనర్చిన గ్రంథ మిప్పటి కిది యొక్కటియే. ఈ వ్యాఖ్య ముద్దులు మూటగట్టు తేటతెనుంగుమాటలకు పెన్నిధి; చక్కని జాతీయోక్తుల గుప్తపరచిన రతనాల పేటిక; అజ్ఞాన తమఃప్రపంచమున అద్భుత కల్పనాశక్తిని సూచించు అపూర్వకరదీపిక......"

THE HINDU—MADRAS, (Educational Suppliment.)

d/ 12—3—34.

"...............The way in which the author Mr. Venkata Krishna Rao has transmuted material taken from the Maha Bharata into a fascinating study of different characters & divergent policies is admirable. The book is a novel, a drama and a commentary rolled into one. Some of the characters in the Epic are presented in a new light. Characterisation apart, the book is an instructive and interesting study of the deplomacy and political philosophy of the Maha Bharata Period——".

NEW ORISSA—Berhampur, d/ 24—10—33.

".........What strikes one at the first reading is the uniqueness of the style and the literary form. Beauties of phrase, words & idiom in plenty: but these do not seem to be exotic decorations but have their roof in the inherent excellence of the expression. To the lay reader there is an apparent quaintness but this is only apparent. The intellegent and scholarly reader cannot but admire the power and vigour of style——".

మా॥ శ్రీ॥ పింగళి లక్ష్మీకాంతంగారు, ఎం.ఏ., ఛీఫ్ లెక్చరర్-తెనుగు
ఆంధ్ర యూనివర్సిటీ కాలేజి, వాల్తేరు.

"......భారతాదిప్రాచీనగ్రంథములలోని ఏకదేశగాథలను ఎత్తి పలువురు పలువిధముల వ్రాసినపుస్తకములకును, శ్రీవేంకటకృష్ణారావు పంతులుగారు రచించిన యీ రాయబారమునకు, జాలవ్యత్యాసమున్నది. నే నెఱింగినంతవరకు అవన్నియు దండాన్వయప్రాయములు; ఇదియో వ్యాఖ్యాన ప్రాయము. రాయభాగ విషయమున కురుపాండవపక్షముల వాదప్రతివాదముల బలమును పరామర్శించి, స్వతంత్రుడగు ప్రాడ్వివాకుడు తీర్చిన తీర్పిది. ఈరకపు పుస్తకము మన భాషలో సరిక్రొత్త ...."

డాక్టరు చిలుకూరు నారాయణరావుగారు,
యమ్. ఏ., పి. హెచ్. డి., యల్. టి.,

"...... కథకు కథ, నవలకు నవల, నాటకమునకు నాటకము; విమర్శకు విమర్శ, యిన్ని యిమిడియున్నవి. మ॥ శ్రీ॥ దేవరాజు వేంకటకృష్ణారావుపంతులు గారు రచించిన రాయబారమను గ్రంథమున... .."

విద్వాన్ అంగలూరి శ్రీనివాస తాతాచార్యులుగారు, ఒ.పి.యల్.,
ప్రధానాంధ్రోపాధ్యాయులు,
బోర్డు హైస్కూలు—గన్నవరం.

"శ్రీ వేంకటకృష్ణారావుగారు తిక్కన సోమయాజి గారి కవితయందలి భావగాంభీర్యమును బాగుగ నవగాహన మొనర్చుకొని, యందలి ప్రతివాక్యమును విమర్శనా దృష్టితోఁ బరిశీలించి వానిలోని భావమును లోకమునకు విశదీకరించి, తిక్కనకవితల్లజుని భావామృతమును జూరగొనఁ జేసిరి...

D. V. Krishna Rao,

GADIVARI STREET, **BERHAMPUR.** (*G.*)

విక్రయమునకు సిద్ధముగానున్న గ్రంథములు.

కా లూ రా యి

గ్రంథకర్త:—దేవరాజు వేంకట కృష్ణారావు గారు

వాండేవీండు, నేనే, అను నిరూపక నవలావతంసములతరువాయి భాగము. స్వతంత్రము. కన్నడ ఉరుదు భాషలలోనికి తర్జుమా కాబడినది. సినిమటోగ్రాఫు వారిచే తర్జుమా కాబడినది.

ఏ ప్రకరణమున కాప్రకరణమే స్వయం సంపూర్ణమయ్యు పూసలలోని దారమువలె నున్నది. దిగ్భ్రమ జెందించుకథ. తుదముట్ట చదువువరకు విడువనీయదు. ఆంగ్లమున షెల్లాక్ హోమ్సు గ్రంథములు జదువలేదను విచారమును తొలగింపజేయుజాలు కథా కల్పనా చమత్కృతి గలది. వెల 0—12—0.

ఉ॥ రూపక ముఖ్య చిత్రములు ♦ ప్రోన్నతలీల నెసంగఁగాఁ గథా
రూపకమందు సామ్యము నె ♦ ఱుంగక యాంధ్రపు వాఙ్మయంబునన్
రూపకలంకమై తగ, ని ♦ రూపక మియ్యది యాలకించి, యే
రూపక యుండుగో తలల ♦ నూన ముదంబు మదిం జెలంగఁగన్.

కో టీ శు త న య

కర్త:—సుప్రసిద్ధ రచయితలు తాత కృష్ణమూర్తిగారు బి.ఎ.ఎల్.టి

జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లాండు, అమెరికా మొదలగు నాగరిక దేశములనిపించుకొనుచున్న వానిలో పాశ్చాత్యవిద్యాభివృద్ధిచే గలిగిన గర్భనిర్భేదకరమగు క్రూరకృత్యములును, వానిం బరిశోధింప డిటెక్టివ్ ఆఫీసర్ల బుద్ధికుశలతయు, అప్రతిహతములగు వారి ప్రయత్నములును చదువరుల గుండియ లవియజేయును.

క్షణ మెడములేక బయాస్కోపు ఫిల్మువలె కాలచక్రముకన్న విపరీత వేగముతో హంతకునిచే జరుపబడిన భయానక దురంత కార్యములు చదువరుల యొడలు కంపింప జేయును. వెల 0-12-0.

సుహృల్లత

చరిత్రాంశముల సత్యీకరించియుఁ బ్రసిద్ధనముల బ్రతిష్ఠింపఁబడిన మానవుల ననుసరించియు, చరిత్రసంకావ్యము వ్రాయుటెంతయు దుర్ఘటము కాదు. సాంఘిక విషయము ననుసరించి వ్రాయుటయు నంత సులభము కాదు. కాని నైతిక విషయముల నధ్యాకరించి యొక నవలను వ్రాయుట యెంతయు దుస్తరము. అది చేకను ప్రభువు వక్కాణించినట్లు కేవలము నమలి పాఱవేయునదిగా నుండక, శాశ్వతామరసాముజిక సత్యములతో వెలయుచుండవలయు. అట్టి యుత్కృష్టాదర్శములతో మానవజన్మంబునకు కాణాచియగు భావంబులలో నొక్కటియగు స్నేహమునందలి పరిణామంబులు సజ్జన దుర్జనుల మైత్రియు, వాని పర్యవసానములును, చక్కని కథారూపమున, మనంబుల కంటునటుల వ్యక్తీకరింపబడి యున్నవి. వెల 0—12—0.

నానాఫడ్నవీస్

హిందూ దేశమున పూర్వయుగమున చాణక్యుడును, మధ్య యుగమున నైరోపా ఖండమున మైకవెల్లియు, నెంత సుప్రసిద్ధ పురుషులో అంత సుప్రసిద్ధ పురుషుడును అగు నానాఫడ్నవీస్ జీవచరిత్ర-. మంత్రి యుగంధరుడు తెలింగానా రాజ్యమునకును, తిమ్మరసు విజయనగర సామ్రాజ్యమునకును, తిక్కనమంత్రి మనుమసిద్ధి రాజ్యమునకును, పూర్ణయ్యగారు మైసూరు రాజ్యమునకును, జేసిన మహదుపకారములకంటె నీ నానాఫడ్నవీస్ మహారాష్ట్రమున కొనర్చిన మేలు కడుంగడు గొప్పది. ఇంగ్లండు నుద్ధరించునట్లు చెప్పఁబడుచున్న పిట్ మహామంత్రికన్న మహారాష్ట్రముపట్ల నీ నానాఫడ్న

ప్రతిజ్ఞాచాణక్యము

శ్రీ ద్విజేంద్రలాల్ రాయ్‌గారి నాటకమును మాతృకగ జేసికొని రచింపబడిన నూతననాటకము వెల 0—8—0.

బ్ర॥శ్రీ॥ మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి ఉపోద్ఘాతము గలది.

జానకీపరిణయము

ఇత్యాది అనేక పురాణములనుండి గ్రహింపబడిన యొక అద్భుతపౌరాణిక విషయమును కథావస్తువుగాఁ గలిగి, పండ్రెండు చిత్రపటములతో శోభిల్లుచుఁ జదువువారలకు ఆహ్లాద, విస్మయ, దిగ్భ్రమములు గలుగజేయుచునుండి, ఆంధ్ర లోకమున నిదివర కెన్నఁడు నెవ్వరిచేతను బ్రచురింపబడని నవనవలా శిరోమణి.

తప్పుల తమాషా యన నిదియే. ఇందలి కథ జానకీపరిణయాంతమువరకు వివరింపబడినది. మాయ రాముడు నిజమగు సీతను జూచి సీతకావని యనుకొని, ఆమెనువీడి మాయసీతనుజూచి నిజమగుసీతయనిభ్రమపడి యామె నెత్తుకొనిపోవుట; మాయసీత యగ్నింబడుటగాంచి నిజమగురాముడు భ్రమజెంది ప్రాణత్యాగప్రయత్న మొనర్చుట; మాయరామలక్ష్మణవిశ్వామిత్రులచే జనకమహారాజు విభ్రమజెందుట లోనగుగల చిత్రవిచిత్రములతో గ్రంథమంతయు(Comedy of Errorsవలె) విభ్రమాకరమై చదువరుల మానసముల భ్రమజెందించుచు పెక్కు చిత్రపటములచే శోభిల్లుచుండును. వెల 1—0—0.

గ్రంథకర్త:—దేవరాజు వేంకట కృష్ణారావు గారు.

నారదమహర్షి జీవిత చరిత్రము

నారదుని చరిత్ర పదునెనిమిది మహాపురాణములలో గాని, పదునెనిమిది ఉప పురాణములలో గాని, శ్రీ మద్దేవీ భాగవతమున గాని, శ్రీమద్రామాయణము, భారతము మొదలగు ఇతిహాసములలో గాని ఒక్కచోట పూర్తిగా నెందైనను గానరాదు. కాని అన్నిటియందును కొంచెము కొంచెముగా చెప్పబడిన విషయము లున్నవి. పురాణములలో చెదరి యున్న నారదచరిత్ర ఒక్కచోట చేర్చి సుబోధక ముచేసి తెలుగువారి కిచ్చిన గ్రంథమిది. వెల 0-12-0.

జగదక్షక శతకము

శతాధిక గ్రంథకర్తలు, కీర్తిశేషులు, బ్ర॥శ్రీ॥ మండపాక పార్వతీశ్వర కవీశ్వర విరచితము.

D. V. Krishna Rao,

Proprietor.

VEGU-JUKKA PRINTING WORKS,

BERHAMPUR. (*G.*)

<u>వెలకు సిద్ధముగానున్న గ్రంథములు:—</u>

1. కాలూరాయి

సుప్రసిద్ధమగు నిరూపకనవల-స్వతంత్రము; రు. 1/-

2. కోటీశుతనయ

ఆంగ్లేయపద్ధతులననుసరించి వ్రాయబడిన అనువాద నిరూపకనవల రూ. 1/-

3. సుహృల్లత

స్నేహపరిణామము, స్నేహబలము మాపుము వ్రాయబడిన నవల అ. 12.

4. నానాఫడ్నవీసు

హిందూదేశమున సుప్రసిద్ధమంత్రకార్యనైపుణ్యశీలురని అనిపించుకొనిన మహా మంత్రులలో నొకరుండగు మహారాష్ట్రసామ్రాజ్యమంత్రియగుని చరిత్ర అ. 12.

5. ప్రతిజ్ఞాచాణక్యము

చాణక్యుని రాజనీతి సంపూర్ణముగ దెలుపగల నాటకము. అ. 12

6. జానకీపరిణయము (మొదటిఖండము పరిణయవిభ్రమములు)

(విభ్రమరాఘవ మను పౌరాణిక నవలలో జానకీపరిణయకథవరకునుగల 'పరిణయవిభ్రమములు' అను ప్రథమ ఖండము-ఇది ఆంగ్లమునందలి COMEDY OF ERRORS ను అనుసరించివ్రాయబడినది రూ. 1/-

7. నారదమహర్షి జీవితచరిత్రము.

ఎన్నోగ్రంథము లాలోకించినగాని సమకూడని చరిత్ర అ. 8.

8. జగద్రక్షక శతకము

బ్రహ్మశ్రీ కీ॥ శే॥ మండపాక పార్వతీశ్వరకవీశ్వర విరచితము. అ. 2.

D V. KRISHNARAO, ***Proprietor*** **V.J.P. Works BERHAMPUR,(G.)**